# తెలంగాణ రాష్ట్రం

## చరిత్ర ఉద్యమాలు



ఎలికట్టె శంకర్‌రావు

# తెలంగాణ రాష్ట్రం
# చరిత్ర ఉద్యమాలు

# తెలంగాణ రాష్ట్రం

## చరిత్ర ఉద్యమాలు

ఎలికట్టె శంకర్‌రావు

సలహాదారు

డాక్టర్ నోముల సత్యనారాయణ

ప్రచురణ

నోముల సాహిత్య సమితి

# తెలంగాణ రాష్ట్రం
# చరిత్ర ఉద్యమాలు

ఎలికట్టె శంకర్‌రావు

మొదటి ముద్రణ
ఆగస్టు, 2014

ప్రచురణల సంఖ్య :8
హక్కులు : రచయితవి

అట్ట మీది బొమ్మ : లక్ష్మణ్ ఏలె

ముద్రణ : చరిత ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్

ప్రతులకు:
విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు
నవోదయ, కాచిగూడ, హైదరాబాద్

ఎన్.ఎస్.అరుణ
నోముల సాహిత్య సమితి
సాయిటవర్స్, నాగార్జునకాలనీ
నల్లగొండ, తెలంగాణ
7799114349

ధర : 200 రూపాయలు



తెలంగాణ సాధకులు

రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారికి

# ఆత్మగౌరవ పోరాటం

తెలంగాణకు ఒక చరిత్ర ఉంది. అస్తిత్వముంది. సంస్కృతి ఉంది. ఆత్మగౌరవం ఉంది. కాని కుట్రలకు బలయ్యింది. సర్వం కోల్పోయింది. తిరిగి పొందటానికి సుధీర్ఘ పోరాటం చేసింది. చివరికి విజయం సాధించింది.

హైదరాబాద్ ఒక సంస్థానం. ఒక రాజ్యం. తెలుగు, కన్నడం, మరాఠీ మాట్లాడే ప్రజలున్న ఈ ప్రాంతాన్ని పాలించిన చివరి రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్. ఈయన పాలనా సమయంలనే భారత్ సొతంత్రం పొందింది. ఆ తర్వాత పద మూడు నెల్లకు హైదరాబాద్ సంస్థానం భారత్‌ల విలీనమైంది. హైదరాబాద్ రాజ్యం హైదరాబాద్ రాష్ట్రంగా గుర్తింపు పొందింది.

ఇదే సమయంల మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డది. అంతకు ముందు నుంచే భాషా రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న డిమాండు వినిపించింది. ఆంధ్రా నాయకులు కూడా ఈ డిమాండు చేసింద్రు. కమ్యూనిస్టు నాయకులు భావోద్వేగాలను రెచ్చగొట్టింద్రు. తెలంగాణ, ఆంధ్ర రొండు తెలుగు ప్రాంతాలను కలపాలని లాబీయింగ్ చేసింద్రు. కుట్రలు చేసింద్రు. తెలుగు జాతి ఐక్యత అని పిట్టకథలు వినిపించింద్రు. ఆంధ్రా నాయకులు మూకుమ్మ డిగా కేంద్రం మీద వొత్తిడి తెచ్చింద్రు.

ఈ విలీన ప్రతిపాదనను తెలంగాణ వ్యతిరేకించింది. కాని నెహ్రూ ప్రభుత్వం ఆంధ్రా వొత్తిళ్లకు లొంగింది. తెలంగాణ నెత్తి నోరు కొట్టుకుంటున్నా వినకుంట విలీనానికి పూనుకుంది. చివరికి సమైక్య రాష్ట్రం ఏర్పడ్డది. తెలంగాణ మీద పరాయి పాలన మొదలయ్యింది.

నమ్మించి పొత్తు కలిసిన ఆంధ్రానాయకులు ఆ తర్వాత తెలంగాణ నెత్తిన కూసుంద్రు. వారికి తెలంగాణ ఆక్రమిత ప్రాంత మైంది. దోపిడీకి అడ్డా అయ్యింది. ఒప్పందాలను పాతర పెట్టింద్రు. తెలంగాణ

భూములను వశపర్చుకుండ్రు. నీళ్లను కొల్లగొట్టింద్రు. ఉద్యోగాలను దోచుకుండ్రు. చివరికి సంస్కృతి మీద దాడి చేసింద్రు. తెలంగాణ ప్రజలను రొండవ శ్రేణి పౌరులుగా చూసింద్రు.

ఆంధ్రా వివక్షను తెలంగాణ భరించలేకపోయింది. పోరాటానికి దిగింది. 1969ల పెద్ద పోరాటం జరిగింది. వొందల మంది తెలంగాణ విద్యార్థులు, ప్రజలు బలయ్యింద్రు. కాని ఈ సమయంల తెలంగాణ నాయకత్వం పక్కదారి పట్టింది. తెలంగాణ ప్రజలను నట్టేట ముంచింది. ఆ తర్వాత కూడా కొంతమంది తెలంగాణ నాయకులు పోరాటాలు మొదలుపెట్టింద్రు. కాని కడదాంక నిలబడలేక పోయింద్రు. పదవులకు కక్కుర్తిపడి ఉద్యమాన్ని వొదిలి పెట్టింద్రు. తెలంగాణ ప్రజల ఆశల మీద నీళ్లు చల్లింద్రు.

ఆంధ్రానాయకులు కూడా తెలంగాణవాదాన్ని అణచి వేయ టానికి కుట్రల మీద కుట్రలు చేసింద్రు. ఉద్యమం మొదలయి నప్పుడల్లా తెలంగాణ నాయకులను దువ్వింద్రు. కమిటీల మీద కమిటీలు వేసింద్రు. కాలం బొలిపింద్రు. కేంద్రం కూడా తెలంగాణ ఉద్యమాన్ని ఎప్పటి కప్పుడు చల్లార్చటానికి ప్రయత్నం చేసింది. ఉద్యమం ఊపందు కుంటుంది అంటె చాలు ఒక పథకాన్ని ప్రకటిం చింది. అవన్ని మభ్యపెట్ట టానికేనని తెలంగాణ ప్రజలు గ్రహించింద్రు. అసహనంతో రగిలి పోయింద్రు.

ఇట్లాంటి సమయంల కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేసిండు. ఉన్న పదవులకు వొదిలిపెట్టి తెలంగాణ ఉద్యమాన్ని మొదలుపెట్టిండు. తెలంగాణ ప్రజలల్ల చైతన్యం తెచ్చిండు. తెలంగాణ సమాజాన్ని ఏకం చేసిండు.

ఉద్యమ క్రమంల కెసిఆర్ నిరాహార దీక్షకు దిగిండు. పదకొండు రోజుల దీక్షకు కేంద్రం దిగివొచ్చింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రి యను మొదలు పెడుతున్నట్లు ప్రకటించింది. కాని మల్లా వలసవాదులు కుట్రలు చేసింద్రు. ఆంధ్రానాయకుల బ్లాక్ మెయిల్‌కు కేంద్రం లొంగి నాలుక తిప్పింది.

దీంతో తెలంగాణ భగ్గున మండింది. ప్రజలల్ల తెలంగాణ ఆకాంక్ష రగిలింది. కసి పెరిగింది. ఉద్యోగులు ఉద్యమంలకు వొచ్చింద్రు.

విద్యార్థులు పిడికిలి బిగించిండ్రు. ప్రొఫెసర్ కోదండరామ్ నాయకత్వంల రాజకీయ జెఎసి ఏర్పడ్డది. ఉద్యమం మరింత మండింది. దీంతో ఆంధ్రా పాలకులు మల్లా కుట్రలకు తెగబడ్డరు. ఉద్యమాన్ని అణచటానికి పూను కున్నరు. తెలంగాణను రక్తసిక్తం చేసిండ్రు.

అయినా తెలంగాణ అదరలేదు బెదరలేదు. కెసిఆర్ నాయ కత్వంల ఉద్యమం మరింత ఉధృతమైంది. అనేకమంది తెలంగాణ యువ కులు ఆత్మత్యాగం చేసిండ్రు. దీంతో కేంద్రానికి ఊపిరి మెసలకుంట అయ్యింది. చివరికి అధికార కాంగ్రెస్ దిగొచ్చింది. అరవై ఏండ్ల కింద పెట్టిన ఉచ్చును విప్పడానికి సిద్ధపడ్డది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రి యను మొదలుపెట్టింది. చివరికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డది. తెలంగాణ ప్రజల కల సాకారమైంది. పద్నాలుగేండ్ల కెసిఆర్ పోరాటం ఫలించింది.

ఈ పోరాటాన్ని కాలక్రమంల పొందుపర్చిన. అరవై ఏండ్ల తెలంగాణ చరిత్రను అందిస్తున్న తొలి పుస్తకం ఇది. చరిత్రను ప్రజల భాషల అందిస్తున్న మొదటి పుస్తకం కూడా ఇదే. తెలంగాణను అర్థం చేసుకోటానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుందని నమ్ముతున్న.

చివరగా ఒక మాట. ఆంధ్రా పార్టీలు, నాయకులు ఇంకా ప్రేతాత్మలై తెలంగాణ మీద తిరుగుతుండ్రు. ఈ ప్రేతాత్మలను వెళ్ల గొట్టటానికి మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ పునర్నిర్మాణమూ మిగిలే ఉంది. కెసిఆర్ నాయకత్వంల అది సాధ్యమ యితదని ఆశిద్దాం.

డాక్టర్ నోముల సత్యనారాయణ, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, దేవులపల్లి కృష్ణమూర్తి, డాక్టర్ కొల్లోజు కనకాచారి, యానాల యాదగిరిరెడ్డి, 'దాసి' సుదర్శన్, డాక్టర్ ఎన్.ఎస్. రాహుల్, డాక్టర్ బెల్లి యాదయ్య, 'ప్రసాద్ ఫొటో షాప్' శ్యాంప్రసాద్, ఎన్.ఎస్.రజనీశ్, మునాసు వెంకట్, ఎన్.ఎస్.అక్షయ్, అరుణ సహకారం మాటల్ల చెప్పలేనిది.

– ఎలికట్టె శంకర్‌రావు

# ఒక్క మాట

నోముల సాహిత్య సమితి ద్వారా 2010 నుంచి ప్రతి ఏటా కథా పురస్కారాలు అందిస్తున్నం. డాక్టర్ ఎన్.ఎస్. రాహుల్ సంపాదకత్వంల 'నోముల పురస్కార కథలు 2010,11' వెలువరించినం. 'ప్రతిజ్ఞ పదశిల్పి పైడిమర్రి' పేరుతో పుస్తకం ప్రకటించి మరుగునపడ్డ 'ప్రతిజ్ఞ' రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావును వెలుగులకు తెచ్చినం. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో 'ప్రతిజ్ఞ యాభై ఏండ్ల వివక్ష' పుస్తకాన్ని అందించినం. నూటా పదేండ్ల కాలాన్ని చిత్రించిన అరవై తొమ్మిది మంది నల్లగొండ రచయితల కథలతో 'నల్లగొండ కథలు' వెలువరించినం. నల్లగొండకు చెందిన తొలితరం కథకుడు 'కాంచనపల్లి చినవెంకట రామారావు కథలు', తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు 'భీమిరెడ్డి నరసిం హారెడ్డి అనుభవాలు', నల్లగొండ జిల్లా 'జల సాధన సమరం' అందించినం.

ఈ క్రమంల తెలంగాణ అరవై ఏండ్ల పోరాటాన్ని 'తెలంగాణ రాష్ట్రం– చరిత్ర ఉద్యమాలు' పేరుతో అంది స్తున్నం. పాఠకులు, సాహిత్య అభిమానులు ఆదరిస్తరని ఆశిస్తున్నం.

– నోముల సాహిత్య సమితి

## రాజ్యం నుంచి రాష్ట్రం దాంక


1. హైదరాబాద్ రాజ్యం......................15

రాజుల పాలన .................................. 17

హైదరాబాద్ అభివృద్ధి ............................20

హైదరాబాద్ ముల్కీలది ..........................24

నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు ....................27

ఆంధ్రా కమ్యూనిస్టులు ............................32

రజాకార్లు ...........................................37

హైదరాబాద్ విలీనం ...............................40

2. హైదరాబాద్ రాష్ట్రం ......................43

రాజప్రముఖ్ నిజాం ................................45

ఆంధ్రా మిడుతల దండు...........................48

హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల .........51

నాన్ ముల్కీ గోబ్యాక్ .............................54

3. ఆంధ్ర రాష్ట్రం ...............................59

ఆంధ్రుల పోరాటం ................................61

శ్రీబాగ్ ఒప్పందం ..................................64

ఆంధ్రరాష్ట్ర ప్రకటన ...............................68

కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ................72

4. ఆంధ్రప్రదేశ్ .............................77
విశాలాంధ్రకు తెలంగాణ వ్యతిరేకత ..............79
రాష్ట్రాల పునర్విభజన కమిషన్ ....................82
ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీ తీర్మానాలు ....................89
విలీనంపై నెహ్రూ ప్రకటన ........................93
పెద్దమనుషుల ఒప్పందం .........................102
ఒప్పందాలకు పాతర .............................110
తెలంగాణపై ఆంధ్రా చిన్నచూపు ..................114
వలసవాదుల దోపిడీ .............................117
అడుగడుగునా వివక్ష .............................120
ఉద్యమానికి రంగం సిద్ధం ........................123
5. తెలంగాణ తొలి ఉద్యమం.................125
బ్రహ్మానందరెడ్డి బద్మాషీ ..........................127
నెత్తురోడిన తెలంగాణ ............................135
అర్ధరాత్రి ప్రధాని రాక ...........................140
ఉద్యమానికి ద్రోహం ..............................145
తెలంగాణ రక్షణలకు పివి అండ ..................148
జై ఆంధ్ర బ్లాక్‌మెయిల్ ఉద్యమం ..................150
చెన్నారెడ్డికి ముఖ్యమంత్రి కుర్చీ ....................156
అమలుకు నోచుకోని జిఓ 610 ...................158
జై తెలంగాణ అంటే మంత్రి పదవి ...............163

జైతెలంగాణ పార్టీ నిమజ్జనం ....................166
తెలంగాణను అడ్డుకున్న చంద్రబాబు .............169
కమిటీల మీద కమిటీలు .........................172
6. టిఆర్ఎస్ ఆవిర్భావం....................175
తెలంగాణ రాష్ట్ర సమితి ...........................177
తెలంగాణ సిపాయి కెసిఆర్ ......................182
కాంగ్రెస్‌ను నమ్మిన టిఆర్ఎస్ ....................186
తెలంగాణకు 36 పార్టీల మద్దతు .................191
ఉద్యమానికి ఊపునిచ్చిన కరీంనగర్ ...............196
ఎన్నికల పొత్తులు ఎత్తులు .........................199
విషం కక్కిన వైఎస్ ................................205
ఊరూరా తెలంగాణ ఉద్యమం ....................209
కూలిన తెలంగాణ అడ్డు ..........................212
7. మలుపు తిప్పిన కెసిఆర్ దీక్ష ............215
కెసిఆర్ ఆమరణ దీక్ష .............................217
సీమాంధ్ర నాయకుల నాటకాలు ..................224
అఖిలపక్షంల రొండు నాలుకలు ..................228
కేంద్రం శ్రీకృష్ణ నాటకం ............................234
శ్రీకృష్ణ కమిటీ కొండంత రాగం ...................238
ఉద్యమంలకు ఉద్యోగులు .........................244
ఢిల్లీని తాకిన ఉద్యమ సెగలు ......................251

8. తెలంగాణ రాష్ట్ర సాకారం ...............255
కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం ................257
తెలంగాణకు కేంద్ర కేబినెట్ ఆమోదం ............261
వలసనాయకుల దుష్ట పన్నాగం ..................266
అసెంబ్లీకి విభజన బిల్లు ...........................269
ఆంధ్రానాయకుల ఆఖరి కుట్రలు .................277
పార్లమెంటును గెలిచిన తెలంగాణ ................280
తెలంగాణ సాధకునికి జనం జేజేలు ..............285
తెలంగాణకు రాజముద్ర ..........................288
9. తెలంగాణ తొలి ప్రభుత్వం ..............291
తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ .............293
తెలంగాణ తొలి మంత్రి వర్గం .....................296
చరిత్రల ముఖ్యఘట్టాలు ...........................297
తెలంగాణ అమరులు ..............................300
ఆధార గ్రంథాలు ..................................301

# హైదరాబాద్ రాజ్యం



# రాజుల పాలన

తెలంగాణకు వేల ఏండ్ల చరిత్ర ఉంది. ఈ ప్రాంతాన్ని అనేక రాజ వంశాలు పాలించినయ్. శాతవాహనులు, ఇక్ష్వాకులు, వాకాటులు, విష్ణు కుండి నులు, బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, వేములవాడ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు, ముదిగొండ చాళుక్యులు, వెన్గొండ వంశీయులు, కందూరు చోడులు, కాకతీయులు, ముసునూరి వంశీయులు, రేచర్ల పద్మనాయకులు, బహమనీ సుల్తానులు, కుతుబ్ షాహీలు, మొగలు వంశీయులు, అసఫ్‌జాహీ వంశీయులు వరుసగా పాలించిండ్రు.

తెలంగాణల అభివృద్ధి, ఆధునికత మాత్రం కుతుబ్‌షాహీల నుంచే మొదల య్యింది. ఈ కుతుబ్‌షాహీల పాలన ఎప్పుడు ఎట్ల మొదలయ్యిందో తెలుసుకోవాలంటే వీళ్ల కంటె ముందున్న బహమనీ రాజ్యం గురించి రొండు మాటలు చెప్పుకోవాలె.

బహమనీసుల్తాను మహమూద్. ఈయన 1482 నుంచి 1518 వరకు పాలించిండు. ఈయన కొలువుల సుల్తాన్ కులీ కుతుబ్‌షా సైన్యాధికారి. రాజుకు నమ్మకమైనోడు. కష్టసుఖాలల్ల తోడుగ ఉన్నోడు. అందుకని రాజు మహమూద్ సంతోష పడి సుల్తాన్ కులీకుతుబ్‌షాను గోల్కొండ జాగిర్దారుగా 1496ల నియమిం చిండు. కుతుబ్ ఉల్‌ముల్క్ అనే బిరుదు కూడ ఇచ్చిండు.

కాలం గడుస్తుంటె రాజు మహమూద్ పరిస్థితి తలకిందులైంది. బహమనీ రాజ్యం పతనమైంది. ఆ తర్వాత ఐదు రాజ్యాలుగా విడిపోయింది. దాంట్లె ఒకటి సుల్తాన్ కులీకుతుబ్‌షాది. కులీకుతుబ్‌షా కూడ 1518ల సొతంత్రించి గోల్కొండ రాజ్యానికి రాజుగ ప్రకటించుకుండు. అంటె కుతుబ్‌షాహీ రాజ్య స్థాపకుడు సుల్తాన్ కులీకుతుబ్‌షా. ఈయన కాలంల తెలంగాణ అనే పదం ప్రచారంలకు వొచ్చిందని పెద్దలు చెపుతరు.

సుల్తాన్ కులీకుతుబ్‌షాకు ఆరుగురు కొడుకులు. మూడో కొడుకు జంషీద్. తండ్రిని చంపిండు. రాజు కావలసిన అన్న కండ్లు పొడిపించిండు. తర్వాత సింహాసనం మీద కూచుండు.

ఆ తర్వాత సుల్తాన్ కులీ కుతుబ్‌షా ఆరో కొడుకైన ఇబ్రహీం కుతుబ్‌షా అన్న జంషీద్‌ను దించి తను సింహాసనమెక్కిండు. ఇబ్రహీం అనేక మంచి పనులు చేసిండు. ఆయన కాలంల తొవ్విన అనేక చెరువులు చరిత్రల నిలిచిపోయినయ్.

ఈ ఇబ్రహీంకు ఆరుగురు కొడుకులు. మూడోడు మహ్మద్ కులీ కుతుబ్ షా. తండ్రి కాలంచెయ్యడంతో ఈయన పద్నాలుగో ఏటనే రాజయ్యిండు. ఈయన ప్రియురాలు భాగమతి. ఈమెకు హైదర్‌హెబ్ అనే పేరుకూడ పెట్టుకుండు కులీ కుతుబ్‌షా. ఈమె పేరు మీదనే హైదరాబాద్ నగరాన్ని నిర్మించిండు. ఇది భాగ్య నగరంగా కూడా ప్రసిద్ధి. ఈయన కాలంలనే అంటె 1592ల రాజధాని గోల్కొండ నుంచి హైదరాబాద్‌కు వొచ్చింది.

మహ్మద్ కులీకుతుబ్‌షా తర్వాత సుల్తాన్ మహ్మద్ కుతుబ్‌షా, ఆ తర్వాత అబ్దుల్లా కుతుబ్‌షా వొరుసగా రాజ్యమేలిండ్రు. వీళ్ల తర్వాత కుతుబ్‌షాహీల రాజ్య వారసుడుగా అబుల్ హసన్ తానీషా రాజయ్యిండు. తానీషా కాలంలనే అంటె 1687ల మొగలు రాజయిన ఔరంగజేబు గోల్కొండ మీద దండెత్తిండు. దీంతో కుతుబ్‌షాహీల పాలన అంతమైంది. మొగలుల పాలన మొదలయ్యింది. ఈ కాలంలనే రాజధాని గోల్కొండ నుంచి ఔరంగాబాదుకు మారింది.

ఔరంగజేబు తర్వాత షా ఆలం చక్రవర్తి అయ్యిండు. ఈయన కమ్రొద్దీన్‌ను అయోధ్య ప్రాంతానికి సుబేదారుగా నియమించిండు. ఆ తర్వాత ఢిల్లీ సింహాసనం మీద ఫరుక్ షయర్ కూసుండు. ఈయన కమ్రొద్దీన్ సేవలకు సంతోషపడి 'ఫతేజంగ్' నిజాముల్ ముల్క్ బిరుదును ఇచ్చిండు. అంతేకాక కాందేశ్, బీరార్, తెలంగాణ, దౌలతాబాద్, అహ్మద్‌నగర్, ఆర్కాట్ ప్రాంతాలతో కూడుకున్న దక్కనుకు సుబేదారును చేసిండు.

కాలక్రమంల మొగల్‌రాజ్యం బలహీనమైంది. కొంతమంది సామం తులు సొతంత్రం ప్రకటించుకుండ్రు. ఆ సమయంలో కమ్రొద్దీన్ తనకు కూడ సొతంత్రం కావాలని నాటి మొగలు చక్రవర్తి మహ్మద్‌షాను కోరిండు. ఆయన దానికి ఒప్పుకున్నడు. అసఫ్‌జా అనే బిరుదు కూడ ఇచ్చిండు. ఆ తర్వాత కమ్రొద్దీన్ –నిజాముల్ ముల్క్– ఢిల్లీకి నామమాత్రపు సామంతునిగా ఉండుకుంట సొతంత్ర పాలన మొదలుపెట్టిండు.

ఇట్ల అసఫ్‌జాహీల పాలన 1724 నుంచి మొదలయ్యింది. నిజాముల్ ముల్క్ సుమారు ఇరువై నాలుగు ఏండ్లు పాలించిండు. 1748ల కాలం చేసిండు. ఆ తర్వాత ఈయన నాలుగో కొడుకు నిజామలీఖాన్ రొండో అసఫ్‌జాహి బిరుదుతో రాజైండు. ఈయన పాలనలనే 1763ల రాజధాని ఔరంగాబాద్ నుంచి హైదరాబాద్‌కు మారింది.

అప్పటికి హైదరాబాద్ రాజ్యంల కన్నడ, మరత్వాడా, ఇప్పటి సీమాంధ్ర ప్రాంతాలున్నయ్. 1800 నాటికి మూడు విడతలుగా సీమాంధ్ర ప్రాంతం బ్రిటీషోళ్ల చేతులకు పోయింది. అంటె 1800 నుంచి ఆంధ్రోళ్ల అంటు సొంటు తెలంగాణకు లేదు. 150 ఏండ్ల పాటు ఆంధ్రసోపతి లేకుంట తెలంగాణోల్లు బతికింద్రు.

నిజామలీ ఖాన్ తర్వాత ఆయన కొడుకు సికిందర్ జా మూడవ అసిఫ్ జాహీ బిరుదుతో సింహాసనం మీద కూచుండు. ఈయన తర్వాత ఈయన కొడుకు నాసిరుద్దౌలా నాలుగో అసఫ్‌జాహీ బిరుదుతో రాజయ్యిండు. నాసిరుద్దౌలా తర్వాత ఈయన పెద్దకొడుకు అఫ్జలుద్దౌలా అయిదో అసఫ్‌జాహీ బిరుదుతో రాజయ్యిండు.

అఫ్జలుద్దౌలా తర్వాత ఈయన కొడుకు మహబూబ్ అలీఖాన్ 1869ల ఆరో అసఫ్‌జాహీగా సింహాసనం ఎక్కిండు. అప్పటికి మహబూబ్ అలీఖాన్ వొయసు మూడేండ్లు. ఈయన కాలంలనే అనేక సాంస్కృతిక, సామాజిక ఉద్యమాలు జరిగినయ్. గ్రంథాలయ ఉద్యమం మొదలయ్యింది ఈయన హయాంలనే.

1911ల మహబూబ్ అలీఖాన్ కొడుకు ఉస్మాన్ అలీఖాన్ ఏడవ నిజాం అయ్యిండు. ఈయనే అసఫ్‌జాహీల పాలనల చివరిరాజు. రాజరిక పాలన ఈయన తోనే అంతమయ్యింది. ఈయన తర్వాత ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డది.

# హైదరాబాద్ అభివృద్ధి

హైదరాబాద్ నిర్మాణం 1591ల మొదలయ్యింది. నాలుగొందల ఏండ్లుగ తెలంగాణల ఉన్న అతిపెద్ద నగరం హైదరాబాద్.

కుతుబ్ షాహీల రాజ్యానికి మొదటి రాజధాని గోలకొండ కదా! ఈ వంశ పాలకుడైన ఇబ్రహీం కుతుబ్‌షా 1550లో రాజయ్యిండు. సుమారు ముప్పయ్ ఏండ్లు పాలించిండు. ఈయన కాలంలనే గోలకొండ నగర జనాభా పెరిగింది. ప్రజలకు నీటి వసతులు కరువైనయ్. అంటు వ్యాధులు సోకినయ్. అప్పుడు ఈయనకు నగరాన్ని పెద్దగ చేయాలనే ఆలోచన వొచ్చింది. అయితే అడ్డంగా మూసీ నది ఉన్నది. మూసీ నదికి ఇవతల నగరాన్ని నిర్మించాలనుకుండు. అందుకే మూసీనది మీద వంతెన–పురానా పూల్–కట్టించిండు. అట్ల కొత్త నగర నిర్మాణానికి పునాది వేసిండు.

ఈయన కాలంచేసిన తర్వాత ఈయన కొడుకు కులీకుతుబ్ షా కొత్త నగరం కోసం ప్రణాళికను తయారు చేయించిండు. అట్ల రూపుదిద్దుకున్నదే హైదరాబాద్ నగరం.

కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల పాలనల హైదరాబాద్‌ల అనేక చారిత్రక నిర్మాణాలు జరిగినయ్. అనేక పరిశ్రమలు స్థాపించిండ్రు. విద్యాలయాలు నెల కొల్పిండ్రు. గ్రంథాలయాలు ఏర్పాటు చేసిండ్రు. అనేక దవాఖానాలు కట్టించిండ్రు.

అసఫ్‌జాహీల పాలనలో హైదరాబాద్ దాదాపు సొతంత్ర రాజ్యంగా ఉన్నది. బ్రిటిష్‌పాలకులతో దోస్తానా ఉంది. సైనిక ఒప్పందం వంటివి చిన్నాచితక ఉన్నా నిజాములు పూర్తి సొతంత్రంగనే పాలించిండ్రు. సొంత చట్టాలు ఉన్నయ్. రాజ్యంల కాలు పెట్టాలంటే నిజాం అనుమతి తీసుకోవాలె. పాసుపోర్టు లేకుంట కాలు పెట్టడానికి వీలులేదు.

నిజాముల కాలంల సొంత నాణేలు వేసిండ్రు. హాలీసిక్కా పేరుతో చెలామణి అయినయ్. సొంత విమానయాన సంస్థ ఉంది. సొంత రోడ్డు రవాణా సంస్థ ఉంది. సొంత రైల్వేసంస్థ ఉంది. విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసిండ్రు.

హైదరాబాద్ సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందింది. సుందరమైన ఉద్యానవనాలను నిర్మించిండ్రు. 1862ల పోస్టాఫీసు, 1873ల బాగేఆం-పబ్లిక్ గార్డెను ఏర్పాటు చేసిండ్రు. 1873ల బొంబాయి-సికింద్రాబాద్ రైల్వేలైన్లను ఏర్పాటు చేసిండ్రు. 1874ల నిజాం రైల్వే సంస్థ ఏర్పాటైంది. 1882ల చంచల్‌గూడ జైలు,1883ల నాంపల్లి రైల్వేస్టేషన్, 1884ల ఫలక్‌నుమా ప్యాలెస్, 1884ల ముస్లింజన్ వంతెన నిర్మించిండ్రు. 1885ల టెలిఫోన్ సౌకర్యం వొచ్చింది. 1893ల హనుమాన్ వ్యాయామశాలను ఏర్పాటు చేసిండ్రు. 1920ల హైకోర్టు, 1920ల ఉస్మాన్‌సాగర్, 1927ల హిమాయత్ సాగర్ ఆనకట్ట, 1930ల హైదరాబాద్ నగరంల సిమెంట్‌రోడ్లను నిర్మించిండ్రు.

అద్భుతమైన పరిశ్రమలను స్థాపించిండ్రు. 1871ల సింగరేణి సంస్థ ప్రారంభమైంది. 1873ల మొదటి స్పిన్నింగ్ మిల్లు,1876ల ఫిరంగుల ఫ్యాక్టరీ, 1876ల ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్, 1910ల సోడా ఫ్యాక్టరీ, 1910ల బటన్ ఫ్యాక్టరీ, 1916ల దక్కన్ బటన్ ఫ్యాక్టరీ, 1919ల వివిఎస్‌టి ప్యాక్టరీ, 1921ల కెమికల్ లాబొరేటరీ,1927ల దక్కన్ గ్లాస్ ఫ్యాక్టరీ, 1929ల డిబిఆర్ మిల్స్, 1931ల వరంగల్ ఆజంజాహి మిల్స్ నిర్మించిండ్రు. 1932ల ఆర్‌టిసి స్థాపిం చిండ్రు. 1937ల నిజాం షుగర్ ఫ్యాక్టరీ, 1939ల సిర్పూర్ పేపర్ మిల్లు, 1941ల గోల్కొండ సిగరెట్ ఫ్యాక్టరీ ఏర్పాటు అయినయ్.

1942ల హైదరాబాద్ స్టేట్ బ్యాంకు ఏర్పాటు చేసిండ్రు. 1942ల హైదరాబాద్ అల్విన్ మెటల్స్, 1943ల ప్రాగాటూల్స్, 1946ల హైదరాబాద్ ఆస్బెస్టాస్, 1947ల హైదరాబాద్ లామినేషన్ ప్రొజెక్టు ఏర్పాటు అయ్యింది.

హైదరాబాదు రాష్ట్రంల అనేక గ్రంథాలయాలను కూడా స్థాపించిండ్రు. 1872ల ముదిగొండ శంకరాధ్యుల లైబ్రరీ, 1892ల అసఫియా స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, 1896ల భారత్ గుణవర్థక్ సంస్థ లైబ్రరీ, 1901ల బొల్లారం లైబ్రరీ, 1904ల శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, 1905ల రాజరాజ నరేంద్ర ఆంధ్రభాషా నిలయం, 1913ల ప్రతాపరుద్ర ఆంధ్రభాషా నిలయం, 1913ల సంస్కృత కళావర్ధినీ గ్రంథాలయం, 1923ల బాలసరస్వతీ గ్రంథాలయం, 1930ల జోగిపేట గ్రంథాలయం ఏర్పాటయ్యింది.

అన్ని రకాల వైద్యసేవలు ప్రజలకు అందుబాటులకు వొచ్చినయ్. 1890ల ఆయుర్వేదం, యునానీ వైద్యశాలలు ఏర్పాటు చేసిండ్రు. 1897ల ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్, 1905ల జజ్గిఖానా (విక్టోరియా మెమోరియల్ ప్రసూతి దవాఖానా),

1916ల హోమియోపతి కాలేజి, 1927ల చార్మినార్ యునాని ఆయుర్వేదిక్ ఆస్పత్రులు, 1945ల నీలోఫర్ చిన్నపిల్లల దవాఖానా, 1925ల ఉస్మానియా జనరల్ హాస్పిటల్, గాంధీ దవాఖానా, సికింద్రాబాద్, టిబి దవాఖానా, ఎర్రగడ్డ కాన్సర్ దవాఖానా, ఇఎన్‌టి దవాఖానా, నిజాం ఆర్థోపిడిక్ హాస్పిటల్ ఏర్పాటు చేసింద్రు.

అనేక పాఠశాలలు, కళాశాలలను కూడా ఏర్పాటు చేసింద్రు. 1856ల దారుల్ ఉలూం పాఠశాల, 1879ల చాదర్‌ఘాట్ పాఠశాల, 1879ల ముఫీదుల్ అనాం ఉన్నత పాఠశాల, 1904ల అలియా స్కూల్, 1884ల సికింద్రాబాద్ మహబూబ్ కళాశాల, 1874ల నిజాం కాలేజి,1887ల నాంపల్లి బాలికల పాఠశాల, 1894ల అసఫియా స్కూల్, 1894ల మెడికల్ కాలేజి, 1904ల వివేక వర్థిని పాఠశాల, 1910ల గన్‌ఫౌండ్రి మహబూబియా బాలికల పాఠశాల, 1920ల సిటి కాలేజి భవనం, ఉస్మానియా యూనివర్సిటీ, 1921ల ఉస్మానియా మెడికల్ కాలేజి, 1923ల హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (జాగిర్దార్ కాలేజి), 1924ల మార్వాడి హిందీ విద్యాలయ ఏర్పాటు చేసింద్రు.

అన్నిరకాల అభివృద్ధి నిజాముల కాలంనాటికే ఉంది. రాజుల పద్ధతిల రకాలు వసూలు చేసినా రైతులకు నీరు అందించటానికి చెరువులను తొవ్వించింద్రు. అంతకు ముందున్న చెరువులను బాగుచేయించింద్రు.

హైదరాబాద్ రాజ్యంల ప్రజలు ఎక్కువమంది హిందువులు. రాజు ముస్లిం. అయినా మత సామరస్యం పాటించింద్రు. ఏనాడూ మతంపేరుతో గొడవలు కాలేదు. నిజాములు మతసామరస్యాన్ని పాటించింద్రు అని చెప్పటానికి ఒక కథ ప్రచారంల ఉంది. ఆరో నిజాం కాలంలో మూసీనదికి వరదలొచ్చినయ్. ఆస్తి, ప్రాణ నష్టం జరి గింది. రాజు ఆ విపత్తుకు చలించిపోయిండు. నా ప్రజలకు ఇన్ని బాధలొచ్చినయ్ కదా అని బాధపడ్డడు. ఆ సమయంల ఒక బ్రాహ్మడు నిజాం మహబూబ్ అలీ దగ్గరికి వొచ్చిండు.

'మహాప్రభూ! ఈ కష్టాలు ముందలపొంటి రాకుంట ఉండాలె అంటే హిందూ మత ఆచారం ప్రకారం పూజలు చేయాలె' అని చెప్పిండు.

అందుకు రాజు అంగీకరించిండు. ఆ బ్రాహ్మడు చెప్పిన ప్రకారం పురానా హవేలిల ఉన్న ఒక రావిచెట్టుకింద కూసొని నొసట కుంకుమ బొట్టు పెట్టుకొని సంస్కృతశ్లోకాలు చదువుకుంట పూజలు చేసిండు. ఇది నవాబుల మత సామరస్యానికి గుర్తుగ మిగిలింది. ప్రజల మీద నిజాముల ప్రేమకు చిహ్నంగా చెపుతరు.

ఏడో నిజాం కాలంనాటి మరో ఉదంతం కూడా ఉంది. ఉస్మాన్ అలీఖాన్ ప్రతిరోజు నమాజ్ చదివిన తర్వాత దేవుణ్ణి పూజించేవాడు.

'అల్లా ! మద్రాసీలను క్షేమంగా ఉంచు' అని.

మద్రాసీలు అంటే అప్పటి మద్రాసురాష్ట్రంల ఉండే తెలుగోళ్లని అర్థం. అంటె ఇప్పటి ఆంధ్రోళ్లు.

నిజాం ప్రార్థనలోని అంతరార్థం ఆయన అంతరంగికులకు కూడా అర్థం కాలేదు. ఒకనాడు ఒక అంతరంగికుడు అడిగిండు.

'మహాప్రభూ! ఎవరైనా తను బాగుండాలె, తన ప్రజలు బాగుండాలె అని కోరుకుంటరు. మరి తమరేంది మద్రాసీలు బాగుండాలని కోరుకుంటున్నరు'

దానికి నిజాం ఇట్ల అన్నడు.

'మద్రాసీలు బాగుంటే వాళ్ల తిండి వాళ్లు తింటరు. వాళ్లకు ఏమాత్రం అటిటు అయినా నా ప్రజల నోటికాడి ముద్ద గుంజుకుంటరు. నా ప్రజలు అమాయకులు. వీళ్లకు ఏ కష్టం రాకూడదనే అల్లాను ప్రార్థిస్తున్న'

ఏడో నిజాం ఆనాడే మద్రాసుల ఉన్న ఆంధ్రోళ్ల గుణాన్ని కనిపెట్టిండు. వాళ్ల నుంచి తెలంగాణ ప్రజలకు ప్రమాదం పొంచి ఉన్నదని గమనించిండు. అందుకే అల్లాకు మొక్కిండు.

ఇది ఏడో నిజాంకు ప్రజల మీదున్న ప్రేమ. ఆంధ్రోళ్ల దోపిడీ గుణాన్ని ఆనాడే పసిగట్టిండు అనడానికి సంకేతం.

# హైదరాబాద్ ముల్కీలది

కాకతీయుల తర్వాత అనేకమంది హిందూ, ముస్లింలు హైదరాబాద్‌కు వొచ్చి స్థిరపడ్డరు. వీళ్లను దక్కనీలు అన్నరు. అంటే స్థానికులు. వీళ్లు ఉన్నత పదవులు ఉద్యోగాలు చేసింద్రు. ఆ తర్వాత బహమనీ సుల్తానుల కాలంల ఇరాన్, ఇరాక్, టర్కీ, అరేబియా దేశాల నుంచి అనేక మంది వలస వొచ్చింద్రు. ఇట్ల వలసవొచ్చి స్థిరపడ్డోళ్లను అఫాకీలు అన్నరు. అంటే స్థానికేతరులు అని.

అయితే అఫాకీలు వ్యాపారాలు చేసి సంపాయించింద్రు. బలవంతులు అయ్యింద్రు. అన్ని రంగాలల్ల పైచేయి సాధించింద్రు. పెద్ద ఉద్యోగాలు, మంత్రి పదవులు పొందింద్రు. ముల్కీలు మాత్రం చిన్న చూపుకు గురయ్యింద్రు. రొండవ శ్రేణి పౌరులుగా గుర్తింపు పొందింద్రు. దీంతో అఫాకీలకు, దక్కనీలకు అన్ని రంగాలలో అంతరాలు పెరిగినయ్. శత్రుత్వం ఏర్పడ్డది. అదికాస్త ముదిరి ఇద్దరి మధ్య గొడవలు జరిగినయ్. ఈ గొడవలల్ల అనేకమంది చనిపోయింద్రు.

కులీ కుతుబ్‌షా 1512ల గోల్కొండల కుతుబ్‌షాహి రాజ్యాన్ని ఏర్పాటు చేసిండు. ఆయన అఫాకీ. అయినా ముల్కీలకే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చిండు. అబుల్ హసన్ తానీషా కాలంల మాదన్న మంత్రి అయ్యిండు. అక్కన్న పేష్కారిగా పనిచేసిండు. కుతుబ్‌షాహీలు గొప్ప మనసుతో స్థానికులకు అవకాశాలు ఇచ్చింద్రు. దీంతో ముల్కీ సమస్య తలెత్తలేదు.

అయితే ఆ తర్వాత వొచ్చిన అసఫ్‌జాహీల కాలంల మాత్రం ముల్కీ సమస్య మల్లా రగిలింది. ఉద్యమాలు జరిగినయ్.

మొఘల్ రాజ్యం పతనం తర్వాత ఢిల్లీ, లక్నో, అవధ్, ముర్షిదాబాద్ రాజ్యాల నుంచి ఉద్యోగం కోల్పోయినవాళ్లు నిజాం రాజ్యానికి వలసవొచ్చింద్రు. ఐదవ నిజాం కాలంల ప్రధాని సాలార్‌జంగ్ చేపట్టిన సంస్కరణల వల్ల వలసలకు తలుపులు తెరుచుకున్నయ్. సాలార్‌జంగ్ హైదరాబాద్ సివిల్ సర్వీసు స్థాపించి నప్పుడు అలీఘర్

విశ్వవిద్యాలయం నుంచి అనేకమంది హైదరాబాద్‌కు వొచ్చింఁడు. ఇట్ల వొచ్చినోళ్లు స్థానికులకు శిక్షణ ఇచ్చి తిరిగి వెళ్లిపోతరని సాలార్‌జంగ్ అనుకున్నడు. కాని అట్ల జరగలే. వలసవొచ్చినోళ్లు స్థిరపడ్డరు. ఉన్న ఉద్యోగాలల్ల పాతుకపోయింఁడు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లేకుంట చేసింఁడు.

దీంతో ముల్కీ, గైర్(నాన్)ముల్కీ ఉద్యమాలు మొదలైనయ్. ఆరవ నిజాం మహబూబ్‌అలీ కాలంల కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. అనేక గొడవలైనయ్. ఆకరికి, ఉద్యోగాలు ముల్కీలకే ఇయ్యాలని నిజాం నిర్ణయం చేసిండు. 1910 కాలంల మహారాజా సర్ కిషన్‌ప్రసాద్ ముల్కీలకు అండగా నిలబడ్డడు. ముల్కీలకు కొంత వరకు న్యాయం చేసిండు.

ఆ తర్వాత 1919ల ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఒక ఫర్మానా జారీ చేసిండు. వీటినే ముల్కీ నిబంధనలు అన్నరు. ప్రభుత్వ ఉద్యోగాలల్ల కేవలం ముల్కీలను మాత్రమే నియమించాలని ఆదేశించిండు.

ఈ ఫర్మానా ప్రకారం ముల్కీలు ఎవరంటే...

- హైదరాబాద్‌లో పుట్టినోళ్లు.
- పదిహేను ఏండ్లు హైదరాబాద్‌ల ఉండుకుంట, తిరిగి వారి సొంత స్థలానికి పోవాలన్న ఆలోచన లేనోళ్లు.
- తండ్రి పదిహేను ఏండ్లు ప్రభుత్వ సర్వీసుల ఉంటే వారి పిల్లలు.
- భర్త ముల్కీ అయి ఉంటే ఆయన భార్య.

ముల్కీలుగా గుర్తింపు పొందాలంటే తాలూక్‌దార్ (కలెక్టర్) స్థాయి అధికారి నుంచి ధృవీకరణ పత్రం తీసుకొని సమర్పించాలన్న నియమం పెట్టిండు. ఇంకా, ముల్కీలు ఎవరు కాదో కూడా ఫర్మానాల వివరంగా తెలిపిండు. కింది స్థాయి ఉద్యోగా లల్ల ఈ ఫర్మానాను కచ్చితంగా అమలు చేసింఁడు.

కాని ఉన్నత ఉద్యోగాల నియామకంల ఈ ముల్కీ నిబంధనలను పాటించ లేదు. నిజాం సంస్థానంల ఉన్నత ఉద్యోగాలల్లకు 1930 ప్రాంతంల పంజాబ్‌కు చెందినోళ్లను అనేక మందిని తీసుకున్నరు. ఉద్యోగ అవకాశాలు పోవడంతో ముల్కీలు మల్లా గొడవ చేసింఁడు. దీంతో 1933ల నిజాం రాజు ఇంకో ఫర్మానా జారీ చేసిండు. ఉన్నత ఉద్యోగాలల్లకు కూడా విద్యావంతులైన ముల్కీలనే తీసుకోవాలని హుకుం సారంశం.

దీంతో ముల్కీల ఉద్యోగాలకు రక్షణ దొరికింది. నిజాం నవాబుకు ముల్కీలు కృతజ్ఞతలు చెప్పిండ్రు. హైదరాబాద్‌ల జరిగిన ఒక సమావేశంల ముల్కీ ఉద్యమ నాయకులు పద్మజానాయుడు, లతీఫ్ సయీద్, బూర్గుల రామ కృష్ణారావు, మందుముల నర్సింగరావు, మీర్ అక్బరలీఖాన్, రాజా ధోండేరాజా, హుమాయున్ మీర్జా, అక్బరలీ ఖాన్, అబుల్‌హసన్ సయ్యద్ అలీ, నవాజ్ షంషేర్‌జంగ్, సొహరాబ్జీ నిజాం రాజుకు ధన్యవాదాలు చెప్పిండ్రు.

ఈ సమయంల నిజాం 'జమీయత్ రియా యాయే నిజాం' అనే పేరుతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసిండు. నిజాం ప్రజల సంఘమని అర్థం. ఈ సంఘం *Hyderabad for Hyderabadis* అని నినాదం ఇచ్చింది. ఈ సంఘం అధ్యక్షుడు సర్ నిజామత్ జంగ్. రావుబహద్దూర్ వెంకట్రామారెడ్డి, మాడపాటి హనుమంతరావు, వామన్ రామచంద్ర నాయక్, కాశీనాథ్‌రావ్ వైద్య ఈ సంఘంల సభ్యులు. ముల్కీల రక్షణే లక్ష్యంగా ఈ సంస్థ 1939 వరకు పనిచేసింది.

# నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు

నిజాం రాజ్యంల ప్రధానంగా మూడు ప్రాంతాలున్నయ్. తెలంగాణ ప్రాంతం, మరఠ్వాడా ప్రాంతం, కన్నడ ప్రాంతం. తెలంగాణ ప్రాంతంల ఎనిమిది జిల్లాలు ఉన్నయ్. నల్లగొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, మెదక్, అత్రాఫ్‌బల్దా. అత్రాఫ్ అంటే చుట్టుపక్కల ప్రాంతం. బల్దా అంటే నగరం. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతమని అర్థం. ఈ ప్రాంతమే తర్వాత హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలుగా ఏర్పాటయింది. అప్పటికి ఖమ్మం జిల్లా కూడ లేదు. ఆ ప్రాంతం వరంగల్ జిల్లాల భాగంగా ఉంది.

మరఠ్వాడా ప్రాంతంల ఐదు జిల్లాలు ఉన్నయ్. ఔరంగాబాద్, బీడ్, పర్బనీ, నాందేడ్, ఉస్మానాబాద్. ఇక మూడవ ప్రాంతం కన్నడం. ఈ ప్రాంతంల మూడు జిల్లాలు ఉన్నయ్. గుల్బర్గా, రాయచూర్, బీదర్. మూడు భాషా ప్రాంతాలల్ల కలిపి మొత్తం 16 జిల్లాలు. ఈ జిల్లాలు అన్నీ కలిసి హైదరాబాద్ సంస్థానం. ఈ మూడు ప్రాంతాలల్ల ప్రజల భాష తెలుగు, మరాఠీ, కన్నడం. అధికార భాష మాత్రం ఉర్దూ. అచ్చమైన రాచరికపాలన ఉన్నది. ఆ సమయంల దేశంల బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమం నడిచింది.

ఈ ఉద్యమంల భాగంగా హైదరాబాద్ సంస్థానంల గ్రంథాలయ ఉద్యమం నడిచింది. అనేక గ్రంథాలయాలు నెలకొల్పిండ్రు. నల్లగొండ జిల్లాకు చెందిన కొమ ర్రాజు వెంకటలక్ష్మణరావు 1901ల హైదరాబాద్‌ల శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషా నిలయాన్ని, హనుమకొండల రాజరాజనరేంద్ర ఆంధ్రభాషా నిలయాన్ని నెలకొల్పిండు. ఈ రొండు గ్రంథాలయాల ఖర్చును మునగాల సంస్థాన అధిపతి రాజా వెంకట రంగారావు సమకూర్చిండు.

గ్రంథాలయ ఉద్యమం ప్రేరణతో అనేక సంఘసంస్కరణ ఉద్యమాలు జరిగి నయ్. అట్ల 1921ల హైదరాబాద్‌ల ఒక సంఘసంస్కార సభ జరిగింది. దానికి

మహిళా విశ్వవిద్యాలయ స్థాపకుడు అయిన కర్వే అధ్యక్షత వహించిండు. ఈయన ఇంగ్లీషు, మరాఠీల ఉపన్యసించెటోడు. అయ్యాల కూడా అట్లనే మాట్లాడిండు. తర్వాత వక్తలు మరాఠీ, ఉర్దూ, ఆంగ్ల భాషలల్ల మాట్లాడింద్రు.

ఈ సమావేశంల తెలంగాణకు చెందిన న్యాయవాది ఆలంపల్లి వెంకట రామారావు ఒక తీర్మానంపై తెలుగుల మాట్లాడటానికి సిద్ధమైండు. అయితే మిగతా సభ్యులు ముఖ్యంగా మరఠ్వాడా ప్రాంతానికి చెందిన వారు అరచి గోల పెట్టింద్రు. ఉపన్యాసం సాగకుంట చేసింద్రు. ఇది తెలుగోళ్లకు అంటే తెలంగాణ వాళ్లకు మనస్తాపం కలిగించింది. ఈ సంఘటన మాతృభాషకు జరిగిన అవమా నంగా భావించింద్రు. నిరసనగా సభ మధ్యలనే బయటకు వొచ్చింద్రు.

అదే రోజు టేకుమాను రంగారావు ఇంట్లె సమావేశమైంద్రు. తెలంగాణ వారికి ఒక ప్రత్యేక వేదిక అవసరమని భావించింద్రు. ఆంధ్ర జన సంఘం అని ఒక సంస్థను ఏర్పాటు చేసింద్రు. దీనికే నిజాం రాష్ట్ర ఆంధ్ర జన సంఘం అని పేరు. ఈ సమావేశానికి టేకుమాను రంగారావు, మాడపాటి హనుమంతరావు, మిట్టా లక్ష్మి నరసయ్య, ఆదిరాజు వీరభద్రరావు, నడింపల్లి జానకిరామయ్య, బూర్గుల రామకృష్ణా రావు, మందుముల నర్సింగరావు, బోయినపల్లి వెంకటరామారావు, కొమ్మవరపు సుబ్బారావు, బూర్గుల నరసింహరావు, పందిరి రామస్వామి నాయర్ హాజరయ్యింద్రు. ఆనాటి సమావేశంల ఆంధ్ర జన సంఘం అధ్యక్షునిగా రాజగోపాలరెడ్డి, కార్యదర్శిగా టేకుమాను రంగారావు ఎన్నికయ్యింద్రు.

నిజాం రాష్ట్ర ఆంధ్ర జన సంఘం సభలు నాలుగు జరిగినయ్. అనంతరం ఈ సంఘం ఆంధ్రమహాసభగా మారింది. దీనినే నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభలు అన్నరు. తొలి నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ 1930ల జోగిపేటల జరిగింది.

తెలంగాణల ఆంధ్ర ఉద్యమం మొదట సాంస్కృతిక ఉద్యమంగా మొదలైంది. ఆ తర్వాత సంస్కరణ ఉద్యమంగా మారింది. ఆ తర్వాత రాజకీయ అంశాలను లేవ నెత్తింది. స్థానిక సంఘాలను ఒక్కటి చేసే ప్రయత్నంల భాగంగా ఆంధ్రమహాసభలు ఏర్పాటయినయ్. నిజాం రాష్ట్రాంధ్రుల కష్టసుఖాలు తెలుసు కోవటానికి, వాళ్ల నుంచి పరస్పరం అభిప్రాయాలను పంచుకోవటానికి తెలంగాణ అంతటికి ప్రాధాన్యం వహించే సంస్థగా ఆంధ్రమహాసభ రూపుదిద్దుకుంది.

ఈ సభలల్ల రాజకీయ అంశాలు, చర్యలు ప్రస్తావనకు రాలేదు. సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేసింద్రు. ఈ తీర్మానాలను అమలు చేయాలని మాత్రమే నిజాం ప్రభుత్వాన్ని ప్రార్థించింద్రు.

అట్ల తొలిసభ మెదక్ జిల్లా జోగిపేటల 1930ల జరిగింది. ఈ సభకు సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించిండు. రొండో సభ 1931ల దేవరకొండల జరిగింది. ఈ సభకు బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షత వహించిండు. మూడో సభ 1934ల పులిజాల వెంకటరంగారావు అధ్యక్షతన ఖమ్మంల జరిగింది. నాలుగో మహాసభ 1935ల సిరిసిల్లల జరిగింది. మాడపాటి హనుమంతరావు అధ్యక్షత వహించిండు. ఐదో సభ 1936ల షాద్‌నగర్‌ల జరిగింది. కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షత వహించిండు.

ఆరో సభ 1937ల నిజామాబాద్‌ల మందుముల నరసింగరావు అధ్యక్షతన జరిగింది. ఏడో సభ 1940ల మల్కాపురంల జరిగింది. ఈ సభకు కూడా మందుముల నరసింగరావు అధ్యక్షత వహించిండు. ఎనిమిదో సభ 1941ల చిలుకూరుల రావి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. తొమ్మిదో సభ 1942ల ధర్మవరంల జరిగింది. ఈ సభకు మాదిరాజు రామకోటేశ్వరరావు అధ్యక్షత వహించిండు. పదో సభ 1943ల జరిగింది. హైదరాబాద్‌ల జరిగిన ఈ సభకు కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షత వహించిండు.

పదకొండో ఆంధ్రా మహాసభ 1944ల జరిగింది. ఈ సభ భువనగిరిల రావి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. పన్నెండో సభ 1945ల ఖమ్మంల జరిగింది. ఈ సభకు కూడా రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించిండు. పదమూడో సభ కూడా 1945లనే మందుముల నరసింగరావు అధ్యక్షతన మడికొండల జరిగింది. పద్నాలుగో సభ 1946ల జరిగింది. జమలాపురం కేశవరావు అధ్యక్షత వహించిన ఈ సభ కందిల జరిగింది. వీటిలో 12,13 మహాసభలు కాంగ్రెస్‌వాదులు విడిగా జరుపుకుండ్రు. ఇట్ల తెలంగాణ అన్ని జిల్లాలల్ల సభలు జరిపిండ్రు. ఈ ఆంధ్ర మహాసభలు తెలంగాణ ప్రజలల్ల రాజకీయ స్పృహను, చైతన్యాన్ని కలిగించినయ్.

1944ల భువనగిరిల జరిగిన పదకొండో ఆంధ్రమహాసభకు రావి నారాయణరెడ్డి అధ్యక్షునిగా ఎన్నికయ్యిండు కదా. అప్పటికే ఆయనకు కమ్యునిస్టులతో లోపాయకారీ సంబంధాలు ఉన్నయ్. రావి నారాయణరెడ్డి ఎన్నిక తర్వాత ఆంధ్ర మహాసభ నాయకులు అతివాదులు, మితవాదులుగా చీలి పోయిండ్రు. ఆ తర్వాత 12వ మహాసభను అతివాదులు రావి నారాయణరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిండ్రు. మితవాదవర్గం 13వ మహాసభను జమలాపురం కేశవరావు అధ్యక్షతన నిర్వహించిండ్రు.

14వ మహాసభను కూడా మితవాదులు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ పేరుతో నిర్వహించిండ్రు. ఆ తర్వాత మితవాద నాయకులు కాంగ్రెస్ పార్టీల చేరిండ్రు. అతి

వాదులు కమ్యూనిస్టు పార్టీల చేరింద్రు. జాతీయపక్ష మితవాదులుగా ఈ సభలో మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకట రంగారెడ్డి, మందుముల నరసింగరావు చురుగ్గా పాల్గొన్నరు. జాతీయ వాదులల్ల మితవాదులు మందుముల రామచంద్రరావు, నాగమిల్లి కోదండ రామారావు, కోదాటి నారాయణ రావు, కాళోజి నారాయణరావు, కొమరగిరి నారాయణరావు, ఎంఎస్ రాజలింగం, హయగ్రీవాచార్యులు, పాగ పుల్లారెడ్డి, కాంచనపల్లి పెద వెంకట రామారావు.

అతివాదులుగా ముద్రపడ్డ తర్వాత రావి నారాయణరెడ్డి, ఆరుట్ల లక్ష్మీ నరసింహారెడ్డి, బద్దం ఎల్లారెడ్డి కమ్యూనిస్టుపార్టీల చేరింద్రు. ఆ తర్వాత కమ్యూనిస్టులతో చేరిన వారిలో దేవులపల్లి వెంకటేశ్వరరావు, సర్వదేవభట్ల రామనాథం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఎ.గురువారెడ్డి ఉన్నరు.

12వ మహాసభ తర్వాత కమ్యూనిస్టులు సాయుధ పోరాటం చేయాలని తీర్మానించింద్రు. ఈ సాయుధ పోరాటం లక్ష్యం తెలంగాణల ఉన్న భూ స్వాము లను వ్యతిరేకించడం. రైతు కూలీలల్ల చైతన్యాన్ని రగిలించడం. నల్లగొండ, వరంగల్ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు రైతులు, వ్యవసాయ కూలీలను సమీక రించింద్రు. 1946ల సాయుధ ప్రతిఘటనను మొదలు పెట్టింద్రు. తెలంగాణ కమ్యూ నిస్టు నాయకుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి నాయకత్వంల ఈ పోరాటానికి అంకురార్పణ జరిగింది.

ఈ పోరాటం ఆ తర్వాత నిజాంకు వ్యతిరేక ఉద్యమంగా మారింది. భూ స్వాముల ఆధీనంల ఉన్న వొందల వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకొని పేదరైతులకు పంచడానికి తెలంగాణ నాయకులు తయారైంద్రు. పేదరైతులను గ్రామస్వరాజ్యంల భాగస్వాములను చేయడానికి ప్రయత్నం చేసింద్రు. నల్లగొండ, వరంగల్ జిల్లాలల్ల తెలంగాణ కమ్యూనిస్టు నాయకులు సాయుధ పోరాటం నిర్వహిం చింద్రు. భూస్వాముల భూములను స్వాధీనం చేసుకొని పేద రైతులకు పంచింద్రు.

తెలంగాణల భూమి కోసం రైతులు సాయుధ పోరాటం చేస్తుంటే ఆంధ్రల కమ్యూనిస్టు పార్టీ నాయకులు మాత్రం పోరాటం పేరుతో వ్యవసాయ అభివృద్ధి పనులు చేసుకుంద్రు. అధిక ఆదాయ ఉత్పత్తుల కోసం కాలువలల్ల పూడికలు తీయించింద్రు. మురుగు కాలువలు శుభ్రం చేయడం వంటి కార్య క్రమాలు చేసింద్రు. తమ ప్రాంతంల పచ్చదనం పెంచుకున్నరు. పంటలు మంచిగ పండించుకున్నరు. పార్టీ నిధుల కోసం వ్యాపారాలను ప్రోత్సహించింద్రు. సమయా నికి కార్యాలయాలకు వొచ్చి పార్టీ పనులు చేసుకొని మల్ల ఇండ్లకు చేరింద్రు.

తెలంగాణను మాత్రం కమ్యూనిస్టు ఉద్యమాలకు ప్రయోగశాలగా మార్చిండ్రు. పేదలకు అరచేతిల స్వర్గం చూపించిండ్రు. గోరంతను కొండంతలు చేసి చూపించిండ్రు. అమాయక ప్రజలను రెచ్చగొట్టిండ్రు. ఉద్యమాలతో ఉసిగొల్పిండ్రు. వీరోచిత పోరాటాలుగా కీర్తించిండ్రు. చివరికి తెలంగాణను రక్తసిక్తం చేసిండ్రు.

# ఆంధ్రా కమ్యూనిస్టులు

తెలంగాణ ప్రాంతంల ఆంధ్రమహాసభలు జరుగుతున్న కాలంలనే ఆనాటి మద్రాసు రాష్ట్రంల ఉన్న సీమాంధ్ర ప్రాంతంల కూడ ఆంధ్ర మహాసభలు జరిగి నయ్. అయితె తెలంగాణల జరిగిన ఆంధ్ర మహాసభలు బ్రిటీష్ ఆంధ్రల జరిగిన ఆంధ్ర మహాసభలు ఒకటికావు. వాటికి ఏ సంబంధమూ లేదు. ఆ సభలు నిర్వహించిన ప్రాంతాలు వేరు. ఆ సభల లక్ష్యాలు వేరు. నాయకులు వేరు.

నిజాం రాజ్యంల కన్నడ, మరఠ్వాడా, తెలుగు అంటే తెలంగాణ ప్రాంతాలు ఉన్నయ్ కదా! ఈ ప్రాంతంల తెలుగు మాట్లాడే తెలంగాణ ప్రజలను ఆంధ్రులు అన్నరు. అట్లనే ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తమిళులు, తెలుగు మాట్లాడే సీమాంధ్రులు ఉన్నరు. అక్కడ సీమాంధ్రులను ఆంధ్రులుగా పిలిచింద్రు. అంతేకాని తెలంగాణ ఆంధ్రకు, సీమాంధ్ర ఆంధ్రకు ఏ సంబంధం లేదు.

నిజాం ఆంధ్రల, బ్రిటిషాంధ్రల ఆంధ్రమహాసభలు జరుగుతున్నయ్ అని చెప్పుకున్నం కదా ! నిజాం రాష్ట్రాంధ్ర మహాసభల లక్ష్యం సంస్కరణలు. బ్రిటీషాంధ్ర మహాసభల లక్ష్యాలల్ల ముఖ్యమైనది మాత్రం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం. ఆంధ్రనాయకులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని కోరుకుంటనే పక్కన ఉన్న తెలంగాణ మీద కన్నేసింద్రు. ఏనాటికైనా భాష పేరుతో రెండు తెలుగు ప్రాంతాలను కలపాలని అనుకుంద్రు. తెలంగాణ ప్రాంతం మీద ఆధిపత్యం చేయాలని కుట్రలు చేసింద్రు.

కమ్యూనిస్టు పార్టీ ఈ ఆంధ్రా కుట్రలను అమలుచేసే పనిని భుజాల మీద వేసుకుంది. అప్పుడు కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో చంద్ర రాజేశ్వరరావు, పుచ్చల పల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య–ఇట్లాంటోల్లంత చురుకుగా పాల్గొన్నరు.

నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలల్ల చురుకుగా పాల్గొంటున్న నాయకత్వాన్ని తమవైపు ఆకర్షించుకోవాలనే ప్రయత్నాలు చేసింద్రు. దాంట్లె భాగంగనే 1937ల ఆంధ్ర ప్రాంతంల వెలువడుతున్న సోషలిస్టు పార్టీ పత్రిక 'నవశక్తి'ని తెలంగాణ ప్రాంతంల అమ్మడం మొదలుపెట్టింద్రు.

తెలంగాణ యువనాయకులు ఆ పత్రిక చదివి సోషలిస్టు భావాలవైపు ఆకర్షితులయ్యింద్రు. ఇదే అదునుగా ఆంధ్రనాయకులు తెలంగాణ నాయకులతో పరిచయాలు పెంచుకుంద్రు. ఆంధ్రనాయకులు ఇంకో అడుగు ముందుకేసి 1939 మే 23 నుంచి జూన్ 13 వరకు నిజాం రాష్ట్రపు ఆగ్నేయ సరిహద్దులోని తిరుపూరు తాలూకా తునికిపాడుల రాజకీయ శిక్షణా శిబిరం ఏర్పాటు చేసింద్రు. ఈ శిబిరంల కమ్యూనిస్టు పార్టీ తరుపున చంద్ర రాజేశ్వరరావు పాఠాలు చెప్పిండు. ఈ శిబిరాలకు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డితోపాటు మరో 50 మంది హాజరయ్యింద్రు.

తెలంగాణ ప్రజల పోరాటానికి మద్దతు ఇయ్యడమే తమ లక్ష్యమని ఆంధ్రా కమ్యూనిస్టు నాయకులు ఈ రాజకీయ శిబిరంల చెప్పింద్రు. తెలంగాణ నాయకులు ఆంధ్రనాయకుల మాటలు నమ్మి నిజాం రాష్ట్రంల ఉన్న సమస్యలను వారితో చర్చించింద్రు.

ఈ సమయంలనే 1940 ఏప్రిల్‌ల జరిగిన 7వ ఆంధ్రమహాసభకు చంద్ర రాజేశ్వరరావు రహస్యంగా హాజరైండు. ఈసభ తర్వాత తెలంగాణ కమ్యూ నిస్టు ఉద్యమం గురించి ఆంధ్ర కమిటీకి ఆయన ఒక నివేదికను ఇచ్చిండు. ఆ తర్వాత తెలంగాణ నాయకత్వం మీద మరింత ఆధిపత్యం సంపాదించాలనే ప్రణాళికతో రాజేశ్వరరావును తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమానికి బాధ్యునిగా ఆంధ్ర కమిటీ నియమించింది.

1944ల భువనగిరిల జరిగిన 11వ ఆంధ్రమహాసభకు కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు ఉన్న రావి నారాయణరెడ్డి అధ్యక్షునిగా ఎన్నికయ్యిండు. దాంతో ఆంధ్ర మహాసభ చీలిపోయింది. అయినా ఆ వెంటనే రావి నారాయణరెడ్డి అధ్యక్షతన మరో ఆంధ్రమహాసభను నిర్వహించేటట్లు చేసి ఆంధ్రకమ్యూనిస్టు కమిటీ తెలంగాణ నాయకత్వం మీద పట్టు బిగించింది. ఇదంతా భాష పేరుతో తెలంగాణ మీద దాడికి ఆంధ్ర నాయకుల కుట్ర అని ఆనాటి తెలంగాణ నాయకత్వం గుర్తించలేక పోయింది. తర్వాత తెలంగాణ నాయకత్వానికి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాలు ఇచ్చింద్రు. తమ పార్టీలకు గుంజుకున్నరు.

తెలంగాణ ప్రజల అవసరాల కోసం, తెలంగాణ కమ్యూనిస్టు నాయకుడైన భీమిరెడ్డి నరసింహారెడ్డి దున్నేవానికి భూమి అనే నినాదం ఇచ్చిండు. భీమిరెడ్డి ఈ నినాదం ఇయ్యడం ఆంధ్రా కమ్యూనిస్టులు ఇష్టపడలేదు. భూ పంపకాలకు మొదట వారు ఒప్పుకోలేదు. కారణం ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ భూస్వాములతో, వ్యాపారులతో నిండి ఉండటం. ఆంధ్రా ప్రాంతంల కూడా భూపంపకాలు చేయాల్సి వొస్తుందని.

అందుకని తీవ్రంగా వ్యతిరేకించిండ్రు. అయినా భీమిరెడ్డి తన నినాదాన్ని వెనక్కి తీసుకోకపోవటంతో ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ ఆయనను సస్పెండ్ చేసింది.

భీమిరెడ్డి వెనకకు తగ్గలేదు. భూ పంపకాలు మొదలుపెట్టిండు. భూ పోరాటానికి తెలంగాణ పేద రైతులు, కూలీల నుంచి అద్భుతమైన స్పందన వొచ్చింది. ఈ స్పందన చూసిన ఆంధ్రా కమ్యూనిస్టు నాయకులు అప్పుడు తెలివి తెచ్చుకున్నరు. చివరికి వారు కూడా దున్నేవానికే భూమి అన్న నినాదం ఇచ్చింద్రు. మల్ల ఇక్కడ కూడా నిజాంతో సంబంధాలున్న భూస్వాముల భూములను పంచడానికి మాత్రమే ఒప్పుకుండ్రు. ఆ తర్వాత తప్పని పరిస్థితిలో బిఎన్‌ను తిరిగి పార్టీలకు తీసుకున్నరు.

అప్పుడు తెలంగాణ, ఆంధ్ర వేరువేరు రాష్ట్రాల ప్రాంతాలు అయినా ఒకటే కమిటీ ఉంది. అది ఆంధ్ర సెక్రటేరియట్. అంతే తప్ప తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు కానియ్యలేదు ఆంధ్రనాయకులు.

తెలంగాణ నాయకులు తెలంగాణకు ప్రత్యేక కమిటీ కావాలని కోరిండ్రు. కాని ఆనాటికి ఆంధ్ర సెక్రటేరియట్ కార్యదర్శిగా ఉన్న ఆంధ్ర కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య తోసిపుచ్చిండు. తెలంగాణకు ప్రత్యేక కమిటీ ఏర్పడటానికి ససేమిరా అన్నడు. ఇది విచ్ఛిన్నకర వాదనగా కొట్టిపడేసిండు. ఆంధ్ర, తెలంగాణకు ఒకటే కమిటీ ఉండాలని పట్టుపట్టిండు. అంతకయితే తెలంగాణకు వేరే సబ్‌కమిటీ ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పిండు. తెలంగాణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటుకాకుంట అడ్డుకున్నడు.

ఈ వివాదాన్ని కేంద్ర కమిటీ గమనించింది. పార్టీని ఐక్యపరచాలంటే తెలంగాణవాళ్లు కోరినట్టు తెలంగాణకు వేరే కమిటీ ఉండాలని చెప్పింది. అయినా ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు ఒప్పుకోలేదు. రొండు మూడేండ్ల చర్చల అనంతరం చిట్టచివరికి ఆంధ్ర, తెలంగాణ ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయమైంది. అయినా సుందరయ్య ఒక కొర్రి పెట్టిండు. ఇది విచిత్రమైనది. ఆంధ్రా ఆధిపత్యానికి సంబంధించింది. అదేందంటే తెలంగాణ కమిటీల తెలంగాణల పుట్టినవాళ్లే ఉండాలనే నియమం ఉండకూడదని. అట్లయితెనే తెలంగాణ ప్రత్యేక కమిటీకి ఒప్పుకుంటం అని తెలంగాణ కమిటీకి ఉచ్చుపెట్టిండు.

ఆంధ్ర కుట్రలే సాగినయ్. తెలంగాణ సెక్రటేరియట్‌ల బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి ఉండగా ఈ ముగ్గురితోపాటు ఆంధ్ర నాయకులు మాకినేని బసవపున్నయ్య, పుచ్చలపల్లి సుందరయ్య దూరిండ్రు.

తెలంగాణ కమిటీ వేసినట్లే వేసింద్రు. కాని ఈ కమిటీ మీద ఆధిపత్యం తమ చేతుల్ల ఉంచుకోవడానికి ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు ఎత్తులు వేసింద్రు.

ఇంక తెలంగాణ కమిటీ వేసిన ప్రయోజనం ఏముంటది. తమ ప్రాంతానికి సొంత కమిటీ ఉండాలని, తమ ప్రాంత అవసరాలకు అనుగుణంగా సొతంత్రంగా పోరాటాలు నిర్మించుకోవాలని అనుకున్న తెలంగాణ నాయకుల ఆశలకు గండిపడ్డది. ఆంధ్రనాయకుల ఉద్దేశం కూడా తెలంగాణ నాయకత్వం మీద జులుం చెలాయించడమే. సుమారు నాలుగేండ్లపాటు తెలంగాణ కమిటీ నెత్తిన ఆంధ్రనాయకులు కూసుంద్రు. 1957 తర్వాత అసలు తెలంగాణ కమిటీనే రద్దు చేసింద్రు. ఆ తర్వాత జబర్దస్తుగ తెలంగాణ నెత్తిన కూసుంద్రు.

ఇక్కడ ఒక మాట. తెలంగాణ ప్రజల మేలు కోసమే ఆంధ్రా నాయకులు తెలంగాణ పోరాటానికి మద్దతు ఇచ్చింద్రు అనుకుందాం. మరి పోరాటం అయిపోయిన తర్వాత ఏం చేయాలె. నిజాయితీ ఉంటె తమ ప్రాంతానికి తిరిగి పోవాలె. కాని ఆంధ్ర నాయకులు ఆ పని చేయలేదు. అహంకారంతో వ్యవహరిం చింద్రు. తెలంగాణ ప్రాంతం మీద తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి ప్రయత్నం చేసింద్రు. పార్టీ పేరు చెప్పి తెలంగాణ ప్రాంతంలో చొరబడ్డ ఆంధ్రోళ్లు తర్వాత తెలంగాణ ప్రతి మలుపులోను తాకుడురాళ్లు అయ్యింద్రు.

తెలంగాణల చొరబడిన ఆంధ్ర కమ్యూనిస్టు నాయకుడు సుందరయ్య తన విప్లవపథంలో నా పయనం అనే పుస్తకం158 పుటల ఇట్ల రాసుకుండు.

'... 1945 నాటికే నల్లగొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలోనూ హైదరాబాద్ పట్టణంలోను మెదక్ కూడ కొంతవరకు ఉన్న నిజాం సంస్థాన వ్యాపిత ఉద్యమం మా అధీనంలోకి వచ్చింది.'

అధీనంలకు వచ్చింది అని అహంకారంతో, పొగరుతో రాసుకున్నడు. శత్రుదేశం మీద దాడి చేసి విజయం సాధించిన వీరుడు అనే మాటల లెక్క ఉన్నయ్. ఈ మాటలు చదువుతుంటే, భాష నెపంతో ఆంధ్ర, తెలంగాణ కలిపి ఒకే రాష్ట్రంగా ఏర్పరచాలె అన్న డిమాండు ఆంధ్రనాయకులు చేస్తుంటే 'విశాలాంధ్ర వెనుక దురాక్రమణకాంక్ష ఉంది' అన్న నెహ్రూ మాటలు యాది కొస్తయ్.

కుట్రలతో కుతంత్రాలతో తెలంగాణ నాయకత్వాన్ని, దాంతోటి తెలంగాణ ప్రాంతాన్ని తమ జాగీరుగా మల్చుకున్న ఆంధ్రకమ్యూనిస్టు పార్టీలు, నాయకులు తెలంగాణకు ద్రోహమే చేసింద్రు.

భూపంపకాలు జరగాలని తెలంగాణ రైతాంగ పోరాటం ఆపేది లేదని దేవులపల్లి వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి ఒకవైపు అంటుంటే 1952 ఎన్నికల్ల పాల్గొని చట్టసభల్లకు పోవాలని ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులు తహతహ లాడింద్రు. అప్పటికే ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో మాట్లాడుకున్నరు. సాయుధ పోరాటాన్ని విరమిస్తేనే ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రభుత్వం అవకాశం ఇస్తుందని నెహ్రూ చెప్పిండు.

దీంతో ఆంధ్రానాయకుల ఆరాటం పెరిగింది. పోరాటం పేరుతో ఎన్నికలకు దూరంగా ఉంటే తర్వాత తమకు ఉనికి, బతుకు ఉండదని భావించింద్రు. ఇక పోరాట విరమణ చేయించాలని నిర్ణయించుకుంద్రు. దానికి దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు, భీమిరెడ్డి నరసింహారెడ్డి అంగీకరించలేదు. అయినా పోరాటంల ఉన్న నాయకులకు కనీసం చెప్పకుంట కుట్రపూరితంగా వ్యవహరించింద్రు. దేవులపల్లి సంతకాన్ని సుందరయ్య నాయకత్వంల ఫోర్జరీ చేసి తెలంగాణ సాయుధ పోరాటం విరమిస్తున్నట్టు ప్రకటన చేసింద్రు. ఆ తర్వాత అవి దొంగ సంతకాలు అని దేవులపల్లి ప్రకటించిండు. అప్పుడు తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఆ పరిస్థితులల్ల ఆ నిర్ణయం తీసుకోవాల్సి వొచ్చిందని కట్టుకతలు చెప్పింద్రు.

తెలంగాణ నాయకులు పోరాటం చేసుకుంట అజ్ఞాతంల ఉంటే ఆంధ్రా నాయకులు రాజకీయ పదవుల కోసం సొంగలు కార్చింద్రు. చివరికి తెలంగాణ సాయుధ పోరాటాన్ని హైజాక్ చేసింద్రు. ఆ తర్వాత తెలంగాణ సాయుధపోరాటాన్ని తామే చేసినమని గొప్పలు చెప్పుకుంద్రు. అసలు పోరాటం చేసిన తెలంగాణ నాయకులను తగ్గించే కుట్రలు చేసింద్రు. తెలంగాణ చరిత్రను వక్రీకరించి తమ హీరోయిజాన్ని ప్రచారం చేసుకుంద్రు. తెలంగాణ మీద ఆధిపత్యం చేయడానికి పూనుకుంద్రు.

# రజాకార్లు

గాంధీ నాయకత్వం, దేశప్రజల పోరాట ఫలితంగా దేశానికి సొతంత్రం వొచ్చింది. 1947 ఆగస్ట్ 15న బ్రిటిష్ పాలకులు అధికారాన్ని అప్పగించిండ్రు. నెహ్రూ ప్రధానమంత్రిగా తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడ్డది. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు ఉపప్రధానమంత్రి హోదాతోపాటు హోంశాఖ బాధ్యతలు అప్పగించిండు నెహ్రూ. రాష్ట్రపతి హోదాకు సమానమైన గవర్నర్ జనరల్‌గా మాత్రం బ్రిటీష్ చివరి వైస్రాయ్ లార్డ్ మౌంట్ బ్యాటన్ ఉన్నడు.

సొతంత్రం వొచ్చింది. కాని నెహ్రూ ప్రభుత్వం ముందు ఆనాడు అనేక సమస్యలు ఉన్నయ్. భారత్ నుంచి పాకిస్థాన్ విడిపోవడం తదితర పరిణామాల నుంచి దేశం ఇంకా కోలుకొని కుదుటపడలేదు. దీనికితోడు దేశవ్యాప్తంగా ఉన్న 500 పైబడిన సంస్థానాలను భారత్‌ల విలీనం చేయడం కూడా జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. దాదాపు అన్ని సంస్థానాలు స్వచ్ఛందంగా విలీనమైనయ్. కాశ్మీర్, హైదరాబాద్ వంటి దేశీయ రాజ్యాలు మాత్రం విలీనం కావడానికి ఇష్టపడలేదు.

1947 జూన్ 2న భారత్‌కు అధికారం అప్పగించనున్నట్లు లార్డ్ మౌంట్ బ్యాటన్ బ్రిటీష్ ప్రభుత్వం తరపున ప్రకటించిండు. ఈ సందర్భంల బ్రిటీష్ ప్రభుత్వం మరో విషయం కూడా ప్రకటించింది. భారత్‌లోని స్వదేశీ సంస్థానాలు ఇండియన్ యూనియన్‌ల కాని పాకిస్థాన్‌ల కాని కలవొచ్చు అని, లేదంటే సొతంత్రంగ కూడా ఉండొచ్చని మూడు మార్గాలను సూచించింది.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ రాజుగా ఉన్న హైదరాబాద్ సంస్థానానికి ప్రత్యేకత ఉంది. దేశంల హైదరాబాద్ అతిపెద్ద సంస్థానం. కొద్దిపాటి విషయాలు తప్ప దాదాపు సొతంత్ర రాజ్యం. రాజు ముస్లిం కాగా ప్రజలల్ల అత్యధికులు అంటే 85 శాతం మంది హిందువులు.

సహజంగనే హైదరాబాద్ నిజాం సొతంత్రంగా ఉండడానికి ఇష్టపడ్డడు. 1947 జూన్ 11న ఒక ఫర్మానా ద్వారా తాము ఇండియన్ యూనియన్‌ల గాని,

పాకిస్తాన్‌ల గాని చేరబోమని తేల్చి చెప్పిండు. సొతంత్రంగ ఉంటనని ప్రకటించు కుండు.

ఇదే సమయంల మజ్లిస్ ఇత్తెహాదు ముస్లిమీన్ మాత్రం పాకిస్థాన్‌ల కలవా లన్న ప్రతిపాదన తెచ్చింది. అయితే రాజు మీర్ ఉస్మానలీ ఖాన్ అందుకు అంగీక రించలేదు. అది ఆచరణ సాధ్యం కాదని చెప్పిండు. సొతంత్రంగ ఉండటమే మంచిదని అన్నడు.

ఇక్కడ మజ్లిస్ ఇత్తెహాదు ముస్లిమీన్ గురించి రొండు మాటలు తెలుసు కోవాలె. మజ్లిస్ లేదా ఇత్తెహాద్ పేరుతో పిలిచే ఈ సంస్థ 1927ల ఏర్పాటయింది. ఈ సంస్థ మొదట సాంస్కృతిక మత సంస్థగా మొదలైంది. యువ జాగీర్దార్ బహదూర్ ఖాన్ ఈ సంస్థ వ్యవస్థాపకుడు. ఈయన మంచి వక్త. ఖురాన్ మీద అద్భుతగా మాట్లాడగలడు. ఈయన ఉపన్యాసాలకు మెచ్చిన నిజాం 'యార్ జంగ్' అనే బిరుదును కూడా ఇచ్చిండు.

1938ల బహదూర్ యార్ జంగ్ అనల్ మాలిక్ అనే సిద్ధాంతాన్ని తెచ్చిండు. దీని ప్రకారం రాజ్యంల ఉన్న ప్రతి ముస్లిం రాజే. ఇది ఇత్తేహాద్ అధికారిక సిద్ధాంత మైంది. హైదరాబాద్‌ను ముస్లిం రాజ్యంగా ప్రకటించాలని బహదూర్ గట్టిగా ప్రయత్నించిండు.

1944ల బహదూర్ అకస్మాత్తుగా చనిపోవటంతో ఇత్తెహాద్ నాయకత్వ పగ్గాలు ఖాసిం రజ్వీ తీసుకుండు. ఈయన అలీఘర్ యూనివర్సిటీల వకాలత్ చదివిండు. ఓ మోస్తరు ప్రాక్టీసు ఉన్న లాయరు. మంచి వక్త. ముస్లిం మతం మీద విపరీతమైన అభిమానం ఉన్నోడు.

రజ్వీ మజ్లిస్ బాధ్యతలు తీసుకున్న తర్వాత పారామిలటరీ బలగాన్ని ఏర్పాటు చేసిండు. ఇత్తెహాద్ పార్టీ సభ్యులను రజాకార్లు అని పిలిచిండు. రజాకార్ అంటే స్వచ్ఛంద కార్యకర్త అని అర్థం.

ఆ తర్వాత కాలంల రజ్వీ అనేక అమానుష చర్యలకు ఒడిగట్టిండు. ఈయన అరాచకాలకు తట్టుకోలేక అనేకమంది హిందువులు నిజాం రాజ్యం నుంచి వలస పోయింద్రు. రజ్వీ రజాకార్ల బ్రిగేడ్లకు ఫీల్డ్‌మార్షల్‌గా తనకు తాను ప్రకటించుకుండు. ఖాకీ యూనిఫారం కూడా వేసుకునేటోడు. ఆ తర్వాత కాలంల నిజాంను కూడా శాసించే స్థాయికి ఎదిగిండు.

హైదరాబాద్ భవిష్యత్తు మీద చర్చ జరుగుతున్నప్పుడు రజ్వీ మాత్రం పాకిస్తాన్‌ల కలపాలని పట్టుబట్టిండు.

అదే సమయంల కమ్యూనిస్టు పేరుతో ఆగడాలు మొదలైనయ్. విస్నూరు దొర రాపాక వెంకటరామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా మొదలయిన కమ్యూనిస్టు ఉద్యమం తెలంగాణ భూస్వాములకు వ్యతిరేకంగా మార్పు చెందింది. మరో అడుగు ముందుకేసి నిజాంకు వ్యతిరేకంగా నినదించింద్రు. ఈ సందర్భంలనే కమ్యూనిస్టులు అరాచకాలను మొదలు పెట్టింద్రు. భారత సొతంత్రాన్ని అంగీకరించ బోమని, అది కేవలం అధికార మార్పిడి మాత్రమే అని ప్రచారం చేసింద్రు.

అసహనంతో తెలంగాణలోని నల్లగొండ, వరంగల్ రొండు జిల్లాలల్ల సాయుధ పోరాటమని చేసింద్రు. గ్రామాలల్ల చిన్నాచితుక భూస్వాముల మీద వాళ్ల అనుచరుల మీద దాడులు చేసింద్రు.

ఈ సమయంల కమ్యూనిస్టుల చర్యలు నిజాం అధికారానికి ఇబ్బంది కలిగి స్తున్నయని కాసిం రజ్వీ భావించిండు. రజ్వీ అధ్వర్యంల రజాకార్లు కమ్యూ నిస్టుల వెంటబడ్డరు. దొరికినోణ్ణి దొరికినట్టు చంపింద్రు.

నిజాం విలీనానికి సంసిద్ధమైతున్న సమయంల కూడా కాసింరజ్వీ దాడులకే తెగపడ్డడు. భారతసైన్యం హైదరాబాద్‌ల కాలుపెట్టినపుడు కూడ విధ్వంసానికి పూను కున్నడు. అనేకమంది హిందువులపై దాడిచేసి ప్రాణాలు తీసిండు.

చివరికి భారతసైన్యానికి బందీ అయి జైలు శిక్ష అనుభవించిండు ఖాసిం రజ్వీ. ఆ తర్వాత 1957 సెప్టెంబర్ 11న శిక్ష పూర్తి చేసుకొని విడుదలై పాకిస్తాన్ పోయిండు. పాకిస్తాన్ పోయే ముందు మజ్లిస్ నాయకత్వ బాధ్యతలు తీసుకొమ్మని అనేక మంది ముస్లిం నాయకులను అడిగిండు. కాని ఎవరూ సాహసించి ముందుకు రాలేదు. రజాకార్ల ఆగడాల వల్ల మజ్లిస్ మీద ఆనాడు ప్రజలల్ల ఉన్న అభిప్రాయమే అందుకు కారణం. చివరికి అబ్దుల్ వాహిద్ ఓవైసీ ముందుకొచ్చిండు. దీంతో మజ్లిస్ నాయకత్వాన్ని ఓవైసీకి అప్పగించి పాకిస్తాన్ వెళ్లి పోయిండు రజ్వీ. అక్కడ 67 ఏండ్ల వొయసుల అనాథలెక్క 1970 జనవరి 15న కాలం చేసిండు.

# హైదరాబాద్ విలీనం

సొతంత్రం అప్పగించుకుంట స్వదేశీ సంస్థానాల గురించి కూడా బ్రిటీష్ పాలకులు ఓ మాట చెప్పింద్రు. సంస్థానాలు ఇండియన్ యూనియన్‌ల కలవొచ్చు. పాకిస్థాన్‌ల కలవొచ్చు. సొతంత్రంగ ఉండొచ్చు. అయితే నిజాం మూడవ మార్గాన్నే ఎంచుకున్నడు.

బ్రిటిష్‌వాళ్లతో ఉన్నట్టుగానే స్నేహపూర్వకంగా ఉండుకుంట సొతంత్ర రాజ్యంగ ఉండాలని అనుకున్నడు. 1947 నవంబర్ 29న భారత రాష్ట్రపతి హోదాల ఉన్న లార్డ్ మౌంట్ బ్యాటన్‌తో ఒప్పందం చేసుకుండు. దీనినే యథాస్థితి ఒడంబడిక అన్నరు. ఈ ఒప్పందం ప్రకారం గతంల బ్రిటీష్ పాలకులతో నిజాం కొనసాగించిన స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించాలె. హైదరాబాద్ అంతర్గత విషయాలల్ల ఇండియన్ యూనియన్ జోక్యం చేసుకోవడానికి వీలులేదు. భారత్, హైదరాబాద్‌ను సమాన స్థాయిగల దేశంగ గుర్తించాలె.

మౌంట్ బ్యాటన్‌తో నిజాం ఒప్పందం నెహ్రూ ప్రభుత్వానికి తెలియంది కాదు. ఈ ఒప్పందం ఇష్టం ఉందోలేదో కాని బయటికి మాత్రం అభ్యంతరం చెప్పలేదు. ఆనాడు దేశంలో జరుగుతున్న గొడవలు, పరిస్థితులు సర్దుకోకపోవడం వంటి కారణాల వలన నెహ్రూ సప్పుడు చేయలేదు.

1948 జూన్‌ల మౌంట్ బ్యాటన్ లండన్ వెళ్లిపోయిండు. ఆయన స్థానంల గవర్నర్ జనరల్‌గా రాజగోపాలచారి వొచ్చిండు.

మౌంట్ బ్యాటన్ లండన్ పోయిన తర్వాత నెహ్రూ ప్రభుత్వం దేశీయ సంస్థానాల విలీనం మీద దృష్టిపెట్టింది. భారత్ అంతర్భాగంల దేశీయ సంస్థానాలు ఉంటే భవిష్యత్‌ల ఇబ్బందులు వొస్తయని భావించింది. అందుకని బలవంతంగా అయినా సరే విలీనం చేయాలని ప్రయత్నాలు మొదలుపెట్టింది.

ఈ విషయం నిజాంకు తెలిసింది. నిజాం రాజు తమ సొతంత్రాన్ని రక్షించుకోవటానికి 1948 ఆగస్ట్ 21న ఐక్యరాజ్య సమితిని ఆశ్రయించిండు. భారత్ చర్యలను ఆపాలని కోరుతూ కేసు వేసిండు.

ఆ వెంటనే ఇండియన్ యూనియన్ హైదరాబాద్‌పై పోలీసు చర్యకు పూనుకుంది. భారత ప్రభుత్వంల హోంమంత్రిగా ఉన్న సర్దార్ వల్లభాయి పటేల్‌కు హైదరాబాద్ సంస్థాన విలీన బాధ్యతను అప్పగించిండు నెహ్రూ. 1948 సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలో పేరుతో హైదరాబాద్ రాజ్యంపై దాడి మొదలైంది.

వాస్తవానికి హైదరాబాద్ సొతంత్ర రాజ్యం. అట్లాంటి సొతంత్ర రాజ్యం మీద దాడి చేసి విలీనం చేసుకోవడం అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధం. ఇది నెహ్రూకు కూడా తెలుసు. అందుకే ప్రజల దృష్టి మళ్లించటానికి ఆపరేషన్ పోలో పేరుతో సైనికచర్యకు పూనుకున్నడు.

1948 సెప్టెంబర్ 15న సాయంత్రం నాలుగు గంటలకు ఐక్యరాజ్య సమితి సమావేశమైంది. హైదరాబాదు సమస్యను ఎజెండాల చేర్చడానికి నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 20 నుంచి విచారణ ప్రారంభించడానికి నిర్ణయించుకుంది.

ఈ పరిస్థితిల జనరల్ జయంత్‌నాథ్ చౌదరి నాయకత్వంల సైన్యం ముందుకు కదిలింది. 170 బర్మన్ టాంకులతో 25000 మంది భారత సైనికులు షోలాపూర్ విజయవాడల మీదంగ హైదరాబాద్ సమీపించింద్రు.

ఇదే సమయంల రజాకార్ల నాయకుడు కాసిం రజ్వీ భారత సైన్యాన్ని ఎదుర్కోవడానికి సిద్ధమైండు. నిజాం అనుమతి లేకుంటనే సొంత నిర్ణయం తీసుకుండు. రజాకార్లకు తోడుగా నిజాం సైన్యాన్ని కూడా కలుపుకుండు. యూనియన్ సైన్యాన్ని నిలువరించడానికి తీవ్ర ప్రయత్నం చేసిండు. అయితే భారత సైన్యం ముందు కాసిం రజ్వీ నిలబడలేకపోయిండు. భారత ఆధునిక ఆయుధాల ముందు రజాకార్ల ఆయుధాలు నిరుపయోగంగా మిగిలిపోయినయ్. చివరికి కాసిం రజ్వీ కూడా చేతులు ఎత్తేసిండు.

ఈ పరిస్థితి నిజాం ప్రధానమంత్రి మీర్ లాయక్ అలీకి కూడా అర్థమైంది. ఆయన సెప్టెంబర్ 16న కింగ్ కోఠికి పోయి నిజాంకు తన రాజీనామా అందించిండు. దీంతో నిజాంకు కూడా పరిస్థితి పూర్తిగా అర్థం అయ్యింది. అధికారాన్ని భారత్‌కు అప్పగించవలసిన సమయం వొచ్చిందని గ్రహించిండు. తనకు తాను స్థిమిత పడ్డడు. ఇండియన్ యూనియన్ సైన్యం తన రాజ్యంలకు రావడానికి అనుమతిని ఇచ్చిండు. దీనికి సంబంధించి ఒక ఫర్మానా కూడా జారీ చేసిండు. చివరికి జనరల్ జెఎన్ చౌదరి నాయకత్వంల యూనియన్ సైన్యం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యంల కాలుపెట్టింది. సికిందరాబాద్ సైనిక స్థావరం వద్ద ఇండియన్ యూనియన్ సైన్యం విడిది చేసింది.

నిజాం తన సంస్థానాన్ని భారత్‌ల కలపడానికి సిద్ధపడ్డడు. తన ప్రజల ప్రాణాలకు ఆస్తులకు నష్టం కలగకూడదని భావించిండు. అందుకని భారత్‌కు అధికారాలు అప్పగించడానికి నిర్ణయించుకుండు. దక్కన్ రేడియోల తన నిర్ణయాన్ని ప్రకటించిండు. భారతసైన్యాలకు స్వాగతం పలికిండు. తన సైన్యాధికారి ఎల్ ఇద్రూస్‌కు భారత జనరల్ చౌదరి ఎదుట లాంఛనంగా లొంగిపొమ్మని హుకుం జారీ చేసిండు. ఇద్రూస్ సెప్టెంబర్ 17న లొంగిపోయిండు.

1948 సెప్టెంబర్ 18న నిజాం సికిందరాబాద్ సైనిక స్థావరం వద్దకు పోయి లాంఛనంగా జనరల్ చౌదరిని కలిసి అధికారం అప్పగిస్తున్నట్లు ప్రకటించిండు. అదే రోజు నిజాం ప్రధానమంత్రి లాయక్ అలీ, నిజాం సైన్యాధికారి జనరల్ ఇద్రూస్, ఇతర మంత్రులను గృహ నిర్బంధం చేసింది భారత సైన్యం. అట్లనే రజాకార్ నాయకుడు కాసీం రజ్వీని తిరుమలగిరిలోని సైనిక కారాగారంల నిర్బంధించింది.

భారత ప్రభుత్వంతో యథాస్థితి ఒడంబడిక చేసుకొని దాని ప్రకారం సొతంత్రంగ ఉండటానికి ప్రయత్నించిన నిజాం ఆపరేషన్ పోలో సందర్భంల మాత్రం ఎంతో విజ్ఞత చూపిండు. అధికారం ఇక అప్పగించక తప్పదు అని తెలిసినంక ఎంతో సంస్కారవంతంగా ఇండియన్ యూనియన్ సైన్యానికి స్వాగతం పలికిండు.

ఆ తర్వాత  వల్లభ భాయిపటేల్ నిజాం రాజును కలువడానికి విమానంల హైదరాబాద్ వొచ్చిండు. బేగంపేట విమానాశ్రయంల విమానం దిగటానికి ఇండియన్ యూనియన్ ముందుగా నిజాం అనుమతి తీసుకుంది.

విమానాశ్రయంల పటేల్‌ను కలిసిన నిజాం మర్యాద పూర్వకంగా స్వాగతం పలికిండు. రక్తపాతం లేకుంటనే అధికారం చేతులు మారింది. రొండు వొందల యాభై సంవత్సరాలు పాలించిన అసఫ్‌జాహీల పాలన అంతమైంది.

ఏడవనిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ గతకాలపు రాజయ్యిండు.

హైదరాబాద్ రాజ్యం ఆ తర్వాత విశాలభారత్‌ల హైదరాబాద్ రాష్ట్రంగా కొత్త గుర్తింపు పొందింది.

# హైదరాబాద్ రాష్ట్రం


ఔరంగాబాద్
పర్భని
ఆదిలాబాద్
బీడ్
నాందేడ్
నిజామాబాద్
ఉస్మానాబాద్
కరీంనగర్
బీదర్
మెదక్
వరంగల్
గుల్బర్గా
హైదరాబాద్
నల్లగొండ
మహబూబ్‌నగర్
రాయచూర్

# రాజప్రముఖ్ నిజాం

నిజాం నవాబు అధికారం అప్పగించిన తర్వాత హైదరాబాద్‌ల పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సి వొచ్చింది. అయితే అప్పుడు ప్రజాస్వామిక పద్ధతులల్ల ఏర్పాటు చేయడం ఇంకా మొదలు కాలేదు. దేశంల అప్పటికి నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వం నడుస్తున్నది. ఎన్నికలు నిర్వహించటానికి ఇంకా సమయం ఉంది. అందుకని మిలిటరీ పాలనను ఏర్పాటు చేసింది నెహ్రూ ప్రభుత్వం.

నిజాం అధికారం అప్పగించిన రోజే జయంత్‌నాథ్ చౌదరి మిలిటరీ గవర్నర్‌గ నియమితుడయ్యిండు. ఈ చౌదరి నాయకత్వంలనే హైదరాబాద్‌పై ఆపరేషన్ పోలో పేరుతో సైనికచర్య జరిగింది. చౌదరికి హైదరాబాద్‌తో పరిచయం ఉంది కాబట్టి ఈయననే మిలిటరీ గవర్నరుగ నియమించింది కేంద్రం. ఈయన బెంగాల్ వాడు.

చౌదరికి సలహాదారులుగా ఐదుగురిని నియమించింది కేంద్రం. ఐపిఎస్ అధికారి డిఎస్ బాఖ్లే ప్రధాన పౌరపాలన అధికారిగా నియమితుడైండు. కొత్తమంత్రి వర్గంల సభ్యులుగా నవాజ్ జైన్‌యార్ జంగ్, రాజా దోండేరాజా, సివిఎస్‌రావు, సిఎచ్ కృష్ణారావు నియమితులైండ్రు.

నిజాం హైదరాబాద్ రాజ్యం ఉన్నది ఉన్నట్లుగా హైదరాబాదు రాష్ట్రం అయ్యింది. హైదరాబాద్ రాష్ట్రంల తెలంగాణ, మరఠ్వాడా, కన్నడ ప్రాంతాలతో కలిపి 16 జిల్లాలు ఉన్నయ్. ఒక్కొక్క జిల్లాకు ఒక పౌరపాలనాధికారిని నియమిం చిండు చౌదరి. అప్పటికే నిజాం పాలనల ఉన్న ఉన్నతాధికారులను సమీక్షించి పునర్నియామకం మొదలుపెట్టిండు. కొంతమందికి పదోన్నతులు కల్పించిండు. రజాకార్ల అరాచకాల సమయంల హద్దులు దాటి ప్రవర్తించిన మరికొంతమందికి ఉద్వాసన పలికిండు.

అంతేకాక బొంబాయి, మద్రాసు ప్రావిన్సుల నుంచి ప్రత్యేకంగా కొంత మంది ఐపిఎస్ అధికారులను ఎంపికచేసి 16 జిల్లాలల్ల జిల్లా కలెక్టర్ల కంటె ఉన్నత హోదాల నియమించిండు.

అయితే పాలన గాడిన పడలేదు. నిజాం కాలంల అధికారం చెలాయిం చిన ముస్లిం అధికారులు అసంతృప్తికి లోనయిండ్రు. లండన్‌ల లా గ్రాడ్యుయేషన్ చదువుకున్న రామ్ దిల్‌సుఖరాం వంటి అధికారులు సహకరించ లేదు. గ్రాడ్యుయేట్ కూడా కాని మిలిటరీ అధికారి ముందు ఇంటర్వ్యూకు హాజరు కావటమా అని ఎదురు తిరిగిండ్రు.

చౌదరి పాలనల ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు పద్ధతి ప్రకారం జరుగ లేదు. రజాకార్లు మిగిల్చిన గాయం ముస్లిం అధికారులపై పడ్డది. అసంతృప్తి పేరుకు పోయింది. ఇట్లాంటి సమయంల 1949 ఏప్రిల్ 13న మిలిటరీపాలనను రద్దు చేయాలని సర్దార్‌పటేల్‌కు విన్నపాలు అందినయ్. ఫరీద్ మీర్జా పండిత సుందర్‌రామ్, ఖాజీ అబ్దుల్ గఫూర్ అట్ల విన్నవించిన వాళ్లల్ల ఉన్నరు.

1949 ఫిబ్రవరి 6న చౌదరి ఒక ఫర్మానా విడుదల చేసిండు. దాని ప్రకారం సొంత ఆస్తి అయిన సర్ఫేఖాస్‌ను నిజాం వొదులుకోవాల్సి వొచ్చింది. రాష్ట్రంల మూడింట ఒక భాగంల గల జాగీర్లు రద్దయినయ్. నిజాం రాజ్య హాలీ సిక్కా రద్దయింది. అప్పటి వరకు ప్రభుత్వ కార్యాలయాలకు శుక్రవారం సెలవుగా ఉండేది. అది రద్దయి ఆదివారం సెలవుగా మారింది.

అప్పటికి కమ్యూనిస్టుల సాయుధపోరాటం వల్ల గ్రామాలల్ల అలజడులు కొనసాగుతనే ఉన్నయ్. రాత్రులు కమ్యూనిస్టులు రావడం, పగలు పోలీసులు రావడంతో గ్రామాలల్ల అశాంతి నెలకొన్నది. ఈ పరిస్థితిల ప్రజా ప్రతినిధులతో ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని కేంద్రం ఏర్పాటు చేసింది.

మిలిటరీ పాలన స్థానంల 1950 జనవరి 26న పౌర ప్రభుత్వం ఏర్పాటు అయ్యింది. సీనియర్ సివిల్ అధికారి ముల్లర్ కాడింగ్ వెల్లోడి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిండు. ఎంకె వెల్లోడి కేరళవాడు.

వెల్లోడి మంత్రివర్గంల నవాజ్ జైన్ యార్ జంగ్, ఎం. శేషాద్రి, సివిఎస్ రావు, బూర్గుల రామకృష్ణారావు, వినాయక్‌రావు విద్యాలంకార్, వల్లూరి బసవ రాజు, పూల్‌చంద్ గాంధి మంత్రులుగా చేరిండ్రు. బూర్గుల రామకృష్ణారావు రెవెన్యూ, విద్యాశాఖ మంత్రిగా పనిచేసిండు.

1950 జనవరి 25న నిజాంకు, భారత ప్రభుత్వానికి ఒక ఒప్పందం జరిగింది. 1950 జనవరి 26న భారత్ రిపబ్లిక్ అయింది. భారతయూనియన్‌ల హైదరాబాద్ కొత్త రాష్ట్రమయింది. అదేరోజు కొత్త రాష్ట్రం హైదరాబాద్‌కు నిజాం రాజ్ ప్రముఖ్ అయ్యిండు. రాజ్‌ప్రముఖ్ అంటే ఇప్పటి గవర్నర్. నిజాంకు 1.25

కోట్ల రూపాయల వార్షిక రాజభరణం జీవితాంతం చెల్లించటానికి భారత ప్రభుత్వం ఒప్పుకుంది.

1956 నవంబర్ 1 వరకు నిజాం రాజప్రముఖ్‌గా ఉన్నడు. ఈ కాలంల ప్రభుత్వం నిజాం పేరు మీదనే నడిచింది. హైదరాబాద్ భారత్‌ల విలీనం అయిన తర్వాత కూడా దాదాపు ఎనిమిది ఏండ్లు నిజాం పేరు మీదనే పరిపాలన సాగింది. హైదరాబాద్ రాజుగా వెలిగి, రాజప్రముఖ్‌గా గౌరవాన్ని పొంది, చివరికి తన రాజ్యం ఆంధ్రా వలసవాదుల చేతులల్లకు పోవడం కూడా చూసిండు నిజాం.

1967 ఫిబ్రవరి 24న నిజాం కన్నుమూసిండు. ఆయన మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పది రోజుల సంతాప దినాలు ప్రకటించింది. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపింది. నిజాం అంతిమ యాత్రల హైదరాబాద్ కదిలింది. ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికింద్రు. అంతిమ యాత్రల పాల్గొన్న జనమే నిజాంపై అభిమానానికి సంకేతం. తెలంగాణ చరిత్ర అంటే నిజాంగా మిగిలి పోయిండు.

# ఆంధ్రా మిడుతల దండు

హైదరాబాద్ విలీనం దగ్గర నుంచి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడే వరకు అంటే దాదాపు మూడున్నర ఏండ్లు జనరల్ చౌదరి మిలిటరీ పాలన, వెల్లోడి పౌర పరిపాలన సాగింది. ఈ ఇద్దరు అధికారులు తెలంగాణవాళ్లు కారు. ఒకరు బెంగాలీ కాగా మరొకరు కేరళకు చెందినవాడు.

జనరల్ చౌదరి పాలనల బొంబాయి, మద్రాసు ప్రావిన్సీల నుంచి ఉన్నతా ధికారులను రప్పించిండు అని చెప్పుకున్నం కదా! ఉద్యోగాలల్లకు తెలంగాణే తరులను తీసుకోవడం దాంతోటే ఆగిపోలేదు.

తెలుగు కాని, ఉర్దూ కాని రాని జనరల్ చౌదరి, పాలనను దృష్టిల పెట్టుకొని ఇతర ప్రాంతాల నుంచి అధికారులను రప్పించిండు. వొచ్చిన అధికారులు కూడా అదే పని చేసిండ్రు. పరిపాలన ఇబ్బంది లేకుంట సాగాలంటె ఆంగ్లం తెలిసినవాళ్లే కావాలని భావించిండ్రు. వారితోటే పాలన సజావుగా సాగుతుందని అనుకుండ్రు. అందుకని కింది ఉద్యోగాలల్లకు కూడా ఆంగ్ల భాష వొంకతో తెలంగాణేతరులను ఉద్యోగాలల్లకు తీసుకుండ్రు. మొదట కేరళ నుంచి ఉద్యోగా లల్లకు తీసుకుండ్రు. తర్వాత కేరళవాళ్లు రావడానికి ఇష్టపడక పోవడంతో మద్రాసు నుంచి తమిళులను తీసుకుండ్రు. తమిళులు కూడా ఆసక్తి చూపక పోవడంతో మద్రాసు రాష్ట్రంలోని తెలుగువాళ్లను అంటే ఆంధ్రోళ్లను తీసుకుండ్రు.

ఆంధ్రోళ్లు అప్పటికే హైదరాబాద్ మీద గురిపెట్టుకొని కూసుండ్రు. తెలం గాణల సమృద్ధిగ ఉన్న భూములు, ఉద్యోగాల మీద కన్నేసిండ్రు. ఏమాత్రం అవకాశం వొచ్చినా మింగాలని ఎదురు చూస్తుండ్రు.

దానికి కారణం లేకపోలేదు. అప్పటికే మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రోళ్లు హైదరాబాదును కబళించడానికి కుట్రలు పన్నిండ్రు. ఆ కుట్రలను ప్రచారం చేసు కుంటనే అవకాశం కోసం ఎదురుచూసిండ్రు.

అప్పటికే ఆంధ్రానాయకుడు, ఎన్ జి రంగాగా ప్రాచుర్యం పొందిన గోగినేని రంగనాయకులు 1926ల 'ఎకనమిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియన్ విలేజెస్' అనే ఒక పుస్తకం రాసిండు. ఈ పుస్తకాన్ని విజయవాడల ఆవిష్కరణ చేసిండు. ఈ పుస్తకం రొండో భాగాన్ని 'ది కాలనైజేషన్ పాలసీ ఆఫ్ ఎచ్ఇఎచ్ నిజాం ఆఫ్ హైదరాబాద్' పేరుతో 1929ల రాసిండు. పది లక్షల ఎకరాల భూమి హైదరాబాదుల వలసవాదులకు అనుకూలంగా ఉందని రాసిండు. తెలంగాణల భూములు ఉన్నయని, ఉద్యోగాలు ఉన్నవని వాటిని ఉపయోగించు కోవాలని ఆయన జాతికి అంటే ఆంధ్రజాతికి ఎలుగెత్తి చాటిండు. దీంతో ఆంధ్రా ప్రజల చూపు తెలంగాణ భూముల మీద పడ్డది.

అదే సమయంల భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని సన్నాయి నొక్కులు నొక్కుతూ ఆంధ్రా కమ్యూనిస్టులు కూడా ప్రచారం చేసింద్రు. ఆంధ్రా కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య కమ్యూనిస్టు పార్టీ పేరు చెప్పి 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే పుస్తకాన్ని 1944ల అచ్చేసిండు. వాస్తవానికి ఈయన మనసుల కలిగిన ఆలోచనలనే పార్టీ పేరుతో పుస్తకంగా రాసిండు. దాంట్లె కూడా అదే విషం. రొండు తెలుగు ప్రాంతాలు కలవాలని. తెలంగాణ భూములు, ఉద్యోగాలు ఎట్ల కొల్లగొట్టాలనేది లోపలి మాట.

సుందరయ్య, ఎన్‌జి రంగా పుస్తకాల ప్రభావం అయితేంది, ఆంధ్ర నాయకుల ప్రచారమైతేంది కాని ఆంధ్రా ఉద్యోగులల్ల, ఆంధ్రారైతులల్ల దోచుకోవడానికి తెలంగాణ అనువైన ప్రాంతమనే నమ్మకం కలిగింది.

ఈ అవగాహనతోటే హైదరాబాద్‌లో మిలిటరీ, పౌరపాలనల అవకా శాలను ఉపయోగించుకుంద్రు. గింత సందు దొరికింది కదాని బార్లు కట్టింద్రు. చిన్నాచితక ఉద్యోగాలల్ల కూడా చేరింద్రు.

ముందల వొచ్చినోళ్లు హైదరాబాద్‌ల అవకాశాలను గురించి సుట్టాలకు పక్కాలకు చెప్పింద్రు. పుణ్యానికి వొస్తుందని సుట్టాలను కూడా ఉత్తరాలు రాసి మరీ రప్పిచ్చుకుంద్రు. ఫలితంగా హైదరాబాద్‌ల ఉద్యోగాలు ఆంధ్రోళ్ల వశమైనయ్.

ఆంధ్ర వలసలు వొచ్చిన తర్వాత నీతి మాలిన చేష్టలు కూడా మొదల యినయ్. నిజాం రాష్ట్రంలో పాన్‌కు బీడీకి పనిచేసే అధికారులు మాత్రమే అంతకు ముందు అక్కడక్కడ కనిపించేది. వలసవాదుల పుణ్యమా అని లంచగొండి తనం అలవాటయింది. ఉద్యోగాలు పొందటానికి పై అధికారులకు లంచాలు అలవాటు చేసింద్రు. ఇంకా అనేక రకాలుగ లోబర్చుకొని ఉద్యోగాలు సంపాదించుకుంద్రు.

అప్పటికి నిజాం కాలంనాటి ముల్కీ నిబంధనలు అమలుల ఉన్నయ్. అయినా దొంగ ముల్కీ సర్టిఫికెట్లు సంపాయించిండ్రు. లంచాలు, మాయమాటలతో అధికారులను లోబర్చుకుండ్రు. తెలంగాణ ప్రజల నోటికాడి ఉద్యోగాలు తన్నుక పోయిండ్రు.

ఇట్ల పొట్టచేతబట్టుకొని వొచ్చిన ఆంధ్రోళ్లు ఆ తర్వాత తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు తెలంగాణ ప్రజల మీదనే అజమాయిషి చేయడం మొదలు పెట్టిండ్రు.

హైదరాబాద్‌ల ఉద్యోగాలు చేసుకుంటనే హైదరాబాద్ సంస్కృతిని, తెలంగాణ భాషను చిన్నచూపు చూసిండ్రు. ఆంధ్రోళ్ల కింద ఉన్న తెలంగాణ అధికారులను అవహేళన చేసిండ్రు. ఆంగ్లభాష వొస్తదన్న అహంకారం ప్రదర్శించిండ్రు. హైదరా బాదును ఉద్ధరించడానికి వొచ్చిన జాతిగా గప్పాలు కొట్టిండ్రు. ఆనాటి పరిస్థితులల్ల తెలంగాణ ఉద్యోగులు ఎదురు మల్లలేని అశక్తతకు లోనయ్యిండ్రు.

ఈ వలసల కాలంలనే 1955ల నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు, తర్వాత నిజాం సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది.

బ్రిటిషాంధ్రల ఉన్న ఆంధ్రోళ్లకు జాతీయనాయకత్వంతో సంబంధాలు ఉండటం, దొంగమార్గంల హైదారాబాద్ ఉద్యోగాల్లో చేరడం వలన ప్రాజెక్టులు, పారుదల గురించి వాళ్లు ముందే తెలుసుకుండ్రు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ డిజైన్ కూడ మార్పించుకోగలిగిండ్రు. ప్రాజెక్ట్ శంకుస్థాపన కాకముందే తెలంగాణ ప్రాంతంలోని భూములను అడ్డికి పావుశేరు లెక్కన కొన్నరు. అప్పటివరకు బతకడానికి వొనరుగానే భూములను చూసిన తెలంగాణ ప్రజలు ఆంధ్రోళ్ల మాయ మాటలకు పడిపోయి అమ్ముకుండ్రు. వొంద రొండొందల రూపాయలకు ఎకరం భూమిని ఆంధ్రోళ్లు సొంతం చేసుకుండ్రు. అమాయకులైన తెలంగాణ ప్రజలు ఆంధ్రోళ్ల కుతంత్రాలను తెలుసుకోలేక పోయిండ్రు. మొత్తం మీద తెలంగాణ ఉద్యోగాలు, పారుగంత భూములు ఆంధ్రోళ్ల కబంధ హస్తాలల్లకు పోయినయ్.

# హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల

దేశంల తొలి ఎన్నికలకు రంగం సిద్ధమైంది. హైదరాబాద్ రాష్ట్రానికి ఒక రాజ్యాంగ సభను ఏర్పరచాలని ప్రతిపాదించిండ్రు. నిజాం కాలంనాటి హైదరాబాద్ రాజ్యం ఉన్నది ఉన్నట్టుగా హైదరాబాద్ రాష్ట్రంగా అవతరించింది. హైదరాబాద్ రాష్ట్రంల తెలంగాణ ఎనిమిది జిల్లాలు, మరఠ్వాడా ప్రాంతానికి చెందిన ఐదుజిల్లాలు, కన్నడ ప్రాంతానికి చెందిన మూడుజిల్లాలు ఉన్నయని చెప్పుకున్నం కదా! ఈ పదహారు జిల్లాలల్ల 142 అసెంబ్లీ నియోజక వర్గాలను ఏర్పాటు చేసిండ్రు. వీటిల 33 ద్విసభ్య నియోజకవర్గాలు. అంటె ఈ ముప్పయి మూడు స్థానాలల్ల ఒక జనరల్ ప్రతినిధితో పాటు మరో రిజర్వు ప్రతినిధి కూడా ఎన్నిక అయితడు. అంటే 142 నియోజకవర్గాలు, మరో 33 మంది రిజర్వు అభ్యర్థులు. మొత్తం 175 మంది శాసనసభ్యులు.

తెలంగాణ ప్రాంతంల 79 నియోజకవర్గాలు. వీటిలో 22 ద్విసభ్య స్థానాలను ఏర్పాటు చేసిండ్రు. తెలంగాణ ప్రాంతం నుంచి మొత్తం 101 శాసన సభ్యులు ఎన్నిక కావాలె.

హైదరాబాద్ రాష్ట్రానికి రాజ్యాంగ సభను ఏర్పరచడానికి మిలిటరీ గవర్నర్ చౌదరి కాలంలనే ఒక నోటిఫికేషన్ జారీ చేసిండ్రు. అయితే పరిస్థితులు మారడంతో దాని అవసరం లేదని నిర్ణయించిండ్రు. దేశంల అన్ని చోట్ల జరిగినట్టు గానే హైదరా బాద్ రాష్ట్రంల కూడా ఎన్నికలు జరపవచ్చని నిర్ణయించిండ్రు. దాని ప్రకారం 1952 ఫిబ్రవరిల హైదరాబాద్ రాష్ట్రంల ఎన్నికలు జరిగినయ్.

ఈ ఎన్నికల్ల ప్రధానంగ ఐదు పార్టీలతోపాటు సొతంత్ర అభ్యర్థులు కూడా పాల్గొన్నరు. కాంగ్రెస్, పీపుల్స్ డెమొక్రాటిక్ ఫెడరేషన్, పీజెంట్స్ అంటే వర్కర్స్ పార్టీ, సోషలిస్ట్ పార్టీ, షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ పార్టీ ఎన్నికల్ల పాల్గొన్నయ్.

కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం ఉండటంతో ఆ పార్టీనాయకులు పీపుల్స్ డెమొక్రాటిక్ ఫెడరేషన్ (పిడిఎఫ్) పేరుతో ఎన్నికల బరిలకు దిగిండ్రు.

తెలంగాణల ప్రధానంగ పిడిఎఫ్, కాంగ్రెస్ పాల్గొన్నయ్. మరత్వాడా జిల్లాల్ల ఈ రొండు పార్టీలతోపాటు పీజెంట్ అండ్ వర్కర్స్ పార్టీ, షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ కూడ ఎన్నికల్ల పాల్గొన్నయ్.

రాష్ట్రంల మొత్తం16 జిల్లాలు ఉంటె 14 జిల్లాలల్ల కాంగ్రెస్ ఎక్కువ సీట్లు గెల్చుకుంది. సాయుధపోరాటం జరిగిన వరంగల్, నల్లగొండ జిల్లాలల్ల మాత్రం పిడిఎఫ్ ఎక్కువ సీట్లు గెల్చుకుంది. ఈ ఎన్నికల్ల రావి నారాయణరెడ్డి, జయసూర్య, పెండ్యాల రాఘవరావు వంటి వారు పాల్గొన్నరు. ఈ ముగ్గురు అసెంబ్లీతో పాటు పార్లమెంటు అభ్యర్థులుగా కూడా పోటీచేసి గెల్చిండ్రు. తర్వాత పార్లమెంటు సభ్యులుగా కొనసాగిండ్రు. శాసన సభ్యత్వాలను వొదిలిపెట్టిండ్రు.

కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ వొచ్చింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం కాంగ్రెసుకు దక్కింది. కాంగ్రెస్ శాసన సభ నాయకునిగా బూర్గుల రామకృష్ణారావు ఎన్నికయ్యిండు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బూర్గుల తయ్యారైండు. రాజ్‌ప్రముఖ్ నిజాం దగ్గరికి పోయి తను మంత్రి వర్గంలకు తీసు కోనున్న వ్యక్తుల గురించి చెప్పి అనుమతి తీసుకుండు.

1952 మార్చి 6న కింగ్‌కోఠిల రాజ్ ప్రముఖ్ నిజాం తన కొత్త మంత్రివర్గం చేత ప్రమాణస్వీకారం చేయించిండు. హైదరాబాదు రాష్ట్ర ముఖ్య మంత్రిగా బూర్గుల రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టిండు. అదేరోజు ఆయన మంత్రివర్గం కూడా ప్రమాణస్వీకారం చేసింది. మంత్రివర్గంల మొత్తం 13 మంది మంత్రులు చేరిండ్రు.

బిందు దిగంబరరావుకు హోం శాఖ, జివిస్ మెల్కోటేకు ఆర్థిక శాఖ, అన్నారావు గనముఖికి స్థానిక పాలన, మర్రి చెన్నారెడ్డికి పౌర సరఫరా, వ్యవసాయ శాఖ, దేవిసింగ్ చౌహాన్‌కు గ్రామీణాభివృద్ధి శాఖ, పూల్‌చంద్ గాంధీకి విద్య, ఆరోగ్యం, సి. జగన్నాథరావుకు న్యాయశాఖ, మొహదీ నవాజ్ జంగ్ బహదూర్‌కు పబ్లిక్ వర్క్స్, విబి రాజుకు కార్మిక, ప్రణాళిక, సమాచార శాఖ, శంకర్ డియోకు సోషల్ సర్వీసెస్, కొండా వెంకటరంగారెడ్డికి ఎక్సైజ్, కస్టమ్స్, అటవీశాఖ, కొరటేకర్ వినాయకరావు విద్యాలంకార్‌కు పరిశ్రమలు వాణిజ్యం శాఖను ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు కేటాయించిండు.

బూర్గుల మంత్రి వర్గంల మూడు భాషా ప్రాంతాల శాసన సభ్యులకు స్థానం దక్కింది. ముఖ్యమంత్రి తెలంగాణ ప్రాంతం వాడు అయినా మంత్రి పదవులు ఎక్కువగా మరత్వాడా ప్రాంతానికి దక్కినయ్. ఆంధ్రా ప్రాంతానికి చెందిన విబి రాజుకు బూర్గుల మంత్రివర్గంల స్థానం దొరకడం ఇక్కడ విశేషం.

వల్లూరి బసవరాజు గుంటూరుల పుట్టి హైదరాబాదుల స్థిరపడ్డడు. తర్వాత రాజకీయాల్లకు వొచ్చిండు. సికిందరాబాదు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున శాసన సభకు ఎన్నికయ్యిండు. తెలంగాణ ప్రాంతంల చట్టసభకు ఎన్నికయిన తొలి ఆంధ్ర నాయకుడు ఈయనే.

పిడిఎఫ్‌కు ప్రతిపక్షహోదా దక్కింది. మరఠ్వాడా ప్రాంతానికి చెందిన విడి దేశ్‌పాండే ప్రతిపక్ష నాయకునిగా ఎన్నికయ్యిండు. స్పీకర్‌గా కాశీనాథరావు వైద్య బాధ్యతలు చేపట్టిండు. డిప్యూటి స్పీకర్ పదవి సొతంత్ర ఎమ్మెల్యే పంపనగౌడ సక్రిప్పకు దక్కింది.

బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గ ప్రమాణస్వీకారంతో మొట్ట మొదటిసారి రాష్ట్రంల ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వం ఏర్పడింది.



హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు

# నాన్‌ముల్కీ గోబ్యాక్

**బూ**ర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం ఏర్పడటానికి ముందే హైదరాబాద్ సెక్రటేరియెట్‌ల వలసవాదులు తిష్టవేసింన్రు. అంటె తెలంగాణ ప్రజలు సొంత రాష్ట్రాన్ని ఆస్వాదించక ముందే ఆంధ్రోళ్ల రూపంల సెక్రటేరియెట్ల శని కూచుంది. తెలంగాణ ప్రాంత ఉద్యోగాలను ఆంధ్రోళ్లు గద్దల లెక్క తన్నుకుపోతుంన్రు. విద్యాసంస్థల్ల సీట్లు తెలంగాణ విద్యార్థులకు దొరకకుండ చేసింన్రు. కాలేజీలల్ల సీట్లు, ఉద్యోగాలు స్థాని కులకు దొరకకుండ పోయినయ్. దీంతో తెలంగాణ విద్యార్థులు, యువకులు కుతకుత ఉడికిపోయింన్రు.

1952 జూన్ 26న వరంగల్ విద్యార్థుల రూపంల అసహనం బద్ధల య్యింది. ఐదు రోజులపాటు నిరసనలు ధర్నాలు చేసింన్రు. జూలై 31న ఒక తీర్మానం చేసింన్రు.

ప్రభుత్వ ఉద్యోగాలల్ల దొంగముల్కీ సర్టిఫికెట్లతో చేరిన ఇతర రాష్ట్రాల వారిపై విచారణ చేయాలని, అట్లాంటి దొంగ ఉద్యోగులను తొలగించి స్థానికులకు ఉద్యోగాలు దొరికేటట్లు చూడాలన్నది తీర్మానం సారాంశం.

ఆగస్ట్ 7న ఇదే నిరసన ఖమ్మంల జరిగింది. వరంగల్, ఖమ్మం జిల్లాలల్ల స్థానికేతరుల మీద నిరసనలు ప్రారంభమైనయ్. ఇది ప్రజలల్లకు బాగా పోయింది. తాము దోపిడీకి గురయితున్న భావన తెలంగాణ ప్రజల్ల కలిగింది.

రాజకీయనాయకులు, చివరికి మంత్రులల్ల కూడా ఈ భావన మొదల యింది. దీనికి ముందుగా స్పందించిన వ్యక్తి జి.రామాచారి. ఈయన గుల్బర్గ జిల్లా చించోలి నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యిండు. ఈయన నిజాం కాలంల లాయక్ అలీ మంత్రి వర్గంల పనిచేసిండు. మిలిటరీపాలనల సలహాసంఘం సభ్యునిగ ఉన్నడు. న్యాయవాది, రచయిత. హైదరాబాద్‌ల జరుగుతున్న పరిస్థితులు తెలిసినోడు. అందుకే స్పందించిండు. 1952 ఆగస్టుల 'హైదరాబాద్ హితరక్షణ సమితి' ని స్థాపించిండు.

గైర్‌ముల్కీలంతా వెనక్కి వెళ్లిపోవాలని నినాదాన్ని ఇచ్చిండు. దీంతో విద్యార్థులకు కొండంత అండ దొరికినట్లయింది.

అప్పటికి బూర్గుల ప్రభుత్వం ఏర్పడి సుమారు ఆరునెల్లయింది. ఈ సమయంల తమ ఆధిపత్యాన్ని పెంచుకోవాలని బూర్గుల మంత్రివర్గ సభ్యులైన కొండా వెంకటరంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి ప్రయత్నం చేసింద్రు. ఈ ఇద్దరు మామా అల్లుండ్లు.

రాష్ట్రంల జరుగుతున్న పరిస్థితులను ఉపయోగించు కోవాలనుకొని పరోక్షంగా విద్యార్థుల ఉద్యమానికి అండగా నిలిచింద్రు. కాని అతి కొద్దికాలంలనే పరిస్థితులు తమకు అనుకూలంగా లేవని గ్రహించింద్రు. తర్వాత విద్యార్థుల ఉద్యమానికి మద్దతు ఉపసంహరించుకుంద్రు. రాష్ట్రంల జరిగే ఉద్యమాలను రాజకీయకోణంల చూడటం ఇది ప్రారంభం.

1952 ఆగస్టు 8న వరంగల్‌జిల్లా మానుకోట (మహబూబాబాద్)ల విద్యార్థులు వీధుల్ల నిరసన ప్రదర్శనలు చేసింద్రు. స్థానికులు కానివారంతా వాపసు పోవాలని నినాదాలు చేసింద్రు.

ఈ వరస సంఘటనలతో ప్రభుత్వంల కదలిక వొచ్చింది. విద్యార్థులను శాంతింప జేయటానికి ప్రభుత్వం ఇచ్చినట్లుగా పత్రికల్ల ఒక ప్రకటన వొచ్చింది. ముల్కి సర్టిఫికెట్లు పొందటానికి నిబంధనలు కఠినతరం చేస్తున్నట్లు దాని సారాంశం. దాని కోసం మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసే ఆలోచనల ప్రభుత్వం ఉన్నట్టు కూడ ప్రకటనల ఉంది.

ఈ వార్త పత్రికల్ల వొచ్చిన కొద్దిరోజులకే ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వరంగల్‌ల జరిగిన ఒక సభల మాట్లాడిండు. విద్యార్థులు ఆవేశాలకు లోను కావొద్దని సలహా ఇచ్చిండు. అనవసర వాదవివాదాలు మానుకోవాలని, శాంతియుతంగా ఉండాలని చెప్పిండు.

ఆగస్టు 26న హైదరాబాద్, సికిందరాబాద్‌ల విద్యార్థులు సమ్మె చేసింద్రు. సికిందరాబాద్‌ల స్థానికేతరులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వీధుల్ల ర్యాలీ నిర్వహించింద్రు. ఈ సమయంల అక్కడక్కడ అల్లర్లు జరిగినయ్.

తెలంగాణ ప్రాంతంలనే కాకుండా ఔరంగాబాద్‌ల కూడా ఇట్లాంటి నిరసన కార్యక్రమాలు జరిగినయ్. ఆగస్టు 27న విద్యార్థులు మల్ల సమ్మెచేసింద్రు. ఆరోజు నుంచి నిరవధిక సమ్మె చేయాలని విద్యార్థుల ఐక్యకార్యాచరణ సమితి నిర్ణయించింది.

విద్యార్థుల నిరసనలు ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుకు ఇబ్బందికరంగా మారినయ్. తన ప్రభుత్వాన్ని బలహీనపరచడానికి, బద్‌నాం చేయడానికి

కొండా వెంకటరంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి ఆడిస్తున్న రాజకీయ నాటకంగా భావించిండు. అందుకే కఠినంగా అణచివేయడానికి పూనుకున్నడు. ఆగస్టు 29న గైర్‌ముల్కి ఆందోళనలను కఠినంగా అణచివేయాలని ఆజ్ఞాపించిండు. విద్యార్థులను రెచ్చగొట్టెటోళ్ల మీద, గోడలపై నినాదాలు రాసెటోళ్ల మీద కేసులు పెట్టి శిక్షించాలని ఆదేశించిండు. తెల్లారి హనుమకొండ విద్యార్థుల మీద పోలీసులు లాఠీఛార్జి చేసింఁ్రడు. విద్యార్థుల సమావేశం మీద పోలీసులు విరుచుకుపడ్డరు. ఈ సంఘటనల విద్యార్థులకు దెబ్బలు తగిలినయ్.

ఈ విషయం తెలిసి తెల్లారి హైదరాబాద్ విద్యార్థులు ఉడికిపోయింఁ్రడు. అప్పటికి మూడురోజులు సమ్మెల ఉన్న విద్యార్థులు సైఫాబాద్ కాలేజీ నుంచి ఊరేగింపు తీసింఁ్రడు. వలసవాదులైన ఆంఁ్రధోళ్లకు సంకేతంగా ఇడ్లీ సాంబర్ గో బ్యాక్, గోంగూర పచ్చడి గో బ్యాక్ అని నినాదాలు చేసుకుంట ఆబిడ్స్ దాంక ర్యాలీ తీసింఁ్రడు. ఆ రోజు సాయంఁత్రం బహిరంగసభ జరిగింది. అనేకమంది పెద్దలు మాట్లాడింఁ్రడు.

హైదరాబాద్ ఉద్యమాలకు స్పందించిన విద్యార్థులు ఁ్రపజలు పెద్దపల్లి, సూర్యాపేటల నిరసన తెలిపింఁ్రడు. ఇవే కాకుంట తెలంగాణల అనేక పట్టణాలల్ల నిరసన కార్యఁ్రకమాలు జరిగినయ్. సెప్టెంబర్ 4న హైదరాబాద్ పాతబస్తీల సిటీకాలేజి విద్యార్థులు ర్యాలీ తీసింఁ్రడు. మదీనా హోటల్ దగ్గరికి ఊరేగింపు రాంగనే ఎట్లాంటి హెచ్చరికలు లేకుంటనే పోలీసులు కాల్పులు జరిపింఁ్రడు. కాల్పుల్ల అక్కడికక్కడే ఒక విద్యార్థి చనిపోయిండు. అనేకమంది విద్యార్థులకు తీఁవ్రంగా దెబ్బలు తగిలినయ్. దెబ్బలు తగిలిన విద్యార్థులను ఉస్మానియా ఆస్పఁత్రిల చేర్పించింఁ్రడు. ఆస్పఁత్రిల ఇంకో విద్యార్థి చనిపోయిండు.

ఆ రోజు హోంమంఁత్రి దిగంబరరావు బిందు, ఁ్రపతిపక్షనాయకుడు విడి దేశ్‌పాండే, పద్మజానాయుడు ఆస్పఁత్రికి వొచ్చి విద్యార్థులను పరామర్శించింఁ్రడు. ఁ్రపశాంతంగా ఉండాలని కోరింఁ్రడు.


అయినా పరిస్థితి అదుపులకు రాలేదు. అదేరోజు నాలుగుసార్లు కాల్పులు జరిగినయ్. అనేకమంది విద్యార్థులు చనిపోయింఁ్రడు. చాలామంది విద్యార్థులకు తీఁవ్రమైన దెబ్బలు తగిలినయ్. తెల్లారి నిరసనగా హైదరాబాద్ బంద్ జరిగింది. జంటనగరాలల్ల పోలీసులు 16 గంటల కర్ఫ్యూ పెట్టింఁ్రడు.

హైదరాబాద్‌ల జరిగిన పోలీసు కాల్పులకు బీదర్, ఔరంగాబాద్, వరంగల్, భువనగిరి తదితర పట్టణాలల్ల నిరసనలు జరిగినయ్. ఆందోళన ఉధృతిని గమనించి

ప్రభుత్వం సెప్టెంబర్ 7న ముల్కి నిబంధనల పరిశీలన కోసం నలుగురు మంత్రులతో ఒక ఉపసంఘాన్ని నియమించింది.


ఈ ఉపసంఘంల ఎక్సైజ్‌మంత్రి కొండా వెంకటరంగారెడ్డి, ఆర్థికమంత్రి డాక్టర్ మెల్కోటే, విద్యాశాఖమంత్రి పూల్‌చంద్‌గాంధీ, పబ్లిక్‌వర్క్స్ శాఖమంత్రి మొహదీ నవాజ్ జంగ్ ఉన్నరు.

హైదరాబాద్ పోలీస్ కాల్పులపై విచారించడానికి న్యాయవిచారణ సంఘాన్ని కూడ ప్రభుత్వం నియమించింది. హైకోర్ట్ సిటింగ్ జడ్జి పింగళి జగన్‌మోహన్‌రెడ్డి ఆ సంఘానికి అధ్యక్షుడు. అయినా స్థానికులల్ల అసంతృప్తి పోలేదు. పేలడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతం లెక్కనే ఉంది పరిస్థితి.



రాజ్‌ప్రముఖ్ నిజాంతో ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, మంత్రులు

# ఆంధ్రరాష్ట్రం



# ఆంధ్రుల పోరాటం

బ్రిటీష్‌వాళ్ల ప్రత్యక్షపాలనల మద్రాసు ప్రావిన్స్ ఉంది. బ్రిటిష్ వాళ్లు భారతదేశాన్ని ప్రావిన్స్‌లుగా విభజించి పాలన సాగించిండ్రు. నాటి మద్రాసు రాష్ట్రంల ముఖ్యంగా ప్రస్తుత తమిళనాడు, సీమాంధ్ర ప్రాంతం, కేరళ, ఒరిస్సాలలోని కొన్ని ప్రాంతాలు కూడా ఉన్నయ్. అయితే అధిక జనాభా తమిళులది. తరువాత స్థానం ఆంధ్రులది అంటె తెలుగు మాట్లాడేటోళ్లది. మద్రాసుల ఉన్న కేరళ, ఒరిస్సా ప్రాంతాల ప్రజలు కూడా చాలా వరకు తెలుగు మాట్లాడేటోళ్లు.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంల తమిళులదే ఆధిపత్యం. ఉన్నత ఉద్యోగాలల్ల వాళ్లే ఉన్నరు. తర్వాత మహారాష్ట్ర నుంచి వొచ్చిన బ్రాహ్మలు ఉన్నత ఉద్యోగాలల్ల చేరిండ్రు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంల ఆంధ్ర, రాయలసీమ జిల్లాలు 11 ఉన్నయ్. కోస్తాంధ్రల ఏడు జిల్లాలు విశాఖపట్టణం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు ఉన్నయ్. రాయలసీమల నాలుగు జిల్లాలు చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం ఉన్నయ్. విశాఖపట్టణం జిల్లాను రొండు సార్లు విభజించి 1950ల శ్రీకాకుళం జిల్లాను, 1979ల విజయనగరం జిల్లాను ఏర్పాటు చేసిండ్రు.

తెలుగువాళ్లకు అంటే ఆంధ్రోళ్లకు ఉద్యోగ అవకాశాలు సరిగ దొరకడం లేదనే అసంతృప్తి ఉంది. అదికాకుండా తమిళుల ఆధిపత్యం కూడా ఆంధ్రోళ్లకు ఇబ్బంది కలిగించింది. ఆంధ్ర ప్రాంతంల 1900 నాటికి సాంఘికోద్యమాలు మొదలైనయ్. కాలక్రమేణ అవి సొతంత్ర భావనలు సంతరించుకున్నయ్.

గుంటూరుల న్యాపతి నారాయణరావు ఆంధ్రోళ్లకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే అభిప్రాయాన్ని మొట్టమొదటి సారి వెల్లడించిండు. ఆనాడు అది ఆంధ్రులకే ఎబ్బెట్టుగా అనిపించింది. తర్వాత ఆంధ్ర మహాసభలు మొదలయినయ్. ఈ ఆంధ్ర మహాసభలకు నిజాం రాజ్యంల జరిగిన ఆంధ్ర మహాసభలకు సంబంధం లేదని చెపుకున్నం కదా!

1913 మే 20న గుంటూరు జిల్లా బాపట్లల తొలి ఆంధ్రమహాసభ జరిగింది. ఆనాటి సభకు బయ్యా నరసింహేశ్వర శర్మ అధ్యక్షత వహించిండు. ఈయన ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం తీర్మానం చేయాలని నిర్ణయించిండు. కాని ఆ సభకు హాజరైన ఆంధ్రోళ్లు చాలామంది ఈ తీర్మానాన్ని వ్యతిరేకించింద్రు. ముట్నూరి ఆదినారాయణయ్య, న్యాయపతి సుబ్బారావు, మోచర్ల రామచంద్రరావు, గుత్తి కేశవపిళ్లై ప్రత్యేకాంధ్రను తీవ్రంగా వ్యతిరేకించింద్రు. దీంతో తీర్మానం వాయిదా పడ్డది.

ప్రత్యేకాంధ్ర తీర్మానానికి ముఖ్యంగా రాయలసీమ, నెల్లూరు జిల్లాల నుంచి వ్యతిరేకత వొచ్చింది. కారణం తీరాంధ్రుల వ్యవహారశైలి, ఆధిపత్య ధోరణి. ప్రత్యేక ఆంధ్ర ఏర్పడితే రాయలసీమ, నెల్లూరువాళ్లకు న్యాయం జరుగదని అనుమానం బలంగా ఉండటం. తీరాంధ్రనాయకుల ఆధిపత్యంల తాము అన్యాయానికి గురి కావడం ఖాయం అని భయపడ్డరు. దానికంటె ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలనే ఉండటం వల్ల తమ ప్రాంతానికి మేలు కలుగుతుందని భావించింద్రు. కాని తీరాంధ్ర ప్రాంతానికి చెందిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్య వంటివాళ్లు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నరు.

రెండవ ఆంధ్రమహాసభ 1914ల బెజవాడల జరిగింది. ఈ సభల కూడా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర తీర్మానం ప్రస్తావన వొచ్చింది. రాయలసీమ, నెల్లూరు జిల్లాల నాయకులు ఎప్పటి లెక్కన్నే వ్యతిరేకించింద్రు. అయ్యదేవర కాళేశ్వరరావు, అయ్యంకి వెంకటరమణయ్య, పెద్దిభొట్ల వీరయ్య తీర్మానానికి అనుకూలంగా మాట్లాడింద్రు. చివరికి వీళ్ల నాయకత్వంల రెండవ ఆంధ్రమహాసభల ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర తీర్మానం నెగ్గింది.

ఆ తర్వాత జరిగిన సమావేశాలల్ల అనేక సార్లు ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుపై చర్చ జరిగింది. అయినా తీరాంధ్ర నాయకుల మీద మిగతా తెలుగువారికి నమ్మకం కలగలేదు. రాయలసీమ నాయకులు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును వ్యతిరే కించుకుంటనే వొచ్చింద్రు.

1917ల నెల్లూరుల జరిగిన ఐదో ఆంధ్రమహాసభల ఆంధ్రరాష్ట్ర తీర్మానానికి వ్యతిరేకత వొచ్చింది. 1918 జనవరి 20న ప్రథమ ఆంధ్ర కాంగ్రెస్ సభ బెజవాడల న్యాపతి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంల తీరాంధ్రులు తెలివిగా రాయలసీమ ప్రాంతానికి చెందిన న్యాపతి సుబ్బారావుకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష స్థానం కట్టబెట్టింద్రు. దీనితో ఆయన మెత్తబడ్డడు. ఆ తర్వాత మద్రాసు

కౌన్సిల్‌ల ఆంధ్రప్రాంతం ఒక ప్రావిన్స్‌గా ఏర్పాటు చేయాలని తీర్మానాన్ని ప్రతిపాదించింద్రు. అయ్యదేవర కాళేశ్వరరావు దీంట్లె ప్రముఖపాత్ర వహించిండు.

అయినా ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుపై రాయలసీమ ప్రాంత నాయకులకు నమ్మకం కుదురలేదు. వాళ్ల గత అనుభవాలు తీరాంధ్రుల మీద నమ్మకం లేకుండ చేసినయ్. ఇంతకుముందు ఆంధ్ర విశ్వవిద్యాలయం అనంతపురంల పెట్టాలని మద్రాసు కౌన్సిల్‌ల తీర్మానం చేసింద్రు. అయితే ఆ తర్వాత తీరాంధ్రులు రాజకీయాలు చేసి అనంతపురంల పెట్టాల్సిన యూనివర్సిటీని విశాఖపట్టణానికి తరలించింద్రు. ఇది రాయలసీమ నాయకులకు ఆగ్రహం తెప్పించింది. తమ ప్రాంతానికి వొచ్చిన యూనివర్సిటీని తన్నుకుపోయిన తీరాంధ్రులు భవిష్యత్తుల ఆంధ్రరాష్ట్రం ఏర్పడినా ఇట్లనే దోపిడీ చేస్తరని భయపడ్డరు. వాళ్లతో తాము వేగలేమని భావించింద్రు.

తీరాంధ్రనాయకులు ఎన్నోవిధాలుగా నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రాయలసీమ నాయకులకు నమ్మకం కుదురలేదు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించింద్రు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలనే ఉండటానికి సమ్మతి తెలిపింద్రు. అక్కడనే వారికి రక్షణ ఉంటుందని భావించింద్రు.

# శ్రీబాగ్ ఒప్పందం

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని తీరాంధ్రనాయకులు డిమాండు చేస్తున్నా రాయలసీమ నాయకులు మాత్రం దానికి మద్దతియ్యలేదు. అనేక అనుమానాలు వెలిబుచ్చింండ్రు. మరోవైపు ఆంధ్రమహాసభలు ప్రతి ఏడాది క్రమం తప్పకుండ జరిగినయ్. ఈ ఆంధ్రసభలల్ల ఆంధ్రరాష్ట్రం విషయాన్ని ప్రతిసారి చర్చకు తెచ్చింండ్రు. అయినా తీరాంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు.

ఆంధ్రరాష్ట్ర నిర్ణయం ఎక్కడేసిన గొంగడి అక్కడనే అన్నట్లుగా ఉంది. ఇదే సమయంల అఖిలభారత కాంగ్రెస్ ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించింది. అయితే తీరాంధ్ర, రాయలసీమ నాయకుల మధ్యన ఏకాభి ప్రాయం కుదిరితేతప్ప ఆంధ్రరాష్ట్రం సంగతి ముందుకుపోయే పరిస్థితి కనిపించలేదు. ఈ సమయంల తీరాంధ్ర ప్రాంతానికి చెందిన కాశీనాథుని నాగేశ్వరరావు చొరవ తీసుకున్నడు. ఈయన అప్పటికి ప్రముఖవ్యక్తిగా గుర్తింపు పొందిండు. ఆంధ్రపత్రిక యజమానిగా, అమృతాంజనం ఉత్పత్తిదారునిగా ఈయనకు పలుకుబడి ఉంది.

నాగేశ్వరరావు పక్కా వ్యాపారి. ఈయన నివాసం మద్రాసు పట్టణం. అక్కడ ఈయనకు పెద్ద ఇల్లు ఉంది. ఆ ఇంటి పేరు శ్రీబాగ్. ఈ ఇల్లు కూడ ఈయన పిఆర్ సుందర అయ్యర్ అనే జడ్జి నుంచి కొన్నడు. ఆ ఇంటి నుంచే నాగేశ్వరరావు వ్యాపార కార్యక్రమాలు నిర్వహించిండు.

నాగేశ్వరరావు చొరవ తీసుకొని 1937 నవంబర్ 16న తన నివాసం శ్రీబాగ్‌ల తీరాంధ్ర రాయలసీమ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసిండు. ఈ సమావేశానికి పట్టాభి సీతారామయ్య నాయకత్వం వహించిండు. ఈ సమావేశానికి రాయలసీమ నుంచి కడప కోటిరెడ్డి, కల్లూరి సుబ్బారావు, ఏపూరి రామాచారి,

ఎచ్.సీతారామిరెడ్డి తదితరులు హాజరయింద్రు. తీరాంధ్ర ప్రాంతం నుంచి కొండా వెంకటప్పయ్య, ముళ్లపూడి పళ్లంరాజు, కాశీనాథుని నాగేశ్వరరావు హాజరయింద్రు.

ఈ సమావేశంల రాయలసీమ నాయకులు అనేక అనుమానాలు, భయాలు వెలిబుచ్చింద్రు. తీరాంధ్రనాయకులపై తమకు విశ్వాసం లేదని బాహాటంగా చెప్పింద్రు. అయితే తీరాంధ్ర నాయకులు వారిని సంతృప్తిపరిచే ప్రయత్నం చేసింద్రు. వారి భయాలను, అనుమానాలను పోగొట్టే యత్నాలు చేసింద్రు. రాయలసీమనాయకుల అభిప్రాయాలను గౌరవిస్తూ హామీలను ఇచ్చింద్రు. దీనినే శ్రీబాగ్ ఒప్పందం అన్నరు.

శ్రీబాగ్ ఒప్పందం:

ఆంధ్ర యూనివర్సిటీ కేంద్రాలను అనంతపురం, వాల్తేరుల ఏర్పాటు చేయాలె. ఈ రొండు కేంద్రాల వల్ల ఆంధ్రరాష్ట్రంల అన్ని ప్రాంతాలల్ల సాంస్కృతిక కేంద్రాలను ఏర్పరచినట్టయితది. ఆంధ్రుల మధ్య సాంస్కృతిక సాంఘిక సంబంధాలు బలపడతయ్. దీంతో వివిధ ప్రాంతాలల్ల కళాశాలలు ఏర్పాటు చేసేందుకు వీలయితది. ఇది అభివృద్ధికి అనుకూలంగా ఉంటుంది.

రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరుల వ్యవసాయం, ఆర్థిక అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలె. ఇతర కోస్తాంధ్రులతో సమానంగా ఎదిగేందుకు అవకాశం ఇయ్యాలె. ఈ ఐదు జిల్లాలకు పది సంవత్సరాల పాటు నీటి పారుదలలో ప్రాధాన్యత ఇయ్యాలె. అవసరాన్నిబట్టి ఈ ప్రాధాన్యతా కాలాన్ని పెంచాలె. తుంగభద్ర, కృష్ణ, పెన్న జలాలను ఈ ఐదు జిల్లాలకు అందించటానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలె. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ముఖ్యంగా ఈ నదులపై పెద్ద ప్రాజెక్టులు నిర్మించాలె. ఇది వెంటనే అమలు కావాలె.

జనరల్ శాసనసభ స్థానాల విషయంల అన్ని జిల్లాలకు సమాన ప్రధాన్యతను ఇయ్యాలె. ఏర్పాటు కానున్న అంధ్రరాష్ట్రంల యూనివర్సిటీ కేంద్ర కార్యాలయం, హైకోర్టు వేరువేరు ప్రాంతాలల్ల ఉండాలె. ఇది అధికార స్థానాల కేంద్రీకరణను తగ్గిస్తుంది. యూనివర్సిటీ ఇప్పుడున్న వాల్తేరులనే ఉండాలె. హైకోర్టు, రాజధాని కోస్తాంధ్ర, రాయలసీమల అనువైన ప్రాంతాలల్ల ఉండాలె. ఈ విషయంలో తొలి ప్రాధాన్యత రాయలసీమకు ఇయ్యాలె.

ఏకాభిప్రాయం ద్వారా ఈ అంశాలల్ల మార్పులు చేసుకోవొచ్చు అని కూడా అంగీకారం కుదిరింది.

ఈ హామీలతో పాటు రాయలసీమ అభివృద్ధి గురించిన హామీలను కూడా ఇచ్చింద్రు. దీంతో రాయలసీమ నాయకులు కొంతవరకు సంతృప్తి చెందింద్రు. ఇది కేవలం రెండు ప్రాంతాల మధ్యన జరిగిన అవగాహన. దీనికి ఎట్లాంటి రాజ్యాంగబద్ధత లేదు. ఈ ఒప్పందం వెనక రెండు ప్రాంతాల నాయకులకు ఎవరి ఆలోచనలు వారికున్నయ్.

తీరాంధ్రతో కలిసి ఆంధ్రరాష్ట్రంగా ఏర్పడితే తమకు అన్యాయం జరుగుతుందని భావించిన రాయలసీమ నాయకులు ఈ హామీల వల్ల తమ ప్రాంత అభివృద్ధికి అంతగా ఆటంకాలు ఉండవని అనుకున్నరు. ఇదే సమయంల తీరాంధ్రనాయకుల ఆలోచన మరోవిధంగా ఉంది. ఏందంటే– రాయలసీమ ప్రాంతానికి రాజధాని ఇచ్చినా అది తాత్కాలికమేనని అనుకున్నరు. ముందుగా మద్రాసు నుంచి విడిపోయి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేసుకోవాలని కోరుకున్నరు. ఆ తర్వాత హైదరాబాద్‌ను తమ రాజధానిగా చేసుకోవాలె అని ప్రణాళిక వేసుకున్నరు. దానికి పునాదిగా అప్పటికే భాషాప్రాతిపదిక రాష్ట్రాలు కావాలనే డిమాండు చిన్నగా వినిపించడం మొదలు పెట్టింద్రు.

అప్పటికే కమ్యూనిస్టులు భాషాప్రాతిపదిక రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని అదేపనిగా మట్లాడుతుంద్రు. మిగతా ఆంధ్రనాయకుల ఆలోచన కూడా ఇట్లనే ఉన్నది. కాబట్టి ఏనాటికైనా హైదరాబాదును చేరుతమని తీరాంధ్ర నాయకులు నమ్మింద్రు. తాత్కాలిక రాజధానే కదా అని రాయలసీమకు ఇయ్యడానికి అంగీకరించింద్రు.

ఈ ఒప్పందంతో రెండు ప్రాంతాల నాయకుల మధ్య సయోధ్య కుదిరింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలనే ప్రతిపాదన 1938ల మద్రాసు అసంబ్లీ, కౌన్సిల్‌ల ప్రతిపాదించింద్రు. ఇక్కడ తమిళ సభ్యులు విజ్ఞత పాటించింద్రు. ప్రత్యేక రాష్ట్ర కోరిక ఆంధ్రోళ్లదే కాబట్టి తీర్మానంపై తమ అభిప్రాయం చెప్పాల్సిన అవసరం లేదని భావించంద్రు. కేవలం ఆంధ్రోళ్లు మాత్రమే తీర్మానంపై అభిప్రా యాలు చెప్పింద్రు. దాంతో తీర్మానం నెగ్గింది.

ఇంత వరకు బాగానే ఉందనుకున్నా తర్వాత మరో వర్గం తయారయింది. ఈ వర్గంల టంగుటూరి ప్రకాశం ముఖ్యుడు. ఆయన డిమాండు ఏందంటే– ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలె. ఆంధ్ర రాష్ట్రానికి రాజధానిగా మద్రాసు పట్టణమే ఉండాలె. దీనిని కొంతమంది ఆంధ్రా నాయకులు అత్యాశగానే భావించింద్రు. అయినా బాహాటంగా వ్యతిరేకించలేకపోయింద్రు.

నిజానికి తమిళనాడుల ఉన్న మద్రాసు నగరం ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని కావడం సౌకర్యంగా ఉండదు. మద్రాసు నగరం కనీసం ఆంధ్రరాష్ట్ర సరిహద్దులల్ల కూడా లేదు. రాష్ట్రం ఒకచోట రాజధాని మరొకచోట ఉండటం సమంజసమా అనే ఆలోచన లేకుంట అత్యాశతో ప్రకాశం ఈ వాదనను ముందుకు తెచ్చిండు. దీనిని అట్లాంటి మరికొంతమంది ఆంధ్రనాయకులు బలపరిచింద్రు. ఆంధ్ర నాయకుల అతి తెలివిని తమిళులు తిప్పికొట్టింద్రు. మద్రాసును మరిచి పోతెనే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు సహకరిస్తమని చెప్పింద్రు. దీంతో రెండు ప్రాంతాల మధ్య పీఠముడి పడి ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు పదహారేండ్లు వెనక్కు పోయింది.

# ఆంధ్రరాష్ట్ర ప్రకటన

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు అనే కల ఆంధ్రోళ్లకు నెరవేరక పోవడంతో అసహ నానికి గురయింండ్రు. ఆంధ్రప్రాంతం నుంచి దాదాపు అన్ని పార్టీల నాయకులు కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చింండ్రు. మరోవైపు భాషాప్రాతిపదిక రాష్ట్రాలు ఏర్పడాలనే ప్రతిపాదనకు కమ్యునిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య బలంగా వినిపించిండు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం అంటూ కమ్యూనిస్టు పార్టీ మేనిఫెస్టో పేరుతో పుస్తకం రూపొందించిండు. దానిని కమ్యూనిస్టులు విస్తృతంగా ప్రచారం చేసింండ్రు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలె, భాషాప్రాతిపదికన తెలంగాణల కలవాలె, హైదరాబాద్ రాజధానిగా ఉండాలె అని ప్రచారం చేసింండ్రు. దేశంల 1952ల తొలి ఎన్నికలు అయిన తర్వాత ఈ డిమాండు తీవ్రమైంది.

అయితే భాషాప్రాతిపదిక రాష్ట్రాలను భారతప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకించిండు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కూడా ఈ డిమాండును వ్యతిరేకిం చిండు. భాషాప్రాతిపదిక రాష్ట్రాల వలన కొన్ని కులాల ఆధిపత్యం పెరుగుతుందని చెప్పిండు. 1947 నవంబరుల రాజ్యాంగ పరిషత్తుల ఈ విషయం మీద చర్చ కూడా జరిగింది.

1947లనే మద్రాసు ఉభయ సభలల్ల ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును కోరుతూ మరోసారి తీర్మానం ప్రవేశపెట్టింండ్రు. అయితే ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుల తమిళ సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పవలసిన అవసరం లేదని మద్రాసు ముఖ్యమంత్రి రాజాజీ ఆజ్ఞ జారీచేసిండు. ముఖ్యమంత్రి ఆజ్ఞమేరకు తమిళ సభ్యులు చర్చల పాల్గొనలేదు. దీంతో రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకత రాలేదు. తీర్మానంపై అసెంబ్లీల ఓటింగు కూడా జరుగలేదు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన సభ్యులు మాత్రమే తీర్మానానికి మద్దతు తెలిపింండ్రు.

ఈ తీర్మానం జరిగిన కొద్ది రోజులకు నెహ్రూ ఆంధ్రానాయకులకు హామీ ఇచ్చిండు. నూతన రాజ్యాంగం అమలులకు రాంగనే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోగలమని చెప్పిండు.

తర్వాత భాషా రాష్ట్ర నిర్మాణ సాధ్యాసాధ్యాలను విచారించడానికి ఒక కమిటీ వేసింద్రు. అలహాబాద్ హైకోర్టుల న్యాయమూర్తిగా పనిచేసిన ఎస్‌కె ధార్‌ను ఈ కమిటీ అధ్యక్షునిగా నియమించింద్రు. కార్యదర్శిగా బిసి బెనర్జీని నియమించింద్రు. గతంల ఉత్తరప్రదేశ్ గవర్నర్ సలహాదారుగా పనిచేసిన డాక్టర్ పన్నాలాల్, రాజ్యాంగ పరిషత్ సభ్యుడు జగత్ నారాయణలాల్‌ను సభ్యులుగా నియమించింద్రు.

ఈ కమిటీ 1947 జూలై 19న పని ప్రారంభించింది. ఏకగ్రీవ అభి ప్రాయంతో తయారుచేసిన నివేదికను 1947 డిసెంబర్ 10న రాజ్యాంగ పరిషత్తుకు అందజేసింది.

ఈ కమిటీ భాషారాష్ట్రాల ప్రతిపాదనను అంగీకరించలేదు. ఈ విధమైన భాషారాష్ట్రాల ఏర్పాటు ఉపయోగకరం కాదని తెలిపింది. ఇట్లాంటి ఆలోచనతో ముందుకుపోతే రాష్ట్రాల పునర్నిర్మాణానికి అంతముండదని తెలిపింది.

ఈ కమిటీ నివేదిక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ఆటంకంగా మారింది. దీంతో ఆంధ్రానాయకులు భగ్గుమన్నరు. వారిని శాంతపరచడానికి జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయిపటేల్, పట్టాభి సీతారామయ్యలతో కూడిన (జెవిపి) కమిటీని 1948లో వేయాల్సివొచ్చింది. ధార్ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించటం ఈ జెవిపి కమిటీ ప్రధానకర్తవ్యం.

1949 ఏప్రిల్ 6న జెవిపి కమిటీ తన నివేదికను కాంగ్రెసు కార్యాచరణ కమిటీకి ఇచ్చింది. దాదాపు ధార్ కమిటీ అభిప్రాయాలనే ఈ కమిటీ కూడా చెప్పింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఆచరణ యోగ్యం కావని, సరిహద్దు సమస్యలు తలెత్తుతయని చెప్పింది. అయితే చివరగా మాత్రం ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు అను కూలత వ్యక్తం చేసింది. కాని ఆంధ్రోళ్లు మద్రాసును వొదులుకోవాలని చెప్పింది.

జెవిపి కమిటీ నివేదిక ప్రకారం మద్రాసు లేకుంట ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలని 1949 నవంబరు 2న మద్రాసు ప్రభుత్వం తీర్మానం చేసింది. ఆ వెంటనే 1949 డిసెంబర్ 7న ఆంధ్రరాష్ట్ర విభజన కోసం అధికారుల కమిటీని మద్రాసు ప్రభుత్వం నియమించింది. 1950 జనవరి 4న ఈ కమిటీ నివేదికను అందించింది.

జెవిపి కమిటీ నివేదికను కూడ ఆంధ్రోళ్లు అంగీకరించలేదు. ఇక్కడ ఆంధ్రకు చెందిన కమ్యూనిస్టుల ఆలోచన మరో రకంగ ఉంది. ఆ పార్టీ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 1952 జూలై 16న రాజ్యసభల మాట్లాడిన మాటలు ఆంధ్ర కమ్యూనిస్టుల ఆలోచనలకు అద్దం పడతయ్. సుందరయ్య మాట్లాడుకుంట 'భాషాప్రయుక్త రాష్ట్రాలు దేశమంతటా ఏర్పరచండి. అప్పుడు ఆంధ్రకు హైదరాబాదు రాజధాని కాగలదు'

అన్నడు. ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని సమస్య పరిష్కారమయితది అనేది ఆయన ఆలోచన.

అదే రోజు సుందరయ్య రాజ్యసభల మాట్లాడుకుంట హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్ర ఏర్పాటును ఏ శక్తి ఆపలేదన్నడు. అందుకు జవాబుగా హైదరాబాద్ రాష్ట్రానికి చెందిన రాజ్యసభ సభ్యుడు వికె ధగే మాట్లాడిండు. ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రధాని అంగీకరించిండు సరే. అయితే ఏర్పడబోయే ఆంధ్రరాష్ట్రానికి తమ ప్రాంతాన్ని కూడా కలపడానికి హైదరాబాద్ రాష్ట్రంల ఉన్న తెలంగాణ ప్రజలు ఇష్టపడతరా. ఒక వేళ తెలంగాణ ప్రజలు అట్ల కోరినా ఆ కోరికను ప్రధానమంత్రి ఒప్పుకుంటడా అని అడిగిండు. అప్పుడు సభల ఉన్న ప్రధాని నెహ్రూ 'లేదు. ఎంతమాత్రం అంగీరించబోం' అని సమాధానం చెప్పిండు.

రాజధాని సమస్య ఎటూ తేలకపోవడంతో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు ఆలస్యం అయ్యింది. ఈ సమయంల 1952 జూలై 27న తీరాంధ్ర, రాయలసీమకు చెందిన అన్ని పార్టీల నాయకులు మద్రాసుల సమావేశం అయి ఆంధ్రరాష్ట్ర విషయం మాట్లాడుకోవాలని అనుకున్నరు. అయితే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీలం సంజీవరెడ్డి ఈ సమావేశానికి తమ పార్టీవాళ్లు హాజరు కావొద్దని చెప్పిండు. రాష్ట్ర ఏర్పాటు వాయిదావేయాలని రాయలసీమ నాయకులు ప్రకటన చేసింద్రు. రాష్ట్ర ఏర్పాటు మల్లా ఆగిపోయింది.

దీంతో తీరాంధ్రనాయకులల్ల అసహనం పెరిగింది. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు ఆలస్యానికి నిరసనగా తీరాంధ్రప్రాంతానికి చెందిన గొల్లపూడి సీతారాం 1952 ఆగస్టు 15న నిరాహార దీక్షకు పూనుకున్నడు. 36 రోజులు దీక్ష చేసిండు. అయినా ఆయన అనుకున్న స్పందన రాలేదు. చివరికి తన సన్నిహితుల సూచనతో దీక్ష విరమించిండు.

ఆ తర్వాత పొట్టిశ్రీరాములు దీక్షకు తయారైండు. శ్రీరాములు దీక్షకు టంగుటూరి ప్రకాశం, బులుసు సాంబమూర్తి మద్దతు, ప్రోత్సాహం ఉన్నయ్. మద్రాసు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలని పొట్టిశ్రీరాములు 1952 అక్టోబర్ 19న మద్రాసులోని బులుసు సాంబమూర్తి ఇంట్లె నిరాహారదీక్ష ప్రారంభించిండు. నిరాహారదీక్షను బహిరంగ ప్రదేశంల ప్రారంభించాలని మొదట అనుకున్నడు. అయితే మద్రాసు ముఖ్యమంత్రి రాజాజీ అందుకు అనుమతించలేదు. గత్యంతరం లేక బులుసు సాంబమూర్తి ఇంట్లె శ్రీరాములు దీక్షకు కూచున్నడు.

దీక్ష ప్రారంభానికి ముందు 1952 సెప్టెంబర్ 30న శ్రీరాములు ఒక ప్రకటన విడుదల చేసిండు. దాంట్లె మద్రాసు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలనేదే తన లక్ష్యమని చెప్పిండు. అయినా ఆయన ప్రకటనకు స్పందన రాలేదు.

దీక్ష ప్రారంభం రోజు మరో ప్రకటన విడుదల చేసిండు. ఈ రొండో ప్రకటనల కాస్త తగ్గి కనీసం మద్రాసు ఉమ్మడి రాజధానిగానైనా రాష్ట్రం ఏర్పాటు చేయాలని డిమాండు చేసిండు. ఈ డిమాండుకు కూడా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి స్పందన రాలేదు. అయినా అట్లనే 58 రోజులు దీక్ష కొనసాగించిండు. 1952 డిసెంబర్ 15న కాలం చేసిండు.

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు ప్రకటన ప్రధాని చేసినంక మద్రాసు కోసం దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు ప్రాణం లక్ష్యం నెరవేరకుండనే పోయింది.

పొట్టి శ్రీరాములు దీక్ష, మరణం మీద కొన్ని గుసగుసలు కూడా ఉన్నయ్. ఈ గుసగుసల సారాంశం ఏంది అంటే... శ్రీరాములు ఏదో దీక్షకు అయితే కూచున్నడు కాని తన కోరిక నెరవేరదని తెలుసుకున్నడు. అందుకని మధ్యలనే దీక్ష విరమించడానికి తయారైండు. కాని ప్రకాశం వంటి నాయకులు మొండిగా దీక్ష కొనసాగించాలని పట్టుపట్టిండ్రు. అంతేకాక దీక్ష వల్ల ఆరోగ్యం చెడిపోయి శ్రీరాములు చనిపోలేదు. ఆయన మరణం వెనుక మర్మం దాగి ఉంది. మద్రాసు నగరం కోసం పొట్టి శ్రీరాములును బలవంతంగా బలితీసుకున్నరు. ఈ గుసగుసలు నెల్లూరుల వినిపిస్తయ్. అయినా శ్రీరాములు మరణంతో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు వేగం పుంజుకుంది.

1952 డిసెంబర్ 19న ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు సుముఖంగా ఉన్నట్లు నెహ్రూ ప్రకటించిండు. అయితే మద్రాసు రాజధాని కావాలన్న ఆలోచనను ఆంధ్రోళ్లు వొదులు కోవాలని మల్లా చెప్పిండు.

# కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం

నెహ్రూ ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు ప్రకటనను చేసిన తర్వాత రాష్ట్ర రాజధాని మీద చర్చలైనయ్. ఆంధ్రనాయకులు మద్రాసు మీద పట్టుపట్టింద్రు. కాని తమిళులు ససేమిరా అన్నరు. మద్రాసు ముఖ్యమంత్రి రాజాజీ మరీ కఠినంగా ఉన్నడు. మద్రాసు అనే మాటను కూడా ఆంధ్రోళ్లను అననియ్యలేదు.

ఈ పరిస్థితుల్ల1953 మార్చి 25న కేంద్ర ప్రభుత్వం విభజన కమిటీని వేసింది. కమిటీ అధ్యక్షుడు జస్టిస్ కైలాసనాథ్ వాంఛూ. ఆయన రాజస్థాన్ హైకోర్ట్ న్యాయమూర్తి. ఈ వాంఛూ కమిటీ ప్రధాన ఉద్దేశం ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుతో తలెత్తనున్న సమస్యలకు పరిష్కారాలు సూచించడం. ముఖ్యంగా రాజధాని సమస్యను పరిష్కరించడం. వాంఛూ అన్ని అంశాలను విచారించిండు. నాలుగు ఏండ్ల పాటు మద్రాసు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా ఉండాలని సూచించిండు. ఈ లోపు ఆంధ్రకు రాజధాని నిర్మాణం జరగాలని చెప్పిండు.

కాని మద్రాసు ముఖ్యమంత్రి రాజాజీ మాత్రం అందుకు అంగీకరించ లేదు. ఆంధ్ర రాష్ట్రానికి మద్రాసు తాత్కాలిక ఉమ్మడి రాజధానిగా ఉండడానికి వీలులేదన్నడు. నాలుగేండ్లు కాదుకదా నాలుగురోజులు కూడా ఉమ్మడి రాజధానిగా ఉండటానికి అంగీకరించమని ముఖం మీద కొట్టినట్లు చెప్పిండు.

ఆంధ్రనాయకులు మాత్రం అదే మంకుపట్టు పట్టిండు. మద్రాసు నగరాన్ని రెండు ముక్కలుగా విభజించి రెండు రాష్ట్రాలకు రాజధాని ఏర్పాటు చేయాలని వాదించింద్రు. దానికి మండిపోయిన రాజాజీ 'ఆంధ్రాకుక్కల్లారా ఇరవై నాలుగు గంటల్లో మద్రాసును ఖాళీ చేసి వెళ్లిపొండి' అని హూంకరించిండు. మద్రాసు నగరంల కాదు కదా తమిళనాడు రాష్ట్రం సరిహద్దు ప్రాంతాలల్ల కూడా ఆంధ్ర రాజధాని ఏర్పాటు చేసుకోవడానికి అంగీకరించనన్నడు. తాత్కాలిక రాజధాని అయినా అది ఆంధ్ర భూ భాగంలనే ఏర్పాటు చేసుకోవాలె కాని మద్రాసు రాష్ట్ర భూభాగంల అవకాశం ఇయ్యనన్నడు.

ఇక మద్రాసుతోటి ఆంధ్రానాయకులకు నూకలు చెల్లిపోయినయ్. తమకు వేరే రాజధాని ఏర్పాటు చేసుకోవడం తప్ప మరోమార్గం లేదని అనుకుంన్రు.

ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలల్లనే ఒక నగరాన్ని రాజధానిగా ఎంచు కోవాలనుకుంన్రు. అయితే ఆంధ్రరాయలసీమ నాయకులకు ఈ విషయం మీద ఏకాభిప్రాయం లేదు. కమ్యూనిస్టులు గుంటూరు, విజయవాడ రాజధానిగా ఉండాలని పట్టుపట్టింన్రు. ఎన్‌జీ రంగా నాయకత్వంలోని కృషికార్ లోక్ పార్టీ తిరుపతి రాజధానిగా పెట్టాలని వాదించింది. రాయలసీమవాళ్లు మాత్రం రాజధాని తమ ప్రాంతంల ఉండా లని వాదించింన్రు. రాజధాని విషయంతో పీటముడి పడ్డది. ఇక ఆంధ్ర, రాయలసీమ శాసనసభ్యులు సమావేశమై రాజధానిని నిర్ణయిం చమని ప్రకాశంకు పెత్తనం ఇచ్చింన్రు.

ఈ సందర్భంల శ్రీభాగ్ ఒప్పందాన్ని రాయలసీమ నాయకులు గుర్తు చేసింన్రు. ఏర్పాటు చేయబోయే రాజధానిని ఆంధ్రనాయకులు తాత్కాలిక రాజధాని గానే భావించింన్రు. కాంగ్రెస్, కమ్యూనిస్టు అనకుండా ఆంధ్రా నాయకులందరికి హైదరాబాద్ మీద కన్నుండటమే కారణం. తెలుగుజాతి, ఐక్యత అనే మాయ మాటలు వాళ్లు ఎప్పటి నుంచో ప్రచారం చేస్తుంన్రు.

అందువల్ల తాత్కాలిక రాజధానే కదా! అని ఆంధ్రనాయకులు రాజధాని తమ ప్రాంతానికే చెందాలనే దానిమీద పట్టు వొదిలింన్రు. ఈ పరిస్థితిల రాయల సీమ వాళ్లను కలుపుకుంటే మంచిదనుకుంన్రు. రాజధాని కేవలం తాత్కాలి కమే అన్న అభిప్రాయంతో ఉన్నరు కాబట్టి ఆంధ్ర రాజధానిగా కర్నూలును నిర్ణయిం చింన్రు. దీంతో రాయలసీమ నాయకులు తృప్తిపడ్డరు.

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు బిల్లు 1953 ఆగస్టు 10న పార్లమెంటుకు వొచ్చింది. 1953 సెప్టెంబర్ 12న అంటే 33వ రోజు బిల్లు ఆమోదం పొందింది. ఆంధ్రోళ్ల చిరకాల వాంఛ ఆంధ్రరాష్ట్రం 1953 అక్టోబర్ 1న నెరవేరింది. పదకొండు జిల్లాలతో కూడిన ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.

అప్పటి వరకు ప్రజా సోషలిస్టు పార్టీ నాయకునిగా చెలామణి అయిన టంగుటూరు ప్రకాశం ముఖ్యమంత్రి పదవికోసం ఆ పార్టీకి రాజీనామా చేసిండు. 82 సంవత్సరాల ప్రకాశం కాంగ్రెస్‌తో కలిసి ముఖ్యమంత్రి పదవి దక్కించుకుండు. నీలం సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రి అయ్యిండు. తెన్నేటి విశ్వనాథం, దామోదరం సంజీవయ్య, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కడప కోటిరెడ్డి, ఎబిపి పట్టాభి రామారావులకు మంత్రి పదవులు దక్కినయ్. తర్వాత కృషికార్ లోక్ పార్టీ నుంచి గౌతు లచ్చన్న మంత్రి అయ్యిండు. కాని కర్నూలును రాజధానిగా సమర్థించలేక రాజీనామా చేసిండు.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డది. ప్రజాప్రభుత్వం ఏర్పడ్డది. కాని రాజధానిల వసతులు లేవు. మద్రాసుల రాజధానిని నడపాలని ప్రకాశం కొద్దికాలం మొండిగా అనుకున్నా రాజాజీ నుంచి సహకారం లభించలేదు. పైగా వెంటనే ఖాళీ చేయాలని మొహమాటం లేకుంట చెప్పిండు. తమ భవనాలల్ల ఆంధ్రప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహిస్తే అద్దెలు వొసూలు చేస్తమని హెచ్చరించిండు. దానికి కూడ సమయం ఇయ్యము అని చెప్పిండు.

దీంతో ఇంకో మార్గం లేకుంటపోయింది. ఆంధ్రసర్కారు రాజధాని నగరంగా ఎంచుకున్న కర్నూలు నుంచే పరిపాలన సాగించడానికి సిద్ధపడ్డది. అయితే కర్నూలుల ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహించడానికి సరియైన భవనాలు లేవు. వసతులు లేవు. అందుకని కార్యాలయాల కోసం ప్రభుత్వం గుడారాలను ఏర్పాటు చేసింది. ఎ, బి, సి, డి టైపు గుడారాలు వెలసినయ్. ఒకటి, రొండు తరగతుల అధికారుల కోసం 'ఎ' టైపు గుడారాలను వేసింఁడ్రు. 'ఎ' తరగతి శిబిరంల 217 గుడారాలు వేసింఁడ్రు. వీటిలో కొన్ని 20×16, మరికొన్ని 16×14 అడుగుల గుడారాలు. 131 గుడారాలల్ల 240 మంది అధికారులు ఉన్నరు. ఇట్ల గుడారాలను ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని డేరా నగర్ అన్నరు.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన అక్టోబరులనే ఆంధ్ర రాష్ట్ర గవర్నర్ చందూలాల్ త్రివేది డేరానగర్‌లోని గుడారాలను పరిశీలించడానికి వొచ్చిండు. ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి స్వాగతం పలికిండు. గవర్నర్ గుడారాలను పరిశీలిస్తుంటే అధికారులు అక్కడ ఉన్న నీటి పంపును తెరిచి నీరు సరిగ్గనే వొస్తున్నదని చెప్పింఁడ్రు. దానికి గవర్నర్ నవ్వుకుంట 'అవి వొచ్చినప్పుడు సరిగ్గనే వొస్తయ్. రానప్పుడు ఒక్క చుక్క కూడా రావు. మొన్న నేను స్నానం చేద్దామనుకుంటే నీళ్లు రాక ముప్పావుగంట ఎదురు చూడాల్సి వొచ్చింది' అన్నడు.

ఆ తర్వాత గవర్నర్ ఒక గుడారంలకి పోయి చూసే సరికి ముగ్గురు సూపరింటెండెంట్లు ఉన్నరు. వారు ముగ్గురు ఒకే గుడారంల ఉంటున్నట్లు చెప్పింఁడ్రు. 'ఉండటానికి వొసతి చూపితే కుటుంబాలు తీసుకొని రాగలమని చెప్పినం. అయితే అధికారులు వొసతి లేదని చెప్పింఁడ్రు' అని గవర్నర్‌కు మొర పెట్టుకుంఁడ్రు.

ఈ గుడారాల నుంచే ఆంధ్ర రాష్ట్ర పాలన సాగించింది. ఆ తర్వాత ఒకటి రొండు భవనాలు నిర్మించుకున్నరు. అయితే వాటిని తాత్కాలికంగా ప్రభుత్వ కార్యాలయాల కోసం ఉపయోగించుకొని, తర్వాత కళాశాలలుగా, ఆస్పత్రులుగా వాడుకోవాలన్న ఆలోచనతో నిర్మించింఁడ్రు.

ఆనాటి ఆంధ్రరాష్ట్రం ఆర్థిక పరిస్థితి హీనంగా ఉంది. ఆంధ్ర అసెంబ్లీల జరిగిన చర్చలు, నాయకులు వెలిబుచ్చిన అభిప్రాయాలు నాటి పత్రికలు రాసినయ్.

ఆంధ్రరాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సంతృప్తికరంగా లేవు. మున్ముందు బాగపడే అవకాశాలు కనపడవు. మార్చినాటికి ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని స్థితి. నందికొండ, తుంగభద్ర ఎగువకాలువ నిర్మాణానికి తగిన ఆర్థిక స్థోమత ఉండదు అని ఆంధ్రపత్రిక 1954 డిసెంబర్ 3న రాసింది. రెవిన్యూఖాతా నుండి పెట్టుబడి పనులకు ద్రవ్యాన్ని వినియోగించే అవకాశం ఇప్పుడు కాదు గదా, మరొక అయిదు సంవత్సరాలకైనా లభించేట్టు కన్పించదు. రుణాల ద్వారా పెట్టుబడి సేకరణకు అవకాశం లేదు అని 1953 డిసెంబర్ 30న ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీల ఒక సభ్యుడు ఆవేదన వ్యక్తం చేసిండు. ఆంధ్రరాష్ట్ర ఆదాయం 22 కోట్లలో, 20 కోట్లు ప్రభుత్వ పాలనకే అయిపోతున్నది అని 1954 సెప్టెంబర్ 15న బెజవాడ గోపాలరెడ్డి ఆంధ్ర అసెంబ్లీల వాపోయిండు.

అభివృద్ధికి అనుగుణంగా ఆర్థిక స్థోమత పెరగలేదు అని 1956 ఫిబ్రవరి 19న ఆంధ్ర పత్రిక రాసింది. ఇప్పుడు 18 కోట్ల లోటుతో బండి నడుస్తున్నది. ఏదో కేంద్ర సహాయం వొస్తేగానీ సిబ్బంది జీతాలు ఇచ్చుకోలేని స్థితి ఇప్పటికే ఉంది అని 1953 నవంబర్ 5న ఆంధ్ర అసెంబ్లీల నీలం సంజీవరెడ్డి ఏకరువు పెట్టిండు.ఎక్కడకు వెళ్లినా రైతులు సాగుకు విద్యుచ్ఛక్తి ఇవ్వాలని అడుగుతున్నరు. ఎక్కడ నుంచి తేగలం? అని1954 ఫిబ్రవరి 25న ఆంధ్ర అసెంబ్లీల ఒక సభ్యుడు లబోదిబోమన్నడు.

ఆంధ్రరాష్ట్రాన్ని దక్షిణాది రాష్ట్రాలతో పోల్చినప్పుడు విద్యుచ్ఛక్తి ఎక్కడా తగినంత వ్యాప్తి చెందలేదు. అందువల్ల పరిశ్రమ కూడా చెప్పుకోదగింది ఏర్పడలేదు అని 1953 జనవరి 5న ఆంధ్రపత్రిక రాసింది. ఆంధ్రప్రాంతంల సేల్స్‌టాక్స్ అతిస్వల్పం అని 1953 జనవరి 31న అసెంబ్లీల ఎం. భక్తవత్సలం పెదవి విరిచిండు. తెలంగాణ పారిశ్రామికంగా కొంత అభివృద్ధి సాధించింది. ఇంకా అభివృద్ధి చెందడానికి చాలా అవకాశం ఉంది అని పివిజి రాజు అన్న మాటలను ఆంధ్రపత్రిక 1955 నవంబర్ 28న రాసింది.

రాజధాని విషయంల కూడా ఆనాటి ఆంధ్రనాయకులు లబోదిబో అన్నరు. ఆంధ్రరాష్ట్రంల రాజధాని కార్యాలయాలు పెట్టుకునే స్థలం లేదు కదా! జిల్లా కార్యాలయాలు పెట్టుకునేందుకే స్థలం లేదు అని కడప కోటిరెడ్డి అన్న మాటలను 1953 మార్చి 13న ఆంధ్రపత్రిక రాసింది.

హైదరాబాద్ వొస్తే మన బాధలన్నీ తీరుతయ్. కానీ ఎట్ల వొస్తుంది? ఎక్కడ నుంచి మనం ప్రయత్నించాలనో ఆలోచించుకోవాలి అని టంగుటూరి ప్రకాశం 1953 జూన్ 2న అన్న మాటలు ఆంధ్రపత్రిక రాసింది. అద్దెలు ఇచ్చి ఆంధ్ర ఉద్యోగులు ఇంకా మద్రాసులనే ఉన్నరు. వారికి వసతి సౌకర్యాలు కర్నూలుల ఎక్కడ లభ్యం కాగలవని అధికారుల ఆందోళన. కొత్త సెక్రటేరియెట్ భవన నిర్మాణం పూర్తయేట్లు కనిపించడం లేదు. పైగా ఉద్యోగులు తమ బిడ్డలకు విద్యావకాశాలు లేవని ఆందోళన. ఈ మాటలు నీలం సంజీవరెడ్డి అన్నవి. 1954 సెప్టెంబర్ 1న ఆంధ్రపత్రిక రాసింది. ఈ మాటలు అన్న సంజీవరెడ్డిపై ఆంధ్రపత్రిక 1954 అగస్టు 9న చురకలు అంటించింది. ఈయన రాయలసీమకు రాజధాని రాకుంటే ఆంధ్రరాష్ట్రంల కలవకుండా మద్రాసు రాష్ట్రంలనే ఉండి పోతమని బెదిరించిన వాళ్లల్ల ముఖ్యుడు అని వాతలు పెట్టింది.

1953 అక్టోబర్ 1న ఏర్పడ్డ ఆంధ్రరాష్ట్రం కనీస పరిపాలన సాగించడానికి వొసతులు లేక ఇబ్బంది పడ్డది. ఇట్లాంటి దుస్థితిల హైదరాబాద్‌ను కలుపు కోవాలని ఆంధ్రానాయకులు కుట్రలకు పూనుకుండ్రు.

# ఆంధ్రప్రదేశ్


Adilabad
Karimnagar
Nizamabad
Medak
Warangal
Khammam
Hyderabad
Ranga Reddy
Nalgonda
Mahbubnagar
Guntur
Krishna
West Godavari
East Godavar
Visakhapatnam
Vizianagaram
Srikakulam
Kurnool
Prakasam
Anantapur
Cuddapah
Nellore
Chittoor

# విశాలాంధ్రకు తెలంగాణ వ్యతిరేకత

హైదరాబాద్ రాష్ట్రంల బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం నడుస్తున్నది. అటు ఆంధ్రరాష్ట్రంల టంగుటూరి ప్రకాశం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిండు. ఆ తర్వాత బెజవాడ గోపాలరెడ్డి ఆంధ్ర ముఖ్యమంత్రి అయ్యిండు.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డంక తెలంగాణతో కలిపి విశాలాంధ్ర ఏర్పటు చేయాలని, దానికి హైదరాబాద్ రాజధానిగా ఉండాలని ఆంధ్రనాయకులు ప్రచారం చేసింద్రు. నిజానికి ఆంధ్రోళ్లకు ఈ కోరిక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కంటే ముందే ఉంది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డంక మాత్రం కమ్యూనిస్టులు విశాలాంధ్ర గురించి అదేపనిగా ప్రచారం చేసింద్రు. దానికి కారణం రొండు ప్రాంతాలు కలిస్తే కమ్యూ నిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చన్న కోరిక. ఇటు హైదరాబాద్ రాష్ట్రంల, అటు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంల ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలన్న కమ్యూనిస్టుల కోరిక నెరవేరలేదు.

హైదరాబాద్ రాష్ట్రంల 1952 ఎన్నికల్ల పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) నుంచి పోటీచేసిన కమ్యూనిస్టులు కేవలం 42 శాసనసభా స్థానాలను గెల్చుకుంద్రు. అసెంబ్లీతో పాటు పార్లమెంట్‌కు ఎన్నిక కావటం వల్ల గెలిచిన స్థానాలల్ల కూడా నలుగురు సభ్యులు రాజీనామా చేసింద్రు. అంటే హైదరాబాద్‌ల ఉన్న 175 అసెంబ్లీ స్థానాలల్ల కేవలం 38 స్థానాలకు కమ్యూనిస్టులు పరిమితమ యింద్రు. సాయుధ పోరాటం జరిగిన రొండున్నర జిల్లాలల్ల తప్ప హైదరాబాద్ రాష్ట్రంల ఈ పార్టీని ప్రజలు తిరస్కరించింద్రు. సాయుధ పోరాటాన్ని ఎంతో ఊహించుకొని ప్రచారం చేసుకున్న కమ్యూనిస్టులు ఎన్నికల్ల బొక్కబోర్ల పడ్డరు.

అంతకు ముందు మద్రాసు రాష్ట్రంల కూడా చేదు అనుభవమే ఎదురైంది. ఆ తర్వాత ఆంధ్ర రాష్ట్రంల 1955ల జరిగిన ఎన్నికలల్ల 196 అసెంబ్లీ స్థానాలకు గాను ఐక్య కాంగ్రెస్ 148 స్థానాలు గెలిచింది. కాంగ్రెస్ సొంతంగా 119 స్థానాలు దక్కించుకుంది. కమ్యూనిస్టులు కేవలం 15 స్థానాలకు పరిమితమయింద్రు.

అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రాంతాలు కలిస్తే తమ ప్రాబల్యం పెంచు కోవచ్చుని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవొచ్చుని కమ్యూనిస్టులు కలలు కన్నరు. తమ కల నెరవేర్చుకోవడం కోసం తెలంగాణ ప్రజల భవిష్యత్తును ఫణంగా పెట్టడానికి సిద్ధమయిండ్రు. తెలుగు జాతి ఐక్యత అనే నినాదంతో కుట్ర చేసిండ్రు. దాంట్లె భాగంగనే విశాలాంధ్ర డిమాండు చేసిండ్రు.

ఇదే సమయంల హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంత ప్రజలు విశా లాంధ్ర ఏర్పాటును వ్యతిరేకించిండ్రు. దానికి కూడా ఆంధ్రోళ్ల ప్రవర్తనే కారణం. నిజాం అనంతరం ఏర్పడిన సైనిక పాలనలోను, ఆ తర్వాత పౌర పాలనలోను కొన సాగిన ఆంధ్రా వలసలు. ఆంధ్రోళ్లు తమ ఉద్యోగాలు దోచుకుం టున్నరని, తమకు అవకాశాలు లేకుండా చేస్తున్నరని తెలంగాణ ప్రజలు, విద్యార్థులు ఉద్యమానికి కూడ దిగిండ్రు. ఆంధ్రోళ్ల ఆధిపత్యంల ఉండటానికి అస్సలు ఇష్టపడలేదు.

వొలసవచ్చిన ఆంధ్రోళ్ల ప్రవర్తన కూడా తెలంగాణ ప్రజల అయిష్టతకు కారణమైంది. అహంకారం, ఆధిపత్యంతో ప్రవర్తించే ఆంధ్రా ఉద్యోగులను తెలంగాణ ప్రజలు భరించలేకపోయిండ్రు. తెలంగాణ, ఆంధ్ర కలిస్తే తమకు అన్యాయం జరుగు తుందని భావించిండ్రు. అవేకాకుండా అనేక భయాందోళనలు తెలంగాణ ప్రజలను వెంటాడినయ్.

ఆవిర్భవించిన నాటి నుంచి ఆంధ్రరాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు పడు తున్నది. ఆంధ్ర రాష్ట్రంతో పోలిస్తే తెలంగాణ ఆదాయం ఎక్కువ. సర్‌ప్లస్‌ల ఉంది. ఆంధ్రతో తెలంగాణ కలిస్తే తెలంగాణ అభివృద్ధికి వినియోగించాల్సిన మిగులు నిధులు ఆంధ్రరాష్ట్రంతో పంచుకోవాల్సి వొస్తుందని భయపడ్డరు. ఆంధ్రుల ఆధిపత్య ధోరణి వల్ల తెలంగాణ అభివృద్ధి విషయంల వివక్షను ఎదుర్కోవలసి వొస్తుందని భావించిండ్రు. కృష్ణా గోదావరి నీళ్లను ఆంధ్రోళ్లు దోచుకపోయే ప్రమాదం ఉందని అనుమానించిండ్రు. నీటి విషయంల తమకు అన్యాయం జరుగుతుందని భయపడ్డరు.

ఉద్యోగాల విషయంల కూడా తమకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ ప్రజలు భయపడ్డరు. బ్రిటిష్ ఆంధ్రల ఉన్న ఆంధ్రోళ్లకు ఇంగ్లీషు భాష బాగ వొస్తదని, తెలంగాణ ప్రజలకు ఇంగ్లీషు రాదని అప్పటికే ప్రచారం చేసిండ్రు. ఆంధ్రోళ్లు ఇదే సాకు చూపించి హైదరాబాద్ సెక్రటేరియెట్‌ల అప్పటికే తిష్ఠవేసిండ్రు. ఇంక తెలంగాణ ఆంధ్ర విలీనం అయితె ఇంగ్లీషు భాష అనే దొంగ సాకు చెప్పి తమ నోటి కాడి ఉద్యోగాలు తన్నుకపోవడం ఖాయమని తెలంగాణ ప్రజలు భావించిండ్రు. ఆంధ్రోళ్లతోటి

తాము పోటీ పడలేమని అనుకున్నరు. తాము తమ రాష్ట్రంల ఉంటెనే తమ ఉద్యోగాలు తమకు దక్కుతయని అనుకున్నరు.

అయినా ఆంధ్రనాయకులు కుట్ర ప్రయత్నాలు మానుకోలేదు. డిల్లీ నాయకుల చెవుల్ల జొర్రీగల లెక్క విశాలాంధ్ర పాట వినిపించింద్రు. కేంద్రంలోని నాయకులను ప్రభావితం చేయడం మొదలు పెట్టింద్రు.

తెలంగాణ చరిత్ర కూడా ఆంధ్రోళ్ల కుట్రలకు బలం చేకూర్చింది. తెలంగాణ ప్రజల ఇష్టాన్ని పట్టించుకోకుండా చేసింది.

తెలంగాణ ప్రాంతం నైజాం పాలనల ఉండటంవల్ల తెలంగాణ నాయకులకు జాతీయనాయకులతో అంత సాన్నిహిత్యం ఏర్పడలేదు. బ్రిటిష్ ఇండియాల ఉన్న ఆంధ్రోళ్లకు జాతీయనాయకత్వంతో మంచి సంబంధాలు ఉన్నయ్. ఈ సంబంధాలతో ఆంధ్రనాయకులు విశాలాంధ్ర ఏర్పాటు చేయాలని జాతీయ నాయకులపై ఒత్తిడి పెంచింద్రు.

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు సమయంల రాజధాని సమస్య వొచ్చినప్పుడు తాత్కాలిక రాజధానిగా హైదరాబాద్‌ను ఏర్పాటు చేయాలని అతితెలివి సూచనను ముందుకు తెచ్చింద్రు కమ్యూనిస్టులు. నెల్లూరుకు చెందిన కమ్యూనిస్టు నాయకుడు సుందరయ్య అయితే రాజ్యసభల మాట్లాడుకుంట హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్ర ఏర్పడుతుందని, ఎవరూ అడ్డుకోలేరని గొంతుచించుకుండు.

తెలంగాణ ప్రజల ఇష్టంతో పనిలేకుండ ఆంధ్రానాయకులు ముఖ్యంగ కమ్యూనిస్టులు విశాలాంధ్ర ఏర్పాటును శక్తివంచన లేకుండా ప్రయత్నాలు చేసింద్రు. ఆంధ్రోళ్లు ఈ కుట్రలు చేస్తుండగనే హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ సంఘంలోని తెలంగాణ ప్రాంత సభ్యులు 1954 జూన్ 7,8 తారీకులల్ల హైదరాబాద్‌ల సమావేశం అయ్యింద్రు. తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగనే ఉంచాలని ఈ సమా వేశంల ఏకగ్రీవంగా తీర్మానం చేసింద్రు.

# రాష్ట్రాల పునర్విభజన కమిషన్

ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుతో దక్షిణదేశంల అనేక రాష్ట్రాల గురించి పునరా లోచించాలనే డిమాండు మొదలయింది. దీంతో రాష్ట్రాల పునర్విభజనకు ఒక శాశ్వత ప్రాతిపదిక ఉండాలని కేంద్రం భావించింది. అంతేకాక భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు డిమాండు అధ్యయనం చేయాలని భావించింది. అందుకుగాను రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌ను 1953 డిసెంబర్ 29న కేంద్రం నియమించింది. న్యాయమూర్తి సయ్యద్ ఫజల్ అలీ అధ్యక్షునిగా కమిషన్ ఏర్పాటు అయ్యింది. హృదయనాథ్ కుంజ్రూ, కవలం మాధవ ఫణిక్కర్ కమిషన్‌ల సభ్యులుగా నియమితులయింద్రు. ఈ కమిషన్ 1954 జూన్, జూలై నెలలల్ల హైదరాబాద్‌ను సందర్శించింది. అనేక సంస్థలు, వ్యక్తుల అభిప్రాయాలు సేకరించింది. వాటి నన్నింటిని పరిశీలించి 1955 సెప్టెంబర్ 30న కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది.

ఈ కమిషన్ హైదరాబాద్ రాష్ట్ర ప్రజల అభిప్రాయమే కాకుండా రాష్ట్రం వెలుపలి ప్రజల అభిప్రాయాలు కూడా పరిశీలించింది. హైదరాబాద్ రాష్ట్రంలోని మరాఠీ భాష మాట్లాడే ప్రజలున్న ప్రాంతాలను మహారాష్ట్రల కలపాలని చెప్పింది. అట్లనే కన్నడం మాట్లాడే ప్రజలున్న ప్రాంతాలను కర్ణాటకల కలపాలని సూచించింది. బీదర్‌తో సహ తెలుగు మాట్లాడే పది తెలుగు జిల్లాలను హైదరాబాద్ రాష్ట్రంగా ఉంచాలని సూచించింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాల డిమాండు నేపథ్యంల ఆంధ్ర, తెలంగాణ ఏకీ కరణ సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలించింది. రెండు ప్రాంతాలల్ల ఉన్న సమస్య లను ప్రస్తావించింది. రెండు రాష్ట్రాల కలయికకు అనుకూలంగా, వ్యతిరేకంగా ఉన్న వాదనలను పొందుపర్చింది. ఒకే భాష, ఒకే రాష్ట్రం అనే ప్రాతిపదిక ఎల్లవేళలా ఆమోదయోగ్యం కాదని చెప్పింది.

ఈ కమిషన్ మరో సూచన కూడా చేసింది. వెంటనే విశాలాంధ్ర ఏర్పాటు చేయడం మంచిది కాదని తెలిపింది. హైదరాబాద్ రాష్ట్రంల మరఠ్వాడా, కన్నడ

జిల్లాలు పోగా మిగిలిన ప్రాంతాన్ని తెలంగాణ రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని చెప్పింది. ఐదేండ్లు గడిచిన తర్వాత 1961 సాధారణ ఎన్నికలు జరగుతయ్ కదా. అప్పుడు హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీల ఉన్న తెలంగాణ శాసన సభ్యులు మూడింట రెండొంతుల మంది అంగీకరిస్తే విశాలాంధ్ర ఏర్పాటు చేయవచ్చని చెప్పింది. ఆంధ్రతో తెలంగాణ కలవాలెనా వొద్దా అన్న నిర్ణయం హైదరాబాద్ అసెంబ్లీ మాత్రమే తీసుకోవాలని చెప్పింది.

రెండు ప్రాంతాల కలయికకు అనుకూలంగా, ప్రతికూలంగా ఉన్న వాదనలను ఎస్ఆర్సి పొందుపర్చింది. పేరాలు, పేరాల సంఖ్యల వారీగా కమిషన్ నివేదికలోని అంశాలు ఇవి.

విశాలాంధ్ర అనుకూల వాదన:

369. ప్రస్తుత హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాల భవిష్యత్తును ఆలోచించాలె. ముఖ్యంగా విశాలాంధ్ర ఏర్పాటు డిమాండు నేపథ్యంలో దీన్ని చూడాలె.

370. ఆంధ్రరాష్ట్రం 1953 అక్టోబర్ 1న ఏర్పడింది. 1953 నాటి ఏర్పాటును శాశ్వత ఏర్పాటుగా నూతనరాష్ట్రంలోని ఆంధ్రులు, ముఖ్యంగా సర్కారు ప్రాంతంవారు భావించడం లేదు. నిజానికి విశా లాంధ్ర ఏర్పాటు వాదన ఇంతవరకు సమగ్రంగా పరిశీలించలేదు.

371. తెలంగాణతో కూడిన విశాలాంధ్ర ఏర్పడితే చెప్పుకోదగిన స్థాయిల సాగుభూమి, 3.2 కోట్లమంది జనాభా, భారీ స్థాయిల జల వనరులు, ఇంధనవనరులు, తగినంత ఖనిజ సంపద, విలువైన ముడి ఖనిజాలతో కూడిన రాష్ట్రం అవతరిస్తుంది. అత్యంత కష్టసాధ్యమైన, ఆందోళన కలిగిస్తున్న ఆంధ్రరాష్ట్ర శాశ్వత రాజధాని సమస్య కూడా తీరిపోతుంది. హైదరాబాద్–సికింద్రాబాద్ జంటనగరాలు విశాలాంధ్ర రాజధానిగా బాగా సరిపోతయ్.

372. కృష్ణ, గోదావరి నదుల అభివృద్ధిని ఏకీకృత నియంత్రణలకు తీసుకొచ్చే వీలుంటది. కృష్ణ, గోదావరి ప్రాజెక్టులకు ఇప్పటికే రూపకల్పన జరిగింది. అయితే కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్ని మొత్తం ఏకీకృతం చేయడం సాధ్యం కాకపోవచ్చు. కానీ తెలంగాణ, ఆంధ్ర కలిస్తే ఈ రెండు నదుల తూర్పు పరీవాహక ప్రాంతాలల్ల సాగునీటి ప్రణాళికల రచన,

అమలును వేగవంతం చేయవచ్చు. తెలంగాణ కూడా ఈ అభివృద్ధి వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా లాభపడుతుంది.

373. ఆంధ్రరాష్ట్రంతో తెలంగాణను ఆర్థికంగా అనుసంధానం చేయడం కూడా ప్రాధాన్యం ఉన్న అంశమే. తెలంగాణ ప్రాంతం ఎన్నో ఏండ్లుగా ఆహారధాన్యాల సరఫరాల లోటును ఎదుర్కొంటున్నది. ప్రస్తుత ఆంధ్రరాష్ట్రం సాధారణంగా మిగులుల ఉంటున్నది. మిగులు ధాన్యాలను తెలంగాణ ప్రాంతం వినియోగించుకోవచ్చు. అదే విధంగా ఆంధ్రరాష్ట్రంల బొగ్గులేదు. తెలంగాణ ప్రాంతానికి చెందిన సింగరేణి నుంచి సరఫరా చేయొచ్చు. విశాలాంధ్రల కలిస్తే తెలంగాణ ప్రాంతం తన సాధారణ పాలనా ఖర్చులను భారీగా తగ్గించుకోవచ్చు.

374. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల వ్యక్తులు, ప్రజాసంస్థలు చాలా కాలంగా భావోద్వేగాలపరంగా సన్నిహితంగా ఉంటున్నరు. ఈ నేపథ్యంల విశాలాంధ్ర ఏర్పాటు ఆదర్శవంతమైంది. అందుకు విరుద్ధంగా బలమైన కారణాలు ఉంటే తప్ప విశాలాంధ్ర సెంటిమెంట్ పరిగణనలకు తీసుకోవడానికి అర్హమైనదే.

తెలంగాణ అనుకూల వాదనలు :

375. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి అనుకూల వాదనలు కూడా అంత తేలిగ్గా కొట్టిపారేయలేని విధంగా ఉన్నయ్.

376. ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి చెప్పుకోదగ్గ స్థాయిల ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నది. తెలంగాణతో పోలిస్తే ఆంధ్ర రాష్ట్రంలో ప్రభుత్వానికి ప్రజల నుంచి వొచ్చే తలసరి పన్ను ఆదాయం తక్కువ. మరోవైపు తెలంగాణకు ఆర్థిక సమస్యలు తలెత్తే అవకాశాలు చాలా తక్కువ. తెలంగాణల భూమి పన్ను ఆదాయం ఎక్కువ. మద్యం మీద ఏటా రూ.5 కోట్ల ఆదాయం వొస్తుంది. రొండు ప్రాంతాల మధ్య ఆదాయాలల్ల తేడాకు ఇది ప్రధాన కారణం. తెలంగాణ స్థిర ఆదాయ వనరుల నుంచి వొచ్చే మొత్తాలను విలీనం తర్వాత ప్రస్తుతం ఆంధ్రరాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక అస్థిరతల వంటి పరిస్థితుల్ల ఉమ్మడి అభివృద్ధి పథకాలకు వెచ్చించే అవకాశం ఉందని తెలంగాణ నేతలు భయపడు తున్నరు. ప్రగతి పథంల ఉన్న తెలంగాణ ప్రాంతానికి ఈ ఏకీకరణ వల్ల పాలనాపరంగా ఎట్లాంటి లాభం ఉండదు.

377. భవిష్యత్తుల తమ ప్రాంత డిమాండ్లను విశాలాంధ్రల అంతగా పట్టించుకోరేమోననే భయం తెలంగాణ ప్రజల్ల వ్యక్తం అయితున్నది. ఉదాహరణకు నందికొండ (కృష్ణానది), కుష్టాపురం (గోదావరి నది) ప్రాజెక్టులు భారతదేశంల చేపట్టిన అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టుల కోవకు చెందినవి. అదే సమయంల ఈ రెండు నదులపై కోస్తా డెల్టాల సాగునీటి పారుదలకు ప్రణాళికలు తయారు అయితున్నయ్. అందుకే, తెలంగాణ ఈ రెండు నదులకు సంబంధించి తన ప్రాంత సొతంత్ర జలవినియోగ హక్కులను వొదులుకోవడానికి ఇష్టపడటం లేదు.

378. కోస్తాకు చెందిన ఆధునికులు దోపిడీ చేస్తరేమోనన్న అనుమానం తెలంగాణ ప్రజలల్ల ఉంది. ప్రభుత్వ ఉద్యోగాలు తమకు దక్కనీయరన్న భయాలు ఉన్నయ్. ఆంధ్రరాష్ట్రంతో కలిస్తే తమను ఆంధ్రవాళ్లకన్నా తక్కువ స్థానంల ఉంచుతరన్న అనుమానం ఉంది. విశాలాంధ్ర ఏర్పడితే ఆంధ్రా అన్నిరకాలుగా తక్షణమే లబ్ధి పొందు తుందని, వాణిజ్యరంగంల ఆరితేరిన కోస్తాంధ్రకు తెలంగాణ వలస ప్రాంతంగా మారుతుందని తెలంగాణ ప్రజలు భయపడుతున్నరు.

379. తెలంగాణ తనకు తానుగా ఒంటరిగా మనగలిగిన సుస్థిర రాష్ట్రం అయితదన్న నమ్మకం తెలంగాణ ప్రజల్ల ఉంది. ఈ ప్రాంత రెవెన్యూ వసూళ్లు రూ.17 కోట్లు. కాబట్టి కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల నిర్మాణానికి తెచ్చే భారీ అప్పులకు చెల్లించాల్సిన వడ్డీల వల్ల కొత్త (తెలంగాణ) రాష్ట్రానికి పడే లోటు భారీగా ఏమీ ఉండదని నమ్ము తున్నరు. అనుకూల పరిస్థితుల్ల ఆదాయం- ఖర్చు సమానం అయ్యే అవకాశం ఉంది. మిగులు బడ్జెట్ కూడా చూపించొచ్చనే వాదనలు ఉన్నయ్. పలు కారణాలతో దీన్ని సమర్థించవొచ్చు.

380. 1952 ఏప్రిల్ నాటి ఆర్థిక సంఘం సూచనలతో హైదరాబాద్ రాష్ట్రంల భాగమైన తెలంగాణ చెప్పుకోదగ్గ స్థాయిల లబ్ధి పొందింది. ప్రస్తుత విధానంల మాత్రమే కేంద్రం నుంచి వొచ్చే పన్నుల వాటా ఇప్పటి లెక్క గరిష్టంగా ఉంటుంది. తెలంగాణల పరిస్థితులు మెరుగుపడి నందున పోలీసు శాఖపై ఖర్చు తగ్గిస్తే, దిగుమతుల పన్ను రద్దు వల్ల ఏర్పడుతున్న లోటు భర్తీ అయితది. రాష్ట్రంల పన్ను వసూళ్ల అవకా శాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటే తెలంగాణ ప్రాంత ఆర్థిక పరిస్థితి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

హైదరాబాద్ రాష్ట్రం వాదనలు :

381. విశాలాంధ్ర ఏర్పాటు వల్ల లాభాలు స్పష్టం. కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాలను ఏకీకృత నియంత్రణ వ్యవస్థ కిందకు తేవాల్సిన అవసరం, తెలంగాణ–ఆంధ్రల మధ్య వాణిజ్య అనుబంధం, మొత్తం విశాలాంధ్ర ప్రాంతానికి రాజధానిగా హైదరాబాద్ సరి పోవడం స్థూలంగా విలీనానికి చెప్పుకోదగ్గ అనుకూల అంశాలు.

382. ఆంధ్రా మొత్తం విశాల రాష్ట్రానికి అనుకూలంగా బలంగా స్పందిస్తున్నది. తెలంగాణ ప్రజాభిప్రాయంల ఇంకా స్థిరత్వం రాలేదు. ఆంధ్రాకు చెందిన ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే నేతలు కూడా ఈ ఏకీకరణను స్వాగతిస్తున్నరు. అయితే, కలయిక స్వచ్ఛందంగా జరగాలె. తమ భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాన్ని తీసుకునే అవకాశం తెలంగాణ ప్రజలకు ఉండాలె.

383. విశాలాంధ్ర ఏర్పాటు జరిగితే తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు తగిన హామీలు ఇచ్చేందుకు ఆంధ్రరాష్ట్రం నేతలు సిద్ధంగా ఉన్నరు. ఈ హామీలు కోస్తా, సీమనేతల మధ్య కుదిరిన శ్రీభాగ్ ఒడంబడిక వంటి ఒప్పందంగా రూపొందే అవకాశం ఉంది. విశా లాంధ్రలో ఏర్పడే ప్రభుత్వోద్యోగాలల్ల కనీసం మూడో వంతు తెలంగాణ ప్రజలకు దక్కేట్లు చూడటం. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించే హామీ ఇవ్వడం వంటివి జరగొచ్చు.

384. శ్రీభాగ్ తరహా ఒప్పందం కానీ, బ్రిటన్‌లో స్కాట్లాండ్ విలీనం అయినప్పుడు ఇచ్చిన రాజ్యాంగ హామీ వంటిది గానీ తెలంగాణ ప్రజల అవసరాలను తీర్చలేవు. తెలంగాణ ప్రత్యేక అవసరాలను తీర్చే చర్యలపై కేంద్రప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణ తప్ప మరేదైనా నిరుపయోగమే. అట్లాంటి ఒప్పందాలను, ఏర్పాట్లను సూచించే బాధ్యత మాకు ప్రభుత్వం అప్పగించ లేదు.

385. మరో విషయం ఏందంటే, ఆంధ్రరాష్ట్రం ఇటీవలే ఏర్పడింది. మార్పుదశలో ఒత్తిడి నుంచి ఇంకా కోలులేదు. ఉదాహరణకు, భూ సంస్కరణల విషయంల అది ఇంకా విధానాన్ని రూపొందించు కోలేదు. ఉమ్మడి మద్రాసురాష్ట్రం నుంచి విడిపోయిన సందర్భంగా తలెత్తిన సమస్యలు ఇంకా

సమసిపోలేదు. ఈ దశల ఎంత జాగ్రత్తగా వ్యవహరించినా తెలంగాణ, ఆంధ్రా విలీనం రెండు ప్రాంతాలకు పాలనా పరమైన ఇబ్బందులు తెచ్చి పెట్టే అవకాశం ఉంది.

386. ఈ అంశాలన్నింటినీ పరిగణనలకు తీసుకొని మేం కొన్ని అవగాహనలకు వొచ్చినం. ఆంధ్ర, తెలంగాణ ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రస్తుతానికి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగించాలె. ఆంధ్రతో విలీనం అంశాన్ని 1961 సాధారణ ఎన్నికల తర్వాత ఏర్పడే హైదరాబాద్ శాసనసభ చేపట్టే వీలు కల్పించాలె. హైదరాబాద్ శాసనసభ 2/3 మెజారిటీతో విలీనానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే అప్పుడు అమలు చేయాలె.

387. ఈ ఏర్పాటుల లాభమేందంటే ఆంధ్రుల ఏకీకరణ ప్రక్రియకు ఈ ఆరేండ్లలో ఎవరూ ఆటంకాలు కల్పించకుంటే రెండు ప్రభుత్వాలు తమ పాలనా యంత్రాంగాన్ని చక్కదిద్దు కుంటయ్. కుదిరితే తమ భూమి పన్ను విధానాలను సమీక్షంచుకుంటయ్. రెండు ప్రాంతాలల్ల ఏకీకృత విధానాల కోసం ప్రయత్నం చేస్తయ్. ఈ సంధి కాలం విలీన భయాలను పారదోలేందుకు ఉపయోగపడుతుంది. రెండు రాష్ట్రాల మధ్య నిజమైన కలయికకు అవసరమైన ఏకాభిప్రాయ సాధనకు సమయం దొరుకుతుంది.

388. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నయ్. ఈ ప్రయోజనాలు వారిని మరింత దగ్గర చేస్తయని ఆశిస్తున్నం. ఒకవేళ రెండు ప్రాంతాల విలీనానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడక పోతే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగుతుంది.

389. హైదరాబాద్ రాష్ట్రం ప్రస్తుతానికి కొనసాగుతుంది. మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, మెదక్, బీదర్ జిల్లాలు, ఆంధ్రరాష్ట్రంలోని కృష్ణాజిల్లాల ఉన్న మునగాల (సంస్థానం) హైదరాబాద్ రాష్ట్రంల ఉన్నయ్.

ఫజల్ అలీ కమిషన్ నిర్మోహమాటంగా తన అభిప్రాయాలను చెప్పింది. విశాలాంధ్ర వాదనలు, తెలంగాణ వాదనలు, హైదరాబాద్ రాష్ట్ర వాదనలు పొందుపర్చింది.

అయితే ఆంధ్రా నాయకులు తెలంగాణ, హైదరాబాద్ రాష్ట్ర వాదనలు పట్టించుకోలేదు. తమకు అనుకూలమైన విశాలాంధ్ర వాదనలనే పట్టుకొని కేంద్రం

మీద వొత్తిడి పెంచింద్రు. దానికి తోడు తెలంగాణ ప్రజలను నమ్మించడానికి ప్రయత్నం చేసింద్రు. ఆంధ్రా ప్రాంత ప్రయోజనాలే లక్ష్యంగా విశాలాంధ్ర ఏర్పాటుకు కుట్రలు చేసింద్రు.

# ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీ తీర్మానాలు

తెలంగాణ, ఆంధ్ర విలీన ప్రయత్నాలు ఊపందుకోవడంతో తెలంగాణ జిల్లాల్లోని గ్రామాలల్ల నిరసనలు మొదలైనయ్. ప్రజాఉద్యమం మొదలయింది. అది రోజురోజుకు పెరిగి ప్రభుత్వ పునాదులను కదిలించే స్థితికి చేరింది.

హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మొదట విలీనాన్ని వ్యతిరేకించిండు. రెండు ప్రాంతాలను కలిపే విషయంల కూడా కులాల సమీకరణలే ప్రధానమయినయ్. సొతంత్రం వొచ్చేనాటికి తెలంగాణల కాని ఆంధ్రల కాని బ్రాహ్మణ నాయకులదే ఆధిపత్యం. అందువల్ల హైదరాబాద్ రాష్ట్ర ముఖ్య మంత్రి పదవి బూర్గుల రామకృష్ణారావుకు దక్కింది. అటు ఆంధ్రరాష్ట్రంల టంగు టూరు ప్రకాశానికి దక్కింది.

అదే సమయంల రెడ్డి నాయకులు అధికారంవైపు ఎదగడం మొదల య్యింది. రెండు ప్రాంతాల రెడ్డి నాయకులకు బ్రాహ్మణాధిపత్యం ఇబ్బందిగా మారింది. తమకు అధికారం దక్కాలంటే బ్రాహ్మణనాయకుల అడ్డును తొలగించు కోవాలని అనుకుంద్రు. వారిని బలహీన పరచడానికి ప్రయత్నం చేసింద్రు.

హైదరాబాద్ రాష్ట్ర మంత్రివర్గంల చేరిన కొండా వెంకటరంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి రెడ్డి నాయకులకు నాయకత్వం వహించింద్రు. కొండా వెంకట రంగారెడ్డి పాలనా వ్యవహారాలల్ల ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుకు సహకరించకుండ ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టిండు. ఇది ముఖ్యమంత్రికి కాలుల ముల్లులెక్క తయారైంది. కొండా వెంకటరంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి బయటికి ఆంధ్ర తెలంగాణ కలయికను వ్యతిరేకించుకుంట బూర్గులను ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టింద్రు. ముఖ్యమంత్రి బూర్గులకు, కొండా వెంకటరంగారెడ్డికి అంతర్గతంగా విభేదాలు తీవ్రస్థాయికి చేరినయ్.

ఇదే సమయంల ఆంధ్రల కూడ ఇట్లాంటి పరిస్థితే నెలకొన్నది. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వంల ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం తర్వాత స్థానమైన ఉప ముఖ్యమంత్రి

పదవిని చేపట్టిన నీలం సంజీవరెడ్డి అరాచకవాదిగా తయారైండు. ప్రకాశంను నిద్ర పోనియ్యకుండా చేసిండు. ముఖ్యమంత్రిని నామమాత్రుడిని చేసిండు. అధికారమంత తనే చెలాయించిండు. ముఖ్యమంత్రి కుర్చీల కూడా నీలం సంజీవరెడ్డి కూచున్నడు. అసలు ముఖ్యమంత్రి ప్రకాశంను గింత ఖాతరు చేయలేదు. దీనికంతటికి కారణం బ్రాహ్మణ ఆధిపత్యాన్ని దెబ్బకొట్టి తను అధికారంలకు రావాలన్న ఆరాటమే.

ఈ పరిస్థితి, తెలంగాణ, ఆంధ్ర రెడ్డినాయకుల మధ్య సంబంధాలను ఏర్పర చింది. ఆంధ్రానాయకుడు నీలం సంజీవరెడ్డి రొండు ప్రాంతాల కలయికను బలంగా వినిపించిండు. తెలంగాణకు చెందిన కొండా వెంకటరంగారెడ్డి విశా లాంధ్ర ఏర్పాటును వ్యతిరేకించిండు. అయినా రొండు ప్రాంతాలకు చెందిన ఈ ఇద్దరు రెడ్డి నాయకుల మధ్యన లోపాయకారి అవగాహన కుదిరింది.

విశాలాంధ్ర ఏర్పాటుతోనే రొండు ప్రాంతాలల్ల బ్రాహ్మణాధిపత్యం తగ్గుతదని, రెడ్డి నాయకులకు అధికారం దొరుకుతదని ఈ అవగాహన సారాంశం. ఈ విషయంల చెన్నారెడ్డి అత్యుత్సాహం చూపిండు

ఈ పరిస్థితిల ఆంధ్ర బ్రాహ్మణనాయకులు అయ్యదేవర కాళేశ్వరరావు, కళా వెంకటరావు హైదరాబాద్ వొచ్చింద్రు. ముఖ్యమంత్రి రామకృష్ణారావు చెవుల జొర్రీగల లెక్క చేరింద్రు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితె రెడ్డినాయకులు బూర్గులకు ముఖ్య మంత్రి పదవి దక్కనియ్యరని ఊదరగొట్టింద్రు.

ఇంటాబయటా ఇట్లాంటి పరిస్థితులు ఏర్పడటంతో బూర్గుల రామకృష్ణారావు మనస్తాపం చెందిండు. రెడ్డి నాయకులు తెలంగాణ భవిష్యత్‌ను రాజకీయం చేయడం ఆయనను కలచివేసింది. నిస్సహాయత, నిర్లిప్తతతో తటస్థ వైఖరి తీసుకుండు.

ఇంతకుముందే ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీ తెలంగాణకు రక్షణలు కల్పిస్తూ రొండు సార్లు తీర్మానాలు చేసింది. టంగుటూరి ప్రకాశం తర్వాత ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి అయిన బెజవాడ గోపాలరెడ్డి 1955 నవంబర్ 5న అసెంబ్లీల తీర్మానం చేసిండు. ఈ తీర్మానంలోని మూడవపేరాలో తెలంగాణకు ఏకపక్షంగా రక్షణలు కల్పిస్తమని హామీ ఇచ్చిండు.

ఆంధ్ర అసెంబ్లీల ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి చేసిన తీర్మానం ఇది :

'తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో ప్రయత్నిస్తం. కొన్ని ప్రాధాన్యతలు, రక్షణలు తెలంగాణ ప్రాంత అభివృద్ధి కోసం ఇయ్యటానికి అంగీకరిస్తం. విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పిస్తం.

తెలంగాణ ప్రజలు ఎటువంటి భయసంకోచాలు పెట్టుకోవలసిన అవసరం లేదు. తెలంగాణ జనాభా ప్రాతిపదికన ఆ ప్రాంత ప్రజలు ఉద్యోగాలల్ల చేరేందుకు రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది. తెలంగాణ ప్రజలకు చెందవలసిన ఇతర అంశాలలోనూ రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంది. తెలంగాణ ప్రజల వాటాకు ఎటువంటి కొరత కలగదు.

తెలంగాణ ప్రజలను ఔదార్యంతో చూసుకుంటం. తెలంగాణ ప్రజలకు  కావలసిన అవకాశాలను కల్పించడంలో ఈ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ఇది తెలంగాణ ప్రజలు చేస్తున్న డిమాండుకు స్పందన కాదు. ఈ శాసనసభల ఉన్న అన్ని పక్షాలు కలిసి ఏకాభిప్రాయంతో, ఒకే గొంతుతో ఈ తీర్మానం ద్వారా హామీ ఇస్తున్నం.'

ఆంధ్రరాష్ట్ర ఉపముఖ్యమంత్రి నీలంసంజీవరెడ్డి కూడ 1956 ఫిబ్రవరి 1న మరో తీర్మానం చేసిండు. తెలంగాణ ప్రజల ఉద్యోగాలకు ఎటువంటి నష్టం చేయమని, అన్ని అవకాశాలు న్యాయబద్ధంగ కల్పిస్తమని నిండు అసెంబ్లీల తీర్మా నించిండు.

ఆంధ్ర అసెంబ్లీల ఉపముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి చేసిన ఆ తీర్మానం ఇది :

'విద్యాపరంగా ముందున్న ఆంధ్రప్రాంతీయులు తమ ప్రాంతంల గల ఉద్యోగ అవకాశాలన్నింటిని పట్టుకొని, తమకు అవకాశాలు లేకుండా చేస్తరేమోనన్న అనుమానాలు, భయాలు తెలంగాణ వారికి  ఉన్నట్టు కనిపిస్తున్నది. ఈ సభాముఖంగా నేను ఒక విషయాన్ని స్పష్టం చేయదలచుకున్న. మేము మీ వాటా ఉద్యోగాలల్ల ఎటువంటి భాగం కోరము. మేము మీ వాటా అయిన మూడింట ఒక వంతు (1/3) ఉద్యోగాలను ముట్టుకోమని హామీ ఇస్తున్నం. ఈ హామీ వ్యక్తిగత హోదాలోనే కాదు, ఈ శాసనసభ, ప్రభుత్వాల తరఫున కూడా ఇయ్యబడు తున్నది.'

తెలంగాణ ప్రజల భయాలను తొలగించడానికి ఆంధ్రశాసనసభ ఏకగ్రీవంగా చేసిన రెండు తీర్మాన ప్రతులను ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు సంకనపెట్టుకొని ఢిల్లీకి పోయింద్రు. ప్రధానమంత్రి నెహ్రూ, విదేశీయాంగ మంత్రి గోవింద వల్లభ పంత్ వంటి జాతీయనాయకులను కలిసి పాడినపాటే పాడింద్రు. చిట్ట చివరికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించ గలిగింద్రు.

ఆ తర్వాత 1955 నవంబర్ 25న ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీ తెలంగాణల విలీనం చేయడానికి తీర్మానం చేసింది. అంటె తెలంగాణ ప్రజల, నాయకుల ఇష్టంతో పని

లేకుండనే హామీల తీర్మానాలు, విలీన తీర్మానాన్ని చేసింద్రు. వొద్దువొద్దని తెలంగాణ నాయకులు, ప్రజలు నెత్తి నోరు కొట్టుకుంటున్నా బలవంతపు సమైక్యతకు రంగం సిద్ధం చేసింద్రు. తమ ప్రయోజనాల కోసం తెలంగాణను బలితీసుకోవడానికి ఆంధ్ర నాయకులు తయారైంద్రు.

# విలీనంపై నెహ్రూ ప్రకటన

తెలంగాణ ప్రజల అమాయకత్వం, ఆంధ్రనాయకుల లాబీయింగ్ ఫలితంగా కాంగ్రెస్ జాతీయనాయకత్వం ఆంధ్ర తెలంగాణ విలీనానికి సుముఖత వ్యక్తం చేసింది. ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కూడా విశాలాంధ్ర ఏర్పాటుకు అంగీకరించిండు. ఈ నేపథ్యంల 1956 మార్చి 5న నెహ్రూ నిజామాబాద్ జిల్లాల భారత్ సేవక్ సమాజ్ ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యిండు. ఈ సభల మాట్లాడుకుంట ఆంధ్ర, తెలంగాణ విలీనం చెయ్యడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని చెప్పిండు. ఈ సందర్భంగా ఆయన ఒక వ్యాఖ్య కూడ చేసిండు.

> 'కలిసి ఉంటే పొంతన కుదరకపోతే, ఆలుమగలు విడాకులు తీసుకున్నట్లే కొంతకాలం తర్వాత రెండు ప్రాంతాలు మల్లా విడిపోవచ్చు'

ఆంధ్రనాయకుల ఒత్తిడివల్లనే ఈ నిర్ణయం తీసుకోవలసి వొచ్చిందన్న ధ్వని ఆయన మాటల్ల వినిపించింది. విలీనం విషయంల ఆయన మరో రెండు వ్యాఖ్యలు కూడ చేసిండు.

> 'అమాయకపు పిల్లను తుంటరి పిలగానితో పెళ్లి చేస్తున్నం'

తెలంగాణను అమాయకపు పిల్లతోను, ఆంధ్రను తుంటరి పిలగానితోను పోల్చిండు. దీన్నిబట్టి నెహ్రూ ఇష్టం లేకుండా అన్యమనస్కంగనే విలీనం నిర్ణయం తీసుకున్నడని అర్థం అయితది.

1953 అక్టోబర్‌ల మీడియా ప్రతినిధులతో మాట్లాడకుంట మరో వ్యాఖ్య కూడా నెహ్రూ చేసిండు.

> 'విశాలాంధ్రవాదన వెనుక దురాక్రమణ ఉద్దేశం, ప్రేరిత సామ్రాజ్యవాద తత్వం దాగి ఉంది'.

నెహ్రూ చేసిన ఈ వ్యాఖ్య 1953 అక్టోబర్ 17న ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌ల ప్రచురణ అయింది. ఇన్ని తెలిసి కూడ ప్రధాని నెహ్రూ తెలంగాణ మెడకు ఉరితాడు పేనిండు.

నెహ్రూ ప్రకటనతో విలీనానికి రంగం సిద్ధమైంది. అప్పటికి ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీ విలీనానికి సంపూర్ణ మద్దతు తెలిపింది. ఆంధ్ర కాంగ్రెస్, కమ్యూనిస్టు నాయకులు అందరు హైదరాబాద్ మీద కన్నేసి ఉండటం కారణం. అదీ కాకుండా గుడారాలల్ల రాజధాని నడుస్తుండటం వారికి ఇబ్బందిగా, అవమానకరంగా ఉంది. దాంతో ఆంధ్ర అసెంబ్లీ సంపూర్ణ మద్దతు తెలిపింది.

175 మంది శాసన సభ్యులున్న హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీల కూడా విశా లాంధ్ర ఏర్పాటుపై చర్చ జరిగింది. 1955 నవంబర్ 25న ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ఈ చర్చను మొదలుపెట్టిండు. 147 మంది సభ్యులు మాట్లాడింద్రు. వీరిలో తెలంగాణ ప్రాంత సభ్యులతో పాటు మరాఠ్వాడా, కన్నడ ప్రాంతాలకు చెందిన సభ్యులు కూడా ఉన్నరు. నిజానికి తెలంగాణ, ఆంధ్ర విలీనంపై మరాఠ్వాడా, కన్నడ ప్రాంత సభ్యుల అభిప్రాయం అవసరం లేదు.

మరాఠ్వాడా ఐదు జిల్లాలకు 44 మంది శాసనసభ్యులు, కన్నడ మూడు జిల్లాలకు 36 మంది సభ్యులు. విలీనంతో సంబంధం లేని ఈ రెండు ప్రాంతాల శాసన సభ్యులే 80 మంది ఉన్నరు. వీరు పోను తెలంగాణ ప్రాంతం నుంచి 67 మంది సభ్యులు మాట్లాడింద్రు. ఈ 67 మందిల కూడా 40 మంది శాసన సభ్యులు పిడిఎఫ్ వాళ్లు. పిడిఎఫ్ అంటె కమ్యూనిస్టుల మరోరూపం.

అప్పటికే కమ్యూనిస్టు పార్టీ పేరుతో ఈ ఎమ్మెల్యేలంతా ఆంధ్రా కమ్యూ నిస్టులతో సంబంధాలు కలిగి ఉన్నరు. సాయుధపోరాటం సమయంల ఆంధ్ర నాయ కులు సహకారం పేరుతో దోస్తానా చేసింద్రు. స్నేహం పేరుతో ఆంధ్రా నాయకులు నెత్తిన కూచున్న సంగతి తెలుసుకునే సోయిల తెలంగాణ నాయకులు లేరు. కమ్యూనిస్టు అనే మాటతో ఒళ్లుతెలవకుండ ఊగిపోయి ఆంధ్రనాయకుల తోకలు పట్టుకొని తిరిగింద్రు.

తెలంగాణ నాయకుల ఈ బలహీనతను ఆంధ్రా కమ్యూనిస్టులు ఆసరాగా చేసుకొని విశాలాంధ్రకు విషబీజాలు నాటింద్రు. పార్టీ పేరుతో తెలంగాణ నాయ కులను ఆడించింద్రు. ఈ బలహీనతతోనే ఆంధ్ర కమ్యూనిస్టు నాయకులను నమ్మి, వారి మాటలు విని తెలంగాణ పిడిఎఫ్ శాసనసభ్యులు తెలంగాణ గొంతు కోసే విశాలాంధ్ర ప్రతిపాదనకు మద్దతు తెలిపింద్రు. ఇది ఆంధ్ర కమ్యూనిస్టులు తెలంగాణ ప్రజలకు చేసిన చారిత్రిక ద్రోహం.

అట్లనే కాంగ్రెస్ శాసనసభ్యుల సంగతి. సాక్షాత్తు ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూనే విలీనానికి అంగీకరించడం, వారి మీద ప్రభావం చూపింది. అధిష్ఠానం

మాట కాదనలేని బలహీనత. అంతేకాకుండా తెలంగాణల రైతాంగ సాయుధ పోరాటం పేరుతో కమ్యూనిస్టులు విస్నూరుగడీ చుట్టు చేసిన పోరాటం వారికి ఇబ్బందిగా మారింది. తెలంగాణ ప్రత్యేకంగా ఉంటే ఈ కమ్యూనిస్టుల ఆగడాలు ఎక్కువైతయని, అవి తమ ప్రాంతానికి కూడా విస్తరించే అవకాశముందని భావించిండ్రు. అందువల్ల విశాలాంధ్ర ఏర్పడితే కమ్యూనిస్టు పార్టీ బలహీనపడు తుందని భావించిండ్రు. అప్పటికే ఆంధ్రల 1955ల జరిగిన ఎన్నికలల్ల కమ్యూ నిస్టులు 15 శాసనసభ స్థానాలకు పడిపోవడం వారికి కనిపించింది. విశాలాంధ్ర ఏర్పడితే తెలంగాణల కూడ ఆ పార్టీ బలహీనపడి తమ తలనొప్పి పోతుందని భావించిండ్రు. కాని ఆంధ్రనాయకుల దోపిడీ మనస్తత్వాన్ని గుర్తించలేకపోయిండ్రు. అందుకనే హైదరాబాద్ అసెంబ్లీల తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులు కొంత అనుకూలత చూపిండ్రు. ఇక సోషలిస్టు పార్టీ వాళ్లు కొందరు మద్దతు తెలిపిండ్రు. సొతంత్ర అభ్యర్థులల్ల ఒకరిద్దరు అనుకూలంగా మాట్లాడిండ్రు.

శాసనసభల 147 మంది అభిప్రాయాలు చెప్పినా గట్టిగా వారు విలీనాన్ని సమర్థించిండ్రు అనలేము. ఎందుకంటే ఓటింగు జరుగలేదు. శాసన సభ్యులు విలీనం పై చర్చల లాభ నష్టాల గురించి మాట్లాడిండ్రు. అభిప్రాయం చెప్పడం సమర్ధించడం కాదు. ఓటు వేసినప్పుడే సభ్యుడు అనుకూలమా వ్యతిరేకమా అనేది స్పష్టంగా చెప్పడానికి అవకాశముంటది.

చర్చలో కెవి రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి మరికొంతమంది నాయకులు విశాలాంధ్రను వ్యతిరేకించిండ్రు. విలీనం జరిగితే తెలంగాణ నష్టపోతుందని అన్నరు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ కొనసాగాలని కోరిండ్రు.

తెలంగాణకు మద్దతు తెలిపిన నాయకులు ఆ తర్వాత ఒక బృందంగ ఢిల్లికి పోయి అప్పటి హోంమంత్రి గోవింద వల్లభ్‌పంత్‌ను కలిసిండ్రు. రొండు ప్రాంతాల మధ్య రాజకీయ, సాంస్కృతిక పరంగా భిన్నత్వం ఉందని చెప్పిండ్రు. ఈ సందర్భంగ విశాలాంధ్ర వెనక దురాక్రమణ ఉద్దేశ ప్రేరిత సామ్రాజ్య వాద తత్వం దాగి ఉందన్న నెహ్రూ మాటలను యాది చేసిండ్రు.

బూర్గుల రామకృష్ణారావు కూడ తెలంగాణ విలీనానికి అయిష్టంగ ఉన్నడు. నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు యుఎన్ థేబర్‌కు ఆయన రాసిన లేఖల ఆ విషయాన్ని ప్రస్తావించిండు. ఫజల్ అలీ కమిషన్ (ఎస్ఆర్‌సి) తన నివేదికను 1955 సెప్టెంబర్ 30న కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. కేంద్రం ఆ నివేదికను 1956 జనవరి 16న ప్రకటించింది. ఈ ప్రకటన తర్వాత అంటే 1956 జనవరి 16, ఫిబ్రవరి 20

మధ్యకాలంల బూర్గుల రామకృష్ణారావు థేబర్‌కు లేఖ రాసిండు. దానిలో విలీనానికి తను వ్యతిరేకమని, విలీనం తెలంగాణ ప్రజలకు మేలుచేయదని భావిస్తున్నట్లు రాసిండు.

బూర్గుల రామకృష్ణారావు 'కాన్ఫిడెన్షియల్' అంటూ రాసిన ఉత్తరం ఇది:

ప్రియమైన థేబర్ భాయ్‌కి,

ఇప్పుడు మీకు నేను రాస్తున్న ఈ లేఖ ఒక మధ్యంతర రిపోర్టు వంటిది. భార్గవరావు రేపు విమానంల ఢిల్లీకి పయనమవు తున్నరు. ఈ స్థితిల సమయం మించి పోకూడదని భావించి నేను మీకు రాస్తున్న. నిన్న, ఈ రోజు నా వ్యక్తిగత హోదాల అనేక మందిని కలిసే సదవ కాశం నాకు లభించింది. ఈరోజు ఉదయం నేను, భార్గవ హైదరాబాద్ చుట్టు పక్కల పల్లెలల్ల చిన్నపాటి పర్యటన చేసినం. ప్రజల అభిప్రాయాలు ఇవి అని కచ్చితంగా చెప్పే స్థితిలేదు. అదంత సులభం కాదు. మాకు తగినంత సమయం కూడా లేదు. తొందర ఉండడంవల్ల దొరికిన సమయంలనే తెలుసుకో గల్గింది తెలుసుకునే యత్నం చేసినం. ఈ పరిమితుల నేపథ్యంల నాకు అర్థమైన రీతిల నా అంచనాను మీ ముందు ఉంచుతున్న.

తెలంగాణల ఈ ప్రధాన ప్రశ్న (ఆంధ్ర, తెలంగాణల కలయిక) పట్ల చెప్పుకోదగిన ఆందోళన ఉన్నది అన్న మాటల సందేహమేమీ లేదు. చెప్పుకోదగింది అని నేను అంటున్న నంటే అది మనం బాంబేల చూసినటు వంటిది కాదని అర్థం చేసుకోగలరు. ఈ ప్రాంతంల ఆందోళన మొత్తం ప్రావిన్సుల అంతా వ్యాపించింది. కేవలం నగరాలకు పరిమితం కాలేదు. తెలంగాణ ప్రజల అభిప్రాయాలపై నా అంచనా ఏమంటే అత్యధికులు తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంగా ఉండాలనే కోరుకుంటున్నరు అని. అయితే బలమైన వర్గ మొకటి విశాలాంధ్రకు అనుకూలంగా ఉంది. కానీ అధికసంఖ్యాకులు నిర్ణయాత్మకంగా, తెలంగాణ, ఎస్ఆర్‌సిల సూచించినట్టు ప్రత్యేక రాష్ట్రంగా ఉండాలని కోరుతున్నరు. ఈ అంశానికి సంబంధించిన అభిప్రాయాలు ఎట్ల విభజితమై ఉన్నయన్న వివరాలను మీకు మరింత విపులమైన రిపోర్టుల బాంబే నుండి పంపిస్త. ఏది ఏమైనా మెజారిటీ ప్రజల అభిప్రాయం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఉండటం వైపు మొగ్గు చూపుతూ ఉన్నరన్న విషయంల ఎవరూ ఎటువంటి అనుమానం పెట్టు కోవలసిన పనిలేదు.

నేను ఇప్పుడు సంక్షిప్తంగా ఈ పరిస్థితిలోని బాగోగులను వివరిస్త. విశాలాంధ్రకు మద్దతునిస్తున్నవారు కింది ఆధారాలతో వాదిస్తున్నరు.

భాషాప్రయుక్త విభజన జరగకపోయి ఉంటే హైదరాబాద్ రాష్ట్రం అట్లాగే ప్రత్యేకరాష్ట్రంగా ఉండడాన్ని వ్యతిరేకించే అవసరం ఉండేదికాదు. కానీ ఇప్పుడు భాషాపరంగా ఈ రాష్ట్రం ముక్కలైంది. కన్నడిగులు, మరాఠీ భాషీయులు విడిపోయింద్రు. ఆ యా రాష్ట్రాలలో కలిసింద్రు. అదే తర్కం అనుసరిస్తూ తెలుగు ప్రాంతాలు ఆంధ్రతో కలిసిపోవాలె.

విశాలాంధ్ర నినాదం చాలాకాలం నుంచి ఉన్నది. దానికి కొంత ఉద్వేగాన్ని ఉసిగొల్పే శక్తి ఉన్నది. హైదరాబాద్ రాష్ట్రంల ఆ కోరిక భూస్వామ్య శక్తుల నుండి బయటపడటం అన్న వ్యక్తీకరణగా ఉన్నది. అందుకే విశాలాంధ్ర అనుకూలవాదన చేసేవారు, (ఆ నూతన నిర్మాణం) వారి ఆశలను తీర్చగలదని భావిస్తున్నరు.

సాంస్కృతిక సమైక్యవాదులు, పక్కన పక్కన జీవిస్తున్న రొండు ప్రాంతాల తెలుగువారు ఒక్క రాష్ట్రంగా రూపొందాలంటున్నరు. వారికి ఉమ్మడి రాష్ట్రంల అనేక సాంస్కృతిక అనుకూలతలు కనిపిస్తున్నయ్. ఈ వాదన ఎంతో భావోద్వేగ పూరితమైంది. సాహిత్యకారులు ఈ అభిప్రాయానికి ఎంతో ప్రాధాన్యత నిస్తున్నరు.

పెద్దరాష్ట్రంల పాలనాపరమైన వ్యయం తగ్గుతుంది. ఒకే పనిని అనవసరంగా మల్లా మల్లా చేయటం తప్పుతుంది. ఈ అభిప్రాయాలు విశాలాంధ్రకు ఎంతో అనుకూలమైన వాదనలు. ఒక గవర్నరు, ఒక హైకోర్టు, ఒక పబ్లిక్ సర్విస్ కమిషన్, ఇట్లా అనేక శాఖలను తగ్గించవచ్చు. కేవలం రొండు రాష్ట్రాలు ఉండటం వల్ల మనుగడ సాగిస్తున్న శాఖలను తగ్గించవచ్చు.

పెద్దరాష్ట్రంల పారిశ్రామిక వికాసానికి అవకాశాలు ఎక్కువ వంటి వాదనలు. ఇటువంటి అంశాల జాబితా కేవలం ఉదహరించేందుకు ఇచ్చిన. ఇట్లాంటి వాదనలు అనేకం ఉన్నయ్.

తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతిపత్తి కోసం తీవ్రంగా ఆందోళన చేస్తున్నవారు కింది విధంగా భావిస్తున్నరు.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత విశాలాంధ్ర భావోద్వేగం తగ్గిపోయింది. తెలంగాణ అనే ప్రత్యేక తెలుగురాష్ట్రం రూపొందించడం

ద్వారా ఆ భావోద్వేగం అంతరిస్తుంది. తెలంగాణను తమతో కలుపుకోవాలనే బలమైన ఉద్యమమేమీ లేదు. కానీ తెలంగాణ మాత్రం బలంగా ప్రత్యేకంగా ఉండగోరుతున్నది, ఆంధ్రల కలవకూడదని ఉద్య మిస్తున్నది (strong agitation).

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఎవరికీ ఎటువంటి నష్టాన్ని కలిగించదు. విశాలాంధ్రవాదులు, భావోద్వేగవాదులు కొంత బాధ పడుతుండవచ్చు కానీ దానికి వ్యతిరేకంగా ఉద్యమాలు రావు. ఇందుకు భిన్నంగా తప్పనిసరిగా తెలంగాణను ఆంధ్రతో కలిపితే తెలంగాణకు కడుపుమంటగానూ, ఆంధ్రులకు అప్రయోజనంగానూ ఉంటుంది.

గత 175 సంవత్సరాల వేర్పాటు వల్ల తెలంగాణావారు తెలుగువారై నప్పటికీ తమదైన ప్రత్యేక జీవన విధానాన్ని రూపొందించుకున్నరని భావిస్తున్నరు. ఆంధ్ర ప్రాంతపు తెలుగువారి జీవనశైలికంటే ఇది అనేక రీతుల భిన్నమైంది. తెలంగాణలో ఆంధ్రల లేని సాంస్కృతిక బాహుళ్యత (cosmopolitanism) ఉన్నది. కలయిక జరిగితే ఈ ప్రత్యేక జీవన విధానం భగ్నమైపోతుందని వారు భయపడుతున్నరు. అందుకే వారు ఆందోళన చెందుతున్నరు.

తెలంగాణల చాలామంది ప్రజలు ఉర్దూ తెలిసిన, మాట్లాడ గల్గిన వారు. వొంద సంవత్సరాలకుపైగా వారి జీవితంల ఉర్దూ ప్రాధాన్యత ఉన్నది. పాలన ఆ భాషల సాగింది. రికార్డులు ఉర్దూల నిర్వహించింద్రు. న్యాయస్థానాలల్ల వ్యవహారాలు ఉర్దూల సాగుతున్నయ్. న్యాయవాదులు ఇతరులు తమ వ్యవహారాలు ఉర్దూల నిర్వహిస్తున్నరు. ఆంధ్రతో కలయిక సహజంగానే వారి జీవితాల నుంచి ఉర్దూను తీసివేస్తుందని వారు భయపడుతున్నరు. దీన్ని వారు ఇష్టపడటం లేదు.

ఆంధ్రతో పోలిస్తే తెలంగాణ విద్యాపరంగా వెనుకబడి ఉంది. ముఖ్యంగా ఇంగ్లీషు చదువుల తెలంగాణవారు వెనుకబడి ఉన్నరు. ఇంగ్లీషు చదువుకు కావలసిన సదుపాయాలు దాదాపు లేనే లేవు అనొచ్చు. ఉన్నవి కేవలం అరకొర వసతులే. అందువల్ల పెద్ద రాష్ట్రంల ప్రభుత్వ ఉద్యోగాలు, తమకు లభించే అవకాశమే లేదని తెలంగాణవారు భావిస్తున్నరు. ఆంధ్రప్రాంతంల వేలమంది గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు ఉన్నరు. తెలంగాణ ప్రాంతంల వందల సంఖ్యల కూడా లేరు. ఉన్న కొద్దిమంది

హైదరాబాదు రాష్ట్రంల ఎటువంటి రక్షణలిచ్చినా ఉమ్మడిగా రూపొందే రాష్ట్రంల ఈ అసమతౌల్యం సరియయ్యే అవకాశం తక్కువ.

ఆర్థికంగా కూడా విశాలాంధ్ర వల్ల తెలంగాణవారు నష్టపోతరన్న భయం ఉంది. సగటున గమనిస్తే తెలంగాణ ప్రాంత ప్రజలు పేదవారు, వాళ్ల దగ్గర దాచుకున్న సొత్తు ఉండే అవకాశం చాలా తక్కువ. ఆంధ్రుల దగ్గర మిగులు ఉంది. వారు వసతి గలవారుగా ఉన్నరు. అందువల్ల విశాలరాష్ట్రం ఏర్పడిన వెంటనేభూమి కొనుగోళ్లు చిన్న, పెద్ద వాణిజ్య లావాదేవీలు విషయంల తాము నష్టపోతమని తెలంగాణవారు భయ పడుతున్నరు. ఆంధ్రప్రాంతపు తెలుగువారు తెలంగాణ ప్రాంత తెలుగు వారిని ఆర్థికంగా దోచుకునేందుకు అవకాశం వస్తే ఎటువంటి సందేహం చూపరని తెలిపే ఉదాహరణలు అనేకం తెలంగాణవారి వద్ద ఉన్నయ్. ఇది తెలంగాణవారి మరో పెద్ద భయం.

భాష ఒక్కటి అయినప్పటికీ ఇరుప్రాంతాల తెలుగువారి మధ్య ప్రేమ అభిమానాలు వెల్లి విరియలేదు. పరస్పర అయిష్టతకు పెద్ద ఉదాహరణ, రజాకారు ఉద్యమనాళ్లలో, హైదరాబాద్ రాజ్య విలీనం తరువాత ఆంధ్రప్రాంత ఉద్యోగులు చూపిన ప్రవర్తన. తెలంగాణవారు అనడ మేమిటంటే, విలీన సమయంల మరాఠీ, కన్నడ అధికారులు సహృదయంతో వర్తించగా, ఆంధ్రప్రాంత అధికారులు చాలా దురు సుగా, ఎటువంటి పట్టువిడుపులు లేకుండా ప్రవర్తించిండ్రు. దీనివల్ల చేదుజ్ఞాపకాలు మిగిలినయ్. ఇవన్నీ తెలంగాణ ప్రజల ఆలోచనల్ల తాజాగా ఉన్నయ్. అందువల్ల వారు తమ ఆంధ్రప్రాంత సోదరుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడి జీవించదలచుకోలేదు.

కమ్యూనిస్టులు, మతవాదులు, ఇటువంటి సందర్భంల విశాలాంధ్ర గురించి ఏకస్వరంతో మాట్లాడుతున్నరు. అయితే మిగతావారికి మాత్రం ఇటువంటి కలయిక ద్వారా ఇరువైపుల ప్రజలకు సంతోషం కలిగించ గలదన్న విషయంపై అనేక అనుమానాలు ఉన్నయ్. వారి దృష్టిల మత వాదులు, కమ్యూనిస్టులు రాజకీయ క్రీడ ఆడుతున్నరు. ఈ రెండు శక్తులు విశాలాంధ్రకు మద్దతునివ్వడంల నిజాయితీతో లేరు.

ఎస్ఆర్సిల పేర్కొన్న విధంగా తెలంగాణను ఇవ్వడం సరైందని భావిస్తున్నవారు ఆ చర్య సబబు అయిందే అని తెలిపేందుకు ఎటువంటి

పరీక్షకైనా సిద్ధమంటున్నరు. వారి అభిప్రాయం ప్రకారం ఇటువంటి పరీక్ష ఏదైనా చాలా పెద్ద మెజారిటీ తెలంగాణీయులు తెలంగాణను ఆంధ్రతో కలపడాన్ని వ్యతిరేకిస్తున్నరు. ఒకవేళ ఈ ఒక అంశం ప్రాతి పదికగా ఎన్ని కలు జరిగితే మతవాదులకూ, కమ్యూనిస్టులకు ఇతర విశాలాంధ్ర మద్దతు దారులకు ఒక్క సీటు కూడా దక్కదు.

నేను నేటి స్థితిలోని బాగోగులు కొన్నింటిని రేఖామాత్రంగా పరిచయం చేసిన. నేను నా అభిప్రాయాన్ని ఇప్పుడే చెప్పడం తప్పు అని భావిస్తున్న. ఈ అంశంపై నేను ఎటు వంటి దృఢాభిప్రాయం రూపొందించుకున్న స్థితిల లేను. నేను ఎటువంటి పక్షపాతం లేకుండా రెండు వైపుల వాదనలనూ వివరించిన. ఈ అంశానికి సంబంధించి కూలం కషమైన వివరణను నా పూర్తి సమీక్ష తరువాత బొంబే నుంచి రాస్త.

ఏది ఏమైనా, ఒక విషయం మాత్రం చెప్పగలను. తెలంగాణ ప్రత్యేక యూనిట్‌గా ఉంచిన తరువాత కూడా ఉమ్మడి అంశాల విషయంల ఉమ్మడి పాలనాయంత్రాంగం ఉండడం నష్టం అనుకుంటున్నరు. ఉదాహరణకు గవర్నర్, హైకోర్ట్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ రెండు ప్రాంతాలకు ఒకటే ఉండవచ్చు. నేనిది రాస్తున్నా అంతిమంగ పార్టీ హైకమాండ్ నిర్ణయానికి లోబడే ఉంటనని తెలుపుతున్న.

గౌరవాభినందనలతో

– రామకృష్ణారావు

హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ లేఖల తెలంగాణ ప్రజల అభి ప్రాయాన్ని రాసిండు. వారు ప్రత్యేక రాష్ట్రంగా ఉండటానికే ఇష్టపడుతున్నరని చెప్పిండు. అయినా ఒక బలమైన వర్గం అంటే కమ్యూనిస్టులు విశాలంధ్ర ఏర్పాటును కోరుకుం టున్నదని రాసిండు. సాయుధ పోరాటం నాటి భావోద్వేగాలు తాత్కాలిక మైనయని అభిప్రాయపడ్డడు. ఒక వేళ విశాలాంధ్ర ప్రాతిపదికన తెలంగాణల ఎన్నికలు జరిగితె కమ్యూనిస్టులకు ఒక్క సీటు కూడా రాదని తేల్చిచెప్పిండు. విశాలాంధ్ర ఆంధ్రోళ్ల కుట్రే కాని తెలంగాణ ప్రజల ఇష్టం కాదని చెప్పిండు.

హైదరాబాద్ అసెంబ్లీల చర్చించిన సుమారు ఒక నెలకు 1955 డిసెంబర్ 23న లోక్‌సభల కూడా తెలంగాణ మీద చర్చ జరిగింది. ఈ సందర్భంగా పిడిఎఫ్ నుంచి ఎన్నికయిన తెలంగాణ పార్లమెంటు సభ్యులు జయసూర్య, రావి నారాయణరెడ్డి,

బద్దం ఎల్లారెడ్డి ఆంధ్రా తెలంగాణ విలీనాన్ని సమర్థించిండ్రు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మాత్రం నోరు తెరవలేదు.

ఈ సందర్భంగా సోషలిస్టు పార్టీ నుంచి ఎన్నికయిన ఆదిలాబాద్ పార్ల మెంటు సభ్యుడు సి. మాధవరెడ్డి విలీనాన్ని గట్టిగ వ్యతిరేకించిండు. ముక్కోటి తెలుగు ప్రజలు కలిసుండాలని ఆంధ్రానాయకులు కోరుకోవడాన్ని అభినందించు కుంటనే తెలంగాణ ప్రజల అభిప్రాయాన్ని కూడా ఆ ప్రాంత నాయకులు గౌరవిం చాలని అన్నడు. తెలంగాణ ప్రజలు తెలంగాణ రాష్ట్టాన్ని కోరుకుంటున్నరని చెప్పిండు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా విలీనం చేసినా భవిష్యత్తుల ఇబ్బందు లొస్తయని అన్నడు. ఆంధ్రోళ్లు హైదరాబాద్‌ల ప్రశాంతంగా ఉండలేరని కుండ బద్ధలు కొట్టిండు.

అయినా నెహ్రూ ప్రభుత్వం రెండు ప్రాంతాలను కలుపడానికి మొగ్గు చూపింది. పైగా రెండు ప్రాంతాల మధ్య నమ్మకం కలిగించడానికి పూనుకుంది.

# పెద్దమనుషుల ఒప్పందం

ప్రధాని నెహ్రూ 1956 మార్చి 5న నిజామాబాద్‌ల తెలంగాణ ఆంధ్ర విలీన ప్రకటన చేసిన తర్వాత, 1956 మార్చి 8న ఆంధ్రప్రభ పత్రికల నార్ల వెంకటేశ్వరరావు సంపాదకీయం రాసిండు. దాంట్లె ఆయన చెప్పింది ఏందంటే... కెవి రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జెవి నరసింగరావు విలీన ప్రకటనను స్వాగతించుకుంటనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగ ఉండాలని పట్టుదలగ ఉన్నరు. హైదరాబాద్ రాష్ట్రంలోని కన్నడ, మహారాష్ట్ర జిల్లాలను ఆయా భాషా రాష్ట్రాలల్ల కలపొచ్చు, కాని ప్రత్యేక సంస్కృతి ఉన్న తెలంగాణను మరో రాష్ట్రంల కలపాల్సిన దుస్థితి లేదు. అంతకు కావాలంటె ఫజల్ అలీ కమిషన్ సూచన ప్రకారం ఐదేండ్ల తర్వాత ఆలోచించ వచ్చు. వెంటనే మాత్రం విలీనం చెయ్యకూడదు. అట్లాంటి ప్రయత్నాలకు వారు వ్యతిరేకంగా ఉన్నరు.

ఇక్కడ నిజాం మీద, తెలంగాణ మీద ఒక కుట్ర కూడా జరిగింది. భారత ప్రభుత్వం అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధంగా నిజాం రాజ్యాన్ని బలవం తంగా విలీనం చేసుకుంది. ఈ విషయంపై నిజాం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిల దావా వేసిండు. ఈ దావా అట్లనే పెండింగ్‌ల ఉంది. ఇది ఎప్పటికైనా ఇబ్బంది పెట్ట వొచ్చు అని భారత ప్రభుత్వం భావించింది. అందుకని నిజాం రాజ్య అస్తిత్వాన్ని భంగం చేయడానికి పూనుకుంది. దాంట్లె భాగంగ భాషా ప్రాతిపదిక పేరుతో నిజాం రాజ్యాన్ని మూడు ముక్కలు చేయాలని భావించింది. కన్నడ, మరఠ్వాడా జిల్లాలను ఆయా భాషా రాష్ట్రాలల్ల కలపాలని అనుకుంది. ఇది అదునుగా తీసుకొని ఆంధ్రా నాయకులు తెలుగు ప్రాంతమైన తెలంగాణను ఆంధ్రల కలపాలని డిమాండు చేసింద్రు.

వాస్తవానికి ఆంధ్ర ప్రాంతం కంటె భిన్నమైన సంస్కృతి కలిగిన ప్రాంతం తెలంగాణ. ఇది ప్రత్యేక రాష్ట్రంగా మనుగడ సాగించటానికి అవసరమైన అన్ని సదుపాయాలు కలిగి ఉంది. ఇంత పెద్ద ప్రాంతాన్ని తమ ప్రాంతంతో కలపాలని ఆంధ్రా నాయకులు వొత్తిడి తెచ్చింద్రు. కేంద్రం కూడా నిజాం అస్తిత్వాన్ని కను మరుగు

చేయాలన్న ఆలోచనల ఉండడంతో హైదరాబాద్ రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసి మూడు రాష్ట్రాలల్ల కలపాలని భావించింది. అయితే కన్నడ, మరఠ్వాడా ప్రాంతాల జిల్లాలల్ల ఈ నిర్ణయానికి వ్యతిరేకత రాలేదు. కానీ తెలంగాణ ప్రాంత ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వొచ్చింది. తెలంగాణ నాయకులు కూడా ఇష్టపడలేదు. కాని ఆంధ్రా నాయకుల పైరవీ, కమ్యూనిస్టుల విశాలాంధ్ర కుట్ర, లాబీయింగ్‌లు కలిసి తెలంగాణకు ఉరితాడు పేనినయ్.

ఈ పరిస్థితులల్ల కేంద్రం తెలంగాణ నాయకులకు నచ్చజెప్పే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ముఖ్యంగా ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాల కొనసా గింపుగా ఏదైనా ఒక హామీ ఇయ్యాలని కేంద్రం భావించింది.

ఆంధ్ర తెలంగాణ ప్రాంతాల నుంచి ముఖ్యమంత్రులను, కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను, ఇద్దరేసి మంత్రులను ఢిల్లీకి పిలిచింది. కేంద్ర హోంమంత్రి గోవింద వల్లభ్‌పంత్ సమక్షంల 1956 ఫిబ్రవరి 20న హైదరాబాద్ హౌస్‌ల చర్చలు జరిగినయ్. రెండు ప్రాంతాల పెద్దమనుషులు అనేక అంశాలపై చర్చ జరిపింద్రు. తెలంగాణ పెద్దమనుషులు విలీనానికి ఇష్టపడలేదు. కాని కేంద్రం వొత్తిడి చేసింది. చివరికి తెలంగాణ పెద్దమనుషులు అయిష్టంగా విలీనానికి తల ఊపింద్రు.

ఈ సమావేశంల తెలంగాణకు రక్షణలు కల్పిస్తూ ఒప్పందం జరిగింది. తెలంగాణ ప్రాంతం మిగులు నిధులు తెలంగాణ అభివృద్ధికే ఖర్చు చేయాలని, తెలం గాణ విద్యా సంస్థలల్ల ప్రవేశం తెలంగాణకే పరిమితం చేయాలని ఒప్పందం జరిగింది. వీటన్నిటిని సమీక్షించడానికి ప్రాంతీయ మండలిని కూడ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ముల్కీ నిబంధనలు కొనసాగించాలని చెప్పింది.

అధికారం కూడ రెండు ప్రాంతాలకు చెందేటట్లుగా ఉండాలని అంగీ కారం కుదిరింది. అందుకు గాను ముఖ్యమంత్రి ఆంధ్రప్రాంతం వాడయితే ఉప ముఖ్యమంత్రి తెలంగాణ ప్రాంతంవాడు ఉండాలని, ఒకవేళ ముఖ్యమంత్రి తెలంగాణ వాడయితే ఉపముఖ్యమంత్రి ఆంధ్రవాడై ఉండాలని ఒప్పందం జరిగింది. మంత్రి వర్గంల కూడా తగిన ప్రాతినిధ్యం ఉండాలని, ముఖ్యమైన శాఖలు తెలంగాణకు కేటాయించాలని ఒప్పందం జరిగింది. మొత్తం 14 ప్రధాన అంశాలపైన ఏకాభిప్రాయం కుదిరినట్లు అంగీకరించింద్రు. అదే రోజు రాష్ట్రం పేరు, హైకోర్టు బెంచ్ ఏర్పాటు గురించిన చర్చ కూడా జరిగింది. కాని నిర్ణయం జరుగలేదు.

పెద్దమనుషుల ఒప్పందం:

1. రాష్ట్రం కేంద్రీకృత, సాధారణ పాలన ఖర్చు తెలంగాణ ఆంధ్ర

ప్రాంతాలు దామాషా ప్రకారం భరించాలె. తెలంగాణ ప్రాంతపు మిగులు ఆదాయాలు తెలంగాణ అభివృద్ధి కోసం రిజర్వ్ చేసి ఉంచాలె. ఈ ఏర్పాటును ఐదు సంవత్సరాల అనంతరం ఒకవేళ తెలంగాణ ప్రాంత శాసన సభ్యులు కోరితే సమీక్షించాలె.

2. తెలంగాణ ప్రాంత శాసనసభ్యులు సూచించిన పద్ధతిలనే తెలంగాణల మద్య నిషేధం అమలుకావాలె.

3. తెలంగాణల ప్రస్తుతం ఉన్న విద్యాసౌకర్యాలల్ల తెలంగాణ విద్యార్థులకే అవకాశాలు ఇవ్వాలె. వాటిని మరింత అభివృద్ధిపరచాలె. తెలంగాణలోని కాలేజీలు, సాంకేతిక విద్యాలయాలల్ల ప్రవేశాలు కేవలం తెలంగాణ విద్యార్థులకు మాత్రమే ఉండాలె. అది కాని పక్షంల రాష్ట్రం మొత్తం మీద ప్రతి విద్యాలయంల మూడింట ఒకవంతు (1/3) స్థానాలు తెలంగాణ విద్యార్థులకు అందించాలె. ఈ రెండింట్లె ఏది తెలంగాణ విద్యార్థులకు మేలు కలుగజేస్తదో ఆ నిర్ణయం తీసుకోవాలె.

4. ఇప్పుడు రాష్ట్రం ఏర్పాటువల్ల ఉద్యోగాలు తొలగించవలసి వస్తే, రెండు ప్రాంతాలల్ల జనాభా దామాషా ప్రకారం తొలగించాలె.

5. తదుపరి ఉద్యోగ నియామకాలు రెండు ప్రాంతాల జనాభాను ప్రాతిపదికగా చేసుకుని జరగాలె.

6. పాలనా న్యాయవ్యవహారాలల్ల ప్రస్తుతం తెలంగాణల అమలుల ఉన్న ఉర్దూను ఇట్లనే ఐదుసంవత్సరాలు కొనసాగించాలె. రీజనల్ కౌన్సిల్ ఈ అంశాన్ని పునస్సమీక్షించాలె. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేసుకునేటప్పుడు, తెలుగు భాషాపరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలనే నియమం ఉండరాదు. అయితే ఉద్యోగంల చేరిన తరువాత రెండు ఏండ్లల్ల నిర్దేశిత తెలుగు ప్రావీణ్యతా పరీక్షల ఉత్తీర్ణులు కావాలె.

7. తెలంగాణావారు తమ జనాభా దామాషాకు అనుగుణంగా ఉద్యోగాలు పొందేందుకు స్థానిక నియమాలు రూపొందాలె. ఉదా: 12 ఏండ్లు ఆవాసం లాంటివి.

8. తెలంగాణ ప్రాంతంలోని వ్యవసాయ భూమి అమ్మకాలు తెలంగాణ రీజనల్ కౌన్సిల్ నియంత్రణల ఉండాలె.

9. తెలంగాణప్రాంత అవసరాలను, ఆవశ్యకతలను దృష్టిల ఉంచుకుని దాని సర్వతోముఖాభివృద్ధి కోసం, రీజనల్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలె.

10. రీజనల్ కౌన్సిల్‌ల 20 మంది సభ్యులుండాలె. ఈ శాసన సభ్యులను కింది విధంగా కౌన్సిల్‌లకు తీసుకోవాలె.

తొమ్మిదిమంది సభ్యులు తెలంగాణలోని తొమ్మిది జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే శాసనసభ్యులు ఉండాలె. వీరిని తెలంగాణ ప్రాంత జిల్లాల శాసన సభ్యులు జిల్లాలవారీగా ఎన్నుకోవాలె. ఆరుగురు తెలంగాణ ప్రాంత శాసన సభ్యులు లేక పార్లమెంటు సభ్యులు. వీరిని తెలంగాణ ప్రాంత శాసన సభ్యులందరూ కలిసి ఎన్నుకోవాలె. ఐదుగురు సభ్యులు శాసనసభకు బయటివారు ఉండాలె. ఈ ఐదుగురు తెలంగాణ శాసనసభ్యులతో ఎంపిక చేసుకోవాలె. వీరేకాక, తెలంగాణ ప్రాంత మంత్రులందరూ ఈ కౌన్సిల్‌ల మెంబర్లుగా ఉంటరు. ముఖ్యమంత్రి లేదా ఉప ముఖ్యమంత్రి ఎవరు తెలంగాణకు చెందిన వారైతే వారు ఈ కౌన్సిల్‌కు అధ్యక్షత వహించాలె. మంత్రిమండలిలోని ఇతర క్యాబినెట్ మంత్రులు ఆహ్వానితులుగా ఉండవచ్చు.

11. రీజనల్ కౌన్సిల్ చట్టబద్ధ సంస్థగా ఉండాలె. ఇంతకు ముందు పేర్కొన్న అంశాలపై నిర్ణయాధికారం ఉండాలె. ప్రణాళిక అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్టుల విషయమై సాధారణ ప్రణాళికల భాగంగా పారిశ్రామిక అభివృద్ధి, తెలంగాణ ప్రాంతపు ఉద్యోగ నియామకాల విషయంల నిర్ణయాధికారం ఉండాలె. ఏదైనా అంశంపై రీజనల్ కౌన్సిల్‌కు రాష్ట్రప్రభుత్వానికీ మధ్య అభిప్రాయ బేధాలుంటే ఆ అంశాన్ని భారతప్రభుత్వానికి నివేదించాలె. భారత ప్రభుత్వ నిర్ణయమే అంతిమ నిర్ణయం.

12. మంత్రి మండలిల 60:40 శాతంగా ఆంధ్ర ప్రాంతీయులు తెలంగాణ ప్రాంతీయులు ఉండాలె. తెలంగాణకు చెందిన 40 శాతంల కచ్చితంగా తెలంగాణ ప్రాంత ముస్లిం శాసనసభ్యుడు ఉండాలె.

13. ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతం నుంచి ఉంటే, ఉప ముఖ్య మంత్రి తెలంగాణ ప్రాంతం నుంచి ఉండాలె. ముఖ్యమంత్రి పదవిల తెలంగాణ ప్రాంతీయులు ఉంటే, ఉపముఖ్యమంత్రి పదవిల ఆంధ్ర ప్రాంతీయులుండాలె. కింది శాఖలలో రెండు శాఖలు తప్పని సరిగా తెలంగాణ వారికి కెటాయించాలె. 1.హోమ్, 2.ఆర్థికశాఖ, 3.రెవిన్యూ, 4.ప్రణాళిక–అభివృద్ధి, 5.వాణిజ్యం– పరిశ్రమలు.

14. హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు 1962 వరకు ప్రత్యేక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉండాలని ఆశించిండ్రు. ఆంధ్రప్రాంత ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునికి ఎటువంటి అభ్యంతరం ఉండ కూడదు.

ఈ చర్చలల్ల రొండు అంశాలపై ఏకాభిప్రాయం కుదురలేదు. కొత్తగా ఏర్పడ నున్న రాష్ట్రం పేరు ఒక అంశం కాగా, హైకోర్టుకు సంబంధించిన అంశం మరొకటి.

1. తెలంగాణ ప్రాంత ప్రతినిధులు రాష్ట్రానికి ఆంధ్ర తెలంగాణ అని పేరుపెట్టాలె అన్నరు (ఇది ముసాయిదా బిల్లుల ఉన్నది). ఆంధ్రప్రాంత ప్రతినిధులు జాయింట్ సెలెక్ట్ కమిటీ సూచించిన ఆంధ్రప్రదేశ్ అనే పేరు ఉండాలన్నరు.

2. గుంటూరుల హైకోర్టు బెంచి హైదరాబాదుల ప్రధానపీఠం ఉండాలని తెలంగాణ ప్రాంత ప్రతినిధులు అన్నరు. గుంటూరుల బెంచి ఉండనవసరం లేదని, హైకోర్టు హైదరాబాదులనే ఉండాలని ఆంధ్రప్రాంత ప్రతినిధులు అన్నరు.

1956 ఫిబ్రవరి 20న జరిగిన పెద్దమనుషుల చర్చల సారాంశాన్ని చూసిన తర్వాత 1956 ఆగస్టు 14న ఎనిమిదిమంది పెద్దమనుషులు ఈ ఒప్పందం మీద సంతకాలు చేసిండ్రు. ఈ ఒప్పందానికి అనుబంధంగా తెలంగాణ ప్రాంత రక్షణల ఒప్పందంపైన కూడా ఇదే రోజు ఇదే పెద్దమనుషులు సంతకం చేసిండ్రు.

1956 ఆగస్టు 14 తెలంగాణ రక్షణల ఒప్పందం ఇది:

ఎ.ప్రాంతీయ స్టాండింగ్ కమిటీ

1. ఆంధ్రప్రదేశ్ మొత్తానికి ఒకే శాసనసభ ఉంటుంది. రాష్ట్రానికి చట్టాలు రూపొందించే వ్యవస్థ ఇదే అవుతుంది. రాష్ట్రానికి ఒక గవర్నర్ ఉంటడు. మొత్తం పరిపాలనకు సంబంధించి రాష్ట్రశాసనసభకు జవాబు దారీగా వ్యవహరించే మంత్రిమండలి గవర్నర్‌కు సహాయకారిగా ఉంటూ సలహాలిస్తుంది.

2. కొన్ని ప్రత్యేక అంశాలకు (స్పెసిఫిక్ మేటర్స్) సంబంధించి ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రదేశాన్ని ఒక ప్రాంతంగా పరిగణిస్తరు.

3. తెలంగాణ ప్రాంతం కోసం రాష్ట్రశాసనసభకు చెందిన ఒక ప్రాంతీయ స్థాయి సంఘం (రీజనల్ స్టాండింగ్ కమిటీ) ఉంటుంది. దీంట్లె ఆ ప్రాంతానికి చెందిన మంత్రులు, ఆ ప్రాంతానికి చెందిన రాష్ట్ర శాసనసభ సభ్యులు ఉంటరు. ముఖ్యమంత్రికి దీంట్లె స్థానం ఉండదు.

4. ప్రత్యేక అంశాలకు సంబంధించిన చట్టాలను ప్రాంతీయ సంఘం సమాలోచనలకు పంపాలె. ప్రత్యేకాంశాలకు సంబంధించిన చట్టం చేయడం కోసం ప్రాంతీయ సంఘం రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు చేయవచ్చు లేదా ఆర్థికభారం పడని సాధారణ విధానాలకు సంబంధించి చట్టం చేయడం కోసం ప్రతిపాదనలు చేయవచ్చు.

5. ప్రాంతీయ సంఘం ఇచ్చే సలహాలను రాష్ట్రప్రభుత్వం, రాష్ట్ర శాసన సభ సాధారణంగా ఆమోదించాలె. ఒకవేళ భిన్నాభిప్రాయాలు వ్యక్తమైతే గవర్నర్ దృష్టికి తీసుకుపోవాలె. గవర్నర్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాలె.

6. ప్రాంతీయసంఘం ఈ కింది విషయాలను పరిశీలిస్తుంది.

- రాష్ట్ర శాసనసభ రూపొందించిన సాధారణ అభివృద్ధి ప్రణాళిక చట్టం పరిధిల అభివృద్ధి సంస్థలు, జిల్లాబోర్డులు, జిల్లా సంస్థలకు సంక్రమించే రాజ్యాంగబద్ధ అధికారాలను పరిశీలిస్తుంది.
- ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, స్థానిక ఆస్పత్రులు, వైద్యశాలలు (డిస్పెన్సరీలు)
- ప్రాథమిక, మాధ్యమిక విద్య
- తెలంగాణ ప్రాంతంలోని విద్యాసంస్థలల్ల ప్రవేశాల నియంత్రణ
- మద్యపాన నిషేధం–వ్యవసాయ భూముల విక్రయం
- కుటీర, చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయం, సహకారసంఘాలు, మార్కెట్లు, సంతలు
- ఒప్పందాన్ని ముందుగా సవరించని పక్షంల ఈ ఒప్పందాన్ని పదేండ్ల తర్వాత సమీక్షించాలె.

బి. స్థానిక నియమాలు

'స్థానిక' (డొమిసైల్) నియమాలు : సబార్డినేట్ సర్వీసుల భర్తీ విషయంల తెలంగాణను ఒక యూనిట్‌గా పరిగణనలోకి తీసుకునే విధంగా ఐదేండ్ల పాటు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలె. ఈ కేడర్‌లోని పోస్టులను ప్రస్తుత ముల్కీ నిబంధనల పరిధిలకు వొచ్చేవారి కోసం రిజర్వు చేయవచ్చు.

సి. ఉర్దూ – దాని స్థానం

భారత ప్రభుత్వం ప్రస్తుతం పాలనా, న్యాయవ్యవస్థల గల ఉర్దూ

స్థానాన్ని రాబోయే ఐదు సంవత్సరాలపాటు పదిలంగా ఉంచేందుకు వీలుగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా సూచనలిస్తుంది.

డి. నూతన రాష్ట్రం ఏర్పాటు వల్ల మిగులు ఉద్యోగుల తొలగింపు

భారత ప్రభుత్వం (హైదరాబాద్ రాష్ట్రంల) ఎటువంటి తొలగింపు ఉంటుందని భావించడంలేదు. హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు సహజంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సేవలలోకి పోతరు. ఒకవేళ ఉద్యోగులను తొలగించవలసివస్తే ఉమ్మడి రాష్ట్రంలోని ఉద్యోగులకు సమంగా ఆ తొలగింపు వర్తిస్తుంది.

ఇ. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల మధ్య వ్యయాల పంపిణీ

రాష్ట్ర వనరుల ద్వారా కేటాయించే వ్యయాల అంశం రాష్ట్రప్రభుత్వం, రాష్ట్ర శాసనసభల పరిధిలోనిదే. కేంద్రీకృత, సాధారణ పరిపాలన కోసం కొత్త రాష్ట్రం వెచ్చించే వ్యయాన్ని రెండు ప్రాంతాలు ఆయా నిష్పత్తి ప్రకారం భరించాలె. ఆదాయంల మిగులును మాత్రం తెలంగాణ అభివృద్ధి నిమిత్తం వెచ్చించే వ్యయం కోసం అట్టి పెట్టాలె. బడ్జెట్ కేటా యింపులు చేసేటప్పుడు, ప్రభుత్వం ఒప్పందంలోని షరతుల మేరకు వ్యవహరించాలె. ఈ అవగాహన గురించి భారత ప్రభుత్వం ఆంధ్ర ముఖ్యమంత్రికి గుర్తు చేయాలె.

ఈ పెద్దమనుషుల ఒప్పందంపైన రెండు ప్రాంతాల నుంచి నలుగురు నాయకులు సంతకం పెట్టింద్రు. ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి, ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరాజు, ఉపముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, మరోమంత్రి గౌతులచ్చన్న ఆంధ్రప్రాంతం ప్రతినిధులుగా సంతకం పెట్టింద్రు. తెలంగాణ ప్రాంత ప్రతినిధులుగ హైదరాబాద్ రాష్ట్ర ముఖ్య మంత్రి బూర్గుల రామకృష్ణారావు, హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జె.వి.నర్సింగరావు, మంత్రులు కొండా వెంకటరంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి సంతకాలు చేసింద్రు.

పెద్దమనుషుల ఒప్పందం మీద అయిష్టంగా సంతకం పెట్టిన తర్వాత 'నా మరణ శాసనం మీద నేనే సంతకం పెట్టిన' అని బూర్గుల రామకృష్ణారావు ఆవేదన చెందిండు. ఈ మాటను ఉమ్మెత్తల కేశవరావు రాసిన బూర్గుల రామ కృష్ణారావు జీవిత చరిత్ర పుస్తకంల రికార్డు అయ్యింది.

అనంతరం పెద్దమనుషుల ఒప్పందాన్ని పార్లమెంట్ ఆమోదించింది. దీంతో ఈ ఒప్పందానికి రాజ్యాంగబద్ధత లభించింది. 1956 ఆగస్టు 31న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బిల్లును భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ఆమోదిం చిండు.

చివరికి తెలంగాణ ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా 1956 నవంబర్ 1న ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలు విలీనమై ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డది. ఈ బలవంతపు కలయికకు ఒక్కరోజు ముందు నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ రాజ్‌ప్రముఖ్ పదవికి రాజీనామా చేసింది.

# ఒప్పందాలకు పాతర

ఆంధ్రనాయకుల కుట్రలు, కుతంత్రాలు ఫలించి విశాలాంధ్ర ఏర్పడ్డది. తెలంగాణ నోరు మూసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేసింద్రు. కాని రాష్ట్రం ఏర్పడ్డ మరుక్షణం ఆంధ్రనాయకులు తమ సహజ నైజాన్ని చూపింద్రు. గోతికాడి నక్కలలెక్క ఏండ్ల తరబడి ఎదురు చూసిన ఆంధ్రనాయకులు రాష్ట్రం ఏర్పడంగనే తమ బుద్ధిని బయటపెట్టుకుంద్రు. తెలంగాణను పీక్కతినటానికి, కడుక్క తాగడానికి ప్రణాళికలు వేసుకుంద్రు. దాంట్లె భాగంగ తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బకొట్టాలనే కుట్ర చేసింద్రు. ఈ కుట్రల భాగంగనే రాష్ట్రం పేరులో తెలంగాణ అనేమాట లేకుండ చేసింద్రు. ఆంధ్రప్రదేశ్ అని ఖాయం చేసింద్రు.

నిజానికి ఫజల్ అలీ కమిషన్ తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగ ఉండాలని చెప్పింది. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడాలని చెప్పింది. బలవంతపు విలీనం నేపథ్యంల రాష్ట్రం పేరు ఆంధ్ర-తెలంగాణ ఉండాలని తెలంగాణ నాయకులు కోరింద్రు. కాని ఆంధ్రనాయకులు పట్టించుకోలేదు. తెలంగాణ అనే పదం అస్తిత్వంల ఉంటే తమ దోపిడీకి అడ్డుకట్ట పడుతుందని భావించింద్రు. అందుకనే మొట్టమొదట తెలంగాణ అనే పదం కనుమరుగు చేయాలనుకుంద్రు.

బిల్లుల రాష్ట్రం పేరు ఆంధ్ర తెలంగాణ అని ఉంది. కాని సెలెక్ట్ కమిటీల ఆంధ్ర నాయకులు తెలంగాణ పదం లేకుంట చేసింద్రు. ఫలితంగ ఉత్తర భారత దేశపు సంప్రదాయమైన ప్రదేశ్ అనే మాటను తీసుకొచ్చి తమ ప్రాంతం తర్వాత తగిలించుకొని ఆంధ్రప్రదేశ్ అనే పేరు పెట్టేటట్టు నరుక్కొచ్చింద్రు. దాంతో తెలంగాణ అస్తిత్వాన్ని, గుర్తింపును, ఆత్మస్థైర్యాన్ని దెబ్బకొట్టాలనే కుట్రకు పునాది వేసింద్రు. రాష్ట్రం పేరులోనే తెలంగాణకు అన్యాయం జరిగింది. ఇది తెలంగాణ గుండెమీద ఆంధ్రనాయకులు కొట్టిన మొదటిదెబ్బ.

రాష్ట్రం ఏర్పడంగనే ఏ ప్రాంతంవారికి ముఖ్యమంత్రి పదవి దక్కాలనే దాని మీద లాబీయింగ్‌లు జరిపింద్రు. అప్పటికే హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తీవ్ర మనస్తాపంతో ఉన్నడు. ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి పదవి ఆశించలేదు. తెలంగాణ ప్రాంతనాయకుడు కెవి రంగారెడ్డి ముఖ్యమంత్రి పదవికోసం ప్రయత్నం చేసిండు. కాని ఆయన ప్రయత్నం ముందల పడలేదు.

అప్పటికి ఆంధ్రనాయకులు మంతనాలమీద మంతనాలు చేసింద్రు. ముఖ్య మంత్రి పదవి పరుగుపందెంల రాయలసీమకు చెందిన నీలం సంజీవరెడ్డి ముందు న్నడు. ఆంధ్రరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం అప్పటికే చతికిలపడ్డడు. అప్పటి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి ముందు కొచ్చిండు. అయితే నీలం సంజీవరెడ్డికి ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టటానికి ఆంధ్ర తెలంగాణ రెడ్డి నాయకుల మధ్యన లోపాయకారి అవగాహన కుదిరింది.

అంతకుముందు, బూర్గుల రామకృష్ణారావుతో విలీనం సందర్భంగ మాట్లాడిన ఆంధ్రబ్రాహ్మణ నాయకులు అయ్యదేవర కాళేశ్వరరావు, కళా వెంకటరావు నోరు మూసుకొని జారుకున్నరు. బ్రాహ్మణ నాయకుడు బూర్గుల రామకృష్ణారావుకు మద్దతియ్య టానికి వారికి ప్రాంతం అడ్డమొచ్చింది. తెలంగాణ బ్రాహ్మణ నాయకుని వొదిలిపెట్టి, ఆంధ్రా రెడ్డి నాయకుని వైపు నిలబడ్డరు. నీలం సంజీవరెడ్డిని బలపర్చింద్రు.

ఎదురులేకుండ నీలం సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కుర్చీల కూసుండు. ముఖ్యమంత్రి పదవిల కూసున్న మరుక్షణం సంజీవరెడ్డి ఆంధ్రా అహం కారాన్ని చూపించిండు. పెద్దమనుషుల ఒప్పందానికి నిలువెత్తు పాతర వేసిండు. ఈ ఒప్పందం ప్రకారం ఆంధ్రానాయకుడు ముఖ్యమంత్రి అయితే తెలంగాణ నాయ కుడు ఉపముఖ్యమంత్రి కావాలె. కాని సంజీవరెడ్డి అది మర్చి వోయిండు. ఉప ముఖ్యమంత్రి పదవి చేతికి ఆరోవేలు వంటిదని, దాని అవసరం లేదని తన కుట్ర బుద్ధిని బయట పెట్టిండు.

విచిత్రమేందంటే సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కావడానికి ఒకరోజు ముందు వరకు ఉపముఖ్యమంత్రి పదవిల ఉన్నడు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిననాటి నుంచి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడేవరకు ఇద్దరు ముఖ్యమంత్రులు టంగుటూరు ప్రకాశం, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంల ఆయన ఉపముఖ్యమంత్రి పదవిలనే కూసుండు. సుమారు మూడేండ్లు ఉపముఖ్యమంత్రి పదవిని అనుభవించిన నీలం సంజీవరెడ్డికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కుర్చీల కూచున్నంక ఉపముఖ్యమంత్రి పదవి ఆరోవేలు వంటిది అనిపిం చింది. పనికిరాని దాని లెక్క కనిపించింది.

దానికి కారణం లేకపోలేదు. ఉపముఖ్యమంత్రి పదవి ఇస్తే తెలంగాణకు ఇయ్యాల్సి వొస్తది. తెలంగాణకు కీలకమైన పదవి ఇస్తే తన ఆటలు సాగవు. అంతేకాక తాను ప్రకాశం మంత్రివర్గంల ఉప ముఖ్యమంత్రిగా ఉండి చేసిన అరాచకం యాది కొచ్చింది. అట్లాంటి అవకాశం మరొకరికి ఇయ్యకుండ జాగ్రత్తపడ్డడు. దీంతో తన అధికారానికి అడ్డు లేకుండ ఉంటుందని భావించిండు. అందుకనే ఉపముఖ్యమంత్రి పదవిని  ఎవరికి ఇయ్యకుంట ఖాళీగనే ఉంచిండు.

రెండు ప్రాంతాల రెడ్డినాయకుల మధ్య అవగాహన ఉంది కాబట్టి సంజీవరెడ్డి తన మంత్రివర్గంలకు కెవి రంగారెడ్డి వర్గాన్ని తీసుకున్నడు. కెవి రంగారెడ్డి, మందుముల నరసింగరావు, వల్లూరి బసవరాజు, మొహిదీ నవాజ్ జంగ్‌లకు మంత్రి పదవులు దక్కినయ్.

పెద్దమనుషుల ఒప్పందంల ప్రభుత్వశాఖల కేటాయింపుల గురించి కూడ ఉంది. కీలకమైనవి హోం, ఆర్థిక, రెవిన్యూ, ప్రణాళిక–అభివృద్ధి, వాణిజ్యం–పరిశ్రమ శాఖలు. ఈ అయిదు శాఖలల్ల రెండు శాఖలు తెలంగాణ ప్రాంత నాయకులకు కేటాయించాలని ఉంది. దానిని కూడ ముఖ్యమంత్రి సంజీవరెడ్డి బొంద పెట్టిండు. శాఖలను కేటాయించడంల మల్లా ఆంధ్రాబుద్ధినే చూపించిండు.

ముఖ్యమైన ప్రణాళిక, హోంశాఖలను సంజీవరెడ్డి తనదగ్గరనే పెట్టు కున్నడు. మరో రెండు కీలకమైన శాఖలు ఆర్థిక, భూసంస్కరణల శాఖను ఆంధ్రా నాయకుడు కళా వెంకటరావుకు అప్పగించిండు. వల్లూరి బసవరాజుకు ఐదో కీలకమైన వాణిజ్యం–పరిశ్రమలు శాఖను కట్టబెట్టిండు. సంజీవరెడ్డి దృష్టిల ఈ శాఖను తెలంగాణకు కేటాయించినట్లు లెక్క. కాని విబి రాజుగా ప్రాచుర్యం పొందిన వల్లూరి బసవరాజు గుంటూరు జిల్లా బాపట్లకు చెందినోడు. కాని తెలంగాణ ప్రాంతంల స్థిరపడ్డడు. తెలంగాణ ప్రాంతం నుంచి ఎన్నికల్ల గెలిచిండు. సంజీవరెడ్డి ఆంధ్రా మూలాలు ఉన్న వ్యక్తికే తెలంగాణకు చెందాల్సిన కీలకమైన పదవి అంటకట్టిండు. మొత్తంమీద కీలకమైన శాఖలన్నీ ఆంధ్రానాయకుల చేతుల్ల పెట్టుకొని పెద్దమనుషుల ఒప్పందానికి తూట్లు పొడిచిండు నీలం సంజీవరెడ్డి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన ఇరవైనాలుగు గంటలల్ల ఆంధ్రానాయకుడైన నీలం సంజీవరెడ్డి తెలంగాణను వీలైనంత అణగదొక్కడానికి కుట్ర చేసిండు. తెలంగాణ గుర్తులు,  గౌరవం లేకుండ చేసిండు. అధికారం అందకుండ చేసిండు. తెలంగాణ ఆత్మస్థైర్యాన్ని దెబ్బకొట్టి భవిష్యత్తుల ఆంధ్రపెత్తనానికి బాట వేసిండు. తెలంగాణను దోపిడి చెయ్యడానికి మార్గం సుగమం చేసిండు.

విలీనానికి ముందు బూర్గులకు సుద్దులు చెప్పిన కళా వెంకటరావు ఆ తర్వాత సంజీవరెడ్డి మంత్రివర్గంల చేరి మంత్రిపదవిల కూసుండు.

నీలం సంజీవరెడ్డి తనకు ఎదురులేకుండ చేసుకోవడానికి అనేక ప్రయత్నాలు చేసిండు. దాంట్లె భాగంగనే ఆంధ్ర తెలంగాణ సంఘాలను కలిపి, ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఏర్పడంగనే తనకు దగ్గరివాడైన అల్లూరి సత్యనారాయణ రాజును అధ్యక్షునిగ చేసిండు. అటు ప్రభుత్వంల ఇటు పార్టీల ఆంధ్రా పెత్తనమే కొనసాగించడానికి తయారైండు.

పెద్దమనుషుల ఒప్పందంలోని ఉద్యోగరక్షణలను మరోసారి తుంగల తొక్కి ఆంధ్రప్రాంతానికి చెందిన డిఎస్‌రెడ్డిని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గ చేసిండు. తెలంగాణ ఉద్యోగాల దోపిడీని అధికారికంగ మొదలుపెట్టిన ఘనత కూడా సంజీవరెడ్డిదే.

అయితే కొద్దిరోజులకే సంజీవరెడ్డి మీద అసమ్మతి బయలుదేరింది. చెన్నారెడ్డి, బొమ్మకంటి సత్యనారాయణ, హయగ్రీవాచారి, గోపాలరావు, మేల్కోటే, పాగ పుల్లారెడ్డి తదితర తెలంగాణ నాయకులు ముఖ్యమంత్రిని వ్యతిరేకించి దుయ్య బట్టింద్రు. రాష్ట్ర ఏర్పాటుకు, ఆంధ్రనాయకుల ప్రవర్తనకు మనస్తాపం చెందిన బూర్గుల రామకృష్ణారావు క్రియాశీల రాజకీయాలకు దూరమైండు. ఆ తర్వాత కేరళ గవర్నర్‌గ వెళ్లిపోయిండు.

# తెలంగాణపై ఆంధ్రా చిన్నచూపు

విశాలాంధ్ర, తెలుగుజాతి ఐక్యత అంటూ ఊదరగొట్టిన ఆంధ్ర నాయకులు తెలంగాణ ప్రజల ఇష్టంతో పనిలేకుండ బలవంతపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింన్రు. కుట్రలమీద కుట్రలుచేసి చివరికి అనుకున్నది సాధించిన్రు. ఆ క్రమంల తెలంగాణ ప్రజలను నమ్మించడానికి ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీల అప్పటి ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి, అదే రాష్ట్రంల ఉప ముఖ్య మంత్రి నీలం సంజీవరెడ్డి పోటీపడి తీర్మానాల మీద తీర్మానాలు చేసింన్రు. తెలంగాణకు రక్షణలు కల్పిస్తం, వారిని గుండెల్ల పెట్టుకొని చూసుకుంటమని ఆంధ్రా అసెంబ్లీ సాక్షిగా చెప్పింన్రు. ఇవన్నీ మాయ మాటలేనని, ఆంధ్రనాయకుల మాటలు నమ్మలేమని తెలంగాణ ప్రజలు భావించిన్రు. అయినా శని పట్టినట్టు ఆంధ్రా వొచ్చి తెలంగాణ గుండె మీద పడ్డది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తెల్లారి నుంచి తెలంగాణ ప్రజల భయాలు నిజ మైనయ్. రాష్ట్రం పేరు, ఉపముఖ్యమంత్రి పదవి, శాఖల కేటాయింపులల్ల ఆంధ్రా పోకడను చూపించిన్రు. ఆ తర్వాత కూడ అదే అహంకారాన్ని అణచివేతను కొనసాగించిన్రు. ముందుగా ఆంధ్రోళ్లు చేసిన పని తెలంగాణ ఆత్మస్థైర్యాన్ని దెబ్బకొట్టే ప్రయత్నం. దాంట్లె భాగంగ తెలంగాణను చిన్నచూపు చూడటం మొదలు పెట్టింన్రు. తెలంగాణ భాష మొరటుదని, అసలు తెలంగాణ ప్రజలకు తెలుగుభాషే రాదని ప్రచారం చేసింన్రు. తెలంగాణ భాషను మాట్లాడే ప్రజలను అవమాన పరిచిన్రు. ఆంధ్రోళ్ల ఈ కుట్రల తెలంగాణ ప్రజలు పడ్డరు. ఆంధ్రోళ్ల ఈ భాష దాడి ఎంత ప్రభావం చూపించిందంటే అప్పటి వరకు అందమైన సజీవమైన తెలంగాణ భాషల కథలు రాసిన రచయితలు కూడ తమ భాషను మార్చుకున్రు. తెలంగాణ భాషల రచనలు చేస్తే అవమానాలు ఎదురయితున్నయని ఆంధ్రాభాషల రాయటం మొదలు పెట్టింన్రు.

పత్రికలు కూడ ఆంధ్రోళ్ల చేతుల్ల ఉండటం, తెలంగాణ రచయితలను మరింత బలహీనపరిచింది. తెలంగాణ భాషల రాసిన రచనలు ఆంధ్రోళ్లు అచ్చు

వేయక పోవడం, ఆంధ్రోళ్ల భాషల రాస్తేనే ప్రోత్సహించడం వంటి కుట్రల వల్ల తెలంగాణ సాహిత్యంల ఆంధ్రోళ్ల భాష చెలామణి కావడం మొదలుపెట్టింది. ఆంధ్రోళ్ల మొదటి దాడి తెలంగాణ భాషపైనే జరిగింది.

భాషపై దాడిల భాగంగ మరొక రకమైన దాడికూడ చేసింద్రు ఆంధ్రోళ్లు. బ్రిటీషాంధ్రల బతికిన తమకు ఇంగ్లీష్ బాగొస్తదని, నైజాంల బతికిన తెలంగాణోళ్లకు ఆంగ్లం అస్సలు రాదని ప్రచారం చేసింద్రు.

రెండవ అంశంగా సంస్కృతిపై దాడి చేసింద్రు. తెలంగాణ ప్రజల వేషధారణ బాగుండదని, ముతకబట్టలు వేసుకుంటరని ప్రచారం చేసింద్రు. ఇంగ తెలంగాణ పండుగలపైనా ఆంధ్రోళ్లది చిన్నచూపే. తమ పండుగలే గొప్పవని ప్రచారం చేసు కున్నరు. తెలంగాణ వంటలపైనా అదే చిన్నచూపు. ఆ అహంకారం తోనే ఆంధ్రా పేరుతో హోటళ్లు పెట్టింద్రు.

తెలంగాణ భాష, కట్టు, బొట్టు, తినే తిండి ఆంధ్రోళ్ల కండ్లకు ఆనలేదు. తాము తెలంగాణ ప్రాంతాన్ని ఉద్ధరించడానికి దేవలోకం నుంచి ఊడిపడ్డోళ్ల లెక్క పోజులు కొట్టింద్రు. ఇది మితి మీరిపోయింది. ఆంధ్రోళ్ల ప్రవర్తన తెలంగాణ ప్రజలను గాయపరిచింది. ఆంధ్రా ప్రాంతం నుంచి పొట్ట చేతబట్టుకొని తెలం గాణకు వచ్చినోడు కూడ ఇట్ల తలపొగరుతో ప్రవర్తిస్తుంటె తెలంగాణోళ్లు రగిలి పోయింద్రు. చివరికి ఆంధ్రోళ్ల దృష్టిల తెలంగాణ ప్రజలు నైజాం ప్రజలయ్యింద్రు. నైజాం ప్రజలంటే ఏమీ తెల్వని అనాడిగాళ్లని వాళ్ల భావన. ఇదే సమయంల తెలంగాణ దృష్టిల వాళ్లేమో ఆంధ్రోళ్లు అయింద్రు. ఆంధ్రోళ్లు అంటే తెలంగాణ మీద పడి దోచుకోవడానికి వొచ్చి నోళ్లనీ తెలంగాణ ప్రజల భావన.

ఇగ ఆంధ్రా నుంచి తెలంగాణకు వలస వొచ్చిన ఆంధ్రోళ్లు తెలంగాణోళ్లతో కలిసి జీవించటానికి ఇష్టపడలేదు. తెలంగాణలోని ఏ ప్రాంతానికి వొలస వొచ్చినా చివరికి హైదరాబాద్‌ల నయినా ఆంధ్రాకాలనీలు ఏర్పాటు చేసుకుంద్రు. ఒక రకంగా చెప్పాలంటే తెలంగాణ నేలమీద ఆంధ్రా ద్వీపాలను సృష్టించుకుంద్రు. యాబయ్యేండ్లు పోరాడి సాధించుకున్న హైదరాబాద్ తమ సొంతమని, పాలకులుగా తాము మాత్రమే అర్హులమని భావించింద్రు.

ఆంధ్రోళ్లు తెలంగాణ చరిత్రను, నాయకులనూ గౌరవించలేదు. తెలం గాణకు ఏమాత్రం సంబంధంలేని పొట్టి శ్రీరాములు వర్ధంతులు, జయంతులు తెలంగాణ నెత్తిన రుద్దింద్రు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ వల్ల ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డది అని పాఠ్యపుస్తకాలల్ల రాసి ఆంధ్రా దొంగ చరిత్రను ఇక్కడి విద్యార్థుల మెదళ్లకు ఎక్కించ

డానికి ప్రయత్నం చేసింద్రు. వాస్తవానికి పొట్టి శ్రీరాములు తెలంగాణ కోసం కాదుకదా, ఆంధ్రరాష్ట్రం కోసం కూడ ఆమరణ దీక్షకు కూచోలేదు. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు సుముఖం అని నెహ్రూ ప్రకటించిన తర్వాత అతితెలివితో తమది కాని మద్రాసు నగరం కావాలని కూచుండు. ఆంధ్రోళ్లకు ఇది తెల్వకకాదు. అయినా శ్రీరాములును తెలంగాణ నెత్తిన రుద్దింద్రు.

ఆంధ్ర అహంకారానికి మరొక ఉదాహరణ– హైదరాబాద్ రాష్ట్ర ముఖ్య మంత్రి బూర్గుల రామకృష్ణారావు మరణ సందర్భం. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 1957ల చనిపోయిండు. ఆయనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపింది. ఆ తర్వాత 1967 సెప్టెంబర్ 14న హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు కూడ కాలం చేసిండు. కాని అధికారంల ఉన్న ఆంధ్రాపాలకులకు బూర్గుల కనిపించలేదు. అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు చేయాలన్న బుద్ధి ఆంధ్ర సర్కారుకు కలుగలేదు. ఇది తెలంగాణ ప్రజల మనసులల్ల నాటుక పోయింది. కేవలం ఆంధ్రోళ్లను నెత్తిన మోసుకుంట తెలంగాణను అణచివేయాలని ఆంధ్ర పాలకులు నిర్ణయించు కున్నరని అర్థం చేసుకుంద్రు.

తెలంగాణ నాయకులు అధికారంలకు రాకుండ ఎన్నెన్నో కుట్రలు చేసింద్రు. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిల ఏకధాటిగ పదిహేనేండ్లు ఆంధ్రోళ్లే కూసుంద్రు. కనీసం తెలంగాణవారికి అవకాశం ఇయ్యాలన్న సోయి కూడ వాళ్లకు కలుగలేదు.

ఇవన్నీ తెలంగాణ ప్రజల మనసులల్ల నాటుకున్నయ్. ఆంధ్రోళ్లు తెలం గాణ ప్రజలతో కలిసి బతకడానికి రాలేదని, తెలంగాణ మీద పెత్తనం చేయడానికి వొచ్చింద్రని అర్థం చేసుకుంద్రు. దీంతో తెలంగాణ ప్రజలల్ల రోజురోజుకు అసంతృప్తి పేరుకోవడం మొదలుపెట్టింది.

# వలసవాదుల దోపిడీ

తెలంగాణ ప్రజలను సాంస్కృతికంగా అణచివేసుకుంటనే తెలంగాణ భూములు, ఉద్యోగాలపై ఆంధ్రోళ్లు కన్నేసింద్రు. ముందుగా ఆంధ్రాప్రాంతం నుంచి సంపన్నవర్గాలు హైదరాబాద్‌కు చేరుకున్నయ్ కాబట్టి వారిదృష్టి హైదరాబాద్‌ల ఉన్న భూములు, ఆస్తులపై పడ్డది.

పథకం ప్రకారం బంజారాహిల్స్ వంటి ప్రాంతాలల్ల వారు దూరింద్రు. నిజాం అధికార పతనం తర్వాత ఏర్పడిన మిలిటరీ పాలన కాలంలనే ఆంధ్రోళ్లు సెక్రెటేరియెట్‌ల చొరబడ్డరు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ వలసలు మరింత పెరిగి సెక్రటేరియెట్‌ల గుత్తాధిపత్యం సంపాయించింద్రు. ముఖ్య మంత్రులు ఆంధ్రా నాయకులేనాయె. ఇంకేముంది, హైదరాబాద్‌లోని ఎవాక్యు ప్రాపర్టీల మీద వాళ్ల కన్నుపడ్డది. ఎవాక్యుప్రాపర్టీ అంటె యజమానులు లేని ఆస్తులు. నిజాం పతనం తర్వాత ఉన్నపళంగా ఆస్తులు వొదిలిపెట్టి నిజాం కుటుంబ సభ్యులు చాలామంది లండన్ పోయింద్రు. అట్లాంటోళ్ల ఇండ్లను చూసుకొని పాగా వేసింద్రు. దొంగకు దొంగతోడన్నట్టు ఆక్రమించుకునేది వాడే, అండనిచ్చేది వాడే. ఇంకేముంది. పట్టపగలు విలువైన ఆస్తులను ఆంధ్రోళ్లు ఆక్రమించింద్రు. తర్వాత తాత జాగీరు లెక్క అక్రమ మార్గంల పట్టాలు చేసుకుంద్రు.

హైదరాబాద్‌ల అందినకాడికి మింగుకుంటనే తెలంగాణ గ్రామాలపై దృష్టి పెట్టింద్రు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ డ్యామ్ డిజైన్‌ను మార్చి నల్లగొండ జిల్లా నీళ్లు ఆంధ్రాజిల్లాలకు పారేటట్లు కుట్ర చేసింద్రు. ఏ కాస్తన్నా నల్లగొండ జిల్లాల నీరు పారుతుందంటె ఆ ప్రాంతానికి గద్దల లెక్క వొచ్చి వాలింద్రు. నీటి సౌకర్యమున్న ప్రాంతాలల్ల భూములు కొనడం ప్రారంభించింద్రు.

ఇది ఒక నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కిందనే కాదు. తెలంగాణలోని, నిజాం సాగర్, డిండి, కోయల్‌సాగర్, వైరా, పాలేరు, మునేరు, మూసీ మొదలైన ప్రాజెక్ట్‌ల

కింద సారవంతమైన భూమిని కాజేసింద్రు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పదిపన్నెండు ఏండ్లల్ల లక్షల ఎకరాల సారవంతమైన భూములు ఆంధ్రోళ్ల చేతుల్లకు పోయినయ్.

అప్పటివరకు వ్యవసాయ భూములను వంశపారంపర్యంగ వొచ్చిన ఆస్తిగనే తెలంగాణ ప్రజలు చూసింద్రు. కాని పైసల్లో చూసే సంస్కృతి తెల్వదు. ఎంత కాలమైనా భూమిని సేద్యం చేసుకోవాలె, పంట పండించుకొని తినాలె. ఇది తెలంగాణ జీవన సంస్కృతి. కాని ఆంధ్రావలసల దాడి తర్వాత అనారోగ్య కరమైన ఆలోచనలు తెలంగాణ భూములచుట్టు తిరిగినయ్. అమాయకులైన తెలంగాణ రైతులను ఆంధ్రోళ్లు బుట్టల వేసుకుంద్రు. ముందుగా పైసల ఆశజూపి రైతుల దగ్గర నుంచి భూములను గుంజుకోవడానికి ప్రయత్నించింద్రు. అయితే తెలంగాణ రైతులు పైసలకు లొంగలేదు. తెలంగాణ ప్రజలు డబ్బులకు లొంగలేదు కాని ప్రేమకు లొంగింద్రు. పక్కోనికి సహాయం చెయ్యాలన్న ఆలోచనతో లొంగింద్రు.

తెలంగాణ గ్రామాలల్ల భూములు కొనడానికి ఆంధ్రా నుంచి వలస రైతులు తిరిగింద్రు. పైసలాశ చూపి రైతులను లొంగదీసుకోలేక పోయింద్రు. ఆ సమయంల ఆంధ్రా వలసరైతులు మాయమాటలు చెప్పింద్రు. తమ ప్రాంతంల చేసుకోడానికి భూముల్లేవని బతకడానికి తెలంగాణకు వొచ్చినమని చెప్పింద్రు. నాలుగెకరాల భూమి ఇచ్చి తాము బతకటానికి సహకారం అందించాలని కోరింద్రు. ఈ మాటలకు తెలంగాణ రైతులు కరిగింద్రు. మన ఊరును నమ్ముకొని వొచ్చిండుగా, ఓ నాలుగెకరాలు ఇద్దాంలే అనుకుంద్రు. ఇచ్చింద్రు. అట్ల తెలంగాణ గ్రామాలల్ల తిష్టవేసిన ఆంధ్ర వలసరైతులు పాతుకపోయింద్రు. మరో నాలుగెక రాలు మరో రొండెకరాలు అనుకుంట విస్తరించింద్రు.

ఇక్కడొక విషయం గుర్తుంచుకోవాలె. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం తెలంగాణ భూములు కొనాలంటే ముందుగా తెలంగాణ ప్రాంతీయ సంఘం అనుమతి తీసుకోవాలె. కాని అధికారంల కూచున్న ఆంధ్రాపాలకులు ప్రాంతీయ సంఘాన్ని నామమాత్రం చేసింద్రు. యథేచ్ఛగ తెలంగాణ భూములు ఆంధ్రా వలసవాదుల వశం కావడానికి సహకరించింద్రు.

తెలంగాణ భూములను మింగుకుంటనే మరొకవైపు తెలంగాణ ఉద్యోగాలల్ల అక్రమంగా దూరింద్రు. తెలంగాణ ఉద్యోగాలల్ల చేరాలంటె కూడా ముల్కీ నిబంధనలు ఉన్నయ్. ఈ నిబంధనల ప్రకారం హైదరాబాద్ రాష్ట్రంల జన్మించినవారు, లేకుంటె పదిహేనేండ్ల తెలంగాణ నివాసం ఉన్నవారికే ఉద్యోగాలల్ల చేరే అర్హత ఉంది. ఈ ముల్కీరూల్స్ నిజాంకాలం నుంచే ఉన్నయ్. నిజాం పాలన తర్వాత ఏర్పడ్డ మిలిటరీ

పౌరపాలనలోనూ ఉన్నయ్. అయితే 1956 తర్వాత ఆంధ్ర తెలంగాణ విలీనం తర్వాత ఈ నిబంధనలను సవరించాలన్న ప్రతిపాదన చేసింద్రు ఆంధ్రోళ్లు. ఈ చట్టాలవల్ల తెలంగాణ ప్రాంతానికి ఆంధ్రోళ్లు వలస వొచ్చే అవకాశం ఉండదు కాబట్టి వాటిని పాతర పెట్టాలనుకుంద్రు.

దీంట్లో భాగంగ చర్చలు జరిగినయ్. ఆంధ్ర, హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు కేంద్రమంత్రుల సమక్షంల చర్చలు జరిపింద్రు. తెలంగాణ జిల్లాలలోని చిన్న ఉద్యోగాలు హైదరాబాద్‌ల చిన్నవాటితోపాటు పెద్ద ఉద్యోగాలల్ల మూడోవంతు తెలంగాణకు చెందేవిధంగ నిర్ణయించింద్రు.

ఆంధ్రప్రదేశ్ 1956 నవంబర్ 1న ఏర్పడితె కొన్నినెలలకే 1957ల ఇట్లాంటి చర్చలు జరిగినయ్. ఫలితంగ కేంద్రప్రభుత్వం 1958ల 'రూల్స్'–నియమావళి రూపొందించింది. కాని ఈ రూల్స్‌ను వ్యతిరేకించి కొందరు ఆంధ్రా ఉద్యోగులు 1957 ఉద్యోగ నియామక చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసింద్రు. ఈ చట్టానికి రాజ్యాంగబద్ధత లేదని వాదించింద్రు. అంటేంది, తెలంగాణ ఉద్యోగాలు కొల్లగొట్టడానికి ఆంధ్రోళ్లకు ఏ అడ్డంకులు ఉండకూడదు. బాహాటంగ తమ ఉద్యోగాల దోపిడీ కొనసాగాలె. తెలంగాణ నోటికాడి ఉద్యోగాలు తమ స్వాధీనం కావాలె. ఈ దుర్మార్గపు ఆలోచనతోనే 1957 నాటి చట్టాన్ని సవాలు చేసింద్రు.

1969 మార్చి 28న సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. 1957 చట్టాన్ని దాని ఆధారంగ రూపొందించిన రూల్స్‌ను కొట్టేసింది. సుప్రీంకోర్టు తీర్పుల ముల్కీ నిబంధనల ప్రస్తావన లేనందున రాజ్యాంగం ప్రకారం అవి అమలుల ఉన్నట్టేనని 1970 డిసెంబర్ 9న హైకోర్ట్ తీర్పు చెప్పింది. ఈ తీర్పు వల్ల 1956కు ముందున్న హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వ ముల్కీశాసనానికి పునర్జన్మ లభించింది. అయినా హైకోర్టు, సుప్రీంకోర్టు అంటూ ఆంధ్రా ఉద్యోగులు తెలంగాణ ఉద్యోగ రక్షణ నిబంధనలను పాతర పెట్టటానికి శతవిధాల ప్రయత్నం చేసింద్రు. ఈ ఉద్యోగుల వెనక ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు నాయకులు నిలబడ్డరు. అధికారంల ఉన్న నాయకులే తెలంగాణను దోచుకోవడానికి వీలుగా తలుపులు బార్లా తెరిచే ప్రయత్నం చేసింద్రు. ఆంధ్రా నాయకుల ఈ కుట్ర తెలంగాణ నాయకులకు కోపం తెప్పించింది.

# అడుగడుగునా వివక్ష

పెద్దమనుషుల ఒప్పందంలోని 9వ నిబంధన ప్రకారం తెలంగాణ ప్రాంతీయ సంఘం ఏర్పాటు అయ్యింది. ఈ సంఘానికి 1958ల చట్టబద్ధత లభించింది. అయినా ఈ సంఘం ఉనికిలోకి రావడం ఆంధ్ర ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి సంజీవరెడ్డికి ఇష్టం లేదు. అందుకే ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం సంఘ కార్యవర్గాన్ని నియమించలేదు. సుమారు రొండేండ్లు కాలయాపన చేసిండు. తెలంగాణ నాయకుల వొత్తిడితో ఆ తర్వాత ముఖ్యమంత్రి అయిన దామోదరం సంజీవయ్య కార్యవర్గాన్ని నియమించిండు. 1960ల ప్రాంతీయ సంఘం ప్రాణం పోసుకుంది. ఈ సంఘం తొలి అధ్యక్షునిగా కె.అచ్యుతరెడ్డి బాధ్యతలు చేపట్టిండు. 1956ల రాష్ట్రం ఏర్పడితే 1960 వరకు ప్రాంతీయసంఘం ఏర్పడకుండ అడ్డుపడిన ఆంధ్రానాయకులు ఆ తర్వాత కూడ ఆ సంఘాన్ని తమ చెప్పుచేతుల్ల పెట్టుకునే ప్రయత్నం చేసింన్రు.

నిబంధనల ప్రకారం ఈ సంఘం పనిచేస్తే తమ ఆటలు సాగవని ఆంధ్ర ప్రాంత నాయకులకు తెలుసు. నిధులు, అభివృద్ధి ఉద్యోగ నియామకాలల్ల సమీక్ష చేయడానికి ఈ సంఘానికి అధికారాలు ఉన్నయ్. ఈ సంఘం కనుక గట్టిగ పనిచేస్తే తమ దోపిడీ బయటపడుతుందని ఆంధ్ర నాయకులు భావించిన్రు. అందుకని సంఘాన్ని తొక్కిపెట్టే కుట్రచేసింన్రు.

తప్పని పరిస్థితిల సంఘం ఏర్పాటుకు ఆంధ్రపాలకులు అంగీకరిం చిన్రు. ఆ తర్వాత కూడా తెలంగాణ ప్రాంతీయ సంఘం అధ్యక్షుడు అచ్యుతరెడ్డి నోరుమూసే ప్రయత్నం చేసింన్రు. కాని అచ్యుతరెడ్డి చాలాకాలం ఓపిక పట్టలేక పోయిండు. క్రమంగా సంఘ అధికారాలు ఉపయోగించుకొని తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను బహిర్గతం చేసిండు. ఆంధ్రాపాలకుల కుట్రలను అడ్డుకునే ప్రయత్నం చేసిండు.

ఆంధ్ర తెలంగాణ విలీనం తర్వాత పంచాయత్‌రాజ్ సంస్థలు ఏర్పడ్డయ్. దీంతో తెలంగాణల అనేక పాఠశాలలు వొచ్చినయ్. లెక్కలు, సైన్స్ ఉపాధ్యాయుల కొరత ఏర్పడ్డది. దొంగ ముల్కీలు సంపాయించి ఆంధ్రాప్రాంతం నుంచి వొచ్చిన

వలసవాదులు ఈ ఉద్యోగాలల్లకు చేరింద్రు. 1967 నాటికి ఇట్ల దొంగ ముల్కీ సర్టిఫికెట్లతో చేరినోళ్ల సంఖ్య నాలుగువేలు. దీంతో తెలంగాణ నిరుద్యోగులల్ల అసంతృప్తి రగిలింది.

1964లనే తెలంగాణ ప్రాంతీయ సంఘం ప్రభుత్వానికి ఒక సిఫార్సు చేసింది. తెలంగాణ మిగులు నిధుల నుంచి ఖర్చుపెట్టి అయినా సరే తెలంగాణలోని పాఠశాలల్ల ఉపాధ్యాయ పోస్టులను భర్తీచేయాలని సూచించింది. అయితే తెలంగాణ మిగులు నిధులు లేవని ఆర్థికశాఖ చెప్పింది. కాని గవర్నర్ అసెంబ్లీని ఉద్దేశించి మాట్లాడుకుంట 1961-66 మధ్యకాలంల తెలంగాణ మిగులు నిధులు 30.54 కోట్ల రూపాయిలు పేరుకు పోయినయని చెప్పిండు. ఆంధ్రాపాలకుల కుట్ర దీంతో బయటపడ్డది.

ఉద్యోగులను రగిలించిన మరొక సంఘటన కూడ ఉంది. భారత పాకిస్తాన్ యుద్ధకాలంల 1965-66 బడ్జెట్ల పదిశాతం కోత విధించి, రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక ఉద్యోగులను తొలగించింది. తెలంగాణలోని ఇంజనీర్లు చాలామంది రోడ్ల మీద పడ్డరు. కారణం తెలంగాణలోని పర్మినెంట్ పోస్టులన్ని ఆంధ్రోళ్లు ఆక్రమించడం, తాత్కాలిక సూపర్న్యూమరీ పోస్టులల్ల తెలంగాణవారిని నియమించడం. తెలంగాణ ప్రాంతంల తెలంగాణ ఇంజనీర్లకు తాత్కాలిక పోస్టులు, ఆంధ్ర నుంచి వొలస వొచ్చిన వారికి పర్మినెంట్ పోస్ట్లు. ఇది తెలంగాణ ఇంజనీర్లకు కోపం తెప్పించింది. ఇది కూడ తెలంగాణ అసంతృప్తిని మరింత పెంచింది.

ఇట్ల కుట్రల మీద కుట్రలు, దోపిడీ మీద దోపిడీ చేస్తుంటె తెలంగాణ నాయకులు కేంద్రానికి ఫిర్యాదు చేసింద్రు. కేంద్రమంత్రి గోవింద వల్లభపంత్కు వినతిపత్రాన్ని పంపింద్రు. అయితే బాహాటంగా అసంతృప్తిని వెళ్లగక్కటాన్ని కూడ రొండో సారి ముఖ్యమంత్రి అయిన సంజీవరెడ్డి దారుణంగా అడ్డుకుండు.

తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రాపాలకులు కొల్లగొడుతున్నరని, నోటి దురుసుతో తెలంగాణ ప్రజలను దూరం చేస్తున్నరని ఫిర్యాదుల మీద ఫిర్యాదులు కేంద్రానికి అందినయ్. పరిస్థితి చేయిజారకముందే మేల్కొనండి అని తెలంగాణ నాయకుడు గులాం పంజాతన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు 1959 డిసెంబర్ 12న బహిరంగ హెచ్చరిక చేసిండు.

ఈ క్రమంలనే ప్రధాని నెహ్రూకు తెలంగాణ మహాసభ విజ్ఞాపన పత్రాన్ని పంపింది. తెలంగాణ ప్రజలకు ఉద్యోగాలల్ల జరిగిన అన్యాయాలపై విచారణ చేయాలని, ఒక ఉన్నతాధికార సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరింద్రు.

తెలంగాణ నాయకుడు వికె ధాగే ఈ అరాచకాలపై 1960ల రాజ్యసభల మాట్లాడిండు. తెలంగాణల జరుగుతున్న అన్యాయాల విషయంల ఆంధ్రా పాలకులు జోక్యం చేసుకుని పరిస్థితి చక్కదిద్దాలని కోరిండు. లేకుంటే భవిష్యత్తుల తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వొస్తుందని హెచ్చరించిండు.

మరో తెలంగాణ సభ్యుడు హరిశ్చంద్రహెడి కూడా అప్పుడే రాజ్యసభల మాట్లాడిండు. పెద్ద మనుషుల ఒప్పందంలోని మౌలిక విషయాలనే పాలకులు మరిచి పోతున్నరని అన్నడు. తెలంగాణ ప్రాంత ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నరని, వెంటనే పరిస్థితిని చక్కదిద్దాలని కోరిండు.

ఈ పరిస్థితిల ప్రాంతీయ సంఘం అధ్యక్షుడు అచ్యుతరెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి తెలంగాణకు జరిగిన అన్యాయాలను ఏకరువు పెట్టిండు. అంతకుముందు ముఖ్యమంత్రి సంజీవరెడ్డికి ఈ విషయాలు చెప్పడానికి పోతే ఆంధ్రా అహంకారంతో అవమానకరంగా మాట్లాడిండు.

ఆంధ్ర ప్రాంతానికి చెందిన వాడైనా ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను మొదటిసారి అంగీకరిం చిండు. ఆ తర్వాత సరిదిద్దే ప్రయత్నం చేస్తమని చెప్పిండు. అయితే తెలంగాణ సమస్యలపై స్పందించిన సంజీవయ్య ముఖ్యమంత్రి పదవికి ఆంధ్రా నాయకులు ఎసరు పెట్టింద్రు. మల్లా నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి తెలంగాణ దోపిడీకి సహకరించిండు. తెలంగాణ నాయకులు ఈ అన్యాయాల మీద మాట్లాడ టానికి తయారైతే పదవుల ఆశచూపి వాళ్ల నోరు మూసిండు.

1967ల తెలంగాణ ప్రాంతీయ సంఘం రొండవ అధ్యక్షుడైన హయగ్రీవా చారి కూడ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుక పోయిండు. అయినా ఆంధ్రాపాలకులు పట్టించుకోలేదు. తెలంగాణ నాయకుల నోరు మూయడానికే ప్రయత్నించింద్రు. అన్ని రకాలుగా అణచివేతకు, దోపిడీకి గురైన తెలంగాణ పేలడానికి తయారైంది.

# ఉద్యమానికి రంగం సిద్ధం

అన్యాయం, దోపిడీ, వివక్షతో కుతకుత ఉడికిపోయిన తెలంగాణ ప్రజలు నిరసనలు తెలపడం మొదలుపెట్టింన్రు. 1968 జూలై 10న తెలంగాణ రక్షణల దినం పాటించిన్రు. హైదరాబాద్‌ల ఈ సమయంలనే ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంల కార్మికనాయకుడు మహదేవసింగ్ మాట్లాడిండు. తెలంగాణ ప్రజలను, కోరికలను అర్థంచేసుకొని ఆంధ్రాపాలకులు పొరపాట్లను సరిదిద్దు కోకపోతే సమైక్య రాష్ట్రం నుంచి తెలంగాణ విడిపోవాల్సి వొస్తుందని ప్రభుత్వాన్ని గట్టిగ హెచ్చరించిండు.

1967ల ప్రభుత్వం పాఠశాలల్లో ఫీజులను పెంచింది. దీనికి నిరసనగా తెలంగాణల విద్యార్థులు సమ్మెచేసిన్రు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పెంచిన ఫీజులను మల్లా తగ్గించింది. విద్యార్థులు ఈ విజయోత్సవంల ఉన్న సమయంల ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా ఆంధ్రా ప్రాంతానికి చెందిన డి.ఎస్.రెడ్డిని ముఖ్యమంత్రి కాసుబ్రహ్మానందరెడ్డి నియమించిండు. ఇది తెలంగాణ విద్యార్థుల ఆగ్రహానికి కారణమైంది.

తెలంగాణ ప్రజలు, విద్యార్థులు అన్యాయాలపై అరిచి మొత్తుకుంటున్నా ఆంధ్రాపాలకులు మాత్రం తమ దోపిడీని విడిచిపెట్టలేదు. తెలంగాణ ప్రజలను అణచి వేసుకుంట అక్రమాలు కొనసాగించిన్రు.

ఇక్కడ మర్రి చెన్నారెడ్డి ముచ్చట కూడ చెప్పుకోవాలె. 1967ల ఆయన అసెంబ్లీ ఎన్నికల్ల పోటీచేసి గెలిచిండు. ఆయన ప్రత్యర్థి వందేమాతరం రామచంద్ర రావు ఓడిపోయిండు. ఎన్నికల్ల చెన్నారెడ్డి అక్రమాలకు పాల్పడ్డడని రామ చంద్రరావు హైకోర్టును ఆశ్రయించిండు.

కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంల చెన్నారెడ్డికి చోటు దొరికింది. కాని ముఖ్యమంత్రికి చెన్నారెడ్డికి పొసగలేదు. తెలంగాణల గట్టి నాయకుడు అయిన చెన్నారెడ్డి ముఖ్యమంత్రి పదవి మీద గురిపెట్టిండు. ఇది కాసు బ్రహ్మానంద రెడ్డికి మింగుడు

పడలేదు. ఇద్దరి మధ్య మనస్పర్థలు పెరిగినయ్. ఒకరిని మరొకరు విమర్శించుకోవడం మొదలుపెట్టిండ్రు. ఈ సంగతి కేంద్రానికి చేరింది. ప్రధాన మంత్రి ఇందిరాగాంధి జోక్యం చేసుకున్నది. రెండు కత్తులు ఒక ఒరల ఇమడలేవని గ్రహించింది. పరిష్కారంగా చెన్నారెడ్డిని రాష్ట్ర రాజకీయాలకు కొద్ది కాలం దూరంగా ఉంచాలనుకుంది. చెన్నారెడ్డికి కేంద్రమంత్రి పదవి ఇచ్చింది. అప్పటికి ఆయన పార్లమెంటు సభ్యుడు కాదు. ఆ తర్వాత రాజ్యసభకు ఎన్నికైండు. రాజ్యసభ సభ్యుడిగా పదవీ స్వీకారం చేయడానికి తయారైండు.

వందేమాతరం రామచంద్రరావు ఫిర్యాదుపై విచారణ పూర్తి చేసిన హైకోర్టు ఈ సమయంల తీర్పు వెలువరించింది. 1968 ఏప్రిల్ 26న హైకోర్టు ఇచ్చిన తీర్పు చెన్నారెడ్డికి వ్యతిరేకంగా వొచ్చింది. చెన్నారెడ్డి ఎన్నిక చెల్లదని, ఆరేండ్లపాటు ఏ ఎన్నికలలోను పోటీ చేయరాదని హైకోర్టు తీర్పుల ఆదేశించింది. దీంతో చెన్నారెడ్డి కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వొచ్చింది.

ఆ తర్వాత చెన్నారెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించిండు. కాని అక్కడ కూడ ఆయనకు వ్యతిరేక తీర్పే వొచ్చింది. దీంతో చెన్నారెడ్డి రాజకీయ భవిష్యత్తు గందర గోళంల పడ్డది.

ఈ సమయంల ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి తనకు సహాయం చేయగలిగిన స్థితిల ఉండి కూడా చేయలేదని చెన్నారెడ్డి భావించిండు. దీంతో బ్రహ్మానందరెడ్డి మీద కోపం పెంచుకున్నడు.

ఒకవైపు ఆంధ్రాపాలకుల అన్యాయాలపై తెలంగాణ ప్రజలు అసహనంతో మండిపడుతుంటె చెన్నారెడ్డి అధికారానికి దూరమైనందుకు అసహనానికి గురైండు. అవకాశం కోసం ఎదురు చూసిండు. ఏ మాత్రం అవకాశం దొరికినా ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిని ఇబ్బంది పెట్టాలని కాచుకున్నడు.

# తెలంగాణ తొలి ఉద్యమం



# బ్రహ్మానందరెడ్డి బద్మాషీ

తెలంగాణ తొలి ఉద్యమానికి ఖమ్మం జిల్లా పాల్వంచ వేదికయింది. అక్కడున్న థర్మల్ పవర్‌స్టేషన్‌ల ఆంధ్రాప్రాంత ఉద్యోగులనే ఎక్కువ మందిని తీసు కుంద్రు. తెలంగాణ ప్రాంతం వారికి అన్యాయం జరిగింది. ఖమ్మం జిల్లా ఇల్లెందుకు చెందిన రామదాసు ఈ అన్యాయాలను మొదట వెలుగులకు తెచ్చిండు. రామదాసుపై పోలీసులు కేసులుపెట్టి నానాహింసకు గురిచేసింద్రు. ఎన్‌జీవో నాయకులు కూడ ఈ విషయంల పోరాటానికి తయారైంద్రు.

ఆ తర్వాత రవీంద్రనాథ్ అనే విద్యార్థి 1969 జనవరి 9న పాల్వంచలోని గాంధీచౌక్ వద్ద నిరవధిక దీక్షను ప్రారంభించిండు. ఈయనకు ఖమ్మం మున్సి పాలిటీ ఉపాధ్యక్షుడు కవిరాజమూర్తి మద్దతు తెలిపిండు. తెలంగాణ రక్షణలను అమలు చేయాలని, ఆంధ్రా నాయకులకు వ్యతిరేకంగ నినాదాలు చేసి ఊరేగింపు తీసింద్రు.

ఈ నిరసనలను ఆంధ్రోళ్ల చేతుల్ల ఉన్న పత్రికలు సరిగా రాయలేదు. దీంతో ఆగ్రహించిన ప్రజలు ఆ పత్రికలను తగులపెట్టి నిరసన వ్యక్తం చేసింద్రు.

ఖమ్మంల జరిగిన ఆందోళన తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు పాకింది. నిజామాబాద్‌ల విద్యార్థులు పాఠశాలలు బంద్‌చేసి నిరసన తెలిపింద్రు.

ఆ వెంటనే హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీల విద్యార్థి సంఘాల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంల తెలంగాణ రక్షణల అమలు కోసం ఉద్యమించాలని తీర్మానించింద్రు. దాంట్లె భాగంగ జనవరి 15 నుంచి సమ్మె చేయాలని నిర్ణయించింద్రు. దీనికి కొనసాగింపుగ జనవరి 13న ఉస్మానియా యూనివర్సిటీల తెలంగాణ విద్యార్థుల కార్యాచరణ సమితి ఏర్పాట యింది. ఈ సమితికి మెడికల్ విద్యార్థి అయిన మల్లికార్జున్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నరు.

అదేరోజు హైదరాబాద్ ప్రముఖులు సమావేశం ఏర్పాటు చేసింద్రు. ఈ సమావేశంల తెలంగాణ పరిరక్షణల కమిటీ ఆవిర్భవించింది. ఈ కమిటీకి సొతంత్ర

సమరయోధుడు కాటం లక్ష్మీనారాయణ అధ్యక్షునిగా ఎన్నికయ్యిండు. సభ్యులుగ మహదేవ్‌సింగ్, సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ, పద్మనాభన్, సంతపురి రాఘవరావు, మాధవరావు, జాకీర్‌హుసేన్ ఎన్నికయింఁడు. తెలంగాణ విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలపాలని ఈ సమావేశంల నిర్ణయం తీసుకుంఁడు.

ఖమ్మంల దీక్షకు కూచున్న రవీంద్రనాథ్ ఆరోగ్యం క్షీణించటంతో తెలంగాణ వేడెక్కింది. జనవరి 16న విద్యార్థులు హైదరాబాద్‌ల ఊరేగింపు తీసింఁడు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను తగలబెట్టింఁడు. ఉస్మానియా విద్యార్థులు అప్పటికే రెండు గ్రూపులుగ ఏర్పడ్డరు.

ఒకవర్గం తెలంగాణ తాత్కాలిక రక్షణలు కావాలని డిమాండు చేసింది. ఇంకో వర్గం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని డిమాండు చేసింది. తెలంగాణ రక్షణలు కోరిన వర్గంల మదన్‌మోహన్, రఘువరరావు, ఆదిరాజు వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నరు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కావాలని డిమాండు చేసిన వర్గంల మల్లికార్జున్, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నరు. జనవరి 18న హైదరాబాద్‌ల ఈ రెండువర్గాల విద్యార్థులు ఊరేగింపు తీసింఁడు. ఆబిడ్స్ చౌరాస్తాల రెండు గ్రూపులు ఎదురు పడటంతో ఘర్షణ జరిగింది.

అదే సమయంల తెలంగాణ ఉద్యోగులు హైదరాబాద్‌ల ఒక సమావేశం ఏర్పాటు చేసింఁడు. అక్రమంగ తెలంగాణల ఉద్యోగాలు పొందిన ఆరువేల మంది ఆంధ్రోళ్లను వెనుకకు పంపాలని డిమాండు చేసింఁడు. లేకుంటే ప్రత్యక్ష పోరాటానికి దిగుతమని ప్రభుత్వాన్ని హెచ్చరించింఁడు.

తెలంగాణ మొత్తం నిరసనలు, ఆందోళనలతో ఉడికిపోయింది. దీంతో ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి ఒక మెట్టు దిగివొచ్చిండు. తాత్కాలికంగా వేడిని తగ్గించ టానికి జనవరి 19న అఖిలపక్ష సమావేశం నిర్వహించిండు. ఆ సమావేశంల రెండు ప్రధాన సమస్యలు చర్చించింఁడు. ఒకటి తెలంగాణల ముల్కీ నిబంధనలకు విరుద్ధంగ పనిచేస్తున్న ఆంధ్రా ఉద్యోగుల లెక్క తేల్చటం. రెండోది తెలంగాణ మిగులు నిధుల లెక్క తేల్చటం. దీనికి గాను ఒక ఉన్నత అధికారిని నియమిం చాలని నిర్ణయం తీసుకుంఁడు.

అఖిలపక్ష సమావేశంల కింది నిర్ణయాలు తీసుకున్నరు.

ఉద్యోగాలు :

1959 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ప్రత్యక్ష నియామకాల ద్వారా గానీ, ప్రమోషన్లు, బదిలీల రూపంలగానీ తెలంగాణ స్థానికులకు రిజర్వు

చేసిన పోస్టులల్ల ప్రస్తుతం ఉన్న స్థానికేతరులను సర్వీసుల నుండి తొల గించాలె. ఆయా స్థానాలల్ల స్థానికులను భర్తీ చేయాలె. ఒకవేళ అర్హతలుగల స్థానికులు లేకపోతే అర్హత కలిగిన స్థానికులు దొరికేంత వరకు ఆ స్థానా లను ఖాళీగా ఉంచాలె. ఈ దిశగా వెనువెంటనే సత్వరచర్య తీసు కోవాలె. ఇట్ల తొలగించిన ఉద్యోగులకు ఆంధ్ర ప్రాంతంల ఉద్యోగాలల్ల నియమిం చాలె. వారి సర్వీసుకు ఎటువంటి విఘాతం కలిగించకూడదు. అవసరమైతే అదనపు ఉద్యోగాలు కల్పించి అయినా వారిని నియమించాలె.

ఈ నిర్ణయాన్ని అమలు చేసేందుకు ఇద్దరు ఉన్నతాధికారులను నియ మించాలె. వారు వెంటనే సమర్థవంతంగా ఈ పనిని పూర్తిచేయాలె.

తప్పుడు స్థానిక ధృవీకరణ పత్రాలతో కొందరు ఉద్యోగాలు పొందింద్రు అన్న ఆరోపణలు ఉన్నయ్. ప్రభుత్వం ఈ ఆరోపణలను విచారించి నిగ్గు దేల్చాలె.

శాసన నిర్మిత సంస్థలు :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ (నివాస ధృవీకరణ) చట్టంలోని నియా మకాలు స్థానిక ప్రభుత్వస్థాయి ఉద్యోగాలకు మాత్రమే వర్తిస్తయ్. హైకోర్టు ఇటీవల ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌బోర్డుల నియామకాలకు ఈ నియమాలు వర్తించవని తీర్పుచెప్పింది. అయితే ఈ ఉద్యోగాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నం దున రాష్ట్ర ప్రభుత్వం వీటిలో కూడా తెలంగాణ ప్రాంతపు ఉద్యోగాలకు రిజర్వేషన్లు కల్పించాలని భావించింది. అందుకే పై తీర్పునకు వ్యతిరేకంగా వెంటనే అప్పీలు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగ నియామక చట్టం కాల అవధిని మరో ఐదు ఏండ్లు పొడిగించాలనీ, దాని పరిధిలోకి చట్టం ద్వారా రూపొందిన సంస్థలను, ప్రభుత్వ మద్దతుపొందే ఇతర సంస్థలను తీసుకురావాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరుతున్నది.

ఉమ్మడి సీనియారిటీ లిస్టు (Intigrated Seniority List) :

కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర, తెలంగాణ అధికారుల విషయంల కామన్ గ్రెడేషన్ లిస్టు ఆమోదించిన సందర్భంల, లేక అటువంటి లిస్టు తయారు చేయడానికి, దాన్ని పునస్సమీక్షించేందుకు గైడ్‌లైన్స్ జారీచేసినా, కేంద్రం ఆమోదించిన లిస్టులు గానీ, కేంద్రం సూచనల మేరకు రూపొందిన లిస్టు ప్రకారం ఆయా ఆఫీసర్ల సర్వీసు కండిషన్ల రెగ్యులేషన్ జరుగుతుంది. కేంద్రం ఆమోదించని, సూచనలివ్వని సందర్భంల, రాష్ట్ర ప్రభుత్వం

పాటిస్తున్న ప్రొవిజనల్ లిస్టు ప్రకారం, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం వేచిచూస్తూ సర్వీసు కండిషన్ల రెగ్యులేషన్ జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం పోస్టుల ఈక్వేషన్ గురించిగానీ, కామన్ గ్రెడేషన్ లిస్టు రూపొందించేందుకు గానీ, సూచనలు ఇచ్చిన పక్షంల ఎటువంటి ఆలస్యం చేయకుండా ఆ సూచనలు అమలు చేయాలె.

తెలంగాణా మిగులు నిధులు :

తెలంగాణ మిగులు నిధులను కింది ప్రాతిపదికల ఆధారంగా రూపొందించాలె.

ఎ. ప్రస్తుతం రెండు ప్రాంతాలకు చేస్తున్న కేటాయింపులు, రాబడులను లెక్కిస్తున్న పద్ధతిని కొనసాగించాలె.

బి. తెలంగాణ వార్షిక మిగులు లెక్కగట్టేందుకు ఆ సంవత్సరపు తెలంగాణ ప్రాంతపు మొత్తం రెవిన్యూ మిగులుకు, తెలంగాణ ప్రాంతంల ఆ సంవత్సరంల వెచ్చించిన మూలధన వ్యయానికీ (capital expenditure) ఆ సంవత్సరపు మొత్తం మూలధన వ్యయంలోని 1/3 వంతు మొత్తానికీ మధ్య ఉన్న తేడాను కలపాలె.

సి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చట్టపరమైన బోర్డులు, కార్పోరేషన్లు, డిపార్ట్‌మెంట్లు, వేటికైతే ప్రభుత్వ అకౌంట్ల నుంచి ఖర్చుచేస్తున్నరో, వాటన్నింటిపై ఖర్చును తెలంగాణ మిగులును లెక్కించేటపుడు పరిగణనలోకి తీసుకోవాలె. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్‌బోర్డు విషయంల హైటెన్షన్ సప్లై, విద్యుదుత్పత్తి ఖర్చులను తెలంగాణ మిగులు లెక్కలకోసం పరిగణనలోకి తీసుకోవాలె. గ్రామీణ విద్యుదీకరణ, పంపిణీ లైన్లపై ఖర్చు ఆ యా ప్రాంతాలల్ల ఎంత జరిగితే (actuals) అంత లెక్కించాలె.

డి. తెలంగాణ ప్రాంతం కొరకు రూపొందించిన ఇండస్ట్రియల్ ట్రస్ట్ ఫండ్ ఉన్నది ఉన్నట్లుగా కొనసాగాలె. దాని లక్ష్యం కోసం వాడాలె.

ఆంధ్రప్రదేశ్ రూపొందిన నాటి నుండి, పై సూత్రం ఆధారంగా తెలంగాణ మిగులు లెక్కగట్టి, భవిష్యత్తుల ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసేందుకు భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, అకౌంటెంట్ జనరల్ స్థాయి సీనియర్ అధికారిని నియమించాలె. ఆ అధికారి 1969 ఫిబ్రవరి 28లోపు తన నివేదిక ఇయ్యాలె.

అట్ల లెక్కపెట్టిన తెలంగాణ మిగులును తెలంగాణ ప్రాంత అభివృద్ధికి రాబోయే అయిదు సంవత్సరాలల్ల ఖర్చుచేయాలె. భవిష్యత్తుల ఏర్పడే తెలంగాణ మిగులును ఆర్థిక సంవత్సరం చివర లెక్కించాలె. తర్వాత ఆర్థిక సంవత్సరంల తెలంగాణ ప్రాంతంల వెచ్చించాలె. ప్రతి ఆరునెలల కొకసారి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలోని ఖర్చులకు సంబంధించిన సమీక్ష ప్రతులను రీజనల్ కమిటీకి, శాసనసభ్యులకూ అందజేయాలె.

ఇదే సందర్భంల ఆంధ్రప్రాంతంల కూడా వెనుకబడిన ప్రాంతాలు ఉన్నయనీ, వెనువెంటనే ప్రాధాన్యతనిచ్చి అవికూడా అభివృద్ధి పరచవలసిన ప్రాంతాలని మేం గుర్తు చేస్తున్నం. సమతుల్య అభివృద్ధి సాధన కోసం ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యత నియ్యాలనీ, వెనుకబడిన ప్రాంతాలల్ల సత్వర అభివృద్ధికీ, ఉద్యోగ కల్పనకు ముఖ్య కార్యక్రమంగా చేపట్టాలనీ సూచిస్తున్నం.

విద్య :

రాబోయే విద్యాసంవత్సరం నుండి, ప్రాంతాలతో ప్రమేయం లేకుండా రాజధాని హైదరాబాదుల మంచి విద్యా సదుపాయాలను అందరు విద్యార్థులకు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటం.

పై చర్య తీసుకోవడం వల్ల, దానికి గట్టిగా కృషిచేయడం వల్ల తెలంగాణ ప్రాంతం వారు ముందుకుతెచ్చిన విద్యాపర సమస్యలు పూర్తిగా పరిష్కారమయితయ్. తెలుగు ప్రజల సాంస్కృతిక వికాసం, ఆర్థికాభివృద్ధి మాకు ప్రాధాన్యత గల అంశాలు. రాష్ట్రంల శాంతియుత పరిస్థితులు నెలకొల్పి ఐక్యతను, ప్రశాంతతనూ నెలకొల్పడం తక్షణ అవసరం. భారీగా పెట్టుబడులను రాష్ట్రంలకు రప్పించి, దాని ద్వారా యువతరానికి ఉపాధి కల్పనను పెంచడం ఎంతో అవసరం. మన సామాజిక జీవితంల విచ్ఛిన్నకర లక్షణాలను పెంచే ఏ చర్యా జరగరాదు. అందుకే మేం ముక్తకంఠంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై కొన్ని ప్రాంతాలల్ల వినవస్తున్న వాదనలను తీవ్రంగా ఖండిస్తున్నం. విభిన్న రాజకీయపక్షాలకు చెందిన మేము, మన రాష్ట్రం త్వరలో ఐక్యం కావడానికి మా శక్తియుక్తులన్ని వినియోగిస్తమని తీర్మానిస్తున్నం. భారతదేశపటంల ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ప్రముఖ స్థానం ఉంది. దేశంల జాతీయ సమగ్రత సాధించేందుకు మన మంతా కృషిచేయాలె. మన రాష్ట్రం పూర్తి ఐక్యతను సాధించడం అత్యంత ఆవసరం.

బేగంపేటలోని ఆనందనిలయంల జరిగిన ఈ అఖిలపక్ష సమావేశానికి హాజరైన నాయకులు : జె.చొక్కారావు, కె.అచ్యుతరెడ్డి, విబి రాజు, పి.నర్సింగ్‌రావు, సిహెచ్ రాజేశ్వరరావు, బద్రి విశాల్, వైవి కృష్ణారావు, జూపూడి యజ్ఞనారాయణ, కుడుపూడి ప్రభాకర్‌రావు, పివి నరసింహరావు, వి.రామారావు, ఎస్‌జంగారెడ్డి, రోడామిస్త్రీ, ఎ.వాసుదేవరావు, జె.వెంగళరావు, టి.పురుషోత్తమరావు, పి.నర్సారెడ్డి, సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ, టి. రంగారెడ్డి, పి.గోవిందరెడ్డి, కమాలుద్దీన్, కె. రామచంద్రా రెడ్డి, ఎర్రం సత్యనారాయణ, సిహెచ్.మూర్తిరాజు, కె.రాజమల్లు, కె.సుదర్శన్‌రెడ్డి, కాకాని వెంకటరత్నం, ఎంఎన్. లక్ష్మీనరసింహ, కాజా రామనాథం, టి.రామస్వామి, ఎస్.సిద్ధారెడ్డి, ఎన్.రామచంద్రారెడ్డి, అరిగె రామస్వామి, ఎన్.ప్రసాదరావు, సిద్ధిరెడ్డి తిమ్మారెడ్డి, జెవి.నర్సింగరావు, కెవి.నారాయణరెడ్డి, ఒవి.గురుమూర్తి, మహ్మద్ ఇబ్రహీం అలీ, జి.లచ్చన్న, వావిలాల గోపాల కృష్ణయ్య, నరసింహారెడ్డి, చెంచు రామానాయుడు, కొండా లక్ష్మణ్, కాసు బ్రహ్మానందరెడ్డి.

అఖిపక్ష సమావేశంల తీసుకున్న నిర్ణయాల ప్రకారం ప్రభుత్వం రొండు రోజుల తర్వాత 1969 జనవరి 21న జిఓ 36 విడుదల చేసింది. ఈ జిఓ తెలంగాణ రక్షణలు అమలుచేయడానికని ప్రభుత్వం చెప్పింది. 1969 ఫిబ్రవరి 28 లోపులనే నాన్‌ముల్కీలను వెనక్కు పంపుతమని ప్రభుత్వం ఆ జిఓల స్పష్టంగ చెప్పింది.

ఒకవైపు తెలంగాణ రక్షణల కోసం జిఓలు ఇచ్చుకుంట మరోవైపు కుట్రలు చేసిండు బ్రహ్మానందరెడ్డి. జిఓ 36 ను సవాల్ చేయాలని కొందరు ఆంధ్రా ఉద్యోగులను ఉసిగొల్పిండు. ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో జనవరి 31న జిఓ 36కు వ్యతిరేకంగ హైకోర్టుల ఐదుగురు తెలంగాణ ఉద్యోగినులు రిట్ దాఖలు చేసింద్రు. తమ భర్తలు ఆంధ్రోళ్లని, జిఓ 36ను అమలుచేస్తే తమ కుటుంబాలు ఇబ్బంది పడతయని వాదించింద్రు.

ఈ నేపథ్యంల ప్రభుత్వం 1969 జనవరిల కుమార్‌లలిత్ అనే అధికారితో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. మార్చి లోపలనే కుమార్ లలిత్ కమిటీ ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఆ నివేదిక ప్రకారం 4500 మంది ఆంధ్ర ఉద్యోగులు ముల్కి నిబంధనలకు విరుద్ధంగ తెలంగాణల పని చేస్తుంద్రు. మరొక ముఖ్య విషయం, తెలంగాణ మిగులు నిధులు 30.10 కోట్ల రూపాయిలని కుమార్ లలిత్ కమిటీ తేల్చి చెప్పింది.

ముఖ్యమంత్రి ఆ నివేదికను పాతర పెట్టడానికి మరో కుట్రకు పూనుకుంటున్న సమయంలనే 1969 ఫిబ్రవరి 3న హైకోర్టు తీర్పు వెల్లడించింది. జిఓ 36

రాజ్యాంగ విరుద్ధమని చెప్పింది. దీనికి తోడు అన్నట్టు జిఓ 36 అమలును ఆపేయాలని సుప్రీం కోర్టు 1969 ఫిబ్రవరి 18న స్టే ఇచ్చింది.

కోర్టుల తీర్పులు, ప్రభుత్వ కుట్రలు తెలంగాణ ఉద్యమకారులకు కోపాన్ని తెప్పించినయ్. ఈ లోపుల 1969 ఫిబ్రవరి 20న హైకోర్టు మరో తీర్పు ఇచ్చింది. ముల్కీ నిబంధనలు రాజ్యాంగ సమ్మతమే అన్నది. జిఓ 36ను సమర్థించింది. అయితే అక్రమంగ తెలంగాణ ఉద్యోగాలల్ల చేరిన ఆంధ్రా ఉద్యోగులను వెనుకకు పంపొద్దని ఆ పోస్టులకు సమానంగ తెలంగాణ కోసం సూపర్‌న్యూమరీ పోస్టులను సృష్టించాలని ఆదేశించింది.

ఈ తీర్పు తెలంగాణ వాదులను తృప్తి పరచలేకపోయింది. అక్రమంగ తమ ఉద్యోగాలల్ల చేరిన ఆంధ్రోళ్లను వెనుకకు పంపకుండ తమకు సూపర్‌న్యూమరీ పోస్టులను సృష్టించి ఇయ్యడం ఏందని అసహనానికి లోనయ్యిండ్రు.

పరిస్థితిని కొంత శాంతింప జేయడానికి కెవి రంగారెడ్డి పూనుకున్నడు. తెలంగాణ సమస్యలను చర్చించడానికి 1969 ఫిబ్రవరి 23న అన్ని పార్టీలను పిలిచి మాట్లాడిండు. 1952 ఉద్యమం తర్వాత, తెలంగాణల జరిగే ఉద్యమాలకు దూరంగా ఉన్న రంగారెడ్డి మల్లా తలదూర్చిండు.

ఇదే సమయంల 1969 ఫిబ్రవరి 28న ముల్కీ నిబంధనలు మరో ఐదేండ్లు పొడిగించడానికి వీలుకల్పించే బిల్లు రాజ్యసభల ఆమోదం పొందింది. ఆరోగ్యం క్షీణించిన ఖమ్మం రవీంద్రనాథ్ విద్యార్థినాయకుడు వెంకట్రామరెడ్డి చొరవతో తన 17 రోజుల నిరవధిక దీక్షను విరమించిండు. కాని తెలంగాణ శాంతించలేదు. ప్రభుత్వ పక్షపాతంపై తెలంగాణ ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు అసహనంతోనే ఉన్నరు. పోరాటం కొనసాగించక తప్పదని భావించిండ్రు.

జనవరి 24న సదాశివపేటల ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరిపిండ్రు. ఆ కాల్పులల్ల గాయపడిన శంకర్ అనే యువకుడు గాంధీ ఆస్పత్రిల చికిత్స పొందుతూ తెల్లారి చనిపోయిండు. జనవరి 30న గజ్వేల్‌ల జరిగిన కాల్పులల్ల నర్సింహులు అనే విద్యార్థి చనిపోయిండు.

మార్చి 14న చొక్కారావు అధ్యక్షతన తెలంగాణ ప్రాంతీయ సంఘం ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చింది. ప్రభుత్వం తెలంగాణ ఉద్యోగులపై పక్షపాతంతో వ్యవహరిస్తున్నదని ఈ నివేదికల దుయ్యబట్టిండ్రు.

1969 మార్చి 28న ముల్కీరూల్స్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంల తెలంగాణ వాదులు అసహనానికి గురయ్యిండ్రు. తెలంగాణ వాదుల కోపాన్ని

చల్లార్చడానికి సుప్రీం కోర్టు ముల్కీ రూల్స్‌ను కొట్టి వేసిన రోజే బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వం వాంఛూ అధ్యక్షతన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఆంధ్రా పాలకుల తీరుకు నిరసనగా అదే రోజు కొండా లక్ష్మణ్ మంత్రి పదవికి రాజీనామా చేసిండు. తెల్లారి ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ సమితిని ఏర్పాటు చేసిండు.

ఈ కుట్రల భాగంగ 1969 ఏప్రిల్ 11న జస్టిస్ వశిష్ట భార్గవ కమిటీని నియమించిండు. భార్గవ కమిటీకి అప్పగించిన పనేందంటే కుమార్ లలిత్ రిపోర్ట్‌పై విచారణ చేయటం. అంటే కమిటీ, దాని మీద ఇంకొక కమిటీ. ఇది ఎప్పటికి ముందల పడొద్దు అనేదే బ్రహ్మానందరెడ్డి పాచిక.

భార్గవ కమిటీ కూడ తెలంగాణ మిగులు నిధులు 28.44 కోట్ల రూపాయిలని చెప్పింది. అక్రమ ఆంధ్రా ఉద్యోగుల విషయంల కూడా దాదాపు కుమార్ లలిత్ కమిటీ చెప్పిన సంఖ్యనే నిర్ధారించింది.

అఖిలపక్ష ఒప్పందంల చేసిన నిర్ణయాలను అమలు చేయడానికి జివో 36 విడుదల చేసిన ముఖ్యమంత్రి అది అమలు కాకుండా అడ్డంకులు సృష్టించడం తెలంగాణ ప్రజలకు ఆగ్రహం కలిగించింది. కమిటీల మీద కమిటీలు వేయడం అసహనానికి గురిచేసింది. కుమార్ లలిత్ కమిటీ చెప్పిందే భార్గవ కమిటీ నిర్ధారించినా చర్యలు తీసుకోకుండా నాన్చడం కోపం తెప్పించింది. చివరికి భార్గవ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగింద్రు.

# నెత్తురోడిన తెలంగాణ

ఉద్యమం ఊపందుకుంది. విద్యార్థులు, ఉద్యోగులు ఉద్యమంలకు వొచ్చింండ్రు. ఈ నేపథ్యంల విద్యార్థినాయకుల ఆధ్వర్యంల 1969 ఫిబ్రవరి 28న తెలంగాణ ప్రజా సమితి ఏర్పడింది. ఈ సమితికి మదన్‌మోహన్ అధ్యక్షునిగా ఎన్నికయిండు. శాసనసభ్యుడు టి.పురుషోత్తమరావు ఈ ప్రజా సమితికి మొట్ట మొదట మద్దతు ఇచ్చిండు. మరికొంతమంది శాసనసభ్యులు కూడ ఆ తర్వాత మద్దతు తెలిపింండ్రు.

మార్చి 8,9 తారీకులల్ల హైదరాబాద్‌లోని రెడ్డిహాస్టల్‌ల ఒక సమావేశం జరిగింది. ఈ సమావేశంల ఉద్యమ బాధ్యతలు పెద్దలకు అప్పగిస్తున్నట్లు సమితి విద్యార్థి నాయకులు ప్రకటించింండ్రు. ఆ రోజు మొట్టమొదటిసారిగ తెలంగాణ చిత్రపటాన్ని టి.పురుషోత్తమరావు ఆవిష్కరించిండు. ఆనాటి సభకు సదాలక్ష్మి అధ్యక్షత వహించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏప్రిల్ 11లోగా ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరుతూ ఆరోజు ఆదిరాజు వెంకటేశ్వరరావు తీర్మానాన్ని ప్రవేశపెట్టిండు. ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింండ్రు.

ఏప్రిల్ 5న సికిందరాబాద్‌లోని అంజలి టాకిస్ చౌరాస్తాల బూరుగు మహదేవ్ హాలుల కమ్యూనిస్టు పార్టీ బహిరంగసభ జరిగింది. రాష్ట్ర సమైక్యతను కోరుకుంటనే కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రక్షణలు అమలు చేయాలని డిమాండు చేసింది. ఈ సభల కమ్యూనిస్టులు తెలంగాణ ఉద్యమ నాయకులను విమర్శిం చింండ్రు. తెలంగాణ ఉద్యమం మీద విషం కక్కింండ్రు. దీంతో తెలంగాణవాదులు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగ నినాదాలు చేసింండ్రు. తెలంగాణవాదులకు, కమ్యూస్టులకు మధ్యన గొడవ జరిగింది. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు లాఠీచార్జి చేసింండ్రు. ఈ ఘటనల 27 మందికి దెబ్బలు తగిలినయ్.

తెల్లారి తెలంగాణల అరెస్టులు జరిగినయ్. తెలంగాణ వాదులను పిడి యాక్ట్ కింద అరెస్టు చేసింండ్రు. మల్లికార్జున్, మదన్‌మోహన్ వంటి నాయకులను అరెస్టు

చేసింద్రు. అరెస్టు అయినోళ్లల్ల తెలంగాణ ఎమ్మెల్యేలు కూడా ఉన్నరు.

తెలంగాణవాదుల అరెస్టులకు నిరసనగా ఏప్రిల్ 11న హైదరాబాద్‌ల సామూహిక సత్యాగ్రహం జరిగింది. ఈ సత్యాగ్రహంల శాసనసభ్యులు అచ్యుతరెడ్డి, టి.అంజయ్య, మానిక్‌రావు, హాషిమ్ తదితరులు పాల్గొన్నరు. సత్యాగ్రహంల పాల్గొన్నం దుకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తెలంగాణ శాసనసభ్యులను పార్టీ నుంచి బహిష్కరించింది. దీంతో ఉద్యమం మరింత తీవ్రమైంది.

ఉద్యమ తీవ్రత డిల్లీకి చేరింది. ఇందిరాగాంధి ఢిల్లీల ఆదలబాదల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి హాజరుకమ్మని మర్రి చెన్నారెడ్డి, కొండా లక్ష్మణ్, నూకల రామచంద్రారెడ్డి, జె.చొక్కారావు తదితరులకు ఇందిరాగాంధీ అహ్వానం పంపింది. డిల్లీ సమావేశానికి ఈ నాయకులు హాజరయ్యింద్రు. ఇదే సమావేశానికి మరికొంతమంది కూడ హాజరయింద్రు. అయితే వారిలో ముఖ్య మంత్రి బ్రహ్మానందరెడ్డి గోసులు సదిరే వాళ్లు కూడ ఉన్నరు. విద్యార్థినాయకులను ఈ సమావేశానికి ఆహ్వానించ లేదు. ఆ సమయంల వారు జైళ్లలోనే ఉన్నరు.

ఇందిరాగాంధీతో తెలంగాణ నాయకులు చర్చలు జరిపింద్రు. అయితే ఈ చర్చలు తృప్తిపరచలేదు. ఇందిరాగాంధీ మాత్రం తెలంగాణ ఉద్యమాన్ని తాత్కాలికంగా అయినా సల్లార్చాలన్న పట్టుదలతో ఉంది. తెలంగాణ నాయకులకు ఇష్టం లేకున్నా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంది. తెలంగాణ అసంతృప్తిని పోగొట్ట టానికి అష్టసూత్ర పథకాన్ని రూపొందించింది. 1969 ఏప్రిల్ 12న పార్లమెంటుల అష్టసూత్ర పథకం ప్రకటించింది.

అష్టసూత్రాలు:

1. ఆంధ్రప్రాంతానికి తరలించిన తెలంగాణ మిగులు నిధుల లెక్కలు తీయడానికి ఉన్నతాధికార సంఘం ఏర్పాటు.
2. కోల్పోయిన తెలంగాణ నిధులను సమకూర్చాలె.
3. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రణాళికలు రూపొందించడానికి కమిటీ.
4. ప్రణాళికలను అమలు జరపడానికి ప్రణాళిక సంఘం సలహాదారు అధ్యక్షతన అధికారుల కమిటీ.
5. కమిటీలోని అధికారులకి ఎక్కువ అధికారాలు ఉండేటట్లు చేయటం.

6. తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాలను స్థానికులకే చెందేటట్లు కట్టుదిట్టం చేయాలె.
7. తెలంగాణ ఉద్యోగస్తుల సర్వీసుకి సంబంధించిన సమస్యల పరిష్కారం.
8. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఇక నుండి కేంద్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ వహిస్తుంది.

ఈ పథకం తెలంగాణవాదులను సంతృప్తి పరచలేక పోయింది. తెలంగాణల నిరసనలు కొనసాగినయ్. దీంతో ఈ అష్టసూత్ర పథకం అమలులకు రాలేదు.

తెలంగాణల ఉద్యమాలు జరుగుతనే ఉన్నయ్. పరిస్థితిల మార్పు రాలేదు. ఇందిరాగాంధి ఆ తర్వాత కూడా సమితి నాయకులతో చర్చలు జరపడానికి ప్రయత్నించింది. తనను కలిసిన తెలంగాణ నాయకులతో ఈ మాట చెప్పింది. ఆ తర్వాత మరోసారి సమితికి ఆహ్వానాలు పంపింది. కాని సమితినాయకులు ఆ ఆహ్వానాన్ని తిరస్కరించింద్రు. ఆమెతో చర్చలకు ఇష్టపడలేదు. అప్పటివరకు జరిగిన ఉద్యమాన్ని ప్రభుత్వం శాంతిభద్రతల సమస్యగానే చూసింది. విద్యార్థుల ఉద్యమంగానే భావించింది.

కోర్టు తీర్పుతో దెబ్బతిని అప్పటి వరకు ఉద్యమానికి దూరంగ ఉన్న చెన్నారెడ్డి ఇందిరాగాంధీతో సమావేశం అయిన తర్వాత ఉద్యమంలకు రావాలను కుండు. ఈ ప్రయత్నంల భాగంగా ఏప్రిల్ 21న మర్రి చెన్నారెడ్డి కాంగ్రెస్ నాయకుడిగ ప్రత్యేక తెలంగాణను సమర్థిస్తూ ప్రకటన చేసిండు. దీంతో ఆయన ప్రత్యక్ష ఉద్యమంలకు రావడానికి రంగం సిద్ధమైంది.

ఆ సమయంల తెలంగాణ ప్రజా సమితి అధ్యక్షుడిగా మదన్‌మోహన్ ఉన్నడు. ఉద్యమం ముందుకు పోతున్నందున భవిష్యత్తుల ప్రధాని ఇందిరాగాంధీతో గాని, కేంద్ర మంత్రులతోగాని మాట్లాడే స్థాయిలో మదన్‌మోహన్ లేడని కొందరు సీనియర్ నాయకులు వాదించడం మొదలుపెట్టింద్రు. ఈ సమయంల భద్రివిశాల్ పిట్టి, బి.సత్యనారాయణరెడ్డి, పోల్సాని నర్సింగరావు, కోదాటి రాజమల్లు, జి.రాజారాం వంటి నాయకులు చెన్నారెడ్డి నాయకత్వాన్ని సమర్థించింద్రు. చెన్నారెడ్డికి సమితి బాధ్యతలు అప్పగించాలని కోరింద్రు. రెడ్డి నాయకుడే ఉద్యమాన్ని సమర్థవంతంగ నిర్వహించగలడని ప్రచారం చేసింద్రు. తెలంగాణ ఉద్యమంలకు రావడానికి చెన్నారెడ్డినే ఈ ప్రచారాన్ని చేయిస్తుండని కూడా ఈ సమయంల ప్రచారం అయ్యింది.

అయితే చెన్నారెడ్డికి తెలంగాణ ప్రజాసమితి అధ్యక్ష పదవి అప్పగించాల్సిన అవసరం లేదని అడ్‌హక్ కమిటీలోని నలుగురు సభ్యులు వాదించింద్రు. కాని చెన్నారెడ్డి

అనుచరులు ఆ నలుగురి నోర్లు మూసింద్రు. సమితి అధ్యక్షునిగా మదన్‌మోహన్ కొనసాగాలని చాలామంది కోరింద్రు. కాని అప్పటికే చెన్నారెడ్డి సమితి మీద పట్టు సంపాయించిండు. తన అనుచరులతో సమితిలోని వ్యతిరేకుల నోర్లు మూయించిండు. తనకు అనుకూల వాతావరణాన్ని సృష్టించుకుండు. చివరికి మదన్‌మోహన్ తప్పుకున్నడు. 1969 మే 22న తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షునిగ చెన్నారెడ్డి ఎన్నికయ్యిండు. అదేరోజు నూతన కార్యవర్గాన్ని ప్రకటించిండు.

రాజకీయ నిరుద్యోగి అయిన చెన్నారెడ్డి ఆ తర్వాత ఉద్యమాన్ని ఉధృతం చేసిండు. ఆనాటి వరకు కొండా వెంకటరంగారెడ్డి ప్రత్యేక తెలంగాణవాదాన్ని సమర్థించ లేదు. కాని అల్లుడు తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడు అయినంక ప్రత్యేక తెలంగాణ వాదానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటన చేసిండు.

1969 మే 25న మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్‌ల జరిగిన ఒక బహిరంగ సభల ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి మాట్లాడిండు. ఆనాడు బ్రహ్మానంద రెడ్డి చేసిన ప్రసంగం ఉద్రేకాలను రెచ్చగొట్టింది. ఒక ఉన్మాది లెక్క మాట్లాడిండు. ఆయన మాట్లాడిన తీరును ఆయన దగ్గరోళ్లు కూడ చీదరించుకుంద్రు. ఆ సభల తెంలగాణవాదులు తీవ్ర నిరసన తెలిపింద్రు. ముఖ్యమంత్రి తిరిగి హైదారాబాద్ వస్తుంటే అడుగడుగున నిరసన తెలిపింద్రు. ఆ రోజు కాల్పులు జరిగినయ్. ఆ కాల్పులల్ల ముగ్గురు చనిపోయింద్రు. అనేకమందికి దెబ్బలు తగిలినయ్.

తెలంగాణ వాదులపై కాల్పులకు నిరసనగా మే 26 నుంచి సామూహిక సత్యాగ్రహాలు కొనసాగించాలని తెలంగాణ ప్రజాసమితి నిర్ణయించింది. దాంతోటి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని భావించింది. ఇందుకుగాను తెలంగాణ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపింది. ఈ విషయం తెలుసుకున్న బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం ఎన్‌జిఓల సంఘం నాయకుడు కెఆర్ ఆమోస్‌ను డిస్మిస్ చేసింది. ఉపాధ్యాయ సంఘానికి గుర్తింపు రద్దు చేసింది.

ఉద్యోగ సంఘాలు సహాయనిరాకరణ ప్రారంభించాలని నిర్ణయించినయ్. కాని ప్రభుత్వం సమ్మెలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంల మే 30న చంచల్‌గూడ జైల్ల కూడ ఘర్షణ జరిగింది. సత్యాగ్రహ ఖైదీలకు, జైలుల శిక్ష అనుభవిస్తున్న ఆంధ్రా ఖైదీలకు మధ్య గొడవ జరిగింది. అనేకమంది సత్యాగ్రహులు ఈ గొడవల గాయపడ్డరు. జైలుల గాయపడిన సత్యాగ్రహులను పరామర్శించడానికి పోయిన తెలంగాణ సమితి నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేసింద్రు. ఈ వార్త తెలంగాణ అంతటా వ్యాపించింది.

హైదరాబాద్ నగరంల మే 1న నిరసన ర్యాలీలు తీసింద్రు. రాజ్‌భవన్‌ల గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించడానికి పోయిన నాయకులపై కూడ పోలీసులు లాఠీచార్జి చేసింద్రు. ఈ గొడవలనే ఉద్యమకారులు పోయి గవర్నర్ ఖండూభాయ్ దేశాయ్‌కి వినతిపత్రం సమర్పించింద్రు. ప్రభుత్వాన్ని రద్దుచేయాలని రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండు చేసింద్రు.

ప్రతినిధి బృందం గవర్నర్‌తో మాట్లాడుతుండంగనే బయట ఉన్న ఉద్యమ కారులపై పోలీసులు మల్లా లాఠీచార్జి చేసింద్రు. ప్రజలకు పోలీసులకు తీవ్రమైన ఘర్షణ జరిగింది. ఈ సందర్భంల పోలీసులు కాల్పులు జరిపింద్రు. 15 నుంచి 20 మంది ఉద్యమకారులు కాల్పులల్ల చనిపోయింద్రు.

ప్రభుత్వ దమనకాండకు నిరసనగా తెలంగాణబంద్‌కు పిలుపునిచ్చింద్రు. జూన్ 2న తెలంగాణల సంపూర్ణ బంద్ జరిగింది. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలు తగల బెట్టింద్రు. ఎక్కడికక్కడ నిరసనలు వెల్లువెత్తినయ్. తెలంగాణ అగ్నిగోళమైంది.

# అర్ధరాత్రి ప్రధాని రాక

రాజ్‌భవన్ దగ్గర జరిగిన కాల్పుల వార్త తెలంగాణ అంతటా పాకింది. తెలంగాణ ప్రజలు మండిపోయింద్రు. 1969 జూన్ 3న నిరసనగా 'గూండాయిజం వ్యతిరేకదినం' జరపాలని తెలంగాణ ప్రజా సమితి, విద్యార్థి కార్యాచరణ సమితి నిర్ణయించినయ్. ఉద్యమ మంటలు ఢిల్లీకి చేరినయ్. ఢిల్లీ నుంచి ముఖ్యమంత్రికి పిలుపు వొచ్చింది.

జూన్ 4న హైదరాబాద్ నగరం యుద్ధభూమిగ మారింది. ప్రజలు రెచ్చిపోయి ప్రభుత్వ ఆస్తులను తగలపెట్టింద్రు. అనేకచోట్ల పోలీసులు కాల్పులు జరిపింద్రు. ఈ కాల్పులల్ల అనేకమంది తెలంగాణ వాదులు చనిపోయింద్రు. దీంతో తెలంగాణ అట్టుడికింది. హైదరాబాద్ నగరమంతట కర్ఫ్యూ విధించింద్రు.

తెలంగాణల పరిస్థితి ఉన్నది ఉన్నట్టుగ ఢిల్లీకి చేరింది. కాల్పులు, చని పోయిన వారి వివరాలు ప్రధాని ఇందిరాగాంధీకి చేరినయ్. ఆమె కలత చెందింది. ఢిల్లీలనే ఉన్న ప్రాంతీయసంఘం అధ్యక్షుడు చొక్కారావును పిలిపించుకుంది. తెలంగాణ పరిస్థితిని అడిగి మరీ తెలుసుకుంది. వెంటనే ఆయనను వెంటపెట్టుకొని సాయంత్రం విమానంల హైదరాబాద్‌కు వొచ్చింది. ఆరోజే డిల్లీ నుంచి రాజధానికి చేరిన ముఖ్య మంత్రికి కూడ ప్రధాని హైదరాబాద్ వొచ్చే సంగతి తెలియదు.

అధికారులు, తెలంగాణ నాయకులతో ప్రధాని పరిస్థితిని సమీక్షించింది. ప్రజాసమితి నాయకుడు చెన్నారెడ్డిని పిలిపించి మాట్లాడింది. తెల్లారి తను ఆఫ్ఘనిస్తాన్ వెళ్లాల్సి ఉన్నదని, ఉద్యమాన్ని తాత్కాలికంగా ఆపితే తిరిగి వొచ్చినంక అన్ని విషయాలు చర్చిస్తనని చెప్పింది.

రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన పెట్టాలని చెన్నారెడ్డి ప్రధాన మంత్రిని కోరిండు. అప్పుడు ఉద్యమాన్ని తాత్కాలికంగ ఆపడానికి ప్రయత్నం చేస్తనని చెప్పిండు. ఈ ప్రభుత్వంల చర్చలకు అనుకూలమైన వాతావరణం లేదని తెలిపిండు. పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలని విన్నవించిండు.

అదే రోజు రాత్రి మూడుగంటలకు ఇందిరాగాంధీ తిరిగి ఢిల్లీ వెళ్లి పోయింది. 33 గంటల తర్వాత జూన్ 6న హైదరాబాద్‌ల కర్ఫ్యూ సడలించిండ్రు.

రోజురోజుకు ఉద్యమం మరింత ఉధృతమైంది. జూన్ 7న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కోరుతూ విద్యుత్ ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులు నిరవధిక సమ్మె ప్రారంభించిండ్రు. జూన్ 11 నుండి నిరవధిక సమ్మె చేయాలని ఎన్‌జీవోల సంఘం నిర్ణయించింది.

అప్పుడే రాష్ట్ర పర్యటనకు వొచ్చిన కేంద్ర హోంమంత్రి చవాన్ ఉద్యమ కారులను పిలిపించుకొని మాట్లాడిండు. రాష్ట్రపతి పాలన విధిస్తే తప్ప చర్చించ లేమని తెలంగాణ ప్రజాసమితి నాయకులు, విద్యార్థినాయకులు కేంద్రమంత్రికి చెప్పిండ్రు. తెలంగాణ వ్యతిరేకి అయిన బ్రహ్మానందరెడ్డిని ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండు చేసిండ్రు. అయితే ఈ డిమాండు తెలంగాణ ఉద్యమ పరిస్థితులల్ల చేసింది కాదు. బ్రహ్మానందరెడ్డి మీద వ్యక్తిగత కక్షతో చెన్నారెడ్డి చేయించింది.

కేంద్ర హోంమంత్రి ఢిల్లీ వెళ్లిపోయిన మరుక్షణం పోలీసులు ఎన్‌జీవోలపై విరుచుకు పడ్డరు. అరెస్టు చేసిండ్రు. అయినా ఎన్‌జీవోలు జూన్ 10 నుంచి సమ్మె ప్రారంభించిండ్రు. ఈ సమ్మె చారిత్రాత్మకంగా 35 రోజులు కొనసాగింది.

కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని ప్రజాసమితి, విద్యార్థిసంఘాలు నిర్ణయించినయ్. జూన్ 16న ఉద్యమ భవిష్యత్ కార్యక్రమాన్ని తెలంగాణ ప్రజా సమితి ప్రకటించింది. సత్యాగ్రహాలు కొనసాగించాలని నిర్ణయించింది. ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకించే ప్రజాప్రతినిధుల ఇండ్ల ముందు నిరసనలు తెలపాలని, పన్నులు చెల్లించకుంట సహాయనిరాకరణ చేయాలని, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాజీనామాలు చేయాలని నిర్ణయించిండ్రు.

ఈలోపుల చెన్నారెడ్డికి, కొండా లక్ష్మణ్‌కు ఢిల్లీ నుంచి పిలుపు వొచ్చింది. చర్చలకు రావాలని పిలిచిండ్రు. ప్రత్యేక రాష్ట్రంతో సహ అన్ని అంశాలు మాట్లాడుదామని పిలవడంతో ఈ ఇద్దరు ఢిల్లీకి పోయిండ్రు. జూన్ 24న మొరార్జీదేశాయ్, చవాన్‌లతో చర్చించిండ్రు. అయితే చర్చలు విఫలమైనయ్. ఇద్దరు నాయకులు అదే రోజు తిరిగి హైదరాబాద్ కొచ్చిండ్రు.

ఆ రోజు సాయంత్రం ముషీరాబాద్ జైలుల సత్యాగ్రహులకు, జైలుల ఉన్న ఆంధ్రాఖైదీలకు ఘర్షణ జరిగింది. గాయపడిన సత్యాగ్రహులను పరామర్శించడానికి వొచ్చిన ప్రజలపై పోలీసులు లాఠీచార్జి చేసిండ్రు. పార్లమెంటు సభ్యుడు వెంకటస్వామి జీపుల అక్కడకు రాగానే గుర్తుతెలియని వ్యక్తి తుపాకి పేల్చిండు. తుపాకి గుండు

టైరుకు తగిలి జీపు బోల్తాపడ్డది. జీపుల ఉన్న వెంకటస్వామికి ఆయన అనుచరులకు దెబ్బలు తగిలినయ్. ముఖ్యమంత్రి తనను చంపేందుకు కుట్ర చేసిండని, దాని ఫలితమే తనపై దాడి అని వెంకటస్వామి ఆరోపించిండు. ఈ దాడికి నిరసనగా తెల్లారి తెలంగాణ బంద్‌కు పిలుపు నిచ్చిండ్రు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా జిఎస్ మెల్కోటే, సంగెం లక్ష్మీబాయి తమ పార్లమెంటు సభ్యత్వాలకు రాజీనామా ఇచ్చిండ్రు. గాంధీభవన్‌ల ప్రజాసమితి అధ్యక్షుడు చెన్నారెడ్డికి ఈ రాజీనామా పత్రాలను అందించిండ్రు. నాలుగు రోజులకు ఆరోగ్యం కోలుకున్నంక వెంకటస్వామి కూడ రాజీనామా పత్రాన్ని ఇచ్చిండు.

చర్చలు విఫలం కావడం, పార్లమెంటు సభ్యులు రాజీనామాలకు సిద్ధం కావడం ఇందిరాగాంధీకి చికాకు కలిగించింది. పరిస్థితులను అదుపు చేయాలని భావించింది. ఫలితంగా హైదరాబాదు చేరిన తెలంగాణ నాయకుల అరెస్టుకు సిద్ధమైంది. అదే రోజు అర్ధరాత్రి పోలీసులు చెన్నారెడ్డిని, ఎనిమిది మంది శాసన సభ్యులను మరో 21 తెలంగాణ ఉద్యమ నాయకులను పిడి యాక్టు కింద అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించిండ్రు. తెల్లారే సరికి ఈ అరెస్టు వార్త గుప్పుమన్నది.

తెలంగాణ అంతటా నిరసనలు బంద్‌లు జరిగినయ్. తెలంగాణ ప్రజా ప్రతినిధుల ఇండ్ల ముందు నిరసనలు తెలిపిండ్రు. నాయకులు జైలుల ఉన్నా ప్రజా ఉద్యమం ఉధృతంగా సాగింది. ఆగస్టు 25న తెలంగాణ ఉద్యమ నాయకు లను విడుదల చేయమని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. దీంతో వారు జైలు నుంచి బయిటికి వొచ్చిండ్రు. ఆ తర్వాత సెప్టెంబర్ నుంచి ఉద్యమ తీవ్రత తగ్గింది. నాయకులు ప్రజల మధ్య సమన్వయం లోపించింది.

ఈ సమయంల 1969 సెప్టెంబర్ 9న కేంద్రం నియమించిన వాంఛూ కమిటీ నివేదిక సమర్పించింది. ముల్కీ నిబంధనలను కొనసాగించటానికి ఆస్కారం లేదని చెప్పింది. రాజ్యాంగాన్ని సవరించటానికి కూడా వీలుకాదని ప్రకటించింది. తెలంగాణకు నష్టం కలిగించేటట్లు వాంఛూ కమిటీ నివేదిక ఉన్నా తెలంగాణల పెద్దగా నిరసన వ్యక్తం కాలేదు.

అప్పటి వరకు ఉద్యమంల ఉత్సాహంగ పాల్గొన్న చెన్నారెడ్డి, ఆయన అను చరులు పట్టించుకోనట్లుగా ఉన్నరు. తెలంగాణ రాష్ట్ర సాధన కంటె ముఖ్య మంత్రిని మార్చటం లక్ష్యంగా పనిచేసిండు చెన్నారెడ్డి. కొండా లక్ష్మణ్ కూడా రాష్ట్ర నాయకత్వాన్ని మార్చాలని కేంద్రానికి విన్నవించిండు.

వరంగల్‌ల సెప్టెంబర్ 18న ఉద్యమాన్ని తాత్కాలికంగ వాయిదా వేసి తరగతులకు హాజరుకావాలని వైద్యవిద్యార్థులు నిర్ణయించిండ్రు. సెప్టెంబర్ 19న రాష్ట్ర నాయకత్వాన్ని మార్చాలని 70 మంది తెలంగాణ శాసనసభ్యులు కేంద్రానికి విజ్ఞప్తి చేసిండ్రు.

తెలంగాణ ఉద్యమాన్ని పక్కకు పెట్టి వ్యక్తిగత ఎజెండాతో పనిచేయడం మొదలు పెట్టిండు చెన్నారెడ్డి. ముఖ్యమంత్రిని మార్చడమే లక్ష్యంగా పెట్టుకుండు. శాసనసభ్యుల వినతుల వెనుక ఉన్నది కూడా ఆయనే. చెన్నారెడ్డి వ్యవహార శైలి తెలంగాణ వాదులు ఇష్టపడలేదు. సెప్టెంబర్ 19న తెలంగాణ ప్రజాసమితి ఉపాధ్యక్షుడు వీరారెడ్డి ఒక ప్రకటన చేసిండు. చెన్నారెడ్డి తెలంగాణ ఉద్యమం నుంచి తప్పుకోవాలని డిమాండు చేసిండు. నిజాయితీ గల మరొకరికి తెలంగాణ ప్రజా సమితి బాధ్యతలు అప్పగించాలన్నడు.

ఈ సమయంలనే వెంకటస్వామి, టి. అంజయ్య, సదాలక్ష్మి మరికొంత మంది ఢిల్లీకి పోయి ప్రధానిని కలిసిండ్రు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేసిండ్రు. చెన్నారెడ్డి డిల్లీ, హైదరాబాదు తిరుగుడు మొదలుపెట్టిండు.

అప్పటికే చెన్నారెడ్డి మీద తెలంగాణవాదులల్ల అనుమానాలు వొచ్చినయ్. ఉద్యమాన్ని ఆయన పక్కదారి పట్టిస్తుండని గ్రహించిండ్రు. తెలంగాణ ప్రజలు అనుమాన పడుతున్నట్లుగానే ఆయన ప్రవర్తించిండు. సెప్టెంబర్ 23న చెన్నారెడ్డి ఢిల్లీ నుంచి హైదరాబాద్ వొచ్చిండు. విద్యార్థులు వెంటనే తరగతులకు హాజరు కావాలని తెలంగాణ ప్రజాసమితి, విద్యార్థి నాయకులు అదే రోజు ప్రకటన చేసిండ్రు. ఆ ప్రకటనపై చెన్నారెడ్డి, మల్లికార్జున్ సంతకాలు చేసిండ్రు.

ఈ ప్రకటన తర్వాత ఉద్యోగులు, విద్యార్థులు ఉద్యమానికి దూరమైండ్రు. చెన్నారెడ్డి కుట్రపూరితంగనే ఉద్యమాన్ని నీరుగార్చుతున్నడని విమర్శలొచ్చినయ్. ఇందిరాగాంధీతో చెన్నారెడ్డి వ్యక్తిగతంగా జరిపిన చర్చలు విజయవంతమైనయని ప్రచారమైంది. ముఖ్యమంత్రిని మార్చడానికి ఇందిరాగాంధీ ఒప్పుకున్నదని, కోర్టు నిషేధకాలం పూర్తయిన తర్వాత చెన్నారెడ్డి భవిష్యత్ పదవులకు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కూడ గుసగుసలు వినిపించినయ్. ఈ నేపథ్యంల తొమ్మిది నెలలు ఉధృతంగ నడిచిన తెలంగాణ ఉద్యమం సప్పబడ్డది.

విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని ప్రకటించిన తరువాత చెన్నారెడ్డి హైదరాబాద్‌ల బసచేసిన రాష్ట్రపతి వి.వి.గిరిని కలిసిండు. తెలంగాణ ఉద్యమాన్ని

వాయిదా వేయడానికి తను తీసుకున్న నిర్ణయాన్ని సంతోషంతో చెప్పిండు. రాష్ట్రపతి ప్రశంసలు అందుకున్నడు.

చెన్నారెడ్డి రాష్ట్రపతిని కలిసిన తెల్లారి, కాంగ్రెస్ అధ్యక్షుడు నిజలింగప్ప రాష్ట్ర నాయకత్వం వెంటనే మారాలని ఆ స్థానంల తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి ఎన్నిక జరగాలని సూచించిండు. తెలంగాణవాదుల అనుమానాలకు చెన్నారెడ్డి చర్యలు, నిజలింగప్ప ప్రకటన బలం చేకూర్చినయ్.

చెన్నారెడ్డి లోపల నుంచి ఉద్యమాన్ని మోసం చేసిండని తెలంగాణ ప్రజా సమితి ఉపాధ్యక్షుడు వీరారెడ్డి ఆరోపించిండు. చెన్నారెడ్డి మోసపూరిత ప్రకటన మీద తెలంగాణల అనేకచోట్ల నిరసనలు వ్యక్తమయినయ్.

ఈ నిరసనల నుండి తప్పించుకోవటానికి చెన్నారెడ్డి మరో నాటకం ఆడిండు. తన సహచరుడు మల్లికార్జున్‌తో సికింద్రాబాద్‌లో గాంధీ విగ్రహం దగ్గర నిరాహారదీక్ష ప్రారంభించిండు. ఇది విద్యార్థుల దృష్టిని మల్లించడానికే అన్న ఆరోపణలు వొచ్చినయ్. అయినా మల్లికార్జున్ దీక్ష 24 రోజులు కొనసాగింది. నవంబర్ 3న మల్లికార్జున్‌ను పోలీసులు అరెస్టు చేసి ఉస్మానియా ఆస్పత్రికి తరలించిండ్రు.

1969 నవంబర్‌ల జాతీయ కాంగ్రెస్‌లో చీలికలు వొచ్చినయ్. తెలంగాణ ప్రజా సమితి ఇందిరాగాంధీని సమర్థించింది. చెన్నారెడ్డి ఇందిరాగాంధి వైపు నిలబడ్డడు. ఈ నేపథ్యంల నవంబర్ 27న ఢిల్లీ నుంచి వొచ్చిన చెన్నారెడ్డి తాత్కాలి కంగ ఉద్య మాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిండు. ప్రజలను మభ్య పెట్టడానికి ప్రయత్నిం చిండు. వచ్చే సంవత్సరం జనవరి నుంచి ఉద్యమాన్ని తిరిగి ప్రారంభించ నున్నట్లు చెప్పిండు.

చెన్నారెడ్డి ఉద్యమ ద్రోహాన్ని గుర్తించిన తెలంగాణ వాదులు మండిపడ్డరు. తెలంగాణ ప్రజాసమితి అధ్యక్ష పదవి నుంచి చెన్నారెడ్డిని తొలగిస్తున్నట్టు డిసెంబర్ 6న సదాలక్ష్మితో పాటు మరో ముగ్గురు ప్రకటన చేసిండ్రు. ఈ ప్రకటన మీద 58 మంది సభ్యులల్ల నలుగురు మాత్రమే సంతకం చేసిండ్రు.

ఈ నేపథ్యంల డిసెంబర్ 26న చెన్నారెడ్డి తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షునిగా ఏకగ్రీవంగ ఎన్నికయిండు. డిసెంబర్ 29న విద్యార్థి ఐక్యకార్యాచరణ సమితికి మల్లికార్జున్ కూడా ఏకగ్రీవంగ ఎన్నికయిండు. తెలంగాణ అంశాన్ని పక్కకు పెట్టిన చెన్నారెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రణాళిక రచించుకుండు. తెలంగాణ ప్రజలను నిలువునా ముంచడానికి సిద్ధమైండు.

# ఉద్యమానికి ద్రోహం

కాంగ్రెస్ నుంచి 1970 జనవరిల నూకల రామచంద్రారెడ్డి బయటకు వొచ్చిండు. విబి రాజు నాయకత్వంల ప్రత్యేకవాదులైన ఇండిపెండెంట్ శాసన సభ్యులతో తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ఏర్పడ్డది. ఈ ఫ్రంట్ శాసనసభల ప్రధాన ప్రతిపక్షం అయింది. 1970 ఏప్రిల్‌ల సామూహిక సత్యాగ్రహాలు చేసింద్రు. అయితే తెలంగాణ ప్రజలు ఆశించినంతగా స్పందించలేదు. ఈలోగా జాతీయ కాంగ్రెస్ రొండు ముక్కలైంది. చెన్నారెడ్డి, విబి రాజు, కొండా లక్ష్మణ్ ఇందిరాగాంధీ పంచన చేరింద్రు.

ఆ సమయంల ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరిగింది. శాసనసభ్యుడు గురుమూర్తి చనిపోవడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ ఉపఎన్నికల ప్రజాసమితి అభ్యర్థి నాగం కృష్ణారావు 15 వేల ఓట్ల మెజారిటీతో గెలిచిండు. ఈ ఫలితంతో తెలంగాణవాదం బలంగ ఉందని పాలకులకు అర్థమైంది. దీంతో కాంగ్రెస్‌కు వ్యతిరేక ఫలితాలు వొస్తయని భయపడి జూన్‌ల జరగాల్సిన నగర పురపాలక సంఘ ఎన్నికలను వాయిదా వేసింద్రు.

ఈ నేపథ్యంల ఆగస్టు 19న ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డితో చెన్నారెడ్డి ఢిల్లీల మంతనాలు జరిపిండు. చెన్నారెడ్డి అసంతృప్తిని చల్లార్చటానికి ఇందిరాగాంధీ ఈ భేటీని ఏర్పాటు చేసింది. చెన్నారెడ్డిని సంతృప్తి పరచటం ద్వారా తెలంగాణ సమస్య కనుమరుగు అయితదని భావించింది. భవిష్యత్‌ల చెన్నారెడ్డి పార్టీకి అండగా ఉంటడని ఆశించింది. ఈ కారణాలతో ముఖ్యమంత్రితో చెన్నారెడ్డి భేటీని ప్రోత్సహించింది.

1971 లోకసభ మధ్యంతర ఎన్నికలను దృష్టిల పెట్టుకొని చెన్నారెడ్డి ప్రజా సమితిని రాజకీయ పార్టీగా మార్చిండు. ఈలోగా సిద్ధిపేట ఎమ్మెల్యే విబి రాజు రాజ్య సభకు ఎన్నికయ్యిండు. దీనికి కాంగ్రెస్ సహకరించింది. ఆ తర్వాత జరిగిన సిద్ధిపేట ఉప ఎన్నికల ప్రజాసమితి అభ్యర్థిగ మదన్‌మోహన్ పోటీ చేసిండు. 20 వేల మెజారిటీతో గెలిచిండు.

1971ల లోకసభ మధ్యంతర ఎన్నికలొచ్చినయ్. చెన్నారెడ్డి నాయకత్వం లోని తెలంగాణ ప్రజా సమితి ఎన్నికలల్ల పాల్గొన్నది. ఈ ఎన్నికలల్ల 10 మంది ప్రజా సమితి అభ్యర్థులు లోకసభకు ఎన్నికయ్యింట్రు. పెద్దపల్లి పార్లమెంటు నియోజక వర్గం నుంచి వి.తులసిరాం, కరీంనగర్ నుంచి ఎం. సత్యనారాయణ రావు, మెదక్ నుంచి మల్లికార్జున్, సిద్ధిపేట నుంచి జి. వెంకటస్వామి, సికిందరాబాదు నుంచి ఎంఎం హాషిం, హైదరాబాదు నుంచి జివిస్ మెల్కోటే, మహబూబ్‌నగర్ నుంచి జె.రామేశ్వర్‌రావు, నాగర్‌కర్నూల్ నుంచి ఎం. భీష్మదేవ్, నల్లగొండ నుంచి కె. రామకృష్ణా రెడ్డి, వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఎస్‌బి గిరి గెలిచింట్రు.

ఆదిలాబాదు పార్లమెంటు నియోజక వర్గం నుంచి కెవి కిషన్‌రావు, నిజామాబాదు నుంచి కె. అనంతరెడ్డి, మిర్యాలగూడ నుంచి కె. జితేందర్‌రెడ్డి, ఖమ్మం నుంచి చేకూరి కాశయ్య పోటీ చేసి ఓడిపోయింట్రు. సుప్రీం కోర్టు ఆరేండ్ల నిషేధం విధించడంతో చెన్నారెడ్డి ఈ ఎన్నికలల్ల పోటీచేయలేదు.

ఎన్నికలల్ల గెలిచి ఆరునెలలు దాటకముందే 1971 అక్టోబర్‌ల 10 మంది ప్రజా సమితి పార్లమెంటు సభ్యులను ఇందిరాగాంధీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టిండు చెన్నారెడ్డి. తెలంగాణ ప్రజాసమితిని కాంగ్రెస్‌ల కలిపిండు. సెంటిమెంటుతో గెలిపించిన తెలంగాణ ప్రజలను నిలువునా ముంచిండు.

దీంతో తెలంగాణవాదులల్ల అసంతృప్తి రగిలింది. దీన్ని చల్లార్చడానికి ఇందిరాగాంధీ పంచసూత్ర పథకం రూపొందించింది.

1971 పంచసూత్ర పథకం:

1 ముల్కీ నియమాలు తెలంగాణ ప్రాంతంల నాన్ గెజిటెడ్ ఉద్యోగాలకు, తహసిల్దారు, అసిస్టెంట్ సర్జన్, జూనియర్ ఇంజనీరు పదవులకు వర్తిస్తయ్. సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, మిగతా ఉమ్మడి కార్యాలయాలల్ల ప్రతిమూడు ఉద్యోగాలల్ల ఒక ఉద్యోగానికి కూడా వర్తిస్తయ్.

2 ఈ రక్షణలు రాజధాని అయిన హైదరాబాదు నగరంల 1977 సంవత్సరం చివరి వరకు, మిగతా తెలంగాణ జిల్లాలల్ల 1980 సంవత్సరం చివరి వరకు అమలు జరుగుతయ్.

3 ఉభయ ప్రాంతాలల్ల ఉద్యోగులకు తగిన ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు వివిధ ఉద్యోగాలను మొదటి లేక రొండవ గెజిటెడ్ స్థాయి వరకు ప్రాంతీయాకరణ చేయటం జరుగుతుంది. ఈ

సూత్రాలు ఏవీ ఆలిండియా సర్వీసెస్‌కు కానీ, ఆ సర్వీసెస్‌కు ప్రమోషన్ దొరికే తక్షణ కింది పదవులకు కానీ వర్తించవు.

4 సాంకేతిక, వృత్తిపరమైన విద్యాలయాలతో సహా నగరంలోని అన్ని విద్యాలయాలల్ల ప్రస్తుతం తెలంగాణ ప్రాంత విద్యార్థులకు లభించే స్థానాలకంటె అదనంగా కొన్ని స్థానాలు సృష్టించడం జరుగుతుంది. కొత్తగా సృష్టించిన స్థానాలు బేషరతుగా ఏ ప్రాంతం వారైనా పొందవచ్చు.

5 జంటనగరాలల్ల ఆంధ్ర, తెలంగాణ రెండు ప్రాంతాలకు చెందిన ఉమ్మడి పోలీసు బలగాలు వుంటయ్. దీనికి సంబంధించిన వివరాలు రూపొందించిన తరువాత అందుకు అవసరమైన శాసనం రూపొందుతుంది.

పసలేని ఈ పంచసూత్ర పథకం తెలంగాణ వాదులను సంతృప్తి పరచ లేదు. ఇది నామమాత్రపు పథకంగనే మిగిలింది. అసలు ఈ పథకం అమలులకే రాలేదు.

చెన్నారెడ్డి తెలంగాణ ప్రజాసమితిని కాంగ్రెస్‌ల కలపడానికి జరిగిన ఒప్పందంల భాగంగ 1971 సెప్టెంబర్ 15న ముఖ్యమంత్రి పదవికి బ్రహ్మానంద రెడ్డి రాజీనామా చేసిండు. అప్పటికి 14 ఏండ్ల పాటు వొదలకుంట ముఖ్యమంత్రి పదవిల కూసుండ్రు ఆంధ్రోళ్లు. ఈ అసంతృప్తిని పోగొట్టటానికి తెలంగాణ ప్రాంతానికి చెందిన పివి నరసింహారావుకు 1971 సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించింది ఇందిరాగాంధీ.

ఈ సమయంల చెన్నారెడ్డి ముఖ్యమంత్రి పదవిని ఆశించినా కోర్టు నిషేధం అడ్డుపడ్డది. దీంతో ఆయన ఆశను చంపుకోక తప్పలేదు. చివరికి తన ప్రత్యర్థి బ్రహ్మానందరెడ్డిని గద్దెదించడం ద్వారా సంతృప్తి పొందిండు. తన భవిష్యత్ ప్రయోజనాల కోసం తెలంగాణను తాకట్టు పెట్టిండు. ఎందరో అమరుల త్యాగాలను అపహాస్యం చేసిండు.

# తెలంగాణ రక్షణలకు పి.వి.అండ

మర్రి చెన్నారెడ్డి ఇందిరాగాంధీకి అనుకూలంగ మారి పట్టుబట్టడంతో బ్రహ్మానందరెడ్డి పదవికి ఎసరొచ్చింది. గత్యంతరం లేని పరిస్థితిల బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిండు. వాస్తవానికి బ్రహ్మానందరెడ్డి అనంతరం తెలంగాణవాడైన చెన్నారెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కాలె. కాని ఆయన మీద ఎన్నికలల్ల అక్రమపద్ధతులకు పాల్పడ్డడన్న కారణంగా సుప్రీంకోర్టు 1968 నవంబర్‌ల ఆరేండ్ల అనర్హతను ప్రకటిస్తూ తీర్పునిచ్చింది. దీంతో చెన్నారెడ్డికి 1975 వరకు ఎన్నికలల్ల పాల్గొనటానికి అవకాశం లేకుండ పోయింది.

మధ్యేమార్గంగ మెత్తటిమనిషి, మేధావి అయిన పివి నరసింహారావుకు ముఖ్య మంత్రి పదవిని ఇయ్యడానికి తెలంగాణ, ఆంధ్ర ప్రాంతనాయకులు అంగీకరించిండ్రు. బూర్గుల రామకృష్ణారావు నాటి అనుభవంతో బ్రాహ్మణుల నుంచి అధికారాల్ని అవసరమైనపుడు గుంజుకోవచ్చని తెలంగాణకు చెందిన చెన్నారెడ్డి వంటి నాయకులు భావించిండ్రు. కాబట్టి పి.వి.కి ముఖ్యమంత్రి పదవి ఇయ్యడానికి అభ్యంతరపెట్టలేదు. పి.వి.తెలంగాణ ఉద్యమానికి దూరంగా ఉండటం, బ్రహ్మానందరెడ్డి కేబినెట్‌ల మంత్రిగ పనిచేయటం వలన తమకు అనుకూలుడే అన్న భావన ఆంధ్రానాయకులకు కలిగింది. ఈ కారణాలతో రెండు ప్రాంతాల నాయకులు పివి నరసింహారావుకు మద్దతు పలికిండ్రు. పి.వి.కి ముఖ్యమంత్రి పదవి దక్కింది.

పి.వి. ముఖ్యమంత్రి పదవిల కూచున్నప్పటి నుంచి రెడ్ల పెత్తనానికి గండికొట్టే చర్యలకు పూనుకుండు. అప్పటికే కేంద్రం రూపొందించిన భూ సంస్కరణ చట్టాన్ని ముందుకు తెచ్చిండు. ఈ చట్టాన్ని అమలు చేసి భూస్వాములైన తెలంగాణ నాయకులను బలహీన పర్చాలనుకుండు. ఇది వాళ్లకు మింగుడు పడలేదు. మరోవైపు తెలంగాణ రక్షణల కోసం పి.వి. సహకారం అందించిండు. ఇది ఆంధ్ర నాయకులకు నచ్చలేదు. ఈ కారణాలతో ఇటు తెలంగాణల, అటు ఆంధ్రల భూస్వాములైన నాయకులు పి.వి.పై

ద్వేషం పెంచుకుంద్రు. ఏమాత్రం సందు దొరికినా పి.వి.ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసింద్రు.

అయినా పి.వి. ముఖ్యమంత్రిగా స్థిరపడ్డడు. 1972ల శాసనసభ ఎన్నికలు పి.వి. ముఖ్యమంత్రిగ ఉన్న కాలంల జరిగినయ్. ఈ ఎన్నికలల్ల భూస్వాములైన నాయకులను నియంత్రించాలన్న లక్ష్యంతో పి.వి. వెనుకబడిన కులాలకు ఎక్కువ సీట్లు కేటాయించిండు. దీంతో తెలంగాణ రెడ్లు పి.వి.కి మరింత దూరమైంద్రు.

అయినా అందరి అంచనాలను తలకిందులు చేసి కాంగ్రెస్ ఈ ఎన్నికలల్ల ఘనవిజయం సాధించింది. మొత్తం 287 శాసనసభ స్థానాలకు ఎన్నికలు జరగ్గా 196 మంది కాంగ్రెస్ అభ్యర్థులను పి.వి. గెలిపించిండు. ఆయనే మళ్లా 1972 మార్చి 20న రొండో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిండు.

ఆంధ్రప్రదేశ్‌ల ఎన్నికల హడావుడి ఉన్న సమయంలనే 1972 ఫిబ్రవరి 14న అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఫుల్‌బెంచ్ ముల్కీ నిబంధనలపై తీర్పునిచ్చింది. ముల్కీ నిబంధనలు రాజ్యాంగబద్ధం కావని ప్రకటించింది.

ముఖ్యమంత్రి పివి నరసింహారావు మాత్రం తెలంగాణ రక్షణలను కాపాడాలని సంకల్పించిండు. ప్రధాని ఇందిరాగాంధీ సహకారంతో హైకోర్టు తీర్పును తిరిగి పరిశీలించాలని ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టుకు పంపిండు.

ఈ సమయంలో పట్టణ ఖాళీభూముల గరిష్ట పరిమితి చట్టం, వ్యవసాయ భూముల గరిష్ట పరిమితి చట్టం పి.వి ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ధన వంతులు, భూస్వాములు, బలమైనవర్గాలు పి.వికి దూరమైంద్రు. తెలంగాణ రెడ్లు, ఆంధ్రా కమ్మలు ముఖ్యమంత్రిని వ్యతిరేకించింద్రు. ఈ నేపథ్యంల 1972 అక్టోబర్ 3న సుప్రీం కోర్టు తీర్పును ప్రకటించింది. హైదరాబాద్ ప్రభుత్వ ముల్కీ నియమాలకు బదులు 1958ల 'నియమావళి' పేరుతో కేంద్రప్రభుత్వం చేసిన చట్టాన్ని రద్దు చేసింది. కనుక నిజాం కాలం నాటి ముల్కీశాసనం అమలుల ఉన్నట్లే అనేది తీర్పు సారాంశం.

ఈ కేసుల పి.వి వియ్యంకుడు కె.నర్సింగరావు సుప్రీంకోర్టుల వాదనలు వినిపించిండు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన తర్వాత 'వివాదంపై ఇది తుదితీర్పు. సుప్రీం చెప్పినవి ఆఖరి మాటలు' అని పి.వి వ్యాఖ్యానించిండు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన పి.వి. వ్యతిరేకులు ఈ అవకాశాన్ని అందుకున్నరు. పివి నరసింహారావును ఇబ్బంది పెట్టడానికి కుటిలయత్నాలు చేసింద్రు.

# జై ఆంధ్ర బ్లాక్‌మెయిల్ ఉద్యమం

**పి.** వి.నరసింహారావు భూసంస్కరణల చట్టం తమ ఉనికిని దెబ్బకొడు తుందని భావించిన ఆంధ్రా తెలంగాణ సంపన్న భూస్వామ్యవర్గాల నాయకులకు సుప్రీం కోర్టు తీర్పు అందివొచ్చిన అవకాశమైంది. నిజానికి సుప్రీంకోర్టు తీర్పువల్ల ఆంధ్రా ఉద్యోగులల్ల ప్రజలల్ల పెద్దగా నిరసన వ్యక్తం కాలేదు. కాని రాజకీయ నాయకులు ఆజ్యం పోసింద్రు. సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఉనికిలకు వొచ్చిన ముల్కీ రూల్స్‌కు వ్యతిరేకంగా అని బయటికి చెప్పుకుంటనే రాజకీయ ఉద్యమానికి తెర తీసింద్రు.

1972 అక్టోబర్ 18న ఆంధ్రాప్రాంత నాయకులు విజయవాడల సమావేశ మైంద్రు. ఉద్యమ నిర్వహణకు 'ప్రజాపరిషత్తు' ఏర్పాటు చేసింద్రు. ఆంధ్రా తెలంగాణలు కలిసి ఆంధ్రప్రదేశ్‌గా కొనసాగాలంటె ఎట్లాంటి షరతులు ఉండ కూడదని తీర్మానిం చింద్రు. అంటె తెలంగాణ ప్రాంతీయ సంఘం కాని, ముల్కీరూల్స్ కాని అడ్డు ఉండ కూడదు అనేది వారి డిమాండు. ఒకవేళ షరతులు ఉంటే సమైక్యరాష్ట్రం నుంచి ఆంధ్రాప్రాంతం విడిపోవాలని తీర్మానించింద్రు.

తమ దోపిడీకి అడ్డులేకుండ ఉంటేనే సమైక్యరాష్ట్రం కొనసాగాలని, దోచు కోవడానికి అవకాశం లేకుంటే ఇంక కలిసి ఉండడమెందుకు అనే భావన వ్యక్తం చేసింద్రు. జై ఆంధ్ర పేరుతో బ్లాక్‌మెయిల్ ఉద్యమానికి తెరదీసింద్రు. తెలంగాణను దోచుకుతినడానికే ఆంధ్రోళ్లు విలీనం కోరినట్లు మరోసారి రుజువైంది.

ఆంధ్రా ఉద్యమానికి ప్రాతిపదిక నిజంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఆంధ్ర ప్రాంతం విడిపోవడం కాదు. తెలంగాణ రక్షణలను నాశనం చేయడానికి బెదిరింపు మాత్రమే. ఈ నేపథ్యంల ఊరేగింపులు, నిరసన ప్రదర్శనలు ఆంధ్రల జరిగినయ్.

అదే సమయంల ముల్కీ నిబంధనలు కొనసాగించాలని హైదరాబాద్‌తో పాటు ఇతర తెలంగాణ జిల్లాలల్ల ఉద్యమం మొదలయింది. ముల్కీ నిబంధనలు

మొత్తానికి మొత్తం రద్దుచేయాలని ఎపిఎన్‌జివో సంఘం 1927 అక్టోబర్ 26న నిరవధిక సమ్మెకు దిగింది. 1972 నవంబర్18,19 తారీకులల్ల ఆంధ్రప్రాంత అఖిల పక్ష నాయకులు సమావేశమై షరతులులేని తెలంగాణ కావాలని డిమాండు చేసింద్రు. అయితే ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు ఈ ఆందోళనను తేలికగనే తీసుకున్నడు. 1969ల జరిగిన తెలంగాణ ఉద్యమంల ఆంధ్ర ఉద్యమం నయా పైసొంతు కూడ కాదన్న భావనల ఆయన ఉన్నడు.

1972 నవంబర్ 21న ఒక సావధాన తీర్మానం ద్వారా సిపిఐ నాయకుడు ఇంద్రజిత్‌గుప్త ఆంధ్రప్రదేశ్‌ల ఏర్పడిన పరిస్థితులను లోక్‌సభ దృష్టికి తెచ్చిండు. ఆయన సుదీర్ఘమైన ఊకదంపుడు ఉపన్యాసం ఇచ్చి రొండు ప్రాంతాల మధ్య సమైక్యత సాధించాలన్నడు. పివి ప్రభుత్వాన్ని విమర్శించుకుంటనే కొందరు రాజకీయ స్వార్థపరుల మాయమాటలు నమ్మి ఆంధ్రల విద్యార్థులు వీధులల్లకు వొచ్చింద్రని, ఇది తనకు స్పష్టంగా తెలుసని అన్నడు.

ఆంధ్రల ఆందోళన జరుగుతుండగా తెలంగాణల చెన్నారెడ్డి మల్లా చురుకు దనం పెంచుకుండు. ఆయన నాయకత్వంల ప్రత్యేక తెలంగాణ కాంగ్రెస్ ఫోరం అని ఒక దానిని ఏర్పాటు చేసిండు. దీంట్లె జైపాల్‌రెడ్డి, రోడామిస్త్రీ, సరోజిని పుల్లారెడ్డి, భోజిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, శీలం సిద్ధారెడ్డి, సుధాకర్‌రావు, వెంకటరామారెడ్డి, కె.వి.కేశవులు, అన్సారి, చొక్కారావు ఉన్నరు.

అయితే చెన్నారెడ్డికి వ్యతిరేకంగ పివి కి అనుకూలవర్గం కూడ బలంగనే ఉన్నది. ఈ వర్గంల రాజారాం, జగన్నాథరావు, గోవింద్‌సింగ్, మండలి వెంకట కృష్ణారావు తదితరులు ఉన్నరు.

పివికి వ్యతిరేకంగా చెన్నారెడ్డి వర్గంల జలగం వెంగళరావు, కోదాటి రాజమల్లు, నూకల వాసుదేవరావు, విబి రాజు ఉన్నరు. 1972 డిసెంబర్ 31న తిరుపతిల సమావేశమైన ఆంధ్రానాయకులు ఉద్యమం ఉధృతం చేయాలని తలపెట్టింద్రు. ఈ సమావేశానికి 131 మంది ఎమ్మెల్యేలు, 11మంది పార్లమెంటు సభ్యులు హాజరయింద్రు. 1973 జనవరి రొండున జరిగిన బందుల కాల్పులు జరిగి నయ్. ఆ కాల్పులల్ల నలుగురు ఐదుగురు ఆంధ్రాయువకులు చనిపోయింద్రు. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

ఇదే అదునుగ తెలంగాణ, ఆంధ్ర భూస్వాములు బలమైన వర్గాల నాయకులు కేంద్రంతో చర్చలు జరిపింద్రు. ప్రధానంగా రొండు డిమాండ్లు పెట్టింద్రు. దాంట్లె మొదటిది భూసంస్కరణ చట్టం తెచ్చిన పి.వి.నరసింహారావును ముఖ్యమంత్రి పదవి

నుంచి తప్పించాలె. రొండవది ముల్కీరూల్స్‌కు బదులుగా మరొక నిర్ణయం తీసుకొని ఆంధ్రప్రాంత ఉద్యమాన్ని శాంతపరచాలె.

ఈ అంగీకారంల భాగంగ ఇందిరాగాంధీ సూచన మేరకు 1973 జనవరి 11న పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిండు. వెంటనే ముఖ్యమంత్రి బాధ్యతలు ఏ ప్రాంతంవారికి అప్పగించినా సమస్యలు తలెత్తుతయని అనుకున్న ఇందిరాగాంధీ రాష్ట్రపతి పాలన విధించింది. గవర్నర్ సలహాదారులుగ మాజీ ప్రధానకార్యదర్శి వి.కె.రావు, కేంద్రంల రక్షణశాఖ మాజీకార్యదర్శి ఎచ్.సి. సెరిన్‌ను నియమించిండ్రు.

ఉద్యమానికి మూలకారకుడు భూసంస్కరణ చట్టం తెచ్చిన పి.వి. పదవి నుంచి దిగిపోవడంతో ఆయన ప్రత్యర్థులు సంతృప్తి పడ్డరు. ఉద్యమాన్ని శాంతింప చేయడంల భాగంగ ఇందిరాగాంధీ ఆంధ్రకు చెందిన కమ్మనాయకుడు, పార్లమెంటు సభ్యుడు అయిన కొత్త రఘురామయ్యకు 1973 ఫిబ్రవరి 3న కేంద్రమంత్రి పదవి ఇచ్చింది. ఆంధ్ర ప్రాంతంవానికి మాత్రమే ఇస్తే అది రాజకీయంగా కనిపిస్తదని భావించి అదేరోజు తెలంగాణ ప్రాంతానికి చెందిన జి.వెంకటస్వామికి కూడ కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది.

కొత్త రఘురామయ్యకు మంత్రిపదవి దొరకడంతో కమ్మనాయకులు ఉద్యమం విషయంల ఉదాసీనత చూపిండ్రు. రాజకీయ సంతృప్తి జరిగినా, ఉద్యమం జరగడానికి మరో కారణం ముల్కీనిబంధనలు. ఈ విషయంల సంతృప్తి పరచడానికి తీసుకోవలసిన నిర్ణయం గురించి ఆంధ్ర తెలంగాణ నాయకులతో ఇందిరాగాంధీ చర్చించింది. సమస్యకు పరిష్కారంగా 'ఆరుసూత్రాల పథకం'ను 1973 సెప్టెంబర్ 21న ప్రకటించింది.

ఆరు సూత్రాల పథకం:

జై ఆంధ్ర ఉద్యమం వల్ల కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అవతరణ సందర్భంగా తెలంగాణకి ఇచ్చిన హామీలన్నింటిని రద్దు చేసింది. దీని బదులుగా ఈ పథకాన్ని ప్రకటించింది.

1 వెనుకబడిన ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే శాసన సభ్యులతోపాటు నిపుణలను భాగస్వామ్యం చేస్తూ రాష్ట్రస్థాయి ప్రణాళిక బోర్డు ఏర్పాటు.

2 రాజధానిల ఉన్నత వసతులు పెంచాలె. దీనికై కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ప్రవేశపెట్టాలె.

3 ఒక నిర్ణీత స్థాయి వరకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలల్ల స్థానికులకే

అవకాశం కల్పించాలె.

4 ఫిర్యాదులను పరిశీలించడానికి ఒక అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ నియమించాలె.

5 ఫిర్యాదులను పరిష్కరించే రీతిల ఉండటానికి అవసరమ యినపుడు భారత రాజ్యాంగాన్ని సవరించే అధికారం రాష్ట్రపతికి ఉండాలె.

6 ఈ అంశాలను అమలు జరపడం మూలంగా ముల్కీ నిబంధనలు, ప్రాంతీయ కమిటీల అవసరం ఉండదు. కాబట్టి అవి రద్దయి పోతయ్.

ఈ ఆరుసూత్రాల పథకానికి చట్టబద్ధత కల్పించింది. ఇందుల భాగంగ రాజ్యాంగ సవరణ చేసింద్రు. తెలంగాణ ఉద్యోగాలల్ల ప్రభుత్వం చట్టవ్యతిరేకంగా అయినా, నిబంధనలకు అనుకూలంగా అయినా గతంల తీసుకున్న చర్యలన్నీ చట్టబద్ధ మైనవే అని పార్లమెంటు రాష్ట్రపతికి సమర్పించింది. ఫలితంగా రాజ్యాంగ సవరణ జరిగింది. ఈ సవరణ ఫలితంగ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, ముల్కీ నిబంధనలు 1973 అక్టోబర్‌ల రద్దయినయ్.

ఈ రాజ్యాంగ సవరణ ద్వారా తెలంగాణ ప్రాంతీయ సంఘం రద్దయింది. తెలంగాణ ఆంధ్ర ప్రాంత ఆదాయవ్యయాలు బడ్జెట్‌ల విడివిడిగ చూపాలన్న నియమం కూడ రద్దయింది. తెలంగాణ స్థానికులుగా గుర్తింపు పొందటానికి పదిహేనేండ్ల కాలం నాలుగు సంవత్సరాలకు తగ్గింది. ఈ రాజ్యాంగ సవరణ వల్ల ఇప్పటి వరకు ఆంధ్రోళ్లు దోచుకున్న ఉద్యోగాలు సక్రమమైనవిగనే గుర్తించాల్సి వొచ్చింది. ప్రాంతీయ సంఘం రద్దుతోటి ఆంధ్ర వలసవాదులను ప్రోత్సహించి నట్లయింది. తెలంగాణ భూములకు రక్షణ లేకుండా పోయింది. ఆరుసూత్రాల పథకంలోని ఐదవ సూత్రం ప్రకారం రాజ్యాంగ సవరణ చేసి 371–డి అధికరణం చేర్చింద్రు.

ఈ రాజ్యాంగ సవరణను చట్టబద్ధమైనదిగా ధృవీకరిస్తూ 1975 అక్టోబర్ 18న ప్రెసిడెన్షియల్ ఆర్డర్ విడుదల అయింది.

రాష్ట్రపతి ఉత్తర్వు :

ఆరుసూత్రాల పథకానికి చట్టబద్ధత కల్పించడానికి రాజ్యాంగాన్ని సవరించింద్రు. జి.ఎస్.ఆర్ 524 (ఈ) నెంబరు గల ఉత్తర్వును రాష్ట్రపతి 1975 అక్టోబర్ 18న జారీచేసిండు. దీన్నే ప్రెసిడెన్షియల్ ఆర్డర్ అన్నరు. సిబ్బంది నియామకాలల్ల పాటించాల్సిన అంశాలను నిర్దేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 674 ను 1975 అక్టోబర్ 20న జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ఉన్న అంశాలు:

1) లోకల్ కేడర్లు, లోకల్ ఏరియాల నిర్ధారణ.

2) బదిలీలు 3) జోన్ల వర్గీకరణ 4) లోకల్ క్యాండిడేట్స్

5) లోకల్ క్యాండిడేట్లకి రిజర్వు చేయబడిన ఉద్యోగాల పరిమితులు.

ఈ ఉత్తర్వుల ననుసరించి రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించిండ్రు. ఆంధ్రా ప్రాంతాన్ని 1,2,3 జోన్లుగా, రాయలసీమను 4వ జోన్‌గా, తెలంగాణను 5,6 జోన్లుగా విభజించిండ్రు. హైదరాబాద్ ఆరవ జోన్‌ల భాగమే.

1వ జోన్ : శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం

2వ జోన్ : తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ

3వ జోన్ : గుంటూరు, ప్రకాశం, నెల్లూరు

4వ జోన్ : కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు

5వ జోన్ : వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం

6వ జోన్ : మెదక్, హైదరాబాద్ ( ప్రస్తుతం ఉన్న రంగారెడ్డి జిల్లాతో కలిపి), నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ

అంతకు ముందే సుప్రీం కోర్టు విధించిన అనర్హత కాలం పూర్తయి 1974 అక్టోబర్18న చెన్నారెడ్డి ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా వెళ్లిపోయినందున తెలంగాణ నుంచి తనకు ఇబ్బంది రాదన్న భావనల ఇందిరాగాంధి ఈ నిర్ణయం తీసుకుంది.

ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌తో ఆంధ్రలో ఉద్యమం చల్లబడ్డది. తెలంగాణ ఉద్యోగులు, ప్రజలల్ల ఇందిరాగాంధీ నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఉన్నా చెన్నారెడ్డి చేసిన మోసానికి ఎవరిని నమ్మలేదు. దీంతో ఎట్లాంటి నిరసన కూడా వ్యక్తం కాలేదు.

పరిస్థితులు సదురుకోవడంతో 1973 జనవరి 18న విధించిన రాష్ట్రపతి పాలనను ఇందిరాగాంధీ 1973 డిసెంబర్ 10న ఎత్తేసింది. 1973 డిసెంబర్ 10న కొత్త ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు బాధ్యతలు స్వీకరించిండు. మొట్ట మొదటి సారి ముఖ్యమంత్రి అయిన తెలంగాణ బిడ్డ పివి నరసింహారావు పాలన 15 నెలలు కూడ సాగలేదు. ఆ వెంటనే తెలంగాణ నివాసి, ఆంధ్రా మూలాలున్న వెంగళరావుకు ముఖ్యమంత్రి కుర్చీ దక్కింది.

అయితే రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుల వెంగళరావు వివక్ష చూపిండు. తెలంగాణ అనుకూలమైన నిర్ణయాలను పట్టించుకోకుంట ఆంధ్రకు అనుకూలమైన నిర్ణయాలను వెంటనే అమలు చేసిండు. రాష్ట్రపతి ఉత్తర్వు ప్రకారం... స్థానికులను

జిల్లా స్థాయి పోస్టులల్ల 80 శాతం, జిల్లా స్థాయి నాన్ గెజిటెడ్ పోస్టులల్ల 70 శాతం, జోనల్ స్థాయి గెజిటెడ్ పోస్టులల్ల 60 శాతం నియామకాలు జరపాలె. రాష్ట్ర సచివాలయ, శాఖాధిపతుల కార్యాలయాలు, రాష్ట్ర స్థాయి పరిధి గల ఇతర కార్యాలయాలు, భారీ అభివృద్ధి ప్రాజెక్టు, ప్రభుత్వ రంగ సంస్థలు, విశ్వవిద్యాల యాలకు ఈ ఉత్తర్వు పరిధి నుంచి మినహాయింపు ఉంటుంది. అయినా వీటిలో నియామకాలు జరిగేటప్పుడు అన్ని ప్రాంతాలకు సరియైన వాటా దక్కాలె. జోన్లకు కేటాయించిన వాటాలు పోగా మిగిలిన వాటాను ఓపన్ కేటగిరీల నియామకాలు జరపాలె. అయితే ఆంధ్రా నాయకులు హైదరాబాద్‌ను ఏడో జోన్‌గా నిర్ణయించాల న్నరు. కాని రాష్ట్రపతి ఉత్తర్వుల హైదరాబాద్ ఫ్రీ జోన్ అనిగాని, ఏడో జోన్ అని గాని చెప్పలేదు. అయితే ఈ ఉత్తర్వుల అమలుల వివక్ష చూపింద్రు.

వెంగళరావును తెలంగాణ ప్రాంతంవాడని తెలంగాణవాళ్లు అనుకోలేదు కాని ఆంధ్ర ప్రాంతంవాడని ఆంధ్రోళ్లు అనుకున్నరు. ఆయన ముఖ్యమంత్రి కాగానే తెలంగాణ అనే మాటను మరిపించటానికి ప్రయత్నాలు జరిగినయ్. ఆంధ్రప్రాంత నాయకులకు అనుకూలుడుగా ముద్రపడ్డ జలగం వెంగళరావు వారి మాటలకే విలువ ఇచ్చిండు.

తెలంగాణ వాదాన్ని కనుమరుగు చేయాలన్న కుట్రల భాగంగ ఆంధ్రోళ్లు ప్రపంచ తెలుగుసభలు అనే కార్యక్రమాన్ని రూపొందించింద్రు. ఆంధ్ర తెలంగాణ విలీనానికి ముందు తెలుగుజాతి అంటూ ఊదిన బాకా ఇప్పుడు అధికారికంగ వినిపించడానికి సిద్ధమైంద్రు.

దానికి ముఖ్యమంత్రి వెంగళరావు సానుకూలంగా ఉండటంతో మొదటి ప్రపంచ తెలుగు మహాసభలను 1975 ఏప్రిల్ 12 నుంచి 19 వరకు వారంపాటు హైదరాబాదులోని లాల్‌బహదూర్ స్టేడియంల నిర్వహించింద్రు. జలగం వెంగళరావు మంత్రివర్గంల విద్యాశాఖమంత్రిగా ఉన్న మండలి వెంకట కృష్ణారావుకు ఈ సభల నిర్వహణ బాధ్యతలను అప్పగించింద్రు. అయితే ఈ సభల నిర్వహణల కృష్ణారావు అవినీతికి పాల్పడ్డడని ఆరోపణలు కూడ వొచ్చినయ్.

ఆ తర్వాత వెంగళరావుకు బలమైన వ్యతిరేక వర్గం తయారయింది. ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టే ప్రయత్నాలు జరిగినయ్. ఇందిరాగాంధీ ఎన్నికలల్ల ఓడిపోయిన నేపథ్యంల జరిగిన రాజకీయ పర్యవసానాలతో కేంద్ర ప్రభుత్వం 1977 జూన్ నుంచి మార్చి వరకు ఎమర్జెన్సీ విధించింది. ఆ సమయంల జరిగిన రాజకీయ సమీకరణల వల్ల వెంగళరావు ఇందిరాగాంధీకి దూరమైండు.

# చెన్నారెడ్డికి ముఖ్యమంత్రి కుర్చీ

ఎమర్జెన్సీ కాలంల జరిగిన రాజకీయ సమీకరణాల వల్ల ముఖ్యమంత్రి వెంగళరావు ఇందిరాగాంధీకి దూరమైండు. ఈ సమయంల తన నమ్మినబంటుకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పగ్గాలు అందించాలని ఇందిరాగాంధీ భావించింది. అప్పటికే తెలంగాణ ఉద్యమాన్ని ఇందిరాగాంధీ కాళ్ల దగ్గర పెట్టి ఆమె మెప్పును పొంది ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గ పనిచేస్తున్న చెన్నారెడ్డి మీద ఆమె దృష్టి పడ్డది. తన మనసుల మాట చెన్నారెడ్డికి చెప్పంగనే ఆయన గవర్నర్ పదవికి రాజీనామా చేసి రాష్ట్రానికి వొచ్చిండు. 1978 జనవరిల మర్రి చెన్నారెడ్డిని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగ నియమించింది ఇందిరాగాంధి.

చెన్నారెడ్డి పిసిసి అధ్యక్ష పదవి చేపట్టిన ఒకటి రొండు నెలల్లనే ఆంధ్ర ప్రదేశ్ శాసనసభకు ఎన్నికలు జరిగినయ్. ఈ ఎన్నికలల్ల అనేకమంది కొత్త యువకులకు మొదటిసారి పోటీచేసే అవకాశం ఇచ్చిండు చెన్నారెడ్డి. అప్పుడే చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గం నుంచి చంద్రబాబు నాయుడు పోటీచేసి గెలిచిండు. ఆ ఎన్నికల్ల కాంగ్రెస్ మెజారిటీ సాధించడంతో 1978 మార్చి 6న మర్రి చెన్నారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగ బాధ్యతలు చేపట్టిండు.

జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న 1973-78 మధ్య కాలంల తెలంగాణ నాయకులు ఎవరు కూడ తెలంగాణ అన్యాయాల గురించి మాట్లాడలేదు. కారణం అంతకుముందు నాయకత్వం ధోకా చెయ్యడమే. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలన్న ఆకాంక్షను మాత్రం వ్యక్తం చేసింద్రు.

చెన్నారెడ్డి ముఖ్యమంత్రి కావడం కొందరు బలమైన ఆంధ్రానాయకులకు మింగుడు పడలేదు. చెన్నారెడ్డి మీద వ్యక్తిగత కక్ష కొంతకాగా, తెలంగాణ నాయకుడు ముఖ్యమంత్రి కావడం కూడ ఆంధ్రనాయకులు జీర్ణించుకోలేక పోయింద్రు

ఈ సమయంల చెన్నారెడ్డి షష్టిపూర్తి ఉత్సవాలు ఆడంబరంగా చేసుకోవడంపై విమర్శలు వొచ్చినయ్. చెన్నారెడ్డి తీసుకున్న అనేక వివాదాస్పద నిర్ణయాల

వల్ల చాలామంది కాంగ్రెస్ నాయకులు ఆయనకు దూరమైంద్రు. చెన్నారెడ్డి ఎన్నిక చెల్లదని గతంల కోర్టుకుపోయిన వందేమాతరం రామచంద్రరావుకు అదే చెన్నారెడ్డి అధికార భాషా సంఘం అధ్యక్ష పదవి నిచ్చిండు. సిపిఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్యకు డ్రెయినేజి బోర్డు అధ్యక్ష పదవి ఇచ్చిండు.

ఆంధ్రానాయకుల ఫిర్యాదులు, చెన్నారెడ్డి తలబిరుసుతనంతో ఆయన ముఖ్యమంత్రి పదవికి రెండున్నర సంవత్సరాలకే ఎసరొచ్చింది. ఫలితంగా ఆయన ముఖ్యమంత్రి పదవికి దూరమైండు. ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవి తెలంగాణ వారికే ఇయ్యాలని ఇందిరాగాంధీ భావించింది. దీంతో తెలంగాణ నాయకుడు టంగుటూరి అంజయ్యకు పదవి దక్కింది. ఆయన 1980 అక్టోబర్ 11న ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిండు.

చెన్నారెడ్డి దిగిపోయినా మల్లా తెలంగాణ నాయకుడు అంజయ్య ముఖ్యమంత్రి కావడం ఆంధ్రానాయకులను అసహనానికి గురిచేసింది. అంజయ్య మెత్తటి మనిషిగ కనిపించటం వల్ల తెలంగాణవాదాన్ని అణచివేయడానికి రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడానికి పూనుకున్నరు. 1981 ఏప్రిల్ 14న కౌలాలంపూర్‌ల ఆంధ్రానాయకుల ఆధ్వర్యంల నిర్వహించింద్రు.

ఇదే సమయంల 1982 మార్చి 21న సినిమానటుడు ఎన్‌టి రామారావు తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసిండు. రామారావుకు అనుకూలంగా రాజకీయ వాతావరణం ఏర్పడ్డది. తెలంగాణ నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండటం ఆంధ్రోళ్లు భరించలేక పోయింద్రు. ఫిర్యాదుల మీద ఫిర్యాదులు ఇందిరాగాంధీకి పంపింద్రు.

చివరికి ఇందిరాగాంధీ అంజయ్యను దించింది. ఆ తర్వాత ఆంధ్రా నాయకుడు భవనం వెంకట్రాం 1982 ఫిబ్రవరి 24న ముఖ్యమంత్రి పదవి చేపట్టిండు. ఏడు నెల్లకే ఆయన ముఖ్యమంత్రి పదవికి దూరమైండు. ఎన్నికల్ల ఎన్‌టి రామారావును ఎదుర్కొనే సత్తా ఉన్నోడని భావించి ఢిల్లీ నాయకులు కోట్ల విజయభాస్కర్‌రెడ్డిని 1982 సెప్టెంబర్ 20న ముఖ్యమంత్రి కుర్చీల కూసబెట్టింద్రు.

ఈ ఐదేండ్ల కాలంల చెన్నారెడ్డి కాని మరొక తెలంగాణ నాయకుడు కాని తెలంగాణ గురించి గట్టిగ మాట్లాడిన సందర్భం లేదు. తెలంగాణ నాయకుల చూపులన్నీ ముఖ్యమంత్రి పదవి చుట్టే తిరిగినయ్. తెలంగాణ ఉద్యమ నాయకులు పదవుల చుట్టు ఉరుకుల పెట్టడం తెలంగాణ ప్రజలకు అసహ్యం కలిగించింది. నాయకుల మీద నమ్మకం పోయేటట్లు చేసింది.

# అమలుకు నోచుకోని జిఓ 610

ఎన్‌టిరామారావు పెట్టిన తెలుగుదేశం పార్టీ కమ్మ కులస్థులను ఆకర్షిం చింది. అప్పటికే ఆర్థికంగ ఎదిగిన కమ్మలు రాజకీయ అధికారం కోసం ఎదురు చూస్తుండ్రు. అట్లాంటి సమయంల రామారావు పెట్టిన పార్టీ ఆయన కులస్థుల్ల ఐక్య తను తెచ్చింది. సినిమా గ్లామరు ఉండటం, కాంగ్రెసు పాలనల ప్రజలు విసుగుచెంది ఉండటం ఆయనకు కలిసొచ్చింది. ఆయన పార్టీ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్ల మెజారిటీ సాధించింది. 1983 జనవరి 9న రామారావు ముఖ్యమంత్రి అయ్యిండు.

అప్పటికి తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను తెలంగాణ నాయకులు బాహాటంగా వినిపించక పోయినా అంతర్గతంగా మాత్రం ప్రజలల్ల ఉంది. తెలంగాణ నాయ కులు ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష పైననే కాదు అన్యాయాలపై కూడా గట్టిగ నోరు తెరవలేదు. కాని తెలంగాణ ఉద్యోగులల్ల మాత్రం అసహనం పేరుకుంది.

1975 అకోబర్ 18న రాష్ట్రపతి సంతకంతో వెలువడిన ఉత్తర్వుల్ల నుంచి ఆంధ్ర ప్రాంతం వాళ్లకు ప్రయోజనకరమైన అంశాలను అమలు చేసిండ్రు. కాని ఈ మధ్య కాలంల ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా రాష్ట్రపతి ఉత్తర్వుల్ల నుంచి తెలంగాణకు అనుకూలమైన అంశాలను అమలు చేయలేదు. ఆ ఉత్తర్వులు ఏమాత్రం అమలయినా తెలంగాణ వాళ్లకు కిందిస్థాయి ఉద్యోగాలైనా వొచ్చే అవకాశముంది. ఈ ఆశతో ఆ ఉత్తర్వులను అమలు చేయించడానికి తెలంగాణ ఎన్‌జివో సంఘం ప్రయత్నించింది.

ఎన్‌జివో వినతులకు ముఖ్యమంత్రి రామారావు స్పందించిండు. ఐఏఎస్ అధికారి జైభారత్‌రెడ్డి నాయకత్వాన ముగ్గురు ఐఎఎస్ అధికారులతో ఒక కమిటీని 1984ల నియమించిండు. ఈ కమిటీల జైభారత్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు ఐఎఎస్ అధికారులు అమర్‌నాథ్, ఉమాపతి ఉన్నరు.

జైభారత్‌రెడ్డి కమిటీ ఏడాదిలోపే 36 పేజీల నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ఈ కమిటీ 1975-1985 మధ్యకాలంల జరిగిన నియామకాలను పరిశీలించింది. ఈ మధ్యకాలంలనే రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా 59 వేల మంది

స్థానికేతరులను ఉద్యోగాలల్ల నియమించినట్లు కమిటీ నిగ్గుతేల్చింది. కేవలం పది సంవత్సరాలల్ల తెలంగాణ ప్రజల నోటికాడి 59 వేల ఉద్యోగాలను ఆంధ్రా ప్రజలు కొల్లగొట్టింద్రు అని చెప్పింది. అయితే నివేదిక మీద ముఖ్యమంత్రి రామారావు చర్యలు తీసుకోవటానికి పూనుకోగా ప్రభుత్వంల ఉన్న కొంతమంది అడ్డుపడ్డరు. తెలంగాణకు న్యాయం జరిగే అంశాలను తొక్కిపట్టడం, సాగదీయడం అలవాటు చేసుకున్న ఆంధ్రోళ్లు మరో కమిటీ వేసి నిగ్గు తేల్చాలని ముఖ్యమంత్రికి సలహా ఇచ్చింద్రు.

దీంతో రామారావు మరో ఐఎఎస్ అధికారి వి. సుందరేశన్‌తో ఏకసభ్య కమిటీని నియమించిండు. సుందరేశన్ కమిటీ చేయాల్సింది ఏందంటే– జైభారత్ రెడ్డి ఇచ్చిన నివేదికలోని సిఫార్సులను పరీక్షించడం.

అయితే సుందరేశన్ కమిటీకూడా కొద్దికాలంలనే తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. జైభారత్‌రెడ్డి, సుందరేశన్ కమిటీల సిఫార్సుల ఆధారంగ 1985 డిసెంబర్ 30న జిఓ 610 వెలువడ్డది. ఎన్‌టి రామారావు ప్రభుత్వం వెలువ రించిన 610 జిఓ 1986 మార్చి 31 లోపు అమలుకావాలని జిఓలనే రాసి ఉంది.

610 జీవో:

1 1976 అక్టోబర్ 18 నుండి 5, 6 జోన్లల్ల జోనల్, జిల్లా నియామకాల నిబంధనలకి వ్యతిరేకంగా నియమితులైన తెలంగాణేతరులందరిని 1986 మార్చి 31 నాటికి వెనుకకు పంపాలె. ఆ స్థానాలల్ల తెలంగాణ వారిని నియమించాలె. ఉద్యోగాలు కోల్పోయిన తెలంగాణే తరుల కోసం ఆ ప్రాంతంల సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించాలె.

2 జూరాల, శ్రీశైలంల ఎడమగట్టు, శ్రీరాంసాగర్ పనులల్ల ఉన్న గెజిటెడ్ ఉద్యోగులను వారి సొంత జోన్‌లకు పంపాలె.

3 సచివాలయం, హైదరాబాద్ కేంద్రం, వివిధ డిపార్ట్‌మెంట్ అధిపతుల కార్యాలయాలు, రాష్ట్ర కార్యాలయాలల్ల జరిగిన అవకతవకలను సరిచేయాలె.

4 బోగస్ లోకల్ సర్టిఫికెట్ల కింద నియమితులయిన తెలంగాణేతరులపై చర్య తీసుకోవాలె.

5 నిబంధనలకి వ్యతిరేకంగా జరిగిన అన్ని నియామకాలను, ప్రమోషన్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలె.

6 వివిధ క్యాడర్లకి సంబంధించి అనవసరంగా, విచక్షణారహితంగా లోకల్ ఏరియాలల్ల బదిలీలు ఉండ కూడదు.

7 సచివాలయంలోని వివిధ శాఖలు రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు జరిగిన అన్ని నియామకాలను, ప్రమోషన్లను 1986 జూన్ 30 వరకు తిరిగి పరిశీలించాలె.

ఈ జిఓ ప్రకారం అక్రమంగా తెలంగాణ ఉద్యోగాలల్ల చేరిన ఆంధ్రా ఉద్యోగులను తిరిగి పంపాలె. వారికోసం ఆంధ్రప్రాంతంల సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించాలె. మూడునెలల్ల జిఓ 610 అమలు చేయాలని జిఓలనే రాసిన ప్రభుత్వం ఆ సంగతి మర్చిపోయింది. జివో 610 కంటె ముందు రాయలసీమ వాసులకే స్థానిక ఉద్యోగాలు అంటూ వెలువరించిన జిఓ 564ను మాత్రం వెంటనే అమలు చేసింది. కాని తెలంగాణకు అనుకూలమైన జివోను అమలు చేయలేదు. దీంతో తెలంగాణ ఉద్యోగులు అసహనానికి లోనయింద్రు.

ఆంధ్రోళ్ల పాలనల ఎన్ని ఏండ్లయినా తెలంగాణకు న్యాయం జరగదని ప్రజలకు అర్థమయింది. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష రోజురోజుకు బలపడటం మొదలు పెట్టింది. ఈ నేపథ్యంల 1985 ఫిబ్రవరి 27న తెలంగాణ జనసభ ఆవిర్భవించింది. 'స్టేట్ అడ్వయిజర్' పత్రిక సంపాదకుడు సత్యనారాయణ అధ్యక్షతన జన సభ పురుడు పోసుకుంది.

అదే రోజు సిద్ధిపేటల కాంగ్రెస్ బహిరంగసభ జరిగింది. ఆ సభకు రాజీవ్ గాంధి హాజరై మాట్లాడిండు. తెలంగాణకు జరిగిన అన్యాయంపై తనకు అవగాహన ఉందని ప్రకటించిండు.

రామారావు పాలనల కూడా ఆంధ్రా అకృత్యాలు కొనసాగుతుండటం తెలంగాణ ప్రజలల్ల ఆలోచన రగిలించింది. తెలంగాణపై సోయిని పెంచింది. 1987ల తెలంగాణ ప్రజా సమితి మల్లా ఆవిర్భవించింది. వరంగల్‌కు చెందిన భూపతి కృష్ణ మూర్తి అధ్యక్షతన ప్రజాసమితి తిరిగి ప్రాణం పోసుకుంది.

ఎన్‌టిరామారావు పాలన తొలినాళ్లల్ల అధికారం కోసం గొడవలతోనే గడిచింది. రెండవసారి ఎన్నికైన తర్వాత ఆయన ప్రజాకర్షక పథకాలు ప్రకటించినా అవి తెలంగాణ ప్రజలను సంతృప్తి పరచలేదు. ఆయన ప్రభుత్వమే వెలువరించిన జి.ఓ 610 అటకెక్కింది. రాజకీయ అస్థిరత, అటు కాంగ్రెస్ రాజకీయాలు రామారావును ఊపిరిమెసలకుంట చేసిననయ్. తెలుగుదేశం ప్రజలకు దూరమైంది.

ఈ పరిస్థితుల్ల 1989ల రాష్ట్రశాసనసభకు ఎన్నికలు వొచ్చినయ్. అప్పుడు

చెన్నారెడ్డి పిసిసి అధ్యక్షుడు. ఆ ఎన్నికలల్ల కాంగ్రెస్ మెజారిటీ స్థానాలను గెలుచు కుంది. పిసిసి అధ్యక్షుడిగా ఉన్న చెన్నారెడ్డికి ముఖ్యమంత్రి అవకాశం వొచ్చింది. 1989 డెసెంబర్ 3న ఆయన ముఖ్యమంత్రి పదవిని రొండోసారి చేపట్టిండు.

అయితే చెన్నారెడ్డి మంత్రి వర్గంల వైఎస్ రాజశేఖరరెడ్డికి చోటు దొరకలేదు. టంగుటూరి అంజయ్య, భవనం వెంకటరాంరెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డి మంత్రి వర్గంల రాజశేఖర్‌రెడ్డి ఇంతకు ముందే మంత్రిగా పనిచేసిండు. ఈ సారి చెన్నారెడ్డి మంత్రివర్గంల స్థానం దొరకక పోవడంతో ఆయన అసహనానికి లోనయిండు. ఫ్యాక్షన్ రాజకీయాల నుంచి వొచ్చిన రాయలసీమ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి మీద వ్యతిరేకత పెంచుకుండు. ప్రభుత్వానికి, చెన్నారెడ్డికి వ్యతిరేక కార్యక్రమాలు మొదలుపెట్టిండు.

మల్లా ఒకసారి తెలంగాణ నాయకుడు ముఖ్యమంత్రి పదవి చేపట్టడం ఆంధ్ర నాయకులకు సహజంగనే మింగుడు పడలేదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి అంటే అది ఆంధ్రోళ్లదే అనే అభిప్రాయాన్ని అప్పటికే వాళ్లు ఏర్పరుచుకుంద్రు. గతంల ముఖ్యమంత్రి కుర్చీ మురిపెం తీరకముందే పివి నరసింహారావు, అంజయ్య, చెన్నారెడ్డిని దించేసిన చరిత్ర ఉండె. ఇప్పుడు కూడా అదే కుట్రలు మొదలు పెట్టింద్రు.

చెన్నారెడ్డి మీద కోపంతోటి ఉన్న రాజశేఖరరెడ్డిని ఆంధ్రానాయకులు ఉసి గొల్పింద్రు. ఇగ ఆయన రెచ్చిపోయిండు. ఆయనకు తోడు కావూరి సాంబశివ రావు కూడ రాష్ట్రంల పర్యటించి చెన్నారెడ్డిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసిండు. ఈ నేపథ్యం లనే హైదరాబాద్ పాతబస్తీల గొడవలు జరిగినయ్. అవి ముదిరి మతకలహాలుగా రూపాంతరం చెందినయ్. హైదరాబాద్‌ల నిరవధిక కర్ఫ్యూ విధించింద్రు. చరిత్రల మొదటిసారి హైదరాబాద్ నగరాన్ని సైన్యం చేతుల్ల పెట్టాల్సి వొచ్చింది. నాలుగు వొందల సంవత్సరాల హైదరాబాద్ చరిత్రల అంతవరకు మతకలహాలు అనేమాట వినిపించలేదు. అత్యధికులు హిందువులు ఉన్నా, ముస్లిం రాజులు పాలించినా ఇట్లాంటి అల్లర్లు జరగలేదు. కాని మొదటిసారి హిందూ ముస్లింల మధ్య శత్రువాతావరణం ఏర్పడ్డది.

చెన్నారెడ్డి మీద అసంతృప్తితో ఉన్న రాజశేఖరరెడ్డి హైదరాబాద్ అల్లర్లకు కారకుడని ఆనాడు ఆరోపణలొచ్చినయ్. విజయవాడ గూండాలు, రాయలసీమ ఫ్యాక్ష నిస్టులు ఈ అల్లర్లు సృష్టించింద్రని ప్రచారమైంది.

ఇవి హిందూ ముస్లిం గొడవలు కావని అధికారం కోసం సాగుతున్న కుట్ర లని ప్రజలు గమనించింద్రు. కేవలం తెలంగాణ నాయకుడిని ముఖ్యమంత్రి పదవి

నుండి దించడానికి ఆంధ్రానాయకులు పన్నిన కుట్ర అని లోకం కోడై కూసింది. చివరికి ఆంధ్రా కుట్రలు ఫలించినయ్. 1990 డిసెంబర్ 17న చెన్నారెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిండు.

కాంగ్రెస్ రెడ్ల పార్టీ అని, తెలుగుదేశం కమ్మపార్టీ అని అప్పటికే ప్రజలల్ల నాటుకుపోయింది. కాంగ్రెస్ నాయకుడే ముఖ్యమంత్రి కావాలె కాబట్టి సహజంగనే రెడ్డి నాయకుణ్ణి ఎంపిక చేయడానికి కాంగ్రెస్ కసరత్తు చేసింది. ముఖ్యమంత్రి పదవిల మరింత సహజంగా ఆంధ్రనాయకుడే ఉండాలె కాబట్టి నేదురుమల్లి జనార్దనరెడ్డిని ఆ పదవికి ఎంపిక చేసింది కాంగ్రెస్ అధిష్ఠానం. చెన్నారెడ్డి రాజీనామా చేసిన రోజే నేదురమల్లి జనార్దనరెడ్డి ముఖ్యమంత్రిగ ప్రమాణస్వీకారం చేసిండు. దాంతో అధికారం తమ చేతుల్లనే ఉండాలనుకునే ఆంధ్రనాయకుల కండ్లు చల్లబడ్డయ్.

జనార్దనరెడ్డి పాలనాకాలంల తెలంగాణ వాదాన్ని చంపే ప్రపంచ తెలుగు మహాసభలు మూడవసారి మారిషస్‌ల జరిగినయ్. జనార్దనరెడ్డి పాలనంతా కొట్లాటల తోనే గడిచిపోయింది. ఈయన కాలంల కాంగ్రెస్‌ల అసమ్మతి పెరిగింది. ఈ అస మ్మతికి కారణం మల్లా వైఎస్ రాజశేఖరరెడ్డినే. జనార్దనరెడ్డి మంత్రివర్గంల ఆయనకు పదవి దొరకలేదు. దుందుడుకుగ వ్యవహరించే రాజశేఖరరెడ్డి అప్పటికే ఫ్యాక్షన్ నాయకునిగ ముద్రపడ్డడు. అందుకని ఆయనను జనార్దనరెడ్డి పక్కన పెట్టిండు.

కాని రాజశేఖరరెడ్డి అదేపనిగ అసమ్మతిని వినిపించిండు. ముఖ్యమంత్రిని ఇబ్బందిపెట్టే కార్యక్రమాలు చేసిండు. ఈ నేపథ్యంల ముఖ్యమంత్రి జనార్దనరెడ్డి మీద అవినీతి ఆరోపణలు వొచ్చినయ్. మెడికల్ డెంటల్ కాలేజీలకు అక్రమంగా అనుమతులు ఇచ్చిండనేది అభియోగం. దీంతో ఆయన సీటుకు ఎసరొచ్చింది. 1992 అక్టోబర్ 9న ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిండు.

రాజీవ్‌గాంధి మరణంతో తెలంగాణ నాయకుడు పివి నరసింహరావును అప్పటికి ప్రధానిపీఠం వరించింది. తన ప్రభుత్వంల మంత్రిగ ఉన్న రాయలసీమ నాయకుడు కోట్ల విజయభాస్కరరెడ్డిని ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేసిండు పివి. ఆంధ్ర ప్రాంతనికి చెందిన మరో రెడ్డి అయితే తప్ప రానున్న ఎన్నికలల్ల నెగ్గుకు రావడం కష్టమని ఆయన భావించిండు. పివి ఈ నిర్ణయం వెనుక ఆంధ్ర నాయకుల లాబీయింగ్ ఉంది. కుల కోణం కూడా ఉంది. తెలంగాణ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి ఇస్తే బలపడతరని, ఆంధ్రనాయకులు పుల్లలు పెడతరని కూడా భావించి కోట్లను ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేసిండు. కోట్ల విజయ భాస్కరరెడ్డి 1992 అక్టోబర్ 9న ముఖ్యమంత్రిగ ప్రమాణస్వీకారం చేసిండు.

# జైతెలంగాణ అంటే మంత్రి పదవి

కోట్ల విజయభాస్కరరెడ్డి తర్వాత ఎన్‌టి రామారావు రొండోసారి ముఖ్యమంత్రి అయ్యిండు. అప్పటికే రామారావుకు నాదెండ్ల భాస్కరరావు అనుభవం ఉంది. దీంతో తెలుగుదేశం పార్టీలోని సీనియర్ నాయకుల వల్ల తనకు ప్రమాదం ఉందని భావించిండు. అట్లాంటి నాయకులను మంత్రిపదవులకు దూరంపెట్టిండు.

రామారావు ఈ నిర్ణయంతో కెఈ కృష్ణమూర్తి, ముద్రగడ పద్మనాభం, వసంత నాగేశ్వరరావు వంటి ఆంధ్రానాయకులతో పాటు తెలంగాణ నాయకుడు కుందూరు జానారెడ్డి కూడా మంత్రి పదవికి దూరమైండు. దీంతో తెలుగుదేశం పార్టీని విడిచిపెట్టి బయటికి వొచ్చిండు. మంత్రి పదవులు పోయిన నాయకులందరు కలిసి తెలుగునాడు పేరుతో పార్టీపెట్టి ఊపబోయింద్రు కాని ఆయితి కాక మధ్యలనే వొదిలిపెట్టింద్రు. ఆ తర్వాత జానారెడ్డి కాంగ్రెస్‌ల చేరిండు. అయితే ఆయనకు చెన్నారెడ్డి మంత్రివర్గం లకాని, నేదురుమల్లి జనార్ధనరెడ్డి మంత్రి వర్గంల కాని చోటు దొరకలేదు.

మంత్రి పదవి లేకుంట ఉన్న జానారెడ్డి తెలంగాణ వాదాన్ని వినిపించడం మొదలుపెట్టిండు. తెలంగాణ కాంగ్రెస్ అసంతృప్త నాయకులతో కలిసి తెలంగాణ పోరాటం చేయాలని, తెలంగాణ రాష్ట్రం సాధించాలని మంతనాలు జరిపిండు. తెలంగాణ నాయకులతోటి కలిసి తెలంగాణ ఫోరం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేసిండు. 1990ల తెలంగాణ ఫోరం ఏర్పాటు చేసింద్రు. ఈ సమయంల తెలంగాణ పోరాటం అయినా సరే సహజంగా తమ ఆధిపత్యంలనే ఉంచుకోవాలని రెడ్డి నాయకులు ప్రయత్నాలు చేసింద్రు. తెలంగాణ ఫోరం కన్వీనర్‌గా జానారెడ్డి పేరును ప్రతిపాదించింద్రు. ఒత్తిడి చేసింద్రు. ఫలితంగా జానారెడ్డి ఫోరం కన్వీనర్ అయిండు.

అప్పటికి వెలిచాల జగపతిరావు వంటి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు బలంగా తెలంగాణవాదం వినిపిస్తుంద్రు. 1990 కాలంల నీరుపారుదల, తదితర అంశాలల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను వెలిచాల వెలుగులకు తెచ్చిండు. తెలంగాణ వేదిక ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ప్రయత్నం

చేసిండు. ఈ సమయంలనే జానారెడ్డి తెలంగాణ ఫోరం ఏర్పాటు చేసిండు.

అనేక సమావేశాలల్ల తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యమని జానారెడ్డి ప్రకటిం చిండు. తెలంగాణ ప్రజలు మాత్రం అంతగా స్పందించలేదు. చెన్నారెడ్డి చేసిన ద్రోహం ఇంకా తెలంగాణ ప్రజల మనసుల్ల పచ్చిపచ్చిగానే ఉంది. పదవుల కోసం తెలంగాణ నాయకులు తెలంగాణ పాట పాడుతరని అప్పటికే అర్థం చేసుకుంద్రు. ఆంధ్రా నాయకులు కూడ అదే ప్రచారం చేసింద్రు.

అయినా తెలంగాణ బలంగా కోరుకునే తెలంగాణ నాయకులు మేధావులు జానారెడ్డిని కలిసింద్రు. గత అనుభవాలు వెంటాడుతున్నా నమ్మితే నష్టం లేదన్న అభిప్రాయంతో ఆయనకు మద్దతిచ్చింద్రు.

తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ఎత్తి చూపుకుంట ఫోరం తరుపున జానారెడ్డి ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చిండు. 1990 సెప్టెంబర్‌ల రాష్ట్ర శాసనసభ వరసగా మూడు రోజులు దీనిపై చర్చ జరిపింది. శాసనసభల జరిగిన చర్చకు ముఖ్య మంత్రి జనార్ధనరెడ్డి కూడ జవాబు చెప్పిండు. తెలంగాణకు జరిగిన అన్యాయాలను సరిదిద్దుతమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చిండు.

జానారెడ్డి నాయకత్వంల 1992 సెప్టెంబర్‌ల ప్రధానమంత్రి పివి నరసింహా రావుకు కూడా వినతిపత్రం అందించింద్రు. తెలంగాణకు జరిగిన అన్యాయాలను సరిదిద్దాలని కోరింద్రు.

జానారెడ్డి ఎత్తుకున్న తెలంగాణ వాదం బలం పుంజుకుంది. అప్పుడప్పుడే జనం నమ్మడానికి తయారైతుంద్రు. ఈ సమయంల నేదురుమల్లి జనార్దనరెడ్డి దిగి పోయి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠంమీద కూచుండు.

తెలంగాణవాదం వినిపిస్తున్న జానారెడ్డిని వెతుక్కుంట సహజంగనే మంత్రి పదవి వొచ్చింది. తర్వాత తెలంగాణ ప్రజల అనుమానాలను, భయాలను జానారెడ్డి నిజం చేసిండు. అప్పటి వరకు భుజానికి ఎత్తుకొని ఊరేగిన తెలంగాణ వాదాన్ని, తెలంగాణ ఫోరాన్ని గాలికొదిలి పెట్టిండు. కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రి వర్గంల వ్యవసాయశాఖ మంత్రిగా చేరిండు.

జానారెడ్డి కడదాంక తెలంగాణవాదాన్ని వినిపించలేదని నల్లగొండ, తెలం గాణ ప్రజలు ముందే ఊహించింద్రు. ఆయన తెలంగాణ ఫోరం కన్వీనర్‌గ ఎన్నికైంది కూడ భవిష్యత్ రాజకీయ ప్రయోజనాలకే అన్న నిజం గ్రహించ గలిగింద్రు. జానారెడ్డి తెలంగాణవాదాన్ని ఎత్తుకుంది మంత్రిపదవి కోసమే అన్నది బహిరంగ రహస్యం.

కాని ఆయన కాడెత్తేయడం మాత్రం తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు పోసింది. 1969ల చెన్నారెడ్డి తర్వాత 14 సంవత్సరాలకు జానారెడ్డి కూడా అట్లనే జారుకున్నడు. మర్రి చెన్నారెడ్డిని యాదికి తెచ్చిండు.

తెలంగాణ ప్రజలు మరోసారి మోసపోయిండ్రు. అధికారం కోసం నాయకులు పుట్టిస్తున్నదే తెలంగాణవాదమని ఆంధ్రోళ్లు చేసే ప్రచారమే నిజమైంది. అప్పుడు జానారెడ్డి కాని మరోనాయకుడు కాని తెలంగాణ ముచ్చట మాట్లాడలేదు.

జానారెడ్డి తెలంగాణ వాదాన్ని గాలికి వొదిలి తన దారి తాను చూసుకున్న సమయంల ఉస్మానియా యునివర్సిటీల విద్యార్థుల రూపంల తెలంగాణ ఆకాంక్ష బలంగా వినిపించింది. 1992ల పెద్ద ఉద్యమం జరిగింది. ఆరుసూత్రాల పథకం ఆమలు విషయంల జరుగుతున్న వివక్ష ఉద్యమానికి కారణమైంది.

ఆరుసూత్రాల పథకం ప్రకారం కళాశాలల్ల 85 శాతం సీట్లు స్థానికులకు రిజర్వు చేయాలె. మిగిలిన 15 శాతం ఓపెన్ కాంపిటిషన్ కోటా. కాని యూని వర్సిటీ అడ్మిషన్లలో 15 శాతం సీట్లు స్థానికేతరులకు రిజర్వు చేసిండ్రు. ఈ 15 శాతంల స్థానికులకు అవకాశం లేకుండ చేసిండ్రు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు తెలంగాణ విముక్తి విద్యార్థుల సంస్థను (తెలంగాణ రిజర్వేషన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్) ఏర్పాటు చేసిండ్రు. తమ డిమాండ్లతో విశ్వవిద్యాలయం ఆవరణల ఊరేగింపు తీసిండ్రు. తెలంగాణ రిజర్వేషన్ల గురించి మొదలైన ఈ ఉద్యమం తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను వెలుగులకు తెచ్చింది. ఈ విద్యార్థులు నిర్వహించిన సభలకు జార్జి ఫెర్నాండెజ్, మేథాపాట్కర్ వంటి నాయకులు వొచ్చిండ్రు. విద్యార్థుల ఉద్యమానికి మద్దతిచ్చిండ్రు. అయితె ఈ సంస్థ కొద్ది రోజులకే బలహీన పడ్డది. కాని తెలంగాణ ఆకాంక్షను తెలంగాణ ప్రజలు మర్చిపోలేదని మరోసారి రుజువు చేసింది.

# జైతెలంగాణ పార్టీ నిమజ్జనం

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 1994 డిసెంబర్‌ల జరిగినయ్. ముగ్గురు ముఖ్య మంత్రులను మార్చిన కాంగ్రెస్ మీద అప్పటికే ప్రజలు అసహనం పెంచుకుండ్రు. ఈ వ్యతిరేకతతో తెలుగదేశం పార్టీకి పట్టం కట్టిండ్రు. ఆ పార్టీ నుంచి ఎన్‌టిరామారావు 1994 డిసెంబర్ 12న మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిండు. అప్పటికి ఆయన లక్ష్మీపార్వతిని పెండ్లి చేసుకుండు. ప్రభుత్వంల ఈమె చక్రం తిప్పడం మొదలుపెట్టింది. దీంతో రామారావు కుటుంబసభ్యులల్ల గొడవలు జరిగినయ్. ఇది అదునుగా తీసుకున్న చంద్రబాబునాయుడు పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచిండు. తొమ్మిది నెలలు కూడా నిండకుండనే రామారావు ప్రభుత్వం కుప్పకూలింది.

1995 సెప్టెంబర్ 1న చంద్రబాబు ముఖ్యమంత్రి అయిండు. 1996 ఎన్నికలల్ల తెలుగుదేశం 16 లోకసభ స్థానాలను దక్కించుకుంది. దీంతో కేంద్రంల చంద్రబాబుకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆ సమయంల వాజ్‌పేయి పదమూడు రోజులకే ప్రధానమంత్రి పదవి నుంచి దిగిండు. తర్వాత దేవగౌడ ప్రధానమంత్రి అయిండు. దేవగౌడకు చంద్రబాబు కూడ మద్దతు ఇచ్చిండు. దేవగౌడ మంత్రి వర్గంల తెలుగుదేశం పార్టీ కూడా చేరింది.

ఆ సమయంల ప్రధాని దేవగౌడ చిన్నరాష్ట్రాల ఏర్పాటుకు అనుకూల మని చెప్పిండు. ఉత్తరప్రదేశ్‌ను విభజించి ఉత్తరాఖండ్‌ను ఏర్పాటు చేయటానికి అభ్యంతరం లేదని ఉత్తరాఖండ్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడిండు. ఇది తెలంగాణ నాయకులను కదిలించింది. తెలంగాణ ఉద్యమం దిక్కు చూసిండ్రు. అట్ల రాజకీయ నిరుద్యోగిగ ఉన్న పటోళ్ల ఇంద్రారెడ్డి తెలంగాణ ఉద్యమాన్ని ఎత్తుకుండు.

ఇంద్రారెడ్డి తెలుగుదేశం పార్టీతో రాజకీయాలల్లకు వొచ్చిండు. రామారావు రొండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు ఈయన కార్మిక సంక్షేమ శాఖ మంత్రి అయ్యిండు. ఎన్‌టిఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయినపుడు జైళ్లశాఖ మంత్రిగ పనిచేసిండు. రామారావును పదవినుంచి దించటానికి చంద్రబాబు కుట్ర పన్నిన

సమయంల ఆయన ఎన్‌టిఆర్‌తోనే ఉన్నడు. ఆ తర్వాత లక్ష్మీపార్వతి స్థాపించిన ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీల కొనసాగిండు. అప్పటికి చంద్రబాబు ముఖ్యమంత్రిగ స్థిరపడటం, లక్ష్మీపార్వతి పార్టీ చతికిల పడటంతో ఇంద్రారెడ్డి ఆ పార్టీ నుంచి కూడ బయటికి వొచ్చిండు.

ఆ సమయంల దేవగౌడ మాటలు ఇంద్రారెడ్డికి తెలంగాణను యాదికి తెచ్చినయ్. తెలంగాణ జిల్లాలల్ల పర్యటించిండు. ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వొచ్చింది. ప్రజలల్ల రాష్ట్ర ఆకాంక్ష బలంగ కనిపించింది. ఇది గమనించిన ఆయన 1997ల జైతెలంగాణ పార్టీ పెట్టిండు. ఉత్సాహంగ తెలంగాణ విజయ యాత్రలు మొదలుపెట్టిండు. ప్రజలు ఆదరించింద్రు.

ఉద్యమం ఒక రూపానికి వొచ్చింది. విశ్రాంత న్యాయమూర్తి కొండా మాధవ రెడ్డి కూడా ఇంద్రారెడ్డికి మద్దతు ఇచ్చిండు. నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడు రాకపోతడా అని ఎదురుచూస్తున్న తెలంగాణ వాదులల్ల ఇంద్రారెడ్డి ఆశలు రేకెత్తించిండు. తెలంగాణ కోసం పరితపిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ వంటి మేధావులు కూడ ఆయనకు మద్దతు ఇచ్చింద్రు. తెలంగాణ రాష్ట్ర సాధనకు కావలసిన సూచనలు, సలహాలు ఇచ్చింద్రు.

అయితే జనంల ప్రాచుర్యం రావడంతో ఇంద్రారెడ్డి ప్రవర్తన మారి పోయింది. కలిసివొచ్చే నాయకులను, తెలంగాణ మేధావులను పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మొదలుపెట్టిండు. ఎవరితోను కనీసం మాట్లాడ కుండ జైతెలంగాణ పార్టీకి తనకు తానే అధ్యక్షుడని ప్రకటించుకుండు. కమిటీలు కూడ ఒంటెద్దు పోకడతో ప్రకటించిండు.

ఇట్లాంటి ప్రవర్తనతో మేధావులల్ల ఆశలు చచ్చిపోయినయ్. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించే లక్షణాలు ఇంద్రారెడ్డిల లేవని గ్రహించింద్రు. దాంతో చాలా మంది దూరమైండు. ఇంద్రారెడ్డి అప్రజాస్వామిక చర్యలు తెలంగాణ వాదులను ఇబ్బందిపెట్టినయ్. నిరుత్సాహానికి గురిచేసినయ్. ఉద్యమంల ఆయన వెంట ఉన్న నాయకులే ఆయనను నమ్మలేని పరిస్థితి వొచ్చింది.

తెలంగాణవాదుల అపనమ్మకాన్ని ఇంద్రారెడ్డి నిజం చేసిండు. అప్పు డప్పుడే ఎదుగుతున్న తెలంగాణ ఉద్యమాన్ని కిందపడేసి కాంగ్రెస్ పార్టీల కలిసిండు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైఎస్ రాజశేఖరరెడ్డి ముందు మోకరిల్లిండు. రాజశేఖరరెడ్డి తెలంగాణకు న్యాయం చేస్తడన్న నమ్మకం ఉంది అని ఒక ప్రకటన ఇచ్చి తెలంగాణ ప్రజల ఆశలను గంగల కలిపిండు.

దీంతో తెలంగాణ ప్రజలకు తెలంగాణ నినాదం వినిపించే నాయకుల మీద అపనమ్మకం పెరిగింది. చెన్నారెడ్డి, జానారెడ్డి ఉదంతాలు తెలంగాణ ప్రజలకు యాదికొచ్చినయ్. తెలంగాణ ప్రజల సెంటిమెంటును వాడుకొని మోసం చేసిన నాయకునిగా ఇంద్రారెడ్డి మిగిలిండు. ఆ తర్వాత కొద్దికాలానికే ఆయన రోడ్డు ప్రమాదంల మరణించిండు.

# తెలంగాణను అడ్డుకున్న చంద్రబాబు

1998 మార్చిల జరిగిన లోకసభ ఎన్నికలల్ల తెలుగుదేశం పార్టీ 12 పార్ల మెంటు స్థానాలు గెలుచుకుంది. కేంద్రంల భారతీయ జనతా పార్టీకి చంద్రబాబు నాయుడు మద్దతిచ్చిండు. తెలుగు దేశం పార్టీకి చెందిన బాలయోగి లోకసభ స్పీకర్ అయిండు. 1997 చివరల పార్లమెంటు ఎన్నికల ప్రచారంల బిజెపి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలమని ఆ పార్టీ అగ్రనాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రకటించిండు.

ఆ తర్వాత 1998ల చిన్నరాష్ట్రాల ఏర్పాటుకు బిజెపి అనుకూలమని కాకినాడల తీర్మానం చేసింద్రు. 1999ల శాసనసభకు, పార్లమెంటుకు ఒకేసారి జరిగిన ఎన్నికలల్ల బిజెపి మళ్లా అధికారం దక్కించుకుంది. ఇదే ఎన్నికలల్ల గెలిచిన చంద్రబాబు కూడ రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యిండు. కేంద్రంల వాజ్‌పేయి ప్రభుత్వానికి చంద్రబాబు మద్దతిచ్చిండు.

చిన్నరాష్ట్రాల ఏర్పాటుకు అనుకూలమని బిజెపి చేసిన కాకినాడ తీర్మా నాన్ని అమలుచేయడానికి వాజ్‌పేయి ప్రభుత్వం పూనుకుంది. ప్రత్యేక రాష్ట్రాలను డిమాండు చేస్తున్న నాలుగింటిని పరిశీలించింది. ఛత్తీస్‌గడ్, జార్ఖండ్, ఉత్తరాంచల్, తెలంగాణ రాష్ట్రాలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది.

అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చంద్రబాబు సైంధవుని లెక్క అడ్డ పడ్డడు. చంద్రబాబు మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వాజ్‌పేయికి సంకట పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ ఏర్పాటు ఆలోచనను మాను కోవాలని వాజ్‌పేయి ప్రభుత్వాన్ని బెదిరించిండు చంద్రబాబు. తెలంగాణ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తే ప్రభు త్వానికి తన మద్దతు ఉపసంహరించుకుంట అని బ్లాక్‌మెయిల్ చేసిండు.

దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడానికి బిజెపి కూడా సాహసం చేయలేదు. అధికారానికి దూరం కావాల్సి వొస్తదని ఆ పార్టీ భయపడ్డది. ప్రజల ఆకాంక్ష కంటే అధికారమే ముఖ్యమని భావించింది. కాకినాడ తీర్మానాన్ని గాలికి

వొదిలిపెట్టింది. మిగిలిన మూడు రాష్ట్రాలను 2000 నవంబర్‌ల ఏర్పాటు చేసింది. కాని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆలోచనను వొదిలి పెట్టింది. చంద్రబాబు పుణ్యమా అని తెలంగాణ ఆగిపోయింది.

తెలంగాణ ఏర్పాటుకు భారతీయ జనతా పార్టీ అనుకూలంగా ఉన్నా చంద్రబాబు అడ్డుకున్న సంగతి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వైఎస్‌రాజశేఖరరెడ్డి గ్రహించిండు. ఈ విషయాన్ని తనకు అనుకూలంగ మార్చుకోవడానికి ఎత్తువేసిండు.

ఎప్పటి నుంచో ముఖ్యమంత్రి పదవి కోసం కాచుకొని కూసున్న ఆయన తెలంగాణ అంశంతో చంద్రబాబును ఇరుకున పెట్టాలని చూసిండు. తెలంగాణ వాదాన్ని వినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులకు మద్దతు ఇచ్చిండు. అప్పటికే తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులు తెలంగాణ ఫోరం ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తుండ్రు. తన అవసరం కూడా అదే కాబట్టి ఫోరం ఏర్పాటును ప్రోత్సహించిండు. ఫోరం ఏర్పడ్డది. తనకు అనుకూలంగా ఉండే తెలంగాణ నాయకుడు జె.చిన్నారెడ్డిని తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటివ్ ఫోరానికి కన్వీనర్ అయ్యేటట్లు చేసిండు.

ఈ నేపథ్యంల 2000 ఆగస్టు 11న సోనియాగాంధీ హైదరాబాద్ వొచ్చింది. ఈ సందర్భంగ తెలంగాణ ఐక్యవేదిక నుంచి ప్రొఫెసర్ జయశంకర్ తదితరులు చిన్నారెడ్డిని కలిసిండ్రు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాల గురించి సోనియాకు తెలంగాణ శాసనసభ్యులు వినతిపత్రం ఇస్తే బాగుంటుందని చెప్పిండ్రు.

సోనియాగాంధీకి వినతిపత్రం ఇయ్యాలని రాజశేఖరరెడ్డి కూడా ప్రోత్సహించిండు. దీనికి కారణం ముఖ్యమంత్రి చంద్రబాబును ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశం. అంతేకాని రాయలసీమ ప్రాంతానికి చెందిన రాజశేఖరరెడ్డికి తెలంగాణ మీద ప్రేమ ఉందని ఎవరూ అనుకోలేదు.

చిన్నారెడ్డి, పాల్వాయి గోవర్ధనరెడ్డి ద్వారా ఐక్య వేదిక నాయకులు 41 మంది తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులల్ల అందుబాటుల ఉన్న 38 మంది సంతకాలు తీసుకుండ్రు. లేక్‌వ్యూ అతిథిగృహంల ఉన్న సోనియాగాంధీకి వినతి పత్రం అందించిండ్రు. ఈ సందర్భంగ సోనియాగాంధీ తనను కలిసిన ప్రొఫెసర్ జయశంకర్ తదితరులతో మాట్లాడింది. తెలంగాణ సమస్యపై తనకు కొంత అవగాహన ఉందని అన్నది. తెలంగాణ రాష్ట్ర డిమాండును పరిశీలిస్తనని చెప్పింది.

1997 ఆగస్టు 14, 15 తారీకులల్ల ఉస్మానియా విశ్వవిద్యాలయంల ప్రొఫెసర్ జయశంకర్, కేశవరావు జాదవ్, వి.ప్రకాశ్, రాపోలు ఆనందభాస్కర్ వంటి

వారు సమావేశమైంద్రు. తెలంగాణ సమస్యలు, రాష్ట్ర డిమాండు తదితర అంశాలపై మాట్లాడింద్రు. అదేరోజు ఐక్యవేదిక ఏర్పాటుతో తెలంగాణవాదులల్ల కదలిక వొచ్చింది. అనేకమంది మేధావులు, విద్యార్థులు కలిసింద్రు.

1999లో చిన్నారెడ్డి కన్వీనర్‌గా తెలంగాణ ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు అయ్యింది. ఈ వేదికతోనే చిన్నారెడ్డి తెలంగాణ వాదాన్ని వినిపించిండు. కాంగ్రెస్ జెండాల తెలంగాణ పటాన్ని ముద్రించిండు. ఈ జెండా పట్టుకొని తెలంగాణ జిల్లాలన్నీ తిరిగిండు. ప్రజలు తెలంగాణ మీద ప్రేమతో చిన్నారెడ్డిని నమ్మింద్రు. తెలంగాణ కోసం కొట్లాడుతుండని వెంట నడిచింద్రు.

తెలంగాణ పేరు చెప్పి కాంగ్రెస్ నాయకులను, శాసస సభ్యులను చిన్నారెడ్డి ఒకే తాటిపైకి తెచ్చిండు. 2001ల మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిల భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసిండు. తెలంగాణ సాధనే లక్ష్యమని ప్రకటించిండు. తెలంగాణ వాదం జనంలకు పోయింది.

తెలంగాణకు జరిగిన అన్యాయాలపై కూడా చిన్నారెడ్డి గొంతు విప్పిండు. నీటి పంపకాలల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతుందన్నడు. ఇదే సమయంల ఖమ్మం జిల్లా దుమ్ముగూడెంల నీటి పంపకాలల్ల జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ధర్నా చేసిండు. ప్రజలు బ్రహ్మరథం పట్టింద్రు. తెలంగాణ సాధించడానికి ఒక నాయకుడు వొచ్చిండని సంబూరపడ్డరు.

2004ల శాసన సభకు ఎన్నికలు వొచ్చినయ్. ఈ ఎన్నికల సందర్భంగా తెలంగాణ గురించి చులకనగా మాట్లాడిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని తీవ్రంగా విమర్శించిండు చిన్నారెడ్డి. దీంతో చిన్నారెడ్డి మీద ప్రజలకు మరింత గురికుదిరింది. మరిన్ని ఆశలు పెంచుకున్నరు. ఈ ఎన్నికలల్ల చిన్నారెడ్డి శాసనసభ్యునిగా ఎన్నికైండు. ఆ వెంటనే రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంల మంత్రిగా చేరిండు.

అప్పటి వరకు తెలంగాణ తెలంగాణ అని కలవరించిన చిన్నారెడ్డి ఆ తర్వాత ఆ పదాన్నే మరిచిపోయిండు. సీమాంధ్ర ముఖ్యమంత్రి అడుగులకు మడుగు లొత్తిండు. వైఎస్ తొత్తులెక్క మారిండు. తెలంగాణ అంటెనే ఒంటికాలు మీద లేవడం మొదలుపెట్టిండు. పదవుల కోసం తెలంగాణ ప్రజల ఆశలను వమ్ముచేసిండు.

# కమిటీల మీద కమిటీలు

ఒకవైపు భారతీయ జనతా పార్టీ మూడు రాష్ట్రాల ఏర్పాటు చేసింది. మరోవైపు తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును డిమాండు చేస్తుండ్రు. అదే సమయంల శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖరరావు రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేసిండు. తెలంగాణ డిమాండు ఊపందుకుంది. దీంతో చంద్రబాబుపై ఒత్తిడి పెరిగింది.

ఇదే సమయంల తెలంగాణ ఏర్పాటును అడ్డుకున్నది చంద్రబాబే అన్న ప్రచారం కూడ ఊపందుకుంది. అట్లనే తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ప్రభుత్వం 1985ల వెలువరించిన జిఓ 610 అమలుల జాప్యం జరుగు తుండటంతో ఉద్యోగులల్ల అసంతృప్తి పెరిగింది. ఈ అసంతృప్తిని తగ్గించ డానికి చంద్రబాబు పూనుకుండు. అసంతృప్తి పెరిగితె అది ప్రత్యేక రాష్ట్ర డిమాం డును ఉధృతం చేస్తదని భయపడ్డడు. ఆంధ్రానాయకుడు కాబట్టి సహజంగనే ఆయనకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం ఇష్టం లేదు.

610 జిఓ అమలును పరిశీలించడానికి 2001 జూన్ 25న జిఎం గిర్‌గ్లాని (జెటో మంగళ్‌దాస్ గిర్‌గ్లానీ) ఏకసభ్య విచారణ కమిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించిండు. ఈ కమిటీ 90 రోజులల్ల నివేదిక ఇయ్యాలని గడువు పెట్టిండు.

గిర్‌గ్లాని కమిటీ విచారణ ప్రారంభించింది. కాని ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదు. రాష్ట్ర ప్రభుత్వంలోని 204 శాఖలల్ల ఈ ఉన్నతాధికారికి 52 శాఖలు మాత్రమే సమాచారం అందించినయ్. మిగిలిన 152 ప్రభుత్వశాఖల అధిపతులు ప్రభుత్వ అండతో కమిటీకి సహకరించలేదు. ఈ 152 శాఖలల్ల స్థానికేతరుల జాబితాలు రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘనల వివరాలు కమిటీకి అందించలేదు. ప్రభుత్వ శాఖల సహకారం లేకపోవడంతో 25 శాతం ఉద్యోగుల జాబితాతోనే తొలి నివేదికను 2001 అక్టోబర్ 6న గిర్‌గ్లాని కమిటీ ప్రభుత్వానికి అందజేసింది.

గిర్‌గ్లానీ కమిటీ నివేదిక :

- ఓపెన్ కేటగిరిల ఉన్న పోస్టులను నాన్ లోకల్ కోటాగా వక్రీకరించుట.
- కొన్ని పోస్టుల పే స్కేళ్లను పెంచి లోకల్ కేండిడేట్లకు ఉన్న కోటాను తగ్గించుట. ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని ఆ నివేదిక పేర్కొన్నది.
- ఓపెన్ కేటగిరీకి సంబంధించిన ఖాళీలకు బదులు రిజర్వ్‌డ్ కేటగిరికి సంబంధించిన ఖాళీలను నింపడంతో, స్థానికులకు నష్టం, స్థానికేతరులకు ప్రయోజనం జరుగుతుంది.
- బోగస్ సరిఫికెట్ల ద్వారా అక్రమంగా ఉద్యోగాలు సంపాదించిన స్థానికేతరుల సంఖ్యను నిర్ధారించడంల అశ్రద్ధ.
- ఇంటర్ డిస్ట్రిక్ట్, ఇంటర్ జోనల్ బదిలీలలో జరిగిన అక్రమాలు, ఏకపక్ష ధోరణులు.
- న్యాయశాఖల బాహాటంగా జరిగిన ఉల్లంఘనలు, అక్రమ నియామకాలు.
- లోకల్ కేండిడేట్లకు సంబంధించిన బ్యాక్‌లాగ్ పోస్టులను ఓపెన్ కేటగిరీకి మార్చి నాన్ లోకల్స్‌కు అందించుట.
- సెక్రటేరియట్ వంటి రాష్ట్రస్థాయి కార్యాలయంల ఖాళీలను భర్తీ చేసినపుడు అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరగకపోవుట.
- స్వయంప్రతిపత్తి గల కార్పోరేషన్‌లు, బోర్డులు వంటి సంస్థలల్ల ఆరుసూత్రాల పథకాన్ని అమలు చేయకపోవడం. ఒక పరిశ్రమాభివృద్ధి సంస్థల మాత్రమే అమలు చేయడం.
- అక్రమ నియామకాలపై అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులను ఖాతరు చేయక పోవడం.

అయితే సమగ్ర విచారణ జరపాలని అదే ముఖ్యమంత్రి చంద్రబాబు కమిటీ కాలాన్ని మరో మూడు సంవత్సరాల మూడు నెలలు పొడిగించిండు. ప్రభుత్వం పెట్టిన మెలికలు, ప్రభుత్వశాఖల నుంచి సహకారం లేకపోవడం, కమిటీకి ఇబ్బంది కలిగించింది. అయినా దొరికిన సమాచారాన్నిబట్టి 1975–2001 మధ్యన 8 రకాల

126 ఉల్లంఘనలు జరిగినయని కమిటీ ప్రకటించింది. ఈ కమిటీ తన తుది నివేదికను 2004 సెప్టెంబర్ 30న ప్రభుత్వానికి అందజేసింది.

అయితే చంద్రబాబు ప్రభుత్వం ఈ కమిటీ నివేదిక ఆధారంగ ఏమైనా చర్యలు తీసుకుందా అంటే అదీ లేదు. సమస్య నాన్చడానికి మరో ఎత్తు వేసిండు చంద్రబాబు.

గిర్గ్లాని కమిటీ నివేదికను పరిశీలించడానికి చంద్రబాబు ప్రభుత్వం ఒక మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఆ మంత్రివర్గ ఉపసంఘం నివేదికను చదివి క్రోడీకరించి తమకు నివేదించడానికి మరొక అధికారుల కమిటీని నియమించింది. ఈ అధికారుల కమిటీ తయారు చేసిన పరిశీలనల ప్రకారం జిఓ 72ను ప్రభుత్వం విడుదల చేసింది.

జిఓ 72 ఉత్తర్వులు, రాష్ట్రపతి ఉత్తరువుల స్ఫూర్తికి, జిఓ 610 స్ఫూర్తికి విరుద్ధంగ ఉన్నయని తెలంగాణ ఉద్యోగులు, తెలంగాణవాదులు గొడవ చేసింద్రు. దీంతో మళ్లా జిఓ116 ద్వారా జిఓ72 ను ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. సమస్యను తేల్చకుండా నాన్చడానికి గిర్గ్లాని కమిటీని వేసిన చంద్రబాబు అనుకున్నట్లుగనే నాలుగు సంవత్సరాలు సాగదీసిండు. అయినా ఈ కమిటీ నివేదిక ఆధారంగ ఆంధ్రా నాయకుల ఆధీనంల ఉన్న ప్రభుత్వం, ముఖ్యంగా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు తీసుకుంటదని ఎవరూ నమ్మకం పెట్టుకోలేదు.

ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 610ని అమలు చేయకుండా ఇరవయ్యేండ్లు సాగదీసిన ఘనతను తెలుగుదేశం పార్టీ మూటగట్టుకుంది. చంద్రబాబు నాయుడు మూటగట్టుకుండు.

అసెంబ్లీల తెలంగాణ అన్న పదం వినిపిస్తే చంద్రబాబు ఒంటికాలుమీద లేచిండు. వెనకబడ్డ ప్రాంతాలు అని చెప్పాలె కాని తెలంగాణ అనేమాట అనకూడదని తెలంగాణ నాయకులను అవమానపరిచిండు.

అందరు ఆంధ్రానాయకుల లెక్కన్నే చంద్రబాబు కూడా తెలంగాణ మీద మొసలికన్నీరు కార్చిండు కాని తెలంగాణకు ఏమీ ఒరగబెట్ట లేదు. పైగా తెలంగాణ అకాంక్షలను అడుగడుగునా అణగదొక్కడానికి ప్రయత్నం చేసిండు.

# టిఆర్ఎస్ ఆవిర్భావం



# తెలంగాణ రాష్ట్ర సమితి

సమైక్యరాష్ట్రంల తెలంగాణ నలబై అయిదేండ్లు వివక్షకు గురైంది. తెలంగాణ ప్రజలకు రెండోశ్రేణి పౌరులుగనే గుర్తింపు దక్కింది. తెలంగాణకు అధికారం లేదు. తెలంగాణకు ఆత్మగౌరవం లేదు. తెలంగాణ యువతకు ఉద్యోగాలు లేవు. తెలంగాణ రైతుల పొలాలకు నీళ్లు లేవు. వలసవాదులకు తెలంగాణ ఒక ఆక్రమిత ప్రాంతమైంది.

ఈ బంధనాలను వొదిలించుకోవడానికి తెలంగాణ ప్రజలు తనుకులాడింద్రు. ఉద్యమాల బాట పట్టింద్రు. ఊపిరి మెసలకుంట చేసింద్రు. కాని ఫలితం దక్కలేదు. వలసవాద సంకెళ్లను తెంచుకోవాలని పోరాటం చేసినప్పుడెల్లా అణచివేతకు గురైంద్రు. మరింత వివక్షకు గురైంద్రు.

తెలంగాణ దుస్థితిని పసిగట్టి చాలామంది తెలంగాణ నాయకులు ముందు కొచ్చింద్రు. ఆర్భాటంగ ఉద్యమాలు మొదలుపెట్టింద్రు. చివరికి ఎవరి తోవల వాళ్లు జారుకుంద్రు. తెలంగాణ ప్రజలకు నిరాశ మిగిలిచ్చింద్రు.

ఇంతవరకు, అట్ల ఉద్యమాలను మీదేసుకొని నడిపించి ఆ తర్వాత ఎత్తేసి పోయిన నాయకులంతా రాజకీయ నిరుద్యోగులే. మర్రి చెన్నారెడ్డి అనర్హత వేటుపడి ఉన్న సమయంల తెలంగాణ ఉద్యమాన్ని ఎత్తుకుండు. ఆ తర్వాత ఎత్తే సిండు. ఫలితంగ గవర్నర్ అయిండు. ముఖ్యమంత్రి అయిండు. ఆ తర్వాత కుందూరు జానారెడ్డి తెలంగాణ కోసం గొంతు సవరిస్తుండగనే ఆయనను మంత్రి పదవి వరించింది. జై తెలంగాణ పార్టీ పెట్టి ఉరుకులు బెట్టిన ఇంద్రారెడ్డి చివ రికి కాంగ్రెస్‌ల కలిసిండు. అధికారంల లేనపుడు తెలంగాణవాదాన్ని వినిపించి చివరికి కాంగ్రెస్ అధికారంలకు రాంగనే మంత్రిపదవిల కూచుండు చిన్నారెడ్డి.

తెలంగాణ ఉద్యమం చిత్రమైన రాజకీయ ఉద్యమమైంది. పదవులు దక్కించు కోవడానికి తెలంగాణ నాయకులకు రాచబాటయింది. తెలంగాణ ఉద్యమం అంటే తెలంగాణ రాజకీయ నిరుద్యోగులు తమ పదవులకోసం చేసే ఉద్యమమే అని ఆంధ్రోళ్లు

ఎచ్చిడిచేసేటట్లు చేసింగ్రు. ఇంతకాలం రాజకీయ నిరుద్యోగులు, పదవులు దక్కని అసంతృప్తులు నడిపిన ఉద్యమాన్ని, తెలంగాణ ఉద్యమ చరిత్రల మొదటిసారి, పదవు లల్ల ఉన్న తెలంగాణ నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు భుజాల కెత్తుకుండు.

కెసిఆర్ అని తెలంగాణ ప్రజలు ముద్దుగ పిలుచుకునే చంద్రశేఖర్‌రావు తెలుగుదేశం ప్రభుత్వంల అప్పటికే మంత్రి పదవులు చేపట్టిండు. చంద్రబాబు ప్రభుత్వం లో డిప్యూటి స్పీకర్ పదవిల కూసుండు. తెలంగాణ రైతుల గోసకు కదిలిపోయిన ఆయన డిప్యూటి స్పీకర్ పదవిల ఉండి ప్రభుత్వానికి ఉత్తరం రాసిండు. తెలంగాణల కరెంటుకోతల గురించి, రైతుల కష్టాల గురించి ఏకరువు పెట్టిండు. అయినా చంద్ర బాబు సర్కారు చీమకుట్టినట్లుగ కూడ కదల్లేదు. తెలంగాణపై నిర్లక్ష్యం చూపింది. దీనికి కెసిఆర్ బాధపడ్డడు. తెలంగాణ అంటే ఆంధ్రా సర్కారుకు ఉన్న చిన్నచూపుకు ఆవేదన చెందిండు. తెలంగాణ కోసం ఏదో చెయ్యాలని ఆలోచన చేసిండు.

అప్పటికే తెలంగాణ కోసం ఎవరైనా నాయకుడు ముందుకు రాకపోతడా, తెలంగాణ సాధించక పోతమా అని ఎదురుచూస్తున్నరు తెలంగాణ మేధావులు. అందుల పెద్దాయన ప్రొఫెసర్ జయశంకర్. ఇంతకు ముందే ఈయన ఇంద్రారెడ్డిని కలిసిండు. నిరాశపడ్డడు. కొద్దిరోజులకు ఆనాటి ప్రతిపక్షనాయకుడు పి.జనార్దన్‌రెడ్డిని కలిసిండు. ఫలితం దక్కలేదు. అయినా ఒక తెలంగాణ నాయకుని కోసం ఎదురు చూసిండు.

అట్లాంటి సమయంల ఈయనకు కెసిఆర్ కనపడ్డడు. తెలంగాణ మేధావులు వి.ప్రకాశ్, బి.హనుమంతరావు తదితరులతో కలిసి కెసిఆర్ దగ్గరికి పోయిండు. తెలంగాణ రైతులకు కరంటు బాధలు ఒక్కటే కాదు అని నలబై ఐదేండ్ల దుక్కాన్ని వినిపించిండు. అంతా విన్న కెసిఆర్ కదిలిపోయిండు.

ఆ తర్వాత అనేకమంది తెలంగాణవాదులతో కెసిఆర్ మాట్లాడిండు. అంతా చెప్పింది, అందరు కోరుకునేది ఒక్కటే. అది తెలంగాణ రాష్ట్రం.

ఇక కెసిఆర్ రాష్ట్ర సాధన కోసం నడుం బిగించిండు. రాష్ట్రాన్ని సాధించ డానికి ఉద్యమం తప్ప మరో మార్గం లేదనుకుండు. అందుకు ఒక వేదిక కావాలె. తెలంగాణ ప్రజలకు తమ ఆకాంక్షలను వినిపించటానికి ఒక రాజకీయపార్టీ కావాలె. అందుకే తెలంగాణ రాష్ట్ర సమితికి రూపకల్పన చేసిండు.

తెలంగాణ విషయంల గత చేదు అనుభవాలున్నవాళ్లు కెసిఆర్‌తో కలిసి పనిచేయడానికి ముందుకు రాలేదు. కెసిఆర్‌ను కూడా గతంల ఉద్యమాన్ని ఎత్తుకొని ఎత్తేసిన నాయకుల లెక్కన్నే చూసింగ్రు. కాని ఆయన మీద నమ్మకమున్న వాళ్లు, నమ్మితే పోయేది ఏమీ లేదనుకున్న ఆశావాదులు మద్దతుగ నిలబడ్డరు.

2001 ఏప్రిల్ 27న కరీంనగర్‌ల బహిరంగసభ. తెలంగాణ పుట్ట పగిలినట్టు జనం వొచ్చింద్రు. ఆ రోజు తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిండు కెసిఆర్. అదేరోజు తన శాసన సభ్యత్వానికి, డిప్యూటీ స్పీకర్ పదవికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా విసిరికొట్టిండు. ఇగో చంద్రబాబూ, నా రాజీనామా నీ మొఖం మీద కొడుతున్న. తీసుకో. ఇది డిప్యూటీ స్పీకర్ పదవికి. ఇది నా శాసన సభ్యత్వానికి. ఇది తెలుగు దేశం పార్టీకి అని చెప్పి మరీ విసిరికొట్టిండు.

ఇప్పటి దాంక జరిగిన తెలంగాణ చరిత్రకు భిన్నంగ పదవులు వొదిలిపెట్టి ఉద్యమంలకు వొచ్చిండు. తనకు పదవులు వెంట్రుకపోసతో సమానమని తేల్చి చెప్పిండు. తెలంగాణ సాధన ఏకైక లక్ష్యం అని బహిరంగసభల నినదించిండు. తెలంగాణ ప్రజలకు ఒక నమ్మకం కలిగించిండు. ఒక ఆశ రగిలించిండు.

వెంటనే జనంలకు పోవడానికి కెసిఆర్ ప్రణాళిక చేసిండు. ఒక భారీ సభ పెట్టాలనుకుండు. నిరాశతో ఉన్న తెలంగాణ ప్రజలల్ల ఉత్తేజం నింపడానికి 2001 మే 11న కరీంనగర్‌ల సింహగర్జన పేరుతో మొట్టమొదటిసారి భారీ బహిరంగసభకు ఏర్పాట్లు చేసిండు.

అనుకున్నట్లుగనే పెద్ద ఎత్తున సభ జరిగింది. తెలంగాణ పదిజిల్లాల నుంచి లక్షలాది మంది జనం తండోపతండాలుగ వొచ్చింద్రు. ఆ సభకు జార్ఖండ్ ముక్తిమోర్చా నాయకుడు శిబుసోరేన్ కూడ హాజరైండు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు తెలిపిండు.

ఆరోజు కెసిఆర్ మాట్లాడిన మాటలు జనం గుండెలకు తాకినయ్. తెలంగాణ భాషల, యాసల ఆయన మాట్లాడిన ప్రతిమాటా తెలంగాణ జనానికి ఆశలు కలిగించి నయ్. జనం కెసిఆర్‌కు జేజేలు పలికింద్రు. కరీంనగర్ సభ తెలంగాణ మలి ఉద్యమా నికి నాంది అయింది. జనంల కదలిక తెచ్చింది.

ఆ ఊపుతో తెలంగాణ పది జిల్లాలల్ల సభలు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర సమితి భావించింది. ఆ వరుసల 2001 జూన్ 2న మహబూబ్‌నగర్‌ల మహాసభ జరిగింది. ఈ సభలకు కూడ అదే స్పందన, అదే జనం.

అదే వరసల జూన్ 6న ఆదిలాబాద్, జూన్ 7న నిజామాబాద్‌ల సభలు జరిగినయ్. తెలంగాణ ఉత్తర దక్షిణ అన్న భేదం లేకుండ తెలంగాణ ఆకాంక్షను జనం వినిపించింద్రు. కెసిఆర్‌కు నివాళి పట్టింద్రు.

పార్టీ పెట్టిన 65 రోజుల్లనే రాష్ట్రంల స్థానికి ఎన్నికలు వొచ్చినయ్. ఉద్యమ ప్రచారం చేయడానికి ఈ ఎన్నికలను వినియోగించుకుండు కెసిఆర్. ఒకవైపు

తెలంగాణకు జరిగిన అన్యాయాలను ఏకరువు పెట్టిండు. ఆంధ్రా పాలకుల వివక్ష, దోపిడీ ప్రజలకు పూసగుచ్చినట్లు చెప్పిండు. మరోపక్క ఎన్నికలల్ల గులాబీ బలం పెంచి, ఉద్యమాన్ని ఉరికించాలని కోరిండు.

కెసిఆర్ ఉద్యమంలకు రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెమటలు పట్టినయ్. ఎదురు లేకుండ నడుస్తున్న ఆంధ్రా దోపిడీ, అధికారానికి ఊపిరి మెసల కుంట అయ్యింది. దీంతో ఆంధ్రా కుట్రలు బుసకొట్టినయ్. రాజకీయ పదవుల కోసమే కెసిఆర్ తెలంగాణ వాదాన్ని ఎత్తుకుండని ప్రచారం చేసింద్రు. పదవి రాంగనే ఇంతకు ముందు నాయకుల లెక్కన్నే ఉద్యమాన్ని వొదిలిపెట్టి పోతడని విషం చిమ్మింద్రు. కెసిఆర్‌ను ప్రజలు నమ్మకుంట చేయాలనుకుంద్రు.

ఇట్లాంటి విష ప్రచారం జరుగుతదని కెసిఆర్ ముందే పసిగట్టిండు. ప్రజల నమ్మకాన్ని మరింత పెంచుకోవడానికి ప్రయత్నం చేసిండు. ఉద్యమానికి ద్రోహం చేస్తే రాళ్లతో కొట్టి చంపండి అని పిలుపునిచ్చిండు. ఇది ప్రజలకు చేరింది. కెసిఆర్‌పై నమ్మకం కలిగింది. ఇంక కెసిఆర్ రెట్టించిన ఉత్సాహంతో జనంలకు పోయిండు.

2001 జూలైలనే సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు జరిగినయ్. ఈ స్థానిక ఎన్నికలల్ల టిఆర్ఎస్ తన ఉనికి చాటుకుంది. 1000 మందికి పైగా ఎంపిటిసిలు ఉద్యమపార్టీ నుంచి గెలిచింద్రు. 87 మండలాలల్ల జడ్‌పిటిసిలు, 84 మండలాలల్ల ఎంపిటిసి స్థానాలను టిఆర్ఎస్ గెలుచుకుంది. మొట్టమొదటిసారి ఎన్నికల్ల పాల్గొన్న ఉద్యమపార్టీ రెండు జిల్లా పరిషత్ చైర్మన్ పదవులను దక్కించు కుంది. శనిగరం సంతోష్‌రెడ్డి నిజామాబాద్ జిల్లా పరిషత్ అధ్యక్షుడు అయ్యిండు. కెవి రాజేశ్వరరావు కరీంనగర్ జడ్‌పి చెర్మన్ అయ్యిండు.

ఈ ఎన్నిక టిఆర్ఎస్‌కు, కెసిఆర్‌కు వెయ్యేనుగుల బలాన్ని ఇచ్చింది. ఉద్యమం ఊపందుకుంది. ఆ వెంటనే 2001 సెప్టెంబర్ 22న కెసిఆర్ రాజీనామా చేసిన సిద్ధిపేట శాసన సభ స్థానానికి ఎన్నికలు జరిగినయ్. ఈ ఎన్నికలల్ల కెసిఆర్‌ను ఓడించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. కెసిఆర్‌ను ఓడించడం ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని దెబ్బకొట్టాలని అధికారాన్ని, డబ్బును కుమ్మ రించిండు. కాని ఆంధ్రా అధికార కుట్రలను పటాపంచలు చేసి తెలంగాణ ఓటర్లు తీర్పు ఇచ్చింద్రు. కెసిఆర్‌ను గెలిపించింద్రు. ఈ ఫలితం కెసిఆర్‌కు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది, ఉద్యమానికి బలమొచ్చింది.

ఆ ఊపుల నవంబర్ 17న ఖమ్మంల టీఆర్ఎస్ బహిరంగ సభ జరిగింది. జనం నుంచి అద్భుతమైన స్పందన వొచ్చింది. ఉద్యమ ఊపు చల్లారకుండ కెసిఆర్

ఊరు వాడ తిరిగిండు. జిల్లా జిల్లా తిరిగిండు. ఆ క్రమంల 2002 మార్చి 27న రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌ల బ్రహ్మాండమైన సభ జరిగింది. ఉద్యమ పార్టీ పుట్టిన ఏడాదిలనే తెలంగాణ మొత్తం పాకింది.

టిఆర్ఎస్ ప్రథమ వార్షికోత్సవ సభ 2002 ఏప్రిల్ 27న నల్లగొండల ఘనంగా జరిగింది. నల్లగొండ పట్టణం మిర్యాలగూడ రోడ్డుల విశాలమైన మైదానంల ఏర్పాటు చేసిన సభకు పది లక్షల మంది ప్రజలు హాజరయ్యింద్రు. గుంతకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, చాడ కిషన్‌రెడ్డి, చకిలం అనిల్‌కుమార్, బండ నరేందర్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, పంకజ్‌యాదవ్, జి. వెంకటేశ్వర్లు నల్లగొండ సభ ఏర్పాట్లను చూసింద్రు. ఆనాటి సభకు కెసిఆర్‌తో పాటు శిబుసోరెన్, అజిత్‌సింగ్, భీమ్‌సింగ్, ఆచార్య జయ శంకర్, ఆర్. విద్యాసాగర్‌రావు హాజరై మాట్లాడింద్రు. ఈ సభ తెలంగాణ ఉద్యమానికి మరింత ఊపునిచ్చింది.



హాలియాలో కెసిఆర్‌తో కలిసి పాదయాత్ర చేస్తున్న చాడ కిషన్‌రెడ్డి తదితరులు

# తెలంగాణ సిపాయి కెసిఆర్

తెలంగాణ రాష్ట్ర సమితి పుట్టిన్నాడు కెసిఆర్ ఒక్కడు. ఆయన వెంట చెప్పు కోదగ్గ మరోనాయకుడు లేడు. తన ఆలోచనలు వ్యూహాలు అన్నీ మేనల్లుడు తన్నీరు హరీశ్‌రావుతోనే పంచుకున్నడు. ఆ తర్వాత రొండవ స్థాయి నాయకులు ఒక్కొక్కరు వొచ్చి ఉద్యమంతో కలిసింద్రు. రాష్ట్ర రాజకీయాలల్ల టిఆర్ఎస్ గురించి కెసిఆర్ గురించి చర్చ మొదలైంది.

పత్రికలు కూడ ఉద్యమాన్ని ప్రోత్సహించినయ్. తెలంగాణ ఉద్యమం రాజకీయ పదవులను ఇస్తది. పత్రికల సర్క్యులేషన్‌ను కూడా పెంచుతది. ఈ విషయం తెలుసుకున్న పత్రికలు టిఆర్ఎస్ ప్రతి కదలికను రాసినయ్.

కెసిఆర్ కూడ తెలంగాణ మీద అవగాహన పెంచుకోవడానికి శతవిధాల ప్రయత్నం చేసిండు. ప్రొఫెసర్ జయశంకర్ వంటి పెద్దల మాటలను బుద్ధిగ విన్నడు. జీర్ణం చేసుకుండు. 1969 ఉద్యమంనాటి పొరపాట్లు జరగకుండ జాగ్రత్త పడ్డడు. తెలంగాణ తొలి ఉద్యమం ఆవేశం, ఉద్రేకంతో జరిగింది. ఇదే నాటి ఉద్యమానికి బలహీనత అయ్యింది. ప్రభుత్వం ఈ బలహీనతను వాడుకొని ఉద్యమాన్ని శాంతి భద్రతల సమస్యగా చూపి అణచివేసింది. తెలంగాణ నాయకుల నోరు మూసింది.

అట్లాంటి పొరపాటు జరగకుండ ఆలోచనతో ఉద్యమాన్ని నడపాలనుకుండు కెసిఆర్. అందుకు కావలసిన జాగ్రత్తలు తీసుకుండు. జయశంకర్ వంటి పెద్దల ద్వారా తెలంగాణకు జరిగిన అన్యాయాలను తెలుసుకొని ఆకళింపు చేసుకుండు. తనదైన శైలిల వేదికలపై మాట్లాడిండు. కెసిఆర్ ఒక్కొక్క మాట ఆంధ్రా వలసపాలకుల గుండెల్ల గుచ్చుకుంది.

1998లో భారతీయ జనతాపార్టీ కాకినాడ తీర్మానం చేసింది. ఒక్క ఓటు రొండు రాష్ట్రాలు అని నినాదం ఇచ్చి గద్దెనెక్కింది. అనుకున్నట్లుగానే డిమాండు ఉన్న జార్ఖండ్, ఉత్తరాంచల్, చత్తీస్‌గడ్ రాష్ట్రాలను 2000 నవంబర్‌ల ఏర్పాటు

చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడానికి సన్నద్ధం కాగానే ఆంధ్రానాయకుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డుపడ్డడు. చంద్ర బాబు మద్దతుతో నడుస్తున్న వాజ్‌పేయి సర్కారు తెలంగాణను ఏర్పాటు చేయలేక మొఖం చాటేసింది.

కమ్యూనిస్టు పార్టీలకు ఉన్నట్టుగనే, బిజెపికి కూడా పార్టీ బలం మొత్తం తెలంగాణల ఉంటె, నాయకత్వం ఆంధ్రల ఉంది. ఆ పార్టీ ఆంధ్రా నాయకులు అదే పార్టీ తెలంగాణ నాయకుడు నరేంద్రను అణచివేసే ప్రయత్నం చేసింద్రు. నరేంద్ర తెలంగాణ గురించి మాట్లాడితే నోరునొక్కే ప్రయత్నం చేసింద్రు. ఈ పరిస్థితులల్ల నరేంద్ర బిజెపిని విడిచిపెట్టి తెలంగాణ సాధన సమితి పేరుతో పార్టీ పెట్టిండు.

అప్పటికే ఉద్యమం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర సమితి ఊపు, కెసిఆర్ నాయకత్వం ఆయనను ఆకర్షించినయ్. కలిసి పనిచేస్తే తెలంగాణ తొందరగ సాధించవొచ్చని టిఆర్ఎస్ వైపు మొగ్గిండు. తెలంగాణ పెద్దల రాయబారంతో నరేంద్ర తన తెలంగాణ సాధన సమితిని 2002 ఆగస్టు 11న టిఆర్ఎస్‌ల కలిపిండు. దీంతో టిఆర్ఎస్ బలం మరింత పెరిగింది.

తెలంగాణ వాదాన్ని ప్రజలల్లకు తీసుకుపోవడానికి టిఆర్ఎస్ పల్లెబాట, బస్తీబాట కార్యక్రమాలను 2002 సెప్టెంబర్‌ల మొదలుపెట్టింది. తెలంగాణలోని అన్ని జిల్లాలల్ల ఈ కార్యక్రమం ఉత్సాహంతో నడిచింది. ప్రజలు ఆదరించింద్రు. 2002 అక్టోబర్ 7 వరకు ఈ కార్యక్రమం నడిచింది. ఆ తర్వాత అదే సంవత్సరం నవంబర్ 25 నుంచి 2003 జనవరి 5 వరకు టిఆర్ఎస్ జలసాధన ఉద్యమం చేపట్టింది. ఊరూరా నిరాహారదీక్షలు చేసింది. నీళ్ల విషయంల తెలంగాణ మోసపోతున్న తీరును ప్రజలకు వివరించింది. దానికి కారకులైన ఆంధ్రాపాలకు లను దుమ్మెత్తిపోసింది. తాము ఇంతకాలం ఎట్ల మోసపోయింద్రో రైతులకు వివరించింది.

తెలంగాణ అన్ని జిల్లాలల్ల ఉద్యమ కార్యక్రమాలు చేపట్టిన టిఆర్ఎస్ తెలంగాణ గుండెకాయ అయిన హైదరాబాద్‌ల మహాసభ పెట్టాలని తలపెట్టింది. తెలంగాణ పది జిల్లాలల్ల విస్తృతంగా ప్రచారం చేసింది. 2003 జనవరి 6న హైదరాబాద్ నడిబొడ్డున తెలంగాణ గర్జన పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించింది. దీంతో నగరంలోని తెలంగాణ ప్రజలల్ల కూడా ఆలోచన మొదలయ్యింది. ఆంధ్రపాలనల తాము నష్టపోతున్నదేందో అర్థం చేసుకుంద్రు.

హైదరాబాద్ సభ తర్వాత తెలంగాణ గొంతును ఢిల్లీల వినిపించాలని టిఆర్ఎస్ భావించింది. కేంద్రంలోని పెద్దలకు తెలంగాణ బాధలు తెలవాలంటే డిల్లీలనే బహిరంగ సభ ఏర్పాటు చేయాలనుకుంది.

అందుకని టిఆర్ఎస్ కారు ర్యాలీ తీయాలని తలపెట్టింది. హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాంక బ్రహ్మాండమైన కారు ర్యాలీ నిర్వహించింది. 2003 మార్చి 27న కారు ర్యాలీ ఢిల్లీకి చేరింది. అదేరోజు ఢిల్లీల బహిరంగసభ ఏర్పాటు చేసింద్రు. ఆ సభకు రాంవిలాస్ పాశ్వాన్ హాజరైండు. తెలంగాణ ఉద్యమానికి మద్దతు పలికిండు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు న్యాయమైన కోరిక అన్నడు.

టిఆర్ఎస్ పార్టీ పెట్టిన రొండేండ్లల్ల గల్లీ నుంచి ఢిల్లీ దాంక తెలంగాణ వాణి వినిపించింది. ఆ ఉత్సాహంతో 2003 ఏప్రిల్ 27న వరంగల్‌ల టిఆర్ఎస్ రొండో వార్షికోత్సవ సభ జరుపుకుంది. ఈ సభకు దేవగౌడ, అజిత్‌సింగ్ హాజర య్యింద్రు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు తెలిపింద్రు. రొండు సంవత్సరాలు ఒంటరిగనే తెలంగాణ వాదాన్ని ప్రజలల్లకు తీసుకుపోయిన కెసిఆర్ ఉద్యమం బలోపేతం కావడానికి ఇతర పార్టీల మద్దతు కూడా అవసరమని భావించిండు. తెలంగాణ నాయకుల సహకారం కూడా అవసరమని అనుకున్నడు. రాజకీయ పార్టీలు, తెలంగాణ నాయకుల మద్దతు పొందడానికి ప్రయత్నం చేసిండు.

ఈ ప్రయత్నంల భాగంగ 2003 జూన్ 25న ఐక్య కార్యాచరణ గురించి చర్చించడానికి టిఆర్ఎస్ ఆధ్వర్యంల సమావేశం ఏర్పాటు చేసిండు. కలిసి వొచ్చే పార్టీలను, నాయకులను పిలిచిండు.

ఆనాటి సమావేశానికి పిసిసి అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరావు, సిపిఐ నాయకుడు సురవరం సుధాకరరెడ్డి, ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఓవైసి, తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.కేశవరావు హాజరయింద్రు. తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి కార్యా చరణ గురించి చర్చించింద్రు. ఈ సమావేశంతో తెలంగాణవాదులైన ఇతర పార్టీల నాయకులల్ల కూడా ఆలోచన మొదలైంది.

దీంతో కెసిఆర్ ప్రజల్లకు మరింత పోవాలని భావించిండు. ఈసారి ఆయన పాదయాత్ర ఎంచుకున్నడు. మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్ నుంచి గద్వాల వరకు 180 కిలో మీటర్లు పాదయాత్ర చేసిండు. 2003 జూలై 30న గద్వాలల భారీ బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత పార్టీనాయకులతో మంత నాలు జరుపుకుంటనే మరో పాదయాత్రకు తయారైండు. ఈసారి పాదయాత్రకు నల్లగొండ జిల్లాను ఎంచుకున్నడు. కోదాడ నుంచి హాలియా దాంక పాదయాత్ర చేసిండు. 2003 ఆగస్టు 25న మొదలైన పాదయాత్ర 30న హాలియా చేరింది. అదే రోజు హాలియాల భారీ బహిరంగ సభ జరిగింది. తెలంగాణతో పాటు నల్లగొండ జిల్లా ఉద్యమం వైపు మళ్లింది.

పాదయాత్ర పొడుగునా కెసిఆర్ తెలంగాణ రైతులతో మాట్లాడిండు. నీటి సమస్య గురించి అడిగిండు. వీటన్నింటికి ఆంధ్రాపాలకులే కారణం అని చెప్పిండు. బతుకులు బాగుపడాలంటే తెలంగాణ రాష్ట్రం ఒకటే మార్గం అని చెప్పిండు. పల్లెపల్లెనా తెలంగాణ ముచ్చెట మొదలయ్యింది. ప్రతి పట్టణంల తెలంగాణ చర్చ మొదలయింది.

రాష్ట్రంలనే కాదు జాతీయస్థాయిల ఉద్యమనేతలతో జట్టు కట్టాలను కుండు కెసిఆర్. ప్రత్యేక రాష్ట్రాలను కోరే ఇతర రాష్ట్రాల నేతలతో కలిసి ఉద్యమిం చడం ద్వారా కేంద్రంపై ఒత్తిడి పెంచాలనుకుండు. అప్పుడే తెలంగాణ రాష్ట్రం సాకారమయి తదని భావించిండు. 2003 సెప్టెంబర్ 9న ఢిల్లీలోని మోలంకర్ హోటల్‌ల ప్రత్యేక రాష్ట్ర ఉద్యమనేతలతో బహిరంగసభ ఏర్పాటు చేసిండు. కొత్త రాష్ట్రాలను డిమాండు చేస్తున్న నాయకులతో మాట్లాడిండు. ఆ సభకు అజిత్‌సింగ్, శిబుసోరేన్, భన్వర్‌లాల్ వంటి ఉద్యమనాయకులు హాజరయ్యిండ్రు. ఆనాటి సమావేశంల కొత్త రాష్ట్రాల జాతీయ కన్వీనర్‌గ కెసిఆర్ ఎన్నికయ్యిండు. దీంతో కెసీఆర్‌పై జాతీయ నాయకుల దృష్టి పడ్డది. తెలంగాణ ఉద్యమం మీద జాతీయ మీడియా దృష్టి పడ్డది.

అదే ఊపుతో వొచ్చిన కెసిఆర్ ఉస్మానియా యూనిర్సిటీల బహిరంగ సభకు పూనుకున్నడు. విద్యార్థులకు తెలంగాణపై అవగాహన పెంచాలంటె తెలంగాణ గుండెకాయ వంటి ఉస్మానియా యూనివర్సిటీనే వేదిక అని భావించిండు. 2003 సెప్టెంబర్ 17న ఆర్ట్స్ కాలేజి భవనం ముందు భారీ బహిరంగసభ జరిగింది. తెలంగాణ పది జిల్లాల నుంచి ప్రజలు, విద్యార్థులు సభకు హాజరయ్యిండ్రు. సభల తెలంగాణ నినాదం మారుమోగింది.

సుమారు రొండున్నర సంవత్సరాల కెసిఆర్ కష్టం ఒక రూపానికొచ్చింది. గల్లీ నుంచి ఢిల్లీ దాంక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష పాకింది. రైతుల నుంచి విద్యార్థుల దాంక జై తెలంగాణ అనడం మొదలుపెట్టిండ్రు. ఉద్యమ పార్టీగా టిఆర్ఎస్ నిలదొక్కుకుంది. కెసిఆర్ తెలంగాణ ఉద్యమనాయకునిగా ప్రజల మనసులల్లకు పోయిండు. తెలంగాణవాదం మరింత బలపడ్డది. ఊరు వాడ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నడుం బిగించింది.

# కాంగ్రెస్‌ను నమ్మిన టిఆర్ఎస్

ఎన్‌టిరామారావు నాయకత్వంల 2004ల తెలుగుదేశం పార్టీ అధికారంలకు వొచ్చిన విషయం తెలిసిందే. రామారావు ముఖ్యమంత్రి అయిన ఎనిమిది నెల్లకే ఆయనకు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు గద్దెనెక్కిన విషయం ఎరిగిందే. ఆ తర్వాత చంద్రబాబు నాయకత్వంల ఎన్నికలకు పోయిన తెలుగుదేశం మళ్లా అధికారం చేపట్టింది. చంద్రబాబుకు రొండోసారి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం దొరికింది. అయితే సుమారు తొమ్మిదేండ్ల చంద్రబాబు పాలన ప్రజలను దూరం చేసుకుంది. కరెంటు రైతులను కాల్చిచంపిండు. అంగన్‌వాడీ వర్కర్లను గుర్రాలతో తొక్కించిండు. రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు కూడ ఈయన పాలనల విపరీతంగ జరిగినయ్. చివరికి వ్యవసాయం దండగ అని ప్రచారం చేసిండు. దీంతో చంద్రబాబు పరువు బజారుల పడ్డది.

ఈ విషయం చంద్రబాబు తెలుసుకున్నడు. వాస్తవానికి 2004 సెప్టెంబర్‌ల శాసనసభ ఎన్నికలు జరగాలె. కాని అప్పటి వరకు ఆగితే తను ప్రజలకు మరింత దూరం కావాల్సి వొస్తదని భావించిండు. అందుకని ప్రభుత్వాన్ని రద్దుచేసి ముందుగానే ఎన్నికలకు పోవాలనే ఆలోచన చేసిండు.

అట్లాంటి సమయంల 2003 అక్టోబర్ 1న తిరుపతి సమీపంలోని అలిపిరి వద్ద చంద్రబాబుపై నక్సలైట్లు దాడిచేసింద్రు. ఈ దాడిల ఆయనకు దెబ్బలు తగిలినయ్. ఇట్లాంటి సంఘటనలు జరిగినపుడు జనం సహజంగనే అయ్యో అంటరు. అప్పుడు కూడా అదే జరిగింది. ఈ సానుభూతిని గమనించిన చంద్రబాబు దానిని రాజకీయంగా వాడుకోవాలని అనుకుండు. గడువు కంటె ముందుగ ఎన్నికలకు పోవడం వల్ల ఈ సానుభూతి ఓట్ల రూపంగా మారి అధికారం అంటగడుతుందని భావించిండు.

అనుకున్నదే తడవుగ 2003 నవంబర్ 14న మంత్రివర్గ సమావేశం పెట్టిండు. నక్సలైట్ల చర్యలపై చర్చించిండు. నక్సలైట్ల హింసాత్మక చర్యలపై ప్రజాతీర్పును కోరుతున్నట్లు ఓ మాట చెప్పి అదేరోజు తన రాజీనామాను గవర్నర్‌కు అందించిండు.

నిత్య అసమ్మతి నాయకునిగా, ఫ్యాక్షన్ లీడరుగా పేరుపడ్డ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అప్పటికే పాదయాత్ర చేస్తుండు. చంద్రబాబు మీద అసంతృప్తితో వైఎస్‌కు జనం బ్రహ్మరథం పట్టింద్రు. రొండు దఫాలు అధికారానికి దూరం కావడంతో కాంగ్రెస్ కూడ అసహనంగ ఉంది. ఈసారి ఎట్లయినా అధికారం దక్కించుకోవాలన్న పంతంతో ఉంది.

చంద్రబాబు 610 జిఓ అమలు, గిర్‌గ్లాని కమిటీ వంటి తెలంగాణ అంశాలను దాటవేస్తుండటంతో సహజంగనే చంద్రబాబు పార్టీపై టిఆర్ఎస్ కోపం పెంచుకుంది. టిడిపి నుంచి కూడ కొందరు నాయకులు టిఆర్ఎస్‌ల చేరింద్రు. టిఆర్ఎస్ ఉద్యమం వల్ల ఈ ఎన్నికలల్ల తెలంగాణ మీద మాట్లాడకపోతే నెట్టుకు రాలేమని కాంగ్రెస్ భావించింది. ఒక అడుగు ముందుకేసి తెలంగాణ రీజినల్ కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ విషయాన్ని ముందుకు తెచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని పిసిసి అధ్యక్షుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉపాయం చేసిండు. దాంట్లె భాగంగా 41 మంది తెలంగాణ ఎమ్మెల్యేలు సోనియాగాంధీకి లేఖ ఇయ్యడానికి సిద్ధమైతే ప్రోత్సహించిండు.

తాము తెలంగాణకు అనుకూలమే అని చెప్పడానికి కాంగ్రెస్ దీన్ని వాడుకుంది. దీని ద్వారా టిఆర్ఎస్‌తో ఎన్నికల పొత్తు పెట్టుకోవాలనుకుంది. కెసిఆర్ కూడ తెలంగాణ వ్యతిరేకి చంద్రబాబును ముందు కుర్చీ నుంచి దించాలనుకుండు. తర్వాత కాంగ్రెస్ ద్వారా తెలంగాణ సాధించాలనుకుండు.

కాంగ్రెస్ టిఆర్ఎస్ ఎన్నికల పొత్తు కుదిరింది. సీట్ల సర్దుబాటు అయ్యింది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికల తెలంగాణ అంశాన్ని చేర్చింది. తెలంగాణ ప్రాంతంల టిఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి ప్రచారం చేసినయ్. కాంగ్రెస్ కూటమిని గెలిపిస్తే తెలంగాణ కల నెరవేరుతుందని ప్రజలు నమ్మింద్రు. ఎన్నికల ప్రచారంల భాగంగ 2004 మార్చి 7న సోనియాగాంధీ కరీంనగర్ బహిరంగ సభకు హాజరయింది. ఆనాటి సభల ఆమె టిఆర్ఎస్ గులాబీ కండువా వేసుకొని మాట్లాడింది.

'తెలంగాణ ప్రజల మనసులల్ల ఏముందో నాకు తెలుసు. ఇక్కడ జరగాల్సినంత అభివృద్ధి జరగలేదని నాకు తెలుసు. ఉపాధి రంగంల దక్కవలసిన అవకాశాలు తెలంగాణకు దక్కకుండా పోయినయ్. మీ కోరికను నేను గౌరవిస్త. రాష్ట్రంల, కేంద్రంల మా ప్రభుత్వాలు ఏర్పడితే మీ ఆకాంక్షను నెరవేర్చడానికి అన్ని విధాలా ప్రయత్నం చేస్త' అని అన్నది. సోనియా మాటలను ఆంధ్రా కాంగ్రెస్ నాయకుడు ఉండవల్లి అరుణ్‌కుమార్ మసాలా దట్టించి మరీ తెలుగుల చెప్పిండు.

ఈ ఎన్నికలల్ల చంద్రబాబు బొక్కబోర్ల పడ్డడు. కాంగ్రెస్ టిఆర్ఎస్ కూటమి ఘనవిజయం సాధించింది. టిఆర్ఎస్ 26 శాసనసభా స్థానాలతో పాటు ఐదు పార్ల మెంటు స్థానాలను గెలుచుకుంది. తెలంగాణలోని ఖమ్మం జిల్లాల తప్ప మిగిలిన తొమ్మిది జిల్లాలల్ల ఉద్యమ పార్టీ జెండా రెపరెపలాడింది. కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి కెసిఆర్, ఆదిలాబాదు నుంచి టి. మధు సూదన్‌రెడ్డి, మెదక్ నుంచి ఎ. నరేంద్ర, వరంగల్ నుంచి డి. రవీంద్రనాయక్, హనుమకొండ నుంచి బి.వినోద్ కుమార్ గెలిచిండ్రు.

వరంగల్ జిల్లాల టిఆర్ఎస్ ఆరు అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంది. ఈ జిల్లాల చేర్యాల అసెంబ్లీ నియోజక వర్గం నుంచి కె. ప్రతాపరెడ్డి, చెన్నూరు నుంచి దుగ్యాల శ్రీనివాసరావు, నర్సంపేట నుంచి కె. లక్ష్మారెడ్డి, హన్మకొండ నుంచి ఎం. సత్యనారాయణరెడ్డి, ఘనపూర్ నుంచి జి. విజయరామారావు, పరకాల నుంచి బండారు శారారాణి గెలిచిండ్రు.

కరీంనగర్ జిల్లాల ఐదు స్థానాలను టిఆర్ఎస్ దక్కించుకుంది. ఈ జిల్లాలోని హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి వి.లక్ష్మీకాంతారావు, కమలాపూర్ నుంచి ఈటెల రాజేందర్, పెద్దపల్లి నుంచి ముకుందరెడ్డి, మేడారం నుంచి కొప్పుల ఈశ్వర్, నేరెళ్ల నుంచి కాశిపేట లింగయ్య గెలిచిండ్రు.

మెదక్ జిల్లాల టిఆర్ఎస్ నాలుగు స్థానాలు గెలుచుకుంది. దొమ్మాట నియో జక వర్గం నుంచి సోలిపేట రామలింగారెడ్డి, సిద్ధిపేట నుంచి హరీశ్‌రావు, సంగారెడ్డి నుంచి తూర్పు జయప్రకాశ్‌రెడ్డి, రామాయంపేట నుంచి పద్మా దేవేందర్‌రెడ్డి గెలిచిండ్రు.

ఆదిలాబాదు జిల్లాలోని ఖానాపూర్ నియోజక వర్గం నుంచి గోవింద నాయక్, బోథ్ నుంచి బాబూరావు, ముథోల్ నుంచి నారాయణరావు పటేల్ మొత్తం ముగ్గురు గెలిచిండ్రు. నిజామాబాదు జిల్లా ఆర్మూర్ నియోజక వర్గం నుంచి శనిగరం సంతోష్‌రెడ్డి, ఎల్లారెడ్డి నుంచి రవీందర్‌రెడ్డి, డిచ్‌పెల్లి నుంచి గడ్డం గంగారెడ్డి గెలిచిండ్రు.

హైదరాబాదు జిల్లా ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి నాయిని నరసింహా రెడ్డి, సికిందరాబాద్ నుంచి టి. పద్మారావు గెలిచిండ్రు. నల్లగొండ జిల్లా ఆలేరు నియోజక వర్గం నుంచి కె. నగేశ్, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం నుంచి పి.లక్ష్మారెడ్డి, రంగారెడ్డి జిల్లా వికారాబాద్ నియోజకవర్గం నుంచి ఎ.చంద్రశేఖర్ శాసనసభ్యులుగా గెలిచిండ్రు.

ఎన్నికల ఫలితాలు వొచ్చినంక కాంగ్రెస్ భాగస్వామ్య పక్షాలు యునైటెడ్

అలయన్స్ (యుపిఎ)గా ఏర్పడ్డయ్. అందరికి ఆమోదయోగ్యమైన ఉమ్మడి ప్రణాళికను కామన్ మినిమం ప్రోగ్రాం) ఏర్పాటు చేసుకున్నయ్. అప్పుడు కామన్ మినిమం ప్రోగ్రాంల టిఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును ప్రతిపాదించింది.

'అవసరమగు సంప్రదింపుల ద్వారా విస్తృత అంగీకారాన్ని కుదిర్చి, సరియైన సమయంల యుపిఎ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని చేపడుతుంది' అని కనీస ఉమ్మడి ప్రణాళికల చేర్చింద్రు. యుపిఎ భాగస్వామ్య పక్షాలతో పాటు బయటి నుంచి మద్దతిచ్చిన నాలుగు వామపక్ష పార్టీలు కూడా దీనికి అంగీకరించినయ్. ఆ పార్టీలల్ల సిపిఎం కూడా ఉంది.

కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. కేంద్రంల మన్మోహన్ సింగ్ ప్రధానిగా కొలువుతీరిండు. రాష్ట్రంల 2004 మే 13న రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా ప్రభుత్వం ఏర్పడ్డది.

2004 జూన్ 7నాటి రాష్ట్రపతి ప్రసంగంల కేంద్రం తెలంగాణ అంశాన్ని చేర్చింది. రాష్ట్రపతి అబ్దుల్ కలాం పార్లమెంటు సాక్షిగ మాట్లాడుకుంట కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల కోరికను నెరవేర్చుతుందని చెప్పిండు.


రాష్ట్రంల, కేంద్రంల అధికారంల ఉన్నది కాంగ్రెసే కాబట్టి, ఎన్నికల నాటి ఒప్పందాన్ని గౌరవించి ఆ పార్టీ తెలంగాణ ఇస్తుందని ప్రజలు నమ్మింద్రు. అయితే రాజకీయ పండితులు మాత్రం ఆ నమ్మకాన్ని ప్రకటించలేదు. ముఖ్యంగ కాంగ్రెస్ రాజకీయాలు తెలిసిన పెద్దలు అస్సలు నమ్మలేదు. కెసిఆర్ కూడ పూర్తిగ కాంగ్రెస్‌ను నమ్మిండని ఎవరూ భావించలేదు.

అట్లాంటి సమయాన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలల్ల చేరాలని కాంగ్రెస్ టిఆర్ఎస్ ను పిలిచింది. వాస్తవానికి ఈ రెండు ప్రభుత్వాలల్ల కాంగ్రెస్‌కు కావలసినంత మెజారిటీ ఉంది. కాని ఎన్నికలల్ల కలిసి పోటీ చేసిన పార్టీగ టిఆర్ఎస్‌ను కూడ ప్రభుత్వంల చేర్చుకోవాలని కాంగ్రెస్ భావించింది.

తెలంగాణ ఇస్తనని మాట ఇచ్చిన పార్టీ కాబట్టి కాంగ్రెస్‌ను గౌరవిం చాలని అనుకుండు కెసిఆర్. దీంతో ఆ పార్టీ ఆహ్వానాన్ని అంగీకరించిండు. కేంద్ర మంత్రి వర్గంల టీఆర్ఎస్ చేరింది. కెసిఆర్‌కు కేంద్ర కేబినెట్ మంత్రి పదవి, మరో ఎం.పి నరేంద్రకు సహాయమంత్రి పదవులు దక్కినయ్. 2004 జూన్ 23న రాష్ట్ర మంత్రి వర్గంల టిఆర్ఎస్ చేరింది. టిఆర్ఎస్‌కు ఆరు కేబినెట్ మంత్రిపదవులు ఇచ్చింది కాంగ్రెస్. సంతోష్‌రెడ్డి, విజయరామారావు, ఎ.చంద్రశేఖర్, నాయిని నర్సింహారెడ్డి, వి. లక్ష్మీకాంతరావు, తన్నీరు హరీశ్‌రావులకు మంత్రి పదవులు దక్కినయ్.

సాధారణ ఎన్నికలల్ల కెసిఆర్ సిద్ధిపేట శాసనసభా స్థానానికి, కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిండు. రొండు చోట్ల గెలిచిండు. ఆ తర్వాత సిద్ధిపేట శాసనసభ స్థానానికి రాజీనామా చేసిండు. అట్ల ఏర్పడ్డ ఖాళీల వెంటనే ఉపఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల హరీశ్‌రావు పోటీ చేసి మొదటిసారి ఎమ్మెల్యే అయిండు. ఆయన ఎమ్మెల్యే అయ్యేనాటికే మంత్రిపదవిల ఉన్నడు.

కాంగ్రెస్ ప్రభుత్వాలల్ల టిఆర్ఎస్ చేరుతున్నప్పుడే 'మాకు పదవులు ముఖ్యం కాదు. తెలంగాణ రాష్ట్ర సాధనే ముఖ్యం' అని కెసిఆర్ ప్రకటించిండు.



తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌తో తెలంగాణ జాతిపిత కెసిఆర్

# తెలంగాణకు 36 పార్టీల మద్దతు

ప్రధాని మన్మోహన్‌సింగ్ కెసిఆర్‌కు ఓడరేవుల శాఖను కేటాయిం చిండు. యుపిఎ భాగస్వామ్య పార్టీ డిఎంకె కూడ మంత్రివర్గంల చేరింది. ఈ పార్టీ నాయకుడు కరుణానిధి ఓడరేవుల శాఖ కావాలని పట్టుబట్టిండు. కాని అది అప్పటికే కెసిఆర్‌కు కేటాయించిండ్రు. దీంతో ప్రధాని మన్మోహన్‌సింగ్, యుపిఎ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఇరకాటంల పడ్డరు.

ఇది తెలుసుకున్న కెసిఆర్ స్వచ్ఛందంగ కాంగ్రెస్ పెద్దలకు చెప్పిండు. తనకు తెలంగాణ ముఖ్యంగాని మంత్రిపదవి కాదన్నడు. యుపిఎ ప్రభుత్వం ఏ ఆటంకాలు లేకుండ నాలుగు రోజులు నడవాలని కోరుకుంటున్న. తెలంగాణ సాధించుకోవాలని కోరుకుంటున్న. అందుకని ఓడరేవులశాఖను డిఎంకెకు ఇయ్యండి. నాకు ఏ శాఖ లేకున్నా ఫరవాలేదని చెప్పిండు. అప్పుడున్న పరిస్థితిల అది మన్మోహన్ సర్కారుకు పెద్ద ఊరట. వెంటనే ఆ శాఖను డిఎంకెకు ఇచ్చి తలనొప్పి తగ్గించుకుంది కేంద్రం. రెండు రోజులకే కెసిఆర్ పోర్టుపోలియో లేని మంత్రి అయ్యిండు. ఈ నిర్ణయం వల్ల తనకు తెలంగాణే ముఖ్యమని మరోసారి చాటిచెప్పిండు కెసిఆర్.

ఇదే సమయంల రాజ్యసభ ఎన్నికలు వొచ్చినయ్. తెలంగాణల 26 మంది శాసనసభ్యులున్న టిఆర్ఎస్ అతిపెద్ద పార్టీ. న్యాయానికి రాజ్యసభ సీటు టిఆర్ఎస్‌కు దక్కాలె. కాని తొమ్మిది స్థానాలున్న సిపిఎం పట్టుబట్టింది. అప్పుడు కూడా టిఆర్ఎస్ త్యాగం చేసింది. పదవుల కంటే తెలంగాణ ముఖ్యమని చెప్పిండు కెసిఆర్. ఆ తర్వాత రాజ్యసభ సీటును సిపిఎం తీసుకుంది. దీంతో కేంద్రం తలనొప్పి పోయింది.

ప్రభుత్వం కుదుట పడ్డది. కాని తెలంగాణ విషయాన్ని కాంగ్రెస్ దాట వేస్తనే ఉంది. ఏడు నెలలు గడిచింది. కెసిఆర్ పోర్టు పోలియో లేని మంత్రిగానే కొన సాగిండు. అయితే ప్రతిపక్షాల నుంచి విమర్శలు రావడంతో కెసిఆర్‌కు కార్మిక, ఉపాధి శాఖను కేటాయించిండు ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలని కెసిఆర్ కేంద్రం మీద వొత్తిడి పెంచడం మొదలు పెట్టిండు. సంప్రదింపుల ద్వారా విస్తృత అంగీ కారం తీసుకోవాలనుకున్నం కదా అని కేంద్ర ప్రభుత్వం 2005 మార్చిల ఇక ఉప సంఘాన్ని నియమించింది. దానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రణబ్ ముఖర్జీ అధ్యక్షుడు. ఆర్‌జెడి సీనియర్ నాయకుడు రఘువంశప్రసాద్ సింగ్, డిఎంకె నాయకుడు దయానిధిమారన్ సభ్యులు. ఈ ముగ్గురు కూడా కేంద్ర మంత్రులే. ఈ కమిటీ తన నివేదికను ఎనిమిది వారాలల్ల ఇస్తుందని కేంద్రం తెలిపింది. అన్ని పార్టీల అభిప్రా యాలను తెలుసుకోవడం ఈ కమిటీ పని. ఈ కమిటీ అన్ని పార్టీలకు తెలంగాణపై అభిప్రాయం చెప్పాలని ఉత్తరాలు రాసింది.

కెసిఆర్ అన్ని పార్టీల నాయకులను కలసి తెలంగాణకు మద్దతు కోరిండు. కేసిఆర్ వల్ల 36 పార్టీలు తెలంగాణకు మద్దతు తెలుపుకుంట ప్రణబ్ ముఖర్జీ కమిటీకి లేఖలు ఇచ్చినయ్. రాష్ట్రీయ జనతా దళ్ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్‌యాదవ్, పత్తాలి మక్కల్ కచ్చి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. రామదాస్, జార్ఖండ్ ముక్తీ మోర్చా అధ్యక్షుడు శిబుసోరెన్, లోక్ జనశక్తి పార్టీ జాతీయ అధ్యక్షడు రామ్‌విలాస్ పాశ్వాన్, మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం జనరల్ సెక్రెటరీ వైకో, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రామ్‌దాస్ అత్తవాలె, జమ్మూ కశ్మీర్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు మహబూబ ముఫ్తి, జనతా దళ్ అధ్యక్షుడు దేవెగౌడ, రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు అజిత్‌సింగ్, బిఎస్‌పి జాతీయ అధ్యక్షురాలు మాయావతి, భారతీయ జనతాపార్టీ, జనతా దళ్ (యునైటెడ్) అధ్యక్షుడు జార్జి ఫెర్నాండెజ్, శిరోమణి అకాలిదళ్ అధ్యక్షుడు ప్రకాశ్ సింగ్ బాదల్, ఇండియన్ ఫెడరల్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు పిసి థామస్, మిజో నేనల్ ఫ్రంట్ అధ్యక్షుడు వన్‌లాల్ జామా, నేషన్ లోక్ తంత్రిక్ పార్టీ అధ్యక్షుడు బాలేశ్వర్ యాదవ్, కేరళ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ ఫ్రాన్సిస్ జార్జ్... మొత్తం ముప్పయ్ ఆరు పార్టీలు తెలంగాణకు అనుకూలంగా ఉత్తరాలు ఇచ్చినయ్.

వీరే కాకుండ మాజీ ప్రధానమంత్రులు విపి సింగ్, ఐకె గుజ్రాల్ కూడా తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా ఉత్తరాలు ఇచ్చింద్రు. ఈ మద్దతు కూడ గట్టడా నికి కెసిఆర్‌కు రొండు ఏండ్లు పట్టింది.

అయితే ఆంధ్రప్రదేశ్‌ల ప్రతిపక్షపార్టీ అయిన తెలుగుదేశం మాత్రం ఉత్తరం ఇయ్యలేదు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఆ పార్టీ అధినేత చంద్రబాబు లేఖ ఇవ్వడానికి ఇష్టపడ లేదు. పూటకో మాట చెప్పుకుంట వాయిదా వేసుకుంట పోయిండు.

ఇంత మద్దతు కూడగట్టినంక కూడా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రారంభించకుంట నాన్చింది. కాంగ్రెస్ నాన్చుడు ధోరణితో విసిగి పోయిండు కెసిఆర్. 2006 వర్షాకాలపు సమావేశాలల్ల నిర్ణయం తీసుకోకపోతే టిఆర్ఎస్ కేంద్ర ప్రభుత్వం నుంచి తప్పుకుంటుందని 2006 మే నెలల డెడ్‌లైన్ పెట్టిండు. అయినా కేంద్రం తెలంగాణను సాగదీస్తుండడంతో ఇక లాభం లేదని భావించిండు. కెసిఆర్, నరేంద్ర 2006 ఆగస్టు 22న తమ మంత్రి పదవులకు రాజీనామాలు ఇచ్చి బయిటికొచ్చింద్రు.

రాష్ట్రంల ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి వ్యవహారశైలి కూడ మారింది. ముఖ్య మంత్రి కాకముందు నక్సలైట్లతో చర్చలకు సిద్ధమని ప్రకటించిండు. చంద్రబాబు మీది కోపంతో నక్సలైట్లు కూడ వైఎస్ వైపు కాస్త మెత్తని చూపు చూసింద్రు. అధికారం లకు వొచ్చినంక వైఎస్ ప్రభుత్వం నక్సలైట్లను చర్చలకు పిలిచింది. అనేక వ్యూహాలు, ప్రతివ్యూహాలు, నమ్మకాలు, అపనమ్మకాల మధ్య ప్రభుత్వానికి నక్సలైట్లకు మధ్య చర్చలు జరిగినయ్. అయితే అందరు భావించి నట్లుగనే ఆ చర్చలు ఫలించలేదు.

చర్చల అనంతరం వైఎస్‌లోని అధికారరాక్షసుడు బయటికి వొచ్చిండు. నక్సలైట్లను వెంటాడి కాల్చి చంపించింది వైఎస్ సర్కారు. రాక్షసంగ అణచివేత చర్యలు మొదలు పెట్టింది. దీంతో నక్సలైట్లు వెనుకకు తగ్గాల్సి వొచ్చింది.

నక్సలైట్ల తర్వాత వైఎస్‌కు శత్రువు లెక్కన కనపడ్డ అంశం తెలంగాణ. తెలంగాణ వాదాన్ని, ఉద్యమాన్ని కూడా ఆయన భరించ లేకపోయిండు. ప్రభుత్వంల టిఆర్ఎస్ ఉండటం కూడ ఆయనకు ఇబ్బందిగ ఉంది. శాసనసభల టిఆర్ఎస్ సభ్యులు తెలంగాణ సమస్యల గురించి మాట్లాడటం ఆయన తట్టుకోలేక పోయిండు. ఆంధ్రా వలసనాయకుడు చంద్రబాబు లెక్కన్నే వైఎస్ కూడ తెలంగాణ అంటే మండి పడ్డడు. తెలంగాణ గురించి మాట్లాడిన టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఆ పార్టీ మంత్రులను అవమానించిండు.

అధికారంలకు వొచ్చినంక వైఎస్‌కు అహం కూడ పెరిగింది. ఏండ్ల తరబడి ఎదురుచూసిన పదవి దక్కగానే కన్ను మిన్ను కానకుండ ప్రవర్తించిండు. దానికి తోడు ఆయనకు కాంగ్రెస్, సోనియా అండ. ఆంధ్రప్రదేశ్‌ల అధికారంలకు రావడానికి కారణం వైఎస్ అని నమ్మింది కాంగ్రెస్. ఆయన వల్లనే రాష్ట్రంల కాంగ్రెస్ ఎంపీలు గెలిచింద్రని కేంద్రంల కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటానికి అవకాశం దొరికిందని కృతజ్ఞతా భావంతో ఉంది. దీన్ని ఆసరాగా తీసుకున్న వైఎస్ పెట్రేగి పోయిండు. ఏకపక్షంగ నిర్ణయాలు తీసుకుండు. తలబిరుసుతో ప్రవర్తించిండు.

వైఎస్‌లో వొచ్చిన ఈ మార్పుతో తెలంగాణకు ఆయన వ్యతిరేకం అన్న

అభిప్రాయం కలగడం, కేంద్రప్రభుత్వం తెలంగాణ ఏర్పాటును నాన్చడం వంటి కారణాల వల్ల కెసిఆర్‌కు కాంగ్రెస్ మీద నమ్మకం పోయింది. ప్రభుత్వంల టిఆర్ఎస్ కొనసాగడం నక్సలైట్లు కూడ ఇష్టపడటం లేదని వార్తలొచ్చినయ్.

ఇదేకాకుండ టిఆర్ఎస్‌ను చీల్చడానికి వైఎస్ కుట్రలు చేసిండు. ఉద్యమ పార్టీ ఎమ్మెల్యేలకు గాలెం వేసిండు. టిఆర్ఎస్‌ను చీల్చి ఉద్యమాన్ని దెబ్బ కొట్టాలని అనుకున్నడు. వైఎస్ కుట్రల టిఆర్ఎస్‌కు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు చిక్కింద్రు.

ఈ పరిస్థితిల ముందుగా రాష్ట్రమంత్రివర్గం నుంచి తప్పుకోవాలని కెసిఆర్ భావించిండు. టిఆర్ఎస్ పార్టీకూడ అదే కోరుకుంది. పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రివర్గం నుంచి టిఆర్ఎస్ మంత్రులు ఒక ఏడాదిలనే తప్పుకున్నరు. అయితే మంత్రి పదవులకు రాజీనామా చేసింది అయిదుగురే. ఆరో మంత్రి సంతోష్‌రెడ్డి అప్పటికే వైఎస్ మాయల పడటంతో రాజీనామా చేయడానికి నిరాకరించిండు. కొద్దిరోజులకే మరో నలుగురు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వైఎస్ పంచన చేరింద్రు. టిఆర్ఎస్ మీద కెసిఆర్ మీద విమర్శలు చేసింద్రు.

శాసన సభ్యులు చెయ్యిదాటి పోతున్నరని గమనించిన టిఆర్ఎస్ అసమ్మతి ఎమ్మెల్యేల మీద క్రమశిక్షణ చర్యలకు పూనుకుంది. ముందుగా 2005 అక్టోబర్ 15న సంతోష్‌రెడ్డిని సస్పెండ్ చేసింది. అయినా ముఖ్యమంత్రి మాయలపడ్డ కొంత మంది టిఆర్ఎస్ శాసన సభ్యులు కనీస ఆలోచన లేకుండ ప్రవర్తించింద్రు. తాము చేస్తున్నది ఎవరికి ఉపయోగమో, ఉద్యమానికి ఎంతనష్టమో అన్న సోయి లేకుంట ప్రవర్తించింద్రు.

2005 డిసెంబర్‌ల శాసనమండలి ఎన్నికలు కూడ వచ్చినయ్. ఈ ఎన్నికలల్ల సొతంత్ర అభ్యర్థిగ కాంగ్రెస్ అండతో కాసాని జ్ఞానేశ్వర్ అనే ఆయన పోటీచేసిండు. పార్టీ ఆదేశాలను కూడ ధిక్కరించి తొమ్మిదిమంది టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు జ్ఞానేశ్వర్‌కు మద్దతు తెలిపింద్రు. ఈ ఎమ్మెల్యేలపై ఆరోపణలు కూడ వొచ్చినయ్. అభ్యర్థి నుంచి ఆర్థిక ప్రయోజనాలు పొంది అమ్ముడు పోయింద్రని ప్రచారమైంది.

పార్టీ ఎమ్మెల్యేలు చీలిపోవడం ఉద్యమానికి ఎదురు దెబ్బతగిలింది. టిఆర్ఎస్ మీద ప్రజలు పెట్టుకున్న నమ్మకం సడలింది. తెలంగాణవాదులల్ల నిరాశ కలిగింది. ఫ్యాక్షన్ రాజకీయ నేపథ్యం నుంచి వొచ్చిన నాయకుడు వైఎస్, టిఆర్ఎస్ చేస్తున్న తెలంగాణ ఉద్యమాన్ని మరింత అణచివేసే అవకాశముందని నిరాశావాదులు భావించింద్రు. కాని కెసిఆర్‌ను అర్థం చేసుకున్నోళ్లు, ఆయనను నమ్మిన తెలంగాణ వాదులు మాత్రం ధైర్యంగ ఉన్నరు.

టిఆర్ఎస్ కోలుకోవడానికి దాదాపు ఆరునెల్లు పట్టింది. ఈ లోపున కేంద్రంల ఉన్న కెసిఆర్ కాంగ్రెస్ పెద్దలతో తెలంగాణ గురించి మాట్లాడుతనే ఉండు. అయినా ఆశాజనకమైన ఫలితాలు రాలేదు. విసిగి వేసారి కెసిఆర్, నరేంద్ర తమ రాజీనామాలు ప్రధాన మంత్రికి ఇచ్చింద్రు. తమ లక్ష్యం తెలంగాణ అని, తెలంగాణను వాయిదావేస్తున్న కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వంల కొనసాగలేమని చెప్పింద్రు. తెల్లారి ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర నిరాహారదీక్ష చేసింద్రు.

తర్వాత హైదరాబాద్‌కు వొచ్చి పార్టీ నేతలతో కెసిఆర్ మంతనాలు జరిపిండు. తెలంగాణ ఉద్యమానికి ఆత్మస్థైర్యం ఇయ్యడానికి పూనుకున్నడు.

ఈ లోపుల కాంగ్రెస్ రాష్ట్ర నాయకుల నుంచి కెసిఆర్ మీద విమర్శలు మొదలయినయ్. రెండు ఏండ్లు మంత్రిపదవి అనుభవించి తెలంగాణ గురించి ఇప్పుడు మాట్లాడుతుండని అందం తప్పిన విమర్శలు చేసింద్రు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎం.సత్యనారాయణరావు చేసిన విమర్శలతో వాతావరణం మరింత వేడెక్కింది. కేంద్రమంత్రి పదవులకు కాదు. దమ్ముంటే కాంగ్రెస్ పొత్తుతో గెలిచిన ఎంపీ స్థానానికి కూడా రాజీనామా చేయాలె అని రెచ్చగొట్టిండు. ఆయన ఏ ఉద్దేశంతో అన్నడో కాని అది కెసిఆర్‌కు అందివొచ్చిన అవకాశమైంది. 2006 సెప్టెంబర్ 12న పార్లమెంటు సభ్యత్వానికి కూడ రాజీనామా చేసిండు కెసిఆర్.

దీంతో కాంగ్రెస్ నాయకుల నోర్లు మూతపడ్డయ్. కెసిఆర్‌పై విమర్శలు తగ్గినయ్. ఇదే అవకాశంగ కెసిఆర్ జనంలకు పోయిండు. కాంగ్రెస్ 2004 ఎన్నికలల్ల మాట ఇచ్చి తప్పిందని ప్రచారం చేసిండు. తెలంగాణ ఉద్యమాన్ని, టిఆర్ఎస్‌ను నాశనం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ కుట్రలు పన్నుతున్నడని ప్రచారం చేసిండు.

జనం కాంగ్రెస్ మీద కోపం పెంచుకుంద్రు. ఇది కాంగ్రెస్ మోసకారి తన మని నమ్మింద్రు. కెసిఆర్ మీద ఉద్యమం మీద నమ్మకం పెంచుకుంద్రు. కెసిఆర్‌కు మద్దతు తెలిపింద్రు.

ఈ లోపల ఎన్నికల నోటిఫికేషన్ వొచ్చింది. కెసిఆర్ మల్లా అదేస్థానం నుంచి పోటీచేసిండు. కెసిఆర్‌ను ఓడించటానికి ముఖ్యమంత్రి వైఎస్, ప్రతిపక్ష నాయ కుడు చంద్రబాబు కుట్రలమీద కుట్రలు చేసింద్రు. ఆంధ్రా నాయకుల కుట్రలు పటాపంచలు చేసి 2006 డిసెంబర్ 7న జరిగిన ఎన్నికలల్ల కెసిఆర్ రెండు లక్షల ఓట్ల మెజారిటీతో గెలిచిండు. ఈ విజయం టిఆర్ఎస్‌కు వెయ్యి ఏనుగుల బలం ఇచ్చింది. ఉద్యమానికి ఆత్మస్థైర్యాన్ని పెంచింది. తెలంగాణ వాదులల్ల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను రగిలించింది.

# ఉద్యమానికి ఊపునిచ్చిన కరీంనగర్

కరీంనగర్ ఉపఎన్నిక ఫలితాలతో నూతన ఉత్తేజం వొచ్చింది. ఆంధ్రా పాలకుల కుట్రలు బద్దలు కొట్టాలంటె ఎన్నికలే మార్గం అని అర్థమైంది. కెసిఆర్ కూడ మునుపటి కంటె రెట్టించిన ఉత్సాహంతో ప్రజలల్లకు పోయిండు.

ఈ ఎన్నిక తర్వాత పార్టీల చర్చ మొదలయింది. మల్లా ఎన్నికకు పోతే మరింత ఉద్యమాన్ని బలోపేతం చేయొచ్చని పార్టీ నాయకులు భావించింద్రు. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు మొత్తం మూకుమ్మడిగా రాజీనామా చేసి ఎన్నికల ల్లకు పోవాలని నిర్ణయమైంది.

అయితే అప్పటికే కెసిఆర్‌కు టిఆర్ఎస్‌కు నరేంద్ర దూరమైండు. ఆయనకు మంత్రి పదవులకు రాజీనామా చేయడం ఇష్టం లేదు. కెసిఆర్ ఒత్తిడివల్ల మంత్రి పదవికి రాజీనామా చేసిండు. మల్లా ఎంపీ పదవికి రాజీనామా చేస్తే గెలుస్తమో లేదోనన్న భయం ఉంది. అంతేకాకుండా పార్టీల ఆయనకు తగిన గౌరవం దక్కడం లేదన్న అసంతృప్తి ఉంది. పార్టీకి దూరంగా కొంతకాలం అంటీ ముట్టనట్లు ఉండు. ఆ తర్వాత టిఆర్ఎస్‌ను, కెసిఆర్‌ను బహిరంగంగ విమర్శించిండు. ఇది టిఆర్ఎస్‌కు ఇబ్బంది కలిగించింది. ఈ సమయంలనే నరేంద్ర మీద మనుషులను అక్రమంగ రవాణా చేస్తుండనే ఆరోపణలు వొచ్చినయ్. ఇట్లాంటి ఆరోపణలు ఉద్యమానికి మంచిది కావని టిఆర్ఎస్ భావించింది. 2007 ఏప్రిల్ 25న నరేంద్రను పార్టీ బహిష్కరించింది.

కెసిఆర్ మీద కోపం పెంచుకున్న నరేంద్ర ఆ తర్వాత ఉద్యమానికి, టిఆర్ ఎస్‌కు ఇబ్బంది కలిగించే వ్యాఖ్యలు చేసిండు. తెలంగాణ వ్యతిరేకులకు ఉపయోగపడే చర్యలకు దిగిండు. అయినా పార్టీ పట్టించుకోలేదు.

ఇట్లాంటి ఇబ్బందులను తొలగించుకోవడానికి టిఆర్ఎస్ ప్రజలల్లకు పోయింది. తెలంగాణలోని పల్లెపల్లెకు ఉద్యమ వ్యాప్తి చేయడానికి ప్రయత్నం చేసింది.

ఉద్యమ పార్టీని నడిపిన ఏడేండ్ల అనుభవం కేసిఆర్‌ను మరింత రాటు దేలేటట్లు చేసింది.

కెసిఆర్ ఉపన్యాసాలు మునుపటి కంటె పదునుదేరినయ్. అధికారపక్షం, ప్రతిపక్షం అనకుంట ఆంధ్రానాయకుల గుండెలకు తాకినయ్. తెలంగాణకు అడ్డు పడుతున్న తెలంగాణ నాయకులకు చెంపదెబ్బలయినయ్. ఆయన మాటలల్ల వాడి వేడి ప్రజలను ఆకర్షించినయ్. కెసిఆర్ తెలంగాణ యాసకు, భాషకు ప్రజలు జేజేలు పలికింద్రు.

కొద్దిరోజులుగా పార్టీల చర్చలు జరిగినట్లుగానే టిఆర్ఎస్ ప్రజా ప్రతినిధు లంతా రాజీనామాలు చేసి ఎన్నికలకు పోవాలనుకుంద్రు. అనుకున్నట్టుగానే 2008 మార్చి 3న నలుగురు ఎంపీలు కెసిఆర్, టి.మధుసూదనరెడ్డి, బి.వినోద్ కుమార్, డి.రవీంద్రనాయక్ రాజీనామా చేసింద్రు. తెల్లారి 16 మంది టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముగ్గురు శాసనమండలి సభ్యులు పదవులకు రాజీనామా చేసింద్రు. 2004ల గెలిచిన 26 మంది శాసనసభ్యులల్ల పదిమంది వైఎస్ కుట్రల వల్ల టిఆర్ఎస్‌కు దూరమైంద్రు. దుగ్యాల శ్రీనివాసరావు, మందాడి సత్యనారాయణరెడ్డి, బండారు శారారాణి, కె. లక్ష్మారెడ్డి, నారాయణరావు పటేల్, ముకుందరెడ్డి, జగ్గారెడ్డి, సంతోష్‌రెడ్డి, బాబూరావు, కాశిపేట లింగయ్య పార్టీ మీద తిరుగుబాటు చేసింద్రు. తెలంగాణ ద్రోహానికి ఒడి గట్టింద్రు.

ఈ ఎన్నిక టిఆర్ఎస్‌కు చావుబతుకుల సమస్యే అయింది. నిజానికి కెసిఆర్ తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ధైర్యంతో కూడుకున్నది. ప్రజలు మద్దతిస్తరు. గెలుస్తం. ఆ నమ్మకం నాకుంది అని కెసిఆర్ మొండి ధైర్యం చేసిండు.

ప్రజలల్లకు పోయి విస్తృతంగ ప్రచారం చేసిండు. తమను గెలిపిస్తే తెలంగాణ సాధించగలమని చెప్పిండు. కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజలను తికమకపెట్టే ప్రయత్నాలు చేసిండు. కాంగ్రెస్ మాత్రమే తెలంగాణ ఇస్తదని, టిఆర్ఎస్‌ను గెలిపించినా తెలంగాణ రాదని ప్రచారం చేసిండు. దీనికి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తోడైంద్రు. పదవులకోసం, రాజకీయ భవి ష్యత్తు కోసం వైఎస్ తోకపట్టుకొని తిరిగింద్రు. ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడ వైఎస్ ఎదురుంగ తెలంగాణ గురించి మాట్లాడలేక పోయిండు. కాని, టిఆర్ఎస్‌ను, కెసిఆర్‌ను విమర్శించడానికి, ఇబ్బంది పెట్టడానికి మాత్రం పోటీలు పడ్డరు.

మరోవైపు చంద్రబాబునాయుడు కుట్రలకు తెగబడ్డడు. టిఆర్ఎస్ పుంజు కుంటె మొదట దెబ్బ తగిలేది టిడిపికే అని ఆయనకు తెలుసు. తెలంగాణ వాదం

బలపడితే తన పార్టీ భవిష్యత్తు చీకటి పాలేనని గ్రహించిండు. అందుకని ఆయన టిడిపి తెలంగాణ నాయకులను ఎగదోసిండు. ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు టిడిపి. ఇద్దరు ఆంధ్రనాయకుల ఆధిపత్యంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల లక్ష్యం ఒకటే. అది టిఆర్ఎస్‌ను దెబ్బకొట్టడం. తెలంగాణ ఉద్యమాన్ని బొంద పెట్టడం.

ఇది తెలిసినా ఆ పార్టీలల్ల ఉన్న తెలంగాణ నాయకులు అదే పార్టీలను పట్టుకొని వేలాడింద్రు. ఆ నాయకులు చెప్పినట్టుగనే తోకాడించుకుంట తిరిగింద్రు.

ఎన్నికలు దగ్గరపడటంతో కాంగ్రెస్, టిడిపిలు లోపాయికారిగా అవగా హన కొచ్చినయ్. ఈ సీట్లలో చంద్రబాబు గెలిచినా అధికారంలోకి వొచ్చేది లేదు. రాజశేఖరరెడ్డి ఓడినా అధికారం పొయ్యేది లేదు. అందుకని గెలిచినా ఓడినా లాభపడేది అయినా నష్టపోయేది అయినా టిఆర్ఎస్‌నే. అందుకని ఆంధ్ర నాయకులు కూడబలుక్కున్నట్లు ఎన్నికలకు దిగింద్రు. తమలో ఎవరు గెలిచినా ఫరవాలేదు కాని టిఆర్ఎస్ మాత్రం గెలువొద్దు అన్న కుట్రలు పన్నింద్రు. విపరీతంగా పైసలు వెదజల్లింద్రు. ముఖమంత్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని టిఆర్ఎస్‌ను దెబ్బతీయడానికి సిద్ధమైండు. ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్యన 2008 మే 29న ఉప ఎన్నికలు జరిగినయ్. రెండు రోజుల తర్వాత జూన్ 1న ఫలితాలు వొచ్చినయ్.

ఈ ఎన్నికలల్ల టిఆర్ఎస్ రెండు ఎం.పి స్థానాలను గెలుచుకుంది. కరీంనగర్ నుంచి కెసిఆర్, హనుమకొండ నుంచి బి.వినోద్‌కుమార్ గెలిచిండు. మరో ఇద్దరు అభ్యర్థులు టి.మధుసూదన్‌రెడ్డి, డి. రవీందర్‌నాయక్ ఓడిపోయింద్రు.

16 శాసనసభ స్థానాలల్ల టిఆర్ఎస్ ఏడు స్థానాలు మాత్రమే గెలుచుకుంది. ఈటెల రాజేందర్, హరీశ్‌రావు, కె. ప్రతాపరెడ్డి, నగేశ్, సోలిపేట రామలింగారెడ్డి, వి.లక్ష్మీకాంతారావు, కొప్పుల ఈశ్వర్ గెలిచింద్రు. ఈ ఫలితాలు టిఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టినయ్. ఆంధ్రా పార్టీల కుట్రలు, అధికార దుర్వినియోగం వల్ల టిఆర్ఎస్ ఒక అడుగు వెనక్కు వేయాల్సివచ్చింది. అయినా టిఆర్ఎస్ గెలుపు మామూలు విషయం కాదు. ఈ ఎన్నికల ఫలితాలు ప్రజలల్ల ఆలోచన కలిగించినయ్. కాని అధికార ప్రతిపక్షాలకు మాత్రం సంతృప్తి నియ్యలేదు. ఓట్ల రూపంల తెలంగాణవాదం బలాన్ని చూసి ఆంధ్రా నాయకులు ఉలిక్కిపడ్డరు.

# ఎన్నికల పొత్తులు ఎత్తులు

నాలుగేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖరరెడ్డి తెలంగాణను పీల్చిపిప్పి చేసిండు. హైదరాబాద్ భూములను ఆంధ్రా వ్యాపారులకు పారిశ్రామికవేత్తలకు అడ్డ గోలుగా కట్టబెట్టిండు. ప్రజాకర్షక పథకాలతో జనం దృష్టిని మళ్లించి తన వాళ్లకు తెలంగాణను దోచిపెట్టిండు. ఈ వ్యవహారంల అవినీతి జరిగిందని పత్రికలు గగ్గోలు పెట్టినయ్. అదే సమయంల వైఎస్ ఆస్తులు ఇబ్బడిముబ్బడిగా పెరగడం కూడా ప్రజలు గమనించిండ్రు.

ముఖ్యమంత్రి కావడానికి ముందు ఆర్థిక ఇబ్బందుల్ల ఉండి బంజా రాహిల్స్ లోని ఇంటిని కూడా అమ్ముకోవడానికి వైఎస్ తయారైండని ఆనాడు వార్తలొచ్చినయ్. అట్లాంటి స్థితి నుంచి అధికారంలకు వొచ్చిన నాలుగేండ్లల్ల కుటుంబానికి దినపత్రిక, ఛానల్, సిమెంట్, స్టీల్‌ఫ్యాక్టరీలు సమకూరడం ప్రజల దృష్టిని తప్పించుకోలేదు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని లూటీ చేస్తుండని ప్రచారమైంది.

నాలుగేండ్లు జేబు నింపుకోవడానికి, తెలంగాణ ఉద్యమాన్ని అణచి వేయ డానికి ప్రయత్నం చేసిన వైఎస్ ఎన్నికలు ఏడాదిలోపే ఉండటంతో తన ఎత్తుగడ మార్చుకుండు. తెలంగాణ ప్రజలను మరోసారి నమ్మించే ప్రయత్నం చేసిండు. 2008ల రోషయ్య కమిటీ అని వేసిండు. రోషయ్య కమిటీ తెలంగాణపై అభిప్రాయాలను సేకరిస్తుందని, ఈ కమిటీ సిఫారసులను బట్టి తెలంగాణ ఏర్పాటుకు సహకరిస్తమని చెప్పిండు. ఈ కమిటీని గాని, వైఎస్‌ను గాని తెలంగాణ ప్రజలు నమ్మలేదు. ఆంధ్ర ప్రజలు కూడా నమ్మలేదు. అది కేవలం తెలంగాణ ప్రజలను మభ్యపెట్టడానికి సాగతీ యడానికి వేసిన కమిటీ అని గుర్తించిండ్రు.

ఎస్‌ఐ పోస్టుల భర్తీకి ప్రభుత్వం తయారు కావడంతో 610 జిఓ అమలు చేయాలని టిఆర్ఎస్ పోరు మొదలుపెట్టింది. ఎన్నికల ముందు కాబట్టి, ఎన్నికలల్ల

లబ్ధిపొందడానికి ఈ జిఓను ఉపయోగించుకోవాలని అనుకుండు వైఎస్. 2008 అక్టోబర్ 20న 610 జిఓను ఒక్క నెలల అమలు చేస్తమని ప్రకటించిండు. దీంతో తెలంగాణ ప్రజలకు తాను వ్యతిరేకం కాదు అన్న సంకేతం ఇయ్యాలనుకుండు. 610 జి.ఓ అమలు వల్ల 5, 6 జోన్లలో అక్రమ పద్ధతులల్ల చేరిన ఆంధ్రా ఉద్యోగులు పోవాల్సి ఉంటుంది కాబట్టి, అట్లా ఖాళీ అయిన స్థానంల సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించాలని కూడా చెప్పిండు. అయినా వైఎస్ అన్న మాట మీద నిలబడ లేదు. సరిగ్గా ఆయన విధించుకున్న గడువుకు ఒక్కరోజు ముందు మరొక ప్రకటన చేసిండు. దాని సారాంశమేందంటే 610 అమలుకు మరో రెండు రోజులు గడువు కావాలని. వైఎస్ మాటలన్నీ గాలిమాటలే అని గ్రహించి బిజెపి నాయకుడు దత్తాత్రేయ తన 125వ బహిరంగలేఖను వైఎస్‌కు రాసిండు. తెలంగాణ సైంధవుడు వైఎస్ అని విరుచుకుపడ్డడు.

ఆ తెల్లారి, 610 అమలును సర్కారు సాగదీస్తుందని, దీనివల్ల తెలంగాణ ప్రాంత ఉద్యోగులకు నష్టం జరుగుతుందని ప్రతిపక్షాలు స్పీకర్ సురేశ్‌రెడ్డికి ఫిర్యాదు చేసినయ్. టిఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు, టిడిపి నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి, సిపిఐ నాయకుడు చాడ వెంకటరెడ్డి, సిపిఎం నాయకుడు జూలకంటి రంగారెడ్డి స్పీకరును కలిసి వైఎస్ సర్కారు కుట్రలను బట్టబయలు చేసింద్రు.

ఆ తెల్లారి హరీశ్‌రావు 610 అమలుల సర్కారు కుట్రలపై విరుచుకు పడ్డడు. ఈ కుట్రల సూత్రధారి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అయితే పాత్రధారి మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ కుందూరు జానారెడ్డి అని మీడియా ముందు కుండబద్దలు కొట్టిండు.

హరీశ్ మాట్లాడిన తెల్లారి 610 అమలు పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి. ఈయన అధ్యక్షతన జరిగిన సమావేశంల టిఆర్ఎస్ నాయకులు దుమ్మెత్తిపోసింద్రు. అయితే తెలంగాణ నాయకుడైన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ సమావేశంల వైఎస్ సర్కారును వెనకేసు కొచ్చిండు. 610 అమలుల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని వైఎస్ భజన చేసిండు. 610 జిఓ అమలుకు ఏనాడూ ప్రయత్నం చేయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఈ జిఓను కాలరాస్తున్న వైఎస్‌ను కీర్తించడం తెలంగాణ ప్రజలకు రుచించలేదు.

తెలంగాణ ప్రజలను ఓట్లకోసం మభ్యపెట్టడానికి ప్రయత్నించుకుంటనే తెలంగాణపై ఏకాభిప్రాయం కావాలని 2008 డిసెంబర్ 3న వెటకారంగా మాట్లాడిండు

వైఎస్. తెలంగాణ విషయంల ఇంత దుర్మార్గంగా ప్రవర్తించినా తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఒక్కరంటే ఒక్కరు నోరు తెరిచి ఇదేంది అని వైఎస్‌ను అడగలేదు.

ఇగ పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ అయితే 2009 లోపు తెలంగాణ ఇస్తమని కాంగ్రెస్ చెప్పనే లేదని 2009 జనవరి 19న ఆంధ్రా సర్కారును వెనకేసు కొచ్చిండు. ముఖ్యమంత్రి పదవి కోసం చేసే ప్రయత్నాలల్ల పదిపైసలొంతు కూడా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఆయన ఏనాడు చేయలేదు.

అప్పటికే రాష్ట్రంల ఎన్నికల వాతావరణం ఏర్పడ్డది. ఒకవైపు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కూటమి ఏర్పాటు చేయాలని టిడిపి, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ప్రయత్నం చేసినయ్. కాంగ్రెస్‌కు దూరమైన కమ్యూనిస్టులు, టిడిపివైపు మొగ్గు చూపింద్రు. 2004 ఎన్నికలల్ల టిఆర్ఎస్‌తోపాటు కమ్యూనిస్టులతో కలిసి ఎన్నికలకు పోయిన వైఎస్ ఐదేండ్లు నిండకముందే ఆ పార్టీలను దూరం చేసుకుండు.

ఈ సమయంల 2008 ఆగస్ట్ 26న సినిమానటుడు చిరంజీవి తిరుపతిల ప్రజారాజ్యం పార్టీని ప్రకటించిండు. ఎన్‌టిరామారావు లెక్కన్నే తను కూడా అధికారాన్ని చేపడత అని కలలు కన్నడు. చిరంజీవి పార్టీ సామాజిక న్యాయం అనే నినాదాన్ని అందుకుంది. ఈ నినాదం బిసి కులాలను బాగా ఆకర్షించింది. ముఖ్యంగా ఆంధ్రాల కాపులను ఆకట్టుకుంది.

సేవే లక్ష్యం, ప్రేమే మార్గం అంటూ చిరంజీవి వేదికలమీద వినిపించిన పంచ్ డైలాగులు కూడా యువకులచేత చప్పట్లు కొట్టించినయ్. తెలంగాణ విషయం లోను తను వ్యతిరేకం కాదు అని ప్రకటించిండు. సామాజిక తెలంగాణ అంటూ సన్నాయి నొక్కులు నొక్కిండు. చిరంజీవి రాజకీయరంగ ప్రవేశంతో ముక్కోణపు పోటీ ఏర్పడ్డది.

ఇట్లాంటి ఎన్నికల వాతావరణంల తన సర్కారు చివరి అసెంబ్లీ సమా వేశాలల్ల చివరి రోజు 2009 ఫిబ్రవరి 12న వైఎస్ హడావుడిగా తెలంగాణకు అను కూలమనే సంకేతాలు ఇచ్చే ప్రయత్నం చేసిండు. తెలంగాణపై సంయుక్త సంఘం ఏర్పాటు చేస్తున్నట్టు ఉభయసభలల్ల ప్రకటించిండు. తెలంగాణ ప్రజల ఓట్లు రానున్న ఎన్నికలల్ల కీలకమని భావించిండు. మల్లోసారి నమ్మించటానికి ఆయన ఇట్లాంటి ఎత్తు వేసిండు.

ఎన్నికల ప్రచారంల భాగంగా 2009 ఫిబ్రవరి 28న సోనియాగాంధీ సికింద్రా బాద్ పరేడ్‌గ్రౌండ్‌ల ఏర్పాటు చేసిన బహిరంగసభల మాట్లాడింది. తెలంగాణ ఇచ్చేం దుకు కాంగ్రెస్‌కు అభ్యంతరం లేదని మల్లా ఒకసారి చెప్పింది.

తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి అధికారాన్ని మల్లా ఒకసారి అందుకోవ డానికి కాంగ్రెస్ సిద్ధపడ్డది. తెలంగాణ ప్రజలను బోల్తాకొట్టించి మల్లా ఒకసారి ముఖ్యమంత్రి కావడానికి రాజశేఖరరెడ్డి అన్ని ప్రయత్నాలు చేసిండు. అధికారమే లక్ష్యంగా ఎన్నికల ప్రచారంల మునిగిపోయిండు.

తెలంగాణ రాష్ట్ర సమితి అధ్వర్యంల జరుగుతున్న తెలంగాణ ఉద్యమం చంద్రబాబును ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆంధ్రనాయకుడు అయిన చంద్రబాబు తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా ప్రణబ్ ముఖర్జీకి లేఖ ఇయ్యకుండ తప్పించుకొని తిరగడం మొదలుపెట్టిండు. కుంటిసాకులు చెప్పుకుంట కాలం బొలిపిండు. దీనివల్ల తెలుగుదేశం పార్టీలోని తెలంగాణ నాయకుల మీద ఒత్తిడి పెరిగింది. ఆ ఒత్తిడికి తట్టుకోలేక తెలంగాణ నాయకులు దేవేందర్‌గౌడ్, నాగం జనార్ధన్‌రెడ్డి పార్టీ సమావేశాలల్ల తెలం గాణ అంశాన్ని లేవనెత్తిండ్రు. అయినా చంద్రబాబు దాటవేసిండు.

చంద్రబాబు నాన్చుడు విధానం వల్ల టిడిపిల రెండవ స్థాయి నాయ కునిగా గుర్తింపు పొందిన దేవేందర్‌గౌడ్‌పై మరింత ఒత్తిడి పెరిగింది. ఆయన అసహనానికి గురైండు. అట్లాంటి సమయాన టిడిపి మహానాడుల తెలంగాణపై చర్చించి నిర్ణయం తీసుకుందామని చంద్రబాబు మరికొంత కాలం దువ్విండు. మహానాడుల తెలంగాణ విషయాన్ని తేల్చకుండ మల్లా వాయిదా వేయడంతో దేవేందర్‌గౌడ్ ఇగ భరించలేక పార్టీకి రాజీనామా చేసి బయటికి వొచ్చిండు.

తెలంగాణకు చెందిన సీనియర్ నాయకుడు పార్టీకి దూరం కావడంతో చంద్రబాబు మీద ఒత్తిడి మరింత పెరిగింది. ఎన్నికలు కూడ మరో ఆరునెల్లల్ల జరుగనున్నయ్. ఇట్లాంటి సమయంల తెలంగాణ వ్యతిరేకిగా ముద్రపడితే ఎన్నిక లల్ల తనకు అధికారం దూరమయ్యే ప్రమాదముందని చంద్రబాబుకు అర్థమైంది. అందుకని తెలంగాణ ఏర్పాటు తమ పార్టీకి సమ్మతమేనని చెప్పాలనుకుండు. 2005 జనవరిల ఏర్పాటైన ప్రణబ్ ముఖర్జీ కమిటీకి మూడున్నర ఏండ్ల తర్వాత 2008 అక్టోబర్ 18న చంద్రబాబు లేఖ ఇచ్చిండు.

టిడిపి లేఖ ఇచ్చిన రెండు రోజులకు, 2008 అక్టోబర్ 20న చంద్రబాబు అడ్డుపడటం వల్లనే 2000 సంవత్సరంల వాజ్‌పేయి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయలేక పోయిందని భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు ఎల్‌కె అద్వాని ప్రకటించిండు. ఇదే సంవత్సరం నవంబర్ 13న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌ల ఏర్పాటు చేసిన 'సంకల్పయాత్ర' బహిరంగసభల ఆయన మాట్లాడిండు. బిజెపి అధికారంలకు వొస్తే వొందరోజులల్ల తెలంగాణ ఏర్పాటు చేస్తమని ప్రకటించిండు.

అధికారంల ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి తెలంగాణను మచ్చిక చేసుకొనే ప్రయత్నాలు చేస్తుండటం, బిజేపి తెలంగాణ పాట పాడటం, కొత్తగ పుట్టిన ప్రజారాజ్యం తెలంగాణ గానం చేయడం, సొంత పార్టీ నుంచి తెలంగాణ నాయ కుడు బయటికి వెళ్లి పోవడం– చంద్రబాబుకు దడపుట్టించినయ్. 2004 ఎన్నికలల్ల పొత్తుల వల్లనే కాంగ్రెస్ అధికారంలకు వొచ్చిందని, ఈసారి ఆ పార్టీలు కాంగ్రెస్‌కు దూరం కావడం వల్ల, తను పొత్తు పెట్టుకోవాలని భావించిండు. ప్రభుత్వం మీద, వైఎస్ మీద కారాలు మిరియాలు నూరుతున్న కమ్యూనిస్టులు కూడ చంద్రబాబుకు సానుకూల సంకేతాలు పంపిండ్రు. తెలంగాణ వ్యతిరేక పార్టీ సిపిఎం రాష్ట్ర నాయకుడు రాఘవులు కూడా టిడిపి పొత్తుకు తహతహలాడిండు. సిపిఐ కూడా సిపిఎంను అనుసరించింది. మొత్తం మీద ఈ మూడు పార్టీలు ఎన్నికలల్ల పొత్తు పెట్టుకోవాలని నిర్ణయించుకున్నయ్. అంతేకాక తెలంగాణ ఉద్యమాన్ని భుజాల కెత్తుకున్న టిఆర్ఎస్‌ను కూడా తమతో కలుపుకుంటే మంచి ఫలితాలు సాధించ వొచ్చని భావించినయ్.

తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కెసిఆర్ కాంగ్రెస్ మీద ముఖ్యమంత్రి వైఎస్ మీద అప్పటికే రగిలిపోతుండు. 2004ల పొత్తుపెట్టుకొని తెలంగాణపై హామీ ఇచ్చిన కాంగ్రెస్ మోసం చేసిందని ఆయన గుర్రుగ ఉన్నడు. రాయలసీమ నాయకుడు రాజశేఖరరెడ్డి తెలంగాణకు అడ్డు తగులుతుండని భావించిండు. ఈ అడ్డును తొలగించు కోవాలంటే కాంగ్రెస్‌కు అధికారాన్ని దూరం చేయడం ఒక్కటే మార్గమని అనుకున్నడు.

అంతేకాక టిఆర్ఎస్‌కు 10 మంది ఎమ్మెల్యేలు దూరం కావడం వైఎస్ కుట్ర ఫలితమేనన్న సంగతి ఆయన మరిచిపోలేదు. అసమ్మతి ఎమ్మెల్యేలపై స్పీకరుకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకుండా వైఎస్ అడ్డుకోవడం ఆయనకు కోపం తెప్పించింది. అదే సమయంల 2008 డిసెంబర్ 21న ఏడుగురు టిఆర్ఎస్ అసమ్మతి ఎమ్మెల్యేల రాజీనామాలు స్పీకర్ ఆమోదించిండు. తెల్లారి మరో ముగ్గురు ఎమ్మెల్యేలు జగ్గారెడ్డి, సోయం బాబూరావు, మందాడి సత్యనారాయణరెడ్డిపై స్పీకర్ అనర్హత వేటు వేసిండు. ఈ కసితోని ఉన్న కెసిఆర్ డిసెంబర్ 29న నిజాం కాలేజిల జరిగిన విద్యార్థి గర్జనల కాంగ్రెస్ పోతేనే తెలంగాణ సాధ్యమని పిలుపు నిచ్చిండు.

కాంగ్రెస్‌ను ఓడించడానికి కెసిఆర్ కూడ పొత్తుల గురించి ఆలోచించిండు. ఈ లోపుల 2009 జనవరి 16న తల్లి తెలంగాణ పార్టీని తెలంగాణ రాష్ట్ర సమితిల కలుపుతున్నట్లు విజయశాంతి ప్రకటించింది.

అనేక అపనమ్మకాలు, అనుమానాల మధ్యన చంద్రబాబు కెసిఆర్ ఎన్నికల పొత్తుల గురించి చర్చలు జరిపిండ్రు. పొత్తులను ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ప్రోత్సహిం

చినయ్. ఫలితంగా 2009 జనవరి 31న నాలుగు పార్టీల మధ్యన పొత్తు కుదిరింది. మహాకూటమిగ ఏర్పడి ఎన్నికలకు పోవాలని నిర్ణయించుకుంద్రు. ఈ పొత్తుల గురించిన చర్చల కెసిఆర్ వెంట తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ కూడా పాల్గొన్నడు. ఎన్నికల ప్రణాళికల తెలుగుదేశం పార్టీ తెలంగాణ అంశాన్ని చేర్చింది.

# విషం కక్కిన వైఎస్

తెలుగుదేశం పార్టీల రొండో స్థానానికి ఎదిగి తెలంగాణ కోసం ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుతో విభేదించి బయటికి వొచ్చిండు దేవేందర్‌గౌడ్. దీన్ని తెలంగాణ వాదులు స్వాగతించిండ్రు. టిడిపిని విడిచిపెట్టి బయటికి వొచ్చిన రోజు ప్రొఫెసర్ జయశంకర్, ఆర్. విద్యాసాగర్‌రావు, వి.ప్రకాశ్ వంటి తెలంగాణ మేధావులు దేవేందర్ గౌడ్‌ను కలిసి మద్దతు ఇచ్చిండ్రు. టిడిపిని వీడిన దేవేందర్‌గౌడ్, టిఆర్ఎస్‌ల చేరి కెసిఆర్‌తో కలిసి ఉద్యమించాలని చాలామంది తెలంగాణ వాదులు కోరుకుండ్రు. కాని దేవేందర్‌గౌడ్ అందుకు సిద్ధపడలేదు. తెలంగాణ వాదుల నుంచి తనకు వొస్తున్న మద్దతు చూసి ఎక్కువ ఊహించుకుండు.

కెసిఆర్ మీద అసంతృప్తితో ఉన్న కొందరు తెలంగాణ నాయకులు, మేధావులు కూడా టిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా దేవేందర్‌గౌడ్ మరో పార్టీ పెట్టాలని కోరుకుండ్రు. వారు కోరుకున్నట్లుగా దేవేందర్‌గౌడ్ నవ తెలంగాణ పార్టీ ప్రకటించిండు. అయితె ఆయనతో పాటు తెలుగుదేశం నుంచి బయటికి వొచ్చిన పెద్దిరెడ్డి తప్ప చెప్పుకోదగ్గ ఇంకో నాయకుడు ఆయన పార్టీల చేరలేదు. దేవేందర్‌గౌడ్ ప్రవర్తన వల్ల సమర్థులైన నాయకులు ఆ పార్టీల చేరలేకపోయిండ్రు. చివరికి రొండో స్థాయి నాయకులకే దేవేందర్ పార్టీ పరిమితమైంది. అయినా నవ తెలంగాణ పార్టీ మాత్రమే తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహిస్తుందని ప్రచారం చేసిండు. తన పార్టీ బలోపేతం కోసం టిఆర్ఎస్‌ను దెబ్బకొట్టాలని చూసిండు.

అదే లక్ష్యంతో నవ తెలంగాణ పార్టీ ప్రజలల్లకు పోయింది. మొదట్లో బాగనే ఆదరణ వొచ్చింది. కాని ఆ వెంటనే తగ్గడం మొదలుపెట్టింది. అదే సమయంల సొంతంగ ఉద్యమపార్టీని నడిపించే చాకచక్యం దేవేందర్‌గౌడ్‌కు ఉన్నదా అన్న అనుమానం కూడా తెలంగాణవాదులకు వొచ్చింది.

ఇట్లాంటి సమయంల దేవేందర్‌గౌడ్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిండు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయకున్నా సొంతంగ ప్రకటించు

కుంటం అని చెప్పిండు. తెలంగాణ రాష్ట్ర పక్షి పాలపిట్ట అని కూడ ప్రకటించిండు. తెలంగాణల ప్రభుత్వ కార్యాలయాలకు తెలంగాణ బోర్డులు తగిలించాలని కూడా కార్యకర్తలకు పిలుపు ఇచ్చిండు.

ఈ సమయంలనే టీఆర్ఎస్‌ను, కెసిఆర్‌ను విమర్శించడం మొదలు పెట్టిండు దేవేందర్‌గౌడ్. ఎనిమిది సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమాన్ని నడిపిస్తున్న టిఆర్ఎస్‌ను, కెసిఆర్‌ను దేవేందర్‌గౌడ్ విమర్శించడం తెలంగాణ వాదులు ఇష్టపడలేదు. ఒకే లక్ష్యం కోసం కొట్లాడుతున్న పార్టీని పనిగట్టుకొని విమర్శించడం దేవేందర్‌గౌడ్ రాజకీయ పరిణతిని శంకించేటట్లు చేసింది. లోతైన ఆలోచనలేని నాయకులకు తెలంగాణ ఉద్యమాన్ని నడపడం సాధ్యం కాదని విమర్శలు వొచ్చినయ్.

టిడిపి నుంచి బయటికి వొచ్చినపుడు మద్దతు ఇచ్చిన నాయకులు చిన్న చిన్నగా దేవేందర్‌గౌడ్‌కు, ఆయన పార్టీకి దూరమైంద్రు. ప్రొఫెసర్ జయశంకర్ వంటి పెద్దలు కూడ దేవేందర్‌తోటి తెలంగాణ సాధ్యపడదని భావించి దూరం జరిగింద్రు.

పుట్టిన నాలుగు రోజులకే దేవేందర్ పార్టీ ఉన్నకాస్త ఆదరణ కోల్పోయింది. ఈ దశలో రాష్ట్రంల ఎన్నికలవేడి పెరిగింది. పొత్తులు చర్చలు మొదలయినయ్. మహాకూటమిల చేరడానికి దేవేందర్‌గౌడ్ కూడా ప్రయత్నం చేసిండు. కాని ఆయనకున్న ఆదరణ ప్రజలల్ల పట్టు చూసిన మహాకూటమి భాగస్వామ్య పార్టీలు నవ తెలంగాణ పార్టీతో సీట్ల సర్దుబాటుకు ఇష్టపడలేదు. చివరికి దేవేందర్‌గౌడ్ ఒంటరిగా మిగిలిండు.

ఆ సమయంల ఆయనకు మరో కొత్త పార్టీ ప్రజారాజ్యం కనిపించింది. ఆ పార్టీ అధ్యక్షుడు చిరంజీవి సామాజిక న్యాయం అనే మాట ఆయనను ఆకర్షిం చింది. పార్టీ పెట్టిన తొమ్మిది నెలలకే ఆపసోపాలు పడి చివరికి ఎన్నికల ముందు 2009 మార్చిల చిరంజీవి పార్టీ ప్రజారాజ్యంల తన పార్టీని విలీనం చేసిండు. సీనియర్ నాయకుడైన దేవేందర్‌గౌడ్ ప్రజల ఆదరణను నిలబెట్టుకోలేక ఒక ఆంధ్రాపార్టీ నుంచి బయిటికి వొచ్చి మరో ఆంధ్రాపార్టీల చేరడం తెలంగాణ వాదులకు మింగుడు పడ లేదు. చివరికి రాష్ట్రంల మూడు కూటములు ఏర్పడి ముక్కోణపు పోటీకి రంగం సిద్ధమైంది.

రాష్ట్రం ఎన్నికల ప్రచారంతో వేడెక్కింది. అన్ని పార్టీలు తెలంగాణ పాటనే వినిపించినయ్. ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అయితే కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందని, బిజెపిని గెలిపించినా, మహాకూటమిని గెలిపించినా తెలంగాణ సాకారం కాదని గొంతు చించుకుండు.

తెలంగాణ ప్రాంతంల మొదటిదఫా పోలింగ్ అయ్యింది. రెండవ దఫా ఎన్నికలు సీమాంధ్రల జరగాల్సి ఉన్నయ్. తెలంగాణ ప్రాంతంల పోలింగ్ సమయం ముగిసిన మరు క్షణమే రాజశేఖరరెడ్డిలోని తెలంగాణ వ్యతిరేక రాక్షసుడు బయటికి వొచ్చిండు. ఆంధ్రప్రాంతంల ఎన్నికల ప్రచారసభల మాట్లాడుకుంట తెలంగాణ మీద విషం కక్కిండు. తెలంగాణ విడిపోతే మనం హైదరాబాదుల విదేశీయులం అవుతాం అని 2009 ఏప్రిల్ 16న విషం కక్కిండు. అప్పటిదాకా తను వేసుకున్న ముసుగును తొలగించిండు. ఈ విషప్రచారంతో రాజశేఖరరెడ్డి తెలంగాణకు పరమశత్రువు అనీ, ఆంధ్రారాజకీయ నాయకుల మాటల్ల విషం దాగి ఉంటదని తెలంగాణ ప్రజలకు మరోసారి తెలిసింది.

ఎన్నికల హంగామా ముగిసింది. ఓటర్ల తీర్పు వెలువడ్డది. కాంగ్రెస్ 157 అసెంబ్లీ స్థానాలు గెలిచింది. ఆనాటి పరిస్థితుల ప్రకారం కాంగ్రెస్ మీద, వైఎస్ మీద వ్యతిరేకత అంతా ఇంతా కాదు. కాని కాంగ్రెస్‌కే విజయం దక్కింది.

దీనికంతటికి కారణం ప్రజారాజ్యం పార్టీతో ఎన్నికల్లకు దిగిన చిరంజీవి. ప్రజారాజ్యం పార్టీ లేకుంటే కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లతో కచ్చితంగా మహాకూటమి గెలిచేదే. కాని మహాకూటమికి పడాల్సిన ఓట్లను చిరంజీవి చీల్చిండు. అందువల్ల మళ్లా కాంగ్రెస్ గెలిచింది. రాజశేఖరరెడ్డికే అధికారపీఠం దక్కింది.

ఈ ఎన్నికలల్ల టిఆర్ఎస్ పది అసెంబ్లీ స్థానాలను, రెండు ఎంపీ స్థానాలను గెలుచుకుంది. కెసిఆర్ మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానం నుంచి గెలిచిండు. మెదక్ స్థానం నుంచి విజయశాంతి గెలిచింది.

కెసిఆర్ కొడుకు కల్వకుంట్ల తారకరామారావు మొట్టమొదటిసారి సిరిసిల్ల నుంచి గెలిచిండు. హరీశ్‌రావు, ఈటెల రాజేందర్ గెలిచిండ్రు. రాజేందర్ శాసనపక్ష నాయకుడుగా ఎన్నికయ్యిండు.

అసలే అహంకారం, ఆపైన రెండోసారి అనుకోకుండా దక్కిన అధికారంతో రాజశేఖరరెడ్డి కిందా మీదా ఆనకుంట అయ్యిండు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి 2009 జూన్ 10న అసెంబ్లీ సమావేశం అయ్యింది. ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి చూపిన తలబిరుసు, మాట్లాడిన మాటలు రాష్ట్ర ప్రజలు మర్చిపోరు. తెలంగాణ ప్రజలు ఎన్నటికి మరిచిపోరు.

శాసనసభల టిఆర్ఎస్ పక్షనాయకుడు ఈటెల రాజేందర్‌ను ఉద్దేశించి, 'రాజేందర్! టిఆర్ఎస్ పట్టుమని పదిసీట్లు గెలిచింది. తల ఎక్కడ పెట్టుకుంటరు' అని నిండుసభ సాక్షిగా తెలంగాణ ఉద్యమపార్టీని, తెలంగాణ ఉద్యమాన్ని అవమాన

పరిచిండు. ఎన్నికలల్ల టిఆర్ఎస్ సాధించిన ఫలితాలు సహజంగనే తెలంగాణ వాదులను నిరుత్సాహపరిచినయ్. వైఎస్ వంటి తెలంగాణ వ్యతిరేకి మళ్లా అధికారం చేపట్టడంతో తెలంగాణవాదులు మరింత నిరుత్సాహానికి గురయ్యింద్రు.

ఎన్నికలు జరిగిన మూడు నెల్లకు దేవేందర్‌గౌడ్‌కు మహాజ్ఞానోద యమైంది. టిడిపిని విడిచిపెట్టడం చారిత్రిక తప్పిదం అని 2009 ఆగస్టు 3న చెంపలేసుకున్నంత పనిచేసిండు. ఆ తర్వాత మూడు రోజులకు ఆగస్టు 6న ప్రజారాజ్యం పార్టీ నుంచి మల్లా తెలుగుదేశం పార్టీల చేరిండు.

తెలుగుదేశం నుంచి తెలంగాణ పేరుతో బయటికి వొచ్చిన దేవేందర్‌గౌడ్ నవ తెలంగాణ పార్టీ పెట్టి, దాన్ని నడపలేక ప్రజారాజ్యం పార్టీల చేరి, అక్కడా కుదురు కోలేక మళ్లా చంద్రబాబు కాళ్ల దగ్గరికి చేరడం తెలంగాణ అభిమానులు జీర్ణించు కోలేకపోయింద్రు. సమర్థుడనుకున్న దేవేందర్‌గౌడ్ ఒక్క ఏడాదిల గింగిరాలు కొట్టి మల్లా టిడిపిల చేరడాన్ని ఇష్టపడలేక పోయింద్రు.

రాజశేఖరరెడ్డి రొండోసారి ముఖ్యమంత్రి అయినంక 'రచ్చబండ' కార్య క్రమం అని పెట్టిండు. అప్పుడు రాష్ట్రంల విపరీతమైనప వర్షాలు. అట్లాంటి వాతావరణంల రచ్చబండ కార్యక్రమానికి బయలుదేరిండు. వాతావరణం ప్రతికూలించి వైఎస్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ పావురాలగుట్ట మీద కూలింది. ఒక వెలుగు వెలిగిన రాజశేఖరరెడ్డి అర్ధంతరంగ 2009 సెప్టెంబర్ 2న కాలం జేసిండు. మృతదేహాన్ని ఆయన సొంతజిల్లాలోని ఇడుపులపాయ ఎస్టేట్‌కు చేర్చింద్రు. తండ్రి చనిపోయిండని తెలిసిన గంటలల్లనే ఆయన కొడుకు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి ప్రయత్నం చేసిండు. వైఎస్ మృతదేహానికి నివాళులు అర్పించటానికి వొచ్చిన ఎమ్మెల్యేల సంతకాలను వైఎస్ ఆత్మబంధువుగా పేరుపడ్డ కెవిపి రామచంద్రరావు సేకరించిండు. ఇది చూసి జనం ముక్కు మీద వేలేసుకుంద్రు.

రాజశేఖరరెడ్డి ప్రవర్తనను అప్పటికే గమనించిన కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్య మంత్రి పదవిని ఆయన కొడుకు జగన్‌మోహన్‌రెడ్డికి కట్టబెట్టి తలనొప్పులు తెచ్చు కోవడానికి సిద్ధపడలేదు. దీంతో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రోషయ్యను ముఖ్య మంత్రిగా ఎంపిక చేసింది. 2009 సెప్టెంబర్ 3న రోషయ్య ముఖ్యమంత్రి బాధ్యతలు తీసుకున్నడు.

# ఊరూరా తెలంగాణ ఉద్యమం

తెలంగాణ రాష్ట్ర సమితి తొమ్మిదేండ్ల ఉద్యమంల తెలంగాణ ప్రజలను ఏకం చేసింది. ఎన్నికలల్ల కిందపడ్డా మీదపడ్డా ఊరూరుకు మాత్రం ఉద్యమాన్ని తీసుకుపోగలిగింది. పార్టీపెట్టిన తొలినాళ్లలో కెసిఆర్ వ్యతిరేకులు, తెలంగాణ వ్యతిరేకులు రకరకాల విమర్శలు చేసింర్రు. గతంల తెలంగాణ ఉద్యమాన్ని అడ్డం పెట్టుకొని పదవులను అనుభవించిన నాయకుల బాటలనే కెసిఆర్ పోతుండని విమర్శించింర్రు. కాని కెసిఆర్ ప్రజలకు నమ్మకం కలిగించిండు. తను ఉద్యమానికి ద్రోహంచేస్తే రాళ్లతో కొట్టి చంపమని బహిరంగ వేదికల మీద చెప్పిండు. కెసిఆర్‌లో ఉన్న కసి, తెలంగాణ సాధించాలన్న పట్టుదల ప్రజలకు నమ్మకం కలిగించినయ్. తెలంగాణ ఉద్యమం మీద ఆయనకున్న నిజాయితీని ప్రజలు గుర్తించింర్రు.

కెసిఆర్ తొమ్మిదేండ్ల పోరాటంతో కేంద్రంల కదలిక తేగలిగిండు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ వ్యతిరేకతను తగ్గించగలిగిండు. తెలుగుదేశం వంటి ఆంధ్రా పార్టీలు గోడమీది పిల్లిలెక్క మాట్లాడుతున్నా బహిరం గంగ తెలంగాణను వ్యతిరేకించలేని ఆత్మరక్షణల పడేయ గలిగిండు. టిఆర్ఎస్ పోరాటం వల్ల గతిలేని స్థితిల చంద్రబాబు టిడిపి ఫోరంను ఏర్పాటు చేసిండు.

కాంగ్రెస్‌లోనూ కేశవరావు వంటి సీనియర్ నాయకులు తెలంగాణకు అను కూలంగ గొంతులు పెంచింర్రు. ఎన్నికల సమయంల కాస్త తగ్గినా తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకుంటున్నరని కేంద్రానికి వినిపించగలిగిండు.

కెసిఆర్ నాయకత్వం వల్ల తెలంగాణ ఉద్యమం ఊరూవాడా పాకింది. తెలంగాణల ఏ గల్లీకి పోయినా తెలంగాణ గురించిన చర్చే. తెలంగాణ కోసం ఆయన ఏ కార్యక్రమానికి పిలుపు ఇచ్చినా పార్టీలకు అతీతంగ తెలంగాణ ప్రజలు కదిలింర్రు.

ముక్కుసూటి ఉపన్యాసాలు, ప్రజల భాషల ప్రభుత్వంపై ఆయన సంధించే ప్రశ్నల బాణాలు ప్రజలల్ల చైతన్యం కలిగించినయ్. సమైక్యరాష్ట్రంల తెలంగాణ ఎన్ని రకాలుగ ఎంత నష్టపోయిందో తెలంగాణ ప్రజలు తెలుసుకో గలిగింర్రు. దోచుకోవ డానికి వొచ్చిన ఆంధ్రానాయకుల అసలు రూపాన్ని ప్రజల ముందు నగ్నంగ నిల

బెట్టిండు. తెలంగాణను, హైదరాబాదును అభివృద్ధి చేసినమని జబ్బలు చరుచుకునే వలస పాలకులకు దిమ్మదిరిగే మాటల తూటాలను వొదిలిండు. హైదరాబాదు చరిత్రను, అభివృద్ధిని పూసగుచ్చినట్టు చెప్పి ప్రజలను చైతన్య పరిచిండు. తెలంగాణల చేసినమని ఆంధ్రానాయకులు చెప్పుకునే అభివృద్ధిలోని డొల్లతనాన్ని బట్టబయలు చేసిండు. వాళ్ల కుళ్లు, కుతంత్రాలను ఎత్తి చూపిండు.

చరిత్రల దాగిన తెలంగాణ గొప్పతనాన్ని కెసిఆర్ వేదికల మీద చెపుతుంటె ఒక్కొక్క ఆంధ్రా మాయపొర తొలగిపోయింది. తెలంగాణ చరిత్రకారులకు కూడా ఆయన మాటలు ప్రోత్సాహాన్ని ఇచ్చినయ్. అనేక కోణాలల్ల పరిశోధనలు చేసింద్రు. చరిత్రను తొవ్వి నిప్పులాంటి నిజాలను బయటపెట్టింద్రు.

తెలంగాణ కవులు, రచయితలు కూడా తెలంగాణనే తమ రచనా వస్తువుగా తీసుకోక తప్పలేదు. కవితయినా, కథయినా అది తెలంగాణ విషయమే అయింది. తెలంగాణ సాహిత్యంలకు ప్రవాహం లెక్కన తెలంగాణ వొచ్చి చేరింది. తెలంగాణ సంస్కృతి, చరిత్ర సామాన్యులకు చేరింది.

ఈ ఉద్యమంల మరీ ముఖ్యమైనది తెలంగాణ పాట. స్వతహాగ రాసి సిడిల రూపంల కెసిఆర్ వెలువరించిన పాటలు ఉద్యమం తొలిరోజులల్ల తెలంగాణ సమాజంల చైతన్యాన్ని తెచ్చినయ్. ప్రజలను ఉద్యమంవైపు ఆకర్శించినయ్. తెలంగాణలోని చిన్నపిలగాని నుంచి గద్దర్ వంటి ప్రజాగాయకుల వరకు తెలంగాణ పాటనే పాడింద్రు. గజ్జెకట్టి తెలంగాణ ఉద్యమ వేదికల మీద పాడు తుంటె జనం అడుగుల అడుగేసింద్రు. తెలంగాణ అంతా ధూంధాంలతో దుమ్ము రేగింది. పాటతోటి అతి సామాన్యుల దగ్గరకు చేరింది తెలంగాణవాదం.

నిజానికి ఈ పాటికే తెలంగాణ సంస్కృతి, చరిత్ర ఆంధ్ర వలసపాలన వల్ల ధ్వంసమైంది. తెలంగాణ ఉద్యమం వల్ల ఈ విషయాలన్నీ తెలంగాణ ప్రజలు తెల్సుకోగలిగింద్రు. తాము ఏమి కోల్పోయింది గమనించ గలిగింద్రు. తెలంగాణ పండుగలు పబ్బాలను భాషను చిన్నరూపు చూసే ఆంధ్రోళ్ల అహంకారాన్ని గుర్తుపట్ట గలిగింద్రు. అందుకే ఉద్యమంవైపు మళ్లింద్రు. తాము ఆత్మగౌరవంతో బతకాలను కుంద్రు. వలసదోపిడీ లేని తెలంగాణ పాలన కోరుకుంద్రు.

తెలంగాణ ప్రజలల్ల వొచ్చిన ఈ చైతన్యానికి నూటికి నూరుపాళ్లు కెసిఆర్ నాయకత్వంల టిఆర్ఎస్ చేసిన ఉద్యమమే కారణం. ఈ విజయం కెసిఆర్ది, టిఆర్ఎస్ది అని జనం ఒప్పుకున్నరు.

తెలంగాణను చైతన్యం చేయడంల తెలంగాణ జాగృతిది మరీ ముఖ్యమైన

పాత్ర. కెసిఆర్ బిడ్డ కల్వకుంట్ల కవిత విదేశాలల్ల ఉద్యోగం చేస్తూ తెలంగాణ ఉద్యమం వైపు ఆకర్షితురాలైంది. తెలంగాణ ఉద్యమంతో మమేకమైంది. తెలంగాణ ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా తెలంగాణ జాగృతిని 2007ల ఏర్పాటు చేసింది. తెలంగాణ పది జిల్లాలల్ల జాగృతి శాఖలను ఏర్పాటు చేసింది. తెలంగాణ ఉద్యమం ఇచ్చిన ప్రతికార్యక్రమానికి మద్దతు తెలుపుకుంటనే సంస్కృతి మీద దృష్టి పెట్టింది. తెలంగాణల అతిపెద్ద పండుగ, తెలంగాణ చిహ్నమైన బతుకమ్మను కేంద్రంగా చేసుకొని జాగృతి కార్యక్రమాలు రూపొందించింది. ఆంధ్ర వలస సంస్కృతి వల్ల తెలంగాణ పండుగలను కూడా పట్టణాలల్ల చేసుకోవడానికి వెనుక ముందాడిన తెలంగాణ ప్రజలను చైతన్యపరచింది.

జాగృతి తరఫున దసరాపండుగ తొమ్మిదిరోజులు జిల్లాకో పట్టణంల బతుకమ్మ కార్యక్రమాన్ని చేపట్టింది కవిత. తను స్వయంగా బతుకమ్మ ఆడుతూ విద్యావంతులైన మహిళలను ఆకర్షించగలిగింది. రెండు మూడేండ్లలో బతుకమ్మ పండుగ గొప్పతనం తెలంగాణ పట్టణ ప్రజలకు తెలిసింది. ఆంధ్రా ప్రజలు కూడా గమనించిండ్రు. ఏనాడు హైదరాబాద్ నడిగడ్డన బతుకమ్మ ఆడిన చరిత్ర లేదు. మొదటిసారి హైదరాబాద్ లోని ట్యాంక్‌బండ్ మీద తెలంగాణ జాగృతి బతుకమ్మ పండుగను చేయగలిగింది.

జాగృతి కార్యక్రమాల వల్ల తెలంగాణ మొత్తం తమ సంస్కృతిని తడుము కుంది. తమ సంస్కృతి గొప్పతనాన్ని చాటిచెప్పి ఆత్మస్థైర్యాన్ని పొందింది. పిండి వంటలు, పండుగల మీద తెలంగాణ గౌరవాన్ని పెంచుకుంది. ఒకరకంగా తెలంగాణ సంస్కృతి మల్లా ఊపిరి పోసుకుంది.

తెలంగాణ జాగృతి విదేశాలల్ల కూడా బతుకమ్మ కార్యక్రమాలు చేపట్టింది. విదేశాలల్ల ఉండే తెలంగాణ మహిళలు బతుకమ్మ పండుగను గొప్పగా చెప్పుకునే స్థితికి ఎదిగిండ్రు. ఇది మా పండుగ అని గర్వంగా చాటి చెప్పిండ్రు.

తెలంగాణ బతుకమ్మ పండుగను ఏనాడు మీడియా పట్టించుకోలేదు. పత్రికలు రాయలేదు. చానళ్లు చూపించలేదు. కాని జాగృతి వొచ్చిన తర్వాత ఆంధ్రా చానళ్లు ప్రత్యక్ష ప్రసారాలు చేసినయ్. పత్రికలు పేజీలకొద్ది వార్తలు ఇచ్చినయ్.

అన్ని రంగాలపై అవగాహన పెంచుకున్న తెలంగాణ సమాజం ఇగ తెలంగాణ సాధించడమే ఏకైక పరిష్కారం అని భావించింది. చిన్నపిల్లగాని నుంచి పండు ముసలి దాంక జై తెలంగాణ నినాదం అందుకుండ్రు. తెలంగాణల నమస్తే అన్న పలకరింపు స్థానంల జై తెలంగాణ అని వొచ్చింది. తెలంగాణ వాదం విస్తరించింది. తెలంగాణ ప్రజలల్ల సొంత రాష్ట్ర ఆకాంక్ష రగిలింది.

# కూలిన తెలంగాణ అడ్డు

తెలంగాణకు అడ్డూ కాదు, నిలువూ కాదు అని అసెంబ్లీల నిలువెల్లా అహంకారంతో వెటకారపు మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బతుకు పావురాలగుట్టల్ల తెల్లారిపోయింది. మరణం బాధాకరమే కాని తెలంగాణకు మాత్రం నిజంగా అడ్డు తొలగిపోయింది. సుబ్బి చావుతో ఎంకిపెండ్లి ఖాయమైంది అనుకున్నరు తెలంగాణ ప్రజలు.

వైఎస్ మరణానికి సహజంగానే ప్రజలు కూడా సంతాపాలు ప్రకటిం చింద్రు. ఆయన దినకర్మలు కూడా అయినయ్. రాష్ట్రం గంభీరంగా ఉంది. అట్లాంటి సమయంల కెసిఆర్ నోట తెలంగాణ ఆక్రోశం లావాలెక్క తన్నుకొచ్చింది. తెలంగాణ ప్రజల పాపం తగిలే వైఎస్ పావురాలగుట్టల్ల కూలిండు. పంచభూతాలు మింగినయ్ అని అన్నడు.

అప్పటి వరకు వైఎస్‌ను రాముడు దేవుడంటూ కీర్తిస్తున్న వారికి ముఖ్యంగా జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని చెక్కభజన చేస్తున్న వారికి కెసిఆర్ మాటలు చురుక్కున తగిలినయ్. అగ్గో, మహానాయకుణ్ణి అట్లంటడా అని గయ్యిన లేచింద్రు. కాని కెసిఆర్ అడుగు వెనక్కి వేయలేదు. మళ్లా అదే అదే మాటన్నడు. వైఎస్ వల్ల లాభపడ్డ కొందరు కొద్దిరోజుల పాటు లబోదిబోమన్నరు. తెలంగాణ నాయకులు కూడా సన్నాయినొక్కులు నొక్కింద్రు. కాని ఓ పది పదిహేను రోజులు గడిచిందో లేదో ఒక్కొక్కరు కెసిఆర్ మాటలనే మళ్లా వినిపించింద్రు. అప్పటిదాకా దిగమింగిన మాటలను బయటికే అన్నరు. కెసిఆర్ మామూలు రాజకీయనాయకుల ఆలోచనకు అందని వ్యూహకర్త. కొద్ది రోజులు మీడియాకు కూడా కనిపించడు. బయటికి వొచ్చిండంటే బ్రహ్మాండం బద్దలైతది.

ఉద్యమం కాస్త చల్లబడ్డప్పుడల్లా రాజీనామా చేసి మండించడం కెసిఆర్ ఎత్తుగడ. 2009 ఎన్నికల ఫలితాలు, దాని తర్వాత వొచ్చిన విమర్శలన్నింటికి

సమాధానంగా మళ్లా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని భావించిండు. ఈసారి రాజీనామా కాకుండా 'ఫ్రీజోన్' ఆయుధం కెసిఆర్ చేతికి దొరికింది.

1975ల రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం హైదరాబాద్ ఆరో జోన్‌ల భాగం. హైదరాబాద్‌ల ఉద్యోగాలు తెలంగాణ వారికే చెందాలె. కాని వైఎస్ ఉన్నప్పుడు రాష్ట్రపతి ఉత్తర్వులను పాతర పెట్టి, హైదరాబాద్ ఆరో జోన్‌ల భాగం కాదు, అది ఫ్రీజోన్ అని తప్పుదారి పట్టించే ప్రయత్నం జరిగింది. ఎస్ఐ పోస్ట్‌ల భర్తీకి వైఎస్ సర్కారు పూను కుంది. కాని తెలంగాణ ప్రజల నుంచి తీవ్ర నిరసన వొచ్చింది. టిఆర్ఎస్ ఉద్యమాన్ని ఉధృతం చేసింది. ఫలితంగ నియామకాలు ఆగిపోయినయ్.

ఆ తర్వాత ఆంధ్రా ఉద్యోగులు సుప్రీం కోర్టును ఆశ్రయించిండ్రు. సుప్రీం కోర్టులో వైఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగ సమర్థవంతమైన వాదనలు వినిపించ లేదు. ఫలితంగ 2009 ఆక్టోబర్ 9న హైదరాబాద్ ఫ్రీజోన్ అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధం. ముల్కీ రూల్స్‌కు విరుద్ధం. ఈ తీర్పు వల్ల హైదరాబాద్‌ల తెలంగాణకు చెందాల్సిన ఉద్యోగాలు ఆంధ్రోళ్లు పట్టపగలే దోచుకోవడానికి బాట వేసినట్టయింది. తీర్పుకు వ్యతిరేకంగ తెలంగాణ భగ్గున మండింది. టిఆర్ఎస్ ఉద్యమాన్ని ఉధృతం చేసింది. రోషయ్య సర్కారుకు కాకబుట్టి గిలగిలలాడింది.

ఈ నేపథ్యంల ముఖ్యమంత్రి రోషయ్య 2009 అక్టోబర్ 19న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిండు. టిఆర్ఎస్ ఆ సమావేశం నుంచి వాకౌట్ చేసింది. రాజ్యాంగ సవరణకు రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేయాలని కెసిఆర్ డిమాండు చేసిండు.

కాని ఆంధ్రపాలకుల సర్కారు దాన్ని నిర్లక్ష్యం చేసింది. దీంతో తెలంగాణ వేడెక్కింది. ఎక్కడికక్కడ నిరసనలు, బంద్‌లు జరిగినయ్. విద్యార్థులు ఆందోళనకు దిగిండ్రు. దిక్కులేని స్థితిల రోషయ్య సర్కారు సబ్ఇన్‌స్పెక్టర్ల నియామకాలను నిలిపి వేసింది.

తాత్కాలికంగ నియామకాలను నిలిపినా తెలంగాణ శాంతించలేదు. ఈ సందర్భంగా ప్రభుత్వం మీద దుమ్మెత్తి పోసిండు కెసిఆర్. హైదరాబాద్ ఫ్రీజోన్ కాదు. అది ఆరో జోన్‌ల భాగం. ఆ విషయం గుర్తించి, అందుకు అను గుణంగా ప్రభుత్వ వ్యవహరించాలె, తగిన చర్యలకు పూనుకోవాలె అని తీవ్రంగ హెచ్చరించిండు.

తెలంగాణ అంతటా ఫ్రీజోన్‌కు వ్యతిరేకంగా నిరసనలు మొదలైనయ్. వరంగల్‌లోని కాకతీయ యునివర్సిటీ విద్యార్థులు దీక్షకు కూసుండ్రు. సంఘీభావం

తెలపడానికి కెసిఆర్ పోయిండు. సుప్రీం కోర్టు ఉత్తర్వులను నిలిపి వేయడానికి అన్ని ప్రయత్నాలు చేద్దాం. అయినా ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే నిరాహారదీక్షకు దిగుత అని ప్రకటించిండు.

2009 అక్టోబర్ 28న ఫ్రీజోన్‌కు వ్యతిరేకంగ హైదరాబాద్‌ల జైల్‌భరో కార్యక్రమం జరిగింది. ఆ రోజు కెసిఆర్ ఆధ్వర్యంల ర్యాలీ తీసిండ్రు. ఆ సందర్భం ల ఆయన మాట్లాడిండు. ఆంధ్రాపాలకుల దోపిడీ పోవాలంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే పరిష్కారం అన్నడు. తెలంగాణ వొచ్చుడో, కెసిఆర్ చచ్చుడో ఏదో ఒకటి తేల్చుకుంట అన్నడు. ఆ రోజే ఆమరణ దీక్షకు దిగనున్నట్లు ఆయన ప్రకటించిండు. ఫ్రీజోన్ కాదు తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించాలని డిమాండు చేసిండు. ఇంక ఆమరణ దీక్షకు తయారైండు.

అయితే జైత్రయాత్ర లేదంటే శవయాత్ర అని 2009 నవంబర్ 5న ప్రకటించిండు కెసిఆర్. ఈ ప్రకటనతో తెలంగాణ మొత్తం లేచింది. ఉద్యమానికి సన్నద్ధమైంది. మెదక్‌జిల్లా సిద్ధిపేట శివార్లలోని రంగథాంపల్లి దగ్గర దీక్ష చేయాలని నిర్ణయమైంది. 2009 నవంబర్ 29న దీక్షకు దిగనున్నట్లు కెసిఆర్ ప్రకటించిండు. టిఆర్ఎస్ కార్యకర్తలు, విద్యార్థులతోటి ఐదు అంచల భద్రత మధ్య దీక్ష చేయనున్నట్లు చెప్పిండు.

దీంతో రాష్ట్రం వేడెక్కింది. సర్కారుకు ముచ్చెమటలు పట్టినయ్. కెసిఆర్ దీక్షకు పోకుంట ముందుగానే అడ్డుకోవాలని సర్కారు కుట్రలు చేసింది. దీక్షను ఎట్లయినా చెడగొట్టాలని కుటిలయత్నాలు మొదలుపెట్టింది.

# మలుపు తిప్పిన కెసిఆర్ దీక్ష



# కెసిఆర్ ఆమరణ దీక్ష

కెసిఆర్ దీక్ష గడువు దగ్గర పడుతుండటంతో తెలంగాణ వేడెక్కింది. టిఆర్ఎస్, తెలంగాణవాదులు దీక్షకు బాగా ప్రచారం చేసింన్రు. తెలంగాణ అభిమానులు, విద్యార్థులు దీక్షా వేదికయిన సిద్ధిపేటకు పోవటానికి తయారైన్రు. ప్రభుత్వం అడుగడుగున ముందస్తు అరెస్టులు చేసింది. టిఆర్ఎస్ నాయకులను, విద్యార్థులను పోలీసులు అదుపులకు తీసుకున్రు.

కెసిఆర్ 2009 నవంబర్ 26న హైదరాబాద్ నుంచి కరీంనగర్ బయలు దేరిండు. మధ్యల దీక్షా వేదికను, ఏర్పాట్లను పరిశీలించి పోతడని ప్రచారమైంది. ఉత్తర తెలంగాణభవన్‌ల మూడు రోజులు ఉండి, అక్కడి నుంచే దీక్షాస్థలానికి వొస్తడని పత్రికలు రాసినయ్.

హైదరాబాద్ నుంచి కరీంనగర్ పోతూ దీక్షావేదికను పరిశీలించటానికి కెసిఆర్ ఆగే సమయం కోసం పోలీసులు ఎదురుచూసిన్రు. అక్కడ్నే ఆయనను అరెస్టు చేసి దీక్ష జరగకుండ చేయాలని పథకం వేసిన్రు. కాని హైదరాబాద్ నుంచి బయలుదేరిన కెసిఆర్ రంగథాంపల్లి వద్ద అగకుండ సక్కగ కరీంనగర్ పోయిండు. దీంతో పోలీసుల వ్యూహం పనికిరాకుండ పోయింది.

కరీంనగర్ చేరిన కెసిఆర్ అక్కన్నే మూడు రోజులు ఉండు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో ఎప్పటికప్పుడు మంతనాలు జరిపిండు. తెలంగాణ ప్రజలు కరీంనగర్ బాట పట్టిన్రు. అక్కడ నుంచి దీక్షాస్థలానికి బయలుదేరే ఉద్యమ నాయకుని వెంట ర్యాలీగా రావలనేది ఆలోచన.

ఉత్తర తెలంగాణ భవన్‌ను పోలీసులు చుట్టుముట్టిన్రు. వేలకొద్ది పోలీసు బలగం మోహరించింది. తెలంగాణ వాదులను ఆ చుట్టుపక్కలకు రానీయలేదు. ప్రజలు గుమిగూడితే కెసిఆర్‌ను అరెస్టు చేయడం వీలుకాదని పోలీసుల ఆలోచన.

నవంబర్ 28 రాత్రికే కెసిఆర్‌ను అరెస్టు చేయాలని శతవిధాల ప్రయత్నం చేసింద్రు. కాని టిఆర్ఎస్ నాయకులు, జనం వేలసంఖ్యల కెసిఆర్‌కు రక్షణగ ఉండ టంతో వీలుకాలేదు. అయినా ఏ మాత్రం సందుదొరికినా అరెస్టు చేయాలని ఆ రాత్రి మొత్తం పోలీసులు కాపుగాసింద్రు. ముందుగనే అరెస్టు చేసి కెసిఆర్‌ను దీక్షా స్థలానికి చేరకుంట చేయాలనేది పోలీసుల ఉపాయం.

నవంబర్ 29 ఉదయం ఉత్తర తెలంగాణ భవన్ చుట్టుపక్కల ప్రాంతం తెలంగాణ ప్రజలతో కిటకిటలాడింది. ఆరోజు పదకొండు గంటలకు తెలంగాణ భవన్ నుంచి బయలు దేరాలె. సమయం దగ్గరపడటంతో ఉత్కంఠ మొదలైంది. భవన్ నుంచి కెసిఆర్ బయటకు వెళ్లడానికి ప్రయత్నిస్తుంటే పోలీసులు హడావుడి చేసింద్రు. తెలంగాణ నాయకులు పోలీసులను అడ్డుకుంద్రు. కెసిఆర్ కాన్వాయ్‌కి ముందు పోలీసువాహనాలు పెట్టి రక్షణకోసమే అని చెప్పబోయింద్రు పోలీసులు. కాని కల్వకుంట్ల తారకరామారావు తదితర టిఆర్ఎస్ నాయకులు అందుకు ఒప్పుకోలేదు. పోలీసుల రక్షణ అవసరం లేదన్నరు. వాదన జరిగింది. చివరికి కాన్వాయ్ వెనుక రావడానికి పోలీసులు ఒప్పుకుంద్రు.

ఎంతో ఉద్విగ్నంగ, వేలాదిమంది వెంటరాగా కెసిఆర్ కాన్వాయ్ బయలు దేరింది. పోలీసులు వెంటాడుతనే ఉంద్రు. తెలంగాణ వాదులు అడ్డుకుంటనే ఉంద్రు. కరీంనగర్ నుంచి అల్గునూరు చౌరాస్తా వరకు వాహనాలు వొచ్చినయ్. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం చౌరాస్తా అది. అప్పటికే పోలీసులు అక్కడ మోహరించింద్రు. వొచ్చి పోయే వాహనాలను ఆపింద్రు.

చౌరాస్తా నుంచి హైదరాబాద్‌రోడ్డున పోవాల్సిన కెసిఆర్ కారును కాన్వాయ్ నుంచి తప్పించి ఖమ్మం వైపు మలిపింద్రు పోలీసులు. దీనికి నిరసనగా కెసిఆర్ ధర్నాకు దిగిండు. పోలీసులు దుర్మార్గంగ ఉద్యమనేతను వాహనంలకు ఎక్కించుకొని ఖమ్మం వైపు పరుగు తీసింద్రు. టిఆర్ఎస్ నాయకులు, ప్రజలు ముందుకు రాకుండ అక్కడనే బ్రిడ్జిమీద రాకపోకలు ఆపేసింద్రు.

గంటన్నర ప్రయాణం తర్వాత కెసిఆర్‌ను ఒంటరిగ ఖమ్మం తీసు కొచ్చింద్రు. అప్పటికే ఖమ్మం పోలిస్‌స్టేషన్ల కెసిఆర్ మీద కేసులు పెట్టింద్రు. రొండు ప్రాంతాల ప్రజలను రెచ్చగొడుతుండని, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తుండని ఆరోపణలు. మొత్తం ఆరు సెక్షన్ల కింద కేసులు బనాయించింద్రు. ఆ వెంటనే ఖమ్మం మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచింద్రు. మెజిస్ట్రేట్ పద్నాలుగు రోజుల రిమాండు విధించిండు. అక్కడ నుంచి కెసిఆర్‌ను ఖమ్మం జైలుకు తీస్కపోయింద్రు. జైల్లనే దీక్ష ప్రారంభిస్తున్నట్లు కెసిఆర్ ప్రకటించిండు.

కెసిఆర్ అరెస్టు వార్త పొక్కి తెలంగాణ అగ్గిమీద గుగ్గిలమైంది. ముసలి ముతకా పిల్లా జెల్లా అంతా రోడ్లమీది కొచ్చింద్రు. ఎక్కడికక్కడ నిరసనలు, రాస్తారోకోలు చేసింద్రు. ముఖ్యమంత్రి రోషయ్య దిష్టిబొమ్మలు తగులబెట్టింద్రు. గంటలల్ల తెలంగాణ అతలాకుతలమైంది.

కెసిఆర్ అరెస్టు వార్త తెలిసి సిద్ధిపేట రంగథాంపల్లి దీక్షాస్థలం దగ్గరున్న హరీశ్‌రావు తను దీక్ష చేయనున్నట్లు ప్రకటించిండు. తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులు ప్రతాపం చూపింద్రు. అయినా తెలంగాణవాదులు వెంట్రుక పోస మందం కూడా తగ్గలేదు.

హైదరాబాద్‌ల కూడా తీవ్రమైన నిరసనలు వ్యక్తమైనయ్. ప్రజలు రోడ్ల మీదికొచ్చింద్రు. ఎల్‌బినగర్ చౌరాస్తాల విద్యార్థులు రాస్తారోకోకు దిగింద్రు. పోలీసులు అదుపుచేసే ప్రయత్నం చేసింద్రు. కాని విద్యార్థులు రెచ్చిపోయింద్రు. కోపోద్రిక్తులై బస్సులపై దాడి చేసింద్రు. పోలీసుల నిర్బంధానికి మరింత రెచ్చి పోయింద్రు. తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితిల నల్లగొండ జిల్లాకు చెందిన శ్రీకాంతాచారి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పు అంటించుకుండు. మంటలు ఎగిసిపడుతుంటే జై తెలంగాణ నినాదాలు చేసిండు. ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. డెబ్బయి శాతం కాలిన శ్రీకాంతాచారి కుప్ప కూలిండు. అక్కడ నుంచి ఆయనను ఆస్పత్రికి తరలించింద్రు.

కెసిఆర్ అరెస్టుకు నిరసనగా తెల్లారి బంద్‌కు పిలుపునిచ్చింద్రు. తెలంగాణ మొత్తం స్తంభించిపోయింది. ప్రభుత్వ కార్యాలయాలు, బస్సులు ఎక్కడికక్కడ నిలిచి పోయినయ్. చీమ చిటుక్కు మనలేదు. టివి చానళ్లల్ల ఎప్పటికప్పుడు వార్తలు ప్రసారమైనయ్. తెలంగాణ వాదులంతా ఖమ్మంవైపు పరుగులు తీసింద్రు. ఖమ్మం పట్టణంల, జైలు సమీపంల తీవ్ర ఉద్రిక్తత ఏర్పడ్డది.

2009 డెసెంబర్ 1. ఆందోళనలు నిరసనలు కొనసాగుతనే ఉన్నయ్. కెసిఆర్ ఖమ్మం జైలులనే ఉండు. దీక్షలో ఉండి రోజూ వాడే టాబ్లెట్లు కూడా ఆయన తీసుకోలేదు. వైద్యులు పరీక్షించి ఆయన ఆరోగ్యం క్షీణించిందని చెప్పింద్రు. ఈ వార్త తెలిసి తెలంగాణ మరింత వేడెక్కింది. ఇట్లాంటి పరిస్థితిల ప్రభుత్వం కుట్రకు పూనుకుంది. దీక్షను మోసపూరితంగానైనా భగ్నం చేయాలనుకుంది. వైద్యులతో తప్పుడు సమాచారం ఇప్పించింది. సర్కారు కుట్రల భాగంగ కెసిఆర్‌కు మత్తుమందు ఇచ్చి రంగునీళ్లు తాపించింద్రు వైద్యులు. ఆ ఫోటోలను వీడియోలను టీవీ చానళ్లకు అందించింద్రు. దీక్ష భగ్నమైందని పోలీసులు ప్రకటించింద్రు. ఈ వార్తను సీమాంధ్ర మీడియా అత్యుత్సాహంతో ప్రసారం చేసింది.

ఇది తెలంగాణ వాదులకు ఆశాభంగం కలిగించింది. కెసిఆర్ దీక్ష విరమిం చిండు అన్న సమాచారంతో ఉస్మానియా యూనివర్సిటీల విద్యార్థులు నిరసనలకు దిగింట్రు. ఎప్పుడూ కెసిఆర్‌ను ఆడిపోసుకునే కొన్ని ప్రజా సంఘాల నాయకులు ఇదే అదనుగా నోరు పారేసుకుంట్రు. కెసిఆర్ ఉద్యమానికి ద్రోహం చేసిండని అవాకులు చవాకులు వాగింట్రు. కెసిఆర్ వ్యతిరేకులు దీన్ని ఉపయోగించు కోవాలని చూసింట్రు. సీమాంధ్ర నాయకులు హేళన చేయబోయింట్రు. సీమాంధ్ర మీడియా అయితే కెసిఆర్ మీద కసికొద్ది విమర్శలు గుప్పించింది. తమ శక్తి కొద్ది విషంగక్కింది.

కొన్ని గంటలల్ల బయట జరుగుతున్న విషప్రచారం తెలుసుకున్న కెసిఆర్ తను దీక్షలనే ఉన్నట్లు ప్రకటించిండు. తెలంగాణ సాధించేదాక తన దీక్ష ఆగదని చెప్పిండు. కెసిఆర్ వెంట ఉన్న ప్రొఫెసర్ జయశంకర్, హరీశ్‌రావు, వినోద్‌కుమార్ తదితర తెలంగాణ నాయకులు జరుగుతున్న కుట్రను పసిగట్టింట్రు. కెసిఆర్ దీక్ష కొనసాగుతనే ఉందని వెల్లడించింట్రు.

కెసిఆర్ ఆరోగ్యం క్షీణిస్తుండడంతో ఆయనను హైదరాబాద్‌కు తరలిం చాలని టిఆర్ఎస్ నాయకులు డిమాండు చేసింట్రు. అనేక ఊగిసలాటల మధ్య తెలంగాణ ప్రజల నిరసనల మధ్య డిసెంబర్ 3 తెల్లవారు జామున కెసిఆర్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించింట్రు.

ఉద్యమానికి విద్యార్థులను దూరం చేయాలన్న కుట్రతో కెసిఆర్‌ను నిమ్స్‌కు తరలించిన రోజు అన్ని కళాశాలలకు పదిహేనురోజుల సెలవు ప్రకటించింది ప్రభుత్వం. ఉస్మానియా యూనివర్సిటీలోని విద్యార్థులను కూడా పోలీసులు బయటికి పంపింట్రు. యూనివర్సిటీల మెస్ బంద్ చేయాలని వైస్‌చాన్సలర్ తిరుపతిరావు మీద పోలీసులు ఒత్తిడి తెచ్చింట్రు.

ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకపోవడానికి డిసెంబర్ 4న తెలంగాణ రాజకీయ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పడ్డది. ప్రొఫెసర్ కోదండరామ్ కన్వీనర్‌గా, మల్లేపల్లి లక్ష్మయ్య కో కన్వినర్‌గా ఏర్పాటయిన జెఎసిల టిఆర్ఎస్, తెలంగాణ కాంగ్రెస్, తెలంగాణ టిడిపి ఫోరం, బిజెపి, సిపిఐ, న్యూ డెమోక్రసి పార్టీలు చేరినయ్.

ప్రొఫెసర్ కోదండరామ్ 2004 మే నెలలనే తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రారంభించిండు. తెలంగాణపై ప్రజలల్ల చైతన్యాన్ని కలిగించడానికి అనేక కార్యక్రమాలు చేసిండు. నిబద్ధతతో తెలంగాణ వాదాన్ని వినిపించిండు.

దీక్షకు ముందే జెఎసిని ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేసిండు కెసిఆర్. రాజకీయ జెఎసి వల్ల ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవొచ్చని భావించిండు. దానికి

సంబంధించి మంతనాలు కూడా అయినయ్. ఆ యా పార్టీలతో, తెలంగాణ వాదులతో మాట్లాడింద్రు. కోదండరామ్ కన్వీనరుగ జెఎసి ఏర్పాటు చేయాలని అనుకుంద్రు. ఆ తర్వాత కెసిఆర్ దీక్షా కార్యక్రమంల మునిగిపోయిండు. కెసిఆర్‌ను అరెస్టు చేసి ప్రభుత్వం జైలుల పెట్టడంతో జెఎసిని ప్రకటించింద్రు. ఉమ్మడి కార్యాచరణ వల్ల ఉద్యమం బలపడుతుందని భావించింద్రు.

రోజు రోజుకు కెసిఆర్ ఆరోగ్యం క్షీణించింది. నిమ్స్ వైద్యులు ఆయన ఆరోగ్య పరిస్థితిపై ప్రకటనలు చేస్తుంద్రు. దీక్ష మొదలై ఆరు రోజులు అయ్యింది. అయినా కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ముఖ్యమంత్రి రోశయ్య ముఖం చాటేసి పోలీసులను ముందుకు తోసిండు. ఆత్మహత్యా యత్నం చేసిన శ్రీకాంతాచారి డిసెంబర్ 4న ఆస్పత్రిల కన్నుమూసిండు. ఈ వార్త క్షణాలల్ల తెలంగాణ ప్రజలకు చేరింది. ఈ పరిస్థితిల కేంద్రం మీద మరింత ఒత్తిడి పెంచాలని జెఎసి అను కున్నది. డిసెంబర్ 6,7 తారీకులల్ల తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చింది. మొదటి రోజు బంద్ ముఖ్య మంత్రికి చెమటలు తెప్పించింది. రొండోరోజు కూడా అదే తీవ్రతతో బంద్‌కు దిగింద్రు.

ఢిల్లీల కదలిక వొచ్చింది. ప్రధాని మన్మోహన్, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ నుంచి ముఖ్యమంత్రికి సూచనలు అందినయ్. డిసెంబర్ 7న సచివాలయంల ముఖ్యమంత్రి రోశయ్య అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిండు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంల ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తొమ్మిది పార్టీల నాయకులు పాల్గొన్నరు. అధిష్ఠానం నిర్ణయమే తమ నిర్ణయమని రాష్ట్ర కాంగ్రెస్ చెప్పింది. ప్రభుత్వం రాష్ట్ర విభజనకు తీర్మానం పెడితే మద్దతిస్తమని తెలుగుదేశం పార్టీ చెప్పింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తీర్మానం అసెంబ్లీల ప్రవేశపెట్టాలని తెలంగాణ రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ, సిపిఐ చెప్పినయ్. ఓట్లకోసం కాకుండ నిజాయితీతో తెలంగాణపై నిర్ణయం తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ చెప్పింది. ఎంఐఎం మాత్రం చర్చించి రొండు రోజులల్ల నిర్ణయం చెపుతం అన్నది. అన్ని పార్టీల అభిప్రాయా లను ముఖ్యమంత్రి రోశయ్య ఢిల్లీకి పంపిండు.

ఆ తెల్లారి కూడ తెలంగాణ వ్యాప్తంగా నిరసనల జోరు పెరిగింది. కెసిఆర్ ఆరోగ్యం గురించి ఆందోళన పెరిగింది. తెలంగాణనాయకులు ఢిల్లీమీద ఒత్తిడి పెంచింద్రు. డిసెంబర్ 8 అంటె దీక్ష పదవరోజు. మొత్తం తెలంగాణ కేంద్రం ప్రకటన కోసం ఎదురు చూసింది. అయితే కేంద్రం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు. కానీ ఢిల్లీల కదలిక మొదలైంది. కేంద్రం సీరియస్‌గ మంతనాలు చేస్తున్నట్లు ఎప్పటికప్పుడు వార్తలు అందినయ్.

2009 డిసెంబర్ 9. సోనియాగాంధీ పుట్టినరోజు. ముఖ్యమంత్రి రోశయ్యకు ఢిల్లీ నుంచి పిలుపొచ్చింది. ఆయన ఆదలబాదల ఢిల్లీ విమానం ఎక్కిండు. ఆ రోజు సొంతం ఢిల్లీల తీరికలేకుంట చర్చలు. తెలంగాణల ఆగని నిరసనలు. క్షీణిస్తున్న కెసిఆర్ ఆరోగ్యం. తెలంగాణ ప్రజలల్ల ఆందోళన. క్షణక్షణం నరాలు చిట్లిపోయే ఉత్కంఠ.

సాయంత్రం అయ్యేసరికి ఢిల్లీల మంతనాల జోరు పెరిగింది. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ సూచనల మేరకు కేంద్ర హోంమంత్రి చిదంబరం మంతనాలు చేసిండు. ముఖ్యమంత్రితో సమావేశమై పరిస్థితిని తెలుసుకున్నడు. తెలంగాణ మీద నిర్ణయం తీసుకోక తప్పదని కేంద్రానికి అర్థమైంది. ఎట్టకేలకు తెలంగాణపై ప్రకటన చేయడానికి పూనుకున్నది.

ఢిల్లీలో కేంద్రహోంమంత్రి చిదంబరం ముఖ్యమంత్రి రోశయ్యతో మాట్లాడిండు. దీక్షల ఉన్న కెసిఆర్‌తో కూడా చిదంబరం ఫోన్‌లో మాట్లాడిండు. ప్రకటన చేయనున్నట్లు కెసిఆర్‌కు చెప్పిండు. ప్రకటన ఎట్లుండాలె అనేదాని మీద కూడా కెసిఆర్ పట్టుబట్టిండు. అయితే కెసిఆర్ ఆరోగ్యం క్షీణించడం వల్ల ఆయన గొంతు సహకరించలేదు. అక్కడనే ఉన్న టిఆర్ఎస్ నాయకుడు వినోద్ కుమార్, ప్రొఫెసర్ జయశంకర్‌తో మాట్లాడాలని కెసిఆర్ చెప్పిండు.

ఢిల్లీల ఉన్న రోశయ్య, కెసిఆర్ దగ్గర ఉన్న టిఆర్ఎస్ మాజీ ఎంపి బి.వినోద్ కుమార్‌తో చర్చించిండు. ప్రకటన ఎట్ల ఉండాలె అనేదాని మీద చర్చలు జరిగినయ్. కేంద్రం చేయాల్సిన ప్రకటన తయారైంది. ప్రొఫెసర్ జయశంకర్ కూడా ప్రకటన విషయంల సంతృప్తి చెందినట్లు తెలిపిండు.

కేంద్రం చేయబోతున్న ప్రకటన కోసం తెలంగాణ ప్రజలేకాదు దేశం మొత్తం ఉత్కంఠతో ఎదురుచూసింది. 2009 డిసెంబర్ 9 రోజు రాత్రి పదకొండున్నరకు కేంద్రమంత్రి చిదంబరం మీడియా ముందుకొచ్చిండు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు గురించిన ప్రకటన చేసిండు.

> 'కెసిఆర్ కోరిన విధంగ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తం. అందుకు తగిన విధంగా రాష్ట్ర అసెంబ్లీల తీర్మానం ప్రవేశ పెడతరు. నవంబర్ 29 తర్వాత ఈ ఆందోళనల పాల్గొన్న నాయకులు, విద్యార్థులు, ఇతరులపై నమోదైన కేసులన్నీ ఉపసంహరించాలని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రికి కేంద్రం విజ్ఞప్తి చేసింది. అందుకు అనుగుణంగ చర్యలు తీసుకుంటమని ముఖ్యమంత్రి మాకు చెప్పిండు. మేము కెసిఆర్

ఆరోగ్యం విషయంల ఆందోళనగ ఉన్నం. ఆయన తక్షణం దీక్ష విరమించు కోవాలని కోరుతున్నం. విద్యార్థులంతా తమ ఆందోళనను విరమించి సాధారణ పరిస్థితులు ఏర్పడటానికి సహకరించాలె.'

ఇది చిదంబరం ఆంగ్లంల చేసిన ప్రకటన సారాంశం. దశాబ్దాల తెలంగాణ ప్రజల కల నెరవేరే ప్రకటన వెలువడింది. అర్ధరాత్రి మరోసారి సొతంత్రం వొచ్చినట్లు తెలంగాణ సంబురాలు చేసుకుంది.

ప్రకటన అనంతరం నిమ్స్ నుంచి కెసిఆర్ వీల్‌చైర్‌ల బయటికి వొచ్చిండు. గడ్డం పెరిగి బక్కచిక్కి కొన ఊపిరితో కనిపించిండు. రొండు చేతులెత్తి తెలంగాణ ప్రజలకు అభివాదం చేసిండు. వేల మంది అమరుల త్యాగఫలం... అంటుంటె ఆయన కండ్లనిండా ఆనందభాష్పాలు పొంగిపొర్లినయ్. ఆనందంతో ఆయన గొంతు పూడుక పోయింది. ఆయన కండ్లల శతకోటి కాంతులు మెరిసినయ్.

# సీమాంధ్ర నాయకుల నాటకాలు

కెసిఆర్ దీక్షతో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన చేయటం సీమాంధ్ర నాయకులకు మింగుడు పడలేదు. సీమాంధ్ర నాయకుల కంటె ముందు సీమాంధ్ర మీడియా భరించలేకపోయింది.

ఇంతకాలం తెలంగాణ ఉద్యమానికి సంఘీభావం చెబుతున్నట్లు నంగి నంగి రాతలు రాసిన పత్రికలు, కపట ప్రేమను కురిపించిన చానళ్లు ఓర్వలేక పోయినయ్. 53 ఏండ్లుగ మోసపుచ్చుకుంట వొస్తున్న సీమాంధ్రులు తెలంగాణ ప్రకటన వొస్తుందని అనుకోలేదు. అసలు ఊహించలేదు. కాని మొదటిసారి ఆంధ్రోళ్ల అంచనాలు తలకిందు లైనయ్. దాంతో రగిలిపోయింండ్రు.

ఉద్యమం లేనప్పుడు తెలంగాణకు అన్యాయం జరుగుతుందని రాతలు రాసిన పత్రికలు, నల్లగొండ జిల్లా ఫ్లోరిన్ బాధితుల మీద మొసలికన్నీళ్లు కార్చిన చానళ్లు తెలంగాణ ఉద్యమం ఉధృతమయ్యేసరికి వెనుకపట్టు పట్టినయ్. ఉన్నవార్తలను ఉన్నట్లుగా ప్రసారం చేయటానికి, రాయటానికి వాళ్లకు దరియ్యలేదు. ఇగ సీమాంధ్ర మీడియా ముసుగు తీసింది. బాహాటంగ కాలకూట విషం చిమ్మింది. రాత్రి ప్రకటన వొస్తే తెల్లారేసరికి సీమాంధ్ర అల్లకల్లోల మైతుందని వార్తలు కుమ్మరించింది. ఆంధ్ర నాయకులు కూడా 24 గంటల ఆనందం కూడా తెలంగాణ ప్రజలకు మిగలకుండా కుట్రలు చేసింండ్రు.

తెలుగుదేశం పార్టీ హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ భవన్ నుంచి సీమాంధ్ర ప్రజాప్రతినిధులను రెచ్చగొట్టింది. ఉద్యమానికి ఉసిగొలిపింది. టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు అయితే విషం మింగినట్లు మొగంపెట్టిండు. తమిళనాడుకు చెందిన చిదంబరం, కర్నాటకకు చెందిన వీరప్పమొయిలీ ఎవరండీ? సోనియాగాంధీ అర్ధరాత్రి తెలుగుజాతిని ముక్కలు చేసే ప్రకటన చేస్తదా అంటూ విషం చిమ్మిండు.

ఆంధ్రా కాంగ్రెస్ నాయకులు కూడా తాము తక్కువకాదని హంగామా చేసింండ్రు. హైదరాబాద్‌ల వక్ఫ్‌బోర్డు భూములను మింగిన కాంగ్రెస్ ఎంపి లగడపాటి

రాజగోపాల్ ఆరాటం అంతాఇంతా కాదు. మొత్తానికి పార్టీలకు అతీతంగ సీమాంధ్ర నాయకులు ఏకమైంద్రు. డిసెంబర్ 10 నాడు పదిగంటలకల్లా రాజీనామాల నాటకానికి తెరతీసింద్రు. సీమాంధ్ర చానళ్లు నిమిష నిమిషానికి మొదటి రాజీనామా రెండో రాజీనామా అంటూ బ్రేకింగ్ న్యూస్ ప్రసారం చేసినయ్.

సీమాంధ్రుల ఆందోళనలు ఇంకా మొదలే కాలేదు. చానళ్లలో గ్రాఫిక్ మంటలు చూపించింద్రు. సీమాంధ్ర తగలబడుతుందని గుండెలు బాదుకుంద్రు. పాత్రికేయ విలువలకు పాతరేసి ఏకపక్షంగ వార్తలు ప్రసారం చేసింది ఆంధ్ర మీడియా.

మొత్తం మీద సీమాంధ్ర మీడియా కుట్ర, చంద్రబాబు కుట్ర ఫలించింది. సీమాంధ్రల బలవంతపు ఉద్యమం మొదలయింది. తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎంపిల రాజీనామాలను చంద్రబాబు ప్రోత్సహించిండు. డిసెంబర్ 7న రోషయ్య అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంల తీర్మానం పెడితే మద్దతిస్తనన్న చంద్రబాబు తాటిమట్ట కంటె హీనంగా నాలుక ఉల్టా తిప్పి మాట్లాడిండు.

కాంగ్రెస్ ఎంపీలు లగడపాటి రాజగోపాల్, కావూరి సాంబశివరావు, రాయ పాటి సాంబశివరావు ఆంధ్రా ఉద్యమానికి పైసలు వెదజల్లి ఆముదం పోసింద్రు. హైదరాబాద్ల తమ దోపిడీకి అడ్డుకట్ట పడుతుందనే వ్యాపారులైన ఈ ఎంపీలు ఇట్లాంటి అనైతిక పనులకు ఒడిగడుతుంద్రని తెలంగాణవాదులు దుమ్మెత్తి పోసింద్రు.

ఆ సమయంల పార్లమెంటు సమావేశాలు నడుస్తన్నయ్. డిసెంబర్ 15న పార్లమెంటుల టిడిపి ఎంపీలు సమైక్యాంధ్ర ప్లకార్డులు పట్టుకొని నాటకం రక్తి కట్టిం చింద్రు. ముఖ్యమంత్రి కావాలని తహతహ లాడుతున్న జగన్ కూడ టిడిపీ ఎంపీలతో కలిసి సమైక్యాంధ్ర ప్లకార్డు పట్టుకొని పార్లమెంటుల నిరసన తెలిపిండు.

అదేరోజు లగడపాటి రాజగోపాల్ దొంగదీక్షకు దిగిండు. విజయవాడల మీడియా హడావుడి మధ్యన దీక్షకు కూచుండు. తెలుగుదేశం నాయకురాలు నన్నపనేని రాజకుమారి పార్టీలను పక్కకుపెట్టి దీక్షకు మద్దతుతెలిపింది. లగడపాటి ధర్మ పోరాటానికి దిగినట్లు నుదిటిమీద ముద్దుపెట్టుకుంది. ఈ వార్త ప్రసారం కావడంతో తెలంగాణవాదులు అసహ్యించుకుంద్రు. ఆంధ్రనాయకులు దోపిడీ రాక్షస గుణంతో ఎంత నీతిమాలిన పనులకయినా తెగబడతరని ఛీకొట్టింద్రు.

అచ్చం కెసిఆర్ చేసినట్లే దీక్షకు కూచున్న లగడపాటిని అరెస్టు చేయడానికి పోలీసులు ప్రయత్నిస్తే తప్పించుకుండు. అక్కడ నుంచి పారిపోయి దొంగకుక్కలెక్క ఉరుక్కుంట నిమ్స్‌ల కనిపించిండు. నిమ్స్‌ల బెడ్ మీద పండుకొని డ్రామా క్రియేట్ చేసిండు.

సీమాంధ్ర నాయకుల ఉన్మాదపు చేష్టలు, సీమాంధ్ర మీడియా విషప్రచారం కేంద్రానికి ఇబ్బంది కలిగించింది. ప్రజాప్రతినిధుల రాజీనామాల వల్ల రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల మనుగడకు ఇబ్బంది అయితదని భావించింది. ప్రభుత్వం ఏర్పడి ఒక్క ఏడాది కూడా కాకముందే ఇబ్బంది పడటానికి కాంగ్రెస్ సిద్ధపడలేదు.

దానికి తోడు సీమాంధ్ర ప్రజాప్రతినిధుల లాబీయింగ్, పైరవీలకు కేంద్రం లొంగింది. సీమాంధ్ర ప్రజాప్రతినిధులు కోట్లకొద్ది రూపాయలు ఢిల్లీ కాంగ్రెస్ నాయకుల మీద వెదజల్లిండ్రనే ప్రచారం కూడా అయింది. చివరికి 2009 డిసెంబర్ 23న కేంద్రప్రభుత్వం మరొక ప్రకటన చేయడానికి పూనుకుంది. తెలంగాణ మొత్తం గగ్గోలు పెడుతున్నా కేంద్రం సీమాంధ్ర ఒత్తిడికే లొంగింది. ఈ సమయంల తెలంగాణ ప్రకటన చేసిన చిదంబరం నోటినుంచే మరో ప్రకటన చేయించాలని సీమాంధ్ర నాయకులు పైరవీలు చేసిండ్రు. దానికి హోంమంత్రి మొదట అంగీకరించలేదు. తెలంగాణ ప్రకటన చేసి దానికి వ్యతిరేకంగ మరో ప్రకటన చేయటానికి ఆయన ఇష్టపడలేదు. కాని కాంగ్రెస్ అధిష్ఠానం ఒత్తిడితో చిదంబరమే రెండో ప్రకటన కూడ చేయక తప్పలేదు. అయిష్టంగనే తెలంగాణకు ఉరిపెట్టే ప్రకటనను ఆయన మీడియా ముందు వెల్లడించిండు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తం. అందుకు అనుగుణంగా అసెంబ్లీ తీర్మానం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినం అని డిసెంబర్ 9న చెప్పిన చిదంబరం ఆ ప్రకటనను తలకిందులు చేసిండు. అసెంబ్లీ తీర్మానం చేసిన తర్వాత రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తం అని ప్రకటన చేసిండు. అసెంబ్లీల సీమాంధ్ర మందబలం ఉండగా తెలంగాణకు అనుకూలంగ తీర్మానం చేయటం వీలుకాదని తెలుసు. తీర్మానం పెట్టినా సీమాంధ్ర ప్రజాప్రతినిధులు ముందల పడనీ యరని, అందుకని ఈ తలకిందుల ప్రకటన చేయించుకుండ్రు.

సీమాంధ్ర నాయకులు తెలంగాణకు ఇరవైనాలుగు గంటల ఆనందం కూడా మిగలనియ్యలేదు. తెలంగాణ కోసం తిండితిప్పలు మాని దీక్షచేసి చావు నోట్లెకు పోయి బయటపడ్డ కెసిఆర్ ఆస్పత్రి నుంచి ఇంక ఇంటికి చేరకముందే దొంగనాటకం మొదలు పెట్టిన సీమాంధ్రులు రెండు వారాలల్ల తెలంగాణ మీద నిప్పులు పోసే ప్రకటన చేయించిండ్రు.

దీంతో తెలంగాణ ఉడికింది. తెలంగాణ ప్రజలు రోడ్లమీదికెక్కిండ్రు. యూని వర్సిటీలు దీక్షా శిబిరాలయినయ్. తెలంగాణ సాంతం పల్లె వాడ అనకుండ రిలే నిరాహార దీక్షలకు దిగింది. ప్రతి ఊరిల పట్నంల తెలంగాణ చౌరాస్తాలు ఏర్పాటైనయ్.

దీక్షా వేదికలు కట్టింద్రు. కులాలకు మతాలకు అతీతంగ తెలంగాణ నిరసనలకు దిగింది. బస్సులు బంద్, కాలేజీలు బంద్. ఆఫీసులు బంద్... మొత్తం స్తంభించి పోయింది.

తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కొందరు ఉద్యమానికి మద్దతు తెలిపింద్రు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు ఉద్యమానికి మద్దతుగ రాజీనామా చేసింద్రు. కాని చాలా మంది వెనుకపట్టు పట్టింద్రు. విద్యార్థుల ఆందోళన రోజురోజుకు పెరిగింది. తెలుగుదేశం ఎమ్మెల్యేలు రాజీనామాకు ముందుకు రాలేదు. రాజకీయ నాయకులపై విద్యార్థులు మండిపోయింద్రు. 2009 డిసెంబర్ 24న ఉస్మానియాల విద్యార్థుల దీక్షకు మద్దతు తెలపడానికి పోయిన టిడిపి నాయకుడు నాగం జనార్ధనరెడ్డి మీద పడి విద్యార్థులు కొట్టింద్రు. దొంగ మద్దతు వొద్దు పార్టీని విడిచిపెట్టి ఉద్యమంలకు రావాలని నాగం కారును బోల్తా పడేసి మరీ కొట్టింద్రు. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుల బూట్ల సప్పుడుతో మారుమోగింది. లాఠీ చార్జీతో యూనివర్సిటీ రక్తసిక్త మయ్యింది. తెలంగాణ మొత్తం నెత్తుటి గాయమైంది. తెలంగాణల రోజురోజుకు ఉద్యమం తీవ్రం కావడం మొదలయ్యింది.

ఉస్మానియా యూనివర్సిటీల నాగం జనార్ధనరెడ్డి మీద దాడి జరిగిన రొండు రోజులకు మాజీ పోలీసు అధికారి నరసింహన్ గవర్నర్‌గ వొచ్చిండు. తెలంగాణ ఉద్యమాన్ని అణచి వేయడానికి ఆయనను కేంద్రం గవర్నర్‌గా పంపిందని ప్రచారమైంది.

# అఖిలపక్షంల రొండు నాలుకలు

తెలంగాణకు వ్యతిరేకంగ చిదంబరం ప్రకటన చేసిన తర్వాత తెలంగాణ భగ్గున మండింది. ఊరూరా ఆందోళనలు మొదలైనయ్. తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేయాలన్న డిమాండు తీవ్రమైంది. జెఎసి నేతలు, విద్యార్థి నాయకులు కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల రాజీనామాలు డిమాండు చేసింద్రు. దీంతో కాంగ్రెస్ నాయకులు తప్పించుకొని తిరుగడం మొదలు పెట్టింద్రు.

ఆగ్రహావేశాలతో మండుతున్న తెలంగాణను చల్లబరచడానికి కేంద్రం అఖిల పక్ష సమావేశం అనే నాటకాన్ని తెరమీదికి తెచ్చింది. రాష్ట్రంలోని ఎనిమిది పార్టీలకు కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబర్ 30న ఆహ్వానాలు పంపింది. తెలంగాణపై అభిప్రాయ సేకరణకు 2010 జనవరి 5న అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపింది.

ప్రజల ఒత్తిడికి తలొగ్గి తెలంగాణలోని ప్రజాప్రతినిధులు రాజీనామాల వైపు మొగ్గక తప్పలేదు. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు రాజీనామాలు చేసింద్రు. కొంత మంది మాత్రం గోడమీది పిల్లుల లెక్క నాటకాలు ఆడింద్రు.

రాజీనామా చేసిన మంత్రులను బుజ్జగించడానికి పిసిసి అధ్యక్షుడు డి.శ్రీని వాస్ పూనుకున్నడు. ఈయన మంతనాల వల్ల పదిమంది మంత్రులు తమ రాజీనా మాలు వెనక్కి తీసుకుంద్రు. పదవులు విడిచిపెడితే బతుకలేము అనుకున్నోళ్లు వెనక డుగు వేసింద్రు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాత్రం రాజీనామాను వెనుకకు తీసుకోవడానికి ససేమిరా అన్నడు. దీంతో అధిష్టానం ఆయనకు షోకాజ్ నోటీసు ఇచ్చింది.

రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల మీద, ఢిల్లీ మీద ఒత్తిడి పెంచడానికి తెలంగాణ వ్యాప్తంగ నిరసనల జోరు పెరిగింది. 2010 జనవరి 3న ఉస్మానియా విశ్వవిద్యా లయంల విద్యార్థులు తెలంగాణ గర్జన పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించింద్రు.

ఈ నేపథ్యంల జనవరి 5న కేంద్ర హోంమంత్రి చిదంబరం అధ్యక్షతన ఢిల్లీలోని నార్త్‌బ్లాక్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎనిమిది రాజకీయ పార్టీలు హాజరైనయ్. ఒక్కోపార్టీ నుంచి ఇద్దరు చొప్పున 16 మంది హాజరయింద్రు. ప్రత్యేక ఆహ్వానితునిగ ముఖ్యమంత్రి రోషయ్య హాజరయిండు.

రాష్ట్ర కాంగ్రెస్ ప్రతినిధులుగ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కావూరి సాంబశివరావు హాజరయింద్రు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంల ఏనాడు పాల్గొన్నవాడు కాదు. కాని కావూరి సాంబశివరావు మాత్రం సమైక్యాంధ్ర ఉద్యమంల ప్రధాన పాత్ర పోషించిండు. ఈ ప్రతినిధుల ఎంపికల కూడా కుట్రనే జరిగిందని తెలంగాణ వాదులు మండిపడ్డరు. సీమాంధ్రులకు అనుకూలమైన ఫలితాలను సాధించటానికి సీమాంధ్ర ప్రతినిధిగా బలమైన వ్యక్తిని, తెలంగాణ ప్రతినిధిగా ఏమాత్రం పట్టింపు లేని వ్యక్తిని ఎంపిక చేసింద్రని విమర్శలొచ్చినయ్. అఖిలపక్ష సమావేశానికి హాజరైన ఈ ఇద్దరు ప్రతినిధులు ఎవరి ప్రాంతం వాదన వాళ్లు వినిపించింద్రు. తెలంగాణ ఏర్పాటుకు కాలపరిమితి పెట్టాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరిండు. అసలు రాష్ట్రాన్ని విభజించనే వొద్దని కావూరి సాంబశివరావు చెప్పిండు.

తెలంగాణ మీద మొదటి నుంచి కుట్రలు చేసే తెలుగుదేశం పార్టీ ప్రతినిధులుగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యనమల రామకృష్ణుడు హాజరయింద్రు. ఇద్దరిల ప్రకాశ్‌రెడ్డి తెలంగాణ ప్రతినిధిగా యనమల రామకృష్ణుడు సీమాంధ్ర ప్రతినిధిగ పోయింద్రు. ప్రకాశ్‌రెడ్డి తెలంగాణ ఉద్యమానికి దూరంగ ఉన్నోడు. యనమల సమైక్య ఉద్యమాన్ని తెరవెనుక నుంచి ప్రోత్సహించినోడు. అఖిలపక్ష సమావేశానికి హాజరైన రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ ప్రతినిధిగా, చంద్రబాబు ఏజెంటుగ మాట్లాడిండు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి అభిప్రాయం చెప్పకుండ తెలుగుదేశం పార్టీని ఇబ్బంది పెట్టడానికే కాంగ్రెస్ తెలంగాణ విషయాన్ని లేవనెత్తిందని వితండవాదం వినిపించిండు. యనమల మాత్రం ఆయన తెలివినంత ప్రదర్శించిండు. రాజకీయ పార్టీల ప్రశ్నలకు హోం మంత్రి సరియైన సమాధానాలు చెప్పలేదని మోకాలుకు బట్టతలకు ముడేయ బోయిండు. చిదంబరం తమ అభిప్రాయాలు తెలుసుకోవడానికి సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పిండని, నిర్ణయించాల్సింది కేంద్ర ప్రభుత్వమే కాబట్టి, దానికి తమ అభిప్రాయం అక్కరలేదని దాటవేసిండు.

తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి ఆ పార్టీ అధినేత కెసిఆర్, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అఖిలపక్ష సమావేశానికి హాజరయింద్రు. ఇద్దరు ఒకే మాట చెప్పింద్రు. వెంటనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను మొదలు పెట్టాలని కోరింద్రు.

ఎంఐఎం నుంచి ఆ పార్టీ నాయకులు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీ హాజరయింద్రు. రాష్ట్రంల గందరగోళ పరిస్థితిని చక్కదిద్దాలని అన్నరు. ఈపార్టీ తెలంగాణ ఉద్యమానికి దూరంగ ఉంటుంది. తెలంగాణ ఏర్పడితే మతతత్వ శక్తులు బలపడతయని తమ రక్షణకు ఇబ్బందులొస్తయని భావించింది. అందుకని వాళ్లు మధ్యేమార్గంగ అభిప్రాయం చెప్పింద్రు. భారతీయ జనతాపార్టీ ప్రతినిధులుగ బండారు దత్తాత్రేయ, హరిబాబు హాజరయింద్రు. మొదటినుంచి బిజెపి తెలంగాణకు అనుకూలంగ ఉంటుంది. దీంతో పార్టీ అభిప్రాయాన్నే ఈ ఇద్దరు ప్రతినిధులు హోం మంత్రికి చెప్పింద్రు. ప్రజారాజ్యం పార్టీ ప్రతినిధులుగ ఆ పార్టీ అధ్యక్షుడు చిరంజీవి, రామచంద్రయ్య హాజరయింద్రు. ప్రజారాజ్యం పార్టీ మొదటి నుంచి కూడా తెలుగుదేశం పార్టీ లెక్కన్నే వెనక ఒకమాట, ముందొకమాట చెపుతుంది. అదీకాక ఇద్దరు ప్రతిని ధులు కూడా సీమాంధ్రోళ్లే. దాంతో తెలంగాణకు వ్యతిరేకమని సమైక్యాంధ్రకు కట్టుబడి ఉన్నమని చెప్పింద్రు.

సిపిఎం నుంచి బివి రాఘవులు, జూలకంటి రంగారెడ్డి హాజరయింద్రు. ఈ పార్టీ మొదటి నుంచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించింది. ఈ ఇద్దరు కూడా రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగ అభిప్రాయం చెప్పింద్రు. ఆంధ్ర నాయకుడు రాఘవులు సహజంగనే రాష్ట్ర విభజనను వ్యతిరేకించిండు. కాని తెలంగాణనాయకుడై ఉండి కూడా జూలకంటి రంగారెడ్డి తెలంగాణకు అను కూలంగా అభిప్రాయం చెప్పలేకపోయిండు. పైగా పార్టీ అభిప్రాయం అంటూ తెలంగాణకు వ్యతిరేకంగా ఆత్మను చంపుకొని చెప్పిండు. సిపిఐ నుంచి నారాయణ, గుండా మల్లేశ్ హాజరయింద్రు. ఈ పార్టీ మొదటి నుంచీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సమర్థిస్తున్నది. మొదట మద్దతు మాత్రమే ప్రకటించిన సిపిఐ ఆ తర్వాత తెలంగాణ ఉద్యమంల కూడా ప్రత్యక్షంగ పాల్గొన్నది. ఆంధ్రప్రాంతం వాడయినా ఆ పార్టీనాయకుడు నారాయణ స్పష్టంగ తెలం గాణ ఏర్పాటు చేయాలని కుండబద్దలు కొట్టిండు.

అన్నిపార్టీల అభిప్రాయాలను తీసుకున్న చిదంబరం, గతంల జరిగిన తెలంగాణ పోరాటాన్ని గుర్తుచేసిండు. 2009 మే నెలల జరిగిన శాసనసభ ఎన్నికలల్ల అన్ని రాజకీయపార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల తెలంగాణకు కట్టుబడి ఉన్నట్లు చెప్పినయని గుర్తు చేసిండు. 2009 డిసెంబర్ 7న ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంల అన్నిపార్టీలు తెలంగాణకు అనుకూలంగ చెప్పినయని, అందువల్లనే డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని చెప్పిండు.

అన్ని పార్టీల అభిప్రాయాలను సేకరించి కేంద్రం మళ్లా తన నిర్ణయం ప్రకటిస్తుందని అందరు అనుకున్నరు. కాని అట్లాంటి ప్రకటన ఏమీ చేయలేదు. దీంతో తెలంగాణ ప్రజలల్ల అసహనం మొదలైంది. కేంద్రం వెంటనే తెలంగాణ ప్రకటన చేయాలని ఆందోళనలు మొదలైనయ్. 2010 జనవరి 8న తెలుగు విశ్వ విద్యాలయంల అమరవీరుల సంస్మరణదినం జరిగింది. ఆ సమావేశానికి తెలంగాణ పొలిటికల్ జెఏసి చైర్మన్ కోదండరామ్ హాజరైండు. కేంద్రం తెలంగాణ అంశాన్ని నాన్చుతుందని అన్నడు. ఎవరినీ బతిలాడాల్సిన అవసరం లేదని, తెలంగాణ నేతలు ఢిల్లీకి పోవద్దని చెప్పిండు. పోరాటాలతోనే తెలంగాణ సాధ్యమయితదని చెప్పిండు. తెలంగాణ మంత్రులు ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి ఉద్యమంలకు రావాలన్నడు.

రాజీనామాల కోసం ఒత్తిడి పెరుగుతుంటె హైదరాబాద్‌కు చెందిన మంత్రులు దానం నాగేందర్, ముఖేశ్‌గౌడ్ జెఏసి మీద ఎదురుదాడికి దిగింద్రు. తమను రాజీనామా చేయమని చెప్పటానికి కోదండరామ్ ఎవరు అని ప్రశ్నించింద్రు. సహనం నశిస్తే మిగలరు అని హెచ్చరించింద్రు.

ఈ ఇద్దరు మంత్రులకు హైదరాబాద్‌ల ఉన్న సీమాంధ్ర నాయకులతో మంచి సంబంధాలున్నయ్. అందుకని మొదటి నుంచి తెలంగాణ ఉద్యమానికి దూరంగ ఉంటుంద్రు. పైగా తెలంగాణ ఉద్యమం మీద ఏమాత్రం సందు దొరి కినా నోరు పారేసుకోవడం అలవాటుచేసుకుంద్రు. అట్లనే కోదండరామ్ మీద కూడా అరిచింద్రు. అయితే ఈ ఇద్దరి ప్రవర్తనను తెలంగాణ ప్రజలు అసహ్యించు కుంద్రు. తెలంగాణ నాయకులై ఉండి ఇంత విచక్షణా రహితంగ ప్రవర్తించడం తెలంగాణ ఉద్యమకారులకు కోపం తెప్పించింది.

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఒక్కొక్కరుగా రాజీనామాలను ఉపసంహరిం చుకొని ముఖం చాటేసింద్రు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాజీనామాలు చేసి తెలంగాణ ప్రజలను నమ్మించుకుంట నాలుగు రోజులు గడిపింద్రు. తర్వాత అందరు కాంగ్రెస్ నాయకుల లెక్కనే వీళ్లు కూడా వెనకడుగు వేసింద్రు. జనవరి 12న ఇద్దరు మంత్రులు రాజీనామాలను వెనుకకు తీసుకుంద్రు.

ఈ నేపథ్యంల జనవరి 16న ఇందిరాపార్కు దగ్గర జెఏసి నిరాహార దీక్ష ప్రారంభించింది. ఈ దీక్షా సమావేశానికి తెలుగుదేశం నాయకుడు నాగం జనార్దనరెడ్డి కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి దామోదరరెడ్డి, కుందూరు జానారెడ్డి హాజరయింద్రు. తెలంగాణ రాష్ట్ర సాధనల తనవంతు కృషి చేస్తనని జానారెడ్డి ఓ మాట అన్నడు. దామోదరరెడ్డి మాత్రం రాజీనామాను వెనక్కు తీసుకునే ప్రసక్తే లేదని కరాఖండిగ

చెప్పిండు. తెలంగాణపై వెంటనే ప్రకటన చేయాలని నాగం జనార్దనరెడ్డి డిమాండు చేసిండు.

కాంగ్రెస్ నాయకులు రాజీనామాల ఆటలు ఆడుతుంటే తెలంగాణ ప్రజలల్ల అసహ్యం అసహనం పెరిగింది. వొచ్చిన తెలంగాణ వెనకకు పోయిందని మనస్తాపం చెందిండ్రు. ఉద్యమానికి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు మద్దతు ఇయ్యడం లేదని కోపం పెంచుకుండ్రు. తెలంగాణ యువకులు ముఖ్యంగ విద్యార్థులు నిరాశకు లోన య్యిండ్రు. తెలంగాణల రోజుకో బలిదానం జరిగింది. ఆ వొరుసల 2010 జనవరి 19న ఉస్మానియా విశ్వవిద్యాలయంల విద్యార్థి వేణు గోపాల్‌రెడ్డి ఆత్మహత్య చేసుకుండు. దీంతో తెలంగాణ మరోసారి భగ్గుమన్నది. జనవరి 20, 21 రొండు రోజుల బంద్‌కు జెఎసి పిలుపిచ్చింది.

జనవరి 23న నిజాం కాలేజీ గ్రౌండ్‌ల జరిగిన విద్యార్థి రణభేరికి హాజరైన బిజెపి జాతీయనాయకురాలు సుష్మాస్వరాజ్ తెలంగాణ యువకులు ఆత్మహత్యలు చేసుకోవద్దని హితవు చెప్పింది. తెలంగాణ న్యాయమైన కోరికను కేంద్రం నెరవేర్చాలని డిమాండు చేసింది.

ఢిల్లీల వారం పదిరోజులు మకాం పెట్టి కాంగ్రెస్ నాయకులను కలిసిన జానారెడ్డి, దామోదరరెడ్డి జనవరి 26న తిరిగి హైదరాబాద్ చేరుకుండ్రు. రొండు రోజుల తర్వాత విలేకరుల సమావేశంల మాట్లాడిండ్రు. ఏడాదిల తెలంగాణ ఏర్పాటు అయితదని చెప్పిండ్రు. ఆనాడు ఈ ఇద్దరితోపాటు ఎంపి సుఖేందర్‌రెడ్డి, కె.కేశవరావు ఉన్నరు. రాష్ట్రంల పరిస్థితులను అధ్యయనం చేయడానికి త్వరలో ఒక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు అదేరోజు చిదంబరం ప్రకటించిండు.

తెలంగాణ వాదాన్ని మొదట్ల బలంగా వినిపించిన కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు మధుయాష్కీ దాగుడు మూతలు మొదలు పెట్టిండు. అప్పుడప్పుడు మొకం చూపించిండు. జనవరి 29న ఆయన నియోజకవర్గం అయిన నిజామాబాద్ లోని తెలంగాణ యూనివర్సిటీల విద్యార్థుల నిరాహారదీక్షకు సంఘీభావం తెలుప డానికి పోయిండు. ఆ రోజు యాష్కీ తెలంగాణ నిరసనలు ఎదుర్కోవలసి వొచ్చింది. మధు యాష్కీ గోబ్యాక్ అంటూ విద్యార్థులు నినాదాలు చేసిండ్రు. నిరసనల మధ్యన ఆయన అక్కన్నుంచి జారుకున్నడు.

2010 జనవరి 30న 129 మంది శాసనసభ్యుల రాజీనామాలను స్పీకర్ కిరణ్‌కుమార్‌రెడ్డి తిరస్కరించిండు. భావోద్వేగాల నేపథ్యంల చేసిన రాజీనా మాలని తిరస్కరించినట్లు చెప్పిండు. ఒక్కొక్క కాంగ్రెస్ ఎమ్మెల్యేను కాంగ్రెస్ దారికి తెచ్చుకుంది.

జెఎసిల కాంగ్రెస్ ఉంటే తమ ప్రభుత్వానికే ఇబ్బంది వొస్తుందని అధిష్టానం భావించింది. అందుకని కాంగ్రెస్ నాయకులు జెఎసి నుంచి తప్పు కోవాలని జనవరి 31న కాంగ్రెస్ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి వీరప్ప మొయిలి హెచ్చరించిండు.

ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి టిఆర్‌ఎస్ ఎప్పటికప్పుడు నిరసన కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించింది. కెసిఆర్ ఉద్యమస్ఫూర్తిని రగిలించిండు. జనవరి 31న హైదరాబాద్‌ల ముస్లిం సంస్థల ఆధ్వర్యంల సమావేశం జరిగింది. దానికి కెసిఆర్ హాజరయి కాంగ్రెస్ నాయకుల వ్యవహారశైలి మీద నిప్పులు చెరిగిండు.

కోదండరామ్ ఎంతో ఓపికతో తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోయిండు. అన్ని శాఖల ఉద్యోగులు జెఎసిలు ఏర్పాటు చేసుకున్నయ్. ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు ఎవరికి వారే ఎక్కడికక్కడ ఉద్యమం చేసింద్రు. ప్రతి గ్రామంల, పట్టణంల దీక్షాశిబిరాలు వెలసినయ్. తెలంగాణ సాధించేవరకు ఉద్యమం ఆపేది లేదని ప్రకటించింద్రు. ఫిబ్రవరి 7 వరకు కేంద్రం ప్రకటన చేయాలని జెఎసి గడువు విధించింది. దీంతో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపై వొత్తిడి పెరిగింది. ప్రజా ప్రతినిధులపై వొత్తిడి పెరిగింది. గడువు సమీపిస్తుండటంతో తెలంగాణ అంతటా ఉత్కంఠ నెలకొన్నది.

# కేంద్రం శ్రీకృష్ణ నాటకం

కేంద్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణను ప్రకటించాలన్న డిమాండుతో తెలంగాణల మొదలైన నిరాహార దీక్షలు 50 రోజులకు చేరినయ్. అఖిలపక్ష సమావేశంతో తెలంగాణల సాధారణ పరిస్థితులు నెలకొంటయని కేంద్రం భావించింది. కాని తెలంగాణల నిరసనలు తీవ్రమైనయ్. రాష్ట్రంల ఏర్పడిన పరిస్థితులు తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా లేవని భావించడంతో సమస్యను సాగదీయడానికి పూనుకుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కేంద్రం ప్రయత్నం చేస్తనే ఉంది అని నమ్మించి తెలంగాణ ప్రజలను శాంతింప జేయాలనుకుంది.

ఈ నేపథ్యంల 2010 ఫిబ్రవరి 3న కేంద్రం శ్రీకృష్ణ కమిటీని ప్రకటించింది. ఈ కమిటీ కేవలం రాష్ట్ర పరిస్థితులను అధ్యయనం చేయటానికి, సాధారణ పరిస్థితులు నెలకొల్పటానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వటానికని ప్రకటించింది. ఈ కమిటీల మొత్తం ఐదుగురు సభ్యులు ఉంటరని తెలిపింది. జస్టిస్ బేలూరు నారాయణస్వామి శ్రీకృష్ణ అధ్యక్షుడు. వినోద్‌కుమార్ దుగ్గల్ సభ్యకార్యదర్శి. రవీందర్ కౌర్, రణ్‌బీర్‌సింగ్, అబూసలేష్ షరీఫ్ సభ్యులు.

కమిటీ అధ్యక్షుడు శ్రీకృష్ణ కర్ణాటకల పుట్టి ముంబైల స్థిరపడ్డ మాజీ న్యాయమూర్తి. దుగ్గల్ మాజీ ఐఎఎస్ అధికారి. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగ పనిచేసిండు. రణ్‌బీర్ సింగ్ హైదరాబాద్‌లోని జాతీయ న్యాయవిశ్వవిద్యాలయం (నల్సార్) వ్యవస్థాపక డైరెక్టర్. మొదటి వైస్ చాన్స్‌లర్. ఢిల్లీ జాతీయ లా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా పనిచేస్తున్నడు. అబూసలేష్ షరీఫ్ ఆర్థికవేత్త. రవీందర్ కౌర్ ఢిల్లీ ఐఐటిల హ్యూమానిటీస్, సోషల్‌సైన్స్‌ల ప్రొఫెసర్.

కేంద్రం ప్రకటించిన శ్రీకృష్ణకమిటీని కాలయాపన కమిటీగనే టిఆర్ఎస్, జెఎసి భావించినయ్. కమిటీ మీద తమకు నమ్మకం లేదని ప్రకటించినయ్. అసంతృప్తులు, అపనమ్మకాల మధ్య వొచ్చిన కమిటీ ఒక సంవత్సరం లోపే నివేదిక అంద

జేస్తుందని కేంద్రం ప్రకటించింది. అయితే కమిటీకి గడువు ప్రకటించడం తెలంగాణ వాదులకు కొద్దిగ సంతృప్తి కలిగించింది.

కమిటీని కేంద్రం ప్రకటించిన మూడురోజులకు ఫిబ్రవరి 6న తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కె.కేశవరావు నివాసంల సమావేశమైంద్రు. ఉద్యమకారులను సంతృప్తి పరచడానికే అన్నట్లున్న శ్రీకృష్ణ కమిటీని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కమిటీగా ప్రకటించాలని డిమాండు చేసింద్రు.

తెల్లారి నిజాం కాలేజీల జమాతె ఇస్లామీ హింద్ నిర్వహించిన తెలంగాణ గర్జనకు టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ హాజరయ్యిండు. కమిటీలు గిమిటీలు అని కేంద్రం నాన్చాలని చూస్తే భూకంపం సృష్టిస్తమనీ, తెలంగాణ ప్రజల సహనాన్ని పరీక్షకు పెట్టొద్దనీ కేంద్రాన్ని హెచ్చరించిండు.

ఎట్టకేలకు ఫిబ్రవరి 12న శ్రీకృష్ణ కమిటీ రాష్ట్రంల పర్యటన మొదలు పెట్టింది. తెల్లారి న్యూ ఎమ్మెల్యే క్వార్టర్ల కాంగ్రెస్ నేతల సమావేశం అయ్యింది. ఈ సమావేశానికి తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యింద్రు.

ఎట్టి పరిస్థితిలోను రాజీనామా వెనక్కి తీసుకోమని దామోదరరెడ్డి, ముత్యం రెడ్డి ప్రకటించింద్రు. రాజీనామా చేసిన దగ్గర నుంచి దామోదర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంల చురుగ్గ పాల్గొన్నడు. గొంతుకూడా పెంచిండు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ముఖ్యంగ జానారెడ్డి రాజీనామా ఉపసంహరించుకోవడం మ్యాచ్‌ఫిక్సింగ్ అని దామో దర్‌రెడ్డి నిప్పులు చెరిగిండు. దీంతో జానారెడ్డి ముఖం మాడ్చుకుండు. అదేరోజు ఉస్మానియా యూనివర్సిటీల నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేసింద్రు.

రాజీనామాలను తిరస్కరించిన నేపథ్యంల దామోదర్‌రెడ్డి, ముత్యంరెడ్డి అదే రోజు మళ్లా రాజీనామా చేసింద్రు. పదిమంది టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా స్పీకర్‌కు రాజీనామాలు అందించింద్రు. టిడిపి శాసనసభ్యుడు చెన్నమనేని రమేశ్ రాజీనామాను అంతకు ముందే 2009 డిసెంబర్ 13న స్పీకర్ ఆమోదించిండు.

కాంగ్రెస్ నాయకులు రాజీనామాలకు ముందుకు రాకపోవడంతో తెలంగాణ వాదులు ఆ నాయకుల ఇండ్లకుపోయి నిరసన తెలిపింద్రు. ఫిబ్రవరి 14న జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇండ్లకు పిడకలుకొట్టి నిరసన తెలిపింద్రు. అదేరోజు ఉస్మానియాల లాఠీచార్జిపై కెసిఆర్ మండిపడ్డడు. యూనివర్సిటీల పోలీస్‌రాజ్యం నడుస్తున్నదని ఘాటుగ విమర్శించిండు.

2010 ఫిబ్రవరి 15న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనయ్. తెలంగాణ

మంత్రులు రాజీనామాల సంగతి పట్టించుకోకుండా ఉండటంతో తెలంగాణ వాదులు వాళ్ల ఇండ్లకు పిడకలు కొట్టి నిరసన తెలిపింద్రు. రాజీనామా చేయని మంత్రులపై ఒత్తిడి పెరిగింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కూడా ఈ కాక తగిలింది. దీంతో కోదండరామ్‌పై మండిపడ్డడు. ఆయన ఏమన్న హిట్లరా, ఆయన వాడుతున్న భాష బాగలేదు అని ఒంటికాలు మీద లేచిండు.

రాజీనామాలకు టిఆర్ఎస్, జెఎసి ఒత్తిడి తెస్తుండటంతో మంత్రులు ఉక్కిరి బిక్కిరి అయింద్రు. చివరికి జెఎసి నుంచి కాంగ్రెస్ తప్పుకుంటున్నట్టు ఫిబ్రవరి 19న ప్రకటించింద్రు. తెలంగాణ ఉద్యమం నుంచి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తప్పుకుంద్రు.

రాజీనామాలు చేయకుంట తప్పించుకొని తిరుగుతున్న కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు జెఎసి నుంచి కూడ తప్పుకోవడంతో తెలంగాణవాదులల్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఉస్మానియా విద్యార్థి జెఎసి ఫిబ్రవరి 20న అసెంబ్లీ ముట్టడి చేసింది. పోలీసుల అణచివేత, లాఠీచార్జీలు, అరెస్టులు యథావిధిగా అయినయ్. ఢిల్లీల కూడా పార్లమెంట్ ముట్టడికి తెలంగాణ వాదులు ప్రయత్నం చేసింద్రు. పోలీసులు తెలంగాణ వాదులను అరెస్టు చేసింద్రు.

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు రాజీనామాలతో నాటకాలు ఆడితే తెలంగాణ టిడిపి నాయకులు మోత్కుపల్లి నర్సింహులు, ఎర్రబెల్లి దయాకర్‌రావు మరింత రక్తి కట్టించింద్రు. తెలంగాణ వ్యతిరేకి చంద్రబాబును వెనకేసుకొచ్చి, కాంగ్రెస్, టిఆర్ఎస్ మీద పండ్లు పటపట కొరికింద్రు. జెఎసిల పట్టుమని పదిరోజులు కాకుండనే చంద్రబాబు హుకుంతో జారుకున్న తెలంగాణ టిడిపి నాయకులు జెఎసి మీద కూడా విమర్శలు ఎక్కుపెట్టింద్రు. అయితే పచ్చి సమైక్యవాది, తెలంగాణ ద్రోహి అయిన చంద్రబాబుకు తొత్తుల లెక్క మారిన తెలంగాణ టిడిపి నాయకులను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంద్రు.

తెలంగాణల అడుగడుగునా నిరసనలు జరుగుతుంటె ఎప్పుడెప్పుడు ముఖ్యమంత్రి సీట్ల కూచుందునా అని ఎదురుచూస్తున్న వైఎస్ జగన్‌మోహనరెడ్డి వరంగల్ జిల్లా మహబూబాబాద్‌ల ఓదార్పుయాత్ర పెట్టుకుండు. వైఎస్ పోయినంక ఆయన కోసం గుండెలు పలిగి చచ్చినోళ్లు, ఆయన చావును తట్టుకోలేక ఆత్మ హత్యలు చేసుకున్నోళ్ల కుటుంబాలను ఓదార్చాలనేది ఆయన బయటికి చెప్పే మాటలు. అసలు వైఎస్ పేరుతో ప్రచారమయ్యే ఆత్మహత్యలు అసత్యాలని, పదవికోసం వైఎస్ జగన్ ఆడుతున్న నాటకంలో భాగమని పత్రికలు గగ్గోలు పెట్టినయ్. ఈ యాత్రల చిన్న

పెద్దలేకుంట జగన్ చెంపలు పిసుకడాన్ని కూడా జనం అసహ్యించుకుండ్రు. అయినా జగన్ అధికార దాహంతో అట్లనే తిరిగిండు.

తెలంగాణకు బద్ధవ్యతిరేకి అయిన వైఎస్ జగన్‌ను తెలంగాణల కాలు పెట్టనియ్యమని తెలంగాణవాదులు హెచ్చరించిండ్రు. అయినా కొండా సురేఖ మద్ద తుతో హైదరాబాద్ నుంచి మానుకోటకు జగన్ రైలుల బయలుదేరిండు. అడుగడుగున నిరసనలు ఎదురైనయ్. నల్లగొండ జిల్లా భువనగిరి రైల్వేస్టేషన్‌లనే జగన్‌కు చెమటలు పట్టినయ్. అయినా యాత్రకు సిద్ధమైండు. తీవ్ర ఉద్రిక్తత ఏర్పడ్డది. అయ్యాల జగన్‌కు చుక్కలు చూపించిండ్రు తెలంగాణవాదులు. పరిస్థితిని గమనించి రైలును మధ్యలనే ఆపి జగన్‌ను అరెస్టు చేసిండ్రు పోలీసులు.

మానుకోట రైల్వేస్టేషన్‌కు తెలంగాణ వాదులు పెద్ద ఎత్తున తరలి వొచ్చిండ్రు. జగన్‌కు మద్దతు ఇస్తున్న సురేఖ దంపతుల మీద తెలంగాణవాదులు రాళ్లు వేసిండ్రు. ప్రాణాలు అరచేతిల పట్టుకొని కొండా సురేఖ, మురళి రైల్వేస్టేషన్‌ల దాచుకుండ్రు. ఈ సందర్భంల కొండ మురళి తెలంగాణ వాదులపై కాల్పులు జరిపిండు. అయినా తెలంగాణవాదులు తగ్గలేదు. నిరసనలతో మానుకోట దద్దరిల్లింది. పోలీసులు తెలం గాణ వాదులపై విచక్షణా రహితంగా లాఠీచార్జీ చేసిండ్రు.

తెలంగాణవాదుల నిరసనల నేపథ్యంల వాస్తవానికి జగన్ ఓదార్పు యాత్రకు ప్రభుత్వం అనుమతి ఇయ్యకూడదు. కాని సమైక్యవాది అయిన ఆంధ్రా ముఖ్యమంత్రి రోషయ్య అనుమతిచ్చిండు. తెలంగాణవాదులు అడ్డుకుంటే తనను వ్యతిరేకించే జగన్ యాత్ర ఆగిపోతది. దీంతో జగన్‌కు జనంల బలం లేదని ప్రచారమైతది. ఒక వేళ జగన్ యాత్ర విజయవంతమైతే తెలంగాణవాదం లేదని చెప్పుకోవడానికి అవకాశ ముంటది. ఈ ఆలోచనతో సర్కారు అనుమతి ఇచ్చింది. ముఖ్యమంత్రి చోద్యం చూసిండు. మహబూబాబాద్ రణరంగమైంది.

# శ్రీకృష్ణ కమిటీ కొండంత రాగం

కేంద్ర ప్రభుత్వం ముందుగ తెలంగాణకు అనుకూల ప్రకటన చేసి మళ్లా నాలిక తిప్పటం, శ్రీకృష్ణ కమిటీ వేసి సాగతీసే ప్రయత్నం చేయడం తెలంగాణ వాదులకు ఆగ్రహం తెప్పించింది. ఫలితంగ తెలంగాణ ప్రజా ప్రతిని ధులు రాజీనా మాలు చేసింద్రు. నాలుగురోజులు నాటకం నడిపి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులంతా రాజీనామాలను వెనక్కు తీసుకుంద్రు. టిఆర్ఎస్‌కు చెందిన పదిమంది శాసనసభ్యులు మాత్రం రాజీనామాలు ఆమోదింపజేసుకుంద్రు. వీరితోపాటు బిజెపి ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ కూడా రాజీనామా ఆమోదింపజేసుకుండు. కాని బిజేపి రాష్ట్ర అధ్య క్షుడు, శాసన సభ్యుడు అయిన కిషన్‌రెడ్డి రాజీనామా చేయకుండా తప్పించుకుండు. మరొక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ శాసనసభ్యత్వానికి, తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసిండు. చెన్నమనేని ఆ తర్వాత టిఆర్ఎస్‌ల చేరిండు.

రాజీనామాల నేపథ్యంల ఉపఎన్నిక లొచ్చినయ్. రాజీనామా చేసిన స్థానంల సిటింగ్ శాసనసభ్యులే మళ్లా పోటీకి దిగింద్రు. నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గం నుంచి రాజీనామా చేసిన బిజెపి ఎమ్మెల్యే యెండెల లక్ష్మీనారాయణ కూడా మల్ల పోటీ చేసిండు. ఈ నియోజకవర్గం నుంచి పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ కాంగ్రెస్ నుంచి పోటీకి దిగిండు.

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించిన తర్వాత అనుకోకుండ రోశయ్య ముఖ్య మంత్రి అయిండు. ఆయన తాత్కాలిక ముఖ్యమంత్రే అని జగన్ వర్గం ప్రచారం చేసింది. కాంగ్రెస్ అధిష్టానం చెప్పినా జగన్ ఓదార్పుయాత్రతో పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డడు. పైగా సొంతపార్టీ పెట్టబోతున్నట్లు 2010 ఫిబ్రవరి 6న ప్రకటించిండు. దాంతో జగన్ దూరం కాబోతున్నడన్న విషయం కాంగ్రెస్‌కు అర్థమైంది. రోశయ్యను ముఖ్యమంత్రి స్థానం నుంచి దించి మరొకరికి ఆ బాధ్యతలు అప్పగిస్తరని ప్రచారం

మొదలయింది. ఎప్పటి నుంచో ముఖ్యమంత్రి పదవికోసం ఎదురుచూస్తున్న డి. శ్రీనివాస్ ఈసారి తనను ఆ పదవి వరిస్తుందని ఆశపడ్డడు. రోశయ్య నాటికే ముఖ్యమంత్రి పదవి వొస్తదని అనుకున్నా అప్పటికి ఆయన ఎమ్మెల్యేగ పోటీచేసి ఓడిపోయి ఉన్నడు. అనుకోకుండ వొచ్చిన ఉపఎన్నికల్ల గెలిచి తన అదృష్టాన్ని పరీక్షించు కోవడానికి సిద్ధమైండు. దానికి అనుకూలంగనే తెలంగాణ ఉద్యమానికి మద్దతుగ రాజీనామా చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చెవులుకుట్టి రాజీనామాలను ఉపసంహరింపచేసిండు. తెలంగాణ ఉద్యమం ఎటుపోయినా ఫరవాలేదు తనకు ముఖ్యమంత్రి పదవి దక్కాలన్న లక్ష్యంతో డిఎస్ పావులు కదిపిండు.

ఆ క్రమంల ఉపఎన్నికల బరిలకు దిగిండు. ఎన్నికల ప్రచారంల 2010 జూలై 21న టిఆర్ఎస్ మీద విమర్శలకు దిగిండు. తను గెలిస్తే టిఆర్ఎస్ దుకాణం బంద్ అయితదని వాగిండు. బంగారు పల్లెంల తెలంగాణ తెచ్చి ఇస్త అని నమ్మించ బోయిండు. తెలంగాణవాదానికి సంకేతంగ జరిగే ఎన్నికలల్ల టిఆర్ఎస్‌ను ఓడగొట్టి, తను గెలిచి ముఖ్యమంత్రి కావాలనేది డిఎస్ లక్ష్యం. ఎన్నికల ప్రచారంల మాట్లాడు కుంట ఆ మాట చెప్పిండు కూడ. తనను ఈ ఎన్నికల్ల గెలిపిస్తే పెద్దపదవి వస్తదని తన మనసుల మాట అన్నడు. తనను పెద్దపదవిల చూడాలని ప్రజలు కోరుకుంటు న్నరని కూడ పేకిండు.

కాని డిఎస్ మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోలేదు. ఆయనను తెలంగాణ ద్రోహిగనే చూసింద్రు. టిఆర్ఎస్‌ను ఓడించటమంటే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకోవడమే అని తెలుసుకున్నరు. ఫలితంగ డిఎస్‌ను వొరసగా రొండో సారి ఓడగొట్టింద్రు. 2010 జూలై 31న ప్రకటించిన ఎన్నికల ఫలితాలల్ల 11 మంది టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఒక బిజెపి ఎమ్మెల్యే గెలిచింద్రు.

ఎన్నికల ఫలితాల రోజు ఇషాన్‌రెడ్డి ఆత్మహత్య చేసుకుండు. ఇషాన్‌రెడ్డి ఒక లెటర్ కూడ రాసిండు. డిఎస్ ఓడిపోవాలని తనను తాను మైసమ్మకు బలి ఇచ్చుకుంటున్నట్లు ఉత్తరంల రాసిండు. తెలంగాణ ప్రజలు ఎంత బలంగ తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకుంటున్నరో ఇషాన్‌రెడ్డి లేఖ చాటిచెప్పింది.

ఉపఎన్నికలు అయిపోయినా వేడి చల్లారలేదు. శ్రీకృష్ణ కమిటీ నివేదిక తెలంగాణకు అనుకూలంగ వొచ్చేవరకు పోరాటం ఆపేది లేదని జెఎసి ప్రకటిం చింది. అందుకు అనుకూలంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది.

ఎన్నికల్ల పోటీచేసి టిఆర్ఎస్ విజయం సాధించడంతో కెసిఆర్ పట్టు పెరిగింది. ఇది తెలంగాణ ప్రజాసంఘాల నాయకులకు మింగుడు పడలేదు. కెసిఆర్

మీద విమర్శలకు దిగింఁడ్రు. కెసిఆర్ పదవులకోసం పాకులాడుతుండని ఏడుపుగొట్టు మాటలన్నరు. తెలంగాణ ఉద్యమ సారథి కెసిఆర్‌ను విమర్శించే వారిని ఆంధ్రా మీడియా ఎగేసింది. అట్ల వీళ్లంత టివి చానళ్లలో కనిపించడం మొదలైంది. దీంతో తామే గొప్ప నాయకులమని భ్రమపడ్డరు. కెసిఆర్‌ను విమర్శించి ఉద్యమానికి తాము నాయకులు కావాలని పగటికలలు కన్నరు.

అట్లాంటి సమయాన 2010 అక్టోబర్ 9న గద్దర్ నాయకత్వాన తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఏర్పడ్డది. అనేక ప్రజాసంఘాలు కలిసి ఈ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసినయ్. కాని ఏకాభిప్రాయం కుదరలేదు. ఫ్రంట్ ఏర్పడిన రోజే గొడవపడ్డరు. మధ్యలనే సభ ముగించి ఎటోళ్లు అటు పోయింఁడ్రు. తెల్లారి గద్దర్ మాట్లాడుకుంట ఉద్యమపార్టీలు ఎన్నికల్ల పాల్గొనొద్దని అన్నడు. విమల మాత్రం ప్రజాస్వామ్య పద్ధతిలనే తెలంగాణ సాధ్యమని, ఎన్నికల్ల పాల్గొనాల్సిందేనని ప్రకటించింది. ఇద్దరి మధ్యన విభేదాలు వొచ్చినయ్. 2010 అక్టోబర్ 21న విమల ఐక్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ వామపక్ష నాయకులు ఉద్యమం కంటే కూడా టిఆర్ఎస్‌ను, కెసిఆర్‌ను విమర్శించ చడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింఁడ్రు.

క్షేత్రస్థాయిల పర్యటించిన శ్రీకృష్ణ కమిటీ రాష్ట్రంల తెలంగాణ, రాయల సీమ, ఆంధ్రప్రాంతంల తిరిగింది. ప్రజల అభిప్రాయాలను తీసుకుంది. ఈ సమయంల సీమాంధ్రనేతలు కమిటీ సభ్యులను లొంగతీసుకోవటానికి నానా ప్రయత్నాలు చేసింఁడ్రు. తెలంగాణవాదులు ఈ కుట్రలను ఎండగడుతున్న సమయం లనే శ్రీకృష్ణ కమిటీ సభ్యకార్యదర్శి దుగ్గల్ ఆంధ్రాకాంగ్రెస్ నాయకుడు సుబ్బి రామిరెడ్డి ఇంటికి విందుకు పోయిండు. ఆ వార్త పత్రికల్ల కూడా వొచ్చింది. నిబద్ధతతో వ్యవహరించాల్సిన కమిటీ సభ్యులు ఆంధ్రప్రాంతం నాయకులతో చనువుగ తిరగడం తెలంగాణవాదులకు మింగుడు పడలేదు. దుగ్గల్ అవినీతికి పాల్పడుతున్నడని, సీమాంధ్రనాయకుల దగ్గర ముడుపులు తీసుకుండని తెలంగాణ నాయకులు తిట్టింఁడ్రు. అట్లాంటి అనైతికమైన మనిషి శ్రీకృష్ణకమిటీల సభ్యుడుగ ఉండటానికి అర్హుడు కాడని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండు చేసింఁడ్రు.

ఈ లోపుల రోషయ్య ప్రభుత్వం మళ్లా ఎస్ఐ రాతపరీక్షలు నిర్వహించ డానికి పూనుకుంది. సర్కారు ఈ చర్య వల్ల పుండుమీద కారం చల్లినట్లయింది. ఫ్రీజోన్ సమస్య తేలకుండనే ప్రభుత్వం ఎస్ఐల రాతపరీక్ష నిర్వహించాలని అనుకోవడం మళ్లా ఆంధ్రా దోపిడీకి ప్రయత్నించడమేనని తెలంగాణ వాదులు భగ్గుమన్నరు. ఎక్కడికక్కడ నిరసన పెల్లుబికింది. 2010 నవంబర్ 19న ఉస్మానియా యూనివ

ర్సిటీల విద్యార్థుల ఆందోళన పతాకస్థాయికి చేరింది. విద్యార్థుల నిరసనలు, పోలీసుల లాఠీచార్జి రణరంగం తలపించింది. పరిస్థితికి తలొగ్గిన ప్రభుత్వం గత్యంతరం లేక ఎస్‌ఐ రాత పరీక్షలను వాయిదా వేసింది.

కేంద్రం ప్రకటించిన ప్రకారం శ్రీకృష్ణ కమిటీ 2010 చివరి నాటికి నివేదిక వెలువరించాలె. రాష్ట్రంల పరిస్థితి మాత్రం అనుకూలంగ లేదు. వొయసుల పెద్దోడైన రోషయ్యకు రాష్ట్ర పరిస్థితి తలనొప్పిగనే తయారైంది. ఒకపక్క ఉద్యమాలు, మరోపక్క జగన్... రోషయ్యకు నిద్ర లేకుండ పోయింది. ఈ నేపథ్యంల రోషయ్యను మార్చాలని కేంద్రం భావించింది.

స్పీకర్ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని కేంద్రం 2010 నవంబర్ 24న ముఖ్య మంత్రిగ నియమించింది. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో జగన్ ఆశలకు నూకలు చెల్లినయ్. ఇక కాంగ్రెస్ అధిష్ఠానం తనకు ముఖ్యమంత్రి పదవి ఇయ్యదని ఆయనకు అర్థమైంది. ముఖ్యమంత్రి పదవి ఇయ్యని పార్టీల ఇంక తను ఉండడం దండుగ అనుకొని 2010 నవంబర్ 29న కాంగ్రెస్‌కు రాజీనామా చేసిండు.

ముఖ్యమంత్రి మారినా ఉద్యమంల మార్పురాలేదు. 2010 డిసెంబర్ 16న ఓరుగల్లు గర్జన పేరుతో వరంగల్లుల బహిరంగసభ జరిగింది. శ్రీకృష్ణ కమిటీ వెంటనే తెలంగాణకు అనుకూలంగ నివేదిక ఇవ్వాలని టిఆర్‌ఎస్ డిమాండు చేసింది. నివేదిక వొచ్చేవరకు కేంద్రం మీద నిరంతరంగా ఒత్తిడి పెంచాలని నిర్ణయించుకొని, నిరసన కార్యక్రమాలు చేపట్టింద్రు.

అప్పటి దాంక తెలంగాణ ఉద్యమంలకు చుట్టపుచూపుగ తొంగిచూసే తెలంగాణ పార్లమెంటు సభ్యులు ఇక చురుగ్గ పాల్గొనాలని నిర్ణయించుకుంద్రు. శ్రీకృష్ణ కమిటీ నివేదిక తెలంగాణకు అనుకూలంగ వొస్తదని, కేంద్రం తెలంగాణ ఇస్తదని ప్రకటించడం మొదలు పెట్టింద్రు. తాము ఊకుంటె ఉద్యమ క్రెడిట్ కెసిఆర్‌కు టిఆర్‌ఎస్‌కు దక్కుతదని, కాబట్టి తాము ఉద్యమంలకు రావాలని భావించింద్రు. తద్వారా తాము ఉద్యమ నాయకులుగ గుర్తింపు పొందాలని చూసింద్రు. తెలంగాణ ఇచ్చేది మేమే తెచ్చేది మేమే అని ప్రకటించింద్రు. తెలంగాణ ఇచ్చేది కాంగ్రెసే తెచ్చేది కాంగ్రెసే. తేకుంటే చచ్చేది కాంగ్రెసే అని టిఆర్‌ఎస్ నాయకులు ఎదురు దాడికి దిగింద్రు.

ఈ సమయంల ఉద్యమం మీద పట్టు సాధించటానికి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు 2010 డిసెంబర్ 26న గన్‌పార్క్ వద్ద దీక్షకు దిగింద్రు. ఉద్యమ సమయంల తెలంగాణ విద్యార్థుల మీద పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండు చేసింద్రు. దీంతో తెలంగాణ విద్యార్థులను మచ్చిక చేసుకోవచ్చని భావించింద్రు.

ఈ నేపథ్యంల 2010 డిసెంబర్ 30న శ్రీకృష్ణ కమిటీ తన నివేదికను కేంద్ర హోంశాఖకు అందించింది.

శ్రీకృష్ణ కమిటీ ప్రతిపాదనలు:

శ్రీకృష్ణ కమిటీ నివేదికల 505 పేజీలు 9 చాప్టర్లు ఉన్నయ్. నివేదిక ముగింపు భాగంల ఈ కమిటీ ఆరు ప్రతిపాదనలు చేసింది.

1 ఉద్యమాన్ని సాధారణ శాంతిభద్రతల పరిస్థితిగా పరిగణించి కేంద్రం నుంచి సాధారణ మద్దతు తీసుకుంటూ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చూసుకోవడం.

2 తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతం.

3 హైదరాబాద్ రాజధానిగా రాయలసీమ, తెలంగాణలతో కలిపి రాయల తెలంగాణ ఏర్పాటు.

4 ప్రత్యేక తెలంగాణ, పెద్ద కేంద్రపాలిత ప్రాంతం ఏర్పాటు. గుంటూరు, కర్నూలు, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని మండలాలను కలుపుతూ హైదరాబాద్‌ను పెద్ద కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడం.

5 హైదరాబాద్ రాజధానిగా తెలంగాణ రాష్ట్ర ప్రతిపత్తి.

6 ప్రధాన సమస్యల పరిష్కారానికి హామీ ఇస్తూ తెలంగాణ ప్రాంతానికి రాజ్యాంగబద్ధ రక్షణను కల్పించడం. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచడం.

శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదిక తెలంగాణ వాదులను సంతృప్తి పరచలేదు. నివేదికలోని అంశాలు పాము చావకుండా, కట్టె విరగకుండా అనే పద్ధతిల ఉన్నయని విమర్శలు గుప్పించిండ్రు. ఈ కమిటీ ఆరు సూచనలు చేసింది. ఈ తలతిక్క సూచనలు తెలంగాణ వాదులకు ఆగ్రహం తెప్పించింది. ఉద్యమాన్ని శాంతిభద్రతల సమస్యగ పరిగణించి రాష్ట్ర ప్రభుత్వం చూసుకోవాలని, అంటే– పోలీసులను పెట్టి అణచివేయాలని. రెండో అంశం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలెకాని, హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగ చేయాలని. మూడో అంశంగ విచిత్రంగ ఎవరూ డిమాండు చేయని అంశాన్ని సూచించింది. అది– రాయల తెలంగాణ ఏర్పాటు చేయాలని. నాలుగో అంశంగా గుండెను వేరుచేసి తెలంగాణ ఇయ్యాలని. నల్లగొండ, మహబూబ్‌నగర్, గుంటూరు, కర్నూలు జిల్లాలలోని కొన్ని భాగాలను కలిపి పెద్ద కేంద్రపాలిత ప్రాంతంగ

ఏర్పాటు చేయాలని. అయిదో అంశంగ హైదరాబాద్ రాజధానిగ తెలంగాణ ప్రజలు కోరుతున్న పదిజిల్లాల తెలంగాణ. ఇక ఆరో అంశం రాష్ట్రాన్ని ఉన్నది ఉన్నట్టు ఉంచడం. శ్రీకృష్ణ కమిటీ ఈ నివేదికకు తలాతోకా లేకుండా పోయింది. తెలంగాణ ప్రజలకు మరింత కోపం తెప్పించింది.

మరొక విచిత్రమేమంటే రహస్యంగ ఉంచిన 8వ అధ్యాయంల ఈ కమిటీ కుట్రపూరిత సలహాలు ఇచ్చింది. ఉద్యమాన్ని ఎట్ల అణచవచ్చునో చెప్పింది. ఎంతో ఊహించుకున్న శ్రీకృష్ణ కమిటీ ఇట్లాంటి నికృష్ట నివేదిక ఇచ్చింది. తెలంగాణవాదులతో ఛీ కృష్ణకమిటీ అనిపించుకుంది. ఈ నివేదికతో తెలంగాణ ఉద్యమానికి మరింత ఆజ్యం పోసినట్లయింది.

# ఉద్యమంలకు ఉద్యోగులు

శ్రీకృష్ణ కమిటీ అటుఇటుగాని నివేదికతోటి తెలంగాణ ఉడికిపోయింది. అందరు అనుకున్నట్లుగనే కేంద్రం సాగతీయటానికే కమిటీ పనికిమాలిన నివేదిక ఇచ్చిందని తెలంగాణవాదులు రగిలిపోయిండ్రు. కేంద్రం మీద వొత్తిడి పెంచడానికి ఉద్యోగులను కూడా ఉద్యమంలకు దించాలని కెసిఆర్ భావించిండు.

అప్పటికే ఏ సంఘానికి ఆ సంఘం విడివిడిగ ఉద్యమంల పాల్గొంటున్న ఉద్యోగులు ఒక గొడుగు కింది కొచ్చిండ్రు. తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్వామిగౌడ్ అధ్యక్షునిగ, దేవీప్రసాద్ కార్యదర్శిగ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పడ్డది. ఇక ఉద్యోగులు ఉద్యమంల చురుకుగా పాల్గొన్నరు.

2011 ఫిబ్రవరి 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయిన నేపథ్యంల మూడు లక్షల మంది తెలంగాణ ఉద్యోగులు సహాయ నిరాకరణకు దిగిండ్రు. అసెంబ్లీల తెలంగాణ బిల్లు పెట్టాలని గల్లీ నుంచి ఢిల్లీ దాంక నిరసన కార్యక్రమాలతో డిమాండు చేసిండ్రు. తెలంగాణ ఉద్యోగులకు రాజకీయ జెఎసి, టిఆర్ఎస్ మద్దతి చ్చినయ్. ఫిబ్రవరి 21న చలో అసెంబ్లీకి పిలుపు నిచ్చిండ్రు. అసెంబ్లీ, రాజభవన్ ముట్టడికి ప్రయత్నం చేసిండ్రు. ఆ రోజు హైదరాబాద్ రణరంగమైంది. అరెస్టులు, లాఠీచార్జీలు ఎప్పటిలెక్కన్నే జరిగినయ్.

కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం మరింత రాక్షసంగ ప్రవర్తించింది. ఆ రోజు జరిగిన పోలీస్ దాష్టీకానికి నిరసనగా రొండురోజుల బంద్‌కు పిలుపునిచ్చిండ్రు. ఆ సమయంల పార్లమెంటు సమావేశాలు కూడ నడుస్తున్నయ్. ఫిబ్రవరి 23న పార్ల మెంటుల టిఆర్ఎస్ పార్లమెంటు సభ్యులు కెసిఆర్, విజయశాంతి స్పీకర్ పోడియం దగ్గర నిరసనకు దిగిండ్రు. తెలంగాణబిల్లును పార్లమెంటుల ప్రవేశ పెట్టాలని డిమాండు చేసిండ్రు. టిఆర్ఎస్ నిరసనకు బిజెపి ఫ్లోర్ లీడర్ సుష్మాస్వరాజ్ మద్దతు తెలిపింది.

తెలంగాణల మొదలైన ఉద్యోగుల సహాయ నిరాకరణ ప్రభుత్వానికి ఊపిరాడ కుంట చేసింది. అనేక కుట్రలను దాటుకొని ఉద్యోగుల సహాయ నిరాకరణ 16 రోజులు కొనసాగింది.

తర్వాత తెలంగాణ రాజకీయ జెఎసి ఉద్యమ కార్యక్రమాన్ని ప్రకటించింది. మార్చి 1న పల్లెపల్లె పట్టాలపైకి పేరుతో రైళ్లబంద్‌కు పిలుపు నిచ్చింది. ఆనాడు రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు రాకపోకలు నిలిచి పోయినయ్. ముందు జాగ్రత్తగ రైల్వేశాఖ రైళ్లను నిలిపేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో తెలంగాణ ఉద్యమ తీవ్రత ఢిల్లీకి చేరింది.

ఉద్యమం తీవ్రం కావడంతో కాంగ్రెస్, టిడిపిలపై ఒత్తిడి పెరిగింది. కాంగ్రెస్‌ల ముసలం పుట్టింది. తెలంగాణ ఏర్పాటును ఆలస్యం చేస్తున్నందుకు నిరసనగ మంత్రి జూపల్లి కృష్ణారావు 2011 మార్చి 3న రాజీనామా చేసిండు. మరో నాలుగు రోజులకు తెలుగుదేశం పార్టీ శాసనసభ్యుడు నాగం జనార్దనరెడ్డి ఆ పార్టీ మీద తిరుగుబాటు చేసిండు. చంద్రబాబునాయుడు తెలంగాణను అణచి వేసే ప్రయత్నం చేస్తుండని ఆరోపించిండు. అప్పటికే మిలియన్ మార్చ్‌కు జెఎసి ఇచ్చిన పిలుపు ఈ రెండు పార్టీల నాయకులకు ఊపిరి మెసలకుండ చేసింది.

మార్చి10న మిలియన్ మార్చ్ జరిగింది. రాజధానికి రాకపోకలు నిలిచి పోయినయ్. ప్రభుత్వం అణచివేతను, పోలీసుల బారికేడ్లను, ముందస్తు అరెస్టులను దాటి తెలంగాణ ప్రజలు హైదరాబాద్ చేరిండ్రు. రాజధాని నిర్బంధం అయింది. నెక్లెస్‌రోడ్డుల సమావేశం. అడుగడుగునా పోలీసుల నిర్బంధం. ప్రభుత్వం అను మతికి నిరాకరించటం మొదలు మిలియన్ మార్చ్ రోజుదాకా సాగించిన నిర్బంధం, కలిగిం చిన ఆటంకాలు తెలంగాణ ప్రజలల్ల మరింత కసిని పెంచినయ్. లక్షలాది మంది ప్రజలు నెక్లెస్‌రోడ్డుకు చేరిండ్రు.

ప్రభుత్వం వెంటనే తెలంగాణ రాష్ట్రం ప్రకటించాలని డిమాండు చేసిండ్రు. అప్పటికే జెఎసి నాయకుడు కోదండరామ్‌ను పోలీసులు అరెస్టు చేసిండ్రు. కోదండ రామ్‌ను గంటల నెక్లెస్‌రోడ్డుకు తీసుకురావాలని లేకుంటే ట్యాంక్‌బండ్ మీది విగ్రహా లను ధ్వంసం చేస్తమని ఉద్యమకారులు ప్రభుత్వాన్ని హెచ్చరించిండ్రు. అన్నట్టుగనే ట్యాంక్ బండ్ మీది ఆంధ్రానాయకుల విగ్రహాలను ధ్వంసం చేసిండ్రు. తమ మీద ఆధిపత్యానికి గుర్తుగా, తమ సంస్కృతి మీద గుండ్ల లెక్క నిలిచిన విగ్రహాలను విర గ్గొట్టి ఈడ్చి హుస్సేన్‌సాగర్‌ల పడేసిండ్రు. రాజీనామాలు చేయకుంట తప్పించు కుంటున్న మధుయాష్కీ, కేశవరావు ఆ సమయంల అక్కడికి రావటంతో ఉద్యమకారులు

నిరసన తెలిపిండ్రు. మధుయాష్కీపై దాడి చేసిండ్రు. కే.కే వాహనంపై కోడిగుడ్లు విసిరిండ్రు.

మార్చి 22న నాగం జనార్ధనరెడ్డి నాయకత్వంల తెలంగాణ టిడిపి ఫోరం ఎమ్మెల్యేలు ఢిల్లీకి పోయిండ్రు. కేంద్ర హోంమంత్రి చిదంబరాన్ని కలిసిండ్రు. తెలంగాణ ప్రకటించాలని వినతిపత్రం ఇచ్చిండ్రు. అయితే చిదంబరం నుండి కనీస స్పందన కూడా తెలంగాణ టిడిపి ఫోరం ఎమ్మెల్యేలకు దక్కలేదు. టిడిపి డబుల్‌గేమ్ తెలిసిన చిదంబరం చంద్రబాబుకు చెప్పివొచ్చిండ్రా, టిడిపి తరఫున వొచ్చిండ్రా, ఫోరం తరుపున వొచ్చిండ్రా, అంతా నాకు తెలుసు అని మొకం మీద కొట్టినట్టుగనే అన్నడు. టిడిపి ఫోరం ఎమ్మెల్యేలు మొకం మాడ్చుకొని తిరిగొచ్చిండ్రు.

ఈలోపుల, సామాజిక న్యాయం అంటూ చిలకపలుకులు పలికి ఏదో పొడి చేస్తనని ఉరుకులు పెట్టిన చిరంజీవి 2011 ఫిబ్రవరి 6న ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌ల విలీనం చేస్తున్నట్లు ప్రకటించిండు. మరోవైపు ముఖ్యమంత్రి సీటే లక్ష్యంగ కాంగ్రెస్ అధిష్ఠానం మీద తిరగబడి ఆ పార్టీకి రాజీనామా చేసిన జగన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మార్చి 12న ఇడుపులపాయల ప్రకటించిండు. ఒక సీమాంధ్రపార్టీ కాలగర్భంల కలిస్తే మరో సీమాంధ్ర పార్టీ ఇగురుపెట్టింది.

చంద్రబాబు రెండు కండ్ల సిద్ధాంతానికి విసిగిపోయిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు, శాసనసభ్యుడు పోచారం శ్రీనివాసరెడ్డి టిడిపికి, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసిండు. మార్చి 23న బాన్సువాడల జరిగిన బహిరంగసభ సందర్భంగ టిఆర్ఎస్‌ల చేరిండు. తన రాజీనామాను స్పీకర్ ఆమోదించక పోవడంతో మార్చి 31న అసెంబ్లీ వద్ద పోచారం దీక్షకు దిగిండు.

శ్రీకృష్ణ కమిటీ రహస్య ఎనిమిదవ అధ్యాయంపై తెలంగాణవాదులు హైకోర్టుల కేసు వేసిండ్రు. మార్చి 23న హైకోర్టు న్యాయమూర్తి ఎల్.నరసింహారెడ్డి తీవ్ర విమర్శతో కూడిన తీర్పు ఇచ్చిండు. ఎనిమిదవ అధ్యాయాన్ని బహిర్గతం చేయాలని తీర్పుల ప్రకటించిండు. అయితే ఏప్రిల్ 26న న్యాయమూర్తి నరసింహారెడ్డి తీర్పుపై హైకోర్టు డివిజనల్ బెంచ్ స్టే ఇచ్చింది.

ఉద్యమం రోజురోజుకు పెరుగుతుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానంల కదలిక వొచ్చింది. అప్పటి వరకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్న వీరప్ప మొయిలీ స్థానంల జాదూగా పేరుపడ్డ గులాం నబీ ఆజాద్‌ను ఆ పార్టీ నియమించింది. తెలంగాణ ఆకాంక్షను చాటిచెప్పడానికి తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద మే 19న కలంకవాతు చేసింది. అప్పటి వరకు ఉద్యమానికి కొండంత అండగా

ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ 2011 జూన్ 21న కన్నుమూసిండు. నాలుగున్నరకోట్ల తెలంగాణ ప్రజలను దుక్కసాగరంల ముంచి పోయిండు. తెలంగాణ సిద్ధాంతకర్తకు ప్రజలు ఘన నివాళులు అర్పించిండ్రు. జయశంకర్ లేని లోటు తీర్చలేనిదని టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అన్నడు.

నాగం జనార్దనరెడ్డి తెలంగాణ వాదాన్ని బలంగా వినిపిస్తుండటం ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబుకు మింగుడు పడలేదు. నాగంను పార్టీ నుంచి పంపడానికి రంగం సిద్ధం చేసిండు. తన చేయికి మట్టి అంటకుండ జూన్ 23న నాగంను పంపించాలని తెలంగాణ ఫోరంతోటే తీర్మానం చేయించిండు. మోత్కుపల్లి నర్సింహులు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, దేవేందర్‌గౌడ్ వంటి తెలంగాణనాయకులు చంద్రబాబు అడుగులకు మడుగు లొత్తుకుంట తీర్మానం చేసిండ్రు. ఆ తర్వాత రొండు రోజులకు నాగంను సస్పెండ్ చేసిండు చంద్రబాబు.

జూన్ 31న కరీంనగర్‌ల బిజెపి పోరుసభ నిర్వహించింది. ఆ సభల సుష్మా స్వరాజ్ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండు చేసింది. కాంగ్రెస్ ఇయ్యక పోతే తెలంగాణను తమ పార్టీ ఇస్తుందని ప్రకటించింది.

తెలంగాణ ఉద్యమం వేడికి మల్లా రాజీనామాల పర్వం మొదలయింది. జూన్ 4న ఎనిమిది మంది తెలంగాణ ఎమ్మెల్యేలు, 13 మంది ఎంపీలు రాజీనామా ఇచ్చిండ్రు. అప్పటివరకు పిసిసి అధ్యక్షునిగ ఉన్న తెలంగాణ నాయకుడు డి. శ్రీనివాస్‌ను తప్పించి ఆ స్థానంల ఉత్తరాంధ్ర నాయకుడు బొత్స సత్యనారాయణను జూన్ 11న కాంగ్రెస్ నియమించింది. తెలంగాణకు అనుకూలంగ బొత్స కొద్ది రోజుల ముందే ప్రకటన చేసిండు. రాబోయే పరిణామాలకు ఎదుర్కోవడానికి సీమాంధ్ర నాయకుడే రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండాలని పార్టీ భావించింది. దీంతో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, స్పీకర్ నాదెండ్ల మనోహర్, పిసిసి అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ... కీలక పదవులు మూడు సీమాంధ్ర నాయకులకే చెందినయ్. మండలి చైర్మన్ చక్రపాణి కూడ ఆంధ్ర ప్రాంతంవాడే. రొండవ స్థాయి పదవులకు మాత్రమే తెలంగాణ నాయకులను పరిమితం చేసిండ్రు. ఉప ముఖ్యమంత్రి పదవిల తెలంగాణ ప్రాంతానికి చెందిన దామోదర రాజనర్సింహ ఉండగా డిప్యూటి స్పీకర్ పదవిల భట్టి విక్రమార్క, మండలి డిప్యూటి చైర్మన్‌గా నేతి విద్యాసాగర్ ఉన్నరు.

ఉద్యమ క్రమంల జూన్ 19న రాజధానిల వంటావార్పు కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ రోడ్లన్ని వంటశాలలు అయినయ్. తెలంగాణ పదిజిల్లాల ప్రజలు ఈ నిరసన కార్యక్రమంల పాల్గొన్నరు. ఈ సమయంల డిజిపి అరవిందరావు పదవీ

విరమణ చేసిండు. జూన్ 1న వివాదాస్పదుడైన ఆంధ్ర ప్రాంతానికి చెందిన దినేశ్‌రెడ్డిని ముఖ్యమంత్రి డిజిపిగ నియమించిండు.

రాజీనామా చేయాలని కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి మీద కూడా ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంల ఆయన సరియైన సమయంల రాజీనామా చేస్తనని ప్రకటించిండు. ఇక రాజీనామా చేయకుండ తప్పించుకొని తిరుగుతున్న మధు యాష్కీ మీద కూడా ఒత్తిడి పెరిగింది. దీంతో ఆయన అసహనానికి లోనయ్యిండు. ఇక టిఆర్‌ఎస్ మీద నోరు పారేసుకుండు. రాజీనామాలతో రాష్ట్రం రాదని, టిఆర్‌ఎస్ విలీనంతోటే తెలంగాణ సాధ్యమయితదని తలాతోకాలేని వాదన వినిపించిండు.

ఉద్యమంల భాగంగ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల సామూహిక దీక్షలు జరిగినయ్. హైదరాబాద్‌ల కాంగ్రెస్ నాయకులు 48 గంటలు దీక్ష చేసింద్రు. ఈ పరిణామాల నేపథ్యంల జూలై 21న ఢిల్లీల పార్లమెంటు ముందు యాదిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నడు. ఆత్మహత్యల పరంపర ఢిల్లీకి కూడ చేరడంతో కాంగ్రెస్ ఉలిక్కి పడ్డది.

జూలై 23న తెలంగాణ ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ నాదెండ్ల మనోహర్ తిరస్కరించిండు. తెలుగుదేశంపార్టీ నుంచి బయటికి వొచ్చిన నాగం జనార్ధనరెడ్డి తెలంగాణ నగారా సమితి పేరుతో 2011 సెప్టెంబర్ 10న కొత్త పార్టీ ప్రకటించిండు.

ఊపిరి మెసలకుంట ఉద్యమం నడుస్తున్నా కేంద్రం దిగిరాక పోవడంతో మరింత ఒత్తిడి పెంచడానికి జెఎసి నిర్ణయించింది. సకలజనుల సమ్మెకు తెలంగాణ ఉద్యోగసంఘాల జెఎసి పిలుపు నిచ్చింది. సెప్టెంబర్ 12న కరీంనగర్‌ల జనగర్జన పేరుతో బహిరంగసభ జరిగింది. సకలజనుల సమ్మె మొదలయితున్నట్లు ఆ సభల కెసిఆర్ ప్రకటించిండు. కాంగ్రెస్ మీద, తెలంగాణ ఉద్యమంల కలిసిరాని పార్టీల మీద నాయకుల మీద నిప్పులు చెరిగిండు.

సెప్టెంబర్ 13 నుంచి సకలజనుల సమ్మె మొదలయింది. తెలంగాణ ఉద్యోగులు విధులను విడిచిపెట్టి రోడ్లమీదికి వొచ్చింద్రు. గ్రామాలల్ల ఉపాధ్యాయులు మొదలు సెక్రటేరియట్‌లోని అడిషనల్ సెక్రెటరీ వరకు అంతా సమ్మెకు దిగింద్రు. ప్రభుత్వశాఖల సంఘాలన్ని కలిసి జాయింట్ యాక్షన్ కమిటీగ ఏర్పడ్డయ్. ప్రభుత్వ కార్యాలయాలన్నీ మూతబడ్డయ్. వేసిన తాళాలు వేసినట్లే ఉన్నయ్. పదిజిల్లాలల్ల కలెక్టర్ల దగ్గర పనిచేసే డ్రైవర్లు అటెండర్లు కూడ సమ్మెల చేరింద్రు.

ఈ సమయంల వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనుచరునిగా ముద్రపడ్డ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జగన్ పార్టీలకు పోతడని ప్రచారమైంది. వైఎస్ మరణం

తర్వాత ముఖ్యమంత్రి అయిన రోషయ్యతోటి గాని ఆ తర్వాత ముఖ్యమంత్రి అయిన కిరణ్ కుమార్‌రెడ్డితోటి గాని ఆయనకు మంచి సంబంధాలు ఏర్పడలేదు. ఇదే కాకుండ తెలంగాణ మంత్రులు రాజీనామాలు చేసి ఉద్యమంలకు రావాలని వొత్తిడి కూడా ఉంది. ఈ నేపథ్యంల 2011 అక్టోబర్ 1న కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేసిండు.

ఈ సమ్మెకాలంల ఆంధ్రపెత్తనం ఉన్న సంఘాలు రొండు ముక్కలయి నయ్. తెలంగాణకు మద్దతు ఇయ్యని సంఘాలు నిట్టనిలువున చీలినయ్. తెలంగాణ సంఘాలు ఏర్పడ్డయ్. పిఆర్‌టియు వంటి ఉపాధ్యాయసంఘాలు రొండు ముక్కల యినయ్. యుటిఎఫ్ వంటి వామపక్ష సంఘాలు కూడా రొండు ముక్కలైనయ్. ఆర్టీసి యూని యన్లు చీలిపోయినయ్. ప్రతి ఉద్యోగి ఉద్యమంలకు వొచ్చిండు.

సుదీర్ఘంగ నడిచిన సమ్మెల సెక్రెటేరియట్ ఉద్యోగుల పాత్ర మరింత కీలకమైంది. అక్రమ పద్ధతులల్ల 85 శాతం ఉద్యోగాలు పొందిన సీమాంధ్రుల పెత్తన మున్న సెక్రెటేరియట్ల తెలంగాణ ఉద్యోగులు గర్జించిండ్రు. ముఖ్యమంత్రి కార్యా లయం ముందు ధర్నాకు దిగిండ్రు. బతుకమ్మ ఆడి తెలంగాణ సంస్కృతిని చాటిండ్రు. ఈ సమయంల సెక్రెటేరియెట్‌లోని ఎల్, జె, డి బ్లాకుల తాళాలు కూడా తీయలేదు. ముఖ్యమంత్రి కూడా తన కార్యాలయానికి దొంగదారి నుంచి రావడం మొదలు పెట్టిండు. అదీ కూడా ఉద్యోగులు కార్యాలయానికి చేరకముందే వొచ్చి కూచున్నడు. మంత్రులెవరూ కార్యాలయాలకు రావడానికి సాహసించలేదు. తెలంగాణ మంత్రు లయితే అటువైపుకూడా మళ్లిచూడలేదు. మంత్రి శ్రీధర్‌బాబు అత్యుత్సాహంతో ముఖ్య మంత్రి మెప్పు పొందడానికి కార్యాలయానికి రావడానికి ప్రయత్నించి భంగపడ్డడు.

రాజధానిల ఆంధ్రా అడ్డాగ మారిన సచివాలయంల జెఎసి ఏర్పడ డానికి తెలంగాణ గెజిటెడ్ ఆఫిసర్స్ అసోసియేషన్ సచివాలయ బ్రాంచి చైర్మన్ నరేందర్‌రావు చొరవ తీసుకుండు. ఆయన నాయకత్వంల సెక్రెటేరియెట్‌ల విజయ వంతంగ సమ్మె నడిచింది. ఈ సమయంల ఉద్యోగులను భయపెట్టడానికి ప్రభుత్వం పూనుకుంది. సచివాలయ ఉద్యోగ నాయకులను అరెస్టు చేసింది. సమ్మె ప్రభావం లేదని చూపడానికి ప్రభుత్వం చావుతెలివి ప్రదర్శించింది.

తెలంగాణ ఆకాంక్షను ప్రపంచానికి చాటిచెప్పడానికి ఉద్యోగుల జెఎసి అధ్యక్షుడు స్వామిగౌడ్, కార్యదర్శి దేవీప్రసాద్ సకలజనుల సమ్మె బాధ్యతను భుజాన వేసుకుండ్రు. అన్ని ఉద్యోగ సంఘాల జెఎసి నాయకులతో పాటు తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకుడు శ్రీనివాసగౌడ్, విద్యుత్ ఉద్యోగుల జెఎసి నాయకుడు రఘు ఉద్యమంల చురుగ్గా పాల్గొన్నరు.

ఈ సమ్మెకాలంల ప్రభుత్వం రాక్షసంగ ప్రవర్తించింది. పోలీసులు అమానుషంగ అణచివేయడానికి ప్రయత్నం చేసింండ్రు. ముఖ్యమంత్రి తొత్తులుగ మారిన వివాదాస్పద పోలీసు అధికారులు కొందరు ఉద్యోగ నాయకులపై ప్రతాపం చూపించిండ్రు. అయినా సమ్మెను ఆపలేకపోయిండ్రు. ఒక రోజు కాదు రెండు రోజులు కాదు 42 రోజులు సకల జనుల సమ్మె విజయవంతంగ నడిచింది. రాష్ట్ర ప్రభుత్వానికి దిమ్మతిరిగింది. కేంద్ర ప్రభుత్వానికి చురుకు ముట్టింది.

# ఢిల్లీని తాకిన ఉద్యమ సెగలు

సకలజనుల సమ్మె ప్రభావం మరిచిపోకముందే జెఎసి తెలంగాణ మార్చ్‌కు పిలుపునిచ్చింది. 2012 సెప్టెంబర్ 30న నెక్లెస్‌రోడ్‌ల తెలంగాణ మార్చ్ ధూంధాంగ జరిగింది. నెక్లెస్‌రోడ్ పొడవునా సాగర సమాహారంగ ఏర్పడి ఉద్యమ కారులు తెలంగాణ ఆకాంక్షను చాటిచెప్పింర్రు.

ఒకవైపు ఉద్యమాలు నడుస్తుంటె మరోవైపు రాజకీయపార్టీల మీద ఒత్తిడి పెంచడానికి కెసిఆర్ సమాయత్తమైండు. సెప్టెంబర్ 7, 8 తారీకులల్ల వరంగల్‌ల రొండు రోజుల మేధోమథన సదస్సు నిర్వహించిండు. ఉద్యమ కార్యక్రమాల గురించి చర్చించిండు. సదస్సు చివరల ఇతర పార్టీల నుంచి తెలంగాణ శాసన సభ్యులను, ఎంపీలను టిఆర్ఎస్‌లకు ఆహ్వానించాలని నిర్ణయించిండు.

ఎన్ని నిరసనలు ఎదురైనా తుడుచుకొనిపోయే పార్టీలకు, నాయకులు దూరమైతున్నరంటె చురుకు ఎక్కుతదని కెసిఆర్ భావించిండు. అందుకు ప్రారంభంగా వరంగల్ మేధోమథన సభ జరిగిన సరిగ్గా వారం రోజులకు నవంబర్ 15న తెలుగు దేశం పార్టీ శాసనసభ్యుడు హరీశ్వర్‌రెడ్డి టిఆర్ఎస్‌ల చేరిండు. ఆనాడు రంగారెడ్డి జిల్లా పరిగిల బ్రహ్మాండమైన బహిరంగసభ జరిగింది. దీంతో చంద్ర బాబు పార్టీకి బీటలు వారినయ్. అప్పటికే సీనియర్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి పార్టీకి దూరం కాగా హరీశ్వర్‌రెడ్డి నిర్ణయం చంద్రబాబుకు నిద్ర లేకుంట చేసింది.

మరో పదిరోజులకు నవంబర్ 25న నల్లగొండజిల్లా సూర్యాపేటల తెలంగాణ సమరభేరి పేరుతో బ్రహ్మాండమైన సభను టిఆర్ఎస్ నిర్వహించింది. డిసెంబర్ 5 నుంచి టిఆర్ఎస్ పల్లెబాట, బస్తీబాట కార్యక్రమాలు పెట్టింది. ఊరూరా ఉద్యమ ప్రచారం చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుంట చేసింది. 2009 డిసెంబర్ 9న కెసిఆర్ దీక్ష ఫలితంగ తెలంగాణను ప్రకటించిన కేంద్రం సీమాంధ్ర నాయకుల బ్లాక్‌మెయిల్ రాజకీయాల వల్ల వెనక్కు తీసుకుంది తెలిసిందే. తెలంగాణను

కేంద్రం సాగదీస్తున్నదని, ఎన్నికల ముందు ఇస్తదని అప్పుడే రాజకీయ విశ్లేషకులు ఆలోచనాపరులు అన్నరు. అన్నట్లుగనే శ్రీకృష్ణకమిటీ పేరుతో ఏడాది గడిపింది. నివేదిక వొచ్చిన తర్వాత మరో ఏడాది నాన్చింది. 2013 వొచ్చేనాటికి కేంద్రం మీద ఒత్తిడి పెరిగింది. 2014 ఎన్నికల ముందు తెలంగాణ ఇయ్యడానికి కసరత్తు మొదలు పెట్టింది.

2012 డిసెంబర్‌ల కేంద్ర హోంమంత్రి చిదంబరం స్థానంల సుశీల్ కుమార్ షిండే బాధ్యతలు తీసుకుండు. డిసెంబర్ 28న అఖిలపక్ష సమావేశం నిర్వహించిండు. ఈ అఖిలపక్ష సమావేశానికి చంద్రబాబు మొకం చాటేసిండు. మిగతా పార్టీలు గతంల చెప్పిన అభిప్రాయాలనే చెప్పినయ్. ఈ అఖిలపక్ష భేటీ సందర్భంల కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి గులాం నబీ ఆజాద్ వివాదాస్ప దమైన మాటలన్నడు. అఖిలపక్ష సమావేశం కేవలం కొత్త హోంమంత్రి అవగాహన కోసమే అనేది ఆయన మాటల తాత్పర్యం. దీంతో తెలంగాణవాదులు ఆజాద్ మీద దుమ్మెత్తి పోసిండ్రు. మొదటి నుంచి ఆజాద్ సీమాంధ్ర పక్షపాతిగనే వ్యవహరించిండు. తెలంగాణవాదులు ఎప్పుడు ఆయనను నమ్మలేదు.

అఖిలపక్ష సమావేశం అయిన తర్వాత కేంద్ర హోంమంత్రి షిండే మీడియాతో మాట్లాడిండు. నెలలోపు తెలంగాణ విషయం పరిష్కరిస్తమని ప్రకటించిండు. తనకు తానే గడువు విధించుకుండు.

కేంద్రం జారిపోకుండ ఈ నెలరోజులు ఒత్తిడి పెంచడానికి టిఆర్ఎస్, జెఎసి ఉద్యమ ప్రణాళిక చేసినయ్. తెలంగాణల నిరసన దీక్షలు జరిగినయ్. మోటారు సైకిళ్ల ర్యాలీ, మండల కేంద్రాల్లో కాగడాల ప్రదర్శన, నియోజకవర్గాలల్ల దీక్షలు, జిల్లా కేంద్రాలల్ల ర్యాలీలు... కేంద్ర ప్రభుత్వాన్ని మెసలనీయలేదు.

ఒకవైపు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా నడుస్తుంటే ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి మరో ఆంధ్రా కుట్రకు పూనుకుండు. తెలంగాణ ఉద్యమం బలపడ్డప్పు డల్లా గతంల ఆంధ్రా సర్కారు ప్రయోగించిన ప్రపంచ తెలుగు సభలు ఆయనకు యాది కొచ్చినయ్. సభల నిర్వాహణ పనులతో రాష్ట్రం మొత్తం హడావిడి చేసిండు. వొందల కోట్ల రూపాయలు కుమ్మరించి ముఖ్యమంత్రి సొంత జిల్లా చిత్తూరులోని తిరుపతిల సభలు నిర్వహించడానికి ఆర్భాటం చేసిండు. నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలు 2012 డిసెంబర్ 27,28,29 తారీకులల్ల నిర్వహిస్తున్నట్లు సర్కారు ప్రకటించింది. ఈ కుట్రను తెలంగాణల కూడా అమలు చేయాలని అనుకుండు ముఖ్యమంత్రి.

అయితే తెలంగాణల ఈ ఉత్సవాలకు తీవ్ర నిరసన వొచ్చింది. అసలు ప్రపంచ తెలుగు సభలే తెలంగాణ వాదాన్ని అణచివేయడానికి పన్నిన కుట్ర అని నిరసన తెలిపింద్రు. తెలంగాణ ప్రజలు ఈ ఉత్సవాలను బహిష్కరించింద్రు. కిరణ్‌కుమార్‌రెడ్డి ఆర్భాటంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలు చివరికి సీమాంధ్ర సభలుగానే ముగిసినయ్.

కేంద్ర హోంమంత్రి షిండే విధించిన గడువుకు సరిగ్గ నాలుగు రోజుల ముందు 2013 జనవరి 23న గులాంనబీ ఆజాద్ నెలంటే నెల కాదని, వారం అంటే ఏడురోజులు కాదని మరో తొర్రికూత కూసిండు. పుల్లలు పెట్టే మాటలు తెలంగాణవాదులకు కోపం తెప్పించినయ్. చివరికి జనవరి 27న మరిన్ని సంప్రదింపులు జరపాలని ప్రకటించిండు హోంమంత్రి. తను విధించుకున్న గడువును తానే దాటి ముఖం చాటేసిండు.

షిండే మీద ఒత్తిడి పెంచడానికి నెలరోజుల కార్యక్రమంల చివరి రోజులైన జనవరి 27,28 తారీకులల్ల హైదరాబద్‌లోని ఇందిరాపార్కు దగ్గర సమరదీక్షకు దిగింది జెఎసి. ఈ దీక్షకు హాజరైన కెసిఆర్ మాట్లాడిండు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉద్యమంలకు కలిసి రాకపోవడం వల్లనే తెలంగాణ ఆలస్యం అయితుందని, వాళ్లు రాజీనామా చేస్తే కేంద్రం వెంటనే దిగివొస్తదని అందరూ అనుకునేదే. షిండే మాటల్తో ఆగ్రహించిన కెసిఆర్ థూ! మీదీ బతుకేనా, ఎంత తిట్టినా సిగ్గు లజ్జ లేదాయె అని ఈసడించుకుండు.

అఖిలపక్షం తర్వాత కేంద్రనాయకులు తలోమాట నోటికేదొస్తే అది వాగి తెలంగాణ ప్రజలను గందరగోళానికి గురిచేసింద్రు. తెలంగాణ పరిష్కారం దోశ వేసినంత ఈజీ కాదని వాయలార్ రవి అంటె, తెలంగాణను తేలుస్తమనలేదు అని షిండే నాలుక మడతేసిండు.

ఈ సమయంలనే శాసనసభ సమావేశాలు ప్రారంభమైనయ్. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని అసెంబ్లీలనే కడిగేసింద్రు. టిఆర్ఎస్ దాడికి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి విచక్షణ కోల్పోయిండు. తెలంగాణకు ఒక్క పైస కూడ ఇయ్యను, ఏం చేసుకుంటరో చేసుకోండి, రాసిపెట్టుకొండి అంటూ ఆక్రోశంగ మాట్లాడిండు. ముఖ్యమంత్రి కిరణ్ అజ్ఞానం అహంకారం రాష్ట్ర ప్రజలకు అసహ్యం కలిగించింది.

అసెంబ్లీ సమావేశాల సందర్భంగ ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడానికి 2013 మార్చి 21న సడక్‌బంద్‌కు జెఎసి పిలుపు నిచ్చింది. శంషాబాద్ నుండి అలంపూర్ వరకు సడక్‌బంద్ విజయవంతంగ నడిచింది. చీమకూడా కదల్లేదు.

ఈ సమావేశాలల్ల ముఖ్యమంత్రి మీద టిఆర్ఎస్ అవిశ్వాసం పెట్టింది. అప్పటి వరకు ప్రభుత్వాన్ని కూల్చుతమని ఉత్తర ప్రగల్భాలు పలికిన చంద్రబాబు తీరా అవిశ్వాసం కాడికి వొచ్చేసరికి జారుకుండు. ఫలితంగ కిరణ్ సర్కారుపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది.

సాధారణంగ ఏమాత్రం సందు దొరికినా ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రతిపక్ష పార్టీ పూనుకుంటది. కాని చంద్రబాబు ఇక్కడ ఆ పని చేయలేదు. ఒక వేళ కూల్చితే ఎన్నికలొస్తయ్. ఎన్నికలకు పోతే తనకున్న నాలుగు సీట్లు తెలంగాణల పోతయ్. తన రెండు కండ్ల సిద్ధాంతాన్ని తెలంగాణ ప్రజలు ఈడ్చి తంతరు. ఇది తెలుసుకున్న చంద్రబాబు గతిలేక సర్కారుకు మద్దతిచ్చిండు.

ఆ తర్వాత కాంగ్రెస్ నాయకులు, టిడిపి నాయకులపై కెసిఆర్ విమర్శలు సంధించిండు. ఈ రెండు పార్టీల వల్లనే తెలంగాణ ఆలస్యమయితుందని విరుచుకు పడ్డడు. దీంతో తెలంగాణ ఉద్యమంలకు రాకుండ వెనుక పట్టు పడుతున్న నాయకులకు చురుకుముట్టింది. దీంతో మధుయాష్కీ వంటి వారు కెసిఆర్ మీద నోరు పారేసుకోవడం మొదలుపెట్టిండ్రు. అప్పటికే సర్వే సత్యనారాయణ మంత్రి పదవి దొరకడంతో సోనియాగాంధీ భజన అందుకుండు. ఉద్యమం సాధారణంగా ఉన్న రోజులల్ల తెలంగాణ పాట పాడిన మధుయాష్కీ, సర్వే సత్యనారాయణ ఉద్యమం ఉధృతం అయినంక జారుకుండ్రు.

ఇదే సమయంల చంద్రబాబు, ఆయన ఆంధ్రా మీడియా కెసిఆర్‌పై కుళ్లు వెళ్లబోసుకుంది. కెసిఆర్‌ది ఫాంహౌజ్ పార్టీ అంటూ చంద్రబాబు కూయడం మొదలు పెట్టిండు. నాది ఫాంహౌజ్ పార్టీ అయితే నీది పిల్లిగడ్డం బొల్లిపార్టీనా అని కెసిఆర్ కూడ చంద్రబాబుకు కౌంటర్ ఇచ్చిండు.

ఎంత ఒత్తిడి పెరిగినా కాంగ్రెస్, టిడిపి నాయకులు నాటకాలు ఆడు కుంట తప్పించుకుండ్రు కాని ఉద్యమంలకు రాలేదు. ఈ రెండు పార్టీలే తెలంగాణకు అడ్డు అన్న నిజం కూడా తెలంగాణ ప్రజలకు తెలిసింది.

# తెలంగాణ రాష్ట్ర సాకారం



# కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం

చంద్రబాబు రెండునాల్కల ధోరణికి విసిగిపోయిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కడియం శ్రీహరి 2013 మే 11న ఆ పార్టీకి రాజీనామా చేసిండు. అప్పటికే కాంగ్రెస్ ఎంపీలు తొమ్మిదిమంది టిఆర్ఎస్‌ల చేరుతుండ్రని వార్తలొచ్చినయ్. మళ్ల కొద్దిరోజులకు ఆరుగురు ఎంపీలు మాత్రమే పార్టీ మారు తుండ్రని వార్తలు వినిపించినయ్. చివరికి 2013 జూన్ 2న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కె.కేశవరావు, ఆ పార్టీ ఎంపీలు మందా జగన్నాథం, వివేక్ టిఆర్ఎస్‌ల చేరిండ్రు. కాంగ్రెస్ ఎంపిలు కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా టిఆర్ఎస్‌లకు పోతుండ్రని వార్తలొచ్చినయ్ కాని వారు పార్టీ వీడలేదు.

తెలంగాణ ఉద్యమంల మొదటి నుంచి దళిత బహుజనులు చురుగ్గా పాల్గొన్నరు. పేద మధ్య తరగతి రెడ్డి నాయకులు కూడా ముందుకొచ్చిండ్రు. కాని సంపన్నులైన రెడ్డి నాయకులు మాత్రం ఉద్యమానికి సహకరించలేదు.

ఇక్కడ ఆంధ్ర ప్రాంతం నుంచి కూడ చెప్పుకోవాలె. సీమాంధ్రల దళిత బహుజనులు తెలంగాణను స్వాగతించిండ్రు. ఆ ప్రాంతానికి చెందిన సంపన్న కుటుంబాలు, ముఖ్యంగా ఆంధ్రల బలమైన కమ్మ నాయకులు వ్యతిరేకించిండ్రు. వారందరికి హైదరాబాద్‌ల వ్యాపారాలు ఉండటమే కారణం. తెలంగాణకు వలస వొచ్చి స్థిరపడ్డ కమ్మనాయకులు కూడా తెలంగాణను వ్యతిరేకించిండ్రు. వలసలకు కేంద్రమైన ఖమ్మం జిల్లాకు చెందిన రేణుకాచౌదరి, టిడిపి ఎంపి నామా నాగేశ్వరరావు ఆంధ్రా పాటనే పాడిండ్రు. వీరిని తెలంగాణ నాయకులుగా తెలంగాణ ప్రజలు ఎన్నడూ గుర్తించలేదు. ఇంక రాయలసీమ రెడ్డి నాయకులు కూడా తెలంగాణను వ్యతిరేకించిండ్రు.

ఈ పరిస్థితులల్ల టిఆర్ఎస్‌లకు ఇద్దరు కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు మందా జగన్నాథం, వివేక్‌తో పాటు కేశవరావు వంటి సీనియర్ నాయకుడు రావడంతో కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బ తగిలింది. తొందరగ తెలంగాణ రాష్ట్రం ప్రకటించకుంటె

కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోవడం ఖాయమని భావిం చింది. మరోవైపు కేకే వంటి నాయకుడు టిఆర్ఎస్‌ల చేరడంతో ఉద్యమానికి బలం పెరిగింది. కేకేను టిఆర్ఎస్ సెక్రెటరీ జనరల్‌గ నియమించి కెసిఆర్ కూడా గౌరవాన్ని ప్రకటించిండు.

2013 జూన్ 3న హైదరాబాద్‌ల బిజెపి సమావేశం జరిగింది. ఆ పార్టీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ హాజరయ్యిండు. ఆరోజు నాగం జనార్దనరెడ్డి తెలంగాణ నగారా సమితిని బిజెపిల విలీనం చేసిండు. మరో మూడు రోజులకే బిజెపి ఎన్నికల సారథిగ నరేంద్రమోడిని ఆ పార్టీ ప్రకటించింది.

జూన్ 17న తెలంగాణ వ్యతిరేక, సమైక్యవాదం బలంగ వినిపించే ఆంధ్రా నాయకుడు కావూరి సాంబశివరావుకు కేంద్రమంత్రి పదవి దక్కింది. దీంతో కాంగ్రెస్ తెలంగాణవైపు పావులు కదుపుతుందని భావించిండ్రు. తెలంగాణను వ్యతిరేకించే నాయకుల నోరు మూయించడం ద్వారా తెలంగాణ ప్రకటనకు సానుకూల వాతా వరణం తయారు చేసుకుంటుందని ప్రచారమైంది.

కాంగ్రెస్ అధిష్ఠానం కూడా తెలంగాణ ప్రకటించబోతున్నట్లు రాష్ట్ర పార్టీకి సంకేతాలిచ్చింది. ఇంక అప్పటి దాంక పండుకున్న కాంగ్రెస్ నాయకులంతా లేసిండ్రు. తెలంగాణను సాధించనున్నట్లు ఆర్భాటం చేసిండ్రు. తమ ఉద్యమం వల్లనే తెలంగాణ సాకారం కానుందని పేకిండ్రు.

నిజానికి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఏనాడూ తెలంగాణ ఉద్యమం లకు రాలేదు. పదవుల కోసం రాజకీయాలు చేయడమే పనిగా పెట్టుకునే ఆ పార్టీ నాయకులు ఏ నాడూ తెలంగాణకు జరిగిన అన్యాయాల గురించి మాట్లాడలేదు. టిఆర్ఎస్ తెలంగాణ ఉద్యమాన్ని భుజానికి ఎత్తుకున్న తర్వాత కూడా వారు మద్దతు ఇయ్యలేదు. ముఖ్యమంత్రి ఎవరున్నా సొంత ప్రయోజనాల కోసమే పాకులాడిండ్రు. పదవులు అనుభవించుకుంట సుతిమెత్తని మాటలు చెప్పిండ్రు.

కెసిఆర్ దీక్ష తర్వాత కూడా తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఉద్యమం లకు రాలేదు. ప్రజల వొత్తిడి పెరిగినప్పుడు జెఎసిల అట్ల చేరి ఇట్ల వెనక్కు జారు కుండ్రు. అధిష్టానం మాట అని చెప్పి పదవులు వొదలకుంట కూసుండ్రు. అగోవొచ్చె ఇగోవొచ్చె అని కోతలు కోసిండ్రు కాని కూసున్నకాడి నుంచి లేవలేదు. చివరి దాంక ఆంధ్ర ముఖ్యమంత్రుల గోసులు సదురుకుంటనే గడిపిండ్రు.

తెలంగాణ కాంగ్రెస్ నాయకులల్ల చీము నెత్తురు ఉన్నోళ్లు మాత్రం ఆ పార్టీని వొదిలిపెట్టి ఉద్యమంల చేరిండ్రు. మిగితా వాళ్లంత ఉత్తమాటలకే పరిమిత మైండ్రు. తెలంగాణకు అనుకూలంగా సిడబ్ల్యూసి ప్రకటన రానుందని తెలవడంతో

ఒక్కసారిగా తెలంగాణ పాట అందుకుండ్రు. ఇంక తామే తెలంగాణను తెస్తున్నట్లు, ఉద్యమం చేస్తున్నట్లు ప్రజలను నమ్మించడానికి ఎత్తులు వేసిండ్రు. ఈ నేపథ్యంల జూన్ 30న తెలంగాణ సాధన సభను నిజాం కాలేజీ గ్రౌండ్‌ల ఏర్పాటు చేసిండ్రు. తమ ఉద్యమం వల్లనే తెలంగాణ వొస్తుందని నమ్మించటాని తెగ ఆరాటం చేసిండ్రు.

2013 జూలై 11న ఢిల్లీల కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశం అయింది. సోనియాగాంధీ, ప్రధాని మన్మోహన్‌సింగ్, ఆజాద్, చిదంబరం, షిండే, దిగ్విజయ్‌సింగ్ ఆ మీటింగ్‌కు హాజరయ్యిండ్రు. ప్రతి శుక్రవారం కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించినా ఈ సమావేశం తెలంగాణ అంశం మీదనే జరిగింది. ఆ సమావేశం అనంతరం తెలంగాణపై తేలుస్తం అని డిల్లీ పెద్దలు ప్రకటించిండ్రు.

మరో పదిహేను రోజులకు జూలై 25న రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, పిసిసి అధ్యక్షుడు బొత్స సత్యనారాయణలను కేంద్రం ఢిల్లీకి పిలిపించింది. తెలంగాణ ఏర్పాటుపై ముగ్గురి అభిప్రాయాలను సేకరించింది. ఎప్పటిలెక్కనే తెలంగాణకు వ్యతిరేకంగ తప్పుడు కూతలు కూసిండు ముఖ్యమంత్రి. పిసిసి అధ్యక్ష పదవి రావడానికి ముందు తెలుగు వారికి రొండు రాష్ట్రాలు ఉంటె తప్పేందని నంగిమాటలు మాట్లాడిన బొత్స సత్య నారాయణ కూడ తెలంగాణకు వ్యతిరేకంగ మాట్లాడిండు. దామోదర రాజనర్సింహ మాత్రం తెలంగాణ ఏర్పాటు అవసరాన్ని చెప్పిండు.

ఆ తెల్లారి కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దిగ్విజయసింగ్ తెలంగాణపై సంప్రదింపులు ముగిసినయని ప్రకటించిండు. ఇంక సాగదీయటానికి అవకాశం లేదన్న సంకేతాలు కేంద్రం తెలంగాణ ప్రజలకు ఇచ్చింది. మరో నాలుగు రోజులకు 2013 జూలై 30న హైదరాబాద్‌తో కూడిన పదిజిల్లాల తెలంగాణ ఇయ్యనున్నట్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రకటించింది.

ఈ ప్రకటనల తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన చారిత్రక అంశాల గురించి, ఏర్పాటు చేయనున్న తెలంగాణ రాష్ట్రం గురించిన పూర్తి వివరాలు ప్రకటించిండ్రు.

> 'తెలంగాణరాష్ట్ర డిమాండు సుదీర్ఘకాలంగా ఉంది. 2004 ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ఎన్నికల మానిఫెస్టోల కూడ కాంగ్రెస్ తెలంగాణ అంశాన్ని పరిష్కారం చేస్తనని చెప్పింది. 2004లో యుపిఎ ప్రభుత్వ కామన్ మినిమమ్ ప్రోగ్రాంల తెలంగాణ అంశాన్ని చేర్చింది. అదే సంవత్సరం జూన్‌ల రాష్ట్రపతి తన ప్రసంగంల కూడ తెలంగాణ అంశాన్ని ప్రస్తావించిండు. 2009

ఫిబ్రవరి 12న అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి కూడ తెలంగాణకు కట్టుబడి ఉన్నమని అసెంబ్లీల ప్రకటించిండు. 2009 డిసెంబర్ 7న ముఖ్యమంత్రి రోషయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంల అన్ని పార్టీలు చెప్పిన అభిప్రాయం ప్రకారం, తెలంగాణ ఏర్పాటు చేయాలని కోరిండు. 2009 డిసెంబర్ 9,23 తేదీలల్ల కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన చేసిండు.

ఢిల్లీల 2010 జనవరి 5న, 2011 జనవరి 6న రొండుసార్లు రాష్ట్రానికి చెందిన ఎనిమిది గుర్తింపు పొందిన పార్టీల అభిప్రాయాలు తీసుకున్నం. ఇదే అంశం మీద శ్రీకృష్ణ కమిటీ కూడ నివేదిక ఇచ్చింది. మూడు సంవత్సరాలు వివిధ పార్టీల అభిప్రాయాలను, ప్రజల అభిప్రాయాలు గమనించినం. ఇవన్నీ గమనించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాజ్యాంగబద్ధమైన చర్యలు తీసుకొమ్మని కోరుతున్నం.

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు వనరుల పంపకం, రక్షణ చర్యలు తీసుకోవాలె. హైదరాబాద్ రొండు రాష్ట్రాలకు పదిసంవత్సరాల పాటు ఉమ్మడి రాజధానిగ ఉంటుంది. ఈలోపు ఆంధ్రప్రదేశ్‌కు కొత్తరాజధాని ఏర్పాటు చేయాలె. పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయహోదా కల్పించాలె.'

కాంగ్రెస్ నిర్ణయానికి తెలంగాణ సంతోషించినా పదేండ్లు ఉమ్మడి రాజధానిగ అంగీకరించడానికి ఇష్టపడలేదు. అట్లనే పోలవరం ప్రాజెక్ట్ డిజైన్ మార్చాలని, లేకుంటె తెలంగాణ నష్టపోతుందని కూడ టిఆర్ఎస్ డిమాండు చేసింది. కాంగ్రెస్‌ను నమ్మలేమని, పార్లమెంటుల బిల్లు పాసయి, రాష్ట్రపతి ఆమోద ముద్ర పడితేనే సంబురాలని కెసిఆర్ చెప్పిండు. సిడబ్ల్యుసి ప్రకటన ఆశలు కల్పించింది. కాని తెలంగాణ ప్రజలల్ల అపనమ్మకాలు మాత్రం తొలగిపోలేదు.

# తెలంగాణకు కేంద్ర కేబినెట్ ఆమోదం

హైదరాబాద్ రాజధానిగ పదిజిల్లాల తెలంగాణ ఏర్పాటు చేయటానికి కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ తీర్మానం చేయడంతో తెలంగాణ సంబురపడ్డది. సిడబ్ల్యుసి ప్రకటన వొచ్చిన రొండోరోజు చంద్రబాబు ఆంధ్ర రాజధాని అభివృద్ధికి ఐదు లక్షల కోట్ల రూపాయిలు ఇయ్యాలని డిమాండు చేసిండు. ఊకెనే రాష్ట్ర విభజన చేస్తే ఎట్ల, కొత్త రాజధాని నిర్మాణ బాధ్యతను కేంద్రం తీసుకోవాలన్నడు. మిగతా ఆంధ్రా నాయకులు సన్నాయినొక్కులు నొక్కినా పెద్ద వ్యతిరేకత లేదు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి బెల్లం కొట్టిన రాయిలెక్క సడిచప్పుడు లేకుంట ఉన్నడు.

చంద్రబాబు ఐదు లక్షల కోట్ల మాట అన్న తెల్లారి కెసిఆర్ ఉద్యోగ సంఘాల సమావేశానికి హాజరయ్యిండు. అక్రమంగ వొచ్చిన ఆంధ్రా ఉద్యోగులు రాష్ట్ర విభజన తర్వాత పోతరు. మన తెలంగాణోళ్లకు ఉద్యోగాలు వొస్తయని అన్నడు. ఆ మాటను పట్టుకొని ఆంధ్రామీడియా గగ్గోలు పెట్టింది. కెసిఆర్ ఉద్యోగస్తులను వెళ్లగొట్టాలని అంటుండు. ఇప్పుడే ఇట్ల అంటే రాష్ట్రం ఏర్పడ్డంక ఆంధ్రోళ్ల పరిస్థితి ఏంది? అని గాయిగాయి చేసింద్రు. ఇక చిన్నాచితక సీమాంధ్ర నాయకులు కూడ నోరు పారేసు కుంద్రు. ఈ సొల్లునంత సీమాంధ్ర మీడియా పోటీపడి జనం మీదికి చిమ్మింది.

2013 ఆగస్ట్ 5న తెలంగాణ ప్రక్రియ షురూ అయిందని ఆర్థికమంత్రి చిదంబరం పార్లమెంటుల ప్రకటించిండు. తెల్లారి ఆంటోని కమిటీ వేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దిగ్విజయ్‌సింగ్, వీరప్ప మొయిలీ, అహ్మద్‌పటేల్ సభ్యులుగ ఎకె ఆంటోని అధ్యక్షుడుగ విభజన కమిటీని ప్రకటించింది కేంద్రం. ఈ కమిటీ ఎందుకు అన్న అనుమానం రాకుంట విభజన అమలుకే ఆంటోని కమిటీ అని ఆగస్టు 7న దిగ్విజయ్‌సింగ్ ప్రకటించిండు.

తొమ్మిది రోజులపాటు మాట పడిపోయినట్లు కూసున్న ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ఆగస్టు 8న నోరు విప్పిండు. తెలంగాణ ఏర్పాటుపై విషం గక్కిండు. కేంద్ర ప్రభుత్వం హడావిడిగ నిర్ణయం తీసుకుంటే ఎట్ల, సీమాంధ్రకు అన్యాయం

జరుగుతది, సీమాంధ్ర ప్రజల నీళ్లవాటా ఏంది, ఉద్యోగాల సంగతేంది, అవేమీ తేల్చ కుంట విభజన అంటే ఎట్ల కుదురుతది? ముందుగ సీమాంధ్రకు న్యాయం ఎట్ల చేస్తరో చెప్పి అప్పుడు విభజన చేయాలని అడ్డదిడ్డంగ మాట్లాడిండు. సొంత అధిష్టానం మీద తిరుగుబాటు ప్రకటించిండు. ముఖ్యమంత్రి మాటలతోటి సీమాంధ్రల రాజకీయ గత్తర లేచింది.

లక్షకోట్ల అవినీతి ఆరోపణలతో 2012 మే 27న అరెస్టయి చంచల్‌గూడ జైల్ల ఉన్న వైఎస్‌ఆర్ పార్టీ నాయకుడు జగన్, జైలు బయట ఉన్న ఆయన తల్లి విజ యమ్మ 2013 ఆగస్టు 10న తెలంగాణ ఏర్పాటుకు నిరసనగా ఎంపి, ఎమ్మెల్యే పద వులకు రాజీనామా చేసింద్రు. సమన్యాయం చేయాలని వింతపాట అందుకున్నరు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకోవటానికి జగన్ జైలు నుంచే కుట్రలకు తెరలేపిండు. ఇగ సీమాంధ్రల జగన్ పార్టీ నోరు పారేసుకుంది. ఆయన టివి చానల్ ప్రత్యక్ష ప్రసారం చిమ్మింది.

జగన్ రాజీనామా డ్రామాకు తెరలేపిన తెల్లారి ఆగస్ట్ 11న హైదరాబాద్‌ల భాతీయ జనతాపార్టీ బహిరంగ సమావేశం జరిగింది. ఆ పార్టీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడి ఆ సభకు హాజరయ్యిండు. బిజెపి అప్పటి వరకు తెలంగాణకు మద్దతు ఇస్తమని చెప్పకుంట వొచ్చింది. ఇంక ఆ పార్టీ మద్దతు ఇయ్యకుంట అడ్డుకోవటానికి చంద్రబాబు కుట్రలు మొదలుపెట్టిండు.

తెలంగాణ ఉద్యమం మీద పుట్టెడు విషం గక్కే టివి 9 గుజరాత్ చానల్ కూడ పెట్టడంతో నరేంద్రమోడి తోటి ఆ చానల్ సిఇవోకు పరిచయాలు ఉన్నయట. ఆ పరిచయాలతోటి తెలుగుసినిమా ప్రముఖులకు నరేంద్రమోడిని కలిసే అవకాశం ఇప్పించిండని ప్రచారమైంది. ఆంధ్రా కుట్రదారులు సినిమా రంగం ముసుగుల నరేంద్రమోడిని కలిసి కడుపుల విషం కక్కింద్రు. చంద్రబాబు అనుమతి లేకుంట గడప దాటని బాలకృష్ణ, మురళీమోహన్‌తోపాటు తెలుగు సినిమా కమ్మోళ్లంత నరేంద్ర మోడిని కలిసింద్రు. తెలంగాణకు మద్దతు ఇయ్యొద్దని చెప్పింద్రు.

రాష్ట్రంల సీమాంధ్ర కుట్రలు కుతంత్రాలు మొదలయితుంటె ఆగస్టు 9న తెలంగాణ నిర్ణయం చేసినం, అమలుచేస్తమని సోనియాగాంధీ ప్రకటించింది.

ఇగ ఆంధ్రోళ్లు అగ్గిమీద గుగ్గిలమయ్యింద్రు. కాలుగాలిన పిల్లోలిగ తిరిగింద్రు. రాష్ట్ర విభజన మీద, తెలంగాణ ఏర్పాటు మీద నోటికొచ్చింది వాగింద్రు. ఆంధ్రా మీడియా కూడ ఉచ్చనీచాలు మరిచి నీతి నియతి తప్పి గోరంత కృత్రిమ ఉద్యమాన్ని కొండంత చూపిచ్చింద్రు.

ఆంధ్రా నాయకులు కుప్పిగంతులేస్తుంటె ఆగస్టు 24న ఢిల్లీల జాతీయ మీడియా సెంటర్ ప్రారంభోత్సవ సభల పాల్గొన్న సోనియాగాంధి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు త్వరలోనే చేస్తున్నట్లు మరోసారి ప్రకటించింది.

ఆ తెల్లారే చంచల్‌గూడ జైలుల జగన్ దీక్షకు దిగిండు. రాష్ట్ర విభజనకు నిరసనగ దీక్ష చేస్తున్నట్లు ప్రకటించిండు. జగన్ కరపత్రం అయిన సాక్షిపత్రిక చెత్తా చెదారం రాసిపడేసింది. ఇగ సాక్షి చానల్ అయితే జగన్ బయట ఉన్నప్పుడు చేసిన ఓదార్పుయాత్రను, ఆయన పంచ్ డైలాగులను పాడిందేపాట పాచిపండ్లరోత అన్నట్లు ప్రసారం చేసింది. తలాతోకా లేని సమన్యాయం అనే మాటను అసహ్యం పుట్టిందాంక వినిపించింది.

సీమాంధ్రనాయకుల అరుపులను పట్టించుకోకుంట ఆగస్టు 27న తెలంగాణపై ముందుకే పోతమని ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడ కుండ బద్దలు కొట్టిండు. ఇగ జగన్ పార్టీ సమన్యాయం అనే మాటను గాలికొదిలి సమైక్యవాదమని ఇంకోపాట అందుకుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆపాలని అరిచి గీపెట్టింది. రాష్ట్రాన్ని సమైక్యంగనే ఉంచాలని లొల్లిపెట్టింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు విజయమ్మ ప్రధానమంత్రికి ఈ సోదంతా పోగేసి బహిరంగలేఖ రాసింది.

జగన్ పార్టీ అవకాశవాద రాజకీయాలకు విసిగిపోయి ఆయనను నమ్ముకొని రెంటచెడ్డ రేవడిలెక్క మిగిలిన కొండా సురేఖ దంపతులు ఆ పార్టీకి రాజీనామా చేసింన్రు. జగన్ పార్టీకి బలంగా మద్దతిచ్చి ఆగమాగం అయిన సురేఖ కూడ ఈడ్చి తన్నడంతో ఇంక తెలంగాణలో ఆ పార్టీకి అడ్రస్ లేకుండ పోయింది. కొండా సురేఖతో పాటు జగన్ పార్టీల ఉన్న చిన్నాచితక తెలంగాణనాయకులు కూడ ఆ పార్టీని వొదిలిపెట్టి దుమ్మెత్తిపోసింన్రు. అంతకు ముందు రాష్ట్ర విభజన తమ చేతులల్ల లేదని, ఆర్టికల్ 3 ప్రకారం కేంద్రం నిర్ణయం తీసుకోవాలని నంగి మాటలు చెప్పిన జగన్ మాపుమాపు రంగు మార్చడంతో, జగన్ పార్టీ ఎన్నటికైనా తెలంగాణ వ్యతిరేక పార్టీయేనని గ్రహించి బయటికొచ్చింన్రు. జగన్ పార్టీ లొల్లి ఆయన మీడియా కుప్పలు తెప్పలుగ కుమ్మరించింది. కిరాయిమూకలతో సమైక్య ఉద్యమానికి పెట్రోల్ పోసింన్రు.

జగన్ మడమతిప్పి, నాలుక మడతేసి సమైక్యపాట అందుకోవడంతో, అయిదులక్షల కోట్లు కావాలన్న నోటితోటే చంద్రబాబు సమన్యాయం అని ఎంగిలి పాట అందుకుండు. సెప్టెంబర్ 2న గుంటూరులో మాట్లాడుకుంట రాష్ట్ర విభజనపై కడుపు మంటను కక్కిండు. జగన్, చంద్రబాబు పార్టీలు తెలంగాణను అడ్డుకోవటానికి పోటీపడి కుటిలయత్నాలు చేసినయ్.

వక్ఫ్‌బోర్డ్ భూములను లాంకో హిల్స్‌పేరుతో మింగిన కాంగ్రెస్ ఎంపి లగడపాటి రాజగోపాల్ తప్ప మరో సీనియర్ సీమాంధ్ర నాయకుడు ఈసారి గంతు లేయలేదు. కావూరి సాంబశివరావుకు మంత్రిపదవి దొరికినంక గమ్మున కూసుంటె ఇంకో సీనియర్ ఎంపి రాయపాటి సాంబశివరావు కూడ గట్టిగ బయటికి రాలేదు.

రొండు ఆంధ్రాపార్టీలు కిందామీదా పడుతుంటే ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ సంఘ నాయకుడు అశోక్‌బాబు నడమంత్రాన నాయకుడైండు. ఆంధ్రా పెట్టుబడి దారుల అండతో ఆయన తెలంగాణకు వ్యతిరేకంగ మాట్లాడటం మొదలు పెట్టిండు. ఇంక ఆంధ్రా మీడియా అందుకొని ఆయనను ఆకాశమంత ఎత్తుకు లేపింది. సీమాంధ్ర ఉద్యమాన్ని తన చెప్పుచేతులల్ల ఉంచుకోవటానికి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి తెగ ప్రయత్నం చేసిండు. అశోక్‌బాబును లోపాయకారిగ రెచ్చగొట్టి రోడ్ల మీదికి వొదిలిండు.

ఈ పరిస్థితిల సమైక్యవాదం వినిపించడానికి హైదరాబాద్‌ల ఉద్యోగ సంఘాల సభ అని ఒకటి కాయించింద్రు. తెలంగాణ ఉద్యమకారులు ఏ సమా వేశం పెట్టినా అనుమతులు ఇయ్యకుంట అష్టకష్టాలు పెట్టే ప్రభుత్వంగాని, పోలీసులు గాని అశోక్ బాబుకు అలవోకగ అనుమతి ఇచ్చి ఎర్రతివాచీ పరిచింద్రు.

సేవ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో సమైక్యసభను సెప్టెంబర్ 21న నిర్వహించాలని తలపెట్టింద్రు. ఈ సభకు అనుమతి ఇయ్యొద్దని తెలంగాణ వాదులు మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. సమావేశం రోజు తెలంగాణ బంద్ ప్రకటించినా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ముందురోజే సీమాంధ్ర ఉద్యోగులు ప్రజలు హైదరాబాద్ చేరింద్రు. దండయాత్రకు వొచ్చినట్లుగ హైదరాబాద్ మీది కొచ్చింద్రు. తెలంగాణకు వ్యతిరేకంగా సమైక్య ఉద్యమాన్ని ప్రోత్సహించే ఈనాడు రామోజీరావు ఆంధ్రనుంచి వొచ్చిన వారికి తన ఫిల్మ్‌సిటీల ఆ రాత్రి బస ఏర్పాటు చేసిండు.

ర్యాలీలు చేయొద్దనీ, ఉద్యోగులు కానివారు పాల్గొనవద్దని కోర్టు ఉత్తర్వులు ఉన్నా ధిక్కరించి ర్యాలీలు తీసింద్రు. సీమాంధ్ర నుంచి ఫ్యాక్షన్ గ్యాంగులు, విజయవాడ నుంచి రౌడీగుంపులు ర్యాలీలు తీసినయ్. అడ్డుకోవడానికి ప్రయత్నం చేసిన ఉస్మానియా విద్యార్థులను తలలు కోస్తమంటూ బెదిరించుకుంట, ఉన్మాదుల లెక్క బజార్లంగ పోయింద్రు.

సమావేశానికి ఉద్యోగులతోపాటు వేదవాక్కులు, నీతిసూత్రాలు వల్లించే ధర్మపురి సత్యవాణి కూడా హాజరయి నోటికొచ్చింది వాగింది. ఇగ గజల్ శ్రీనివాస్ అనేటాయన కూడ యమ హడావుడి చేసిండు. సీమాంధ్రుల మదమెక్కిన మాటలకు

తెలంగాణ ప్రజలు ఉడికిపోయింద్రు. సభ జరుగుతుంటెనే శ్రీనివాస్ అనే తెలంగాణ కానిస్టేబుల్ ఎల్‌బి స్టేడియంల జై తెలంగాణ అంటూ నినాదాలు చేసి తెలంగాణ ఆకాంక్షను దిక్కులు పిక్కటిల్లేటట్లు వినిపించిండు. పోలీసులు ఆంధ్రా తొత్తులు శ్రీనివాస్ మీద పడి కొట్టింద్రు. సమైక్యవాదం బూటకమని తెలంగాణ వాదం నిప్పు వంటిదని శ్రీనివాస్ నినాదాలతో మళ్లోసారి లోకానికి తెలిసింది.

సమైక్యాంధ్రసభ విజయవంతం అయ్యిందని సీమాంధ్రనాయకులు తెగ విర్రవీగింద్రు. ఇగ తెలంగాణను అడ్డుకోవడానికి కాలుకేస్తే మెడకు, మెడకేస్తే కాలికి అన్నట్లు మాట్లాడింద్రు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని, రాయల తెలంగాణ ఏర్పాటు చేయాలని నోటికొచ్చినట్లు వొర్లింద్రు. పోలవరం ప్రాజెక్టుతోటి నీళ్లు దోచుకోవడానికి మునగాల, భద్రాచలంను ఆంధ్రల కల పాలని గొంతెమ్మ కోర్కెలు కోరింద్రు.

ఆంధ్రోళ్లు ఓదిక్కున గాయిగాయి చేస్తుంటె రొండు కండ్ల సిద్ధాంతం అడ్డం పెట్టుకొని తప్పించుకొని తిరుగుతున్న చంద్రబాబు సెప్టెంబర్ 21న ఢిల్లీకి పోయి రాష్ట్రపతిని కలిసిండు. రాష్ట్రంల రొండు ప్రాంతాలల్ల ఉద్యమాలు జరుగుతున్న యని, అందుకని విభజన ఆపాలని చెప్పిండు. జోక్యం చేసుకొని చిచ్చును ఆర్పండి అని మొక్కి వొచ్చిండు.

చంద్రబాబు డ్రామాలు ఆడుతుంటె చంద్రబాబుతో ఆడుకోవడానికి జగన్‌కు అవకాశం దొరికింది. 16 నెల్ల సంది జైల్ల ఉంటున్న జగన్‌కు సెప్టెంబర్ 23న బెయిల్ వొచ్చింది. తెల్లారి జైలు నుంచి బయటి కొచ్చిండు. ఇక సమైక్య వాదానికి లీడరు కావాలని జగన్, చంద్రబాబు పోటీపడి డ్రామాలు నడిపింద్రు.

కృత్రిమ సమైక్యాంధ్ర ఉద్యమం జరుగుతుంటె దానికి జవాబుగ టిఆర్ఎస్ సెప్టెంబర్ 29న నిజాం కాలేజి గ్రౌండ్‌ల సకలజనభేరి బహిరంగసభను నిర్వహించి తెలంగాణ ఉద్యమసత్తాను చాటింది. రాష్ట్రంల ఉద్యమాలు జరుగుతుంటే కేంద్రం తన పని తాను చేసుకుంట పోయింది. 2013 అక్టోబర్ 3న కేంద్ర హోంశాఖ రూపొందించిన తెలంగాణ నోట్‌ను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఇంతకు ముందు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయంల ఎట్లాంటి మార్పులు లేకుంట ఆమోదం తెలిపింది. హైదరాబాద్ రాజధానిగ పదిజిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయటానికి అంగీకరించింది.

# వలసనాయకుల దుష్ట పన్నాగం

తెలంగాణ ప్రక్రియ వేగం పుంజుకుంది. ఇంక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఖాయమైంది. ఈ విషయం తెలిసికూడ ఆంధ్రాబాబులు జగన్, చంద్రబాబు, కిరణ్ కుమార్‌రెడ్డి పోటీలు పడి డ్రామా నడిపించింద్రు. ఆంధ్రా కావరంతో రాష్ట్రంల పడి నోటికొచ్చినట్లు వాగింద్రు. ఒక నీతి ఒక నియతి లేకుండ వొర్లడం మొదలు పెట్టింద్రు. రాష్ట్ర ప్రజలు చీదరించుకునేటట్లు ఓవరాక్షన్ చేసింద్రు.

జగన్ అయితే తండ్రి పేరు చెప్పుకొని సినిమాస్క్రిప్టును తలదన్నే నాట కాలు మొదలుపెట్టిండు. 2013 అక్టోబర్ 5న ఆయన ఇంటికాడ జూబ్లిహిల్స్‌లోని లోటస్ పాండ్ దగ్గర సమైక్యదీక్ష అని కాయించిండు. సీమాంధ్రులకు నాయకుడు కావాలన్న లక్ష్యంతో తానే రాష్ట్ర విభజనను అడ్డుకుంటున్నట్లు చెప్పుకోవటానికి దీక్షకు కూసుండు. ఎప్పటిలెక్కనే ఆయన చానల్, పేపర్ డప్పుకొట్టినయ్. అయితే రాత్రిపూట ఎక్కడోళ్లు అక్కడ పోయినంక దొంగచాటుంగ దీక్ష నుంచి లేచి ఇంట్లకు పోయిండు. రొండు గంటల తర్వాత మల్ల వొచ్చి ఏమి ఎరుగనట్లు కూసుండు. ఈ క్లిప్పింగ్‌లు తెల్లారి టీవి చానళ్లల్ల ప్రసారమైనయ్. దాంతో ఇజ్జత్ పోయి దీక్షా గుడారం ఎత్తేసిండు. కొత్త ఎత్తుగడ వేయటానికి తయారైండు.

జగన్ సమైక్యాంధ్ర దీక్షకు కూసొని సీమాంధ్రకు నాయకుడు అయితడో ఏమోనని చంద్రబాబుకూడ నాటకం వేయడానికి తయారైండు. అయితే ఆయన ఎక్కడ వేయాలె. ఆంధ్రల గుడారం వేస్తే అది ఆంధ్రా గుడారమేనని తెలంగాణోళ్లు అంటరు. తెలంగాణల వేస్తే వెంటబడి తరుముతరు. అందుకని ఇక్కడ కాదు, అక్కడ కాదని ఢిల్లీల ఎపి భవన్ దగ్గర గుడారం వేసిండు. 2013 అక్టోబర్ 7న అక్కడ దీక్షకు కూచుండు.

జగన్ అయితే రాష్ట్రం సమైక్యంగ ఉండాలని తొండికో, మొండికో కుండ బద్దలు కొట్టిండు. తెలంగాణ మీద ఆశలు వొదులుకుండు. మరి చంద్రబాబుకు తెలంగాణల కూడ అంతో ఇంతో పార్టీ ఆనవాళ్లు కనబడుతుండె. అవి వొదులు

కోలేక ఢిల్లీల కూచుండు. మరి ఎందుకు కూచుండో చెప్పాలె కదా! అదేమాట జాతీయ మీడియా అడిగింది. జగన్ రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తుండు. మరి మీరెందుకు దీక్షకు దిగినట్టు అని అడిగింద్రు. చంద్రబాబు గుడ్లు తేలేసిండు. కుట్ర అని చెప్పలేదు కదా! అందుకని మళ్లా రొండు కండ్ల సిద్ధాంతం చెప్పిండు. ఇద్దరు కొడుకులు ఉంటె ఏ కొడుకును సమర్థిస్తవు అని తలాతోక లేని పిట్టకథలు వినపించిండు. విసిగి వేసారిన జాతీయ మీడియా ప్రతినిధులు ప్రత్యక్ష ప్రసారంలనే చంద్రబాబు దీక్షకు ఎందుకు కూచుండో అరగంట మాట్లాడినా అర్థం కాలేదని మొకంమీద కొట్టినట్లు చెప్పింద్రు. చంద్రబాబు నాటకం జాతీయస్థాయిల ఇజ్జత్ తీసింది. ఇంగ బాగలేదు ఉంటె ఆయింత ఇజ్జత్ పోతదని మూటముల్లె సదురుకొని ఇంటిబాట పట్టిండు.

ఆంధ్రా పార్టీల నాటకాలు ఇట్ల నడుస్తుంటె అక్టోబర్ 8న రక్షణ మంత్రి ఎకె ఆంటోని చైర్మన్‌గ మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది కేంద్రం. కేంద్ర హోం మంత్రి సుశీల్‌కుమార్ షిండే, ఆర్థికమంత్రి చిదంబరం, ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి గులాంనబి ఆజాద్, పెట్రోలియం శాఖ మంత్రి వీరప్ప మొయిలీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేశ్ మొత్తం ఐదుగురు సభ్యులు మంత్రుల బృందంల ఉన్నరు. వి. నారాయణస్వామి ప్రత్యేక ఆహ్వానితుడు.

రాష్ట్ర విభజన మీద సూచనలు సలహాలు ఇయ్యాలని మంత్రుల బృందం రాష్ట్ర పార్టీలను కోరింది. నవంబర్ 12,13 తారీకులల్ల ఢిల్లీల కలిసి అభిప్రాయాలు చెప్పాలని కోరింది. ఐదు పార్టీలు కాంగ్రెస్, బిజెపి, టిఆర్‌ఎస్, సిపిఐ, ఎంఐఎం తమ సూచనలతో నివేదికలు ఇచ్చినయ్. కాని సమన్యాయం అంటూ ఊరూరా తిరిగే చంద్రబాబు ఆ సమన్యాయానికి ఏం చేయాలనో చెప్పమంటే తప్పిం చుకుండు. ఎన్నిసార్లు చెపుతం అని తొర్రిమాటలు మాట్లాడిండు. జిఓఎంకు నివేదిక ఇయ్యకుంట తప్పించుకుండు. తెలంగాణ వ్యతిరేకపార్టీ సిపిఎం, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ కూడా మొఖం చాటేసినయ్.

ఈ మధ్యల రాయల తెలంగాణ అని రాయలసీమ నాయకులు జెసి దివాకర్‌రెడ్డి, టిజి వెంకటేశ్ కొత్తపాట అందుకుంద్రు. ఇంతకాలం తెలంగాణ ఉద్య మాన్ని అణచడానికి ఆంధ్రోళ్లవెంట తిరిగి తీరా తెలంగాణ రాష్ట్రం ఏర్పాట యితుంది అనేసరికి మేం ఆంధ్రా నాయకులతో వేగలేం తెలంగాణతోటే కలిసుంటం అని వగలుపడ్డరు. ఈ నాటకాలను చూసిన కేంద్రం ఆలోచనల పడ్డది. రాయల తెలంగాణ ఏర్పాటు చేస్తే కొంత వ్యతిరేకత తగ్గుతుందని ఆలోచించింది. ఇది గమనించిన కెసిఆర్ డిసెంబర్ 3న రాయల తెలంగాణ అంటే రణమే అని గర్జించిండు. తెలంగాణకు

వ్యతిరేకంగా సీమాంధ్ర నాయకులు చేస్తున్న కుట్రలను అడ్డుకోవటానికి డిసెంబర్ 4న నిరసన, 5న బంద్‌కు పిలుపునిచ్చింది.

అనుకున్నట్లుగనే తెలంగాణల డిసెంబర్ 4న నిరసన బ్రహ్మాండంగ జరిగింది. డిసెంబర్ 5న బంద్ జరిగింది. దీంతో కేంద్రానికి దిమ్మతిరిగింది. రాయల తెలంగాణ అంటే తెలంగాణ మరింత అట్టుడుకుతదని భావించింది. మల్లా ఆలోచనల పడ్డది. తెలంగాణ బంద్ జరిగిన డిసెంబర్ 5 తారీకుననే పార్లమెంటు సమావేశాలు మొదలయినయ్. అదే రోజు తెలంగాణ ముసాయిదా బిల్లు–2013ను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయించి నట్లుగనే హైదరాబాద్‌తో కూడిన పది జిల్లాల తెలంగాణకు జై కొట్టింది.

# అసెంబ్లీకి విభజన బిల్లు

ఒకవారం గడిచింది. బిల్లును అడ్డుకోవడానికి సీమాంధ్ర నాయకుల కుట్రలు కొనసాగించింద్రు. ఈ నేపథ్యంల విభజన బిల్లును రాష్ట్రపతి పంపిండు. ప్రత్యేక విమానంల 2013 డిసెంబర్ 12న బిల్లు రాష్ట్రానికి చేరింది. ఆరువారాలల్ల రాష్ట్ర అసెంబ్లీ అభిప్రాయం చెప్పాలని రాష్ట్రపతి కోరిండు. అప్పటికే రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు కూడ మొదలయినయ్. కేంద్ర హోంశాఖ అధికారులు సాయంత్రం ఎనిమిది గంటలకు చీఫ్‌సెక్రటరీ మహంతికి రాష్ట్ర విభజన బిల్లును అందించింద్రు.

తెల్లారి రాష్ట్ర అసెంబ్లీకి బిల్లు వొస్తదని తెలంగాణవాదులు, నాయకులు భావించింద్రు. కాని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి బిల్లు అసెంబ్లీకి రాకుండ అడ్డుకునే ప్రయత్నం చేసిండు. మధ్యాహ్నం రెండు వరకు రాకపోయే సరికి టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు లొల్లి పెట్టింద్రు. డిసెంబర్ 13న అసెంబ్లీ వాయిదా పడ్డంక బిల్లు అసెంబ్లీకి చేరింది. ఆ రోజు బిల్లు ప్రతులు తెలంగాణ శాసనసభ్యులకు అందకుండ ఆపగలిగిండు ముఖ్యమంత్రి. 14 తారీకు ఆదివారం. 15న బిల్లు ప్రతులకు ఎమ్మెల్యేలకు అందించింద్రు. 16న బిల్లుపై చర్చను ప్రారంభించిండు డిప్యూటి స్పీకర్ మల్లు భట్టివిక్రమార్క. ప్రతిపక్షనాయకుడు చంద్రబాబును మాట్లాడమని కోరిండు.

దీంతో పార్టీలకు అతీతంగా సీమాంధ్ర ప్రాంతానికి చెందిన శాసన సభ్యులు పిచ్చి పట్టినట్లు బిల్లు ప్రతులను చింపింద్రు. కాలుతో తొక్కి నిరసన తెలిపింద్రు. కనీస సంస్కారం లేకుంట ప్రవర్తించింద్రు. సభల గందరగోళం సృష్టించింద్రు. ఇట్లాంటి పరిస్థితిల సభ వాయిదాపడ్డది.

చర్చ ప్రారంభమైందని, ఇంక అభిప్రాయాలు చెప్పినా, చెప్పకున్నా శాసనసభ పని అయిపోయిందని తెలంగాణ శాసనసభ్యులు వాదించింద్రు. ముఖ్యమంత్రి మాత్రం బిల్లుపై చర్చ మొదలు కాలేదని తొండిమాటలు చెప్పటం మొదలుపెట్టిండు. అసెంబ్లీల బిల్లుపై చర్చ ప్రారంభమైందని అదేరోజు శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించిండు. గందరగోళం ఏర్పడ్డది. మూడు రోజుల పాటు నడిచింది సభ. డిసెంబర్ 19న తొలివిడత సమావేశాలు వాయిదా పడ్డయ్.

అదేరోజు రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ శీతాకాల విడిదికోసం హైదరాబాద్ వొచ్చిండు. బొల్లారంలోని రాష్ట్రపతి విడిదికి పోయి ఆంధ్రానాయకులు తెలంగాణను అడ్డుకోవడానికి శతవిధాల ప్రయత్నం చేసింద్రు. తెలంగాణ నాయకులు కూడ రాష్ట్ర పతిని కలిసి పరిస్థితిని వివరించింద్రు. విభజనను ఆపడం సాధ్యం కాదని తనను కలిసిన సీమాంధ్ర నాయకులతో రాష్ట్రపతి చెప్పినట్లు వార్తలొచ్చినయ్. రాష్ట్రపతి హైదరా బాదుల ఉన్న పదిరోజులు తెలంగాణ సీమాంధ్ర నాయకులు విడవకుంట కలిసింద్రు.

శాసనసభ మలివిడత సమావేశాలు 2013 జనవరి 3 నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. సరిగ్గా రొండు రోజుల ముందు 2013 డిసెంబర్ 31న ముఖ్య మంత్రి మరో కుట్ర చేసిండు. రాష్ట్ర పునర్విభజన బిల్లుపై చర్చ మొదలైందని ప్రకటించిన శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబును తప్పించాలనుకుండు. తెలంగాణ మంత్రి ఉంటే తన ఆటలకు అడ్డుపడుతుండనుకొని శ్రీధర్‌బాబు దగ్గరున్న శాసనసభా వ్యవహా రాల శాఖను తెలంగాణపై విషంగక్కే సీమాంధ్ర మంత్రి శైలజానాథ్‌కు అంట గట్టిండు.

దీంతో శ్రీధర్‌బాబు మండిపడ్డడు. ముఖ్యమంత్రి రెచ్చగొట్టే చర్యలకు ఒడి గడుతుండని అన్నడు. రాష్ట్ర పునర్వి భజన బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంల ముఖ్యమంత్రి నీచానికి ఒడి గట్టటం తెలంగాణ నాయకులకు కోపం తెప్పించింది. ఒకే గొంతుతో ముఖ్యమంత్రిని కడిగి పారేసింద్రు. కుట్రలతో తెలంగాణను అడ్డు కోలేరని హెచ్చరించింద్రు. ముఖ్య మంత్రి చర్యలకు నిరసనగా 2014 జనవరి 2న శ్రీధర్‌బాబు మంత్రి పదవికి రాజీనామా చేసిండు.

తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ప్రారంభమయ్యేసరికి ముఖ్యంగ చంద్రబాబుకు నిద్ర పట్టకుంట అయింది. ఆయన తన కసిని మొదటి నుంచి కెసిఆర్ మీద కక్కు తుండు. తెలంగాణ టిడిపి నాయకులు మోత్కుపల్లి నర్సింహులు, ఎర్రబెల్లి దయాకర్ రావును ఉసిగొల్పుతనే ఉండు. మోత్కుపల్లి అయితే మేకపోతు గాంభీర్యం తోటి కెసిఆర్‌పై అనేకసార్లు నోరు పారేసుకుండు. కెసిఆర్ తన పార్టీ టిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌ల విలీనం చేయడం లేదు కాబట్టి తెలంగాణ రాష్ట్ర సాధన ఆలస్యమైతుందని బోడిగుండుకు మోకాలును లింకుపెట్టి మాట్లాడిండు. నోరు తెరిస్తే కెసిఆర్ ఫాంహౌస్‌ల పండుకుండని, అందుకనే తెలంగాణ ఆలస్యమైతుందని తలాతోక లేకుంట మాట్లాడిండు. అసలు కెసిఆర్‌కు తెలంగాణ రావడం ఇష్టం లేదని కూడ వాగిండు. చంద్రబాబు మెప్పును పొందడానికి దిగజారి మాట్లాడిన మోత్కుపల్లి తన గౌరవాన్ని తనే పోగొట్టుకుండు.

పునర్విభజన బిల్లు అసెంబ్లీకి వొచ్చినంక కూడ అవే తొర్రికూతలు కూయడం మొదలుపెట్టిండు. ఫాంహౌస్, విలీనం అని రోత పుట్టించిండు. ఇంత కాలం విను

కుంట ఉన్న కెసిఆర్ 2014 జనవరి 2న విలేకరులను పిలిపించి తన వ్యవసాయ క్షేత్రం సొంతం చూపించిండు.

తనది వ్యవసాయ కుటుంబమని మందిసొమ్ము దోచుకొని రాలేదని గూబ గుయ్యి మనేటట్లు కెసిఆర్ జవాబు చెప్పిండు. దాంతోటి చంద్రబాబు, మోత్కుపల్లి నర్సింహులు, ఎర్రబెల్లి దయాకర్‌రావు మల్ల మాట్లాడితె ఒట్టు. ఆ తర్వాత ఫాంహౌస్ అనే మాట చంద్రబాబు నుంచి గాని ఆయన పెంచి పోషిస్తున్న ఆయన పార్టీ నాయకుల నుంచి కానీ రాలేదు. కెసిఆర్ జోలికి పోయి తెలుగుదేశం మల్లా ఒకసారి పండ్లూడ గొట్టుకుంది. చంద్రబాబుకు తన్నబోయి తన్నిచ్చు కున్నట్లు అయ్యింది.

2014 జనవరి 3న శాసనసభ మలివిడత సమావేశాలు మొదలయినయ్. అయినా సీమాంధ్ర నాయకులు పోటీపడి గొడవ చేసింద్రు. దీంతోటి అట్ల మొదల యిన సమావేశాలు ఇట్ల వాయిదాపడ్డయ్. మూడు రోజులు ఒట్టిగనే కాలం బొలిపింద్రు.

జనవరి 6న బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశం స్పీకర్ నాదెండ్ల మనోహర్ నిర్వహించిండు. ఆ బిఎసి సమావేశంలో స్పీకర్‌ను ఎంఐఎం శాసన సభాపక్ష నాయకుడు అక్బరుద్దీన్ అడిగిండు. ఇంతకు బిల్లుపై చర్చ ప్రారంభమైందా లేదా అని. దాంతో చర్చ ప్రారంభమైనట్లు అసెంబ్లీల స్పీకర్ ప్రకటించిండు. చర్చ ప్రారంభం కాలేదని అబద్ధాలు చెప్పిన ముఖ్యమంత్రి నాటకం బయటపడ్డది. అయినా ముఖ్యమంత్రి మూర్ఖపు చర్యల వల్ల సభ్యులు అభిప్రాయాలు చెప్పే వాతావరణం లేకుంటపోయింది. ఎట్టకేలకు జనవరి 8న మంత్రి వట్టి వసంత కుమార్ బిల్లుపై తొలిప్రసంగం చేసిండు. ఆ తర్వాత చర్చ గాడిన పడ్డది. రొండు రోజులు నడిచింది. జనవరి10న టిఆర్ఎస్ శాసనసభాపక్ష నేత ఈటెల రాజేందర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరం గురించి ఉద్వేగభరితంగ మాట్లాడిండు.

'వెయ్యిమంది అమరుల త్యాగ ఫలితం ఇది. అరవయ్యేండ్ల పోరాటాలకు ప్రతిరూపమిది. బిల్లుల అమరవీరుల రక్తముంది. వారిని కన్నతల్లుల ఆవేదన ఉంది. మన చేతికి నిప్పు తగిలితే అమ్మా అంటం. కాని ఎల్‌బినగర్ చౌరాస్తాల శ్రీకాంతాచారి ఒంటిపై పెట్రోలు పోసుకొని మంటల్ల కాలిపోతూ జై తెలంగాణ అని నినదించిండు. ఉస్మానియా యూనివర్సిటీల యాదయ్య మంటల్ల కాలిపోతూ జై తెలంగాణ అంటూ నినాదం చేసిండు. అమరుల త్యాగాలు ఢిల్లీ పెద్దలకు వినిపించటం లేదని ఢిల్లీ పెద్దలకు లేఖరాసిన యాదిరెడ్డి పార్లమెంట్‌కు కూతవేటు దూరంల ఉరేసుకున్నడు. అట్లాంటి వెయ్యిమందికి పైగా అమరవీరుల త్యాగాలు ఈ బిల్లును తెచ్చినయ్. క్రైస్తవు లకు బైబిల్, ముస్లింలకు ఖురాన్, హిందువులకు భగవద్గీత ఎంత పవిత్రమైనవో

మాకు ఈ ముసాయిదా బిల్లు అంత పవిత్రమైనది. అట్లాంటి బిల్లును మీరు చించి వేసింగ్రు. కాల్చి బూడిద చేసింగ్రు. ఇదేనా మీ సంస్కారం?' అంటూ తెలంగాణ ఎందుకు కావాల్నో పూసగుచ్చినట్లు చెప్పిండు. సీమాంధ్ర నాయకుల తీరుపై మండి పడ్డడు. ఆనాటితో శాసనసభ మలివిడత సమావేశాలు ముగిసినయ్.

మూడు రోజులు సభ నడిపినట్లు చేసిన ముఖ్యమంత్రి తెలంగాణను అడ్డ కోవడానికి మరొక కుట్రకు పావులు కదిపిండు. చర్చకు సమయం సరిపోదని ఇంకో మూడువారాలు గడువును రాష్ట్రపతిని కోరాలని ఉపాయం చేసిండు.

ఇట్ల గడువు పెంచుకుంట అసెంబ్లీలనే బిల్లును ఆలస్యం చేయాలని అను కున్నడు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఫిబ్రవరి 4 నుంచి మొదలయి 20 వరకు నడుస్తయని, ఆ తర్వాత ఎలక్షన్ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని ప్రచారమైంది. ఎన్నికల వరకు తెలంగాణను ఆపగలిగితే ఆ తర్వాత ఏ ప్రభుత్వం ఏర్పడినా మరో ఐదేండ్లు తెలంగాణను అడ్డుకొని దోచుకోవచ్చని భావించిండు. అందు కని గడువు కోరుతూ చీఫ్ సెక్రెటరీ ద్వారా రాష్ట్రపతికి లేఖ పంపడానికి తయారైండు. 2014 జనవరి 17న తుదివిడత సమావేశాలు మొదల యినయ్. తెలంగాణ సీమాంధ్ర ప్రాంతాలకు చెందిన సభ్యులు అభిప్రాయాలు చెప్పింగ్రు.

అప్పటికే సీమాంధ్ర నాయకులు ముఖ్యంగ తెలుగుదేశం నాయకులు హైదరాబాద్‌ను చంద్రబాబే అభివృద్ధి చేసిండని అవాకులు చెవాకులు పేకింగ్రు. ఇంతకు ముందు కూడ చంద్రబాబు అనేకసార్లు హైదరాబాద్‌ను నేనే అభివృద్ధి చేసిన అని గుండెలు బాదుకుండు. ఇదే కాకుండ నిజాంది నిరంకుశ పాలనంటూ కమ్యూ నిస్టుల మాటలను కూడ వినిపించింగ్రు సీమాంధ్ర శాసనసభ్యులు.

వీటన్నింటికి సమాధానంగ 2014 జనవరి 20న ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ అసెంబ్లీల గర్జించిండు. హైదరాబాద్‌ను ఎవరూ అభివృద్ధి చేయలేదు. అభివృద్ధి చెందిన హైదరాబాద్‌కే అంతా వొచ్చింగ్రు. దోచుకున్నరు అని విరుచుకు పడ్డడు. నిజాంకాలంల అభివృద్ధి చేసిన ప్రాజెక్టులు, చెరువులు, యూనివర్సిటీ, ఆస్ప త్రులు, పాఠశాలలు, ఆనాటి పత్రికలు అంటూ ఏకరువు పెట్టిండు. చంద్రబాబు, తెలుగుదేశం పార్టీనే హైదరాబాద్‌ను అమ్ముకున్నదని దుమ్మెత్తిపోసిండు. హైదరాబాద్ రాజధానిగ పదిజిల్లాల తెలంగాణే కావాలని, సంపూర్ణ అధికారాలున్న తెలంగాణే కావాలని డిమాండు చేసిండు. నిజాంను చూపి విభజనను అడ్డుకుంటరా అని గర్జిం చిండు. అక్బరుద్దీన్ ధాటికి సీమాంధ్ర నేతల నాలికలు పిడచబారినయ్. చంద్రబాబుకు మాట పడిపోయింది.

ఆ తెల్లారి టిఆర్ఎస్ సభ్యుడు కెటిఆర్ వాడివేడిగ మాట్లాడిండు. వెయ్యి మంది బలిదానాలు చేసుకుంటే మాట్లాడని సీమాంధ్రనాయకులు ట్యాంక్‌బండ్ మీద మట్టి విగ్రహాలు కూలితే గగ్గోలు పెట్టింద్రని ఘాటుగ మాట్లాడిండు. తెలం గాణను దోచుకున్నది సీమాంధ్ర నాయకులు, వారి పార్టీలేనని విరుచుకు పడ్డడు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష సంపూర్ణ తెలంగాణ అని వివరించిండు.

2014 జనవరి 22న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర పునర్విభజన బిల్లును వ్యతిరేకిస్తున్నాను అంటూ అంతుపొంతు లేని ప్రసంగం మొదలుపెట్టిండు. ముఖ్యమంత్రి బిల్లును వ్యతిరేకిస్తున్నా అని మొదలు పెట్టిన కాసేపటికి మంత్రి జానారెడ్డి లేచి కిరణ్‌కుమార్‌రెడ్డి ఏ హోదాల మాట్లాడుతున్నడో వివరణ ఇయ్యాలని కోరిండు. సభానాయకుడి హోదాల మాట్లాడితే ఆయన అభిప్రాయంతో తాము ఏకీభవించటం లేదని చెప్పిండు. అయినా కిరణ్‌కుమార్‌రెడ్డి వివరణ ఇయ్యకుంటనే వెకిలి చూపుల్తో, తొండి మాటలతో ప్రసంగాన్ని సాగదీసిండు.

అదేరోజు చంద్రబాబు కూడ మాట్లాడిండు. బిల్లు, లోపాలు అని సోది చెప్పిండు. కాని తాను బిల్లును వ్యతిరేకించేది, స్వాగతించేది చెప్పలేదు. సోమవారం చెపుత అని దాటేసిండు.

అప్పటికే చీఫ్ సెక్రెటరీ మూడువారాల గడువు పెంచాలని రాష్ట్రపతికి లేఖ రాసిండు. దాని స్పందనగా రాష్ట్రపతి ఒక్క వారం గడువు పెంచుతూ ముందు ఇచ్చిన గడువు చివరిరోజైన 23న లేఖ పంపిండు.

ఆ తర్వాత జనవరి 25న మళ్లా చంద్రబాబు మాట్లాడిండు. బిల్లు తప్పుల తడకనీ, దాన్ని తిప్పిపంపాలనీ అన్నడు. చంద్రబాబు అన్నదే ఆలస్యం, ముఖ్యమంత్రి అదే సొల్లు తానూ వాగిండు. డ్రాఫ్ట్ బిల్లు కాకుండా ఒరిజనల్ బిల్లు పంపాలని తన జ్ఞానమంతా ఒలికించిండు. అదేరోజు సాయంత్రం రూల్ 77 కింద బిల్లును వాపసు పంపాలని స్పీకరుకు తీర్మానం నోటీసు ఇచ్చిండు.

సభ సజావుగ సాగుతుండటంతో కిరణ్‌కుమార్‌రెడ్డికి పిచ్చెక్కినట్లయింది. చంద్రబాబు పరిస్థితి అదే. ఇగ శాసనసభ సమావేశాలు ప్రారంభమైన దగ్గరి నుంచి సమైక్య తీర్మానం చేయాలె, ఓటింగ్ పెట్టాలె అని మూర్ఖవాదం చేసి సభ నుంచి సస్పెండ్ అయ్యింద్రు వైఎస్ఆర్ కాంగ్రెస్ సభ్యులు. అసెంబ్లీల ఆ మాటతప్ప మరోమాట మాట్లాడలేదు ఆ పార్టీ నేత విజయమ్మ.

ఈ మూడు ఆంధ్రాపార్టీలు కూడ దేనికదే తామే బిల్లును అడ్డుకున్నట్లు క్రెడిట్ కొట్టేయాలని తెగ ఆరాటపడ్డయ్. సీమాంధ్రల నాలుగు ఓట్లు, సీట్లు రాల్చు

కోవడానికి పోటీపడి జబ్బ లెగరేసింద్రు.

2014 జనవరి 30న రాష్ట్రపతి ఇచ్చిన గడువు పూర్తయితది. బిల్లుపై చంద్రబాబు అభిప్రాయం చెప్పాల్సి వొస్తది. కాబట్టి దాన్నుంచి తప్పించుకోవాలని ఆయన ఎత్తు. మొత్తం మీద సీమాంధ్ర పార్టీల నాటకాలు అసెంబ్లీ సాక్షిగ బయట పడ్డయ్. అయినా అదే మూర్ఖత్వంతో బిల్లును అడ్డుకోవాలని తెలంగాణను ఆపాలని ఉన్మాదాన్ని ప్రదర్శించింద్రు. బిల్లును వెనక్కి పంపాలన్న ముఖ్యమంత్రి ఏకపక్ష తీర్మానాన్ని సీమాంధ్ర శాసనసభ్యులంతా భుజాన వేసుకొని మొత్తుకుంద్రు.

అయితే జనవరి 26న ముఖ్యమంత్రి తీర్మానంపై తెలంగాణ మంత్రులు తిరుగుబాటు చేసింద్రు. ఎట్టి పరిస్థితిలోను దానికి ఒప్పుకోమని ఎదురు తిరిగింద్రు.

జనవరి 28న మరో మూడువారాల గడువు కావాలని రాష్ట్రపతికి ముఖ్య మంత్రి ఉత్తరం రాసిండు. ఇది ముఖ్యమంత్రి కుట్రేనని తెలంగాణను అడ్డుకోవటా నికి ముఖ్యమంత్రి ఆడుతున్న నాటకమని తెలంగాణ శాసనసభ్యులు విరుచుకు పడ్డరు. శాసనసభ సమావేశాలు ప్రారంభం కావడం, తెలంగాణ శాసనసభ్యులు ముఖ్యమంత్రి తీర్మానాన్ని తిరస్కరించి చర్చ ప్రారంభించాలని పట్టుబట్టడం– గందర గోళంతో సభ వాయిదా పడటం. ఇట్లనే రొండు రోజులు గడిచింది.

చివరిరోజు జనవరి 30. ఇక రాష్ట్రపతి గడువు పెంచడని అర్థమైంది. ఆఖరి రోజని తేలిపోయింది. బిల్లుమీద ఓటింగు పెట్టాలని ముఖ్యమంత్రి విశ్వప్ర యత్నం చేసిండు. అయితే తెలంగాణ నాయకులు మూకుమ్మడిగ అడ్డుకున్నరు.

అరవయ్యేండ్ల తెలంగాణల మొదటిసారి పార్టీలకు అతీతంగ తెలంగాణ శాసన సభ్యులంతా ఏకమైంద్రు. తెలంగాణను అడ్డుకోవాలని చూస్తే ఖబర్దార్ అని హెచ్చరించింద్రు.

అసలు రాష్ట్రపతి పంపిన బిల్లుపై శాసనసభ అభిప్రాయాలు మాత్రమే చెప్పాలె. బిల్లును తిరస్కరించే, వెనక్కి పంపే అధికారం అసెంబ్లీకి లేదు. ఓటింగ్‌కు కూడా అవకాశం లేదు. ఇది తెలిసి కూడా సీమాంధ్ర శాసనసభ్యుల సంఖ్య ఎక్కువ కాబట్టి మందబలంతో అడ్డుకోవాలని సీమాంధ్ర నాయకులు కుటిల ప్రయత్న చేసింద్రు. అంతకంటె గట్టిగ తెలంగాణ నాయకులు తిప్పికొట్టింద్రు.

శాసనసభ చివరిరోజు సమావేశం. జనవరి 30, ఉదయం తొమ్మిది. సభ ప్రారంభం కాంగనే తెలంగాణ శాసనసభ్యులు, మంత్రులు స్పీకర్ పోడియంను చుట్టు ముట్టి ముఖ్యమంత్రి తీర్మానాన్ని తిరస్కరించాలని పట్టుబట్టింద్రు. ఐదు నిమిషాలకే గంటపాటు సభ వాయిదా వేసిండు స్పీకర్ మనోహర్.

తర్వాత సభ మల్ల ప్రారంభమైంది. గాంధీ వర్ధంతిరోజు కాబట్టి మహాత్మునికి సభ నివాళులర్పించింది. వెంటనే మరో గంట వాయిదా. మల్లా సభ ప్రారంభం కాంగనే స్పీకర్ మాట్లాడిండు. '87 మంది శాసనసభ్యులు సభల మాట్లాండింద్రు. మిగిలినవాళ్లు వాళ్ల అభిప్రాయాలను రాతపూర్వకంగ ఇచ్చింద్రు. దీంతో మొత్తం సభ్యుల అభిప్రాయం రికార్డయింది. బిల్లుపై చర్చ ముగిసింది' అని ప్రకటించిండు.

ఈ ప్రకటన చేసిన తర్వాత ముఖ్యమంత్రి రూల్77 కింద ఇచ్చిన తీర్మానం చర్చకు తీసుకుంటున్నట్లు ప్రకటించిండు. గందరగోళం మధ్యనే మూజు వాణి ఓటుతో ఆ తీర్మానం నెగ్గిందని ప్రకటించిండు. ఆ తర్వాత శాసనసభ సమావేశాలను నిరవధి కంగ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిండు.

స్పీకర్ మనోహర్ ఆంధ్రపక్షపాత బుద్ధితో ముఖ్యమంత్రి రాజ్యాంగ విరుద్ధంగ ఇచ్చిన తీర్మానాన్ని మూజువాణి ఓటుతో నెగ్గిందని ప్రకటించిండని తెలంగాణ నాయ కులు విమర్శించింద్రు. ఇది స్పీకర్ గౌరవానికి తగింది కాదని అన్నరు. ఆ వెంటనే సీమాంధ్ర చానళ్లు బిల్లు వెనక్కి పంపింద్రని విషప్రచారం చేసినయ్. పైశాచిక ఆనందంతో కొందరు సీమాంధ్ర నాయకులు మిఠాయిలు పంచుకుంద్రు. తెలంగాణ బిల్లును ఆపగలిగినం అని జబ్బలు చరుచుకుంద్రు.

స్టార్ బ్యాట్స్‌మన్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీల తెలంగాణ బిల్లును అడ్డుకుండని ఇక పార్లమెంటుల రొండవ స్టార్‌బ్యాట్స్‌మన్ లగడపాటి రాజగోపాల్ అడ్డుకుంటడని సొల్లుపురాణం ప్రసారం చేసినయ్ సీమాంధ్ర చానళ్లు.

తెలంగాణ నాయకులు వాస్తవాన్ని వివరించింద్రు. ముఖ్యమంత్రి తీర్మానం నాలుక గీసుకోవడానికి కూడా పనికిరాదని కెటిఆర్ అన్నడు. చర్చ ముగిసిందని ప్రకటించిన తర్వాత జరిగే తీర్మానానికి విలువలేదని హరీశ్‌రావు అన్నడు. ఈటెల రాజేందర్ తదితర తెలంగాణ నాయకులు శాసనసభా ఘట్టం విజయవంతంగ ముగిసిం దని అన్నరు. తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ్యులు, మంత్రులు కూడ తెలంగాణ ఆపడం ఎవరితరం కాదని అన్నరు.

సీమాంధ్ర మీడియా, సీమాంధ్ర నాయకుల విషప్రచారాన్ని తిప్పికొట్ట టానికి కెసిఆర్ అదే రోజు సాయంత్రం మూడుగంటలకు ప్రెస్‌మీట్‌ల మాట్లాడిండు. 'ఆంధ్రప్రదేశ్ శాసనసభ చివరి సమావేశం ముగిసింది. బిల్లు ఢిల్లీ చేతికి పోయింది. ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదు. రేపు ఆంధ్రప్రదేశ్ నుంచి ఢిల్లీ పోతున్న. తిరిగి తెలంగాణ రాష్ట్రంలనే కాలుపెడత. ఢిల్లీ నాయకులతో మాట్లాడిన. ఫిబ్రవరి పదిహేనుకల్ల మన తెలంగాణ మన కొస్తది' అని ధైర్యం చెప్పిండు.

పనిలోపనిగ సీమాంధ్ర మీడియాకు గడ్డిపెట్టిండు. 'ఇట్లాంటి చెత్తవార్తలు బంద్ చేయండి. ఇంత పక్షపాతం పద్ధతి కాదు. ఇవి జర్నలిజం విలువలు కావు. మీ పిచ్చిరాతలు, పిచ్చికూతలతోటి తెలంగాణ ఆపలేరు. రొండు ప్రాంతాల ప్రజల మధ్యన శాశ్వత విషబీజాలు నాటొద్దు. లంకల ఉన్నోళ్లంత రాక్షసులే అన్నట్లు ఈ బిల్లుతోటి సీమాంధ్ర నాయకుల, మీడియా అసలురూపం బయట పడ్డది. ఇట్లాంటి చిల్లర నాయకులతోటి మేము ఎంతకాలం కలిసి ఉండాలె. తెలంగాణ ప్రజలు ధైర్యంగ ఉండాలె. 60 ఏండ్ల కల సాకారమయితుంది. ఈ విజయం తెలంగాణ అమరవీరులకే అంకితం' అన్నడు.

కెసిఆర్ ప్రెస్‌మీట్ ముగిసిన గంటలనే ఢిల్లీ నుంచి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దిగ్విజయ్‌సింగ్ మీడియాతో మాట్లాడిండు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు విజయవంతంగ ఢిల్లీ చేరుతుందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆగదని ప్రకటించిండు. రాష్ట్రంల ముఖ్యమంత్రి పన్నిన ప్రతికుట్రకు దిగ్విజయ్‌సింగ్ ఎప్పటి కప్పుడు సమాధానం చెప్పిండు. అట్లనే ఇప్పుడూ చెప్పిండు. ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ఫ్యాక్షన్ లీడర్ లెక్క వ్యవహరించిండని కూడ దిగ్విజయ్‌సింగ్ అన్నడు. తెలంగాణ బిల్లు తొందరలనే పార్లమెంటుల కూడా నెగ్గుతుందని తెలంగాణ ప్రజలకు భరోసా ఇచ్చిండు.

మరికొంత సేపటికి శాసనసభ డిప్యూటి స్పీకర్ మల్లు భట్టివిక్రమార్క శాసనసభల జరిగిన అంశాలపై మీడియాతో మాట్లాడిండు. ఇంతమంది చర్చల పాల్గొనడం మరే రాష్ట్రంల జరగలేదన్నడు. రాష్ట్రపతి పంపిన బిల్లు ప్రకారం సభ్యుల అభిప్రాయాలను రాష్ట్రపతికి పంపుతమని, ముఖ్యమంత్రి తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతమనీ వివరించిండు. తేడా అర్థమైందని భావిస్తున్న అని తేటతెల్లం చేసిండు. అంటే శాసనసభ్యుల అభిప్రాయాలు మాత్రమే రాష్ట్రపతికి పోతయని, ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మూర్ఖంగా పెట్టిన తీర్మానం రాష్ట్రం దాటదని చెప్పిండు. ముఖ్యమంత్రి తీర్మానం పనికిమాలినదని తేల్చిపారేసిండు.

అనేక కుట్రలు కుతంత్రాల మధ్య 49 రోజులు రాష్ట్ర శాసనసభల ఉన్న బిల్లు విజయవంతంగ రాష్ట్రపతికి చేరడానికి సిద్ధమైంది. ఇక తెలంగాణ ప్రజలతో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు మిగిలింది తెగతెంపులే. అరవయ్యేండ్ల సంకెళ్లు తెగడానికి మార్గం సుగమమైంది.

# ఆంధ్రానాయకుల ఆఖరి కుట్రలు

అసెంబ్లీల తెలంగాణల బిల్లుపై చర్చ అయిపోంగనే అదే రోజు కెసీఆర్ ఢిల్లీకి పోయిండు. అక్కడ తెలంగాణ బిల్లుకు మద్దతు కూడగొట్టే ప్రయత్నంల మునిగి పోయిండు. గతంల ప్రణబ్‌ముఖర్జీ కమిటీకి లేఖలు ఇచ్చి మద్దతు తెలిపిన పార్టీ నాయకులను కలిసిండు. 2014 ఫిబ్రవరి 2న లల్లూప్రసాద్ యాదవ్, రాంవిలాస్ పాశ్వాన్ తదితరులను కలిసిండు. బిల్లుకు మద్దతియ్యాలని కోరిండు.

ఫిబ్రవరి 3న బిల్లుపై రాష్ట్ర అసెంబ్లీ పంపిన అభిప్రాయాలు కేంద్ర హోం శాఖకు అందినయ్. ఆ తెల్లారే మంత్రుల బృందం సమావేశమైంది. రాష్ట్ర అసెంబ్లీ పంపిన అభిప్రాయాలపై తర్జన భర్జన చేసి ఆమోదం తెలిపింది. ఫిబ్రవరి 4న కెసిఆర్ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌ను కలిసి మాట్లాడిండు. ఫిబ్రవరి 5న పార్లమెంటు సమావేశాలు మొదలయినయ్.

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీల కిరికిరి చేసి బిల్లు పంపడంతో అంతటా ఉత్కంఠత ఏర్పడింది. బిల్లు పార్లమెంట్‌కు పోతుందా ఆగిపోతుందా అన్న అనుమానాలను ఆంధ్ర మీడియా పనికట్టుకొని ప్రచారం చేసింది. అయితే బిల్లు పార్లమెంటుకు పోతుందని మంత్రుల బృందం తేల్చి చెప్పింది. దీంతో ముఖ్యమంత్రి ఇంకో కుట్రకు పూనుకున్నడు. పార్లమెంటు సమావేశాలు మొదలైన రోజు ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర తెలంగాణ ఏర్పాటుకు నిరసనగా మౌనదీక్షకు కూచుండు. ముఖ్యమంత్రి వెంట తెలంగాణ ఏర్పాటును అడ్డుకునే సీమాంధ్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కూచుండ్రు.

ఇంకో దిక్కు తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దీక్షకు నిరసన తెలపడానికి పూనుకున్నరు. ముఖ్యమంత్రి దీక్షా స్థలానికి పోతుంటే తెలంగాణ మంత్రులు అడ్డుకున్నరు. మహిళా మంత్రులు గీతారెడ్డి, డికె అరుణ, సునీతా లక్ష్మారెడ్డి ముఖ్యమంత్రి వాహనానికి అడ్డం పోయిండ్రు. ఈ సందర్భంల

పోలీసులు విచక్షణారహితంగా మహిళా మంత్రులపై దాడులు చేసింద్రు. ఈ గొడవల గీతారెడ్డి కింద పడ్డది.

ఈ సంఘటనల గీతారెడ్డి తీవ్ర మనస్తాపం చెందింది. ముఖ్యమంత్రి ఉన్మాదపు చర్యలను ఎండగట్టింది. ఇందుకేనా కలిసి ఉండాలె అనేది అంటూ దుమ్మెత్తి పోసింది. ఉద్వేగంతో కంట తడిపెట్టుకుంది. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైనంక తెలంగాణ బిల్లు ఏరోజైనా పార్లమెంటుకు పోతుందని తెలవడంతో తెలంగాణ సైంధవులు చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీల తేలింద్రు. అప్పటి వరకు పొరుగు రాష్ట్రాలల్ల ప్రాంతీయ పార్టీల నాయకులను కలిసి బిల్లును అడ్డు కోవాలని కాళ్లా వేళ్లా పడ్డ చంద్రబాబు చివరికి బిజెపి ద్వారా అడ్డుపుల్ల వేయాల నుకుండు.

ఫిబ్రవరి 6న చంద్రబాబు, జగన్ వేరువేరుగా బిజెపి పార్లమెంటరీ నేత సుష్మా స్వరాజ్‌ను కలిసింద్రు. అప్పటికే బిజెపి పూటకోమాట మాట్లాడుతున్నది. ఆంధ్రా నాయకుడు వెంకయ్యనాయుడు ప్రభావంతో పార్టీ అగ్రనేత అద్వానీ తెలంగాణకు ఇబ్బంది కలిగించేటట్లు మాట్లాడిండు. సుష్మాస్వరాజ్ కూడా తెలంగాణ ప్రజలకు ధైర్యం చెప్పేట్లు మాట్లాడలేదు. అటిటు మాట్లాడింది. ఈ సందర్భంగా చంద్రబాబు, జగన్ ఆమెను కలిసింద్రు. తెలంగాణ టిడిపి నాయకులు ముందుగా ఆమెను కలిసింద్రు. ఆ తర్వాత సీమాంధ్ర టిడిపి నాయకులు కలిసింద్రు. తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన టిడిపి పార్లమెంటుసభ్యుడు నామా నాగేశ్వర్‌రావు రెండు ప్రాంతాల నాయకులతోనూ పోయి సుష్మస్వరాజ్‌ను కలిసిండు. రెండు రకాల మాటలు మాట్లాడిండు. అటిటు కాని ఈ నాయకుడి మాటలు గమనించిన సుష్మ దుమ్ము దులిపింది. చంద్రబాబును కూడ నిలదీసింది. అసలు నీ స్టాండేంది అని మొకం మీదనే అడిగింది. రెండు కండ్ల సిద్ధాంతాన్ని చెప్పలేక మింగలేక చంద్రబాబు మొకం మాడ్చుకొని బయిటి కొచ్చిండు.

అదే రోజు మరో ఆంధ్రా పార్టీ నాయకుడు జగన్ ఆమెను కలిసి తెలంగాణను అడ్డుకోవాలని కోరిండు. ఆమె వీలు కాదని చెప్పింది. అయినా జగన్ పదిహేను నిముషాల సమయమిస్తే మిమ్ముల్ని ఒప్పిస్త అని తన తెలివి చూపించబోయిండు. కాని సుష్మా అందుకు అంగీకరించలేదు. జగన్ కుట్రను గమనించి ఒక్క నిముషం కూడ ఇయ్యడానికి ఇష్టపడలేదు. దీంతో జగన్‌కు దిమ్మ తిరిగింది. ఏం మాట్లాడుతున్నడో సోయి లేకుంట మీరు తెలంగాణ ప్రతినిధిగా మాట్లాడుతున్నరు అని కసిని వెళ్లగక్కిండు. సుష్మాస్వరాజ్ మరింత ఘాటుగ అవును నేను తెలంగాణ ప్రతినిధినే అని ఈడ్చితన్నినట్లు జవాబు చెప్పింది. ఇంక చేసేది లేక జగన్ తల వాల్చుకొని బయటికి వొచ్చిండు.

ఫిబ్రవరి 7న తెలంగాణ బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సీమాంధ్ర నాయకులు వొత్తిడి తేవడంతో కేంద్రం ఆ తర్వాత సవరణలు తేవడానికి ప్రయత్నం చేసింది. ఈ విషయం కెసిఆర్‌తోటి కూడా జివోఎం సభ్యులు మాట్లాడింద్రు. కెసిఆర్ గింత సందు ఇయ్యలేదు. సవరణలు ఆమోదించేది లేదని కుండబద్దలు కొట్టిండు.

డిల్లీల పార్లమెంటుకు బిల్లు పోవడానికి తయారైతుంటే ముఖ్యమంత్రి కిరణ్ రాజీనామా చేస్తదని, కొత్తపార్టీ పెడతదని ప్రచారమైంది. ఫిబ్రవరి 9న బిల్లు రాష్ట్రపతి దగ్గరకు పోయింది. ఆ తెల్లారి కెసిఆర్ సోనియాగాంధీని కలిసి మాట్లాడిండు.

పార్లమెంటు మొదలయినంక సీమాంధ్ర కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు లగడ పాటి రాజగోపాల్, రాయపాటి సాంబశివరావు, హర్షకుమార్, సబ్బం హరి, సాయి ప్రతాప్, ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టింద్రు. ఇది కాంగ్రెస్‌కు చికాకు కలిగించింది. దీంతో ఫిబ్రవరి 11న ఆరుగురు ఎంపీలను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

అప్పటికే బిజెపి మీద అనుమానాలు ప్రచారమైనయ్. తెలంగాణ ప్రజలు కూడా ఆ పార్టీ పద్ధతి చూసి గట్టిగ నమ్మలేక పోయింద్రు. బిజెపి తెలంగాణకు మద్దతు ఇయ్యకుంట నాలుక అటిటు తిప్పుతుందని ఆ పార్టీ నాయకులే ఆందోళన పడ్డరు. ఈ సంగతి అంతా బిజెపి పెద్దలకు చేరింది. ఈ పరిస్థితిల తెలంగాణకు మద్దతిస్తమని సుష్మాస్వరాజ్ మల్లోసారి ప్రకటించింది. ఏం చేస్తే నమ్ముతరు, చెయ్యి కోసియ్య మంటరా, రక్తంతో రాయమంటరా అని నమ్మకం కలిగించే విధంగా మాట్లాడింది. ఒక వైపు సుష్మాస్వరాజ్ ఇంత గట్టిగా తెలంగాణ బిల్లుకు మద్దతు ఇస్తమని చెపుతుంటే ఇంకో వైపు ఆ పార్టీ అగ్రనేత అద్వానీ, ఆంధ్రా వెంకయ్య నాయుడు బిల్లుల లోపాలున్న యని అడ్డదిడ్డంగా మాట్లాడింద్రు.

# పార్లమెంటును గెలిచిన తెలంగాణ

అరవై ఏండ్ల తెలంగాణ ప్రజల కల పార్లమెంటు గడప ఎక్కింది. రాష్ట్ర పునర్వి భజన బిల్లును హోం మంత్రి సుశీల్‌కుమార్ షిండే 2014 ఫిబ్రవరి 13న పార్లమెంటుల ప్రవేశపెట్టిండు. బిల్లు ప్రవేశపెడుతున్నట్టు షిండే ప్రకటిస్తుంటే సీమాంధ్ర ఎంపీలు గొడవచేసింద్రు. హోం మంత్రిని అడ్డుకోవడానికి ప్రయత్నం చేసింద్రు. సభను నడవ కుంట చేయాలని తీవ్రప్రయత్నం చేసింద్రు. ఈలోపు స్పీకర్ మీరాకుమార్ సభల బిల్లును ప్రవేశపెట్టినట్టు ప్రకటించింది.

దీంతో సీమాంధ్ర ఎంపీలకు పిచ్చిలేచినట్టు అయ్యింది. పోడియం వైపు దూసుకుపోవడానికి ప్రయత్నం చేసింద్రు. అయితే వారిని అడ్డుకోవడానికి తెలం గాణ ఎంపీలు చుట్టు చేరింద్రు. ఇంక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయితే తమ దోపిడీ సాగదని తెలుసుకున్న ఆంధ్రా ఉన్మాదపు ఎంపీ లగడపాటి రాజగోపాల్ తోటి పార్లమెంటు సభ్యులపై పెప్పర్ స్ప్రే దాడికి తెగబడ్డడు. అదే సమయంల ఆంధ్రాకు చెందిన మరో అరాచక తెలుగుదేశం ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మైకును విరగ్గొట్టిండు. కత్తివంటి వస్తువుతో దాడికి దిగిండు.

లగడపాటి పెప్పర్ దాడితో సభ ఒక్క సారిగా ఉలిక్కి పడ్డది. సభల అల్ల కల్లోలం ఏర్పడ్డది. ఎంపీలపై పెప్పర్ పడడంతో కండ్ల మంటలతో కేకలు పెట్టింద్రు. ఉన్మాదపు ఎంపీలను అడ్డుకోవడానికి అడ్డుపోయిన తెలంగాణ ఎంపీ పొన్నం ప్రభాకర్‌పై పెప్పర్ దాడి చేయడంతో ఆయన తీవ్ర అనారోగ్యం పాలయ్యిండు. స్పీకర్‌పై కూడా పెప్పర్ పడడంతో ఆమె దగ్గుకుంటనే సభ వాయిదా వేసింది. ఈ లోపుల సభలోని ఎంపీలు ఉరుకులు పరుగులు పెట్టింద్రు. తమపై పడ్డది ఏ విష పదార్థమో అనుకొని ఆందోళన చెందింద్రు. ప్రాణభయంతో సభ నుంచి బయటికి ఉరికింద్రు.

ఉన్మాదపు దాడికి దేశం ఒక్క సారిగా నిర్ఘాంత పోయింది. సీమాంధ్ర రాక్ష సత్వం లోకానికి తెలిసింది. తెలంగాణ మీద సానుభూతి కురిసింది. సభల గందర

గోళానికి కారణమైన 16 మంది ఎంపీలను అదే రోజు స్పీకర్ ఐదు రోజులు సస్పెండ్ చేసింది. వీరిలో సీమాంధ్ర కాంగ్రెస్‌కు చెందిన సబ్బం హరి, అనంత వెంకటరామరెడ్డి, రాయపాటి సాంబశివరావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఉండవల్లి అరుణ్‌కుమార్, సాయిప్రతాప్, లగడపాటి రాజగోపాల్ ఉన్నరు. సీమాంధ్ర టిడిపికి చెందిన నిమ్మల కిష్టప్ప, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, కొనకళ్ల నారాయణ, శివప్రసాద్ ఉన్నరు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు చెందిన వైఎస్ జగన్, రాజమోహన్‌రెడ్డి, ఎస్‌పివై రెడ్డి ఉన్నరు. తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన గుత్తా సుఖేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఉన్నరు. ఉన్మాదపు ఎంపీలను అడ్డుకున్న ఈ ఇద్దరు తెలంగాణ ఎంపీలు కూడా సస్పెండ్ కావల్సి వొచ్చింది.

తెలంగాణ బిల్లును అడ్డుకోవడానికి సీమాంధ్ర ఎంపీలు తెగబడ్డందుకు నిరసనగా తెల్లారి తెలంగాణల నిరసనలు జరిగినయ్. నిజామాబాదుల నిరసన కారులు ఆంధ్రా నాయకులైన ఎన్‌టి రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను విరగ్గొట్టింద్రు.

పార్లమెంటుపై పెప్పర్ దాడిని జాతీయ మీడియా తూర్పారబట్టింది. దాడికి పాల్పడ్డ లగడపాటి రాజగోపాల్, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిని, అదే రోజు రాజ్యసభలో రౌడీయిజం చేసిన తెలుగుదేశం సభ్యుడు సిఎం రమేశ్‌ను కడిగి పారేసింది. ఇట్లాంటి వాళ్లను పార్లమెంటు నుంచి ఎత్తి బయట పడెయ్యాలని జాతీయ మీడియా కాండ్రించి ఊస్తుంటే సీమాంధ్ర మీడియాల లగడపాటి ఆంధ్రా భగత్‌సింగ్ అని ప్రకటనలు వొచ్చినయ్. సీమాంధ్ర మీడియా లగడపాటిని హీరోగా చిత్రీకరించడానికి తెగ తాపత్రయపడ్డది. అసలు గొడవకు కారణం తెలంగాణ ఎంపీలే అయినట్టు తప్పుడు కథనాలు ప్రసారం చేసినయ్. పత్రికలు కూడా పాత్రికేయ విలువలను బొందపెట్టి నిస్సిగ్గుగా రాసినయ్.

ఫిబ్రవరి 13న బిల్లు ప్రవేశ పెట్టినా ఆంధ్రా నాయకుడు వెంకయ్యనాయుడు కుట్రల చిక్కుకున్న బిజెపి నాయకురాలు సుష్మాస్వరాజ్ బిల్లు ప్రవేశపెట్టలేదని అన్నది. తను పార్లమెంటుల ఉండంగ బిల్లు రాలేదని మాట్లాడింది. ఆమె మాటలు తెలంగాణ ప్రజలకు ఆందోళన కలిగించినయ్.

లోకం అంతా ఊస్తున్నా సీమాంధ్ర పార్టీలు ఇంకా అడ్డుకోవాలనే చూసినయ్. నాలుగురోజుల సెలవుల తర్వాత ఫిబ్రవరి 17 సోమవారం నాడు పార్లమెంటు తిరిగి ప్రారంభం కావాల్సి ఉంది. ఈ లోపుల సీమాంధ్ర నుంచి రౌడీలను రైళ్లల్ల డిల్లీకి తరలించింద్రు. జగన్, చంద్రబాబు, కిరణ్, ఉద్యోగ సంఘాల నేత అశోక్ బాబు అంతా కలిసి డిల్లీల గందరగోళం సృష్టించాలని కుట్రచేసింద్రు. డిల్లీల నిరసన దీక్షలు

చేయాలని తయారైంద్రు. ఫిబ్రవరి17న జగన్ తెలంగాణ బిల్లుకు నిరసనగా మీటింగు పెట్టిండు. ఇంత ఏక పక్షమా అని నంగిమాటలు మాట్లాడిండు. అశోక్‌బాబు కూడా మీటింగు పెట్టిండు. కాని డిల్లీకి వొచ్చిన జనం మీటింగుల కూసోకుంట తిరిగి రావడానికి పోవడంతో మీటింగు వెలవెల పోయింది.

ఫిబ్రవరి18న తెలంగాణ బిల్లుపై చర్చ మొదలయ్యింది. బిల్లుపై హోంమంత్రి షిండే మాట్లాడిండు. ఫిబ్రవరి 13ననే బిల్లు ప్రవేశపెట్టినట్లు హోంమంత్రి ప్రకటించిండు. తర్వాత కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడిండు. సుష్మాస్వరాజ్ మద్దతు ఇస్తున్నట్లు తెలిపింది. సోనియాగాంధీతో పాటు ఈ చిన్నమ్మను కూడా యాదికి పెట్టుకోండి అని తెలంగాణ ప్రజలను కోరింది.

అయినా సీమాంధ్ర ఎంపీలు సభను అడ్డుకోవడానికి తీవ్ర ప్రయత్నం చేసింద్రు. లోక్‌సభల సీమాంధ్ర ఎంపీల ప్రవర్తన ప్రజాస్వామ్య వాదులకు అసహ్యం కలిగించింది. ఈ గందరగోళంలనే లోకసభ ప్రత్యక్ష ప్రసారాలు నిలిచి పోయినయ్. లోక్‌సభ ప్రత్యక్ష ప్రసారాలు ఉండడం వల్ల సీమాంధ్ర ఎంపీలు ఓవర్ యాక్షన్ చేస్తుంద్రని స్పీకర్ భావించింది. అందువల్లనే ప్రత్యక్ష ప్రసారాలు నిలిపివేయడానికి ఆదేశాలు ఇచ్చింది. ఆ సమయంల మూజువాణి ఓటుతో తెలంగాణ బిల్లు పాసయ్యింది. రాష్ట్ర పునర్విభజన బిల్లు నెగ్గిందని స్పీకర్ మీరా కుమార్ ప్రకటించింది.

లోకసభల తెలంగాణ బిల్లు పాస్‌కావడంతో ఆంధ్రనాయకులు గిలగిల లాడింద్రు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి గుబులు పుట్టింది. ఫిబ్రవరి 19న ముఖ్యమంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి, కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిండు. ఆ తర్వాత గవర్నర్ నరసింహన్‌ను కలిసి రాజీనామా పత్రం ఇచ్చిండు. ముఖ్యమంత్రి రాజీనామాను కాంగ్రెస్ అధిష్టానం కాని తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు కాని గింత కూడ పట్టించుకోలేదు. కిరణ్‌కుమార్‌రెడ్డిని అసలు ముఖ్యమంత్రిగనే గుర్తిస్తలేము. ఆయన ఉంటే ఎంత పోతే ఎంత అని తీసిపారేసింద్రు.

ఫిబ్రవరి 19న రాజ్యసభల బిల్లు చర్చకు రావాల్సి ఉండె. కాని బిజెపి రెండు నాలుకల ధోరణి వల్ల ఆగింది. అదే రోజు బిజెపి అగ్రనాయకులు సమావేశమైంద్రు. వెంకయ్యనాయుడు ప్రలోభానికి లొంగిన అద్వానీ, నరేంద్రమోడి బిల్లుకు సహకరించ వొద్దని, తిరకాస్తు పెట్టాలని భావించింద్రు. రాజ్యసభల అడ్డుకోవాలని చూసింద్రు. కాని ఆ పార్టీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్, సుష్మాస్వరాజ్, అరుణ్‌జైట్లీ బిల్లుకు మద్దతు ఇయ్యాల్సిందేనని పట్టుబట్టింద్రు. లోకసభల మద్దతిచ్చి రాజ్యసభల అడ్డుకుంటే జాతీయ పార్టీ అయిన బిజెపి ఇజ్జత్ పోతదని అన్నరు. బిజెపి అడ్డుకుంటె తను రాజీనామా

చేయాల్సి వొస్తదని ఒకానొక దశల సుష్మా స్వరాజ్ తెగేసి చెప్పింది. గత్యంతరం లేక మిగిలిన నాయకులు కూడా మద్దతు ఇయ్యడానికి ఒప్పుకున్నరు.

బిజెపి పూటకో మాట మారుస్తుండటంతో తెలంగాణ ప్రజలకు ఆ పార్టీ మీద అనుమానం పెరిగింది. దీంతో తెలంగాణ బిజెపి నాయకుల మీద వొత్తిడి పెరిగింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిల్లీల దీక్షకు కూసుండు. రాజ్యసభల బిల్లుకు బిజెపి మద్దతు ఇచ్చేంత వరకు దీక్ష విరమించేది లేదని ప్రకటించిండు.

ఫిబ్రవరి 20న రాజ్యసభల హోంమంత్రి షిండే బిల్లు ప్రవేశ పెట్టిండు. ఆంధ్రా కాంగ్రెస్ సభ్యుడు కెవిపి రామచంద్రరావు సభల గడకొయ్యలెక్క నిలబడి ప్లకార్డుతో నిరసన తెలిపిండు. ఆంధ్రా తెలుగుదేశం సభ్యులు సుజనాచౌదరి, సిఎం రమేశ్ కల్లు తాగిన కోతుల లెక్క చేసింద్రు. ఈ ముగ్గురు కలిసి అడుగడుగునా సభను అడ్డుకోవాలని చూసింద్రు. దీంతో సభ వాయిదాల మీద వాయిదాలు పడ్డది. అయ్యాల సుమారు పది సార్లు వాయిదాపడ్డది.

సాయంత్రం ఆరుగంటలకు చైర్మన్ స్థానంల కూచున్న డిప్యూటీ చైర్మన్ కురియన్ అభిప్రాయాలు చెప్పాలని కోరిండు. వెంకయ్యానాయుడు అడ్డుకునే ప్రయత్నం చేసిండు. ఒక వైపు బిజెపి బిల్లుకు మద్దతు ఇస్తది అని చెప్పుకుంటనే ఆంధ్రా కుల్లును కక్కిండు. సభ ముందుకు నడవకుండా కుట్రలు చేసిండు. ఈ సమయంల రాజ్యసభల బిజెపి ఫ్లోర్‌లీడర్ అరుణ్‌జైట్లీ తమ పార్టీ బిల్లుకు మద్దతు ఇస్తుందని ప్రకటించిండు. ఇంక సిపిఎం ఫ్లోర్ లీడర్ ఏచూరి సీతారాం అయితే తమ పార్టీ విశాలాంధ్ర కోరుకుంటుందని అందువల్ల బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు చెప్పిండు. పొట్టి శ్రీరాములు త్యాగం వల్లనే విశాలాంధ్ర ఏర్పడ్డదని మూర్ఖంగ మాట్లాడిండు. ఇస్తే వొద్దనము, ఇయ్యమని అడగము అని చిలుక పలుకులు పలికిన ఈ పార్టీ నాయకుడు బిల్లును వ్యతిరేకించి ఆంధ్రా బుద్ధిని చాటుకుండు.

బిల్లుపై రొండు మూడు గంటలు చర్చ జరిగింది. అంశాల వారీగా చర్చిం చింద్రు. సీమాంధ్ర ఎంపీలు తెలంగాణ బిల్లును ఇబ్బంది పెట్టడానికి చేసిన కుట్రలు మూజువాణి ఓటుతో పటాపంచలైనయ్. చివరికి బిల్లు మీద మూజువాణి ఓటుకు డిప్యూటీ చైర్మన్ సిద్ధం కాగా మల్లా ఆంధ్రా సిపిఎం నాయకుడు ఏచూరి సీతారాం అడ్డుకోవడానికి తయారైండు. బిల్లుపై డివిజన్ జరగాలని కోరిండు. లేకుంటే సభను బాయికాట్ చేస్తం అని ఆఖరి ప్రయత్నం చేసిండు. కాని డిప్యూటీ చైర్మన్ కురియన్ మూజువాణి ఓటుకే మొగ్గు చూపిండు. అధికార ప్రతిపక్ష పార్టీలు అంగీకరించినయ్ కాబట్టి డివిజన్ అసరసం లేదని తేల్చి చెప్పిండు.

దీంతో సీతారాం ఏచూరి నాయకత్వంల సిపిఎం ఎంపీలు బాయికాట్ చేసింద్రు. తర్వాత మూజువాణి ఓటుతో తెలంగాణ బిల్లు నెగ్గింది. 'ది బిల్ ఈజ్ పాస్డ్' అని డిప్యూటీ చైర్మన్ ప్రకటించిండు. దీంతో లోక సభ, రాజ్యసభల బిల్లు ఆమోదం పొందింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పార్లమెంటు అంగీకారం దొరికింది. తెలంగాణ ప్రజల అరవై ఏండ్ల సంకెళ్లు తెగినయ్. తెలంగాణల సంబురాల వెలుగులు చిమ్మినయ్.

రాజ్యసభల బిల్లు పాసయిన గంటకు డిల్లీలో కెసిఆర్ ప్రెస్‌మీట్ పెట్టిండు. ఇది ఒకరి గెలుపు, మరొకరి ఓటమి కాదన్నడు. తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలల్ల ఉన్నా సహకరించుకోవాలని కోరిండు. తెలంగాణ ఉద్యమంల పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు కృతజ్ఞతలు చెప్పిండు. అమరులను, ప్రొఫెసర్ జయశంకర్‌ను యాది చేసుకున్నడు. తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన సోనియాగాంధీకి కృతజ్ఞతలు చెప్పిండు. హోంమంత్రి షిండేకు, లోకసభ స్పీకర్ మీరాకుమార్‌కు, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కురియన్‌కు, సుష్మాస్వరాజ్‌కు, అరుణ్ జైట్లీకి, బిజెపి అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్‌కు కృతజ్ఞతలు చెప్పిండు. తెలంగాణ బిల్లుపై రాష్ట్రపతి ముద్ర పడి గెజిట్ అయినంకనే తిరిగి హైదరాబాద్ వొస్త అని చెప్పిండు.

కెసిఆర్ నాయకత్వంల పదమూడేండ్ల పోరాటం ఫలించింది. సీమాంధ్ర కుట్రలు ఛేదించుకొని అరవై ఏండ్ల కల నెరవేరింది. తెలంగాణ ఊరువాడా పండుగ చేసుకుంది. తెలంగాణ సంబురాలు అంబరాన్ని అంటినయ్.

# తెలంగాణ సాధకునికి జనం జేజేలు

ఆంధ్రప్రదేశ్‌ను విభజిస్తే భూమి బద్ధలైతది, ఆకాశం కుప్పకూల్తదని గగ్గోలు పెట్టింద్రు ఆంధ్రానాయకులు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, ఇంకో ఆంధ్రపార్టీ నాయకుడు జగన్ ప్రళయం వొస్తదని గాయిగాయి చేసింద్రు. సీమాంధ్ర అగ్నిగోళమైతదని అంతుపొంతు లేకుండ వాగింద్రు.

పార్లమెంటుల బిల్లు పాసయ్యింది. తెలంగాణ రాష్ట్రం ఖాయం అయ్యింది. కాని సీమాంధ్రల చీమ చిటుక్కుమనలేదు. ఎవరు గుండెలు బాదుకోలేదు. ఆత్మ హత్యలు చేసుకోలేదు. అంతా ప్రశాంతంగా ఉంది. అప్పటి వరకు కాకుల గోల వినిపించిన ఆంధ్రా టీవీలు నోరు మూసుకున్నయ్.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సీమాంధ్ర ప్రజలు వ్యతిరేకించడం లేదు అని తెలంగాణ నాయకులు చెప్పిందే నిజమైంది. ఇంత కాలం సీమాంధ్ర నాయకుల కక్కిందంతా విషమేనని రుజువైంది.

తెలంగాణ ఏర్పాటుకు నిరసనగా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన రాజీనామాను 2014 ఫిబ్రవరి 21న గవర్నర్ ఆమోదించిండు. కిరణ్ రాజీనామా చేసిన ఫిబ్రవరి 19 నుంచే ఆపద్ధర్మ ప్రభుత్వం అమలులకు వొస్తదని గవర్నర్ నరసింహన్ ప్రకటించిండు.

డిల్లీలనే ఉన్న కెసిఆర్ తెలంగాణకు మద్దతు తెలిపిన పార్టీల నాయకులను కలిసి కృతజ్ఞతలు చెప్పిండు. భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రాజనాథ్‌సింగ్‌ను కలిసిండు. ఫిబ్రవరి 23న కెసిఆర్ కుటుంబసభ్యులతో కలిసి సోనియాగాంధీని కలిసిండు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు చెప్పిండు.

ఆ తెల్లారి ఫిబ్రవరి 24న టిఆర్ఎస్ నాయకులు కేశవరావు తదితరులతో కలిసి కెసిఆర్ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ దగ్గరికి పోయిండు. రాష్ట్రపతి ఆనందంగా స్వాగతం పలికిండు. తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసుకోవడానికి కెసిఆర్

చూపిన పట్టుదలను ప్రశంసించిండు. అదే రోజు కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీని కెసిఆర్‌తో పాటు టిఆర్ఎస్ నాయకులు కలిసి కృతజ్ఞతలు చెప్పింద్రు. తెల్లారి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ను కూడా కలిసింద్రు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సహకరించిన పార్టీలకు కృతజ్ఞతలు చెప్పే క్రమంల అన్ని పార్టీల నాయకులను కలిసినట్లే కాంగ్రెస్ నాయకులను కూడా కలిసిండు కెసిఆర్. అయితే ఆంధ్రా మీడియా మాత్రం కెసిఆర్ కాంగ్రెస్ నాయకు లను కలవడాన్ని బూతద్దంల చూసింది. టిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌ల విలీనం చెయ్యడానికి కెసిఆర్ ఒప్పు కున్నడని వాగింది. తెలంగాణ ఇస్తే టిఆర్ఎస్‌ను విలీనం చేయడానికి గతంలనే అంగీకరించిండని అక్కసు కక్కింది.

నిజానికి టిఆర్ఎస్ విలీనం గురించి ఎన్నడు కూడా కెసిఆర్ కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరుపలేదు. కాని ఉద్యమ సందర్భంల ఒకటిరొండు సార్లు మా తెలంగాణ మాకు ఇయ్యండి, కావాలంటే మా పార్టీని కూడా మీ బొంద మీద కొడతం అన్నడు. కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటును నాన్చుతున్న సందర్భంల అన్న మాట ఇది. ఈ మాటను పట్టుకొని ఆంధ్రా మీడియా అవాకులు చెవాకులు పేకింది.

2014 జనవరి 30న డిల్లీకి పోయిన కెసిఆర్ 26 రోజులు అక్కడనే ఉన్నడు. ఫిబ్రవరి 26న హైదరాబాద్ రావడానికి ఏర్పాట్లు చేసుకున్నడు. అప్పటికే తెలంగాణ నాయకులు అందరు హైదరాబాద్ చేరింద్రు. తెలంగాణ సాధకునికి స్వాగతం పలక డానికి టిఆర్ఎస్ బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేసింది.

ఫిబ్రవరి 26 మధ్యాహ్నం మూడు గంటలకు కెసిఆర్ డిల్లీల బయలు దేరిండు. ఆయన వెంట మాజీ ఎంపీలు ఎపి జితేందర్‌రెడ్డి, బి.వినోద్ కుమార్ ఉన్నరు. నాలుగు గంటలకు శంషాబాద్ విమానాశ్రయంల దిగిండు కెసిఆర్. అభిమానులు, ప్రజలు ఆయనకు ఆత్మీయంగా స్వాగతం పలికింద్రు. అక్కడ నుంచి ప్రత్యేక విమానంల బేగంపేట విమానాశ్రయానికి చేరిండు. అక్కడా టిఆర్ఎస్ కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు ఘనంగా స్వాగతించింద్రు. బేగంపేట నుంచి గన్‌పార్కు వరకు విజయోత్సవ ర్యాలీ సాగింది. తెలంగాణ పది జిల్లాల నుంచి లక్షలాది మంది ప్రజలు ర్యాలీల పాల్గొన్నరు. హైదరాబాద్ మొత్తం గులాబీ మయమైంది. రాజధాని ధూంధాంలతో దద్దరిల్లింది. అట్టహాసంగా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీల ఒంటెలు, గుర్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచినయ్.

తెలంగాణ విజయోత్సవ ర్యాలీ గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్దకు చేరింది. హెలీకాప్టర్ నుంచి అమరవీరుల స్థూపంపై పూలవర్షం కురిసింది. కెసిఆర్‌తో

పాటు టిఆర్ఎస్ నాయకులు అమరవీరులకు నివాళులర్పించింౘ్రు. జై తెలంగాణ నినాదాలతో నాలుగు దిక్కులు దద్దరిల్లినయ్.

ఆ తర్వాత ర్యాలీ తెలంగాణ భవన్ వరకు సాగింది. అక్కడ తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి కెసిఆర్ నివాళులర్పించిండు. తెలంగాణ అభిమానులకు అభినందనలు చెప్పిండు.

ఆంధ్రప్రదేశ్ నుంచి పోతున్న. తిరిగి తెలంగాణ రాష్ట్రంలనే కాలుపెడత అని కొండంత ఆత్మవిశ్వాసంతో డిల్లీకి పోయిండు కెసిఆర్. అన్నట్లుగానే తెలంగాణ రాష్ట్రంల కాలుపెట్టిండు. అరవై ఏండ్ల కల నెరవేర్చిన తెలంగాణ జాతిపిత కెసిఆర్‌కు తెలంగాణ ప్రజలు అపూర్వస్వాగతం పలికింౘ్రు.



ప్రొఫెసర్ కోదండరామ్‌తో కెసిఆర్

# తెలంగాణకు రాజముద్ర

పార్లమెంటు ఆమోదించిన తర్వాత తెలంగాణ బిల్లును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతికి పంపింది. అప్పటికే ఆంధ్రప్రదేశ్‌ల ఆపద్ధర్మ ప్రభుత్వం నడుస్తున్నది. అప్పటి వరకు తెలంగాణ బిల్లు మీద దృష్టిపెట్టిన కేంద్రం తర్వాత రాష్ట్ర వ్యవహారాల మీద దృష్టిపెట్టింది. రొండు మూడు నెలల్ల ఎన్నికలు జరగాల్సి ఉండగా కొత్త ముఖ్య మంత్రిని నియమించాల్నా, రాష్ట్రపతి పాలన పెట్టాల్నా అని తర్జన బర్జన పడ్డది. ఇదే సమయంల మూడు నెలల ముఖ్యమంత్రి పదవి కోసం తెలంగాణ ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు పోటీ పడ్డరు. కాంగ్రెస్ అధిష్టానం ఎటూ తేల్చుకోలేక పోయింది. రాష్ట్రం లోని రొండు ప్రాంతాలల్ల నెలకొన్న పరిస్థితిల ఏ ప్రాంత నాయకున్ని ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేసినా కష్టమేనని భావించింది. చివరికి రాష్ట్రపతి పాలన విధించింది.

2014 మార్చి 1న తెలంగాణ బిల్లుపై రాష్ట్రపతి సంతకం అయ్యింది. నాలుగు కోట్ల ప్రజల కలకు రాచముద్ర పడ్డది. మార్చి 2న కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. దీంతో తెలంగాణ బిల్లు చట్టమైంది. తెలంగాణ రాష్ట్రానికి సంపూర్ణ చట్టబద్ధత ఏర్పడ్డది. భారతదేశంల 29వ రాష్ట్రంగా తెలంగాణ కొత్త గుర్తింపు పొందింది.

అదే రోజు రాష్ట్రంల రాష్ట్రపతి పాలన మొదలైంది. ఆంధ్రప్రదేశ్ అవత రించిన నాటినుంచి రాష్ట్రపతి పాలన రావడం ఇది రొండవ సారి. మొదటిసారి 1973 జనవరి 18 నుంచి 1973 డిసెంబర్ 10 వరకు కేంద్రం రాష్ట్రపతి పాలన విధించింది. పివి నరసింహరావుతో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయించి ఇందిరాగాంధీ మొదటిసారి రాష్ట్రపతి పాలన పెట్టింది. రాష్ట్రంల తెలంగాణ, ఆంధ్రా ఉద్యమాల నేపథ్యంల ప్రధాని ఈ నిర్ణయం తీసుకుంది. మల్లా 41 ఏండ్ల తర్వాత రాష్ట్రపతి పాలన వొచ్చింది. తెలంగాణ రాష్ట్రం సాకారమైన సందర్భంల ఏర్పడిన రాజకీయ పరిణామాల వల్ల రొండవ సారి వొచ్చింది. రొండు సార్లు కూడా తెలంగాణ కారణంగనే ఈ పరిస్థితి వొచ్చింది.

తెలంగాణ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందిన దగ్గర నుంచి మీడి యాల టిఆర్ఎస్ విలీనంపై ఊహాగానాలు జోరుగా ప్రసారమైనయ్. ఈ నేపథ్యంల పార్టీ సమావేశంల చర్చించి నిర్ణయం తీసుకుంటమని కెసిఆర్ చెప్పిండు. మార్చి 3న టిఆర్ఎస్ సమావేశం పార్టీ కార్యాలయంల జరిగింది. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమక్షంల విస్తృతస్థాయి చర్చ జరిగింది. అదే రోజు సాయంత్రం టిఆర్ఎస్ నాయకులతో కలిసి కెసిఆర్ పార్టీ తీర్మానాలు వెల్లడించిండు.

కాంగ్రెస్‌ల టిఆర్ఎస్ విలీనం ఉండదని తేల్చిచెప్పిండు. తెలంగాణ రాష్ట్రంల సొంత పార్టీ అవసరమని, తెలంగాణ పునర్నిర్మాణం టిఆర్ఎస్ బాధ్యత అని చెప్పిండు. ఇప్పటి వరకు ఉద్యమ పార్టీగా ఉన్న టిఆర్ఎస్ ఇక మీదట పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా కొనసాగుతుందని కుండబద్దలు కొట్టిండు.

ఆ తెల్లారి 2014 మార్చి 4న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినం 2014 జూన్ 2 అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

కాంగ్రెస్ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తెలంగాణ ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా తెలంగాణ, ఆంధ్రా విలీనం చేస్తే కెసిఆర్ ఉద్యమ ఫలితంగా అదే కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ తెలంగాణ కోరికను గౌరవించి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసింది.

యాభై సంవత్సరాల కుట్రలు కుతంత్రాలతో ఆంధ్రానాయకులు తెలంగాణ మీద పెత్తనం సాధించిండ్రు. అరవై ఏండ్ల పోరాటంతో తెలంగాణ ప్రజలు సంకెళ్లను తెంచుకుండ్రు. తెలంగాణ నిజమైన సొతంత్రం పొందింది.


भारत का राजपत्र
The Gazette of India
EXTRAORDINARY
PART II—Section 3—Sub-section (ii)
PUBLISHED BY AUTHORITY
No. [illegible]] NEW DELHI, TUESDAY, MARCH 4, 2014/PHALGUNA 13, 1935

MINISTRY OF HOME AFFAIRS
NOTIFICATION
New Delhi, the 4th March, 2014
S.O. [illegible](E).—In exercise of the powers conferred by clause (a) of section 2 of the Andhra Pradesh Reorganisation Act, 2014 (6 of 2014), the Central Government hereby appoints the 2nd day of June, 2014, as the appointed day for the purposes of the said Act.
[F.No. 12012/1/2014-SR]
S. SURESH KUMAR, Jt. Secy.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన–తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపై
భారత ప్రభుత్వ రాజపత్రము (మొదటి పేజీ)

# తెలంగాణ తొలి ప్రభుత్వం

# తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాజ్యాంగ బద్ధత ఏర్పడ్డది. తెలంగాణ ప్రజలు సంబుర పడ్డరు. ఇదే సమయంల అసంతృప్తి వెళ్లగక్కింండ్రు. తెలంగాణ మీద కేంద్రం విధించిన ఆంక్షలు ఇందుకు కారణం.

రాష్ట్ర ఏర్పాటు సమయంల ఆంధ్రోళ్ల లాబీయింగు, కుట్రల ఫలితంగా కేంద్రం ఆంక్షలతో కూడిన తెలంగాణ ప్రకటించింది. హైదరాబాద్‌ను పదేండ్లు ఉమ్మడి రాజ ధాని అని ప్రకటించింది. శేషాంధ్ర ప్రదేశ్‌కు రాజధాని నిర్మాణం అయ్యే వరకు హైదరాబాద్‌ల రాజధాని ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ ప్రజలు అభ్యంతర పెట్టలేదు. ఓ ఐదేండ్ల వరకంటే భరించటానికి సిద్ధంగా ఉన్నరు. కాని పదేండ్లు ఉమ్మడి రాజధాని అని కేంద్రం ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని గుండెల మీద కుంపటిగనే భావించింది తెలంగాణ.

ఇదే సమయంల లా అండ్ ఆర్డర్ అధికారాలు తెలంగాణ రాష్ట్రం చేతికి ఇయ్యకుంట కేంద్రం తన చేతుల ఉంచుకుంది. గవర్నర్‌కు అంటగట్టింది. ఇది తెలంగాణ ప్రజలు అవమానంగ భావించిండ్రు.

దీంతో పాటు పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది కేంద్రం. తెలంగాణను ముంచే ఈ ప్రాజెక్టు కోసం ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌ల కలపటానికి పూనుకుంది. ఆర్డినెన్సు ఇవ్వటానికి సిద్ధమైంది. ఇది కూడా తెలంగాణ ప్రజలకు అసంతృప్తిని కలిగించింది.

తర్వాత ఉద్యోగుల పంపకాలు. జనాభా ప్రాతిపదికన ఉద్యోగులను పంపిణీ చేయటానికి ప్రయత్నం చేస్తుండ్రు. జనాభా ప్రాతిపదికన ఉద్యోగుల నియామకాలు జరిగి ఉంటే దీనిని తెలంగాణ ఒప్పుకునేది. కాని గతంల అట్ల జరుగలేదు. అక్రమంగా ఉద్యోగాలల్ల చేరిన ఆంధ్రోళ్ల పింఛన్లను తెలంగాణ ప్రభుత్వం నెత్తిన బలవంతంగా రుద్దబోయిండ్రు. దోచుకున్నది సరిపోలేదన్నట్లు మరో దోపకానికి తయారు చేసిండ్రు.

కీర్తి శేష ఆంధ్రప్రదేశ్‌ల విద్యాసంస్థల్ల ఉన్న అడ్మిషన్ల విధానమే ఇంకో పదేండ్లు కొనసాగించాలని చూసింద్రు. ఇంత కాలం తెలంగాణ విద్యార్థులకు చెందాల్సిన అడ్మిషన్లను కొల్లగొట్టిన ఆంధ్రోళ్లు రాష్ట్రం ఏర్పడ్డంక కూడా ఇంకో పదేండ్లు దోపిడీ కొనసాగించటానికి కుట్ర చేసింద్రు. ఆస్తులు అప్పుల పంపకాలల్ల కూడా ఇదే వివక్ష.

దేశంల ఉన్న అన్ని రాష్ట్రాల లెక్కన్నే 29వ రాష్ట్రంగా అవతరించే తెలంగాణకు కూడా సంపూర్ణ అధికారాలు ఉండాలని ఆశించింద్రు. ఆంక్షలను తొలగించుకోవటానికి తెలంగాణ ప్రయత్నంచేస్తుంటే సీమాంధ్ర నాయకులు ఇంకా తమ పెత్తనం కొనసాగించటానికి కుట్రలు పన్నింద్రు. సాధారణ ఎన్నికలను ఇందుకు ఉపయోగించుకున్నరు.

ఇట్లాంటి సమయంల 2014న మార్చి 5న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డది. తెలంగాణల ఎన్నికల వేడి పుట్టింది. సంపూర్ణ తెలంగాణ, పునర్నిర్మాణం లక్ష్యం అని తెలంగాణ రాష్ట్ర సమితి ప్రకటించింది. ఏ పొత్తులు లేకుంట ఒంటరిగనే ఎన్నికల బరిలకు దిగింది.

ఈ ఎన్నికలల్ల ఆంధ్రానాయకులు చంద్రబాబు నాయుడు, వెంకయ్య నాయుడు కుట్రలు పన్నింద్రు. ఈ ఇద్దరు ఆంధ్రా నాయకులు బిజెపి, టిడిపి పొత్తులు కుదిరిచ్చింద్రు. తెలంగాణల టిడిపి నుంచి కొంతమందిని శాసన సభ్యులుగా గెలిపించుకొని కావలి కుక్కలుగా వాడుకోవాలని చంద్రబాబు ప్రయత్నం చేసిండు. తెలంగాణ ఇంటి పార్టీ టిఆర్ఎస్‌ను, తెలంగాణ ఉద్యమనాయకుడు కెసిఆర్‌ను ఇబ్బంది పెట్టటానికి ఎత్తుల మీద ఎత్తులేసిండు.

ఓ దిక్కు టిడిపి ఎమ్మెల్యేలు టిఆర్ఎస్‌ల చేరింద్రు. తెలంగాణ ప్రజలు అసహ్యించుకునేటట్లు ఉద్యమ సమయంల ప్రవర్తించిన మోత్కుపల్లి నర్సింహులు సొంత జిల్లా నల్లగొండల పోటీ చేయలేక పక్క జిల్లా ఖమ్మం వలస పోయిండు. అక్కడ మధిర నుంచి పోటీ చేసిండు. చంద్రబాబు తోక పట్టుకొని తిరిగిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, రేవంత్‌రెడ్డి వంటి నాయకులు దింపుడుకళ్లం ఆశతోటి పోటీ చేసింద్రు.

ఇంకో దిక్కు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు మేమే తెలంగాణ తెచ్చినమని బీరాలు పలికింద్రు. ఏనాడూ ఉద్యమంలకు రాని ఈ నాయకులు కాంగ్రెస్‌తోటే తెలంగాణ పునర్నిర్మాణం అని ఉపన్యాసాలు దంచింద్రు. తెలంగాణ రాష్ట్ర సమితి మాత్రం ఆత్మవిశ్వాసంతో ఎన్నికలల్ల దూసుకు పోయింది. కెసిఆర్ ఒంటి చేతితో ఎన్నికల ప్రచారం చేసిండు. గాలి మోటరేసుకొని రోజు పది మీటింగులల్ల మాట్లాడిండు.

ఈ ఎన్నికల సమయంల ఆంధ్రా శక్తులన్నీ ఏకమైనయ్. తెలంగాణ మీద పెత్తనం కొనసాగించటానికి తయారైనయ్. ముఖ్యంగ ఆంధ్రా మీడియా బరితెగింపుతో విషం చిమ్మింది. ఆంధ్రా పార్టీకి తెలంగాణల జీవం పోయటానికి ప్రయత్నం చేసినయ్. తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలకు రాకుంట అడ్డు కోవాలని చూసినయ్.

చివరికి ఉద్యమ పార్టీ టిఆర్ఎస్‌కు తెలంగాణ ప్రజలు పట్టం గట్టింద్రు. 63 మంది శాసన సభ్యులను, 11 మంది ఎంపీలను గెలిపిచ్చింద్రు. ఈ ఎన్నికలల్ల కాంగ్రెస్ 21, ఆంధ్రా పార్టీ టిడిపి 15, ఎంఐఎం 7 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. మే 17న టిఆర్ఎస్ శాసన సభ పక్ష నాయకునిగా కెసిఆర్ ఎన్నికయ్యిండు.

ఈ ఎన్నికలల్ల కాంగ్రెస్ సీనియర్ నాయకులంతా మట్టికరిసింద్రు. మంత్రులు చాలా మంది అడ్రస్ లేకుంట పోయింద్రు. మోత్కుపల్లి వంటి నాయకులు జాడపత్తా లేకుంట పోయింద్రు. తెలంగాణ ఉద్యమంల నాటకాలు ఆడిన నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పింద్రు.

2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగింది. తెలంగాణ ప్రజలు అన్ని జిల్లాలల్ల వారం రోజులు అద్భుతమైన సంబురాలు చేసుకుంద్రు. రాష్ట్ర ఆవిర్భావం రోజే మధ్యాహ్నం కెసిఆర్ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిండు. రాజ్‌భవన్‌ల గవర్నర్ నరసింహన్ సమక్షంల ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. కెసిఆర్‌తో పాటు 11 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేసింద్రు.

# తెలంగాణ తొలి మంత్రి వర్గం

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం 2014 జూన్ 2న
తొలి విడతగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రి వర్గం

| | |
|---|---|
| కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు | ముఖ్యమంత్రి |
| ఎండి మహమూద్ అలీ | ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ |
| టి. రాజయ్య | ఉప ముఖ్యమంత్రి, వైద్యం ఆరోగ్యం |
| నాయిని నర్సింహారెడ్డి | హోం |
| ఈటెల రాజేందర్ | ఆర్థిక |
| పోచారం శ్రీనివాసరెడ్డి | వ్యవసాయం |
| తన్నీరు హరీశ్‌రావు | భారీ నీటిపారుదల |
| కెటి రామారావు | పంచాయత్‌రాజ్, ఐటి |
| పి. మహేందర్‌రెడ్డి | రవాణా |
| జోగు రామన్న | అడవులు, పర్యావరణం |
| గుంతకండ్ల జగదీశ్వర్‌రెడ్డి | విద్య |
| టి. పద్మారావు | ఎక్సైజ్, మద్య నియంత్రణ |

| | |
|---|---|
| సిరికొండ మధుసూదనాచారి | స్పీకర్ |
| పద్మా దేవేందర్‌రెడ్డి | డిప్యూటీ స్పీకర్ |
| స్వామిగౌడ్ | శాసన మండలి చైర్మన్ |
| నేతి విద్యాసాగర్ | డిప్యూటీ చైర్మన్ |

| | |
|---|---|
| కుందూరు జానారెడ్డి | ప్రతిపక్షనాయకుడు (కాంగ్రెస్) |
| ఎర్రబెల్లి దయాకర్‌రావు | తెలుగుదేశం శాసనసభా పక్షనాయకుడు |

# చరిత్రల ముఖ్యఘట్టాలు

1947 ఆగస్టు 15 : భారత్‌కు సొతంత్రం

1947 నవంబర్ 29న : భారత ప్రభుత్వంతో నిజాం యథాస్థితి ఒడంబడిక

1948 ఆగస్టు 21 : ఐక్యరాజ్య సమితికి నిజాం ఫిర్యాదు

1948 సెప్టెంబర్(13–17) : హైదరాబాద్‌పై భారత్ పోలీసు చర్య

1948 సెప్టెంబర్ 17 : భారత్ దేశంల హైదరాబాద్ రాజ్యం విలీనం

1952 : ముల్కి ఉద్యమం (ఇడ్లీ సాంబార్ గో బ్యాక్)

1952 మార్చి 6 : ముఖ్యమంత్రిగా బూర్గుల ప్రమాణస్వీకారం

1953 డిసెంబర్ 29 : రాష్ట్రాల పునర్విభజన కమిషన్ నియామకం

1955 నవంబర్ 25 : హైదరాబాద్ అసెంబ్లీల విశాలాంధ్ర ఏర్పాటుపై చర్చ ప్రారంభం

1956 ఫిబ్రవరి 20 : ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్‌ల పెద్దమనుషుల ఒప్పందం

1956 మార్చి 5 : నిజామాబాద్‌ల నెహ్రూ విలీన ప్రకటన

1956 ఆగస్టు 31 : ఆం.ప్ర. రాష్ట్ర బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

1956 నవంబర్ 1 : ఆంధ్రప్రదేశ్ అవతరణ

1968 : తెలంగాణ ఉద్యమం ప్రారంభం

1969 జనవరి 13 : తెలంగాణ విద్యార్థుల కార్యచరణ సమితి

1969 : కుమార్ లలిత్ కమిటీ

1969 జనవరి 21 : తెలంగాణ రక్షణలు అమలు చేయడానికి జివో 36

1969 ఫిబ్రవరి 28 : మదన్‌మోహన్ అధ్యక్షుడుగా తెలంగాణ ప్రజాసమితి ఆవిర్భావం

1969 మార్చి 28 : వాంచూ అధ్యక్షతన నిపుణుల సంఘం ఏర్పాటు

1969 ఏప్రిల్ 11 : జస్టిస్ భార్గవ కమిటీ

1969 ఏప్రిల్ 12 : ఎనిమిది సూత్రాల పథకం

1969 మే 22 : తెలంగాణ ప్రజా సమితి అధ్యక్షునిగా చెన్నారెడ్డి

1969 నవంబర్ 27 : ఉద్యమాన్ని వాయిదావేస్తున్నట్లు చెన్నారెడ్డి ప్రకటన

1971 : రాజకీయ పార్టీగా తెలంగాణ ప్రజాసమితి అవిర్భాం

1971 అక్టోబర్ : తెలంగాణ ప్రజా సమితి కాంగ్రెస్‌లో విలీనం

1971 : పంచ సూత్ర పథకం

1972 : జై ఆంధ్ర ఉద్యమం

1973 సెప్టెంబర్ 21 : ఆరు సూత్రాల పథకం

1973 అక్టోబర్ : రాజ్యాంగ సవరణ ద్వారా ముల్కీ ఉత్తర్వులు రద్దు

1975 అక్టోబర్ 18 : రాష్ట్రపతి ఉత్తర్వులు

1978 మార్చి 6 : ముఖ్యమంత్రిగా చెన్నారెడ్డి

1984 : జైభారత్‌రెడ్డి కమిటీ

1985 : సుందరేశన్ కమిటీ

1985 ఫిబ్రవరి 27 : తెలంగాణ జనసభ ఆవిర్భావం

1985 డిసెంబర్ 30 : 610 జివో

1990 : తెలంగాణ ఫోరం కన్వీనర్‌గా జానారెడ్డి

1997 : జై తెలంగాణ పార్టీని ప్రకటించిన ఇంద్రారెడ్డి

1997 : తెలంగాణ సాధన సమితి

1998 : బిజెపి కాకినాడ తీర్మానం

2000 ఆగస్టు 11 : తెలంగాణ కోరుతూ 41 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల వినతి

2001 ఎప్రిల్ 27 : తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం

2001 మే 25 : గిర్‌గ్లానీ కమిటీ ఏర్పాటు

2004 జూన్ 7 : రాష్ట్రపతి (అబ్దుల్ కలాం) ప్రసంగంల తెలంగాణ

2005 జనవరి : ప్రణబ్ ముఖర్జీ కమిటీ ఏర్పాటు

2006 డిసెంబర్ 7 : కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నిక, కెసిఆర్ విజయం

2008 : రోషయ్య కమిటీ

2009 అక్టోబర్ 9 : హైదరాబాద్ ఫ్రీ జోన్‌పై సుప్రీం తీర్పు

2009 నవంబర్ 29 : కెసిఆర్ దీక్ష ప్రారంభం

2009 డిసెంబర్ 4 : తెలంగాణ జెఏసి ఏర్పాటు

2009 డిసెంబర్ 7 : సి.ఎం. రోషయ్య అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం

2009 డిసెంబర్ 9 : తెలంగాణ ప్రకటన

2010 జనవరి 5 : ఢిల్లీల చిదంబరం అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం

2010 ఫిబ్రవరి 3 : శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటు

2010 డిసంబర్ 30 : శ్రీ కృష్ణ కమిటీ నివేదిక

2010 : ఉద్యోగ సంఘాల జెఏసీ ఆవిర్భావం

2011 మార్చి10 : మిలియన్ మార్చ్

2011 జూన్ 19 : రాజధానిల వంటావార్పు

2011 సెప్టెంబర్ 13 : సకలజనుల సమ్మె ప్రారంభం

2012 సెప్టెంబర్ 30 : తెలంగాణ మార్చ్

2012 డిసెంబర్ 28 : హోం మంత్రి షిండే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు

2013 జనవరి 27,28 : జెఏసీ సమరభేరి

2013 మార్చి 21 : సడక్ బంద్

2013 జూలై 30 : సిడబ్ల్యూసి ప్రకటన

2013 ఆగస్టు 6 : ఆంటోనీ కమిటీ

2013 సెప్టెంబర్ 29 : సకల జన భేరి

2013 అక్టోబర్ 3 : తెలంగాణ నోట్‌కు కేంద్ర కేబినెట్ తీర్మానం

2013 అక్టోబర్ 8 : ఎ.కె.ఆంటోనీ చైర్మన్‌గా జివోఎం ఏర్పాటు

2013 డిసెంబర్ 5 : 2013–రాష్ట్ర పునర్విభజన ముసాయిదా బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

2013 డిసెంబర్ 16 : అసెంబ్లీల విభజన బిల్లుపై చర్చ ప్రారంభం

2014 ఫిబ్రవరి 4 : తెలంగాణ బిల్లుకు మంత్రుల బృందం ఆమోదం

2014 ఫిబ్రవరి 7 : తెలంగాణ బిల్లుకు కేంద్ర కెబినెట్ ఆమోదం

2014 ఫిబ్రవరి 9 : రాష్ట్రపతికి తెలంగాణ బిల్లు

2014 ఫిబ్రవరి 18 : లోకసభల తెలంగాణ బిల్లు ఆమోదం

2014 ఫిబ్రవరి 19 : రాజ్యసభల తెలంగాణ బిల్లు ఆమోదం

2014 జూన్ 2 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం

# తెలంగాణ అమరులు

1969 పోలీసు కాల్పుల్లో చనిపోయినవారు : ఆనంద్, ఎంఆర్ కృష్ణారెడ్డి, ఒగ్గు రాములు, డేవిడ్, నారాయణ, డి. రేణుక, మోజెస్, టీకారాం, ఆకుల నరేందర్, బుద్ధులాల్, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రాపోలు కృష్ణ, రషీద్, పెంటయ్య, భూషణం, సావిత్రి, మహ్మద్ షఫి అహ్మద్, వినోద్‌కుమార్ పటేల్, నర్సింగరావు.

2009 నవంబర్ 29 తర్వాత బలిదానం చేసుకున్న యువత:

నల్లగొండ : శ్రీకాంతాచారి, శివచరణ్, ధర్మావతు సుధాకర్‌నాయక్, సత్తు వీరనాగులు, నామ నటరాజు, కె. వేణుగోపాల్‌రెడ్డి, బదిరి రాములు, షేక్ అన్వర్, ఎనగందుల శ్రీనివాస్, కావడి కృష్ణ, గుంటి సతీష్ యాదవ్.

వరంగల్ : భూక్య ప్రవీణ్, తోడేటి నాగరాజు, డి. రవి, వంగల రాజు, సర్వ శ్రీను, పొన్నబోయిన అశోక్, పెంగపల్లి రమేశ్, పృథ్వీరాజు, వెల్దండి సుమన్, కరుణాకర్, బాలాజీ, దాసు, రాజ్‌కుమార్ చారి, హాలావత్ రాజేందర్, బోగి రమేశ్, సంపత్‌రావు, ఏదుల ప్రభాకర్, సందీప్, ఆరెల్లి శ్రీనివాస్, సాగర్, భాస్కర్.

కరీంనగర్ : దండిగ పృథ్వీరాజ్, బరిగెల అశోక్, ఆరెల్లి కృష్ణ, కోలా రవి, గుగ్గిళ్ల శ్రీధర్, కేసుగాని శ్రీనివాస్, పాముల నర్సయ్య, గట్టయ్య, బానోతు నరేశ్, కళ్లెం మల్లేశం, స్వామి, శ్రీకాంత్, రమణారెడ్డి, మధుసూదన్, రాజేందర్, పుత్తల చంద్రశేఖర్, గంగాధర్, కర్రె రాజేశ్, జీవన్‌కుమార్, కల్యాణ్, సతీశ్‌రెడ్డి.

మెదక్ : ఉనుగూరి శ్రీకాంత్, పి. వినయ్, కన్నెబోయిన ఐలయ్య, పత్తి హనుమంతు, మండల కనకయ్య, మురళి, మౌనిక, నాగరాజు, స్వామి చారి.

ఆదిలాబాద్ : బుద్దె సుమన్, ఏనుగు భూమారెడ్డి, ధరావత్ శ్వేత, కత్తెర్ల రవి, వామన్‌రావు సూర్య, రవికాంత్, రవి, క్రష్టపల్లి సతీశ్‌కుమార్, శోభారాణి.

నిజామాబాద్ : పి.కిష్టయ్య, కుమ్మరి సునిత, బాలయ్య, బూసా సుమలత, కడెం నరేశ్‌కుమార్, నవీన్, జంగం ప్రభాకర్, రజిత, కేతావత్ శ్రీనివాస్, నవీన్.

మహబూబ్‌నగర్ : ఎం.శివ, సువర్ణ, మల్లేశ్, బెస్త రంగయ్య.

రంగారెడ్డి : వినోద్‌కుమార్, శేఖర్‌రెడ్డి, ఎస్. యాదయ్య, అరిగె సరిత.

హైదరాబాద్ : నర్సింహ, ఈదయ్య.

(మలి ఉద్యమంల అమరులైన కొందరి పేర్లు)

# ఆధారగ్రంథాలు


- నరేంద్ర లూథర్ – హైదరాబాద్ జీవిత చరిత్ర, 2012, ఎమెస్కో బుక్స్, హైదరాబాద్
- రాజేంద్రప్రసాద్ – హైదరాబాద్ నిజాం నవాబులు, 2013, ఎమెస్కో బుక్స్, హైదరాబాద్
- మందుముల నరసింగరావు – 50 సంవత్సరాల హైదరాబాద్, 2012, ఎమెస్కో బుక్స్, హైదరాబాద్
- మహ్మద్ హైదర్ – 1948 హైదరాబాద్ పతనం, 2013, హైదరాబాద్ బుక్ ట్రస్ట్
- దేవులపల్లి రామానుజరావు – యాభై సంవత్సరాల జ్ఞాపకాలు, 1981, సాహితీ బంధు బృందం, చైతన్య సాహితీ, వరంగల్
- ఏనుకొండ కృష్ణమాచార్యులు – నైజాం రాష్ట్ర చరిత్ర సమీక్ష, 1990
- సుంకిరెడ్డి నారాయణరెడ్డి – తెలంగాణ చరిత్ర, 2011, తెలంగాణ ప్రచురణలు, సికిందరాబాద్
- ఉమ్మెత్తల కేశవరావు – బూర్గుల రామకృష్ణారావు జీవిత చరిత్ర,1983
- ఎలికట్టె శంకర్‌రావు (సం) – భీమిరెడ్డి నరసింహారెడ్డి అనుభవాలు, 2012, నోముల సాహిత్య సమితి, నల్లగొండ
- నల్లా నరసింహులు – తెలంగాణ సాయుధ పోరాటం నా అనుభవాలు, 2009, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
- రావి నారాయణరెడ్డి – నా అనుభవాలు జ్ఞాపకాలు, 2010, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్
- ఆరుట్ల రామచంద్రారెడ్డి – తెలంగాణ పోరాట స్మృతులు, 1981, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ
- బిఎన్ శాస్త్రి – పులిజాల రంగారావు జీవిత చరిత్ర, 999, మూసీ పబ్లికేషన్స్, హైదరాబాద్

- కొండపల్లి వెంకటశేషగిరిరావు, హీరాలాల్ మోరియా– హైదరాబాదు సంస్థానంలో రాజకీయ వికాసం, 1985, శ్రీగిరి ప్రచురణలు
- కె. జితేంద్రబాబు(సం)– నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు, 2009, తెలంగాణ జాగృతి, హైదరాబాద్
- దేవులపల్లి వెంకటేశ్వరరావు – తెలంగాణ ప్రజల సాయుధ పోరాట చరిత్ర, 1988, ప్రొలిటేరియన్ లైన్ ప్రచురణలు, హైదరాబాద్
- చెదలవాడ పిచ్చయ్య– ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుల నగ్నసత్యాలు, 1948
- ఆదిరాజు వెంకటేశ్వర్‌రావు – తెలంగాణ రాష్ట్రోద్యమాలు, 2006, ఓం సీ సత్య వెంచర్స్, హైదరాబాద్
- శోభాగాంధీ–ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల చరిత్ర, 2002, గాంధీ పబ్లికేషన్స్, హైదరాబాద్
- దాగ్మార్ బెర్న్ స్టార్ఫ్, హ్యూగ్ గ్రే – ఆంధ్రప్రదేశ్ రాజకీయ వ్యవస్థ తెలంగాణ రాజకీయాలు, 2005, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్
- కొత్తపల్లి జయశంకర్ – తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్, 2004, మల్లెపల్లి రాజం మెమోరియల్ ట్రస్ట్, తెలంగాణ
- కె. జయశంకర్, సింహాద్రి – తల్లడిల్లుతున్న తెలంగాణ, 2000, సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్, హైదరాబాద్
- కొత్తపల్లి జయశంకర్ – తెలంగాణ రాష్ట్రంపై విస్తృత అంగీకారం నిజానిజాలు,2011, సంగం మీడియా గ్రూప్, హైదరాబాద్
- ఎన్. ఇన్నయ్య – రాష్ట్ర రాజకీయ చరిత్ర వందేళ్ల విశ్లేషణ, 2010
- తడకమల్ల వివేక్, మరింగంటి రాఘవాచారి, శ్రీధర్‌రావు దేశ్‌పాండే, సంగిశెట్టి శ్రీనివాస్ (సం)–1969 ఉద్యమం చారిత్రక పత్రాలు, 2009, తెలంగాణ హిస్టరీ సొసైటీ
- వాగీశ్ – తెలంగాణ విఫలాంధ్ర ప్రదేశ్, 2010, సకల ప్రచురణలు, హైదరాబాద్
- కె. శ్రీనివాస్– సంభాషణ, 2011, పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్
- కె. శ్రీనివాస్ – కొత్తవంతెన, 2013, అనేక పబ్లికేషన్స్, హైదరాబాద్
- అల్లం నారాయణ– ప్రాణహిత, 2012, పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్
- ఎన్. వేణుగోపాల్– విద్వేషమే ధ్యేయంగా విశాలాంధ్ర మహారభస, 2013, తెలంగాణ ఆత్మగౌరవ వేదిక, హైదరాబాద్

- బోయినపెల్లి జగన్‌మోహన్‌రావు– కెసిఆర్ ఉద్యమస్ఫూర్తి తెలంగాణ, 2013
- జీవన్ – ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కెరటం, 2010,
  ప్రతిభ ప్రచురణలు, ఖమ్మం
- గడ్డం కేశవమూర్తి – తెలంగాణ ఆత్మఘోష వ్యాస సంపుటి, 2013,
  జికెఎం ఏజెన్సీస్, వరంగల్
- తెలంగాణ విద్యావంతుల వేదిక – ఐదేండ్ల కాంగ్రెస్ పాలన విద్రోహం
  విధ్వంసం, 2009
- సంగిశెట్టి శ్రీనివాస్ – హైదరాబాద్ సిర్ఫ్ హమారా, 2011,
  తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరల్ సెంటర్, హైదరాబాద్
- టంకశాల అశోక్ – సిపిఎం తెలంగాణ యాంత్రిక వ్యతిరేకత ఒక విశ్లేషణ,
  2008, తెలంగాణ రచయితల వేదిక
- దిన పత్రికలు (2009–2014)
- K. Jitendra Babu (Ed) - Mir Laik Ali Tragedy of hyderabad, 2011,DACRI Hyderabad
- Our MLAs - Hyderabad -1952
- Ramesh Panneeru - Telangana Armed Struggle in Nalgonda District,2010, Prajashakti book house
- B. Kamalakar Rao - Separate state for Telangana, 2013, Telangana Development Forum

వలసవాద రచనలు

- చలసాని శ్రీనివాస్ – జై ఆంధ్ర జై తెలంగాణ దగాపడ్డది ఆంధ్రులే, 2010
- విశాంధ్ర మహాసభ – రుజువులు లేని ఉద్యమం
  తెలంగాణ వేర్పాటు వాదుల 101 అపద్ధాలు వక్రీకరణలు,
  2013, విశాలాంధ్ర మహాసభ
- పుచ్చలపెల్లి సుందరయ్య –వీర తెలంగాణ విప్లవపోరాటం గుణపాఠాలు,
  2004, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్
- పుచ్చలపల్లి సుందరయ్య – విప్లవపథంలో నా పయనం, 2009,
  ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్
- పుచ్చలపల్లి సుందరయ్య – విశాలాంధ్రలో ప్రజారాజ్యం, 1996,
  ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ
- సుందరయ్య విజ్ఞానకేంద్రం – సుందరయ్య రచనల సంకలనం, 2012



# Telangana Rashtram Charitra Udyamalu

## Aelikatte Shankar Rao

హైదరాబాద్ రాజ్యం నుంచి
తెలంగాణ రాష్ట్రం దాంక
అరవై సంవత్సరాల
తెలంగాణ ప్రజల
ఆత్మగౌరవ పోరాటానికి
అక్షర రూపం

